# nijāmābādu jillā navalalu – sāmājika viślēṣaṇa

A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the requirement for the award of

Doctor of Philosophy
In
Telugu

**Researcher**
**KAMTAM KRISHNA**
**(Reg No: 15HTPH16)**

**Supervusor**
**Prof. G. ARUNA KUMARI**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad- 500 046
Telangana, India
May – 2023

# నిజామాబాదు జిల్లా నవలలు - సామాజిక విశ్లేషణ

పిహెచ్.డి., పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం


**పరిశోధకుడు**

**కంఠం కృష్ణ**

**15HTPH16**

**పర్యవేక్షకులు**

**ఆచార్య జి. అరుణ కుమారి**



తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు- **500 046**


మే-**2023**

# DECLARATION

I, **KAMTAM KRISHNA** hereby declare that this Theses entitled '**nijāmābādu jillā navalalu – sāmājika viślēṣaṇa'** submitted by me under the guidance and supervision of **Prof. G. Aruna Kumari** is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in Shodhganga/ INFLIBNET.

**Date:** **KAMTAM KRISHANA**
**Place: Hyderabad** **Reg. No. 15HTPH16**

# CERTIFICATE

This is to certify the Thesis entitled **'nijāmābādu jillā navalalu – sāmājika viślēṣaṇa' submitted** by **Mr. KAMTAM KRISHNA** bearing **Regd. No. 15HTPH16** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:** Parts of this thesis have been: (NOT EXACT PARTS) Issues discussed in the following papers have been presented elaborately in the chapter 3 of the thesis.)

**1.** **"jājula gauri mannubuvva kathala sampuṭi-prapañcīkaraṇa prabhāvaṁ(ISBN 978-93-83637-60-7)** "The Impact of Globalization on hindi and other Indian Languages" Pg. No. 103-105, December - 2016. Chief Editor "Dr. P.K. Jayalakshmi" Vishakapatnam, A.P.

**2.** **"**nijāmābādu jillā sāhityaṁ-vihaṅga vīkṣaṇaṁ" (ISSN-2582-7294). Vol: 13, Issue: 11, 'Palapitta' Monthly Magazine. Pg.No. 44-48, December - 2022. Editor: Gudipati, Baghlingampally, Hyderabad-500044.

**B. Presented in the following National and International seminars:** (Issues presented in the following papers have been discussed elaborately)

**1.** **"Voyinaṁ navala vastu rūpa viślēṣaṇa" "Telugu Rachayitrulu-Samakaleena Rajakeeya, Sahitya Dhoranulu"** conducted by Maris Stella College .(A), Vajayavada, A.P, on January 08&09th , 2015.

**2.** **"bhūpāl kūlipilla katha-bālakārmika vyavasthā citraṇa" 'Adhunika Sahityamlo balala samasyala chitrana'** conducted by Government Women's Degree College, Sreekaalahasthi, Telugu adyayana Saaka, on February 23rd & 24th, 2015.

Further, the Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D.

| Course Code | Name | Credits | pass/fail |
|---|---|---|---|
| 1. HT-801 | Research Methodology | 4.00 | PASS |
| 2. HT-802 | History of Telugu Research | 4.00 | PASS |
| 3. HT-803 | Studies in Literature and Language | 4.00 | PASS |
| 4. HT-804 | Specialized Area and Broad Field | 4.00 | PASS |

Prof. G. ArunaKumari — **Research Supervisor**

Prof. Darla Venkateswara Rao — **Head, Department of Telugu**

Prof.V. Krishna — **Dean, School of Huma**

# కృతజ్ఞతలు

అందరు ఆడ సంతానం మధ్యలో ఒక మగబిడ్డగా నాకు జన్మనిచ్చి, తమ సంతోషాల్ని నాలో వెతుక్కుని సర్వసుఖాలను మాకోసం త్యాగం చేసి చదువు రాకపోయినప్పటికీ తమ జీవితానుభవాలు నేర్పిన పాఠాల జ్ఞానంతో మమ్మల్ని పెంచి పెద్ద చేసిన ఆదర్శ దంపతులు అమ్మ అనసూయ, నాయిన ఎల్లయ్యలకు శిరస్సు వంచి పాదాభివందనాలు తెలియజేస్తున్నాను. మా అభివృద్ధి చూడకుండానే అనంతలోకాలకు వెళ్ళిన స్వర్గీయ అమ్మమ్మ-రామంజమ్మ, తాత-శంకరయ్యలకు....

'నిజామాబాదు జిల్లా నవలలు-సామాజిక విశ్లేషణ' అనే అంశంపై పరిశోధన చేయడానికి నాకు అవకాశం కల్పించిన హైదబాదు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖకు....

ఐ.ఎం.ఏ నుండి విద్యాబుద్ధులు నేర్పి, పరిశోధన ఆవశ్యకతను ఎప్పటికప్పుడు అందిస్తూ నన్ను పరిశోధన రంగంవైపు అడుగులు వేసేలా చేసి, ఎం.ఫిల్ నుండి పిహెచ్.డి స్థాయివరకు ఎదిగేలా చేసిన మాతృ సమానురాలు పరిశోధక సహచరులమంతా 'అమ్మ'గా భావించే నా పర్యవేక్షకులు ఆచార్య జి. అరుణకుమారి గారికి సద్వినయంగా పాదాభివందనాలు....

డాక్టోరల్ కమిటీ సభ్యులుగా ఉంటూ నా పరిశోధనకు తగు సూచనలు, సలహాలు అందించిన తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారు, డా. డి. విజయకుమారి గార్లకు...

ఇంటిగ్రేటెడ్ నుంచి పిహెచ్.డి స్థాయి వరకు మాకు పాఠాలు భోదించిన అధ్యాపక బృందం తెలుగుశాఖ పూర్వశాఖాధ్యక్షులు ఆచార్య పరిమి రామనరసింహంగారికి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి, ఆచార్య ఎన్.ఎస్ రాజుగారికి, ఆచార్య ఎస్.శరత్‌జ్యోత్స్నా గారికి, ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య రేమిళ్ళ రామకృష్ణశాస్త్రిగారికి, ఆచార్య పిల్లలమర్రి రాములుగారికి, ఆచార్య ఎం. గోనానాయక్ గారికి, కీ.శే. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, ఆచార్య డి. విజయలక్ష్మిగారికి, డా. బాణాల భుజంగరెడ్డిగారికి, డా. డి. విజయకుమారిగారికి...

కష్టకాలంలో ఎల్లప్పుడూ నావెంటే ఉండి నాకు ఊతమందిస్తూ, నేను పరిశోధన చేయగలననే ధైర్యాన్ని నింపి, పరిశోధన గురించి ఎల్లవేళలా గుర్తుచేస్తూ నన్ను భయపెట్టి భరోసా ఇచ్చి ఎన్ని

అవాంతరాలు ఎదురైనా వాటన్నింటినీ దాటుకుంటూ నా పరిశోధనను పూర్తిచేయించటంలో నాకు ఎంతగానో సహాయ సహకారాన్ని అందించిన నా భాగస్వామి సోని(నయోమి)కి థాంక్స్... అలాగే నా పరిశోధన సాఫీగా జరగడానికి నాకు అనుకూల పరిస్థితులు ఏర్పర్చిన నా పుత్ర రత్నాలు సాకృష్ ప్రిన్స్, సహాస్ ప్రిన్స్ లకు ప్రేమతో ఆశీర్వచనాలు...

నేనెప్పుడూ మంచిపేరు తెచ్చుకోవాలని అనునిత్యం చెప్పే మా పెద్దక్క విజయ-గంగారాం, జ్యోతి-ప్రదీప్, మమత-ప్రవీణ్, రేణుక-మోహన్, మాధవి-శివ దంపతులకు...

నా పరిశోధన కాలంలో నా పిల్లల్ని అక్కున చేర్చుకొని వారి ఆలనా పాలనా చూసిన అత్త మామలు దుభాషి మాణిక్యం-లక్ష్మమ్మ దంపతులకు, బామ్మర్ది చరణ్‌కు....

బతుకుదెరువు కోసం హైదరాబాదుకు వచ్చిన నన్ను హైదరాబాదు విశ్వవిద్యాలయాన్ని పరిచయం చేసిన మా అన్నయ్య (పెద్దమ్మకొడుకు) డా.మేకల రామస్వామికి వినయంగా....

అల్లుండ్లు, కోడండ్లు శివప్రసాద్, వైష్ణవి, అద్విక, యశ్వంత్, సన్ని, చిన్ని, విన్సీలకు ఆశీర్వాదాలు..

'నిజామాబాదు జిల్లా నవలలు-సామాజిక విశ్లేషణ' అనే అంశంపై పరిశోధన చేయడానికి ఇంతకుముందు ఎం.ఫిల్‌లో చేసిన 'జాజుల గౌరి వొయినం నవల-దళిత మహిళా చైతన్యం' అనే అంశం బాగా ప్రేరేపించి నన్ను పరిశోధన వైపు నడిపింది.

నా పరిశోధనకి సంబంధించిన సమాచార సేకరణలో భాగంగా నాకు సహకరించిన జిల్లా సాహితీ పెద్దలు, రచయితలందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నాను.

సీనియర్ అన్నలు రాజీవ్, రాంబాబు, ఉదయ్ బాను, గంగా ప్రసాద్, దత్తన్న, తిరుపతి చందు, మల్లేశ్, శంకర్, సంతోష్, ఆది నారాయణ, వెంకటేశ్, రమేశ్, బాలకృష్ణ, రవిబాబు, అక్కలు కళ్యాణి, స్పందన అక్కలకు....

నాతోటి పరిశోధన మిత్రులైన రవి కుర్మకోరే, పిల్లి సురేశ్, వెంకటేశ్ భరత, శ్రీనివాస్ రాథోడ్ లకు...

మిత్రబృందం జగన్, రాజు, నాగబాబు, అశోక్, రాజేశ్, రాంచందర్, సంజీవ్, చిరంజీవి పర్షు, రాఘవేందర్, మహేందర్, చైతన్య, యోగి, సురేశ్, రామకృష్ణ, సుశీల్, కిరణ్, సందీప్, హరీశ్,

నిరంజన్, నవీన్, సుమన్, భారతి, చందు, మల్లికార్జున్, జనార్దన్, ఆనంద్, కళ్యాణ్, ప్రకాశ్ లకు...
బాల్య మిత్రులు వెంకటేశ్, శ్రీకాంత్, సత్తి, గిరి, శివ, నవీన్, నరేశ్, పృద్వి, కె. నరేశ్, కపిల్, రాజేశ్, స్వామి, కళ్యాణ్, బాలరాజు లకు....

హైదరాబాదుకు వచ్చినప్పుడల్లా ఉండటానికి చోటిచ్చి, తినడానికి తిండి పెట్టిన మంత్రి మల్లన్న- అనిత, దేవయ్య-లావణ్య, శ్రీకాంత్-అంకిత లకు...

నా పరిశోధనకు ఆర్థిక ప్రోత్సాహం అందించిన యూజీసి వారికి,

నా పరిశోధనకు పుస్తకాలనందించిన ఇందిరాగాంధీ మెమోరియల్ గ్రంథాలయ(హెచ్‌సీయూ) అధికారులు, సిబ్బందికి, సమయానికి పోషకాహారాలు అందించిన మెస్ సిబ్బందికి, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందికి...

నా పరిశోధనకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించి, నన్ను ముందుకు నడిపిన వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు....

**ఇట్లు**

**కంఠం కృష్ణ**

*****

# సంకేతాలు: వివరణ

| | | |
|---|---|---|
| ఆ.పి. | = | ఆడ పిల్లేనా |
| కా.క. | = | కావేరి కళ్యాణం |
| జె.యి. | = | జెగ్గని యిద్దె |
| న.చ. | = | నడుస్తున్న చరిత్ర |
| స.బ. | = | సంసార బంధం |
| సృ.తీ. | = | సృష్టిలో తీయనిది |
| స్వే.వి. | = | స్వేచ్ఛా విహంగాలు |

*****

# విషయ సూచిక


## కృతజ్ఞత

## సంకేతాలు: వివరణ

## పరిచయం (i-ix)

1. పరిశోధన నేపథ్యం i
2. పరిశోధన ఆవశ్యకత ii
3. పరిశోధన పరిధి ii
4. పూర్వ పరిశోధనలు vi
5. అధ్యాయ విభజన vii

# అధ్యాయం-1

## 1. నిజామాబాదు జిల్లా పరిచయం, నేపథ్యం (1-21)

1.1. పరిచయం 1

1.2. నిజామాబాదు జిల్లా చరిత్ర, ప్రాశస్త్యం 1

1.2.2. జిల్లాలోని కోటలు–సంస్థానాలు 2

1.2.3. కౌలాస్ సంస్థానం 3

1.2.4. సిర్నాపల్లి సంస్థానం 4

1.2.5. దోమకొండ సంస్థానం 6

1.3. నిజామాబాద్ జిల్లా భౌగొళిక నైసర్గిక స్వరూపం 7

1.3.1. నేలలు–పంటలు 8

1.3.2. పర్వతాలు 9

1.3.3. అడువులు 9

1.3.4. నదులు–ప్రాజెక్టులు 9
1.3.5. ఖనిజాలు 10
1.4. నిజామాబాద్ సాహితి, కళారంగాల సంపద 10
1.5. నిజామాబాద్ జిల్లా ప్రత్యేక ఆకర్షణలు 12
1.6. పుణ్యక్షేత్రాలు 12
1.6.1. లింబాద్రిగుట్ట 12
1.6.2. బడాపహాడ్ (పెద్దగుట్ట) 13
1.6.3. సారంగాపూర్ 14
1.6.4. శ్రీ సిద్ధరామేశ్వర స్వామి దేవాలయం 15
1.6.5. శ్రీ కాలభైరవ స్వామి దేవాలయం 16
1.6.6. కంఠేశ్వర్ 17
1.6.7. డిచ్‌పల్లి రామాలయం 17
1.6.8. ఖిల్లా రామాలయం 18
1.6.9. వంద స్తంబాల గుడి 18
1.6.10. క్లాక్ టవర్ 19
1.7. నిజామాబాదు జిల్లా–సాంఘిక, ఆర్థిక, సాంస్కృతికాంశాలు 19
1.8. రవాణా 20
1.9. జనాభా 21

## అధ్యాయం-2

## 2. నిజామాబాదు జిల్లా సాహిత్యం-విహంగ వీక్షణం (22-35)

2.1. పరిచయం 22
2.2. నిజామాబాదు జిల్లా ప్రాచీన సాహిత్యం 23
2.3. నిజామాబాదు జిల్లా ఆధునిక సాహిత్యం 26
2.3.1. కావ్య సాహిత్యం– పరిచయం 27

2.3.2. శతక సాహిత్యం–పరిచయం 28
2.3.3. వచన సాహిత్యం–పరిచయం 29
2.3.4. గేయసాహిత్యం– పరిచయం 31
2.3.5. యక్షగాన సాహిత్యం పరిచయం 32
2.3.6. భక్తి–ఆధ్యాత్మక సాహిత్యం–పరిచయం 33
2.3.7. నాటక– నాటిక సాహిత్యం–పరిచయం 34
2.3.8. కథ–నవల సాహిత్యం– పరిచయం 35

## అధ్యాయం-3

## 3. నిజామాబాదు జిల్లా నవలలు - వస్తు వివేచన (36-141)

**3.1. 2020 వరకు వచ్చిన నవలలు 36**
3.1.1. జెగ్గని యిద్దె–1955 36
3.1.2. సంఘము–1955 40
3.1.3. భావన భార్గవి–1960 45
3.1.4. నవభారతి–1960 50
3.1.5. కళావతి–1960 52
3.1.6. తరంగాలు–1961 53
3.1.7. ప్రేమంటే–1962 55
3.1.8. ఆరాధకులు–1962 57
3.1.9. నవోదయం–1963 58
3.1.10. సూత్రధారి పాత్రధారులు–1961 60
3.1.11. పొగమంచు–1976 63
3.1.12. బంగారు గూడు–1976 64
3.1.13. మనస్విని–1976 64

| | |
|---|---|
| 3.1.14. సంసార బంధం–1976 | 69 |
| 3.1.15. వైతరణి ఒడ్డున వయ్యారి–1977 | 70 |
| 3.1.16. ప్రేమించకు పెళ్ళవుతుంది–1978 | 72 |
| 3.1.17. కళా జలతారు–1978 | 74 |
| 3.1.18. నవరసాలు–1979 | 74 |
| 3.1.19. లవ్ స్టోరీ–1979 | 76 |
| 3.1.20. నడుస్తున్న కథ–1980 | 77 |
| 3.1.21. మహానంద–1983 | 80 |
| 3.1.22. పిచ్చి మనిషి–1984 | 80 |
| 3.1.23. నర్తకి–1985 | 82 |
| 3.1.24. స్వప్న ప్రియ–1986 | 83 |
| 3.1.25. గాయపడ్డ సూర్యుడు–2004 | 85 |
| 3.1.26. జోగిని–2004 | 87 |
| 3.1.27. సృష్టిలో తీయనిది–2005 | 91 |
| 3.1.28. విజేత–2008 | 93 |
| 3.1.29. సర్వేజనః సుఖినోభవంతు–2009 | 95 |
| 3.1.30. కావేరి కళ్యాణం–2010 | 97 |
| 3.1.31. పునరాగమనం–2011 | 99 |
| 3.1.32. శ్రీమతి గోమతి–2012 | 103 |
| 3.1.33. ఆడపిల్లేనా–2012 | 106 |
| 3.1.34. స్వేచ్ఛా విహంగాలు–2013 | 108 |
| 3.1.35. యశోధరుడు–2014 | 109 |
| 3.1.36. చిరుజల్లు కురిసేనా–2014 | 111 |
| 3.1.37. కిడ్నాప్–2017 | 114 |
| 3.1.38. కానుక–2017 | 116 |
| 3.1.39. చుక్కాని చిరుదీపం–2017 | 120 |
| 3.1.40. కాలస్పర్శ–2018 | 120 |

3.1.41. మృత్యోర్మ అమృతాంగమయ–2018 122
3.1.42. ప్రయాణం–2019 123
3.1.43. ఆరాటం–2019 124
3.1.44. అమర్ సాహసయాత్ర–2019 126
**3.2. 2020 తర్వాత వచ్చిన నవలలు 128**
3.2.1. బతుకు సేద్యం–2021 128
3.2.2. హవేలి–2021 133
3.2.3. కలిసుందామా 134
3.2.4. ఆడజన్మ శాపమా? వరమా?–2021 134
3.2.5. మాధవి ఐపిఎస్–2021 136
3.2.6. బాలవర్ధన్–2021 137
3.2.7. రక్ష–2021 138
**3.3. నిజామాబాదు జిల్లా నవలలు-వస్తు పరిణామం: పట్టిక 139**

## అధ్యాయం-4

## 4. నిజామాబాదు జిల్లా నవలలు-సామాజిక విశ్లేషణ (142-254)

4.1. మూఢ నమ్మకాలు 142
4.2. అంటరానితనం, వివక్ష 152
4.3. దళిత చైతన్యం 154
4.4. చదువు 156
4.5. స్త్రీ జీవిత చిత్రణ 157
4.6. పురుషాధిక్యత 174
4.7. వరకట్న సమస్య, స్త్రీ చైతన్యం 182
4.8. ఆదర్శ విహాహాలు 192
4.9. కుటుంబ సంబంధాలు 198

4.10. ప్రేమ 204
4.11. అధికార బలం 214
4.12. పత్రికారంగం 216
4.13. స్నేహం 218
4.14. రాజకీయం 220
4.15. పేదరికం 222
4.16. నిరుద్యోగం 225
4.17. అనుబంధాలు–సంబంధాలు 227
4.18. లైంగిక బానిసగా స్త్రీ, శరీర వాంఛను కోరే స్త్రీ 230
4.19. కుల ఆచారాలు–జరిమానాలు 233
4.20. చేనేత వృత్తి–కష్టాలు 235
4.21. సినిమా ప్రపంచం 241
4.22. మానవ జీవితంలో సైన్స్ 243
4.23. సైన్స్–బాలల అద్భుత సాహసం 245
4.24. యువత–నిరుద్యోగం 249
4.25. విద్యా వ్యవస్థ–నాడు నేడు 250
4.26. కల్తీ వ్యాపారం 252
4.27. వలస బతుకులు 253

## అధ్యాయం-5

## 5. నిజామాబాదు జిల్లా నవలలు-భాషాంశాలు (255-278)

5.1. నామ పదాలు 256
5.2. జాతీయాలు/సామెతలు/పలుకుబడులు 266
5.3. జంట పదాలు 278

ముగింపు (279-296)

ఉపయుక్త గ్రంథాలు (297-300)

నవలా రచయితలతో పరిశోధకుడు-ఛాయా చిత్రాలు(301-310)

పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాల నకలు (311-323)

జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువపత్రాల నకలు (324-325)

*****

# పరిచయం

## 1. పరిశోధన నేపథ్యం

కాలక్రమేణా మారుతున్న సమాజంలో ఎన్నో కొత్త పోకడలు సంతరిచుకుంటున్నాయి. అలాగే తెలుగు సాహిత్య చరిత్రలో కూడా కాలానుగుణంగా ఎన్నో మార్పులు వచ్చాయి. భారతదేశంలోకి ఆంగ్లేయులు వ్యాపార నిమిత్తమై వలసవచ్చి మనపై ఆధిపత్యం సంపాదించుకొన్నారు. ఇక్కడి సహజ సంపదను దోచుకెల్లాలని దేశరాజులతో సత్సంబంధాలు పెంచుకున్నారు. 19వ శతాబ్దం నాటికీ భారతదేశంలో అనేక ప్రాంతాలలో తమ స్థావరాలను ఏర్పరచుకున్నారు. ఈ రకమైన చారిత్రక మార్పులు సాహిత్యంపై ప్రభావాన్ని చూపాయి. ఆంగ్ల విద్య, అచ్చుయంత్రం, క్రైస్తవ మిషనరీల ప్రభావం వల్ల భారతదేశంలో ఇతర దేశాల సంస్కృతి, సంప్రదాయాల పరిచయం ఏర్పడింది. దీనితో భారతీయ సాహిత్యంలో ప్రజలందరికి అర్ధమయ్యే వచన రచనలు వెలువడ్డాయి. తత్ఫలితంగానే తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలు ఏర్పడ్డాయి. అవే కథ, నవల, నాటకం, కవిత్వం, విమర్శ మొదలగునవి. ఇవి సమాజ శ్రేయస్సును కాంక్షించి దాని ప్రయోజనానికి తోడ్పడుతున్నాయి. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో నవల పక్రియ తనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకుంది. నవల భారతదేశంలో అవిర్భవించే కాలానికి సంఘసంస్కరణోద్యమం ప్రారంభదశలో ఉంది. నవల ద్వారా రచయితలు నాటి సామాజిక సమస్యలను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేసారు. ఇప్పటివరకు తెలుగులో భిన్నమైన వస్తువుతో నవలలు వెలువడ్డాయి. ఉదాహరణకు అస్తిత్వవాద నవలలు, దళితవాద నవలలు, స్త్రీవాద నవలలు వెలువడ్డాయి. దాదాపు అన్ని ఉద్యమ సాహిత్యాలను నవల మన ముందు ఉంచింది. అదేవిదంగా సామజిక మార్పులను, నాశనం అవుతున్న విలువలను, సంబంధ బాంధవ్యాలను, గ్రామాలలో వస్తున్న మార్పులను, సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను ఇక్కడి రచయితలు తమ నవలల్లో చిత్రించారు. ఇప్పటివరకు దాదాపు తెలుగు సాహిత్యంలో వివిధ జిల్లాల రచయితలు కవులనుండి వెలువడిన అన్ని సాహిత్య పక్రియలపై పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. అయితే తెలంగాణా ప్రాంతంలోనే నిజామాబాదు జిల్లాకు సంబంధించినంత వరకు

జిల్లా గ్రామా నామలపై, మొహర్రం పాటలపై జిల్లా కథలపై, కవిత్వంపై పరిశోధనలు జరిగాయి. కానీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో నిజామాబాద్ జిల్లా నవలలపై పరిశోధన జరగలేదు. కాబట్టి నా పరిశోధన 'నిజామాబాద్ జిల్లా నవలలు–సామజిక విశ్లేషణ' అనే శీర్షికతో నా పరిశోధనకు ఎంచుకోవడం జరిగింది.

## 2. పరిశోధన ఆవశ్యకత

తెలుగు పరిశోధన చరిత్రలో నవలలపై ఎన్నో పరిశోధనలు వెలువడినాయి. అదే క్రమంలో ఇంకా జరగవలసిన అవసరాన్ని గుర్తించి, ముఖ్యంగా జిల్లా సాహిత్యాల మూల్యంకనాలు జరుగుతున్న ఆవశ్యకతను అనుసరించి ఈ పరిశోధనను చేయదలుచుకున్నాను. నా పరిశోధనాంశం 'నిజామాబాద్ జిల్లా నవలలు–సామజిక విశ్లేషణ'. నా ఈ పరిశోధన కోణంలోంచి జరుగుతుందని భావిస్తున్నాను. సామజిక వాస్తవికతను ప్రతిఫలించే సాహిత్యం మరింత ముందుకు వచ్చింది. సాహిత్య అధ్యయనం చరిత్ర నిర్మాణానికి, సామజిక విశ్లేషణకు ఆధారంగా సహాయ పడుతుంది. కాబట్టి ఆధునిక తెలుగు పరిశోధనా రంగంలో ఈ రకమైన దృష్టితో పరిశోధనలు విరివిగా జరిగుతున్నాయి. ప్రస్తుత నా పరిశోధనాంశం కూడా ఆ కోవలోనే నిర్ణయించుకోవడం జరిగింది. నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన వాస్తవిక జీవిత చిత్రణను చిత్రించిన నవల సాహిత్యాన్ని విశ్లేషించి, ప్రజల ఆచార వ్యవహారాలను విధివిధానాలను, భాషను, సాంస్కృతిక జీవనం మొదలైన అంశాలను ప్రపంచానికి తెలియజేసి లోటుపాట్లను మార్చే ప్రయత్నం చేయడమే నా ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశ్యం.

## 3. పరిశోధన పరిధి

'నిజామాబాద్ జిల్లా నవలలు –సామజిక విశ్లేషణ' అనే నా పరిశోధనాంశానికి ఎలాంటి కాల పరిమితి పెట్టుకోకుండా మొదటి నిజామాబాద్ జిల్లా నవలగా చెప్పబడుతున్న'జగ్గని యిద్దె' (1952), సిద్దాన్త లోకమలహరి రాశారు. ఈ నవలను ఎందరో సాహిత్యకారులు నిజామాబాదు జిల్లా మొదటి నవలగా పేర్కొన్నారు. మొదటి నవలగా 'జెగ్గనియిద్దె'ని తీసుకొని, నా పరిశోధన ముగింపు వరకూ

అనగా 2020 వరకు నవలలను తోసుకొని, వాటిల్లోని సామాజికాంశాలను ఒక క్రమ పద్ధతిలో విశ్లేషించాను. అయితే నిజామాబాద్ జిల్లా నవల సాహిత్యం పరిశీలించినట్లయితే నవలా ప్రక్రియ అంతగా రాలేదనే చెప్పాలి. దాదాపు ఇప్పటివరకు 75 పైగా నవలలు వచ్చాయి. ఇందులో నాకు లభ్యమైన 44 నవలను పరిశోధనకు స్వీకరించాను. నా పరిశోధన కాల పరిమితి తర్వాత (2020) వచ్చిన నవలలు 7. అలభ్యమైన నవలలు 20. ప్రధానంగా నిజామాబాద్ జిల్లాకు చెందినవారు రాసిన వాటిని పరిశీలించాను. ఆ నవలలో వస్తువు, కాలం, స్థలం ప్రత్యేకతల దృష్ట్యా వాటిని సాంఘిక నవలలు, దళిత నవలలు, రాజకీయ నవలలు, స్త్రీవాద నవలలు, బాలల నవలలు మొదలైనవి వెలువడ్డాయి. వాటిలోని సామాజికాంశాలను వెలికితీశాను. ఆ నవలలు:

**పరిశోధనకు ఎంచుకున్న నవలలు**

1. జెగ్గని యిద్దె–1955, లోకమలహరి
2. సంఘము–1955, లోకమలహరి
3. భావన భార్గవి–1960, బొమ్మ హేమాదేవి
4. నవభారతి–1960, బొమ్మ హేమాదేవి
5. కళావతి–1960, బొమ్మ హేమాదేవి
6. తరంగాలు–1961, బొమ్మ హేమాదేవి
7. ప్రేమంటే–1962, బొమ్మ హేమాదేవి
8. ఆరాధకులు–1962, బొమ్మ హేమాదేవి
9. నవోదయం–1963, బొమ్మ హేమాదేవి
10. సూత్రదారి పాత్రధారులు–1964, బొమ్మ హేమాదేవి
11. పొగమంచు–1976, బొమ్మ హేమాదేవి
12. బంగారు గూడు–1976, బొమ్మ హేమాదేవి
13. మనస్విని–1976, బొమ్మ హేమాదేవి
14. సంసార బంధం–1976, బొమ్మ హేమాదేవి

15. వైతరణి ఒడ్డున వయ్యారి–1977, భరత్ కుమార్

16. ప్రేమించకు పెళ్ళవుతుంది–1978, బొమ్మ హేమాదేవి

17. కళాజలతారు–1978, భరత్ కుమార్

18. నవరసాలు–1979, బొమ్మ హేమాదేవి

19. లవ్ స్టోరీ–1979, బొమ్మ హేమాదేవి

20. నడుస్తున్న కథ–1980, రాజీవ

21. మహానంద–1983, బొమ్మ హేమాదేవి

22. పిచ్చి మనిషి–1984, బొమ్మ హేమాదేవి

23. నర్తకి–1985, భరత్ కుమార్

24. స్వప్న ప్రియ–1986, భరత్ కుమార్

25. గాయపడ్డ సూర్యుడు–2004, యాటకర్ల మల్లేశ్

26. జోగిని–2004, వి.శాంతి ప్రభోద

27. సృష్టిలో తీయనిది–2005, విజేత

28. విజేత–2008, మేడిచర్ల ప్రభాకరరావు

29. సర్వేజనః సుఖినోభవంతు–2009, మేడిచర్ల ప్రభాకరరావు

30. కావేరి కళ్యాణం–2010, మేడిచర్ల ప్రభాకరరావు

31. పునరాగమనం–2011, స్వాతి శ్రీపాద

32. శ్రీమతి గోమతి–2012, మేడిచర్ల ప్రభాకరరావు

33. ఆడపిల్లేనా–2012, సిరిగాద శంకర్

34. స్వేచ్ఛా విహంగాలు–2013, సిరిగాద శంకర్

35. యశోధరుడు–2014, మేడిచర్ల ప్రభాకరరావు

36. చిరుజల్లు కురిసేనా–2014  స్వాతి శ్రీపాద

37. కిడ్నాప్–2017, యాటకర్ల మల్లేశ్

38. కానుక–2017, వి.ఆర్.శర్మ

39. చుక్కాని చిరుదీపం–2017, స్వాతి శ్రీపాద

40. కాలస్పర్శ–2018, మల్లవరపు చిన్నయ్య

41. మృత్యోర్మ అమృతాంగమయ–2018, మల్లవరపు చిన్నయ్య

42. ప్రయాణం–2019, వి.ఆర్. శర్మ

43. ఆరాటం–2019, దారం గంగాధర్

44. అమర్ సాహసయాత్ర–2019

**నా పరిశోధన పరిధి కాలం(2020) తర్వాత ముద్రించబడిన నవలలు**

1. బతుకు సేద్యం–20210

2. హవేలి–2021, లలిత వర్మ

3. కలిసుందామా?–2021, లలిత వర్మ

4. ఆడజన్మ శాపమా? వరమా?–2022, కర్క రమేశ్

5. మాధవి ఐపిఎస్–2021, ఎల్ది సుదర్శన్

6. బాలవర్ధన్–2021, వి.ఆర్.శర్మ

7. రక్ష–2021, వి.ఆర్.శర్మ

**అలభ్య నవలలు**

1. ఆశోపహతులు–భరత్ కుమార్

2. రక్తాశ్రువులు–భరత్ కుమార్

3. పవిత్ర హృదయాలు–భరత్ కుమార్

4. మనిషి మహాకాలం–భరత్ కుమార్

5. మనిషికి మెట్లెక్కడ–భరత్ కుమార్

6. మధుర స్వప్నం–భరత్ కుమార్

7. కళలు కన్నీళ్ళు–భరత్ కుమార్

8. డా. సురేఖ–భరత్ కుమార్

9. అమృతం కురిసిన రాత్రి–భరత్ కుమార్

10. ఎడారి కుసుమం–భరత్ కుమార్

11. చైతన్య రంగాలలో స్త్రీ–భరత్ కుమార్

12. ప్రతీకారం–భరత్ కుమార్

13. అభినేత్రి–భరత్ కుమార్

14. డా. నందిత–భరత్ కుమార్

15. ప్లీజ్ మా నాన్నను పెళ్ళి చేసుకోండి–సిరిగాద శంకర్

16. ఏ సీమదానివో–కిరణ్ బాల(అసంపూర్తి నవల)

17. మర్రినీడ–సి.హెచ్ మధు(అసంపూర్తి నవల)

18. తూర్పు ఎరుపులో మహిళ–సిహెచ్.మదు

19. రాబోవు తరం స్త్రీ–రాజీవ

20. కువైట్ టూ ఇండియా–రాజీవ

## 4. పూర్వ పరిశోధనలు

నిజామాబాదు జిల్లా నవలా సాహిత్యానికి సంబంధించి పూర్వ పరిశోధనలు ఏమీ జరగలేదు. కానీ నిజామాబాదు జిల్లా సాజిత్యాన్ని తొలిసారి నమోదు చేసే యత్నం గిరినాగభూషణం చేశాడు. తర్వాత శాస్త్రుల రఘురామశర్మ సంకలనం చేసిన 'ఇందూరు సీమ విజ్ఞాన సర్వస్వంలో డా. వి. శంకర్ వ్యాసం. కొందరు సాహితీవేత్తలు జిల్లా సాహిత్యం తేవడంకోసం ప్రయత్నం చేసినా, అవి ముద్రణ రూపంలోకి రాలేకపోయాయని వి.శంకర్ 'నిజామాబాదు జిల్లా కవిత్వం' అనే పరిశోధన ద్వారా తెలుస్తుంది. సాహితీ ప్రక్రియలైన పద్యం, కవిత్వం మొదలైన వాటిపై పరిశోధనలు జరిగాయి. అవి:

1. 'నిజామాబాదు జిల్లా పద్య సాహిత్యం సమగ్ర పరిశీలన' ప్రకాశ్ బోచ్కర్

2. 'నిజామాబాదు జిల్లా కవిత్వం' వి. శంకర్. ఉస్మానియా విశ్వవిద్యాలయం–2001

3. దోమకొండ సంస్థాన కవులు–వారి రచనలు–మేడవరపు అనంతకుమార శర్మ–1989

4. నిజామాబాదు జిల్లా కవులు–సంప్రదాయాలు, ప్రయోగాలు–మేకల రామస్వామి, ఉస్మానియా విశ్వవిద్యాలయం–2022

5. నిజామాబాదు జిల్లా రంగస్థల నాటకం–ఒక అధ్యయనం–బి. నాగరాజు, ఉస్మానియా విశ్వవిద్యాలయం–2022

6. నిజామాబాదు జిల్లా మొహర్రం పాటలు–కె. గంగాధర్

**5. అధ్యాయ విభజన**

నా పరిశోధనాంశాన్ని 5 అధ్యాయాలుగా విభజించుకొని విశ్లేషించాను.

1. నిజామాబాదు జిల్లా పరిచయం, నేపథ్యం
2. నిజామాబాదు జిల్లా సాహిత్యం–విహంగ వీక్షణం
3. నిజామాబాదు జిల్లా నవలలు–వస్తు వివేచన
4. నిజామాబాదు జిల్లా నవలలు–సామాజిక విశ్లేషణ
5. నిజామాబాదు జిల్లా నవలలు–భాషాంశాలు

**1. నిజామాబాదు జిల్లా పరిచయం, నేపథ్యం**

ఈ అధ్యాయంలో నిజామాబాదు జిల్లా చరిత్ర, ప్రాశస్త్యం, జిల్లాను పరిపాలించిన రాజులు నిర్మించిన కోటలు, సంస్థానాలు, అందులో కౌలాస్ సంస్థానం, సిర్నాపల్లి సంస్థానం, దోమకొండ సంస్థానం మొదలైనవి. నిజామాబాదు జిల్లా భౌగోళిక నైసర్గిక స్వరూపం, నేలలు, పంటలు, పర్వతాలు, ఆడవులు, నదులు–ప్రాజెక్టులు, ఖనిజాలు, నిజామాబాదు జిల్లా ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రాలైన లింబాద్రి గుట్ట, బడాపహడ్, సారంగాపూర్, శ్రీ సిద్ధరామేశ్వర స్వామి దేవాలయం, శ్రీ కాలబైరవ స్వామి దేవాలయం, కంఠేశ్వర్, డిచ్‌పల్లి రామాలయం, ఖిల్లా రామాలయం, వంద స్తంభాల గుడి, క్లాక్ టవర్,

నిజామాబాదు జిల్లా సాంఘిక, ఆర్థిక, సాంస్కృతికాంశాలు, రవాణా, జనాభా మొదలైన అంశాలు ఈ అధ్యాయంలో చర్చించబడ్డాయి.

### 2. నిజామాబాదు జిల్లా సాహిత్యం–విహంగ వీక్షణం

ఈ అధ్యాయంలో నిజామాబాదు జిల్లా ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం, కావ్య సాహిత్యం, శతక సాహిత్యం, వచన సాహిత్యం, గేయ సాహిత్యం, యక్షగాన సాహిత్యం, భక్తి–ఆధ్యాత్మిక సాహిత్యం, నాటక, నాటిక సాహిత్యం–పరిచయం, కథ, నవల సాహిత్యం మొదలైన ప్రక్రియల్లోని సాహిత్యాన్ని ఇందులో చర్చించాను.

### 3. నిజామాబాదు జిల్లా నవలలు–వస్తు వివేచన

నిజామాబాదు జిల్లాలోని ప్రధాన నవలలైన జెగ్గని యిద్దె, సంఘము, మహానంద, పొగమంచు, నవరసాలు, లవ్ స్టోరీ, సంసార బంధం, నడుస్తున్న కథ, జోగిని, సృష్టిలో తీయనిది, విజేత, సర్వేజన సుఖీనోభవంతు, కావేరి కళ్యాణం, శ్రీమతి గోమతి, యశోధరుడు, పునరాగమనం, చిరుజల్లు కురిసేనా, ఆడపిల్లేనా, స్వేచ్ఛా విహంగాలు, బతుకు సేద్యం, నవభారతి, బంగారు గూడు, ప్రేమంటే, ఆరాధకులు, గాయపడ్డ సూర్యుడు, మనస్విని, సూత్రధారి పాత్రధారులు, భావన భార్గవి, కిడ్నాప్, ప్రేమించకు పెళ్ళవుతుంది, కళావతి, నవోదయం, పిచ్చి మనిషి, తరంగాలు మొదలైన నవలల్లోని వస్తు వైవిధ్యాన్ని ఈ అధ్యాయంలో విశ్లేషించాను.

### 4. నిజామాబాదు జిల్లా నవలలు–సామాజిక విశ్లేషణ

నిజామాబాదు జిల్లాలో ప్రజలలో ఉన్న మూఢ నమ్మకాలను, ముఖ్యంగా జోగిని వ్యవస్థలో పేరుకునిపోయిన అరాచకాలను, తద్వారా నలిగిన దళిత స్త్రీల గాథలను ఇందులో విశ్లేషించాను. దళితుల పట్ల అంటరానితనం, వివక్ష, దళితులు బాధలు అనుభవించి, అలసిపోయి చివరకు ఎదురు తిరిగి చైతన్యవంతమైన తీరును, స్త్రీలు అనుభవించిన వివక్ష, జీవన విధానం, స్త్రీల పట్ల పురుషుల

ఆధిక్యత, స్త్రీలు పెళ్ళి విషయానికి వచ్చే సరికి వరకట్న సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటికి ఎదురు తిరిగి చైతన్యం ఐన స్త్రీల గురించి ఈ అధ్యాయంలో చర్చించాను. అంతేకాకుండా ఆదర్శ వివాహాల గురించిన కూడా నిజామాబాదు జిల్లా నవలలో ఉంది. కుటుంబంలోని వివిధ వ్యక్తుల మధ్య అనుబంధాలు, ప్రేమ, అవినీతి, లైంగిక వాంఛ, అధికార బలంతో దొరల, భూస్వాముల ఆగడాలు, పత్రికారంగం, స్నేహం, రాజకీయం, పేదరికం, నిరుద్యోగం, దళితుల చైతన్యం, లైంగిక వాంఛను కోరే స్త్రీలను, లైంగిక బానిసగా ఉన్న స్త్రీల గురించిన చర్చ, కుల ఆచారాలు-జరిమానాలు విధింపు, చేనేత వృత్తులవారి కష్ట నష్టాలు మొదలైన సామాజికాంశాలను ఈ అధ్యాయంలో చర్చించాను.

### 5. నిజామాబాదు జిల్లా నవలలు-భాషాంశాలు

మానవుడు తన భావాలను, అవసరాలను ఇతరులతో పంచుకోవడానికి ఉపయోగపడేది భాష. అది మానవుడు ఆవిర్భించిన నాటి నుంచి అనేక పరిణామాలు చెందుతూ నేటి లిఖిత రూపంలోకి వచ్చింది. సృజన రచనలను వైవిధ్యభరితంగా, పాఠకులను ఆకట్టుకునేలా చేసేది భాష మాత్రమే. వస్తువు ప్రధానమైనప్పటికీ, రూపంలోని భాగమైన భాష ప్రధాన పాత్ర వహిస్తుంది. నిజామాబాదు జిల్లా నవలల్లో ఉన్న మాండలికంలో ఉన్న భాషా పదాలు, వాటి అర్థాలు, జాతీయాలు, సామెతలు, పలుకుబళ్ళు, జంట పదాలు మొదలైన వాటిని చర్చించాను.

ఉదా: అంబటాళ్ళ = అంబలి తాగేవేళ, లెల్లం = తొందరగా, గోజలు = పశువులు, సాలె = బడి, పూలమ్మిన చోట కట్టెలమ్ముట = గొప్పగా బతికిన చోటే చిన్న చిన్న పనులు చేసుకుంటూ బతకడం సాధ్య కాదని అర్థం. కానీ అవసరం, సందర్భం, కష్టం వచ్చినప్పుడు ఏ పనులైనా చేయాల్సి వస్తుంది.

కానని మొకానికి కప్పనే పులి = గొప్ప విషయాలు, సంఘటనలు చూడలేని వారికి, అందుబాటులో ఉన్నదే గొప్పదని భావిస్తారు. పులి భయంకరంగా ఉంటుంది. మనకు అందుబాటులో ఉండదు. కనుక దానిని చూడలేం. కప్పను చూసే భయపడతాం. దీనిని 'కానని మొకానికి కప్పనే పులి' పలుకుబడిని వాడతారు.

*****

# అధ్యాయం-1

# 1. నిజామాబాదు జిల్లా పరిచయం, నేపథ్యం

## 1.1. పరిచయం

తెలంగాణ చరిత్రలో నిజామాబాదు జిల్లాకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ ప్రాంతంలో పురావస్తు సంపద పుష్కలంగా బయటపడింది. క్రీస్తుపూర్వం వెయ్యి సంవత్సరాల కాలంనాటి రాక్షసగుళ్లు బయటపడ్డాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలలో నిజామాబాదు ఒకటి. ఈ జిల్లాను పూర్వం ఇందూరు మరియు ఇంద్రపురి అని పిలిచేవారు. "ఇంద్రదత్తుని పేరు మీదుగా కొంతకాలం ఇంద్రపురి అని వ్యవహరింపబడి ఇప్పుడు నిజామాబాదుగా మారిపోయిన ప్రాంతం బహమనీ సుల్తాన్లు, గోల్కొండ నవాబుల కాలంలో నిరంతర యుద్ధాలకు ఆటవిడుపుగా మారింది". (వెంకటరామారావు, జి. తెలంగాణ విద్యా సాంస్కృతిక రంగాల చరిత్ర. పుట: 43).

"హైదరాబాదును రాజాధానిగా పాలించిన ఆసఫ్ జాహీలలో 6వ నిజాం మీర్ మహబూబ్ ఆలీఖాన్ (క్రీ.శ.1869-1911) పరిపాలనకాలంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరిగినపుడు ఇందూరు 1876లో జిల్లా కేంద్రంగా మారింది. తరువాత నిజాం నవాబ్ పేరు మీదుగా ఇందూరు జిల్లా పేరును (నిజామ్-ఆబాద్) నిజామాబాద్ జిల్లాగా 1905లో మార్చడం జరిగింది. 'ఆబాద్' అనగా అధికసంఖ్యలో ప్రజలు నివసించుటకు యోగ్యత కలిగిన పట్టణం అని ఉర్దూలో అర్థం". నిజామాబాదులో ముఖ్యంగా బోధన్, కామరెడ్డి, ఆర్మూర్‌లు జిల్లా ప్రధాన నగరాలుగా ఉన్నాయి. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్ తరువాత మూడవ అతి పెద్ద నగరంగా నిజామాబాదు జిల్లాను గుర్తిస్తున్నారు.

## 1.2. నిజామాబాదు జిల్లా చరిత్ర, ప్రాశస్త్యం

జైనయుగం నాటి పాలనా విభాగాలను దేశములు, రాజ్యములు అని పిలిచేవారు. అంగ-వంగ-కలింగ మొదలైన దేశాలు ఉండేవి.'ఇందూరు సీమ' ప్రాంతం 'పులాకదేశం'

అని పిలువబడింది. శాతవాహనుల కాలంలో ఈ ప్రాంతం 'మంజీరకాదేశం' అని పిలువబడింది. రాష్ట్రకూటుల కాలంలో మెదక్-నిజామబాద్-కరీంనగర్ ప్రాంతాలు 'నాగభూమి' అని పిలువబడ్డాయి. బోధన్ చాళుక్యుల తొలి రాజధాని 'బోధన్ నగరము'. ఆనాడు ఇది 'సంపాదలక్షభూమి' అంతేగాక గోదావరి దక్షిణాన మంజీరనది నుండి మహా కాళేశ్వర పర్యంతం వ్యాపించిన భూభాగం 'పొదననాడు' అని వ్యవహరించారు. నిజామాబాద్‌ను 8వ శతాబ్దంలో రాష్ట్రకూట వంశానికి చెందిన ఇంద్రవల్లభ పాంత్య వర్ణ ఇంద్రసోముడు అనే రాజు పరిపాలించాడు. అతని పేరు మీద ఈ ప్రాంతానికి ఇందూరు అని పేరు వచ్చింది. ఇందూరుకు పూర్వం పేరు 'ఇంద్రపురి'. ఇంద్రపురి అనే పేరు ఒకరాజు పేరు మీద వచ్చిందని కొందరి అభిప్రాయం. కానీ ఆ రాజు క్రీ.శ.388 ప్రాంతంలో నర్మద, తపతిల దక్షిణ ప్రాంతాన్ని పాలించిన త్రికూటక వంశానికి చెందిన ఇంద్రదత్తుడా? విష్ణుకుండిన చక్రవర్తి మొదటి ఇంద్రవర్మనా? అనే విషయం స్పష్టంగా తెలియడం లేదు. 20వ శతాబ్దం తొలినాళ్ళ వరకు కూడా ఈ జిల్లా ఇందూరుగానే పిలవబడింది. 1901వ సంవత్సరంలో నిజాం పరిపాలన కాలంలో ఈ ప్రాంతం నుండి (సికింద్రాబాద్-నుండి-మన్మడ్ వరకు) రైలు మార్గం ఏర్పాటు చేసినప్పుడు ఇక్కడి ప్రాంతానికి అప్పటి రాజు 'నిజాం ఉల్-ముల్క్' పేరు పెట్టి జిల్లా పేరును నిజామాబాదని మార్చడం జరిగింది. ఈ జిల్లాలో చారిత్రక శిల్ప సంపదకు ఏమాత్రం కొదువలేదు. రాజులు ఏలిన సంస్థానంలో నేటికి చారిత్రక కట్టడాలు అనవాళ్ళు దర్శనమిస్తున్నాయి. క్రీ.పూ. 3000 నాటికి జిల్లాలో మానవుల ఉనికి ఆధారాలున్నాయి. అందుకు చరిత్రకారులకు దొరికిన 'కైరన్' (చనిపోయిన వారిని వారికి ఇష్టమైన వస్తువులతో కలిపి పూడ్చిపెట్టి దాని చుట్టూ కొన్ని గుర్తులను అమర్చే విధానం) నిదర్శనం. దీని ద్వారానే ప్రాచీన కట్టడాలైన రాష్ట్రకూటులు బోధన్ చాళుక్య, కళ్యాణి చాళుక్యులు, ఆలయాలు, ముస్లిం నిర్మాణాలుగా వెలిశాయి.

### 1.2.2. జిల్లాలోని కోటలు - సంస్థానాలు

రాజులకు సేవచేసిన కొందరికి అధిక మొత్తంలో భూమిని దారదత్తం చేసేవారు. అలా ఎక్కువ మొత్తంలో భూమి పొందిన వారే సంస్థానాధీశులుగా పేరుపొందారు. సంస్థానాలు

అంటే చాలా మొత్తంలో ఎక్కువ గ్రామాలు అధికారి ఏలుబడి కింద ఉండటం. ముస్లిం రాజుల పరిపాలనలో అధికార భాషలుగా ఫారసీ, ఊర్దూ ఉండేవి. జిల్లాలో దోమకొండ, సిర్నాపల్లి, కౌలస్ సంస్థానాల ఆనవాళ్ళు నేటికి పదిలంగా ఉన్నాయి.

### 1.2.3. కౌలాస్ సంస్థానం

ఎంతోమంది రాజులకు సైనిక బాండాగారంగా నిలిచింది. జుక్కల్ మండలం కౌలాస్ గ్రామం వద్ద 1544 సంవత్సరంలో కౌలాస్ ఖిల్లాను నిర్మించారు. బడాపహడ్ పర్వతాలలో కౌలాసా అనే మహాముని తపస్సు చేసిన ప్రాంతం కనుకనే దీనిని కౌలాస్ ఖిల్లాగా పేరు ఉన్నట్లు తెలుస్తుంది. దీనిని రాష్ట్రకూటులు, కాకతీయుల కాలంలో నిర్మాణం చేశారు. నాల్గవ రాష్ట్రకూటుని రాజు గోవిందుని కాలంలో కౌలాస ప్రాంతం గొప్ప సాంస్కృతిక కేంద్రంగా విరాజిల్లింది. అంతేకాకుండా అనేక యుద్ధాలకు సాక్షిగా నిలిచినది. కౌలాస్ ఖిల్లా, మహరాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్నది. ఖిల్లా లోపలి భాగంలో అత్యంత నైపుణ్యం గల రాతికట్టడాలు ఇప్పటికి చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. వెంకటేశ్వర మందిరం, రామమందిరం, దుర్గామాత మందిరాల నిర్మాణాలు రాతితో నిర్మించారు. ప్రతి మందిరం వద్ద దిగుడు బావులతోపాటు, ఏనుగులు స్నానాలు చేసేందుకు పెద్ద బావులను నిర్మించారు. కోట లోపలి భాగంలో నిర్మించిన రాతికట్టడాలలో ధాన్యాగారం, స్నానపు గదులు, ఇతర విలువైన కట్టడాలున్నాయి. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ పంచలోహాలతో తయారుచేసిన అనేక ఫిరంగులుండేవి. కాని ఇప్పుడు అవి దొంగలపాలయ్యాయి. ఈ ఫిరంగుల తయారీలో బంగారాన్ని కూడా వాడారేమోనని, వాటిని ఎత్తుకెళ్ళారనడంలో సందేహం లేదు. ఇదొక చారిత్రాత్మక ఖిల్లా. ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామానికి, నేను సైతం అంటూ ఖదం తొక్కింది. బ్రిటిష్ పాలకుల మీద తిరుగుబాటు చేసేందుకు వేదికగా మారింది. ఇది 156 ఏకరాల విస్తీర్ణంలో కలదు. కౌలాస్ కోటను బి.బి.పాటేల్ దత్తత తీసుకున్నారు. రాణి రుద్రమదేవి ఈ కోటను జయించినట్లు, తర్వాత దీన్ని సామంతులకు అప్పజెప్పినట్లు ఆధారాలున్నాయి. ఢిల్లీసుల్తాన్‌లు, అల్లావుద్దీన్ ఖిల్జి దండెత్తి ఈ కోటను ఆక్రమించుకున్నాడని 1327లో దీనిని సైనిక కేంద్రంగా మార్చాడని చెప్పుకుంటారు.

1857లో ఈ కోటను పాలించిన రాజ్‌దీప్‌సింగ్ ఇక్కడినుంచే బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పుకుంటారు. ఇక్కడున్న తొమ్మిది అడుగుల ఫిరంగు ఆనాటి రాజుల ధైర్యానికి నిదర్శనం. ఈ కోటలో రాణిగారి మందిరానికి ముందు ముప్పై పైగా దేవాలయాలు, కోటచుట్టూ యాభై ఐదు బురుజులున్నాయి. కాకతీయ సామ్రాజ్యం అంతమైన తరువాత బహామనీ సుల్తానులు కౌలాస్ దుర్గాన్ని వశపరుచుకున్నారు. ఆ సంస్థానానికి ఔరంగజేబు ద్వారా రాజ్‌దీప్‌సింగ్ గారు కౌలాస్ సంస్థానాధీశునిగా నియమితులయ్యారు. ఇతని వారసులు స్వాతంత్ర్యం వరకు అసఫ్‌జాహి నైజాం రాజులకు సామంతులుగా వారి రాజ్య పరిరక్షణలో ముఖ్యపాత్ర పోషించారు. రాజ్‌దీప్సింగ్ 1857 తిరుగుబాటులో ముఖ్యపాత్ర పోషించి బ్రిటిష్ వారిచే శిక్షకు గురయ్యాడు. శత్రు దుర్భేద్యమైన అప్పటి కట్టడాలు ఇప్పటికి వాటి నిర్మాణ చాతుర్యాన్ని చాటుతున్నాయి.

### 1.2.4. సిర్నాపల్లి సంస్థానం

కాకతీయులు, కుతుబ్‌షాహీల తరువాత నిజాంలు పాలించిన సంస్థానం సిర్నాపల్లి. వందల సంవత్సరాలుగా అనేకమంది రాజుల పాలనలో ఉన్న ప్రాంతమిది. ఇందూరు (నిజామాబాద్) ప్రాంతానికి రైలు మార్గాన్ని వేయించినందుకు కృతజ్ఞతగా ఈ ప్రాంతానికి అప్పటి రాజు 'నిజాం-ఉల్-ముల్క్' పేరును పెట్టారు. తదనంతరం 'నిజామాబాద్'గా మారింది. నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలంలో సిర్నాపల్లి ఒక గ్రామం. జిల్లాలోనే అతి పెద్ద సంస్థానంగా పేరు పొందింది. నిజాం కాలంలో మొదట్లో నర్సాగౌడ్ ఆధీనంలో ఉండేది. ఆ తరువాత చీలం ప్రతాప్‌రెడ్డి ఆధీనంలోకి వచ్చింది. చిన్న వయస్సులో ప్రతాప్‌రెడ్డి చనిపోవడంతో ఆయన భార్య చోలం జానకిబాయి సంస్థాన బాధ్యతలను చేపట్టింది. జానకీబాయ్‌కి పిల్లలు లేకపోవడంతో మెదక్ జిల్లాకు చెందిన రామలింగారెడ్డిని దత్తత తీసుకుంది. తర్వాత ఈ ప్రాంతానికి చీలం రామలింగరెడ్డి దొర పాలన చేశాడు. దాదాపు వంద గ్రామాలు ఈ సంస్థానం ఆధీనంలో ఉండేవి. దాదాపు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఈ గడి నిర్మాణం ఉంది. అప్పట్లో ఈ గడి ఎంతవుందో, ఊరు మొత్తం అంతే ఉండేదని చెప్తారు. అంటే రాణి ఎంత స్థలంలో నివసిస్తుంటున్నారో గ్రామం మొత్తం అంతే స్థలంలో ఉండాలన్న

ఫ్యూడల్ ధోరణి అప్పట్లో ఉండేది. తెలంగాణలో మారుమూల గ్రామాలకు వెళితే భూస్వామ్య వ్యవస్థలు మనకు దర్శనమిస్తాయి. సిర్నాపల్లి గడి ప్రాంగణంలో అడుగుపెట్టడానికి ముందు పెద్ద కమాన్, రెండు బురుజులు ఉండేవి. గడిలో పెద్ద రాతిభవనం కనిపిస్తుంది. భవనం ముందుభాగం ఆర్చ్ డిజైనలతో అందంగా కనిపిస్తుంది. ఈ డిజైన్‌లను 'గోదిక్' డిజైన్ అంటారు. పశ్చిమ యూరప్‌లో ఎక్కువగా కనిపించే ఈ నిర్మాణం మధ్యయుగంలో భారతదేశానికి వచ్చింది. ఆనాటి కాలంలో రాజులకు దేశవిదేశాలతో సంబంధాలున్నట్లు తెలుసుకునేందుకు ఈ నిర్మాణాలు నిదర్శనంగా చెప్తారు. జిల్లాలో సిర్నాపల్లి సంస్థానానికి ప్రత్యేకత ఉంది. చెక్కతో చేసిన మెట్లు ఆటోమెటిక్‌గా తలుపులు మూసుకోవటం విశేషం. (వీటిని లండన్ నుంచి తెప్పించారు). ఒకప్పుడు అధికార కేంద్రంగా ఉన్న ఈ గడిని బడిగా మార్చారు. తెలంగాణలో మగవారితోపాటు ఆడవారు సంస్థానాలు ఏలిన చరిత్ర ఉంది. దొరలుగా ఉన్నపుడు భర్తలు చనిపోతే వారి బాధ్యతను భార్యలే స్వీకరంచేవారు. కుటుంబ సభ్యులతో, నమ్మకస్తులైన పట్వారీల అండతో పాలనను సమర్ధవంతంగా నిర్వహించేవారు. ఈ రాణికి లింగన్న అనే పట్వారీ అండగా నిలిచేవాడు. ఆ కోవకి చెందినదే రాణి జానకీబాయి. నిజాం నవాబుల కాలంలో రాణీ జానకీబాయి హయాంలో జరిగిన అభివృద్ధి పనులు ఇప్పటికి అజరామరం. 1859–1920 వరకు సిర్నాపల్లి సంస్థానాన్ని ఆమె పాలించారు. చెరువులు, ఆనకట్టలు, కుంటలు, బావులు, కాలువలు కట్టించారు. ఈమె ఇందల్‌వాయి, నిజామాబాద్‌లోని సిర్నాపల్లి గడి, కొటగల్లి గడి, మహబూబ్‌గంజ్‌లోని క్లాక్ టవర్ తదితర నిర్మాణాలు కట్టించారు.

రెంజల్ దాకా 100 గ్రామాల్లో పరిపాలన సాగించారు. సికింద్రాబాద్–నిజామాబాద్ రైల్వే లైను మార్గాన్ని, నిజాం నవాబును ఒప్పించి ఉప్పల్‌వాయి, సిర్నపల్లి నుండి డిచ్‌పల్లి మీదుగా వెళ్ళేలా వేయించుకున్నారు. దానికి కృతజ్ఞతగా అప్పట్లో ఇందూరుగా ఉన్న ప్రాంతాన్ని నిజాంబాద్‌గా పేరు మార్చిందని ప్రతీతి. ఫ్యూడల్ వ్యవస్థ అంతరించిన తరువాత తెలంగాణలో జరిగిన పెద్ద పరిణామం నక్సల్స్ పోరాటం. సిర్నాపల్లి గ్రామం ఒకప్పుడు మిలిటెట్ల స్థావరంగా ఉండేది. అడవికి మధ్యలో ఉండటంవల్ల ఈ గ్రామం మిలిటెట్

పోరాటానికి అనువుగా మారింది. గ్రామస్తుల నుండి నక్సల్స్ సహాయం పొందేవారు. దాని మూలంగా సిర్నాపల్లి గ్రామస్తులు పోలిసుల నుండి కేసులు, చిత్రహింసలకు గురయ్యారు. రైతుల అత్మహత్యలతో సిర్నాపల్లి గ్రామస్తులు గ్రామాన్ని వదిలి వలసల బాట పట్టారు. కరువుతో గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. దింతో కొందరు దుబాయ్, మస్కట్‌లకు వలసలుగా వెళ్ళేవారు.

### 1.2.5. దోమకొండ సంస్థానం

ప్రాచీన సంస్థానాలలో పేరుగాంచింది దోమకొండ. వీరు పాకనాటి రెడ్డిశాఖకు చెందిన కామినేని వంశస్థులు. 1636లో అబ్దుల్ హుస్సేన్ కుతుబ్‌షా కామారెడ్డికి దోమకొండ సంస్థానాన్ని ఇచ్చాడు. ఈ ప్రాంతాంలోని అనేక గ్రామాలకు వారి వంశీయుల పేర్లయిన కామారెడ్డి, సంగారెడ్డి, ఎల్లారెడ్డి, మాచారెడ్డి, సదాశివనగర్, పద్మజివాడి, తుక్కోజివాడి నామాలుగా వెలిశాయి. సంస్థానంలో కట్టడాలు శిల్పకళా సంపదను సాక్షాత్కరిస్తాయి. కోట అద్దాలు బంగ్లా రాజుగారి భవనాలు, ఆశ్వగజ శాలలు, కుద్యాలు బురుజులు, కందకం, పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ అద్దాల మేడలోనే కామినేని వంశీయులు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపించేవారు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో పునర్నిర్మాణ పనులు జరగడంతో చారిత్రక సంపదను కాపాడుకున్నట్లుంది. నిజామాబాదు మొదటగా హైద్రరాబాద్ రాజ్యం బీదర్ సుబాలో ఇందూరు జిల్లాగా ఉంది. 1905లో ఇందూరులోని నిర్మల్, నర్సాపూర్ తాలుకాలను కొత్తగా ఏర్పడిన అదిలాబాద్ జిల్లాలో చేర్చారు. మంధోల్ తాలుకాను మరియు బాన్సువాడలోని కొంతభాగం నాందేడ్ జిల్లాలో చేర్చారు. మిగిలిన బాన్సువాడ తాలుకాను ఎలారెడ్డి, బోధన్ తాలుకాలోకి చేర్చారు. భీంగల్‌ను ఆర్మూర్ తాలుకాలో కలిపి, ఎల్లారెడ్డిపేట్, కామారెడ్డిపేట్ తాలుకాలో మరిన్ని మార్పులుచేసి కొత్తగా ఏర్పడిన జిల్లాకు నిజామాబాద్ జిల్లాగా నామకరణం చేశారు.

1830లో కాశీయాత్రలో భాగంగా పలు గ్రామాలు, పట్టణాలతో మజిలి (స్నేహం) చేస్తూ ప్రయాణించిన 'ఏనుగుల వీరస్వామయ్య' ఆనాడు ఈ ప్రాంతపు స్థితిగతుల గురించి

వ్యాఖ్యానించారు. హైదరాబాద్ రాజ్యంలో కృష్ణానది మొదలుకొని (నేటి రంగారెడ్డిజిల్లా, హైద్రరాబాద్ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా) ప్రాంతాల్లో సంస్థానాధీశుల కలహాలు, దౌర్జన్యాలు, భయభ్రాంతులను చేసే స్థితిగతులు ఉన్నాయని, ఐతే హైద్రరాబాద్ నగరం దాటి గోదావరి తీరం వరకూ (నేటి నిజామాబాద్, మెదక్ జిల్లాలు) గ్రామాలు చాలా వరకూ అటువంటి దౌర్జన్యాలు లేకుండా ఉన్నాయని రాశారు. కృష్ణానది నుంచి హైదరాబాద్ వరకు ఉన్న ప్రాంతాల్లో గ్రామగ్రామానికి కోటలు, సైన్యం విస్తారంగా ఉంటే హైదరాబాద్ నుంచి గోదావరినది వరకూ ఉన్న ప్రాంతాంలో మాత్రం కోటలు లేవని, చెరువులు విస్తారంగా ఉండి మెట్ట పంటలు ఉన్నాయని రాశారు.

నాటినుండి నేటి వరకు పరిపాలనలో తేడా కనిపిస్తుందే తప్ప నాటి సమాజ పరిస్థితులలో ఎక్కడ తేడా కనిపించదు. వృత్తికారులు వృత్తి చేసుకుంటూ గడికి వెట్టి చేయాల్సిందే. అదేవిధంగా నిర్భందంగా వెట్టి చేసేవాళ్ళ జీవితాల్లో ఎక్కడా మార్పు కన్పించలేదు. ఈ సంస్థాన సామాజిక చరిత్ర చూసినట్లయితే ఇప్పటివరకు తెలంగాణలో అనేక చారిత్రక పరిణామాలకు అద్దం పడుతుంది. ఫ్యూడల్ వ్యవస్థలో భాగంగా ఉన్నప్పుడు ఈ సంస్థానం రెడ్డి దొరసాని ఆధీనంలో ఉండేది. అయినా గ్రామంలో వారి సంఖ్య తక్కువే. ఇక్కడ మున్నూరుకాపు, గౌడ్లు, బెస్తలు, పెరుక, ఎస్సీలు ఎక్కువగా జీవించేవారు. ఎస్సీలు పూర్తిగా వెట్టి మీదనే ఆధారపడేవారు. దళుతులకు గడినే ఆధారం. నిజాం రాజ్యం చివరి రోజుల్లో ఆరాచకాలకు పాల్పడ్డ రజాకారులపై, దొరలపై ప్రజలంతా ఏకమై తిరుగుబాటు చేశారు.

## 1.3. నిజామాబాద్ జిల్లా భౌగొళిక నైసర్గిక స్వరూపం

శాతావాహనాంధ్రుల కాలంలో పరిపాలన కోసం రాజ్యంలోని భౌగోళిక ప్రాంతాన్ని చిన్నచిన్న భాగాలుగా చేశారు. ఒక్కోక్క ప్రాంతానికి అనుకూలంగా ఉండే మండల పాలనా కేంద్రంగా చేశారు. అవే రాజధాని, ముఖ్యపట్టణం, జిల్లాకేంద్రం, మండల కేంద్రంగా

పిలువబడ్డాయి. ప్రస్తుతం 'ఇందూరు సీమ'ను 'నిజామాబాదు' జిల్లాగా పిలుస్తున్నారు. ఈ నిజామాబాదు జిల్లా భౌగోళిక స్వరూపం తెలుసుకోవలసిన అవసరం ఉంది.

జిల్లాకు సరిహద్దులుగా ఉత్తరాన అదిలాబాద్ జిల్లా, తూర్పున కరీంనగర్, దక్షిణాన మెదక్ జిల్లాలు, పశ్చిమాన కర్ణాటకలోని బీదరు జిల్లా మరియు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలు ఉన్నాయి. 18-5' మరియు 19' ఉత్తర అక్షాంశాల మధ్య, 77-40' మరియు 78-37' తూర్పు రేఖాంశాల మధ్య జిల్లా విస్తరించి ఉంది. సముద్ర తీరానికి సుదూరంగా ఉండటంచేత జిల్లా వాతావరణం భూమాధ్యరేఖ వాతావరణంగాను, విపరీత ఉష్ణోగ్రత వ్యత్యాసాలుంటాయి. సగటు కనిష్ట ఉష్ణోగ్రత 13.7 డిగ్రీల సెం.మీ సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 39.9 డిగ్రీల సెం.మీగాను ఉన్నాయి. శీతాకాలంలో ఉష్ణోగ్రత 5 డిగ్రీలు సెం.మీ. వరకు పడిపోవడం. వేసవిలో 47 డిగ్రీల సెం.మీ. వరకు పెరగడం కూడా చూస్తున్నాం. జిల్లా విస్తీర్ణం 7956 చ.కీ.మీ. అనగా 19,80,586 ఏకరాలు. జిల్లాలోని 36 మండలాల్లో ఉన్న 923 గ్రామల్లో 866 నివాసమున్నవి. కాగా 57 గ్రామాలు ఖాళీ చేయబడినవి. లేదా నీటి ప్రాజెక్టులలో ముంపుకు గురైనవిగా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా భౌగోళికంగా చాలా ప్రశస్తమైనది.

### 1.3.1. నేలలు-పంటలు

నిజామాబాదు జిల్లాలో నేలలు ప్రధానంగా బోధన్, మద్నూర్, బాన్సువాడ తాలూకాల్లో 55 శాతం నల్లరేగడి నేలలు ఉండగా ఆర్మూర్, నిజామాబాదు, కామారెడ్డి, ఎల్లారెడ్డిల్లో 45 శాతం దుబ్బచెలకలు ఉన్నాయి. అంతేగాక అక్కడక్కడ లేతరంగు ఇసుక భూములు, ఎర్రనేల భూములే మనకు దర్శనమిస్తాయి. ఇక్కడ ప్రధానంగా వరి, పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్న, చెఱుకు, గోదుమ, అముదము, కూరగాయాలు, పప్పుధాన్యలు పండిస్తారు. వర్షధార నీరు, చెరువులు, బావులు, కరెంటు బోర్లు ఆధారంగా వ్యవసాయం చేస్తారు. జిల్లాలో అంకపూర్ గ్రామం వ్యవసాయంలో అగ్రస్థానంలో ఉంది.

### 1.3.2. పర్వతాలు

నిజామాబాద్ జిల్లాలో పర్వతాలకు కొదవలేదు. ఒకరకంగా ఈ జిల్లా మొత్తం పర్వతాలలో దాగి ఉన్నది. ఆర్మూర్ గుట్టలను చూస్తే విచిత్రంగా ఉంటుంది. ఎవరో గుండ్లను తెచ్చి కుప్పగా పోసినట్లుగా గుట్టలు గుట్టలుగా కన్పిస్తాయి. ఈ గుట్టలలో అనేక గుహలున్నాయి. జాన్కంపేట్, బోధన్, వర్ని, బిచ్కుంద ప్రాంతాలలోని పర్వతాలు చాలా ఎత్తైనవి. సంతాయిపేట, డిచ్‌పల్లి, భీంగల్, ప్రాంతాల్లో కూడా ఎత్తైన పర్వతాలున్నాయి.

### 1.3.3. అడవులు

నిజామాబాదు జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువే. అడవుల విస్తీర్ణంలో ఈ జిల్లా తొమ్మిదవ స్థానంలో ఉంది. పర్వత ప్రాంతాలన్ని అడవి ప్రాంతాలే. అంతేగాక సిర్నాపల్లి, ఇందల్‌వాయి, వర్ని, కైలాస్ మొదలైన ప్రాంతాల్లో దట్టమైన అడవులున్నాయి. ఈ జిల్లాలో 1,15,967 చ.కీ.మి విస్తీర్ణంలో అడవులున్నాయి. ఈ అడవిలో టేకు, చెనంగి, గోడిసె, నల్లమద్ది మొదలైన రకాల వృక్షాలున్నాయి. ఈ అడవులలో తునికి చెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ చెట్ల ఆకులు బీడి పరిశ్రమకు ఉపయుక్తమౌతాయి. అందుకే ఈ జిల్లాలో బీడి పరిశ్రమ ప్రధాన కుటీర పరిశ్రమగా కొనసాగుతుంది.

### 1.3.4. నదులు-ప్రాజెక్టులు

నిజామాబాద్ జిల్లాలో ప్రవహించే గోదావరినది ముఖ్యమైనది. ఈ నది జిల్లాకు ఉత్తర సరిహద్దున 113కి.మీ పోడవున గోదావరి నది ప్రవహించి, కరీంనగర్ జిల్లాలో ప్రవేశిస్తుంది. దీనికి ఉపనది మంజీరానది. ఈ నది జిల్లాకు దక్షిణ సరిహద్దుగా ఉండి మెదక్ జిల్లా నుంచి తాలూకా యెల్లారెడ్డి, బాన్సువాడల మీదుగా మద్నూర్, బోధన్ సమీపంలో ప్రవహిస్తూ రేంజల్ మండలంలోని కందకుర్తి దగ్గర గోదావరిలో కలుస్తుంది. అలాగే మెదక్ జిల్లాలో పుట్టిన హరిద్రానది కూడా కందకుర్తిలోనే కలుస్తుంది. అందుకే ఈ ప్రాంతం “త్రివేణి సంగమంగా” పేర్కొంటారు. నిజామాబాదు జిల్లా మధ్య గోదావరినది లోయకు సంబంధించినది. భారతదేశంలో అతిపెద్దది గోదావరినది. మన తెలంగాణ రాష్ట్రంలో దీని

పోడవు 720 కి.మీ. నాసిక్ వద్ద త్రయంబక్ నుంచి బయలుదేరి బంగాళఖాతంలో కలుస్తుంది. ఈ జిల్లాలో నిజాంసాగర్, శ్రీరాంసాగర్, అలీసాగర్, రామడుగు ప్రాజెక్టు, కౌలాస్నాలా ప్రాజెక్టులతో పాటు పూలవాగు, పెద్దవాగు, ఎడ్లకట్టవాగు, హరిద్ర మొదలైన జలాశయాలున్నాయి.

### 1.3.5. ఖనిజాలు

మానవ పరిణామ వికాసానికి భూభాగం, శిలలు, ఖనిజ సంపదలు ఉపయోగపడుతాయి. ఈ జిల్లాలో కొంత ఖనిజ సంపంద ఉన్నట్లు కనుగొన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ సమీపంలోని కోన సముద్రం, భీంగల్ ప్రాంతాలలో శ్రేష్ఠమైన ఇనుప ఖనిజాలు ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతంలో డమస్కస్ కత్తులు మొదలైన ఆయుధాలను తయారు చేసేవారు. "గ్లిమ్స్ ఆఫ్ దక్కన్"అనే పుస్తకాన్ని "క్లెయిడియల్"అనే రచయిత రాస్తూ నిజామాబాద్ జిల్లాలోని కోన సముద్రం, ఇందల్వాయి ప్రాంతాల్లో ప్రశస్తమైన ఇనుప ఖనిజాలున్నట్లు ఈ ఖనిజం ఇంగ్లాండ్, స్వీడన్ దేశాల్లో ఇనుప ఖనిజం కన్నా ప్రశస్తమైందని పేర్కొన్నాడు. ఎల్లారెడ్డి మండంలోని కరడపల్లి ప్రాంతంలో అల్యూమినియం ఖనిజాలను కనుగొన్నారు. అంతేగాక నాసిరకానికి చెందిన ఇనుప ఖనిజాలు, రోడ్లు, భవన నిర్మాణానికి ఉపయోగించే గ్రానైట్(శిలలు) ఈ జిల్లాలో విస్తారంగా ఉంది.

## 1.4. నిజామాబాద్ సాహితి, కళారంగాల సంపద

సంస్కృతి, సాహిత్యాలు సరస్వతీ వరాలు. సాహిత్యం మానవ హితాన్ని కోరడమే కాకుండా చరిత్ర రచనకు అలంభనగా ఉంటుంది. నిజామాబాద్లోని సాహిత్య సౌరభం అతీ ప్రాచీనమైనది. తెలుగు కవులనేకాక కన్నడ కవులను కూడా ఆదరించి వారికి తగిన గౌరవాన్ని కల్పించింది. కన్నడ భాషకు ఆదికవిగా, కవిత్రయంలోని మొదటివాడుగా పేరెన్నికగన్న మహకవి పంపడు ఈ జిల్లాలో బోధన్లో నివసించి పరమవదించారు. 'సింహాసన ద్వాత్రింశిక' కథా సంపుటి తెలుగు ప్రబంధయుగానికే ఒక గీటురాయి. ఈనాడు రచించబడుతున్న అనేక నవల, కథలకు కుల గురువుగా ఆ కావ్యాన్ని చెప్పుకుంటారు.

అంతటి నవీన కథా కుసుమాన్ని అందించిన కవి కొరవి గొపరాజు నిజామాబాద్ జిల్లాలోని భీంగల్ ప్రాంతం పల్లికొండ నివాసి. స్వయంగా కవులై అనేక రచనలు తాము రచించడమేగాక, కవికులాన్ని ఆదరించి వారికి మడిమాన్యాలిచ్చి, సమస్త సంబారాలిచ్చి పోషించినవారు. అనేక ఉత్తమ గ్రంథాలను రచింపజేసిన కవి రాజులు, దోమకొండ ప్రభువులు ఈ ఇందూరు సీమవారే. ఈ జిల్లా ఆనాటినుండి కవి పండితులకు పేరుగాంచింది. సంస్కృత, తెలుగు సాహితీ సుమాలు ఈ ప్రాంతాంలో వికసించి గుబాళించాయి. కుస్తాన్‌పురం, భీంగల్ స్థల మహాత్యాలను ఆనాడు ఈ ప్రాంతం కవులు సంస్కృత భాషలో వర్ణించారు. నరహరి సూరి విష్ణు పురాణానికి వ్యాఖ్యానం రాసి ఎంతో పేరు తెచ్చుకున్నాడు. భిక్కనూరుకు చెందిన మిట్టపల్లి సీతారామసూరి ప్రామాణిక జ్యోతిష్య శాస్త్రంపై గ్రంథం రాసినట్టు చెబుతారు. అలాగే భిక్కనూరు రాజు కామారెడ్డి తమ్ముడైన మల్లారెడ్డి గొప్ప కవి పోషకుడుగా పేరు తెచ్చుకున్నారు. ఈయన సంతతి వాడైన రాజా రాజేశ్వరరావు బహుబషా కోవిదునిగా పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎందరో ఆధునిక కవులు ఈ జిల్లాలో వర్ధిల్లారు. ఈ జిల్లాలోని నీలంతేశ్వరాలయం, సంగంలోని సంగమేశ్వరాలయం, బోధన్‌లోని చక్రేశ్వరాలయం, ఉమ్మెడలోని ఉమా మహేశ్వరాలయం కల్యాణి చాళుక్యుల కాలంనాటివే. అలాగే నేటి బాన్సువాడ (నాటి వానసవాడ). ఆ కాలంనాటిదే అని అంటున్నారు. శివాజీమహారాజు కాలంలో సమర్థ రామదాసుస్వామి సారంగపురంలోనూ, నిజామాబాద్ పట్టణంలోనూ నిర్మించిన ఆలయాలు నేటికి నిత్య పూజాలందుకుంటున్నాయి.

చిందు భాగవతం, చిందు ఎల్లమ్మ, యక్షగానాలు, చిరుతల రామాయాణం, బుర్రకథ, ఒగ్గుకథ, జడకొప్పులాట, ధూలాట వంటి సాహిత్య కళారంగాలలోనూ, వ్యాపారంగంలోనూ నిజామాబాద్ జిల్లాకు ఆనాటి నుండే ఎనలేని కీర్తి ప్రతిష్ఠలున్నాయి. ఈనాటి బీడీల పరిశ్రమ చక్కెర పరిశ్రమల నుండి నాటి యుద్ధ సామాగ్రినీ, దారు శిల్పాలనూ, నకాశి కళా ఖండలనూ, అత్తరు-పన్నీరులనూ తయారు చేసిన ఘనత నిజామాబాద్ జిల్లాకు దక్కుతుందనడంలో అతిశయోక్తి కాదు.

## 1.5. నిజామాబాద్ జిల్లా ప్రత్యేక ఆకర్షణలు

చరిత్రకు సజీవ సాక్ష్యం చారిత్రక కట్టడాలు. భవిష్యత్ తరాలకు చరిత్రను అందించే ఆలనాటి కట్టడాలు, జిల్లా నగరంలో చూడడానికి చాలా ఉన్నాయి. నీలకంఠేశ్వరాలయం, సారంగపూర్ హన్మాన్ మందిరం, తిలక్ గార్డెన్, ఖిల్లా, తెలంగాణ విశ్వవిద్యాలయం మొదలైనవి. నిజాంసాగర్ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్, పోచారం డ్యాం, అలీసాగర్, నిజామాబాద్ కోట, డిచపల్లి రామాలయం, మ్యూజియం, దోమకొండ కోట, ఖిల్లా రామాలయం, భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వర దేవాలయం, రామారెడ్డి శ్రీకాలబైరవ స్వామి దేవాలయం, సంతాయిపేట్ శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయం, మల్లారం అడవి ఆశోక్ సాగర్, సారంగాపూర్, ఆర్మూర్ రోడ్డులోని శిలలు మొదలైనవి పర్యాటక ఆకర్షణలు. నిజామాబాద్ కోట, రఘునాధదాసు నిర్మించిన ఒకప్పటి రామాలయంపై నిర్మించారు. ఆయనే నిర్మించిన పెద్దచెరువు నేటికి నిజామాబాద్ నగరానికి మంచినీటి అవసరాలు తీరుస్తోంది.

## 1.6. పుణ్యక్షేత్రాలు

ప్రసిద్దమైన యాత్రస్థలాలు, తీర్థస్థలాలకు ఈ జిల్లాలో కొదువలేదు. పుణ్యక్షేత్రాలలో లింబాద్రి గుట్ట, బడాపహాడ్, బిచ్కుంద మరియు సారంగాపూర్ మొదలైన ప్రదేశాలు ఎన్నో చారిత్రక నేపథ్యం కలిగి ఉన్నాయి. కొన్ని క్షేత్రాలు రాజవంశస్థులు నిర్మించినవి, మరికొన్ని ఇలవేల్పులుగా వేలసినవి. ఇలా అనేక మహిమ కలిగి, నిరంతరం పూజలు అందుకుంటూ ప్రజల జీవనవిధానంలో భాగంగా భక్తిపారవశ్యంలో మునిగి తేలుతున్నాయి. వీటిలో కొన్ని ముఖ్యమైనవి.

### 1.6.1. లింబాద్రిగుట్ట

నిజామాబాదు జిల్లాకి ఐదు కి.మీ. దూరంలో ఉన్న లింబాద్రి గుట్టపై కోలువుదీరిన క్షేత్రం శ్రీనిబాంద్రి లక్ష్మీనరసింహ నిలయం. దీనిని 'దక్షిణ బద్రినాథ్'గా పేరు గాంచింది. లక్ష్మీనరసింహ క్షేత్రాలలో అరుదుగా కనిపించే శివాలయం జోడులింగాలతో ప్రత్యేకంగా

కన్పించే ప్రదేశమిది. దీనికి వందయేళ్ల చారిత్రక ప్రాముఖ్యత గలదు. అంతేగాక బ్రహ్మమహేశ్వరులు తపస్సు చేసిన ప్రదేశంగా ప్రసిద్ధి. బ్రహ్మవైవర్తక, బ్రహ్మాండ పురాణాలలో ఈ క్షేత్ర ప్రసక్తి కలదు. లింబాద్రిగుట్ట అసలు పేరు నింబాద్రిగుట్ట. 'నింబా' అంటే 'వేప' అని అర్థం. వేపవనంలో వెలిసిన లక్ష్మీనరసింహుడు కాబట్టి ఈ ప్రదేశానికి నింబాద్రిగుట్టగా పేరుగాంచింది. ప్రతి సంవత్సరం కార్తీక శుద్ధ తదియ నుండి త్రయోదశి వరకు ఇక్కడ ఉత్సవం జరుగుతుంది. దీనిని 'నింబాచలం' అని కూడా అంటారు. ఈ ఉత్సవాల్లో ముఖ్యమైన ఘట్టం సుదర్శన పెరుమాండ్ల యాత్ర. నరనారాయణ రూపంతో బద్రినాథ్ క్షేత్రంలో స్వామి విరాజిల్లుతారు. లక్ష్మీనారాయాణ, కుబేర, గరుడ, నారద, ఆర్జున, కృష్ణ, ఉద్ధవ అనేవి బద్రీనాథ్‌లో మనకు కన్పించే దేవతమూర్తులు. అక్కడేకాకుండ మళ్ళీ మన భారతదేశంలో స్వయంవ్యక్తమైన నరనారాయాణులు, కృష్ణార్జులున్న ఏకైక ఆలయం ఇది మాత్రమే. గర్భాలయంలో నరసింహుని ఆనుకొని కృష్ణార్జునులు ఇక్కడ మనకు దర్శనమిస్తారు. కాబట్టి దీనిని 'దక్షిణ బద్రినాథ్'గా పిలుస్తారు. సాధారణంగా వైష్ణవ క్షేత్రంలో బిల్వపత్ర సమర్పణ కనబడదు. కాని ఇక్కడ తులసి పత్రి ఎంత ప్రీతో అంతే బిల్వపత్రాలతో పూజలు చేస్తుంటారు. అది ఇక్కడి వైశిష్ట్యం. పచ్చని కొండల మధ్య ఈ ప్రాంతం ఎంతో ఆహ్లాదంగా ఉంది.

### 1.6.2. బడాపహాడ్ (పెద్దగుట్ట)

నిజామాబాదు జిల్లాలోని వర్ని మరియు చందూరు మధ్య జలాలుపూర్ దగ్గర దట్టమైన ఆడవి ప్రాంతంలో ఉన్నది 'సయ్యద్ షాదుల్లా హుస్సేన్ బాబా దర్గా. దీనినే బడాపహాడ్ అని, 'పెద్దగుట్ట' అనే పేర్లున్నాయి. ఈ దర్గ ఏడువందల యేండ్ల చరిత్ర కలిగినది. ఉర్దూ క్యాలెండర్ ప్రకారం రజ్జాస్ నెలలో సమాధి పండుగ జరుపుతారు. ఇక్కడికి కర్ణాటక, తమిళనాడు, మహరాష్ట్రల నుండి అనేకమంది భక్తులు శ్రద్ధాంజలి ఘటించడానికి వస్తారు. ఇక్కడ ప్రతి సంవత్సరం జాతర కూడా జరుగుతుంది. అయితే ఇక్కడి ప్రజల కథనం ప్రకారం అలంగిరి అనే రాజు దగ్గర సయ్యద్ షాదుల్లా తహాసిల్దారుగా పని చేశాడట. ఈయన మహరాష్ట్రలో ఉన్న జాల్నా ప్రాంతంలో శిస్తులు వసూలు చేసేవాడు. అయితే ఆ సమయంలో

ఆ ప్రాంతమంతా చాలా కరువు ఏర్పడి ప్రజలు తిండిలేక అల్లాడుతుంటే అది చూసి అప్పటివరకు వసూలు చేసిన శిస్తు ధనాన్ని వారందరికి పంచిపెడతాడు. రాజు శిస్తు పంపాలని ఆదేశిస్తాడు. శిస్తు కట్టలేక ఉద్యోగం వదులుకొని, ఆ ప్రాంతం విడిచి తనదగ్గర ఉన్న గుర్రం, కుక్క, పిల్లి, సైందవులతో కలిసి లక్ష్మీపుర ప్రాంతానికి వచ్చాడు. అక్కడ గొల్ల సాయమ్మ సహాయంతో తనకు కావాలసినవన్ని తెప్పించుకుని జీవనం కొనసాగించేవాడు. కాని అలంగిరి రాజుగారి సైనికులు వెతుక్కుంటూ వస్తారు. గొల్ల సాయమ్మ ద్వారా విషయం తెలుసుకుంటారు. దీంతో సయ్యద్ షాదుల్లా తన దగ్గరున్న జంతువులను తీసుకొని పెద్దగుట్ట మీదకిపోయి ముందుగా గుర్రాన్ని, కుక్కని, పిల్లి, సైందవులను తన దగ్గర ఉన్న బెత్తం(కర్ర)తో కొట్టాడట దాంతో అవి భూమిలోకి పోయి సమాధైనాయట. ఆ తరువాత సయ్యద్ షాదుల్లా కూడా అక్కడే సమాధైపొయాడట అని ఇక్కడివారు చేప్తారు. కొంతకాలానికి రెండు వందల యేళ్ళ క్రితం ఒక కాపరి పశువులను మేపుకుంటూ ఆ ప్రాంతానికి చేరుకుంటాడు. కొద్దిసేపు చెట్టుకింద నిద్రపోయి లేచేసరికి తన పశువులు కనబడకుండా మయామైతాయి. దాంతో దేవుడా నా పశువులు నాకు చూపించని కోరుకున్నాడట. వెంటనే పశువులు ప్రత్యక్షమైనాయాట. ఈ స్థలంలో ఎంతో మహిమగలదని అందరికి చెప్పాడు. ఇలా సమాధి వెలుగులోకి వచ్చింది. ఈ సమాధి ప్రతి ఆది, సోమ, గురువారాలలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ జెండా ఊరేగంపులలో చిన్న, పెద్ద సంబరాలను సంవత్సరంలో మూడు రోజులపాటు ఉర్సు ఉత్సవాలు జరుపుకుంటారు. అంతేగాక బాబాగారి గుర్రానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

### 1.6.3. సారంగాపూర్

నిజామాబాదు జిల్లాకు కేంద్రంగా ఎనిమిది కి.మీ.ల దూరంలో బాసరకు వెళ్లే మార్గంలో స్వయంభుగా వెలసిన హనుమంతుని దేవాలయం సారంగాపూర్‌లో కలదు. దాదాపు 400 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో చాలా కరువు ఏర్పడుతుంది. సారంగపూర్ పాలించే రాజు కరువును నివారించే పూజలు చేయమని బ్రాహ్మణులను ఆదేశిస్తాడు. అంతేగాక పూజలు ఫలించక వానలు పడకపోతే వారందరిని చంపేస్తానని

ఆజ్ఞలు విధిస్తాడు. సారంగపూర్ అనే అగ్రహారంలోని బ్రాహ్మణులంతా కలిసి అడవిలోకి వెళ్ళి పూజలు చేస్తారు. అలా పదకొండు రోజులు చేసిన ఫలితం ఉండదు. ఆ సమయంలో ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు అటుగా వెళ్తూ గమనించి విషయాన్ని తెలుసుకొని తపస్సు చేస్తే ఫలితంగా అక్కడ అంజనేయస్వామి వెలుస్తాడు. తరువాత వర్షాలతో కరువు సమస్య తీరిందని ఇక్కడి చరిత్ర, ప్రజల నమ్మకం. ఈ ఆలయానికి సమర్థరామదాసు శంకుస్థాపన చేశాడు. ఇక్కడి అంజనేయస్వామి రుద్రాంజనేయస్వామిగా పూజలు అందుకుంటున్నారు. అలాగే త్రేతాయుగంలో రామావతరంలో వాయుదేవుడి అంశతో అంజనేయుడిగా, ద్వాపరయుగంలో కృష్ణావతరంలో భీముడిగా, కలియుగంలో మద్వాచార రూపంలో అవతరించాడని వైష్ణవ ధర్మం తెలుపుతుంది. చైత్రపూర్ణిమ రోజున అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి జరుపుతారు. మాఘశుద్ధ అష్టమి నుండి మాఘశుద్ధప్రతిపద వరకు బ్రహ్మోత్సవాలు జరుపుతారు. నిజామాబాదు జిల్లాలోనే అతిపెద్ద అంజనేయస్వామి ఆలయం ఇదే. 1400 ఎకరాలలో సువిశాలమైన చక్కటి వాతావరణంలో, రవాణా సౌకర్యాలతో భక్తులకు అవసరమైన వసతులన్ని కలిగిన ప్రదేశం.

### 1.6.4. శ్రీ సిద్ధరామేశ్వర స్వామి దేవాలయం

శతాబ్దాల చరిత్ర కలది ఈ గుడి. దీని చుట్టూ ఎంతో చారిత్రక విశేషాలున్నాయి. ఇక్కడ శివుడు స్వయంభూగా వేలిశాడు. ఇక్కడ కనిపించేటువంటి శివలింగం ప్రపంచంలో మరెక్కడ కనిపించదు. పానపచ్చం మీద లింగం లోపలివైపు తిరిగి ఉంటుంది. ఏడంతస్తుల రాజగోపురం, వందలయేళ్ళ నుండి చెక్కుచెదరకుండా ఉన్న పాముల పుట్ట, వటవృక్షం, గర్భాలయంపై కప్పు మీది నిర్మాణాపు వజ్రాకారాలు అన్ని ఈ గుడికి ఉన్న ప్రాముఖ్యతను, విశిష్టతను పురాతన చరిత్రను తెలియజేస్తున్నాయి. కామారెడ్డి నుండి భిక్కనూరుకి ఇరవై కి.మీ. దూరంలో ఈ ఆలయం మనకు కనబడుతుంది. ఏడున్నర శతాబ్దాల చరిత్ర కలదు. సిద్దగిరి, రామగిరి అనే మునులు ఈ స్థలంలో తపస్సు చేశారు. వీళ్ళు తపస్సు చేసుకునే సమయంలో రోజు ఒక ఆవు వచ్చి ప్రక్కనున్న పుట్టలో పాలుపోసి పోయేదట. ఆ ఆవు అలా ఎందుకు చేస్తుందని ఆ మునులు పుట్ట దగ్గరకు వెళ్లి చూస్తే ఆ పుట్టనుండి ఓంకార శబ్దం

వినబడుతుంది. ఆ మునులిద్దరు నీళ్ళను సంప్రోక్షం చేసి ఆ పుట్టపైన చల్లగానే పుట్ట పగిలి శివుడు ప్రత్యక్షమవుతాడు. శివుడు వాళ్ళతో ఇక్కడ ఆలయ నిర్మాణం చేయాలంటాడు. దానికి మునీశ్వరులకు శివుడు తాళపత్ర గ్రంథాన్ని ఇస్తాడు. దానిలో విశేషాలను పాడుకుంటూ గ్రామగ్రామాలు తిరిగి ఆలయ నిర్మాణానికి కావలసిన పైకాన్ని సమకూర్చుతారు. గుడి నిర్మాణం ప్రారంభిస్తారు. గర్భాలయం, అంతరాలయం, మండపం, సింహద్వారం వాళ్ళే నిర్మించారు. ఆ విధంగా ఇక్కడి చెట్టుకు, పుట్టకు వందల యేళ్ళ చరిత్ర ఉన్నది. సిద్ధగిరి, రామగిరి అనే మునులు కట్టించిన దేవాలయం కనుక వీరి పేరుమీదుగా శ్రీ సిద్ధరామేశ్వరాలయం అని ప్రసిద్ధి చెందింది. 15వ శతాబ్దంలో వేలసిన గుడిగా ప్రాశస్త్యం పొందింది. గోల్కొండ నవాబుల కాలంనాటి ఆర్కిటెక్చర్ మనకు కనబడుతుంది. ఈ గుడిలో ఉన్న మరో ప్రత్యేకత మూలబావి. దీనిని సిద్ధగిరి, రామగిరి మునులు తవ్వించారు. 20-25 గజాల లోతులో ఉంటుంది. దీనిని పుష్కరిణిబావి అని కూడా పిలుస్తారు. ఈ ఆలయం 1971లో ఎండోమెంట్ పరిధిలోకి ఈ దేవాలయం వచ్చించి. ఇక్కడ కనపడే శివాలింగాన్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇలాంటి శివలింగం ప్రపంచంలో మరెక్కడ కనబడదు. సాధారణంగా శివాలయాల్లో పానవట్టం ఉత్తరాభిముఖంగా ఉంటుంది. కాని ఇక్కడ తూర్పు అభిముఖంగా కనబడుతుంది. ఇది ఈ క్షేత్ర ప్రత్యేకృత.

### 1.6.5. శ్రీ కాలబైరవ స్వామి దేవాలయం

సాక్షాత్తు పరమశివుడే కొలువైన క్షేత్రం కాశీపుణ్యక్షేత్రం. ఆ క్షేత్రానికి క్షేత్ర పాలకుడు కాలభైరవుడు. పరమశివుడి మానస పుత్రుడే ఈ కాలభైరవుడు. బ్రహ్మనే సంహరించిన శక్తిశాలి. దుష్టశక్తులకు సింహస్వప్నం. నిజామాబాద్ జిల్లా రామారెడ్డి మండలంలోని ఇస్సన్నపల్లి అనే గ్రామంలో ఈ కాలభైరవస్వామి దేవాలయం కలదు. రామారెడ్డికి రథాల రామారెడ్డి అనే పేరు కలదు. ఈ ఊర్లో అప్పటి కాలంలో దేవతల రథోత్సవాలు అధికంగా జరిగేవి. అందుకే ఈ ఊరికి రథాల రామారెడ్డి అనే పేరు వచ్చింది. 15వ శతాబ్దం వరకు ఈ గ్రామం దోమకొండ సంస్థాన ఆధీనంలో ఉండేది. క్రీ.శ.1550-1600 మధ్యకాలంలో దోమకొండ సంస్థానాన్ని పాలించిన రెండవ కామిరెడ్డి తమ్ముడు రెండవ మల్లారెడ్డి కొడుకు

రామారెడ్డి పేరుతోనే నిర్మించినది. రామారెడ్డిలోని శివాలయం, రామాలయాల నిర్వహణ కోసం దోమకోండ సంస్థానాధీశులు రాసి ఇచ్చిన అగ్రహారమే ఈ ఇస్సన్నపల్లి. మాల్లారెడ్డి అన్నయ్య తన కొడుకు విస్సారెడ్డి పేరుతో కట్టించిన ఊరే విస్సన్నపల్లి అని, అది కాలక్రమంలో ఇస్సన్నపల్లిగా మారిందని అంటారు. రామారెడ్డి గ్రామానికి అష్టదిక్కులో అష్టభైరవులున్నారు. వీరు ఎల్లప్పుడు ఊరిని కాపాడతారని ప్రజల నమ్మకం. 1. అశి తాగుడు 2. సంసార భైరవుడు 3. రూరుడు 4. కాళుడు 5. క్రోధభైరవుడు 6. తానుచూడుడు 7. చంద్ర చూడుడు 8. మహాభైరవుడు అనే పేర్లులున్నాయి. కాలభైరవుని విగ్రహం క్రీ.శ. 13వ శతాబ్దం నాటిదని, దిగంబర జైన విగ్రహమని కొందరి వాదన. కాలభైరవుడిని దిగంబరుడిగా చెప్పిన పురాణాలు, తాళ్ళపత్ర గ్రంథాలు కాలభైరవ విగ్రహం సనాతన వైదిక విగ్రహామనే వాదన కూడా ఉంది. కరువు సమయంలో స్వామి వారి విగ్రహానికి పేడపూసేవారు స్థానికులు. కార్తీకమాసంలో స్వామివారికి జన్మదిన వేడుకలు చేస్తారు.

### 1.6.6. కంఠేశ్వర్

నిజామాబాదు పట్టణంలో కొండపై వెలసిన కంఠేశ్వర్‌లో ఉన్న నీలకఠేశ్వరుని రూపంలో కొలువై ఉన్న శివుని దేవాలయం అతి పురాతనమైంది. పూర్వకాలంలో జైనాలయంగా ఉండేది. ఉత్తరభారత వాస్తుశైలిలో ఉండే ఈ దేవాలయాన్ని శాతవాహన చక్రవర్తియైన రెండవ శాతకర్ణి జైనులకొరకు కట్టించారు. జనవరిలో రథసప్తమి రోజున శివలింగంపైన సూర్యకిరణాలు ప్రసరిస్తాయి. ఈ రథసప్తయి పండగను ప్రతిఏటా పెద్దెత్తున జరుపుతారు.

### 1.6.7. డిచ్‌పల్లి రామాలయం

క్రీ.శ. 1600 ప్రాంతంలో విజయనగర రాజులు డిచ్‌పల్లి దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. డెబ్బై ఆరు అడుగుల ఎత్తులో దీన్ని నిర్మించారు. ద్వారాలపై నగషీ, గోపురాలపై ద్రావిడుల ప్రభావం కన్పిస్తుంది. విజయనగర రాజుల శిల్పరీతి కనిపించడంతో 16వ శతాబ్దం మధ్యకాలంలో రామరాయల హయాంలో నిర్మించి ఉండవచ్చని భావిస్తున్నారు.

నిర్మాణం మొత్తం చాలా వరకు నల్లరాయితో జరిగింది. ఈ దేవాలయానికి ఎదురుగా చెరువు మధ్యలో నిర్మించిన మండపం ప్రత్యేక ఆకర్షణ.

### 1.6.8. ఖిల్లా రామాలయం

ఇందూరు, ఇంద్రపురి అనే పేర్లు కలిగిన నిజామాబాదు పట్టణాన్ని ఇక్కడి కోటను రాష్ట్రకూటులు నిర్మించారు. వారి కాలంలోనే నిర్మించిన నలభై అడుగుల ఎత్తున్న విజయస్థూపం కూడా ఇక్కడ ఉంది. క్రీ.శ.1311లో ఈ కోటను అల్లావుద్దీన్ ఖిల్జీ ఆక్రమించాడు. తరువాత అది బహమనీ రాజుల చేతుల్లోకి, ఆపై కుతుబ్షాహి, అసప్జాహీల చేతుల్లోకి వెళ్ళింది. విశాలమైన ఈ కోట రాతిగోడలతో నాలుగు మూలల బురుజులతో ఉంది. క్రీ.శ.10వ శతాబ్దపు ఈ రాష్ట్రకూటుల కోట ప్రస్తుతం అసప్జాహీల శైలిలో విశాలమైన గదులతో ఉంది. కోటలో సమర్థ రామదాసు నిర్మించిన బడా రామాలయం మరో ఆకర్షణగా నిలిచింది. కంజర్లో కూడా హనుమంతుని దేవాలయం ఉంది. ఈ గుడిని 1843లో నిర్మించారు.

### 1.6.9. వంద స్తంబాల గుడి

బహుధాన్యపురంగా పేరుగాంచిన బోధన్ నగరానికే తలమానికం వంద స్తంభాల గుడి. ఇది రాష్ట్రకూటుల కళా దర్పానికి నిదర్శనం. ఎన్నోవందల సంవత్సరాల చరిత్ర కల్గినది. ఇది జిల్లాలోనే ప్రాచీన దేవాలయంగా వందస్తంభాల గుడి పేరుపొందింది. ఈ వందస్తంభాల ఆలయాన్ని హిందువులు ఇంద్రనారాయణ, సూర్యనారాయణ ఆలయంగా పిలుస్తుండేవారు. అలాగే ముస్లింలు దేవర మసీదుగా పిలుస్తున్నారు. ఈ దేవాలయంలో శిల్పసంపద ఇప్పటికి సజీవంగా దర్శనమిస్తుంది. పద్మాలు, ఏనుగుల శిల్పాలతో అద్భుత నిర్మాణం గావించారు. ఈ ఆలయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఒకవైపు ఆలయంగా, మరోవైపు మసీదుగా కనిపిస్తుంది. బోధన్ ప్రాంతాన్ని క్రీ.శ. 915-927 కాలంలో పరిపాలించిన రాష్ట్రకూట చక్రవర్తి మూడవ ఇంద్రవల్లభుడు ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు చెప్తున్నారు.

### 1.6.10. క్లాక్ టవర్

ఇందూరు జిల్లాకే తలమానికం నగరం నడిమధ్యలో ఉన్న క్లాక్‌టవర్. ఒకప్పుడు నిజామాబాద్ షాన్‌గా ఉండేది. ఈ గడియారానికి కరెంటుతో పనిలేదు. అప్పట్లో లండన్ నుండి విడిభాగాలు తెప్పించి, టవర్‌కు నాలుగు వైపులు ఒకే సమాయాన్ని తెలిపేవిధంగా దీనిని నిర్మించారు. 1905లో గంజ్ ఏర్పాటు చేసిన చీలం జానకీబాయి 150 పీట్ల ఎత్తులో నిర్మాణాన్ని చేశారు. ఈ గడియారానికి ఒక చరిత్ర ఉంది. రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి నిజామాబాద్ ఆర్మూర్‌ల మధ్య ప్రధాన కూడలిగా ఉండేచోట మహబూబ్ గంజ్ మార్కెట్‌యార్డును ఏర్పాటు చేశారు. స్వాతంత్రం వచ్చాక ఈ మార్కెటుయార్డును గాంధీ గంజ్‌గా పేరు మార్చారు.

### 1.7. నిజామాబాదు జిల్లా-సాంఘిక, ఆర్థిక, సాంస్కృతికాంశాలు

నిజామాబాదు జిల్లా బహు సంస్కృతుల సమ్మేళనం. ఈ జిల్లాలో తెలుగు భాష వ్యవహర్తలు అధికంగా ఉన్నారు. అలాగే రెండవ స్థానంలో ఉర్దూ భాష వ్యవహర్తలుంటారు. జిల్లాతో సరిహద్దుగాగల మహరాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల వల్ల మరాఠి, కన్నడ మరియు గుజరాతీ భాషలు మాట్లాడే ప్రజలు కనబడుతుంటారు. దీనివల్ల వారి మధ్య సంబంధ బాంధావ్యాలు ఎర్పడ్డాయి. నిజాం పరిపాలన కాలంలో అధికార భాషగా ఉర్దూ చలామణిలో ఉండటంవల్ల తెలుగు భాషపై ఉర్దూ భాష ప్రభావం ఉండేది. అదేవిధంగా ఇక్కడి ప్రజలపై వ్యాపారాలలో, పరిశ్రమలలో, అన్ని రకాల రంగాలలో మార్వడీ, గుజరాతీ, రాజాస్థానీయులు గుత్తాధిపత్యం వల్ల వీరి సంప్రదాయాలు దెబ్బతిన్నాయి. నిజాం పాలన అంతం అయ్యేవరకు ఈ జిల్లా ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా వెనుకబడ్డాయి. 1923లో నిజాం ప్రభుత్వం నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్ట్, 1938లో నిజాం చక్కెర ఫ్యాక్టరీని స్థాపించడంతో ఆర్థిక పరిస్థితులలో మార్పులు వచ్చాయి. జిల్లాలోని హరిజనులు సాంఘికంగా, ఆర్థిక ఇబ్బందులతో, అలాగే పద్మశాలీల చేనేత పరిశ్రమలు దెబ్బ తినడంతో వేలాది కుటుంబాలు బ్రతుకు దెరువు కోసం బొంబాయి, పూనే, షోలాపుర్ వంటి ప్రాంతాల పరిశ్రమలలో కార్మికులుగా పని చేస్తున్నారు.

నిజాం నిరంకుంశ పాలనలో తెలంగాణ ప్రాతంమంతా కూడా అణచివేతకు గురైంది. మాతృభాష తెలుగులో విద్యాబోధనను నిషేధించడం జరిగింది. అంతేకాకుండా పాఠశాలలు, కళాశాలలు అన్నిరకాల ప్రభుత్వ కార్యాలయాలోనూ ఉర్దూ భాషనే ఉపయోగించబడింది. తెలుగు పత్రికల నిర్వహణ మీద, పుస్తకాల ప్రచురణలపైనా ఆంక్షలుండేవి. పై కారణలవల్ల తెలంగాణ సాంస్కృతికంగా వెనుకబడింది. అలాగే జిల్లా పరిస్థితి ఇదేవిధంగా ఉండేది. ఈ నిజామాబాదు జిల్లాలో తెలుగు నాటకాలు, నాటికలు, నృత్యం, సంగీతం వంటి కళలు ఎక్కువగా అభివృద్ధి చెందలేదు. తోలుబోమ్మలాటలు, వీధిభాగోతలు మాత్రమే ప్రజల వినోద సాధనాలుగా ఉండేవి. అలాగే పాటలు, పద్యాలు, గేయాలు మొదలైనవి ప్రజల నాలుకల మీద నేటికీ సజీవంగా ఉన్నాయి. జిల్లాలో పూర్వం నుండి ఇళ్ల నిర్మాణంలో పెంకుటిళ్లే ఎక్కువ. మగవారు దోతి, అంగీ ధరిస్తారు. ఆడవారిలో కొందరు సాధారణ చీరతోపాటు గోచీచీరను కూడా ధరించేవారు ఉన్నారు. మగవారు బీడీలు, చుట్టలు త్రాగుతారు. అలాగే ఆడవారు ఆకేసుకోవడం (తాంబులం) జర్ద వేసుకుంటారు. తెలంగాణ సంస్కృతికే అలంకారమైన బతుకమ్మ పండుగ, పీర్ల పండుగ, దసరా, దీపావళి, సంక్రాంతి, క్రిస్మస్ పండుగలను జరుపుకుంటారు. అలాగే జిల్లాలో చేతబడి, దెయ్యం పట్టుట, మంత్రతంత్రాలు వంటి మూఢనమ్మకాలు నేటికి కొనసాగుతూనే ఉన్నాయి. నిజామాబాదు జిల్లాలో జైనమతం, బౌద్ధమతం, వైష్ణవమతం, శైవమతం, ముస్లీం, సిక్కు, క్రైస్తవ మతాల ప్రజలు జీవించడంవల్ల ఈ జిల్లా సంస్కృతి భిన్నత్వంలో ఏకత్వంలా ప్రతిబింబిస్తుంది.

నిజామాబాదు జిల్లా గుండా సికింద్రాబాద్-నాందేడ్ మార్గం వెళ్తుంది. జానకంపేట నుంచి బోధన్ వరకు మరో మార్గం ఉంది. జిల్లాలో మొత్తం ఈ మార్గంలో 15 రైల్వేస్టేషన్లు ఉన్నాయి. కరీంనగర్ నుంచి నిజామాబాదుకు కొత్తగా నిర్మిస్తున్న రైలుమార్గం పురోభివృద్ధిలో ఉంది. జిల్లా గుండా ఉత్తర-దక్షిణంగా 44వ నెంబర్ జాతీయ రహదారి మరియు నిజామాబాదు-భూపాలపట్నం జాతీయ రహదారి వెళ్తుంది

**1.9. జనాభా**

నిజామాబాదు జిల్లా 2011 జనాభా లెక్కల ప్రకారం, ఈ జిల్లా జనాభా 25,52,073. స్త్రీ, పురుషుల నిష్పత్తి 1038:1000 భారతదేశ జనాభాతో పోల్చుకుంటే జిల్లాలో పురుషుల సంఖ్య కంటే స్త్రీల సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం. మొత్తం అక్షరాస్యత 53.26% కలిగి ఉంది. 2006లో భారత ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాను, దేశంలోని మొత్తం 640 జిల్లాలలో కెల్లా ఆర్థికంగా వెనుకబడిన 250 జిల్లాలలో ఒకటిగా గుర్తించింది.

ఈ అధ్యాయం ద్వారా నిజామాబాదు జిల్లా చరిత్ర, ప్రాశస్త్యం తెలుసుకోవచ్చు. జిల్లాలోని కౌలాస్, సిర్నాపల్లి, దోమకొండ మొదలైన కోటలు-సంస్థానాల విశిష్టతను చూడవచ్చు. భౌగోళిక స్వరూపంలో భాగంగా అక్కడి నేలలు, పంటలు, ఖనిజాలు, వనరులు మొదలైన వాటి గొప్పతనం కన్పిస్తుంది. సాహితీ కళాసంపద, ఆధ్యాత్మిక క్షేత్రాలు, రవాణా, జనాభా మొదలైన విషయాలు తెలుస్తాయి.

*****

# అధ్యాయం-2

# 2. నిజామాబాదు జిల్లా సాహిత్యం-విహంగ వీక్షణం

### 2.1. పరిచయం

సమాజానికి హితాన్ని బోధించేది సాహిత్యం. ఇది అనేకానేకాంశాలతో మనిషి జీవితంలో అన్ని కోణాలను ప్రభావితం చేసేది సాహిత్యం. మానవాళి అభివృద్ధికి తోడ్పడంతోపాటు, చరిత్ర రచనకు ఆధారంగా నిలుస్తుంది. అలాగే తెలంగాణ సాహిత్యాన్ని పండించడంలో నిజామాబాదు జిల్లాకు ఒక స్థానం ఉంది. క్రీ.పూ. 6వ శతాబ్ది నాటికే బోధన్ కేంద్రంగా 'అస్మకరాజ్యం' వర్ధిల్లింది. అప్పటినుండే ఇక్కడ సంస్కృత, ప్రాకృత సాహిత్యం వెల్లివిరిసింది. ఆ కాలంలో జైనమతం ప్రబలంగా ఉండటంవల్ల ఆ మతానికి సంబంధించిన సాహిత్యమే ఎక్కువ వచ్చింది. అయితే వస్తువు జైన సంబంధి కావడం, భాష ప్రాకృతం కావడంవల్ల అది తర్వాత సాహిత్య పరంపరతో సంబంధం లేకుండా పోయింది. తర్వాత బోధన్ చాళుక్యుల కాలంలో సంస్కృత, కన్నడ భాషల్లో గొప్ప సాహిత్యం సృజించబడింది. అప్పడప్పుడే సాహిత్యంలో స్థిరపడుతున్న తెలుగు భాషలోనూ చక్కని కవిత్వం నాంది పలికింది. అప్పటినుండే నిజామాబాదులో సాహిత్య పరిమళాలు వికసించి సమాజానికి మార్గదర్శనం చేసిన ఆనవాళ్ళున్నాయి. అంతేకాకుండా ఈ జిల్లాకు ఆనుకొని సరిహద్దులుగా పడమరన కర్ణాటక, మహరాష్ట్రలు ఉండడంవల్ల కన్నడ, మరాఠీల భాష ప్రభావం ఉంది. అలాగే అప్పటి నిజాం నవాబుల పరిపాలన కాలంలో ఉర్దూ రాజభాషగా అమల్లో ఉండేది. దీనితో ఈ జిల్లా ప్రజలపై కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల ప్రభావంతో తెలుగుభాష, సాహిత్యాల గురించి ఎవరు పట్టించుకోలేదు. కాని తెలుగు ప్రజల గుండెల్లో తెలుగు కవిత్వం, పాటలు, పద్యాలు మొదలైనవి సజీవంగా మౌఖిక రూపంలో ఉన్నాయి. వాటిని వెలికితీసి పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అధ్యాయంలో నిజామాబాదు జిల్లాకు సంబంధించిన సాహిత్యాన్ని విశ్లేషించాను.

## 2.2. నిజామాబాదు జిల్లా ప్రాచీన సాహిత్యం

ప్రాచీనకాలంలో సాహిత్యం పోషింపబడింది అనడానికి సరైన ఆధారాలను పరిశీలించినట్లయితే, భవభూతి క్రీ.శ. 680-750 ప్రాంతానికి చెందినవాడు. అయితే భవభూతి తానే స్వయంగా విదర్భ దేశంలోని పద్మపురం గ్రామవాసినని చెప్పుకున్నాడు. ఇది నిజామాబాదు జిల్లాలోని బోధన్ నగరం. ఇది అత్యంత ప్రాచీన రాజధాని నగరమైన 'పోదనపురం'. మహాభారతంలో పేర్కొనబడిన అశ్మకుని రాజధాని నగరం. జైనతీర్థంకరుడైన బాహుబలి రాజధాని నగరం. బాహుబలిని గూర్చిన కన్నడ పురాణంలో బోధన్ నగరాన్ని పద్మపురమని అని పేర్కొన్నారు. అయితే బోధన్‌కు వసుమతి, పద్మపుర, ఏకచక్రపుర, బహుధాన్యపుర అనే పేర్లున్నాయి. చాళుక్య రాజైన ఇమ్మడి అరికేసరి-2 కవులకు, పండితులకు ఆశ్రయం కల్పించినట్లు తెలుస్తుంది. ఇతని వద్ద ఆశ్రయం పొందినవారిలో ఇందూరు జిల్లాకవిగా పేరుగాంచిన మహకవి పంపడు. క్రీ.శ.902 ప్రాంతంలో జన్మించాడు. ఇతను కూడా పద్మపుర నివాసినని చెప్పుకున్నాడు. కన్నడ భాషాత్రయం(పొన్న, రన్న, పంప)లో ఇతడు మొదటివాడు. ఇతడు ఆదిపురాణాన్ని, విక్రమార్జున విజయం అనే కావ్యాలను కన్నడ భాషలో రచించాడు. నన్నయ్య కంటే పంపకవి వంద సంవత్సరాలు పూర్వీకుడని, "జినేంద్రపురాణం" అనే కావ్యాన్ని రాశాడని చారిత్రకారుల అభిప్రాయం. కాని ఇది అలభ్య గ్రంథం. పంపకవి తమ్ముడు 'జినవల్లభుడు' కరీంనగర్ జిల్లాలోని గంగాధర సమీపంలో బొమ్మలగుట్ట మీద రచించిన "కుర్క్యాల శాసనం"లో తెలుగు కందపద్యాలు కనిపిస్తాయి. దీనిని బట్టి అన్నదమ్ములకు సంస్కృత, కన్నడ, తెలుగు భాషలలో ప్రావీణ్యం ఉందని తెలుస్తుంది. చివరకి జైనమతాన్ని స్వీకరించి 'శుభనంది' పేరుతో దేవేంద్ర సిద్ధాంతి శిష్యుడై బోధన్‌లో మరణించాడు. మధ్యయుగ కాలంనాటికి ముస్లిం పాలన ప్రభావం వల్ల తెలుగులో సాహిత్యం అంతగా అభివృద్ధి చెందలేదని చెప్పవచ్చు. క్రీ.శ.1405-1480 మధ్యకాలంలో నిజామాబాదు జిల్లా, ఆర్మూరు తాలుకా భీముగల్లుయే నేటి వేముగల్లు(ప్రస్తుత భీంగల్). ఈ ప్రాంత పాలకుడైన రాణామల్ల రాజాశ్రాయంలో ఆస్థానకవి కొఱవి గోపరాజు వీరి తల్లిదండ్రులు కామాంబిక, కసవిరాజు. ఈయన పన్నెందు ఆశ్వాసాల "సింహాసన ద్వాత్రింశిక" అనే సంస్కృత కావ్యాన్ని తెలుగులో కథాకావ్యంగా రచించాడు. ఇది అద్భుతరస ప్రధానం. గోపరాజు తన కావ్యాన్ని హరిహరనాథుడికి అంకితం చేశాడు.

అంతేకాకుండా కొఱవి గోపరాజు పినతాత కొఱవి సత్యనారాయణ కవి. ఇతను రాచకొండలో నివసించాడు. ఇతనికి 'ప్రప్రథమ ఆంధ్ర కవితాపితమహా' అనే బిరుదు కలదు. ఇక్కడే నివసించిన మరొక కవి దత్తోజి పండితుడు. ఈయన క్రీ.శ.1784 ప్రాంతానికి చెందినవాడు. కృష్ణార్జున సంవాదం, భగవద్గీత, యోగశాస్త్రాలు ఇతని రచనలు. సురవరం ప్రతాపరెడ్డి సంకలనం చేసిన "గోల్కొండ కవుల సంచిక"లో నిజామాబాదు జిల్లాకి చెందిన కవుల వివరాలు ఉన్నాయి. ఆ కవులలో శ్రీ శాస్త్రుల వారి ఆనంతరామ శాస్త్రి జన్మస్థలం లింగంపేట, ఎల్లారెడ్డి తాలుకా. ఇంకొకరు రెడ్డి హనుమద్దాసు. ఇతను నిజామాబాదు జిల్లా, దోమకొండ దగ్గర గల బీబీపేటలో నివసించాడు. ఆధ్యాత్మిక భక్తి, జ్ఞాన తాత్త్విక ప్రభోదాలకు సంబంధించిన గేయాలను రాశాడు. సాంబ శతకం, జ్ఞానబోధాధ్యాత్మలు, జగదాంబ కీర్తనలు, జీవబోధ శతకం, భక్తిపాటలు కొన్ని రాశారు. అంతేగాక సరళమైన పదాలతో భక్తిని, ముక్తిబాటను, గురుసేవను వైరాగ్యభావనలు ప్రబోధించేలా రాసిన పాటలను ఈ ప్రాంత ప్రజలను బాగా ఆకర్షించాయి. ఇప్పటికి వీటిని భజన బృందాలు పాడుకుంటారు. 1934లో గోల్కొండ కవుల సంచిక వెలువడిన నాటికి ఆరేళ్ళ క్రితం అంటే 1928లో హనుమద్దాసు మరణించారు. మరొక కవి 'శిరిశనహాళ్ కృష్ణమాచార్యులు'. ఈయన నిజామాబాదు జిల్లాలోని మోర్తాడులో పుట్టాడు. తెలుగు, సంస్కృత భాషల్లో మహపండితుడు, అష్టావధాని. నిజాం రాజ్యంలో తొలి శతవాధానిగా గుర్తింపు పొందాడు. 1925 నాటికే నిజామాబాదు, కరీంనగర్ జిల్లాలలో కవిగా, అవధానిగా ప్రసిద్ధి పొందాడు. పద్యాన్ని రమణీయ భావాలతో పలికించగల దిట్ట. ఇతని రచనలు కళాశాలాభ్యుదయం, కోరుట్ల జగిత్యాల అవధానములు, పద్మావతీ పరిణయము, రుక్మిణీకళ్యాణం, మనోజవిజయ బాణము (సంస్కృతం), గురువంశ మహాకావ్యం (సంస్కృతం), సంపత్కుమార సంభవం (సంస్కృతం), రామానుజ చరిత్రము, గీతాతత్వ మీమాంస గ్రంథాలు రచించాడు. వీరేకాకుండా కామినేని కవులైన కామినేని కామిరెడ్డి, కామినేని రెండో ఎల్లారెడ్డి, కామినేని మల్లారెడ్డిలు. వీరు క్రీ.శ. 1530-1611 మధ్యకాలంలో జీవించారు. బిక్కనవోలు (ఇప్పటి బిక్కనూరు, నిజామాబాద్ జిల్లా) సంస్థానం రాజధానిని 1787లో దోమకొండకి మార్చారు. అప్పటినుండి దీనిని దోమకొండ సంస్థానంగా వ్యవహరించారు. ఈ సంస్థాన మూలపురుషుడు కామినేని కాచారెడ్డి. కామినేని వంశంలో కామినేని కామిరెడ్డి శివభక్తుడు, లింగారాధ్యులవద్ద పట్టమట్ట సోమనాథునితోపాటు సహద్యాయి. కామిరెడ్డి తన సంస్థానంలో

సోమనాథుని ఆస్థానకవిగా నియమించి అతనితో సూతసంహితను అనువదింపజేసి అంకితం తీసుకున్నాడు. అలాగే కామినేని రెండో ఎల్లారెడ్డి రచించిన వాసిష్టవము, లింగపురాణం అనే రచనలు అలభ్య గ్రంథాలు. పట్టమెట్ట సోమనాథకవి రాసిన బ్రహోత్తరఖండాన్ని కామినేని రెండో ఎల్లారెడ్డికి అంకితం చేశాడు. కామినేని వంశంలో ముఖ్యమైనవాడు కామినేని మల్లారెడ్డి. ఇతను ఉద్దండ పండితుడు, రాజకవి. ఈ సంస్థానకవులలో అగ్రగణ్యుడు. సంస్కృతాంధ్ర కవితావిశారదుడు. ఇతని రచనలు షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరము, పద్మపురాణము అనే గ్రంథాలు లభిస్తున్నాయి. కవి మఠం మడివాళయ్య ఈయన 18వ శతాబ్దంలో నివసించిన సుప్రసిద్ధకవి. నిజామాబాదు జిల్లాలోని బిచ్కుంద దగ్గరలోని బోర్లం గ్రామవాసి. వీరశైవమత ప్రచారం చేస్తూ, ధర్మప్రచారం కోసం అనేక రచనలు చేశాడు. బసవేశ్వరుని భక్తుడు ఇతడు. తెలుగు, కర్నాటక భాషల్లో అనేక స్తవములు, పాటలు రచించాడు. ఈయన ప్రధాన రచన "శాయిరీ రామాయాణం". శాయిరీ మరాఠీ జానపద ఛందస్సు. పద్యాలు మాత్రాఛందస్సులో ఉంటాయి. ఈ కావ్యాన్ని బోర్లం బసవేశ్వరునికి అంకితం చేశాడు. మహంతమ్మ క్రీ.శ.1833 ప్రాంతానికి చెందినది. ఈమె మఠం మడివాళయ్య భార్య. నిజామాబాదు జిల్లాలోని బాన్సువాడ సమీపంలోని బోర్లం గ్రామవాసి. ఈమె రచన స్తవములు(అముద్రితం). మరికొంతమంది కవులు ప్రాచీన సాహిత్యంలో తమవంతు కృషిని చాటుకున్నారు. వారిలో రాపాక వెంకటదాసకవి క్రీ.శ.1710 ప్రాంతాంలో వాడు. నిజామాబాద్ జిల్లావాసి. శివునూరి అచ్చనమంత్రి ప్రోత్సహంతో శివరహస్య ఖండం రచించి వేములవాడ రాజరాజేశ్వరునికి అంకితం చేశాడు. దీనిలో చంద్రాపుర విశ్వేశ్వరుని వర్ణన ఉంది. రాపాక శ్రీరామకవి నిజామాబాదు జిల్లా పరకాలవాసి. ఇతని రచన అధ్యాత్మక రామాయాణం (యక్షగానము).

దోమకొండ సంస్థాన పదమూడవ పాలకుడైన మొదటి రాజేశ్వరరావుకి ఆశ్రితుడు రాపాక లక్ష్మీపతి. ఇతను ఆచార్య విజయము, శ్రీ మధూపాఖ్యానము, నీలవివాహము, భద్రాయురాభ్యుదయము అనే గ్రంథాలను రాశాడు. ఉమాపత్యభ్యుదయం రచించినది అదిపూడి ప్రభాకరరావు. ఇది ఈ జిల్లాలో వెలువడిన మొట్టమొదటి లఘుకావ్యం. మొదటి వంశ చారిత్రక కావ్యం. కామినేని వంశ చరిత్రను తెలుపే ఏకశ్వాస పద్యగ్రంథం. గద్వాల సంస్థానంలో పని చేస్తున్న అదిపుడి దోమకొండ సంస్థానధీశుడైన ఉమాపతిరావు బహుద్దూర్ ఆహ్వానం మేరకు "ఉమాపత్యభ్యుదయము" అనే పేరుతో దోమకొండ పాలకుల చరిత్రను

రాశారు. దీనినే కామినేని వంశచరిత్రగా పేర్కొంటారు. ఈ కావ్యం 1907లో రచించి 1909లో ముద్రితమైంది." (దోమకొండ సంస్థాన కవులు, అనంత కుమారశర్మ, పుట. 80, 81) శ్రీ చివుకుల వెంకటాచల శాస్త్రీ రామేశ్వర విలాసము కావ్యాన్ని రచించాడు. ఇతడు దోమకొండ సంస్థానానికి చెందినవాడు. 1920 ప్రాతంలో వెలువడింది. ఇది జిల్లాలో వెలువడిన మొదటి క్షేత్రమహాత్మ్య కావ్యం. దీనిని రెండవ ఉమాపతిరావు పినతండ్రి కమారుడైన సదాశివరావు కాలంలో దోమకొండలో నెలకొన్న రామ, ఈశ్వరుల ఉత్సవాల గురించి వివరించిన కావ్యం. రాణీ రాజవ్వ జీవిత చరిత్ర సంగ్రహం దీనిని రచించినది పెద్ద మందడి వెంకటకృష్ణకవి. ఇతనికి "కవి శరభ" అనే బిరుదు కలదు. రెండవ ఉమాపతిరావు మనుమడైన రాజా సోమేశ్వరరావు తమ తల్లైన రాణీ రాజవ్వ గురించి తన సంస్థాన కవియగు పెద్దమందడి వెంకటకృష్ణ కవిచే ఈ కావ్యాన్ని రచింపజేశాడు. ఈ రచన 1927 ప్రాంతంలో వెలువడింది. ఈ విధంగా ఆస్థానాల కవులతోపాటు, సాహిత్యకారులు తమ ప్రతిభ పాటవాలు ప్రదర్శించారు. కొన్ని రచనలు ముద్రణ రూపానికి నోచుకున్నాయి. మరికొంత మౌఖిక రూపంలో కొనసాగింది. వాటిలో ఆధికంగా భజనలు, కీర్తనలు, హరికథలు, భాగోతాలు ఒగ్గుకథలు వంటి కళారూపాలతో ప్రదర్శితమయ్యేవి. ఇలా ఆ కాలంలో ప్రాచీన సాహిత్యం వెల్లివిరిసింది.

## 2.3. నిజామాబాదు జిల్లా ఆధునిక సాహిత్యం

తెలుగు సాహిత్యంలో 1875 తరువాత ఉన్న కాలాన్ని ఆధునికయుగంగా పేర్కొన్నారు. సాహిత్యంలో ప్రాచీనకాలానికి ఆధునిక కాలానికి చాలా విస్తృతి కనబడుతుంది. ఈ కాలంలో తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అవి ఆంగ్లవిద్యా ప్రభావంగాని, ఆనాటి రాజకీయ, సామాజిక పరిస్థితుల ప్రభావంగాని, పాశ్చాత్య భావజాలం గాని, లేక ముద్రణ యంత్రం, పత్రికలు అందుబాటులోకి రావడంగాని మరింకేదైనా కారణాలవల్ల సాహిత్యంలో మార్పులు వచ్చాయని చెప్పవచ్చు. అలా తెలుగు సాహిత్యంలో కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, మొదలైన ప్రక్రియలు దర్శనమిస్తుంటాయి. సాహిత్య సంస్థలు, పత్రికలు చేసిన కృషితోపాటు రచయితలు చేసిన సేవలు మర్చిపోలేనివి.

ఆధునిక కాలంలో నిజామాబాదు జిల్లాలో వచ్చిన సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించింది. కావ్యాలు, శతకాలు, వచన, గేయ సాహిత్యాలు, యక్షగానం, భక్తి-ఆధ్యాత్మిక,

నాటక–నాటిక, కథలు–నవలలు, జానపద సాహిత్యం, కళలు మొదలైన రంగాలకు చెందిన సాహిత్యం వెలువడింది. నిజామాబాదు జిల్లాకి సంబంధించిన సాహిత్యాన్ని పరిశీలిస్తే ఇలా ఎన్నో అమూల్యమైన సాహిత్య రూపాలు కనిపిస్తాయి. వీటిలో ముఖ్యంగా ఈ క్రింది వాటిని పేర్కొంటున్నాను. అవి.

### 2.3.1. కావ్య సాహిత్యం- పరిచయం

నిజామాబాదు జిల్లాలో పద్య ప్రక్రియలో ఆధునిక కాలం విశిష్ఠమైనది. వీటిలో బృహత్కావ్యాలు, లఘు కావ్యాలు, ఖండ కావ్యాలు, జీవిత చరిత్రలు, స్వీయచరిత్రలు, ఉదాహరణలు మొదలైన రచనలు వివిధ ప్రక్రియలల్లో గమనించవచ్చు. శిరశినహళ్ రచించిన కళాశాలాభ్యుదయం మూడు ఆశ్వాలు కలిగిన కావ్యం, ఆలాగే మనస్సందేశం(వేదాంత పరమైన కావ్యం), రామానుజ చరిత్రము (జీవిత చరిత్ర), రత్నమాల(ఖండకావ్యం) అంతేకాకుండా స్తుతి గీతములు అనే అనువాద రచనను కూడా రాశారు. అలాగే తాళ్ళ గంగాదాస యోగీంద్రులు జీవేశ్వరాద్వయ దోష రహితచల గురుబోధామృత చరిత్ర, శ్రీజ్ఞాన సరస్వతీ దేవతా స్త్రీల లాలిపాట, మహాయోగి గంగాదాసు పద్యరత్నావళి, మాహాయోగి గంగాదాసు జీవిత చరిత్ర(స్వీయచరిత్ర), గురుశిక్ష–క్రమశిక్ష వంటి తాత్విక పరమైన రచనలు చేశారు. నంబి శ్రీధరరావు శారద గణితం, నింబాచల మహాత్మ్యం, మామదేవ శ్రీనివాసరావు శ్రీమాద్రామాయాణం, తంగుడిగె శ్రీధరరావు ద్విపద భగవద్గీత, సేనాపతి భాస్కరాచార్యులు కవితతరంగిణి(ఖండకావ్యం), చిత్కల పుండరీకాక్ష శర్మ శ్రీ లలితా కవిత కుసుమాంజలి, శ్రీ లలితాంబికార్చనం, శ్రీ పరాంబవ్రతకల్పం, శ్రీ లలిత సుప్రభాత స్తవము వంటి రచనలు వీరి కలం నుండే జాలువారినవి. కవి గణపతి రామచంద్రారావు శ్రీమద్వరదాచార్యోదాహరణము, శ్రీ వాసర సరస్వతీదేవి ఉదాహరణము, రస భూమిక, శ్రీవాసర సరస్వతీ దండకం, మేడిచర్ల ప్రభాకరరావు భారతభారతి, రథసారథి, విశ్వసుందరి, సారంగధరుడు, రుద్రమదేవి, సౌముని సౌందర్యం, కామాక్షీ కైవల్యం, చవుల చిన్నయ కన్నుల ఓర, మౌనధ్వని, గణపతి అశోకశర్మ శ్రీహరివిల్లు, ఆచార్య ఫణీంద్ర పద్య ప్రసూనాలు, చిత్కల శ్రీనివాసశర్మ ప్లాస్టిక్ ప్రభోదం, గుండి వెంకటాచార్యులు శ్రీవతము అనే పేరుతో తమిళ పారాయణ గ్రంథం తిరుప్పావైని తెలుగీకరించాడు. మహాదేవ శ్రీనివాసరావు రామకథను 108 పద్యాలలో శ్రీమద్రామాయణము పేరుతో రాశాడు. నటేశ్వరశర్మ శ్రీ

వెంకటేశ్వర విలాసం, బోజన్న రాజేశ్వరశర్మ అద్వైత ప్రవక్త ఆదిశంకరుని జీవితం, మహిమలు వర్ణిస్తూ శ్రీమదాది శంకరచార్య చరిత్రము రాశారు. అలాగే పప్పు నారాయాణార్య రామాయణంలోని ఉత్తర కథను సీతాపరివేదనముగా రాశాడు. ఇలా నిజామాబాదు జిల్లా సాహిత్యంలో కావ్య రచన కొనసాగిస్తున్న కవులు మనకు గోచరిస్తున్నారు.

## 2.3.2. శతక సాహిత్యం-పరిచయం

"తెలుగు సాహిత్యంలో శతకం ఒక విశిష్టమైన సాహిత్య ప్రక్రియ. శతకంలోని పద్యాలు ముక్తకాలు. ఇవి వేటికవే స్వతంత్ర భావాలను కలిగి ఉంటాయి. ప్రాచీనకాలం నుండి శతక రచనను కవులు కవిత్వ సాధనకు తొలిమెట్టుగా భావించారు. స్వీయానుభూతులు, లోకానుభవం ప్రకటించడానికి కవులకు మంచి వాహిక. కవి తన ఇష్టదైవాన్ని ఉద్దేశించి లోకనీతి చెప్పడం శతకాలల్లో కనిపించే లక్షణం. శతక కవులు మకుట, ఛందో, సంఖ్యానియమాలను పాటిస్తారు". (శంకర్, వి. నిజామాబాదు జిల్లా కవిత్వం. పుట: 46) నిజామాబాదు జిల్లాలో ఇప్పటివరకు దాదాపు మూడువందలకు పైగా శతకాలు వెలువడ్డాయి. లభిస్తున్న ఆధారాలను బట్టి కృష్ణాజివాడికి చెందన బాబరాయుడు రాసిన 'రాజరాజేశ్వర శతకము' (1900 ప్రాంతంలో) మొదటిదిగా చెప్పవచ్చు. ఇటీవలే లభించింది. ఈ శతకం సీసపద్యాల్లో ఉంది. 'పర్వత నివేశ కృష్ణాజివాడ వాస/రాజరాజేశ శ్రీ బాబరాయ పోష!!' అనే మకుటం గలదు. తర్వాత రెడ్డిశెట్టి హనుమద్దాసు రాసిన సాంబశతకం, శ్రీరామోజు లక్ష్మణాచారి రాసిన రాజరాజేశ్వర శతకం, శ్రీ పనస హనుమద్దాసు తిరుమల స్వామి శతకం, ఆర్మూర్ వాసియైన రాగి చినయ్య లక్ష్మీ శతకం, నంబి శ్రీధరరావు రాసిన లొంకరామేశ్వర శతకం, శాస్త్రుల పాండురంగ శర్మ పాండురంగ సూక్తులు పేరుతో నీతి శతకం రాశారు. అలాగే మామిండ్ల రామాగౌడు  చౌడప్ప శతకం, పెనుగొండ శ్రీనివాసులు  శ్రీ బసవలింగ శతకం, మాకునూరు లక్ష్మీ నర్సింహాచార్యులు శ్రీ మాణిక్యప్రభు శతకం, కందాళై లక్ష్మీ  నరసింహచార్యులు మరియు గణపతి రామచంద్రరావు జంటగా కలిసి రాసిన శ్రీ ఇందుపురీశ్వర వెంకటేశ్వర శతకం, కాశ నర్సయ్య నరస శతకం, డా. అయాచితం నటేశ్వరశర్మ ఏడు శతకాలు రాశారు. అవి కవితాశతకం, నవ్యశతకం, శ్రీరాజేశ్వర శతకం, శ్రీ గణేశ శతకం, భారతీయ శతకం, వాణీ శతకం, శ్రీ భీమేశ్వర శతకాలు ముఖ్యమైనవి. అదేవిధంగా తల్లావజ్జల మహేష్ బాబు తెలుగువాణీ శతకం, తాళ్ళగంగదాసు యోగీంద్రులు లొంక రామేశ్వర శతకం, కల్లూరి రామచంద్రరావు

తెలుగుబిడ్డ శతకం, శిరిశినహాళ్ కృష్ణమాచార్యులు  గాంధీశతకం, చిత్కల పుండరిక శర్మ రామలింగేశ శతకం, మేడిచర్ల ప్రభాకర్ వాసరమ్మవాణీ పంచశతి, ఆచార్య ఫణీంద్ర ముకుంద శతకం, ఉల్లెంగల గంగాధర్ విశ్వనాథ శతకం, పబ్బం మురుళి మురళి శతకం, కట్కం ముత్యం లక్ష్మీ నరసింహ శతకం, మట్టిపల్లి శ్రీధరాచార్యులు వాసరేశ్వర శతకం, ఎలిగందుల లింబాద్రి నింబాద్రి శతకం, డా. పింగళి గంగాధర్, త్ర్యంబకేశ్వర శతకం, వెంకన్న జ్యోతి రాసిన పల్లెటూరు శతకం, అంబట్ల రవి సాయి శతకం, స్వర్ణ లక్ష్మణరావు శ్రీనివాస శతకం, శృంగారం జనార్ధనాచార్యులు గోవింద గోపాల శతకం, దుర్కివాసి గోశిక్ నరహరి  సోమలింగ శతకం, పప్పు నారాయణార్య కవి పినాకపాణి అనే పేరుతో ఏడుకొండలవాడి నిలువుదోపిడి అనే వ్యాజస్తుతి శతకం రాశారు. ఈ విధంగా నిజామాబాదు జిల్లాలో శతకాల రూపంలో భక్తి, నీతి, మానవ విలువలను పెంపొందించే విధంగా ఆయా రచయితలు తమ వంతు కృషిని చాటుకున్నారు. అంతేగాక జిల్లాలో పుంఖానుపుంఖాలుగా వెలువడ్డ  శతకాలపైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది.

### 2.3.3. వచన సాహిత్యం-పరిచయం

నిజామాబాదు జిల్లాలో వచన సాహిత్యం బహుముఖంగా విస్తరించింది. వయోభేదం లేకుండా అందరూ రచనలు చేశారు. "1970 తరువాతనే వచన కవిత్వం విస్తృతంగా వెలువడింది. 1962లో సైబ పరంధాములు "వెన్నెల" సాహిత్య పత్రికను నిర్వహిస్తూ అందులో తన రచనలతోపాటు ఇతరుల రచనలను కూడా ప్రచురించేవారు. అలాగే 1969లో ఇందూరు భారతి, 1972లో ఏర్పాటైన "చేతనసాహితి", 1974లో "ఆదర్శ కళాసమితి" మొదలైన సాహిత్య సంస్థల స్థాపనతో వచన కవితకు కొండంత బలం చేకూరింది. ఆ సంస్థలు నిర్వహించిన కవి సమ్మేళనాలు, కవిత సంకలనాల ప్రచురణలవల్ల కొత్తగా కవిత్వం రాసేవారికి నూతన ప్రోత్సాహాన్ని అందించినట్లైంది". (నిజామాబాదు జిల్లా కవిత్వం, డా. వి. శంకర్. పుట: 87) 30మంది రచయితలతో ఇందూరు భారతిలో వచ్చిన "నగ్నచిత్రాలు" అనే కవితా సంకలనం సమాజంలోని ఆరాచకాలను నిలదీసింది. సైబ పరంధాములు రచించిన పదచిత్రాలు, శబ్దచిత్రాలు, ఏ.సూర్యప్రకాశ్ సంస్పందన, చౌరస్తా, నగరం నీడలు, మళ్ళీ సూర్యోదయం, కొత్తయుగం, అలలకు ఓటమిలేదు, కాగితం పువ్వు, పత్రహరితం, సూర్యుని ఏడోగుర్రం మొదలైన రచనలు సామాజిక స్పృహతో రచనలు

చేశారు. వి.ఆర్.శర్మ, బందే ఆలీ, జి.లచ్చయ్యలు కలిసి 1970లో ఆదర్శ కళాసమితి ద్వారా వెలువరించిన కవితలు పేర్కొనదగినవి. అలాగే బైస రామదాసు, బెడిద రాజేశ్వరం కలిసి "రేపు" అనే కవితా సంకలనం వెలువరించారు. సలంద్ర లక్ష్మీనరసింహం వేడిగాలి, చావుగీతం, బద్దూరి నరసింహం రచనలు ముఖ్యమైనవి. కేశనకుర్తి వీరభద్రాచారి వారి కొత్తదారి, డి.వి. సుబ్బారావు వర్తమానం, నాళేశ్వరం శంకర్ దూదిమేడ, సయ్యద్ బందే ఆలీ పల్లెపాటలు, కాసం సుధాకర్ రెడ్డి క్రాంతి పుష్పాలు (దేశభక్తి కవితలున్నాయి), పంచారెడ్డి లక్ష్మణ రాజీన రాబందులు, కొత్త చిగళ్ళు, కన్నగంటి నరసింహారావు కారటొచ్చింది, తెగిన సంకెళ్ళు, బోజ్జతారకం నది పుట్టిన గొంతుక, కొల్లు రంగారావు వెలుగు పువ్వులు (50 వచన కవితలు మానవ విలువలను తెలుపుతుంది), తేనెజల్లు (44 వచన కవితలతో సామాజిక స్పృహను తెలియజేస్తాయి), అఖండ భారతం, ఆకుపచ్చ సంతకం, సూరారం శంకర్ ఇవ్వాళే అంకురిద్దాం, పెద్ది అంజన్ కుమార్ కవితరసఝరి, వాసాల నర్సయ్య శ్రమగీతం, గరిశకుర్తి రాజేంద్ర కవితాలత, అయినంపూడి శ్రీలక్ష్మీ అలలవాన, వి.ర్. శర్మ సూర్యడు అనేక రంగుల్లో ఉదయిస్తాడు, వానపూలకొండ, మా ఊరి మట్టివాసన, ఆయాచతం నటేశ్వర శర్మ చుక్కలు, భారత ప్రశస్తి, టి, కృష్ణమూర్తి తొక్కుడుబండ, మోత్కురి ఆశోక్ కుమార్ తెలంగాణ గాయాల సంతకం, పిట్టగూడు, గిరి నాగభూషణం ఏరివాక (రాజకీయ దుస్థితిని తెలుపుతుంది), సుదర్శన్, లక్ష్మణ్ కలిసి సంయుక్త ఆధ్వర్యంలో వెలువడిన ఎక్స్‌రే, రవీందర్ రెడ్డి కసిగాకదలివస్తే, సాగరచర్య, కొలిమి, ఎ.ఎస్. పోశెట్టి విప్లవం వర్ధిల్లాలి, రష్యాలో ఏముంది, చీర్ల అంజనేయులు అందాలకాంత, శీరీష ప్రస్థానం, ఎం. రాములు కాలం కదలికలు, ఎం. బాబురావు నాకవితలు, భారతి శర్మ అందాల శిశిరమా, ఎ. రామారావు మల్లెమెగ్గలు–మెరుపు తీగలు, రంగన్న సాయిలు రచించిన పూలకొలిమి, మధుసుదనరావు భూమిక, యెల్ది సుదర్శన్ యెల్ది రత్నాలు, యెల్ది ముత్యాలు, తల్లావజ్జల మహేశ్ బాబు అమరవాణీ, పి.వి. భైరవన్ శర్మ స్నేహ కుసుమాలు, పొదిల గంగారం అమృత గీతలహరి, స్వానుభవాల వేదిక, జీవిత పరమార్ధ దీపిక, కాసర్ల నరేశ్‌రావు కాల స్పర్శ, కాల గంధం, సిరిగాద శంకర్ పో, పద, సి.హెచ్. ప్రకాశ్ మనసు మల్లెలు, అక్కడిదాకా, గంట్యాల ప్రసాద్ ఘంటానాదం, రుద్రంగి రమేశ్ అమ్మనాన్నలు, కిరణ్ బాల నా కలల ప్రపంచంలో, శారదాహన్మండ్లు మనోదర్పణం, తెలంగాణోద్యమంలో భాగంగా తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో వచ్చిన 'గాయి', కామారెడ్డి కవుల పోలికేకలు, స్ఫూర్తి సాహితి సంస్థవారి

అద్దం, వి.ఆర్. శర్మ దీర్ఘకవిత అలజడి, సి.హెచ్. ప్రకాశ్ చీకట్లను చీల్చుకుంటూ, ఏనిశెట్టి శంకర్ ఒకట్టే మాట తెలంగాణ, ఘనపురం దేవేందర్ ఘన తెలంగాణ, మొదలైనవి పేర్కొదగినవి. ఇలా తెలుగు సాహిత్యంలో ఈ జిల్లా కవులు తమవంతు కృషి చేశారు.

## 2.3.4. గేయసాహిత్యం-పరిచయం

"గేయం లయాత్మకమైనది. మాత్రాఛందస్సులో పాడుకునేందుకు అనువుగా ఉంటుంది. జానపదుల కష్టసుఖాల నుండో లేదా భావుకుని ఊహాల్లోంచో రూపుదిద్దుకున్న భావపరంపరకు నాద మాధుర్యం తోడైనపుడు గేయం ఊపిరి పోసుకుంటుంది" (శంకర్, వి.నిజామాబాదు జిల్లా కవిత్వం పుట: 62). ఈ ప్రక్రియలో రెడ్డిశెట్టి హనుమద్దాసు జ్ఞానబోధాధ్యాత్మలు ఇందులో భక్తి, ఆధ్యాత్మిక గేయాలు ఉన్నాయి. తాళ్ళ లక్ష్మీ నారాయాణ గౌడ్ గంగిపాటలు, శిష్ఠా శ్రీశర్మ గేయచంద్రిక, కళా వాచస్పతి అనంతరాములు శ్రీజ్ఞాన సరస్వతి సప్తస్వర గీతమాలిక, పొదిల గంగారం చైతన్య గీతాలహరి, ఈమని సత్యనారాయణ శర్మ బాలగేయ మందారం, మామిండ్ల కృష్ణమూర్తి పన్నీరులో కన్నీరు, బి. నాగభుషణం బి.న్.వి. పాటలు, సజ్జనపూడి అనంతరాములు నాట్యగీతరవళి, మెండాప్రభాకర్ రావు బాల సాహిత్యం, పాపాయి తువ్వాయి, ఉడుత బుడుత వంటి బాలగేయాలను రాశారు. అదేవిధంగా జనార్ధనాచారి వేణుగోపాల భజనలు, పలస హనుమద్దాసు యుగ విచిత్రము పాటలు, వడ్ల వెంకటాచార్యులు శ్రీ రాజయోగానంద భజనమాల, పెద్ది హనుమయ్య శ్రీహరి భజనమాల, డా. అయాచితం నటేశ్వరశర్మ వసంతకుమారి, కామారెడ్డి పాట, నవ్యగీత ఆంధ్రతేజం, ఆరురుచుల ఆమని, గరిశకుర్తి రాజేంద్ర హృదయాన్వేషణ, బాలగేయాలమాల, నటేశ్వరశర్మ భారతి ప్రశస్తి, ఊరుకొండ బాలయ్య బాలగేయాలు, ఉప్పల సరస్వతి భక్తిగేయమాలిక, ప్రణవకుమార్ వేదవీణ, బెజుగామ రామమూర్తి గానలహరి, గడ్డం రామచంద్రరెడ్డి శ్రీ బసవేశ్వరభజనమాల, పప్పు నారాయణాచార్య వేదసుధ, సురారంశంకర్ మల్లిపాటలు, తాటి కిష్టయ్య గీత ప్రబంధం షట్కం, కృష్ణగీతమంజరి, కొవూరి రాములు శ్రీమన్నారాయణ భక్తిగీతములు, వెలేటి గౌరిశంకర శర్మ మా అమ్మ, గన్ను కృష్ణమూర్తి మహాసంకల్పం, వాసవీ కన్యకాపరమేశ్వరి, ఎం. కృష్ణయ్య కృష్ణగీతాలు, గోవిందుల అనంతస్వామి అభ్యుదయ గేయాలు, తిగుళ్ళ వెంకటేశ్వరశర్మ వానకారు బోజన్న రాజేశ్వర

శర్మ కుమార జననం మొదలైనవి. ఈ విధంగా ఈ జిల్లాలో గేయ సాహిత్య పరిమళాలు వివిధ కోణాల్లోంచి ఆవిష్కరింపబడుతూ ప్రజలను పరవశింపజేస్తున్నాయి.

## 2.3.5. యక్షగాన సాహిత్యం పరిచయం

నిజామాబాదు జిల్లాలో ప్రాచీన కాలంనుండి సంప్రదాయ సాహిత్యం, జానపద సాహిత్యం కలిసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. జానపద సాహిత్యంలో ప్రధాన భాగమైన యక్షగానాలు, చిరుతల నాటాకాలు ఆధిక సంఖ్యలో ఈ జిల్లా కవులచే రచించబడ్డాయి. "ప్రజల వ్యవహరిక భాషలో యక్షగానాలు, చిరుతల నాటకాలను రచించి, అద్భుతమైన తన గాన వాహినిలో సుమారు ఆరుదశాబ్దాలపైగా ఇందూరు ప్రజలను ఓలాలడించిన గాన గంధర్వులు, కవి, నటులు ప్రయోక్త పలస హనుమద్దాసు పదిహేనేళ్ళ ప్రాయం నుండే కోలాట కీర్తనలు, యక్షగానాలు రచించడం ప్రారంభించాడు. యక్షగాన రచయితలలో చెర్విరాల భాగయ్యది అగ్ర స్థానంకాగా, ముప్పై ఒకటికి పైగా యక్షగానాలు, చిరుతల నాటకాలను రచించి ద్వితీయ స్థానంలో నిలిచి ఇందూరుకు అలంకారమై భాసించాడు" (ఓం ప్రకాశ్ బోచ్కర్, నిజామాబాదు జిల్లా పద్య సాహిత్యం సమగ్ర పరిశీలన. పుట: 16) పలస హనుమద్దాసు ఉప్పలవాయి గ్రామానికి చెందినవాడు. ఇతని రచనలు రుక్మాంగద యక్షగానం, హనుమద్రాస సంగ్రామం, శకుంతలా విలాసం, వెంకటేశ్వర మాహాత్మ్యం, డాంగ్నేయోపాఖ్యానం, బాలనాగమ్మ, గుణసుందరి యక్షగానం, భక్తమాధవదాసు, చంద్రకాంత మహారాజు చరిత్ర, పాళనచోళ మహారాజు యక్షగానం, బీరప్ప యక్షగానం, ఆడది గొడ్డా! మగడుగొడ్డా!! (సాంఘిక యక్షగానం), హనుమద్దాసు కోలల కృష్ణలీలలు మొదలైనవి పలస హనుమద్దాసు రచనలలో మఖ్యమైనవి. ఆర్మూరు మండలంలోని దేగాం గ్రామానికి చెందిన మునిపంతులు మహాభారతాన్ని యక్షగానంగా రాశాడు. రఘువీరదాసు మాంధాత చరిత్ర, భీంగల్ వాసి అయిన నింబాద్రిదాసు భళ్యాణ చరిత్రము, తాడ్వాయి గ్రామానికి చెందిన రామోజు లక్ష్మణాచారి పారిజాతపహరణం యక్షగానం, శివచర్య సువర్ణ కమలాపహరణం, సేతుబంధనం, వరలక్ష్మీ వ్రతం మొదలైన యక్షగానాలు రచించారు. మాటూరి మాసానిపల్లెకి చెందిన తెన్నెరంగపొన్న రంగనాథాచార్యులు మోహినీరుక్మాంగద, శ్రీనివాస పద్మావతి పరిణయం, రుక్మిణి కళ్యాణం, లలితోపాఖ్యానం, మొదలైనవి రాశాడు. అలాగే వీరి తమ్ముడైన తెన్నెరంగపొన్న

అణ్ణనాచార్యులు ఇరవైకి పైగా యక్షగానాలు రచించారు. వాటిలో కౌసల్య పరిణయం, ఋతుధ్వజోపాఖ్యానం, ఇక్ష్వాకుమహరాజు చరిత్ర, జాంబవతీపరిణయం, గజేంద్రమోక్షం, కుశలవవిజయం, మొదలైనవి ప్రధానమైనవి. అనంతనరం సిద్ధప్పకవి అశోక సామ్రాజ్యం, జీవనరేంద్ర యక్షగానం రాయగా, బాన్సువాడలో తిర్మలాపురంకి చెందిన పెద్దిరాం పోచన్న పంతులు భీరప్ప చరిత్ర, గంగాకళ్యాణం, శంబరాసురవధ రాశారు. బాన్సువాడలో దుర్కి గ్రామానికి చెందిన గోశిక భూమయ్య నటుడు, ప్రయోక్త. వీరు చెంచులక్ష్మీ, హనుమద్విజయం, కుంతీదేవి దీవెన, స్త్రీ సాహసం, గరుడ గర్వాపహరణం రాశారు. రథాల రాంరెడ్డి గ్రామానికి చెందిన విశ్వజ్ఞ మంచిరాల జనార్ధనాచారి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవితచరిత్ర రాశాడు. తాడ్వాయి వాస్తవ్యుడైన రామోజి బాలయాచారి బీరప్ప చరిత్ర, సదాశివనగర్ గ్రామవాసి ఎర్రోజు వెంకటేశచారి లవకుశ, మూయూమశ్చీంద్ర యక్షగానం, కాంభోజరాజు యక్షగానం, నలదమయంతి యక్షగానం, సావిత్రీ పరిణయం, భక్త పురూరవ యక్షగానం, వెల్పూరు లక్ష్మణచార్యులు శ్రీకృష్ణార్జున యుద్దం, చుక్కపూర గ్రామవాసి సంగకవి గయోపాఖ్యనం, అవధూత నిర్మలానంద స్వామి గుణసుందరి, సోమవార వ్రత మహాత్మ్యం, నందివాడ గ్రామవాసైన వెలమలపల్లి గుండేరావు సతీసౌధామిని యక్షగానం, బీబీపేటకు చెందిన పబ్బబుచ్చి లింగం సుందోపసుందోపాఖ్యానం, కాంతావిభ్రాంత చరిత్ర, రామారెడ్డికి చెందిన వల్లంభట్ల కృష్ణయ్య సుభద్ర పరిణయం, రాజంపేట గ్రామవాసి సందుకుల రంగచార్యులు రామాంజనేయ యుద్ధం, ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన శ్రీకృష్ణకవి చిత్రకేతూపాఖ్యానం మొదలైనవి. ఇలా నిజామాబాదు జిల్లాలో యక్షగాన ప్రక్రియ దినదిన అభివృద్ధి చెందింది.

### 2.3.6. భక్తి-ఆధ్యాత్మిక సాహిత్యం-పరిచయం

నిజామాబాదు జిల్లా చారిత్రకంగా ఎన్నో దేవాలయాలకు, పుణ్యక్షేత్రాలకు, తీర్థాలకు, జాతరలకు ప్రసిద్ధి. కాబట్టి ఇక్కడ భక్తి ఆధ్యాత్మిక సాహిత్యం నెలకొన్నది. తాళ్ళగంగాదాస రాజయోగీంద్రులు రచించిన రచనలన్ని భక్తి, అధ్యాత్మిక, తాత్త్విక భావ సంపదకు నిలయాలు. ఈ జిల్లాలో సిద్ధేశ్వర క్షేత్రానికి సంబంధించిన సమగ్ర చరిత్రను తెలియజేస్తూ కోనసముద్రం రాజమల్లిఖార్జునశర్మ శ్రీనవనాథ సిద్ధేశ్వర చరిత్రను రాశాడు. ఈ క్షేత్రం ఆర్మూర్‌లో సిద్ధులగుట్టగా ప్రసిద్ది చెందింది. ముత్యంపేటకి చెందిన కేదరనాథ శర్మ ద్వాదశ

జ్యోతిర్లింగ మహాత్మ్యం, శివజ్యోతి, శివదీక్షావిధి అనేవి ఇతని రచనలు. శృంగారం జనార్ధనాచారి శ్రీ పంచముఖాంజనేయ చరిత్ర, మంచినరావు యాదగిరి ఆచార్యలు విశ్వబ్రహ్మణ వికాసం, డా. అయాచితం నటేశ్వర శర్మ భగవతామృతం, డొంకేశ్వర్ కృష్ణమూర్తి వెదాంత కిరణాలు, మేడిచర్ల ప్రభాకరరావు ధ్యాన దర్శనం, గన్ను కృష్ణమూర్తి వస్త్రాపహరణం, గరిశకుర్తి రాజేంద్ర భక్తిసుధ, ఎస్. వెంకటాచార్య కిసాన్ నగర చరిత్రము, కర్మయోగి నారాయణ జిజ్ఞాసు మనశ్శాంతి, ఎం. బాబురావు రాఘవేంద్రస్తుతి, సిరిగాద శంకర్ కూడవెళ్ళి రానాలింగేశ్వర చరిత్ర, ఘనపురం కృష్ణమూర్తి పరమార్ధ దర్శిని, గంగావరం ఆంజనేయశర్మ గణేశగీత, జనగామ చంద్రశేఖరశర్మ సంప్రదాయ సుముహూర్త దీపిక. ఈ విధంగా భక్తి సాహిత్యం కూడా జిల్లాలో వచ్చింది.

### 2.3.7. నాటక - నాటిక సాహిత్యం - పరిచయం

నిజామాబాదు జిల్లాలో నాటక రచన విస్తృతంగా జరిగింది. 1904లో జన్మించిన పనస హనుమద్దాసు సుమారు పద్దెనిమిది నాటకాలను రచించారు. వాటిలో పాండవుల ఆరణ్యవాసం, స్త్రీ సాహస నాటకం, మదనసేన నాటకం, బాలనాగమ్మ నాటకం, హనుమద్రామ సంగ్రామం, బాలరాజు నాటకం, వీరబొబ్బిలి నాటకం, శకుంతల విలాసం, అల్లిరాణి పరిణయం, బలుగూరి కొండయ్య నాటకం, భక్తకేతన నాటకం, జయంత జయపాల నాటకం వంటి రచనలు ప్రధానమైవి. విశ్వజ్ఞ మంచిరాల జనార్దచారి సంపూర్ణ చంద్రిక విలాసం, శ్రీకృష్ణగారడి నాటకం, పాతాళభైరవి నాటకం, శశిబిందూపాఖ్యానం, శౌరిదవేణి స్వయంవరం, అనంతవరం సిద్ధప్పవర కవి జీవనరేంద్ర నాటకం, వెంకటాచార్యులు శ్రీ మర్కేండయ నాటకం, శ్రీ వీరబ్రహ్మే నాటకం, భీంగలుకు చెందిన వేముగంటి శ్రీనివాసులు సత్యహరిశ్చంద్ర నాటకం, సీత స్వయంవరం, మండోదరి స్వయంవరం, ఆహల్యా స్వయంవరం, బండారు రఘుపతి సతీతులసి నాటకం, సత్యగుణ భూషిని, గొశికే నరహరి, భూమయ్యలు కలిసి పురందర విజయం, జయంతజయపాల గజగౌరి వ్రతం, తంగుడిగె శ్రీధర రావు అర్జున శృంగభంగము, సిరికొండకు చెందిన దుబ్బారి నర్సయ్య చిరుతల ద్రౌపది స్వయంవరం కుర్నాపల్లికి చెందిన కథలాపురం గంగాధర్ చిరుతొండనంబి నాటకం, ఆరేటి నారాయణ మట్కనాటకం, గరిశకుర్తి రాజేంద్ర నిజాయితికి నీరాజనం, పప్పునారాయణార్య వీరసదాశివరెడ్డి నాటకం, డా. అయాచితం నటేశ్వరశర్మ

వసంత విలాసం, ఆంధ్ర తేజం, ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మ చరిత్ర పుటలు, అమృతలత స్కూలు పెట్టిచూడు (నాటకాల సమాహారం). ఇలా నిజామాబాదు జిల్లాలో నాటక సాహిత్యం పరిఢవిల్లింది.

### 2.3.8. కథ-నవల సాహిత్యం- పరిచయం

నిజామాబాదు జిల్లా సాహిత్యంలో మిగతా ప్రక్రియలాగే కథ, నవల ప్రక్రియ కూడా చెప్పుకోదగినంత వచ్చింది. ముందుగా కథ విషయానికి వస్తే జిల్లాలో 1950 దశకంలో తొలి కథాసంకలనంగా తంగుడిగె నరసింహం 'తొలికాన్పు' రచించారు. నిజామాబాదు జిల్లాలో నిరంతరం రాస్తున్న రచయితగా పేర్కొంటున్న సి.హెచ్. మధు ప్రసిద్ధి చెందారు. ఈయన రాసినవి. చెదలు, ముసలోడు, వ్యవస్థ, శాంతికథలు, ముళ్ళు వద్దు రాళ్ళు వద్దు డబ్బుకావాలి, ఉద్యమ కథలు కూడా రాశారు. బొమ్మహేమదేవి యమున, దేవిరమ అనే కలం పేరుతో రాసిన అన్నపూర్ణ, శాంతి నిలయం, బాంచెను దొరసాని, ఛోటి ఛోటి బాతే, గరిశకుర్తి రాజేంద్ర ఇంటగెలిచి, పండుగ కథలు, సి.హెచ్. వేణు బూడిద, సమరం, జాబిలి, ఇలా ముప్పైకి పైగా కథలు రాశారు. అమృతలత రచించిన మనస్సు ఎరగని మనుషులు, కన్నీళ్ళతో కాలక్షేపం, స్పందన, వెతలే కతలై (కథల సంపుటి) సంపాదకత్వం వహించారు. దేవికారాజ్ రాసిన మధురానభూతి (కథలసంపుటి) భోళాతనం, వై. లక్ష్మీ వాసన్ రాజీవ అను కలం పేరుతో కొత్తనిజం, తుర్లపాటి లక్ష్మీ రాసిన సూర్యునితో పోటిపడి, ఒక పాపకథ, కాశి– పులి, జీవనసమరం, పునాదుల్లోంచి, స్వాతీ శ్రీపాద మనసుకు చూపుంటే, హృదయంలో అడుగులు, కిరణ్ బాల ఇందిర పేరుతో కానుక, చందమామమామె, స్విట్ సంథింగ్, తప్పిపోయిన ఉత్తరం. అయాచితం నటేశ్వరశర్మ నా బంగారు తల్లి, కన్నెగంటి నరసింహరావు సంఘశక్తి, పరిష్కారం, భారతీశర్మ జీవనసంధ్య, తిరిగిచ్చిన వసంతం, జానకీరామ్ కలనైనా నీవలపే, శ్రీపతి మూగ మల్లేశం, డ్యూటి, మృత్యుకోసం, మెత్కురి అశోక్ కమార్ నమ్మిక, డా. వడ్ల శంకర్ ఒక సూర్యుని ఉదయం.

ఈ అధ్యాయంలో ప్రాచీన సాహిత్యంలోని ప్రక్రియలు పేర్కొన్నాను. ఆధునిక సాహిత్యంలోని ప్రక్రియలను పేర్కొంటూ, నిజామాబాద్ జిల్లా రచయితలు, కవులను పరిచయం చేస్తూ మొత్తంగా నిజామాబాదు జిల్లా సాహిత్యాన్ని స్థూలంగా పరిచయం చేశాను.

*****

# అధ్యాయం-3

## 3. నిజామాబాదు జిల్లా నవలలు - వస్తు వివేచన

తెలంగాణ సాహిత్యాన్ని పండించడంలో నిజామాబాదు జిల్లా సాహిత్యం ఒరవడిని, విశిష్టతను సంతరించుకుంది. అందులో నవలా సాహిత్యం కూడా ఎక్కువే వచ్చింది. విభిన్న వస్తువులతో నిజామాబాదు జిల్లా నుంచి నవలలు వచ్చాయి. అవి: జెగ్గని యిద్దె, సంఘము, మహానంద, పొగమంచు, నవరసాలు, లవ్ స్టోరీ, సంసార బంధం, నడుస్తున్న కథ, జోగిని, సృష్టిలో తీయనిది, విజేత, సర్వేజనా! సుఖినోభవంతు, కావేరి కళ్యాణం, శ్రీమతి గోమతి, యశోధరుడు, పునరాగమనం, చిరుజల్లు కురిసేనా, ఆడపిల్లేనా, స్వేచ్ఛా విహంగాలు, నవభారతి, కన్నీటి లోయ, బంగారు గూడు, ప్రేమంటే, ఆరాధకులు, గాయపడ్డ సూర్యుడు, మనస్విని, సూత్రధారి పాత్రధారులు, భావన భార్గవి, కిడ్నాప్, ప్రేమించకు పెళ్ళవుతుంది, కళావతి, నవోదయం, పిచ్చిమనిషి, తరంగాలు మొదలైనవి. ఈ అధ్యాయంలో నవలలను రెండు భాగాలుగా విభజించాను. 2020 వరకు వచ్చిన నవలలు. నా పరిశోధన కాల పరిధి 2020 వరకు మాత్రమే. అందువల్ల అంతవరకు వచ్చిన నవలలను ఒక విభాగంగా చేశాను. 2020 తర్వాత వచ్చిన నవలలను రెండో విభాగంలో చేర్చాను.

### 3.1. 2020 వరకు వచ్చిన నవలలు

### 3.1.1 జెగ్గని యిద్దె-1955

**రచయిత పరిచయం:** శతాధిక గ్రంథకర్త లోకమలహరి 1910లో జన్మించారు. ఈయన నిజామాబాదు జిల్లా కామారెడ్డి తాలూకాకు చెందిన బీబీపేట గ్రామంలో ఒక చేనేత కుటుంబానికి చెందినవాడు. వీరి తల్లిదండ్రులు లక్ష్మయ్య, వెంకమ్మలు. చిన్నాటినుండే మహాపురుషుల కథలను, ఇతర గ్రంథాలను చదవడం ద్వారా స్ఫూర్తిని పొందాడు. నేత పనులతోపాటు వ్యవసాయంలోనూ అనుభవం కలదు. అంతేగాకుండా కల్లుగీత పనుల సూపర్వైజరుగాను, గౌలిగూడలోని ప్రేమ్ సాగర్ ప్రింటింగ్ ప్రెసులోను పని చేశాడు. ఆ

తరువాత 1931లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా బాధ్యతను చేపట్టి బాన్సువాడ, నిజామాబాదు తదితర ప్రాంతలలో సుమారు నలభై సంవత్సరాలు పని చేశారు. మలహరి 1971లో పడిగిల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ పొందాడు. ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న రోజుల్లో వేద సాహిత్యాన్ని చదివి వేదాలపై మక్కువ పెంచుకున్నారు. 2007న సన్యాసం స్వీకరించిన మలహరి వేదానంద సరస్వతీ స్వామిగా కీర్తి పొందారు. ఇలా వైదిక సేవల ద్వారా చిరంజీవులైన లోకమలహరి తన 100వ యేట 2010, ఏప్రిల్ 4న స్వర్గస్తులైనారు.

**వస్తువు:** మోనసరము(మోహనసాగరం) గ్రామంలోని హరిజన వాడలో చిన్న పూరింట్లో జీవిస్తున్న మాల ఈరడు-రామి(ఈరన్న-రామవ్వ) దంపతులకు 'జెగ్గడు', 'సిద్దుడు' అనే ఇద్దరు కుమారులతో పాటు 'చంద్రి' అనే ఒక కూతురు ఉన్నది. ఈరని తాతల కాలంనుండి వీరి వారసులు కిష్టారెడ్డి వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. దొర దగ్గర తమ పెళ్ళికి తెచ్చుకున్న అప్పును తీర్చడానికి ఈరడు-రామి సగం జీవితం దొరకు అర్పించారు. వీరి పెద్ద కుమారుడు జెగ్గడు ఐదేళ్ల వయస్సునుండే ఈ దొరదగ్గర పశువుల కాపరిగా పనిలో చేరి తల్లిదండ్రులకు కుటుంబ పోషణలో ఆసరాగా నిలుస్తున్నాడు. ఇతను చదువుకోలేక పోయినప్పటికి తాను చూసిన, విన్న విషయాలను తెలివిగా ఇతరులకు అర్థమయ్యేలా చెప్పడంలో దిట్ట. గాంధీజీ హరిజనోద్యమ ప్రభావంతో కొందరు ఉపన్యాసకులు ఆ గ్రామ హనుమాన్ మందిర సమీపంలో ఒక సమావేశాన్ని ఏర్పరచి ధనిక, పేద, కుల, మత, లింగభేదం లేకుండా గ్రామాలలో అందరూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుకోవాలని, చదువు ప్రాధాన్యతను తెలుపుతూ గొప్ప సందేశాన్ని ఇచ్చారు. ఆ సమావేశానికి వెళ్ళిన పదకొండు సంవత్సరాల జెగ్గడు తన తండ్రితో నేను పశువులు కాయను చదువుకుంటానని, చదువు అయిపోయిన తర్వాత ఉద్యోగం చేసి మిమ్ములను బాగా చూసుకుంటానని ఒకటే మంకుపట్టు పడతాడు.

కిష్టారెడ్డి దొర కుటుంబంపై ఆధారపడి అతను ఇచ్చే జీతంతో కుటుంబ బాధ్యతలను నెట్టుకొస్తున్న ఈరనికి ఒకరకంగా కొడుకును చదివించే స్తోమత లేదు. మరో రకంగా మాలమాదిగలు చదువుకుంటే చదువులతల్లి సరస్వతీదేవికి అంటు తగిలి అపవిత్రం అవుతుందని, అలా గ్రామానికి, తమకు అరిష్టం కల్గుతుందనే కిష్టయ్య పటేలు, గ్రామ ప్రజల మాటలకు కట్టుబడి కొడుకు జెగ్గనితో 'మనం ఈ ఎక్కోల్లకు శాకిరి చేయడానికే పుట్టినం బిడ్డ. ఈ సదువులు శాస్త్రాలు మనకు వద్దు' అంటాడు. జెనిగె పట్టు, జెగ్గని చదువు బాధను భరించలేక ఈరడు తన పినతండ్రి రాజాలుతో విచారించడానికి వెళతాడు. జెగ్గడు చాలా తెలివైనోడు. వాడు చదువుకోవడం వల్ల మన వంశానికే గొప్ప పేరు వస్తుందని, వాని చదువుకు అయ్యే ఖర్చులను చేతనయ్యేంత వరకు తానే భరిస్తానని పేర్కొన్న వృద్ధ రాజాలుకు జెగ్గని చదువు, బాధ్యతలను పూర్తిగా అప్పగించి ఈరడు-రామి దంపతులు రాజాలు కాళ్ళుమొక్కుతారు. తాతా రాజాలు సహకారంతో జెగ్గడు ముందు క్రైస్తవ పాఠశాలకు వెళ్తాడు. అక్కడ బడిపంతులు చెప్పే పాఠాలు నచ్చక అక్కడినుండి ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళి, పురుషోత్తమరావు అనే బ్రాహ్మణ ఉపాధ్యాయుని ఇంటిలో ఒకనిగా ఉంటూ సక్రమంగా చదువుకుంటాడు. బ్రాహ్మణ ఉపాధ్యాయుని(పురుషోత్తమరావు) ఇంటిలో ఈ మాల పిల్లవాడు ఉంటూ పాఠశాలలో తమ పిల్లలతో కలిసి చదువుకోవడాన్ని చూసి భరించలేని ఆ గ్రామ పెద్దలైన దొరలు, కరణాలు, గ్రామస్తులు కుల అహంకారంతో, మతమౌఢ్యంతో కూరుకుపోయి పై అధికారుల అండదండలతో పురుషోత్తమరావును అక్కడినుండి వేరేచోటికి బదిలీ చేయించారు. పురుషోత్తమరావును బదిలీ పురస్కరించుకొని ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో ఈ ఉపాధ్యాయుని గుణగణాల గురించి కొందరు విద్యార్థులు మాట్లాడుతూ పేద విద్యార్థులపై ఆయన చూపే ప్రేమకు, వారి చదువు కొరకు ఆయన పడే శ్రమకు ఈ జగదీశును ఉదాహరణగా చెప్పి, ఆ గ్రామ పెద్దలందరికి కంటతడి పెట్టించి కనువిప్పు కలిగించారు.

విద్యార్థుల మాటలతో మనుసు మార్చుకున్న గ్రామపెద్దలు పురుషోత్తమరావు ఆలోచనలను, ఆశయాలను సాధించుటకు అక్కడే కంకణం కట్టారు. తమ గ్రామ పెద్ద

కిష్టారెడ్డి నాయకత్వంలో, అతని కుమారుడు సురేందర్‌రెడ్డి, మరికొందరు గ్రామ పెద్దలు, గ్రామ యువకుల సహకారంతో విద్యాభివృద్ధికి, తద్వారా గ్రామాభివృద్ధికి కింది కార్యక్రమాలను చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించడం, కొత్త విద్యార్థులు చదువుకోవడానికి ప్రచారం చేయడం. రాత్రి పాఠశాలలను ఏర్పాటు చేసి గ్రామంలోని వయోజనులకు చదువు చెప్పించి నిరాక్షరాస్యతను నివారించడం. గ్రామంలో కిష్టారెడ్డి ఇంట్లో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసి అందులో వివిధ పుస్తకాలు, పత్రికలు పాఠకులకు అందుబాటులో ఉండేలా చేయడం మొదలైన కార్యక్రమాలు చేపట్టారు. పురుషోత్తమరావు భార్య సుశీల కూడా జగదీశు చదువుకు ఎంతో సహకరించింది. నిజంగా ఈమె గుణంలో సార్థక నామధేయురాలు. పురుషోత్తమరావు బదిలీ పట్టణానికి జరిగిందని తెలిసి పల్లెల్లో నిత్యావసర వస్తువులన్నీ ఎలాంటి కల్తీ లేకుండా శుభ్రంగా లభిస్తాయని, కుళ్లిన కూరగాయలు, పాలు, నెయ్యి ఇలా అనేక నిత్యావసర సరకులు పట్టణాలలో అధిక లాభాలు ఆశించే వ్యాపారస్తుల చేతుల్లో కల్తీకి గురౌవుతాయి అంటుంది. పురుషోత్తమరావు, సుశీల సంరక్షణలో మెట్రిక్యులేషన్ పాసైన జగదీశు వీరి సహకారంతోపాటు సురేందర్‌రెడ్డి ఇచ్చిన ఆర్థిక సహాయంతో విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., ఎల్.ఎల్.బి. లాంటి ఉన్నత చదువులు చదివాడు.

సికింద్రాబాదు రైల్వే స్టేషన్‌లో జగదీశుకు కృష్ణానాయుడుతో పరిచయం ఏర్పడింది. కృష్ణానాయుడు తండ్రి రైల్వే ఉద్యోగ నిమిత్తం గుంటూరు నుండి సికింద్రాబాదుకు కుటుంబ సమేతంగా వచ్చి స్థిరపడ్డాడు. వీరి ఇద్దరిమధ్య ఉన్న పరిచయంతో మెట్రిక్యులేషన్ చదువుతున్న వసంత (కృష్ణానాయుడు చెల్లెలు)కు జగదీశు పార్ట్‌టైమ్ ట్యూషన్ చెప్పాడు. జగదీశు ప్రవర్తన క్రమంగా కృష్ణానాయుడు కుటుంబంలోని వారందరికీ నచ్చడంతోపాటు తనచెల్లి వసంతకి కూడా ఇష్టం ఉండడంతో కృష్ణానాయుడు జగదీశుతో ఆమె వివాహం జరిగించడానికి పూనుకున్నాడు. ఇద్దరి చదువులు ఎం.ఏ., ఎల్.ఎల్.బి., వసంత ఇంటర్ పూర్తయిన తరువాత జగదీశు తల్లిదండ్రులు, తాతా అతని చదువుకు సహకరించిన పెద్దల నిర్ణయంతో కుటుంబ పెద్దలు, పండితులు, బంధుమిత్రుల సమక్షంలో కృష్ణానాయుడు

ధనవంతురాలైన తన చెల్లి వసంతను ఆర్థికంగా ఏ దిక్కులేని జగదీశుకు ఇచ్చి కులాంతర, ఆదర్శ వివాహం జరిపించాడు. వివాహ అనంతరం వసంతతో కలిసి జగదీశు హైదరాబాదులో ఉంటూ వకీలు ప్రాక్టీసును ప్రారంభించాడు. వాది, ప్రతివాదుల్ని పిలిపించుకొని వివాదాల సంగతి, సందర్భాలు తెలుసుకొని సాధ్యమైనంతవరకు కోర్టుమెట్లు ఎక్కకుండానే అక్కడికక్కడనే సమస్యలను పరిష్కరించేవాడు. ఇతని వాక్పటిమ, న్యాయశీలత, బీద జనాదరణను మెచ్చుకొని అనేకమంది ఇతనిని ఆదర్శంగా తీసుకునేవారు. ఉన్నత విలువలు గల వసంత, జగదీశులు, సురేందర్‌రెడ్డి ఆ గ్రామంలో ఉన్నత చదువులు చదివిన యువకులు. జగదీశు తమ్ముడు సిద్దేశ్వరుడు (సిద్దుడు), చెల్లెలు చంద్రకళ (చెంద్రి) లాంటి అందరి సహకారంతో కుల-మత, ధనిక–పేద, స్త్రీ–పురుష భేదం లేకుండా గ్రామంలోని అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. ఆ గ్రామస్తులందరూ ఇంటి, వొంటి శుభ్రతే కాకుండా గ్రామాన్ని కూడా శుభ్రంగా ఉంచుతున్నారు. అందరి సహకారంతో గ్రామ పంచాయితీ, సహకార పరపతి సంఘాలు ఏర్పాటు చేసుకొని ఆ గ్రామ సర్వోన్నతాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

రచయిత లోకమలహరి ఈ నవలలో స్త్రీ విద్యా ప్రాధాన్యతను తెలుపుతూ సంతానానికి మొదటి గురువు స్త్రీ. ప్రతి ఇంటిలో స్త్రీ చదువుకోవడంవల్ల ఆ ఇల్లు, అందులోని వ్యక్తుల శుచీ శుభ్రతే కాకుండా, గ్రామ పరిశుభ్రత పెరుగుతుంది. తల్లి, పిల్లలకు మంచి పోషక ఆహారం అందించి వారి శారీరక, మానసిక పెరుగుదలకు తోడ్పడడమే కాకుండా వారిని ఉన్నత చదువులు చదివించి, ఉత్తమ విలువలు గల ఆరోగ్యవంతులైన పౌరులను దేశానికి అందిస్తారు. తద్వారా దేశంలో నిరాక్షరాస్యత, పేదరికం నివారించబడి కులాంతరాలు, మతమౌఢ్యాలు పూర్తిగా సమాజంలో మాయమౌతాయి. ఇలా ఉత్తమ మానవ వనరులతో మనదేశ ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా వికసించాలని కోరుకుంటాడు.

### 3.1.2. సంఘము-1955

ఈ నవలను లోకమలహరి రాశారు. సంఘము నవలలో మొత్తం పదకొండు భాగాలున్నాయి. పద్మశాలీల (చేనేత) జీవితాన్ని చిత్రికరించిన నవల ఇది. బుక్కరావుపేటలో

బుచ్చమ్మ అనే పద్మశాలీ స్త్రీ ఉంటుంది. ఆమెకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. కొడుకు జాతరకి వెళ్ళి తిరిగిరాడు. కొడుకు కోసం వెతికి, ఏడ్వడంతో బుచ్చమ్మ చూపు తగ్గుతుంది. కుటుంబ పోషణకై బుచ్చమ్మ కోమటి, బ్రహ్మణుల ఇండ్లల్లో పని చేస్తుంది. ఈ విషయం తెలిసిన కులస్తులు ఇతర కులస్తుల ఇంటిలో పనిచేయడం నేరంగా భావించి, జరిమానా వేయాలని చూస్తారు.

పేద స్త్రీలకు జరిమానా వేయడం మంచిది కాదని, పంచాయితీలలో వచ్చిన ఆదాయంతో పేద స్త్రీలను ఆదుకోవాలంటాడు నర్సయ్య. కాని కుల పెద్దలు ఆమెకు ఇరవై రూపాయలు జరిమానా వేస్తారు. బుచ్చమ్మ ఆ జరిమానా కట్టడానికి నానా ఇబ్బందులు పడి కడుతుంది. ఆమె జీవించడానికి ఆ పని తప్ప వేరేది కనబడదు. ఆ పని చేస్తే కుల పెద్దలతో ఇబ్బందులు తప్పవని వేరే గ్రామానికి వెళ్తుంది. ఈ గ్రామంలోనే ధనశెట్టి నాగనాథం అనే కోమటి ఉంటాడు. ఇరవై సంవత్సరాల క్రితం ఏమిలేని వాడిగా వచ్చినోడు లక్షాధికారిగా మారుతాడు. అందరి అవసరాలకు అధిక వడ్డి కింద డబ్బులు ఇస్తాడు. ఇతని దగ్గర గఫ్రూఖాన్ అనే ముస్లిం వ్యక్తిని నియమించుకుంటాడు. వెంకయ్య అనే పద్మశాలీ మూడునెలల్లో అప్పు తీరుస్తానని నాగనాథం దగ్గర అప్పు తెచ్చుకుంటాడు. సమయానికి డబ్బులు చెల్లించకపోవడంతో గఫ్రూను పంపిస్తాడు నాగనాథం. గఫ్రూ వచ్చి వెంకయ్య ఇంటిముందు కూర్చోని డబ్బులు ఇచ్చేవరకు కదిలేది లేదని అంటాడు. వచ్చేనెలలో అప్పు తీరుస్తానని సేటుకు చెప్తానన్నా గఫ్రూ వినడు. ఇంతలో నర్సయ్య అక్కడికి వచ్చి విషయం తెలుసుకొని, నాగనాథం ఒకటికిరెండు చేసి పద్మశాలీలను దోచుకొని ధనవంతుడయ్యాడు అని అంటాడు. వెంకయ్యకు అప్పు తీర్చుకోవడానికి డబ్బు ఇచ్చి ఆదుకుంటాడు నర్సయ్య.

వెంకయ్య నర్సయ్యతో కులస్తుల దగ్గర అప్పులు చేయడం మంచిది కాదని, నేడు పద్మశాలీలు పనుల గిరాకీ లేక అందరూ బొంబాయికి వెళ్తున్నారు. బందరుకంటి రామయ్య, అతని బామ్మర్దులు వెళ్ళి వచ్చారని, చిన కొడుకులిద్దరిని పంపిద్దామని అనుకుంటున్నానని అంటాడు. కాని దూర ప్రదేశం ఎలా బ్రతుకుతారో అని బాధపడ్తాడు. పిల్లలకు మిల్లు

పనికూడా సరిగా రాదనడంతో నర్సయ్య నెలరోజులు చూస్తే అదే వస్తుందని చెప్తాడు. వీరి సంభాషణలో కుల పంచాయితీల గురించి, వారు వేసే పన్నుల గురించి చర్చిస్తారు. ఈ గ్రామ దొర భుజంగరావు అతని తండ్రి కొండల్‌రావు దొర ఉండగానే అన్ని ఏర్పాట్లు జేసిపోయాడు. తొందరగా ప్రసవం కాని గర్భవతులకు ఈ కొండల్‌రావు పేరు చెప్పితేనే ప్రసవించేవారట. ఇక్కడే మనకు అర్థమవుతుంది వీరు ఎంతటి క్రూరుడో. కొండల్‌రావు అన్ని కులాలవారు ఏయే సేవలు చేయాలో హుకుం జారీచేశాడు. పద్మశాలీలకు కూడా. దొరలు వేంకటేశ్వర్ల సేవకు వెళ్ళినప్పుడు పెండ్లిలలో దివిటీలు పట్టడం, బంధువులు వచ్చినప్పుడు, పండుగలకు, ప్రభుత్వ అధికారులు వచ్చినప్పుడు కోడిగుడ్లు, కోళ్ళను అందించడం, వాటిని ఆభివృద్ధి చేయడం లాంటిపనులు చేసేవారు. తండ్రిని అనుసరించి భుజంగరావు ఉంటున్నాడు. గ్రామంలో ఎవరైన కొంత ఆర్థికంగా ఉండి, మంచిగా ఉంటే వారిని నాశనం చేస్తాడు.

భుజంగరావు దొర ఒకనాడు రామలింగంతో పద్మశాలీలు చేసే పనులు సరిగా చేయడం లేదని, ముందు పిల్లిలా వుండి, చాటుకు పులిలాగా తయారవుతున్నారని, కమిటీలు ఏర్పాటు చేసుకుంటున్నారని గట్టిగా అనగా రామలింగం తనకు ఏమి తెలియదని నర్సయ్య మొదలుపెట్టాడు అని చెప్పడంతో దొర కోపంతో నర్సయ్యను తీసుకురమ్మని సుంకరి ముత్తయ్యని పంపుతాడు. నర్సయ్య రావడం చూసి భుజంగరావు “యేమోయి నర్సయ్య దొర గారూ, మీకండ్లకేమన్న దొరలు గనిపించేటట్టున్నారా అన్నాడు. మీసాలను మెలికేసి పైకి ఎక్కిస్తూ” ఇక్కడ ఎవరైన కొంత ఆర్థికంగా ఎదిగి, పక్కవారికి సహాయం చేయడాన్ని భుజంగరావు ఓర్చుకోకపోవడం కనబడుతుంది. నర్సయ్య తాను ఏమి తప్పు చేయ్యలేదంటాడు. దొర నర్సయ్యను నీదగ్గర ఉన్న డబ్బుతోనే శాలోల్లదండు తయారుచేస్తున్నావని అంటాడు. దానికి నర్సయ్య తాను తన తోటివారికి సహాయం చేస్తున్నానని, పద్మశాలీల పరిస్థితి ఘోరంగా వుందని ఒకపూట తిండికి కూడా కష్టంగా ఉందంటాడు. తమరు ఆదుకుంటే బాగుంటుందని, బుచ్చమ్మ విషయంలో కులస్తుల ప్రవర్తనను తెలిపి ఎవరో తనమీద వ్యతిరేకంగా చెప్పివుంటారు అంటాడు.

ఈ మాటలు విన్న భుజంగరావు శాలోల్లకు కొత్తకొత్త పేర్లు పద్మశాలీలని సుంకర ముత్తయ్య చేతిలోని కఱ్ఱ తీసుకొని నర్సయ్యను కొట్టి, మిగతా కులాలవాళ్ళు అన్నిపనులు బందుచేయాలని హుకూం జారీ చేస్తాడు. నర్సయ్యది సున్నిత మనస్తత్వం. ఈ జరిగిన సంఘటనతో వేరే ఊరికి వెళ్దామని, దొరనుండి ఆపదలు తప్పవని అనుకుంటాడు. ఒక రోజు అర్ధరాత్రి ఎవరో పశువుల పాకకు నిప్పంటించగా గడ్డివాము, ఇల్లు తగలపడుతుంది. ఈ సంఘటనలో దూడ, తన ఐదు నెలలు గల కొడుకును పోగొట్టుకుంటాడు. కొందరు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా మరికొందరు దొరికిన సొమ్ము తీసుకెళ్తారు. నర్సయ్య బొంబాయికి వెళ్ళి అక్కడే పనిచేస్తూ ఉంటాడు. లింగప్ప, సోమన్న అనే ఇద్దరు వ్యక్తుల సంభాషణలో నర్సయ్య లాంటివారు ఇబ్బందులకు గురైయ్యారని, పేదలను దోచుకునేవారిని ఆ దేవుడు కూడ ఏమి చేయలేడని, దుర్మార్గులను చూసి దేవుడే భయపడుతాడు అనే సందేహాన్ని వ్యక్తం చేస్తారు. నాగనాథం ఇంట్లో దొంగలు పడ్డారని, ఆ పని దొరదేనని తెలిసిన పోలీసులు ఏమి చేయరని, దొరదగ్గర మంచి దావతులు తీసుకుంటారు. అందుకే దొంగలు దొరకరని అంటాడు సోమన్న.

వీరిద్దరి సంభాషణలలో బొంబాయికి వెళ్ళి బ్రతికేవారి జీవన విధానాన్ని చర్చిస్తారు. పద్మశాలీల నేత పనిని గురించి మాట్లాడుతూ మొగలాయి రాజు ఔరంగజేబు కూతురు ఔబున్నిస్సాబేగం నేతచీర ఏడు వరసలు కట్టినా శరీరం కనబడేలా చీరలు తయారు చేసిన పనితనం మనదని, నేటికి ఇలాంటి కార్మికులు ఉన్నారని అలాంటి వారికి తినడానికి తిండి కూడి దొరకడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తాడు లింగప్ప. పద్మశాలీలలకు పూర్వవైభవం రావాలంటే మిల్లులో పనిచేసే పద్మశాలీలందరు పనిమానేస్తే బాగుంటుందనగా, వెంకయ్య నేడు అన్ని కులాలవారు పని చేస్తున్నారని అది అసాధ్యమంటాడు. జోగేంద్ర, దుర్గాప్రసాద్ ఇద్దరు మంచి స్నేహితులు. బుచ్చమ్మ కొడుకు దుర్గాప్రసాద్. జాతరలో తప్పిపోయి వీరివద్దకు చేరి లాయర్ అవుతాడు. ప్రసాద్ తన కుటుంబంకోసం వెతకుతాడుగాని వాళ్ళ ఆచూకి దొరకదు. జోగేంద్ర ప్రసాద్‌తో మీవాళ్ళు దొరికితే మీ చెల్లెని పెండ్లి చేసుకుంటానని, దానితో అందరం ఒకదగ్గర ఉండొచ్చని అంటాడు. జోగేంద్ర డాక్టర్. మంచిపేరు ఉన్న వ్యక్తి. ఒకసారి

జోగేంద్ర ప్రక్క గ్రామానికి వెళ్ళి వస్తుండగా కొన ఊపిరితో ఉన్న అమ్మాయిని తీసుకొచ్చి వైద్యం చేసి బ్రతికిస్తాడు. ప్రసాదుతో అ అమ్మాయి నీలాగే ఉందని, నీకు కుడి కణతకు మచ్చ ఉంటే, ఆమెకు ఎడమ కణతకు ఉందటాడు. వెంటనే ప్రసాద్ వెళ్ళి ఆమెను చూసి తన చెల్లిగా గుర్తిస్తాడు. జోగేంద్ర ఆమెను వివరాలు అడుగుతారు. తనపేరు శ్యామల, తనది బుక్కరావుపేట, పద్మశాలీలమని చెప్పి, చిన్నతనంలోనే తండ్రి చనిపోవడం, అన్న జాతరలో తప్పిపోవడం మొదలైన అన్ని విషయాలు చెబుతుంది. ఇంద్రసాగరం గ్రామంలో దేశపాండ్య ఇంటిలో పని దొరికిందని, వారి కూతురు సరళాదేవితో సమానంగా చూసుకోవడంతో పాటుగా చదివించారని మెట్రికులేషన్‌లో తను పాసుకావడం, సరళ తప్పడంతో జీవితం తారూమారైందని, ఇంతలో కలరా వ్యాధితో అమ్మ చనిపోయిందని చెప్తుంది. ప్రసాద్ చెల్లెలి దగ్గరికి వెళ్ళి దుఃఖించడంతో ఆమె ఎవరు అని అడుగగా జోగేంద్ర మీ అన్న అని చెప్తాడు. శ్యామల ఆరోగ్యం బాగైన తరువాత ముగ్గురు కలిసి వారి వారి విషయాలు మాట్లాడుకుంటారు. తన అన్నను చేరదీసింది, తనను బ్రతికించింది జోగేంద్ర అని తెలిసి శ్యామల జోగేంద్రకు నమస్కరిస్తుంది.

తరువాత ప్రసాద్, జోగేంద్రల సంభాషణలో పద్మశాలీల జీవన పరిస్థితుల గురించి చర్చిస్తారు. గతంలో నిజాంలు, కరణాలు వారి తర్వాత నేడు డిపోదార్లు, పెట్టుబడిదార్లు, ఏజెంట్లు పెట్టే బాధలు ఎక్కువయ్యాయని అంటాడు ప్రసాద్. ప్రతిదానికి లంచాలు ఇచ్చామని, సన్నని దారం దొరకడం లేదని సాకులు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని అంటాడు. గ్రామంలో ఈ దోపిడి ఎక్కువగా ఉందని, పద్మశాలీల సంఘాలు స్థాపించి అందరికి అవగాహన కల్పిస్తున్నామని, గ్రామాలలో కూడా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని అంటాడు ప్రసాద్. దానికి మనజాతికి స్త్రీ విద్య అవసరమంటాడు జోగేంద్ర. దానికి సమధానంగా ప్రసాద్ స్త్రీవిద్య గురించి కూడా సమావేశాలు జరిగాయని శ్యామలాదేవి, ఉషదేవి లాంటివారి ఉపన్యాసాలు బాగున్నాయి అంటాడు. అప్పుడు జోగేంద్ర తనవంతు సహాయంగా ఐదువేల రూపాయల చెక్కును అందిస్తాడు. సహకార సంఘాలు ఏర్పడటంతో నేత కార్మికులు ఉపాధిమార్గం సులభతరమయంది. నర్సయ్య ఆ సంఘానికి

అధ్యక్షుడు. వేంకయ్య గ్రామ చేనేత కార్మికుల లిస్టు తీసుకొని వచ్చి నర్సయ్యకు ఇస్తాడు. దారిలో ప్రక్క గ్రామానికి చెందిన చేనేత కార్మికుడి కష్టాలు విని సహకార సంఘాల ద్వారా కలిగే లాభాలు తెలిపి, అతన్ని వెంటతీసుకోని వస్తాడు. నర్సయ్యని కలిసిన సందర్భంలో మిల్లుల ముందు మన పనికి ఏం వీలవుతుంది. మిల్లుగుడ్డలు నేత గుడ్డలకంటే అందంగా చౌకగా ఉంటాయి. కాబట్టి మననేత గుడ్డకు బజారులో రేటు లేదని, నేతగుడ్డని అందరు అదరిస్తే ఉపాధి కలుగుతుందని వేంకయ్య అంటాడు. లాయర్ ప్రసాద్ బుచ్చమ్మ కొడుకని, తన ఇంటి స్థలాన్ని, ఆ ప్రక్కన ఇంకొంత స్థలాన్ని కొని చేనేత సంఘానికి చేయూతనిస్తున్నాడని నర్సయ్య చేప్పాడు. ఈ విధంగా ప్రసాద్ చేనేత కుటుంబాలకు సహాయ సాహకారాలు అందిస్తున్నాడని తెలిసి అందరూ సంతోషిస్తూ, జోగేంద్రతో శ్యామలకు, ప్రసాద్ ఉషను వివాహం చేసుకోవడంతో ఈ నవల ముగుస్తుంది.

లోకమలహరి సంఘము నవలలో స్త్రీ విద్య గురించి చెప్తూనే, చేనేత వృత్తికారులైన పద్మశాలీల బాధలను చర్చించాడు. భూస్వాములు దొరల అహంకారానికి బహుజనులలో ఒకరైన పద్మశాలీలు ఎలా బలయ్యారో తెలియజేశాడు. అదేవిధంగా చదువు గొప్పతనాన్ని తెలియజేస్తూ, పద్మశాలీ యువకుడు చదువుకొని వారి వృత్తిలోని బాధలను తీర్చడానికి వారిని చైతన్యపరుస్తాడు. ఆదర్శవివాహం గురించి కూడా ఇందులో పేర్కొన్నాడు రచయిత.

### 3.1.3. భావన భార్గవి-1960

**రచయిత పరిచయం:** తెలంగాణా మలితరం రచయిత్రులలో బొమ్మా హేమాదేవి ఒకరు. మొట్టమొదటి బహుజన రచయిత్రి. 1960–1980 మధ్యకాలంలో మహిళల నుండి సాహిత్యం జీవితానుభవాలు, సంఘటనల నుండి కథలుగా, నవలలుగా మలిచారు రచయితలు. అందులో బొమ్మా హేమాదేవి ఒకరు. ఆమె అసలు పేరు రుక్మిణీదేవితో పాటు యమున అనే పేరు కూడా ఉంది. రచనా వ్యాసంగం కోసం 'దేవిరమ' అని ఇంకోపేరు పెట్టుకున్నారు. ఆ పేరుతో 40 నవలలు, 20 వరకు కథలు అచ్చయ్యాయి. ఆ తర్వాత ఆమె రాసినవి ముద్రణ కావడం ఆకస్మాత్తుగా ఆగిపోయాయి. అప్పుడు 'బొమ్మా హేమాదేవి' అని

కోడలు హేమ పేరు పెట్టుకున్నారు. ఆ పేరుతో రాసిన 'కుంకుమ పూలు' కథకు 1973లో ఆంధ్రజ్యోతి వార్తపత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటిలో మొదటి బహుమతి వచ్చింది. అప్పటినుండి ఆమె ఆ పేరుతోనే తన రచనలు కొనసాగించారు. అలా బొమ్మ హేమాదేవి పేరు స్థిరపడిపోయింది. నవలా ప్రక్రియలో తెలంగాణా రచయిత్రుల్ని వేళ్ళపై లెక్కపెట్టొచ్చు. చాలా తక్కువ మంది నవలలు రాశారు. అందులో బొమ్మ హేమాదేవి ఒకరు.

హేమాదేవి సాహితీ ప్రయాణం 1950లో ఆరంభించారు. అచ్చులో వచ్చిన మొదటి నవల భావన భార్గవి. 1960లో అచ్చయింది. ఆ తర్వాత నవధాన్యాలు, లవ్ స్టోరీ, తపస్విని, నవభారతి వంటి నవలలు మొదలైనవెన్నో వచ్చాయి. ఆమె చివరి నవల వనజ అడవి పుత్రిక(అలభ్యం). 1995లో రాశారు. "కుంకుమపూలు" కథ రాసి ఆంధ్రజ్యోతి 1973 దీపావళి కథల పోటిలో మొదటి బహుమతి పొందారు. ఆ ప్రోత్సాహంతో ఇప్పుడు మళ్ళీ రాయడం విజృంభించారు. ఆమె పుట్టింది నిజామాబాద్‌లో, ఉండేది హైదరాబాద్. డిగ్రీలు గొప్పగా లేవు. జీవితానికి కావలసినంత సంస్కారం జీర్ణించుకున్నారు. "కథలు రాయడం నా వృత్తి కాదు హాబి" అనే హేమాదేవి అత్మీయుల జీవితాల్లోకి, తోటి మనుష్యుల జీవితాల్లోకి సానుభూతి పూర్వకంగా తొంగిచూస్తారు. ఏమైనా సంఘటన కనిపిస్తే ఏదో ఒక కథ సిద్ధం చేస్తారు. పాఠకులతో తమ భావాలను పంచుకుంటారు. "బంగారు గూడు" నవల చాలా రోజుల తర్వాత హేమాదేవి రాసిన హుషారైన చిన్న నవల.

ఆంధ్రభూమి డైలీలో సీరియల్‌గా వచ్చిన "ఆరాధన" అశేష తెలుగు పాఠకుల ఆదరణ పొందింది. కథానాయకురాలు పార్వతి ఏ పాత్రను మహిళలకు ఆదర్శవంతంగా దిద్దారని అంటారు ఆనాటి పాఠకులు. మహిళా పాఠకులే కాదు పురుషుల్లోనూ ఆమెకు అభిమానులు ఎక్కువే. మీ రచన చదువుతుంటే సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుందని కొందరు అంటే, రచయిత్రి శైలి కవితా ధోరణిలో సాగుతోందని, సంభాషణలు చాల చక్కగా ఉన్నాయని, వాస్తవ గాథను రాస్తున్నట్లున్నారని, ఉత్కంఠ కలిగిస్తూ, కథనంలోనూ కొత్తదనం నింపుకుందని అంటారు. ఆరాధన సీరియల్ ఒక అసాధారణ ప్రేమ కావ్యంలా సాగిందని,

అవధులులేని ప్రేమకు ఈ సీరియల్ అద్దం పడుతుందని పాఠకుల లేఖలు పత్రికాఫీసుకు అందేవి. భగవాన్ పబ్లికేషన్స్, మద్రాసువారు 'ఆరాధన' ప్రచురించారు. ఆ పుస్తకం వెనుక అట్టపై పాఠకుల అభిప్రాయాలకు చోటిచ్చారు.

'నవ్యధాన్యాలు' అనే నవల వీరి సునిశిత దృష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. భార్యాభర్తలు బయటికి వెళ్ళినప్పుడు భర్త ఎదురుగానే భార్యను సంఘవిద్రోహులు కిడ్నాప్ చేసిన వాస్తవ సంఘటన తీసుకుని నవల రాశారు. నేరస్థుడిని పట్టుకుంటారు భర్త, కాని భార్యను ఏలుకోలేను. ఏలుకుని చుట్టుపక్కల తలెత్తుకుని బతకలేను. కాబట్టి ఆమెను పుట్టింటికి పంపించెయ్యమని తల్లితో చెప్తాడు. అప్పుడు తల్లి కోడలు పక్షాన నిలబడి మాట్లాడుతుంది. ఆమె కిడ్నాప్ అవడాకినికి కారణం ఆమెనా? ఆమె తప్పు చేసినట్లా! కాదా?. అటువంటప్పుడు ఆమె ఇంటినుండి ఎందుకు వెళ్ళిపోవాలి అని కొడుకుని నిలదీస్తుంది. తన కోడలు ఇల్లు విడిచి వెళ్ళేది లేదని కొడుకుకు స్పష్టం చేస్తుంది. నీవు ఇక్కడ తలెత్తుకోలేను అనుకుంటే ఈ ఊరినుండి మారిపోవచ్చు అని కొడుక్కి సలహా ఇస్తుంది. తన పాత్రల ద్వారా, తాను సృష్టించిన సాహిత్యం ద్వారా సమాజాన్ని సంస్కరించాలనే తాపత్రయం కనిపిస్తుంది. రచయిత్రి బొమ్మ హేమదేవి రచనల్లో, స్త్రీలకు జరిగే అన్యాయాల పట్ల, స్త్రీల సమస్యల పట్ల ఎంతో ముందుచూపుతో రచనలు చేశారామె. తమ రచనలు ద్వారా స్త్రీల పట్ల జరిగే అన్యాయాలకు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి అని ఉద్భోధిస్తున్నట్లుగా ఉంటుంది బొమ్మా హేమాదేవి సాహిత్యం. సామాజికమైన ఇతివృత్తాలతో, ఆకర్షణీయమైన ప్రకృతి వర్ణనలు, ఆహ్లాదకరమైన అలంకారాలతో తెలుగునాట ఎంతోమంది హృదయాలు దోచుకున్న రచయిత్రి బొమ్మా హేమాదేవి. ఆమె రచనల్లో నైపుణ్యతా చదువరులను ఆకట్టుకుంటుంది. ఆమె రచనలు ప్రధానంగా నవలల్లో పాత్రల సంభాషణలు సూటిగా ప్రశ్నిస్తుంటాయి. ఆమె కథల్లో, నవలల్లో పాత్రల సంభాషణలు సూటిగా ప్రశ్నిస్తుంటాయి.

ఆమె రచనలు ప్రధానంగా మహిళలకు సంబంధించినవో, సమాజంలో ఉన్న మహిళల వివిధ సమస్యలను తీసుకొని రాసినవై ఉంటాయి. అతి సాధారణంగా కనిపించే

అంశాలను తీసుకుని అద్భుతమైన శైలితో వాస్తవిక దృష్టితో తెలుగు సాహితీ సీమలో సౌరభాలు అద్దినారు రచయిత్రి. నిజామాబాదుకు చెందిన రామాగౌడ్, గంగాదేవి మొదటి సంతానం ఇమె. 1932 సెప్టెంబర్ 14వ తేదీన నిజామాబాదులో జన్మించారు. హైదరాబాదులోని నారాయణగూడ బాలికోన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ చదివారు. ఆమెకు పదిహేనవ ఏటనే వివాహం అయింది. ఆర్థికంగా ఉన్నత స్థాయి కుటుంబం. కానీ, పేద ఇంటికోడలై ఆ యింటి పరిస్థితులకు అనుగుణంగానే నడుచునేది. ఆరుగురు పిల్లలతో సంసార బాధ్యతలతో తలమునకలవుతూనే రచనా వ్యాసంగం చేయడం గమనించదగ్గది. ఏమాత్రం సమయం చిక్కినా ఆ సమయాన్ని రచనా వ్యాసంగానికి వినియోగించుకునేవారు హేమాదేవి. పని మధ్యలో పది పదిహేను నిముషాలు సమయం చిక్కినా కూర్చొని రాసుకునేవారు. రాసుకోవడానికి ప్రత్యేక సదుపాయాలు, వసతులు ఏమీలేవు. మానసిక స్థితిని బట్టి రాయడం వంటివి ఏమి లేవు. సమయం దొరికితే చాలు కలం కదిలించేవారని అంటారు శోభారాణి. గుడిపాటి వెంకటాచలంతో ఎప్పుడూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుండేవారని, సినారె, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి కవులతో సాహితీ సాంగత్యం అమ్మతో సాహితీ ప్రయాణం చేయించారు అంటారామె.

బొమ్మ హేమదేవి గారి నలభైకి పైగా రాసిన నవలలో నా పరిశోధన కాలానికి ఇప్పటివరకు లభించిన, సేకరించిన నవలల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. అవి.

| | |
|---|---|
| 1. భావన భార్గవి | 1960 |
| 2. నవభారతి | 1960 |
| 3. కళావతి | 1960 |
| 4. తరంగాలు | 1961 |
| 5. పంచరంగులు | 1961 |
| 6. ఆరాధకులు | 1962 |
| 7. నువ్వు భార్యవు | 1962 |
| 8. ప్రేమంటే | 1962 |

9. నవోదయం 1963

10. సూత్రధారి–పాత్రదారులు 1964

11. పొగమంచు 1976

12. బంగారు గూడు 1976

13. మనస్విని 1976

14. సంసారబంధం 1976

15. ప్రేమించకు–పెళ్ళవుతుంది 1978

16. నవరసాలు 1979

17. లవ్ స్టోరి 1979

18. మహానంద 1983

ఈ భావన భార్గవి నవలలోని పాత్రలు యమునా, భావన. వీరిద్దరు అక్కాచెల్లెలు. ఆట పాటల్లోనూ, అంద చందాల్లోనూ, చదువుల్లోనూ ఇద్దరూ చాలా చురుకైనవారు. ఫైనల్ పరీక్షలనంతరం యమునా బెంగుళూరులో ఉంటున్న పిన్ని(భార్గవి) దగ్గర సెలవులు గడపాలని అనుకుంటుంది. పస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులో తన ఇంటిపనివాడైన హరిని తోడుగా వెంటపెట్టుకొని బెంగుళూరు ప్రయాణమవుతుంది. హరి స్టేషన్‌కి తీసుకెళ్ళడానికి ఎవరు వస్తారు అని అడగగా సమాధానంగా యమునా పిన్ని వస్తుందేమో!... బాబాయ్‌కి పనులవల్ల కుదరకపోవచ్చు అని ఆశాభావం వ్యక్తంచేస్తుంది. దానికి హరి ఏం పనులు అమ్మ, పనికిరాని పనులు, పాపం అమ్మగారు కాబట్టి అన్ని భరిస్తున్నారు. ఏం అయింది హరి అలా ఎందుకు మాట్లాడుతున్నావ్ అని అడిగితే ఏముందమ్మ బాబాయిగారు సరిగ్గా అమ్మగారిని చూడరు. అదోలా అన్నాడు. ఎవరో ఇంకో ఆడమనిషిని వేరే ఇల్లు తీసుకొని అందులో అట్టేపెట్టుకున్నారట. మరి ఇందులో విచారపడవల్సిన విషయం ఏముంది? పిల్లలు స్కూలుకి, బాబాయ్ పనిమీద బయటకు వెళ్తారు. పిన్ని ఒకరె ఇంట్లో ఒంటిరిగా ఉంటుంది. కాబట్టి ఇంకొకరు ఉంటే ఆమెకు తోడుగా, కాలక్షేపంగా ఉంటారు కదా! అని చెప్తుంది. అందుకు హరి భారత స్త్రీ(నారి) ఒకే పురుషున్ని నమ్ముకుని ఉంటుందమ్మ అతనే భర్తగాను, దైవంగాను, అతనే సర్వస్వంగాను భావిస్తుంది. తను అంతగా కొలుస్తున్న భర్త తన్ను కాదని

మరో పరాయి స్త్రీని చేపట్టడం వలన మన దేశపు స్త్రీ సంహించలేదమ్మ... మనదేశంలో ఒక భార్య ఉండగానే మరో స్త్రీకోసం ప్రాకులాడే పురుషులున్నారు. కాని, స్త్రీల విషయం అలాక్కాదుగా? ఎందుక్కాదు? ఇంకో భర్త కావాలని అంత నిశ్చయంగా అనుకున్నప్పుడు దొరకరా! నలుగురు పిల్లల తండ్రి ఇంకో భార్యను వెతక్కుంటే తప్పులేదుగాని నలుగురు పిల్లల తల్లి ఇంకో భర్తను వెతుక్కోవడం తప్పా! అని వాదిస్తుంది. మగవాళ్లకు సంప్రదాయం... ఆడవాళ్ళకు ప్రాణగండమునా! అని ఆశ్చర్యంగా అడుగుతుంది. మగవాళ్ళు, ఆడవాళ్ళు అని భేదం ఎందుకు? పుట్టడం, చావడం అన్నీ ఒక్కలాగే ఉన్నప్పుడు భేదమంతా ఆ ఒక్క విషయంలోనే ఎందుకు అని ప్రశ్నిస్తుంది. ఔనమ్మా అన్నిటికంటే అమూల్యమైన ఆ ఒక్క విషయంలోనే మన భారతదేశం కొన్ని యుగ యుగాలనుండి పతివ్రతలకు నిలయమైంది. ఇలా ప్రయాణంలో నిద్ర వచ్చేవరకు వాదించుకుంటూ నిద్రలోకి జారుకుంటారు.

అక్రమ సంబంధాల విషయంలో కూడా పురుషులు ఆధిక్యతా దిశగానే ఆలోచిస్తారనే విషయం ఈ నవల ద్వారా అర్థమవుతుంది. ఎందుకంటే పురుషులు వేరే స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకుంటే భార్య ప్రశ్నించకూడదు. కాని అదే భార్య వేరే పురుషుడితో వివాహేతర సంబంధం ఉందని ఏమాత్రం తెలిసినా అనుమానించి ఇబ్బందులు పెడుతుంటాడు. అసలు ఇద్దరు అక్రమ సంబంధం పెట్టుకోకుండా అన్యోన్యంగా ఉండాలి. దీనిని బట్టి ప్రతి విషయంలోనూ పురుషుడు ఆధిపత్యం చెలాయిస్తూనే ఉండటం, తప్పు చేసినా సమర్థించుకునే విధంగా ప్రవర్తించడం ఇందులో విశ్లేషించబడింది.

### 3.1.4. నవభారతి-1960

ఈ నవలను బొమ్మ హేమాదేవి(దేవీరమ) రాశారు. నవభారతి నవలలో భారతి ప్రధాన పాత్రగా కథంతా నడుస్తుంది. ఇందులో స్త్రీ జీవితం, నిరుద్యోగం, పేదరికం, పురుషాధిక్యత ప్రధాన వస్తువులుగా తీసుకొని నవల రాశారు రచయిత బొమ్మ హేమాదేవి(దేవీరమ). పేదకుటుంబంలో కలిగే ఇబ్బందులు, తద్వారా కుటుంబంలోని స్త్రీలపై

పడే ప్రభావం, పురుషాధిక్యత, నిరుద్యోగం మొదలైన వాటితో కుటుంబం ఏ విధంగా చితికిపోతుందో ఈ నవలలో విశ్లేషించబడింది. భారతి వాళ్ళ ఇల్లు పీకల్లోతు అప్పులతో వారి జీవనం నడుస్తుంది. వారి అన్నయ్యకు సరైన ఉద్యోగం దొరకదు. భారతి ఉద్యోగం చేద్దామంటే తన అందమే అడ్డుగా మారుతుంది. అందరి కళ్ళు తనవైపే చూస్తూ కాల్చేస్తుంటాయని బాధపడుతుంది. పురుషులు కూడా అందమైన ఆడవారు కనిపిస్తే అదోలా చూడటం, ఏదో అనుకోవడం మొదలైన అవమానాలన్నీ భారతిని ఇబ్బంది పెడుతున్నాయి. మధ్యవయస్కులు సైతం భారతిని కోరుకోవటం, పెళ్ళి చేసుకుంటాననటం, భార్య చనిపోయిన పిల్లల తండ్రి కూడా తనను పెళ్ళి చేసుకోమ్మని కోరటం, అద్దెకు వెళ్ళిన ఇంట్లో, అద్దె చెల్లించలేక దేవాలయంలో తలదాచుకున్న సందర్భంలో, ట్యూషన్ చెప్పే క్రమంలో స్త్రీని ఒక రకంగా చూడటం ప్రతిచోట్ల స్త్రీ జీవితం దుర్భరంగా కనిపిస్తుంది. చివరకు హైదరాబాదులో ఉద్యోగం కోసం వెళ్తే అక్కడా అంతే. ఇక చేసేది లేక తన అందాన్నే వ్యాపారంగా మొదలు పెట్టింది భారతి. తన కాళ్ళు, చేతులు, ముఖం, నాట్యం, ప్రశ్నలకు సమాధానాలు మొదలైనవాటికి టికెట్టు పెట్టి ప్రదర్శించటం ప్రారంభించింది. మొత్తంగా బాహ్య సౌందర్యంలోని అంగాంగాలకు ఖరీదు కట్టి చూపిస్తుంది. దీనికి మంచి స్పందన వచ్చింది. అందులో పనిచేసేవారు ఏడువందల మందివరకు పోషింపబడుతున్నారు. ఆ సౌందర్య ప్రదర్శనతో వచ్చిన సొమ్ముతో సమాజ సేవ చేస్తుంది. పాఠశాలలు, కళాశాలలు నిర్మించి ప్రజలకు తనవంతుగా సహాయపడుతుంది. బాగా చదివి ఉద్యోగం లేక చివరకు భారతిని తన అన్నయ్య రెండవ పెళ్ళి సంబంధం ఐనా, అధిక వయస్సు ఉండి భార్య చనిపోయి నలుగురు పిల్లలు కల్గిన వ్యక్తిని పెళ్ళి చేసుకుంటే మన అందరు అవసరాలు తీరుతాయనటం, తను కూడా తన అన్నను అదే రీతిగా పెళ్ళి చేసుకోమనటం, తనవల్ల కాక ఆమె అన్న భరత్ భూషన్ సన్యాసిగా మారతాడు. 'భారతి నిలయం' పేరుతో సౌందర్య ప్రదర్శన ఆట నడిపిస్తున్న సమయంలో నూతన్ బాబుతో పరిచయం ఏర్పడటం వల్ల చివరకు అతన్ని పెళ్ళి చేసుకుంటుంది. అతను పిహెచ్.డి చదువుకున్నా ఉద్యోగం దొరకకపోవడంతో సమాజంలోని తీరును చెప్తూ, తిండిలేక దిక్కు తోచకుండా తిరుగుతుంటే భారతి చేరదీసి తమ సామాజిక సేవా సంస్థలో పనిచేయమంటుంది. తర్వాత అతన్ని పెళ్ళి చేసుకుంటుంది.

ఇవన్నీ స్త్రీ జీవితం, నిరుద్యోగం, పురుషాధిక్యత, పేదరికం మొదలైనవన్నీ ఈ 'నవభారతి' నవలలో కనిపిస్తుంది.

### 3.1.5. కళావతి-1960

కళావతి నవలను బొమ్మ హేమాదేవి (దేవీరమ) రాశారు. ఇందులో ప్రధాన పాత్రలు కళావతి, ఉమలు. ఉమకు ఇద్దరన్నయ్యలు, ఒకచెల్లె, అమ్మానాన్నలు ఉన్నారు. ఈ నవలలో కుటుంబ సంబంధ బాంధవ్యాలు కనిపిస్తాయి. అన్నా చెల్లెల్ల అనుబంధం, రాఖీ పండుగ ప్రత్యేకత కనిపిస్తాయి. సమాజంలో రాఖీ కట్టినప్పుడు చెల్లెల్లు అన్నయ్యల దగ్గరనుండి డబ్బు రూపంలోనో లేదా వస్తు రూపంలోనో ఎంతోకొంత ఆశించడం సహజం. రాఖీ పౌర్ణమి విశిష్టత ఏమిటంటే ఆడపడుచులు అన్నయ్యలు లేదా తమ్ముళ్ళకు రాఖి కడతారు. అలా కట్టడంలో ఉద్దేశమేమిటంటే ప్రతి సందర్భంలోనూ అన్నదమ్ములకు తమ ప్రేమ, ఆప్యాయతలు రక్షణగా ఉంటూ, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటారు. అదేవిధంగా అన్నాదమ్ముల అండదండలు తమపై ఉండాలని, ఆపద సమయాల్లో ఆదుకోవాలని ఆశిస్తారు. రాఖీ అంటే నిర్దిష్టమైన విలువ కట్టలేనిదని, అది ప్రేమ, ఆప్యాయతలకు సంబంధించిన విషయమని రచయిత్రి తెలియజేశారు. ఇందులో ఉమా వాళ్ళ చిన్నన్నయ్య విశ్వం నవలా రచయిత. ఇతని నవలలను చాలామంది చదువుతుంటారు. అందులో 'కళావతి' అనే అమ్మాయి విశ్వం నవలలను చదివి ఇష్టపడి అతన్ని గాఢంగా ప్రేమిస్తుంది. కాని ఇంట్లోవాళ్ళు ఒప్పుకోరు. కారణం కళావతి అన్నయ్య హరినాథ్ పుట్టిన తరువాత అతని నాన్న చనిపోతాడు. భర్త చనిపోవడంతో హరినాథ్ అమ్మ రెండోపెళ్ళి చేసుకుంటుంది. అప్పుడు కళావతి పుడుతుంది. వీరిద్దరికి తండ్రి వేరువేరు, కాని తల్లి మాత్రం ఒకరే. కనుక సమాజం ఆమె తల్లి గురించి తప్పుగా భావించి ఆమెను, వాళ్ళ అన్నయ్యను చులకనగా చూస్తోంది.

విశ్వం రచయితే అయినప్పటికీ వాళ్ళ కుటుంబం కూడా సమాజంలో ఒక భాగమే కాబట్టి, సమాజానికి భయపడి వారు కళావతి, విశ్వంల ప్రేమ పెళ్ళికి ఒప్పుకోరు.

తదనంతరం విషయాన్ని అర్థం చేయించడంతో ఒప్పుకుంటారు. విశ్వంతో కళావతి వివాహం, హరినాథ్‌తో ఉమా ప్రేమల వివాహాలు జరగడంతో కథ సుఖాంతమవుతుంది.

ఈ నవలలో రచయిత్రి వితంతు వివాహాన్ని సమాజం ఎలా చూస్తుందో కళావతి, హరినాథ్ వాళ్ళ అమ్మ విషయం ద్వారా తెలియజేస్తుంది. కళావతి–విశ్వం, హరినాథ్–ఉమ వివాహాలు చేసుకోవడం ద్వారా ప్రేమ వివాహాలను రచయిత్రి ప్రోత్సహిస్తున్నట్టు తెలిస్తుంది.

### 3.1.6. తరంగాలు-1961

తరంగాలు నవలను బొమ్మ హేమాదేవి (దేవీరమ) రాశారు. ఇందులో రూమా, నవలత ప్రధాన పాత్రలు. వీరిద్దరు అక్కాచెల్లెలు. ఇంట్లో ఇద్దరికీ పెళ్ళి సంబంధాలు చూస్తారు. చాలాకాలం తర్వాత ఇద్దరికీ సంబంధాలు కుదురుతాయి. కమల్‌బాబుతో రూమాకు, చంచల్‌బాబుతో నవలతకు పెళ్ళి నిశ్చయం అవుతుంది. కమల్‌బాబు రూమాను చూడగానే నచ్చుతాడు. ఇష్టంగా మాట్లాడతాడు. “చూడు రూమా! నా కొరకు పెళ్ళి ప్రయత్నం చేయడం ఇదే మొదటిసారి. అంటే పెళ్ళి చూపులు చూడ్డం కూడా ఇదే మొదటిమారన్నమాట. పెళ్ళి అంటే అదేమో, అందరిలా నాకు దానిపై శ్రద్ధ ఉండేది కాదు. ఇంట్లో అమ్మా నాన్న మరీ ఆతురత పెట్టారు. మా బావగారైతే, నన్ను బలవంతంగా ఇక్కడికి తీసుకొచ్చారు. కాని, ఇప్పుడు నిన్ను చూచాక ఏమనిపిస్తుందో చెప్పమంటావా? ఈ రోజు నేనిక్కడికి రాకపోవడం జరిగితే జీవితంలో ఇంకెన్నడూ ఊహించుకోలేని నష్టాన్ని పొందేవాణ్ణి రూమా! నాకు కొత్తగా పెళ్ళిచేసుకొనే అవసరం లేదని, నా పెళ్ళి ఎప్పుడో జరిగిపోయిందని అనిపించేది. ఆ పెళ్ళి కూతురెవరో ఇప్పుడు స్పష్టంగా చూచుకోగల్గుతున్నట్లు అనిపిస్తుంది. రూమా! మన పరిచయం ఈ జన్మది కాదేమో నీకెలా అనిపిస్తుంది. ఊఁ?” (దేవీరమ. తరంగాలు. పుట: 9). రూమా నచ్చడంతో కమల్‌బాబు ఆమెకు ప్రేమగా ఉంగరం తొడుగుతానంటాడు. రూమా ఏమీ మాట్లాడకపోతే మీ ఉంగరమైనా ఇవ్వండి అన్నాడు. రూమా అతనికి ఉంగరం తొడుగుతుంది. ఇంతకుముందు అమెరికా వెళ్ళి వచ్చిన తర్వాత పెళ్ళి చేసుకుందామని అనుకుంటుండేవాడిని, కాని ఇప్పుడు మనసు మార్చుకున్నాను. పెళ్ళైన తర్వాత ఇద్దరం కలిసి

అమెరికా వెళ్ళొచ్చు అంటాడు. అంతలోనే కమల్‌బాబు వాళ్ళ నాన్నకు అనారోగ్యం కారణంగా నిశ్చితార్థ సమయానికి రాలేకపోతాడు. అలా చాలారోజులు ఎదురుచూసిన తర్వాత రుమా కుటుంబీకులు కంగారు పడతారు. ఆ సమయంలో నవలతను చేసుకోబోయే భర్త చంచల్‌బాబుకు విషయం తెలియడంతో రూమాకు తన పెద్దనాన్న కొడుకు అయిన నిర్మల్‌బాబుతో సంబంధం కుదురుస్తాడు. రూమా–నిర్మల్‌బాబు, నవలత–చంచల్‌బాబులకు పెళ్ళవుతుంది.

నిర్మల్‌బాబు, రూమా బాగా అన్యోన్యంగానే ఉంటున్నారు. వీరికి ముగ్గురు అమ్మాయిలు, అబ్బాయి పుడతారు. కొన్నాళ్ల తర్వాత నిర్మల్‌బాబు పనిచేసే ఆఫీసులోనే కమల్‌బాబు పనిచేస్తుంటాడు. ఇతడు పిచ్చిపట్టినవాడిలా ఉంటూ, జీవిత సత్యాలు, సూక్తులు చెప్తూ ఉంటాడు. కారణం అతని ప్రేమ విఫలమైందనే చెప్పాలి. ఎందుకంటే అతను రూమాను పెళ్ళిచూపుల్లో చూడటం, రూమా ఉంగరం తొడిగినప్పటినుండి ఆమె ధ్యాసలోనే ఉంటాడు. అప్పటినుండి పెళ్ళిచేసుకోలేదు. వాళ్ళ నాన్న ఆరోగ్యం సరిగ్గా లేక పెళ్ళి సమయానికి రాలేక, అప్పటికే రూమాకు పెళ్ళి అయ్యిందని తెలియగానే, అప్పటినుండి ఇలా తయారవుతాడు.

రూమా భర్త నిర్మల్‌బాబు కమల్‌బాబుల స్నేహంవల్ల వీరి ఇంటికి వస్తుంటాడు. వచ్చినప్పుడు ప్రేమ గురించి రూమాకు చెప్తూ, సంకుచితమైన దృష్టితో, స్వార్థబుద్ధితో ప్రేమను చూడవద్దని చెప్తాడు. రూమాదేవి బాధతో కమల్‌బాబును ఎంతకాలం ఒంటరిజీవితం గడుపుతావు? పెళ్ళి చేసుకోవచ్చు కదా! అని అడిగి, ఏదో చెప్పబోతే, అప్పుడు కమల్‌బాబు "రూమాదేవీ! పోతే ప్రేమను పంచిపెట్టే శక్తి సామర్థ్యాలు నాలో లేవు" (దేవీరమ. తరంగాలు. పుట: 133). అన్నాడు రూమాదేవికి పూర్తిగా అర్థమయ్యేలాగా. ఎంత గాఢంగా రూమాదేవిని మనసులో దాచుకున్నాడో అర్థమవుతుంది. ఇక్కడ ప్రేమ సఫలమైతే తీపిని, విఫలమైతే ఎంతటి(చెదు)ని తీవ్రాతితీవ్రమైన బాధను కలిగిస్తుందో కూడా ఈ నవలలో రచయిత్రి చిత్రించారు.

ఇందులో వరకట్నానికి సంబంధించిన విషయం కూడా చర్చించబడుతుంది. పైన చెప్పిన రెండు జంటల పెళ్ళిళ్ళు కూడా కట్న కానుకలు లేకుండానే నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా జరిగాయి. కాని చంచల్‌బాబు, నవలతకు కూతురు పుడితే బాధపడతాడు, కారణం ఏమంటే కూతురుకు పెళ్ళికి కట్నాలు అవి ఇచ్చుకోవాలని బాధపడ్తుంటాడు. అమ్మాయి పుట్టిందనే బాధపడ్తూ భార్యాభర్తలు ఇద్దరూ గొడవలు పడితే సమసిపోయే సమస్య కాదు కదా, వరకట్న పిశాచాన్ని తరిమికొట్టే ప్రయత్నం మనమందరం చేయాలని అని పాత్రల మధ్య సంభాషణ ద్వారా రచయిత్రి తెలియజేస్తుంది.

అదేవిధంగా పురుష స్వభావాన్ని కూడా ఇక్కడ చెప్పారు. చంచల్‌బాబు మనస్తత్వాన్ని ఇందులో ప్రస్తావించారు. నవలతను మంచిచీర కట్టుకొని అందంగా తయారవమనడం, ఇంకా రకరకాలు హింసించేవాడు. “అక్కయ్యా! ఆడదానికి అందంగా, ఆరోగ్యంగా ఉన్నంతవరకే, మగవాళ్ళు విలువ ఇస్తూ ఉంటారేమో! పెళ్ళిచేసుకొని సుఖపడ్డవారు ఎవరున్నారని నన్ను సుఖం కొరకు చేయి చాపమంటావ్!? అంది.” (దేవీరమ. తరంగాలు. పుట: 78). ఇలా ఆడవాళ్ళు పురుషుల సరదాకొరకే అన్నట్లుగా మనకు అర్థమవుతుంది.

వరకట్నం లేకుండా పెళ్ళిళ్ళు జరగాల్సిన ఆవశ్యకతను, పురుష అహంకారాన్ని, ప్రేమ గొప్పతనాన్ని ఈ నవలలో కనిపిస్తాయి.

### 3.1.7. ప్రేమంటే-1962

ఈ నవలను బొమ్మ హేమాదేవి (దేవిరమ) రాశారు. ఇందులో ప్రధానంగా ప్రేమంటే ఏమిటి? ప్రేమించిన వ్యక్తికోసం ఎంతకాలం ఎదురుచూస్తారు? ప్రేమను ఎందుకు త్యాగం చేస్తారు? వంటి మొదలైన అంశాల దృష్టితో రచయిత్రి ఈ నవలను రాశారు. ఇందులో రాధా, గోకుల్ ప్రధాన పాత్రలు. రాధా(మధు) వాళ్ళ కుటుంబంలో తల్లిదండ్రులు, ముగ్గురు అక్కలు, ఉంటారు. వారిలో అందరూ అమ్మాయిలే కావడం చేత చిన్నమ్మాయి రాధను అబ్బాయిలాగే పెంచారు. ఆమెకూడా అందరి ఆడవారిలాగే కాకుండా భిన్నంగా ఆలోచించడం, శక్తికి మించిన పనులను సునాయాసంగా నేర్చుకోవడం వంటివి చేస్తుంది.

గుర్రపు స్వారీతో సహా ఆమెకు చాలా విద్యలు వచ్చేవి. గోకుల్ రాధ మేనబావ. చిన్నప్పటినుంచి ఒకరు అంటే ఒకరికి ఇష్టం. వీరిద్దరికి కచ్చితంగా పెళ్ళవుతుందని అందరూ భావిస్తారు.

రాధాపురి జమిందారుకు నలుగురు కుమారులు. అందులో ఒకరు రాధ అబ్బాయిలాగా పెరిగినట్టుగానే చివరి అబ్బాయి అమ్మాయిలాగా పెరిగాడు. కాదు కాదు పెంచారు. రాధ వాళ్ళ అమ్మానాన్నకేమో అబ్బాయిలు లేరని చివరి అమ్మాయిని అబ్బాయి లాగా చూడసాగారు. అదేవిధంగా రాధాపురి జమిందారుకు అమ్మాయిలు లేరు కాబట్టి, చివరి అబ్బాయి విష్ణును అమ్మాయిలాగా చూడసాగారు. అటు రాధ అక్కయ్యలుగాని, ఇటు విష్ణు వాళ్ళ అన్నయ్యలుగాని ఒకరి పెళ్ళి కాకుండా మరొకరు చేసుకోరు. కనుక చివరకు వీరికి, వారికి పరిచయం ఏర్పడి సంబంధాలు కుదురుతాయి. రాధ గోకుల్‌ను ప్రేమిస్తుంది. కాని అనివార్య పరిస్థితుల్లో జమిందారు అబ్బాయి విష్ణుని చేసుకుంటే రాధ అక్కలను విష్ణు అన్నయ్యలు పెళ్ళి చేసుకుంటారు. కనుక తన ప్రేమను త్యాగంచేసి మరీ ఈ పెళ్ళికి ఒప్పుకుంటుంది. ఇంట్లో వాళ్ళు వద్దని వారించినా అందరి క్షేమం కోసం ఈ పనికి పూనుకుంటుంది. "బావను నేను బాధపెట్టలేను. బావ నా కొరకు తపించిపోతూ వుంటే చూస్తూ నేను వూరుకోలేను. భగవంతుడా! ఏమిటీ రోజు ఈ ఆలోచన వచ్చింది? చిన్నతనంలో తల్లి, దండ్రి ప్రేమకు దూరమై, యవ్వనంలో ప్రేయసి అనురాగానికి బావ దూరమవుతాడా? లేదు, లేదు, లేదు... మోసం ఎలా ఔతుంది? నేనూ, బావా కష్టపడ్డామంటే ఎందరి జీవితాల్లోనో ఆనందం, సుఖం, ప్రవేశిస్తుంది. నలుగురు వాళ్ళ వాళ్ళ తల్లిదండ్రులు, మా అక్కయ్యలు, అమ్మ, నాన్న ఇందరి కొరకు మేమిద్దరం కష్టపడటం లెక్కకు వచ్చే విషయం ఏమీ కాదు. లాభసాటి బేరమే. ఔను, ప్రపంచమే ఓ పెద్ద వ్యాపార కేంద్రం. కాని, బావ... బావకు లోటు లోపం ఏమిటి? నాకన్నా ఎన్నోరెట్లు అధికురాలు అతనికి అర్ధాంగిగా దొరుకుతుంది. కాని, ఆ అబ్బాయి విషయం అలాక్కాదు." (దేవీరమ. ప్రేమంటే. పుట: 45).

ఒక స్త్రీ చైతన్యవంతంగా ఆలోచించి తన ప్రేమను సైతం త్యాగం చేసి కుటుంబాన్ని ఎలా చక్కదిద్దుతుందో ఈ నవలలో మనం చూడవచ్చు. అయితే ఇక్కడ విషయం మనం గమనించాలి. ఈ నవలలో రాధా అసలు పేరు మధు. ఈ పాత్ర ద్వారా రచయిత్రి ఒక కథను రాయిస్తుంది. అదే కథ నవల ఆసాంతం సాగుతుంది.

పెళ్ళి తర్వాత రాధ తన భర్తను నెమ్మదిగా మార్చుకుంటుంది. ఈ క్రమంలో తన అత్తగారిని కూడా ఎదిరిస్తుంది. ఒక అబ్బాయిని కని, కన్నుమూస్తుంది. రాధ మరో జన్మ ఎత్తి, తనను అత్యంత ఇష్టంగా ప్రేమించిన తన బావ గోకుల్‌ను పెళ్ళి చేసుకున్నట్టుగా మధు పాత్ర ద్వారా కథ రాయబడింది. ప్రేమకోసం జన్మంతా ఎదురు చూశాడు రాధ బావ గోకుల్. ప్రేమంటే ఏమిటి అని రాధ గోకుల్‌ను ప్రశ్నిస్తుంది. అప్పుడు గోకుల్ ఇలా అంటాడు. 'జన్మ జన్మలకు జీవాత్మలతో ఆనందాన్ని అనుభవించేదే ప్రేమ... ముందు జన్మలో నీ ఆత్మను నేను సొంతం చేసుకున్నాను. ఈ జన్మలో నీ సర్వస్వాన్ని నేను పొందగలిగాను. జన్మజన్మలకు నిన్నే ఆరాధిస్తాను. నువ్వు దూరమైతే, నీకోసం తపస్సు చేసి, సాధిస్తాను. ఈ అనిర్వచనీయమైన అనుబంధానికి మారుపేరే 'ప్రేమ' తెలిసిందా?' అని అంటాడు. అంటే రాధను ఎంత గాఢంగా ప్రేమించాడో అర్థమవుతుంది.

మొత్తంగా ఈ నవలలో ఒక స్త్రీ కుటుంబం కోసం తన ప్రేమను త్యాగం చేసిన విధానం, ఒక ప్రియుడు తన ప్రేయసి కోసం ఒక జన్మంతా ఎదురుచూడటం మొదలైన విషయాలను వస్తువుగా రచయిత్రి చిత్రించారు.

### 3.1.8. ఆరాధకులు-1962

ఈ నవలను బొమ్మ హేమాదేవి(దేవీరమ) రాశారు. దేవీరమ 'ఆరాధకులు' నవలలో కూడా 'ప్రేమ'ను వస్తువుగా రాసారు. ఇందులో ధనలక్ష్మి, బూషన్‌బాబు ప్రధాన పాత్రలు. వీరిద్దరు ప్రేమించుకుంటారు. కాని బూషన్‌బాబుకు యాక్సిడెంట్ కావడంవల్ల పెళ్ళి ముహూర్తానికి బూషన్‌బాబు చేరుకోలేకపోతాడు. ధనలక్ష్మి వివాహం మేనబావతో

జరుగుతుంది. అతడు ధనలక్ష్మిని ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తాడు. విషయం తెలుసుకున్న బూషన్‌బాబు ధనలక్ష్మి మేనబావ కేశవ్ దగ్గరికి వెళ్ళి ఆమెను వదిలిపెట్టమంటాడు. కాని అతడు డబ్బులు డిమాండ్ చేస్తాడు. బూషన్‌బాబు ఇస్తూనే వస్తుంటాడు. బ్లాక్ మెయిల్ చేసి కేశవ్, బూషన్‌బాబు దగ్గరనుండి డబ్బు గుంజుతూనే ఉంటాడు. చివరకు ధనలక్ష్మి బావ హింసను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటుంది.

ధనలక్ష్మి మరణాన్ని తట్టుకోలేకపోయిన బూషన్‌బాబు కొంతకాలనికి ధనలక్ష్మి రూపురేఖలతో ఉన్న భిక్షగత్తెను తనతో తీసుకెళ్తాడు. ఆమెతోనే కాపురం చేస్తాడు. చాలా మంచిగా చూసుకుంటాడు. ఐదుగురు పిల్లల్ని కూడా కంటారు. కేశవ్ భిక్షగత్తె లక్ష్మి దగ్గరికి వచ్చి ధనలక్ష్మి, భూషన్‌బాబుల ప్రేమ విషయం అంతా చెప్తాడు. నిజం తెలుసుకున్న ఆమె బూషన్‌బాబును కేశవ్ మరదలు ధనలక్ష్మి ఇష్టమా? భిక్షగత్తె లక్ష్మి ఇష్టమా? అని అడిగితే 'నాకు నా లక్ష్మి అంటేనే యిష్టం, ధన్నూ! నా లక్ష్మివి నువ్వే, ధన్నూ!' అంటాడు.

ఈ నవలలో స్త్రీని కేశవ్ లాంటి పురుషులు ఎలా ఇబ్బందుకు గురి చేస్తారో చూడవచ్చు. ఇతడు డబ్బుకోసమే స్త్రీని నానా రకాలుగా హింసిస్తూ ఉండేవాడు. అయినా ఆత్మహత్య చేసుకునే ముందు ధనలక్ష్మి నా చావుకు ఎవరూ కారణం కాదనే విషయాన్ని రాసిపెట్టి మరీ ఆత్మహత్య చేసుకుంటుంది. ఎంత క్షోభ అనుభవించినా, కేశవ్‌ను శిక్షించాలని మాత్రం అనుకోదు. అంటే ఎంత ఉదారంగా వ్యవహరించిందో మనం గమనించవచ్చు. ఈ నవలలో ధనలక్షి , భూషన్‌బాబుల లాంటివారి ప్రేమతోపాటు, కేశవ్ లాంటి పురుష అహంకార మనుషుల్ని చూడవచ్చు.

### 3.1.9. నవోదయం-1963

ఈ నవలను బొమ్మ హేమాదేవి (దేవీరమ) రాశారు. ఇందులో ఆరాధన ప్రధాన పాత్ర. వీరి తోబుట్టువులతో సహా ఎనిమిది మంది. వీరిలో నలుగురు ఆడవాళ్ళు. నలుగురు మగవాళ్ళు. రఘు, రాజేష్, రాకేష్, రవి, ఇంద్రాణి, సుభద్ర, సరమ వీరి కుటుంబం గౌరవ

మర్యాదలకు పుట్టినిల్లు. కాని వీరింట్లో అభిప్రాయాల్లో భిన్న వైరుధ్యాలు గలవాళ్ళు ఉన్నారు. కట్నాలకోసం పాకులాడి కట్నం కింద అత్తగారింటి నుంచి కారు కొనితెచ్చుకోవాలని అనుకునే రాకేశ్, అలాగే సరమ భర్త కట్నం కానుకల కింద పుట్టింటి నుంచి కారు తీసుకురావాలని ఒత్తిడి చేస్తాడు. నిజానికి ఈమెకు అలా కట్నం రూపంలో కారును తీసుకెళ్ళాలని లేదు. కాని పురుషాధిపత్య సమాజం కాబట్టి, ఆమె భర్త ఓత్తిడి వల్ల తప్పట్లేదు. ఆరాధన తండ్రి ఉన్నత భావాలు గల వ్యక్తి. తల్లి కూడ కొంతమేరకు అభ్యుదయ భావాలుగల వ్యక్తి. తన కొడుకు రాకేశ్ తన భార్యను కారు మీ అమ్మవారింటినుండి కచ్చితంగా తేవాలని పట్టుపట్టినప్పుడు, ఈమె మాత్రం తనకోడలును జాగ్రత్తగా చూసుకుంటుంది. కారు అవసరం లేదంటుంది. కోడలువైపే మద్ధతుగా నిలుస్తుంది.

రవి, వాళ్ళ నాన్న మాత్రం 'సమాజం' అనే సంఘంలో చేరారు. సమాజానికి ఏవి అవసరమో అవి అందిస్తూ, ప్రజలను చైతన్యపరుస్తూ, అన్యాయాలు, దుర్మార్గపు పనులు చేసేవారిని చట్టబద్ధంగా శిక్షపడేలా చేయడం వంటివి ఈ 'సమాజం' అనే సంఘం చేస్తుంది. చిరవకు ఆరాధన కూడా 'సమాజం'లో చేరుతుంది. అందులో ఎన్నో చైతన్యవంతమైన, ప్రగతిశీలమైన పనులు జరుగుతుంటాయి. కనుక ఆరాధనకు బాగా నచ్చుతుంది. ఈమె సమాజానికి వెళ్ళిన ఒకరోజు ఒకవ్యక్తి తన భార్యకు పిల్లలు పుట్టడం లేదని, మరో పెళ్ళి చేసుకోవడం కోసం తన భార్యను వదిలేస్తాడు. అప్పుడు ఆమె విషయాన్ని సంఘంలో చెప్తుంది. దాన్ని పరిష్కరించే దిశలో సమాజం పని చేస్తుంది. ఏవైపు నుంచి చూసినా స్త్రీయే నష్టపోతుంది. కనుక భర్త ఇంకో పెళ్ళిచేసుకునే స్త్రీకి భవిష్యత్తులో మొదటి భార్యకు జరిగే నష్టమే నీకు కూడా జరగవచ్చని నీవు గమనించాలని చెప్తారు. కారణం పిల్లలు కాలేదనే నెపంతో మొదటి భార్యను వదిలివేసినట్టుగానే నిన్ను కూడా వదిలేయడని నమ్మకం ఏమిటి? అని తెలియజెప్తారు. అప్పుడు ఇద్దరు స్త్రీల జీవితాలను బాగుచేసినట్టుగా మనం అర్థం చేసుకోవచ్చు.

ఆడవాళ్లకు చదువు వల్ల ఉపయోగం ఏమటనేది కూడా ఈ నవలలో చెప్పారు రచయిత్రి. ఉద్యోగం చేసేవాళ్ళు చేయవచ్చు. కొన్ని కారణాలవల్ల చేయలేని వారు సంసారాన్ని చదువు సంస్కారంతో చక్కబెట్టవచ్చు అని విషయాన్ని ఇందులో స్పష్టంగా తెలియజేశారు. అదేవిధంగా 'సమాజం' అనే సంఘం ఏర్పాటు చేసుకుంటారు. అందులోని సభ్యులందరూ కుల, మత, ధనిక, పేద అనే భేదం లేకుండా సమానమే అని నిబంధన కలిగి ఉంటుంది. సమాజంలో ఎవ్వరికి కష్టం వచ్చినా, చర్చించి పరిష్కార మార్గాలు చూపిస్తారు.

### 3.1.10. సూత్రధారి పాత్రధారులు-1964

ఈ నవలను బొమ్మ హేమాదేవి(దేవీరమ) రాశారు. 'పేదరికం' వల్ల ఎదురయ్యే సమస్యలు పడే పాట్లను ఇందులో చెప్పారు రచయిత్రి. "దారిద్ర్యం పుట్టి ఎన్ని యుగాలైందో కాని, దానికి చావు, మాకు బ్రతుకు లేకుండా పోతోంది." (దేవీరమ. సూత్రధారి పాత్రధారులు. పుట: 3). ఇందులోని పాత్రలు పద్మ వాళ్ళ అమ్మ, వాళ్ళ ఇద్దరు తమ్ముళ్ళు కేశవ్, విజయ్. ఇద్దరు చెల్లెల్లు సంధ్య, వింధ్య. వీళ్ళు ఏ పూట కాపూట జీవనం సాగిస్తుంటారు. అప్పులు చేస్తూ, వాటిని తీర్చుతూ, కొన్నిసార్లు ఉపవాసం ఉంటూ కాలగమనం చేస్తుంటారు. వాళ్ళ మామయ్య నెలకు వందరూపాయలు పంపుతాడు. అవి సరిపోయేవి కావు. వీరి చదువులకు, తిండికి పూర్తిగా సరిపోవు. కనుక ఇతరుల దగ్గర అప్పు తీసుకుంటుంటారు. అప్పు తీసుకొని తీర్చే క్రమంలో మార్గాలు వెతుక్కుంటూ బాధపడుతుంటారు. అప్పు ఎగ్గొట్టె మనస్తత్వం ఉన్నవారు కాదు. ప్రధాన పాత్ర అయిన పద్మకు మీరా అనే స్నేహితురాలు ఉండేది. ఆమె ధనవంతుల కూతురు. ఈమె సహాయం చేస్తానంటే కూడా తీసుకోరు. అప్పుగా ఇస్తానంటే కూడా ఒప్పుకోరు. మీరా నేరుగా పద్మవాళ్ల అమ్మ దగ్గరికి వచ్చీ మరీ అడుగుతుంది తన సహకారం తీసుకొమ్మని. కాని ఆమె వద్దని వారిస్తుంది. ఇప్పుడు నెలనెలా వస్తోన్న డబ్బు కూడా ఓ గొప్ప వ్యక్తి చేస్తున్న సహకారమే తల్లీ అని చెప్తుంది.

అప్పుడు సంధ్యా మన మామయ్యే ఆ డబ్బు పంపుతున్నారు కదమ్మా అని అడిగితే, అప్పుడు వాళ్ళ అమ్మ మామయ్య పంపినా అది సహకారమే కదమ్మా అని అంటుంది. అయినా ఆయన స్వయాన మేనమామ కాదమ్మ. నాన్నగారికి మంచి స్నేహితుడు. అతని పేరు కళ్యాణ చంద్రుడు, పెద్ద జమిందారు. నన్ను అతను సోదరిలాగా చూసుకునేవారు. అంతే అప్పటినుండి నేను అన్నయ్య అనటం, మీకు మామయ్యగా పరిచయం చేయటం జరిగిందని చెప్తుంది.

మీ నాన్నగారు చనిపోయాక మన ఇంట్లోనే ఉండి మనందరిని కంటికి రెప్పలా చూసుకునేవారు. కాని అతని అభిమానాన్ని, ఆదరణను లోకం అపార్థం చేసుకొని నిందలు వేయడం ప్రారంభించింది. “లోకం నాకు గంజినీళ్ళయినా ఇవ్వనిమాట నిజమే అయినా, వారి సహాయ సహకారాలు పొందితే రకరకాల పేర్లు మాత్రం ఇస్తుంది.”(హేమాదేవి, బొమ్మ. సూత్రధారి–పాత్రధారులు. పుట: 13) ఫలితంగా ఆయన ఊరుని వదిలిపెట్టి వెళ్ళాల్సి వచ్చింది. వాటన్నింటికి భయపడి ఆ జమిందారు బంగళాలోంచి బయటకు వచ్చిన తర్వాత అసలు సమస్య మొదలవుతుంది. కుటుంబాన్ని పోషించడం చాలా కష్టమైంది. ఒంటిమీద బట్టలు తప్ప ఏమీ లేకుండా బయటకు అడుగుపెట్టారు పద్మ కుటుంబం. ఆ బాధలన్నింటి గురించి చెప్తూ పద్మ అమ్మ ఇలా అంటుంది. “ఆ భయాందోళనలలో మనిషి ముఖ్యమైన అవసరాలకు బ్రతుక్కు పనికివచ్చే వాటినే మర్చిపోయి వచ్చాను. నాకు కావల్సింది మానం, అభిమానం, కీర్తి, ప్రతిష్ఠ, గౌరవం. ఇవి బ్రతుక్కు ప్రాణాలు నిల్చేందుకు పనికిరావని ఆ మూడు రోజుల్లోనే తేలిపోయింది. నాల్గవనాడు మిమ్మల్ని ముందుంచుకొని ఏడుస్తూ కూర్చున్నాను. అంతకన్నా ఎంకేం చేయలేని నా అసమర్థతపై, బలహీనతపై, కట్టుబాట్లు నీతి నియమాలపై ఏడుస్తూ కూర్చున్నాను.” (దేవీరమ. సూత్రధారి–పాత్రధారులు. పుట: 12). అప్పుడు ఆ మామయ్య వీళ్ళను వెతుక్కుంటూ వచ్చి సహాయం చేస్తానంటాడు. కాని పద్మ అమ్మగారు ఒప్పుకోరు. చివరికి అప్పుగా తీసుకుంటానని ఒప్పుకుంటుంది. కొన్ని రోజులు పద్మ, సంధ్య ట్యూషన్స్ చెప్తూ కాలం వెళ్ళదీస్తుంటారు. పద్మ పుట్టినప్పుడే పద్మను ఆమె మామగా జమీందారైన కళ్యాణ చంద్రగారు అతని కొడుక్కు ఇచ్చి పెళ్ళి చేయాలని

అంటుండేవారు. పద్మ వాళ్ళ అమ్మ ఆమెకు విషయాలన్నింటిని చెప్పి పెళ్ళికి ఒప్పిస్తుంది. కాని అప్పటికే పద్మ వేరొక అతన్ని ప్రేమిస్తుంది.

అతడు రిక్షా తొక్కుతూ జీవనం గడుపుతున్నానని చెప్తాడు. కాని అది నిజం కాదని తర్వాత తెలుస్తుంది. అది నాటకంలోని ఒక రిహార్సల్ కోసం చేసానని చెప్తాడు. పద్మ కూడా కళాశాలలో ఒక నాటకంలో పాత్ర కోసం ధనవంతురాలిగా నటిస్తుంది. వీరు ధనిక, పేద ఇవేవి పట్టించుకోకుండా ఒకరికి తెలియకుండా ఒకరు ప్రేమించుకుంటారు. చివరికి ప్రియచరణ్ పద్మను ప్రేమిస్తున్నానని చెప్తాడు. కాని అప్పటికే పద్మకు పెళ్ళవుతుంది జమీందారి మామయ్య కుమారుడితో. కాని ఇక్కడ విషయం ఏమిటంటే ఈమె ప్రేమిస్తున్న ప్రియచరణ్ జమీందారు కుమారుడైన శ్రీనివాసులు ఒకరే. కాని పద్మకు తెలియదు. అలాగే నేను పెళ్ళి చేసుకుంది మా అత్తయ్య కూతురు పద్మను(బాంధవి) అని. ఎందుకంటే పద్మ పేరు 'బాంధవి' అని తప్పు చెప్పడంవల్ల గుర్తించలేకపోతాడు. బాంధవినే ప్రేమించడంవల్ల పద్మను పెళ్ళి చేసుకునేటప్పుడు ఆమె ముఖం కూడా చూడడు. పెళ్ళి తర్వాత కూడా ఒకేగదిలో ఉన్నా బాంధవి మనసులో ఉంచుకొని తెరచాటున ఉంటాడు. చివరకు బాంధవికోసం తలుచుకుంటూ అనారోగ్యం పాలవుతాడు ప్రియచరణ్. చివరకు మీరా ద్వారా అసలు విషయం తెలుస్తుంది. నిజాలు తెలిసిన తర్వాత ఒకరికొకరు ఆనందపడటం, ఆశ్చర్యపడటం జరుగుతుంది. దీనికంతటికీ కారణం భగవంతుడు అతడు సూత్రధారి, మనమందరం అందులో పాత్రధారులం. మన ప్రమేయం లేకుండానే అన్ని జరుగుతున్నాయని అనుకుంటారు. "ఆయనకు నమస్కరించు బంధూ! ఆయనే సూత్రధారి. మనం పాత్రధారులం... నమస్కరించు పద్మా! నీ అన్ని కోరికలు చాలా గమ్మత్తుగా తీరుస్తాడు. అసలు నీకు తెలియనే తెలియదు బంధూ, వారు నీ కోరికలు తీరుస్తున్నట్లు. ఏం తమాషా భగవంతుడనుకున్నావ్! అని భగవంతునివైపు ప్రేమగా, చనువుగా, ఆత్మీయంగా, కృతజ్ఞతగా, భక్తి భావంతో చూస్తూ అన్నారు వారు. ఆ రకంగానే నేను వారివైపు చూస్తూ ఉండిపోయాను." (దేవీరమ. సూత్రధారి–పాత్రధారులు. పుట: 143). ఇంతటితో నవల ముగుస్తుంది.

పేదరికంతో బాధపడే వారికి, అందులో మగదిక్కు(కుటుంబ పెద్ద)లేని కుటుంబానికి ఎవరైనా నిస్వార్థంగా సేవ చేస్తే, వారి మధ్య లేనిపోని అక్రమ సంబంధాలు అంటగట్టడం అర్థంలేని మనుషులు చేసే పని. ఈ నవలలో అదే జరిగింది. ప్రతిదాన్ని లోకం దృష్టితో చూస్తే బతకడం కష్టమనే విషయం అర్థమవుతుంది. అదేవిధంగా ఇందులో నిజమైన ప్రేమ కూడా కనిపిస్తుంది.

### 3.1.11. పొగమంచు-1976

ఈ నవలను బొమ్మ హేమాదేవి(దేవీరమ)రాశారు. అవని, భాస్కర్ భార్యాభర్తలు. వాళ్ళ ఆరేళ్ళ కాపురానికి సాక్ష్యంగా వారికి ఇద్దరు పిల్లలు. భాస్కర్ తన స్నేహితురాలైన రాగిణిని ఇంటికి తీసుకొచ్చి, అవనిని పరిచయం చేస్తాడు. క్రమక్రమంగా రాగిణి ఇంటికి వచ్చి వారితోనే ఉండటం మొదలు పెడుతుంది. రాగిణి పట్ల ప్రేమతో ఆమెకు అన్ని సమకూరుస్తుంది. భాస్కర్, రాగిణితో సన్నిహితంగా ఉండడం చూసిన అవని ఆత్మహత్యకు ప్రయత్నిస్తుంది. చివరి నిమిషంలో పిల్లలు గుర్తుకు రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటుంది. భాస్కర్ ప్రవర్తన మితిమీరడంతో అతనితో ఉండలేక ధైర్యంగా ఇంట్లోనుండి పుట్టింటికి వెళ్తుంది. అవని పుట్టింటికి వెళ్ళడంతో తట్టుకోలేని భాస్కర్ దిగులుతో అనారోగ్యం పాలై చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతాడు. భర్త ఆరోగ్యం గురించి తెలుసుకున్న అవని అతడిని చూడడానికి వచ్చి, అక్కడ రాగిణి ఉండటంతో తిరిగి వెళ్ళిపోతుంది. తన అవసరం కోసం వచ్చిన రాగిణి కూడా భాస్కర్ పరిస్థితి చూసి ఆమెదారి ఆమె చూసుకుంటుంది. అనారోగ్యం పాలైన భాస్కర్ చివరకు తనవారంటూ దగ్గర లేకపోతే ఎంత నరకమో తెలుసుకొని, అవనిని కలుసుకోవడంతో నవల ముగుస్తుంది.

ఈ నవలలో భాస్కర్, అవని, రాగిణి పాత్రల ద్వారా స్త్రీ మనోవేదనను రచయిత్రి చిత్రించారు. జీవిత భాగస్వామిని వేరొకరితో పంచుకోవడానికి ఏ స్త్రీ ఒప్పుకోదు. అందుకు బదులుగా తన ప్రాణం అడిగినా సంతోషంగా ఇస్తుంది. పురుషుడు తన భార్యతోపాటు తన జీవితాన్ని వేరొకరితో పంచుకోవడంతో స్త్రీ ఎదుర్కొన్న మానసిక సంఘర్షణే ఈ నవల.

### 3.1.12. బంగారు గూడు-1976

ఈ నవలను బొమ్మ హేమాదేవి(దేవీరమ) రాశారు. ఎక్కువమంది పిల్లలు ఉన్న పెద్ద కుటుంబం ఎలా ఉంటుందో 'బంగారు గూడు' నవలలో చూడవచ్చు. మధ్యతరగతి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కుటుంబ జీవితం చిత్రణ  ఇందులో ఉంటుంది. వచ్చిన జీతంతో ఏడెనిమిది మంది కుటుంబ సభ్యులు ఎలా జీవనం సాగిస్తారు. దేనికి ఎంత ఖర్చు చేయాలి మొదలైన విషయాలు మనకు ఇందులో కన్పిస్తాయి. ఇలాంటి కుంటుంబాలలో కొంత ఇబ్బంది ఉన్నా సంతోషంగా బతకగల్గుతారు. ఉన్నదానిలో హాయిగా ఉంటారు. కాబట్టి దీన్ని 'బంగారు గూడు' నవలగా పేరు పెట్టిందేమో రచయిత్రి బొమ్మ హేమాదేవి.

"ఔను పక్షినించి మనిషి కొన్ని నేర్చుకోగలిగితే బాగుంటుంది అనిపిస్తుంది కొన్నిసార్లు. ముఖ్యంగా పక్షి తన పిల్లలకు రెక్కలు వచ్చేంత వరకు మాత్రమే తన గూటిలో తన పిల్లల్ని ఉంచుకుంటుంది. మనం కూడా సెంటిమెంట్స్ లేకుండా పిల్లల్ని అలాగే పెంచగలగాలి. పిల్లలయినా సోమరితనాన్ని వదిలి యుక్తవయస్సు రాగానే తమ బాధ్యతల్ని తెలుసుకోగలగాలి. రెక్కలు రాగానే పక్షి పిల్ల తన ఆహారాన్ని తానే సంపాయించుకుని తనూ ఓ కొత్తగూడు నిర్మించుకున్నట్టుగా మనిషి అట్లాగే ఉండగలగాలి ఋషి అన్నాడు." (హేమాదేవి, బొమ్మ. బంగారు గూడు. పుట: 208). ఈ నవలలో ఎక్కువమంది కుటుంబ సభ్యులున్న కుటుంబంలో ఎటువంటి సమస్యలు ఉంటాయి. ఎలా మెలగాలి. పిల్లల పెంపకం వారికి స్వయం ప్రతిపత్తి కలిపించేలా పెంచాలి తప్ప ఒకరిపై ఆధారపడేట్టుగా సున్నితంగా పెంచకూడదనే విషయాన్ని ఇందులో గమనించవచ్చు.

### 3.1.13. మనస్విని-1976

బొమ్మ హేమాదేవి ఈ నవలను రాశారు. దీనిలో రాఖీపౌర్ణమి గొప్పతనాన్ని పేర్కొన్నారు. అనాదిగా సంప్రదాయంగా వస్తున్న రాఖీపౌర్ణమినాడు తోబుట్టువులకు ఇచ్చే కానుకలను నిరసించారు. అన్నదమ్ములకు ఇచ్చే స్థితిలో ఉన్నప్పుడు తీసుకొని, ఇవ్వని స్థితిలో ఉన్నప్పుడు బాధపడటం ఎందుకని, కేవలం కట్నాలు, కానుకలు, చీరలు, సారెలు, నగలకు

బదులుగా మీ ఆదరాభిమానాన్ని, ఆత్మీయతను, అనురాగాన్ని, ప్రేమను కానుకలుగా కట్నాల రూపంలో ఇవ్వమని కోరుతుంది విజయ.

ప్రభు, విష్ణు, విజయ రసిక వీరు దాదాపు రెండు, మూడు సంవత్సరాల వయస్సు వ్యత్యాసంతో జన్మించారు. వీరికి పెళ్ళి వయస్సు రాగానే పెద్దోడైన ప్రభుని పెళ్ళి చేసుకోమని అంటారు. ముందు చెల్లెల్ల పెళ్ళి, ఆ తర్వాత చేసుకుంటానంటాడు. కాని మొదటి చెల్లైన విజయ పెళ్ళి చేసుకోనని కరాఖండిగా చెప్తుంది. ఈమెకు తోడుగా తన చిన్నన్నయ్య విష్ణు కూడా సంపాదించలేనివాడు పెళ్ళి చేసుకోలేడు. కొంత స్థిరపడ్డాక పెళ్ళి చేసుకుంటానని చెప్తాడు. దాంతో చిన్నదైన రసిక పెళ్ళి, ప్రభుపెళ్ళి జరిపిస్తారు. విష్ణు నవలలు, కథలు రాస్తూ తన జీవనోపాధిని చూసుకుంటాడు. ఇతను రాసిన నవలకు వీరాభిమానినని చెప్పుకొని మనస్విని అనే అమ్మాయి విష్ణు ఇంటికి వస్తుంది.

మరుసటి రాఖీపౌర్ణమి నాటికి రసిక పుట్టింటికి వస్తుంది. తను అత్తగారింట్లో పడే బాధలను తన అక్కతో పంచుకుంటుంది. పండగ ఎప్పటిలాగానే వైభవంగా జరుపుకుంటారు. ఒకరోజు రసిక భర్తైన మధు మరియు ప్రభు భార్య మాటల్లో భాగంగా ఎంత అన్నా చెల్లెలైయితే మాత్రం ఇంతగా రాసుకుపూసుకు తిరగాలా వయస్సు పెరిగినకొద్దీ వారి హద్దుల్లో ఉండటం మంచిదని మాట్లాడుకుంటారు. అయితే ఇది విన్న విజయ అన్నయ్యలిద్దరికి దూరంగా ఉంటుంది. బెంగతో నెలరోజులపాటు జ్వరం వస్తుంది. ఈమెతో పరిచయం పెంచుకోవడానికై మనస్విని రోజు వచ్చి, విజయకు ఆరోగ్యం కుదుటపడేలా సేవలు చేస్తుంది. తన చిన్నన్నయైన విష్ణు రాసిన నవలలకు అభిమానిగా వచ్చిన మనస్విని విజయ కుటుంబంతో కలిసిపోతుంది. విజ్జి ఆరోగ్యం కుదుటపడేవరకు వాళ్ళ అన్నయ్య విష్ణుతో కలిసి బావ ఊరికి వెళ్ళాలనుకుంటారు. బావ ఊరికి వచ్చిన తరువాత విజ్జి ఆరోగ్యం కుదుటపడటంతోపాటు అక్కడి వంటమనిషి అయిన నీలాతో పరిచయం పెరుగుతుంది. ఎప్పుడు ఖాళీగా ఉండని నీల ఏదో ఒక పని చేస్తూనే ఉంటుంది. కాని ఆమె గుండెలో ఎంతో తెలియని బాధ కనిపిస్తుంది. చిన్నతనంలోనే పెళ్ళి అయింది. భర్త చనిపోతాడు. ఇరవై

సంవత్సరాలు దాటకముందే ఆమె విదవగా మారింది. విజ్జి తనలో తాను మాట్లాడుకుంటూ మానవుడు సృష్టించిన ఈ సంప్రదాయాలు, పద్ధతుల వలన మానవుడే విలవిల కొట్టుకుంటున్నాడు. ఈ బాధలు, దుఃఖాలను అధిగమించి ఎప్పుడూ సుఖంగా ఉండే ప్రయత్నాలు చేయలేమా అనుకుంటుంది. ఎందుకంటే తన ఇష్టం లేకపోయినా అమ్మ చెప్పిన మాటలు విని పెద్దన్నయ్య వంశం నిర్వంశం అవుతుందని పెళ్ళిచేసుకొని, పెళ్ళికన్నా ముందున్న ప్రశాంతతను, స్వేచ్ఛను పోగొట్టుకున్నాడు. అలాగే పెద్దవాళ్ళ మాట జవదాటగూడదనే అభిప్రాయంతో చెల్లెలు రసిక పెళ్ళి చేసుకొని ఎన్నడూ ఎరుగని బాధలు పడుతుంది. చెల్లెలి ప్రేమకు విలువ ఇస్తూ చిన్నన్నయ్య విచారపడుతున్నాడు. వదిన మాటలకు విలువనిస్తూ తను అశాంతి పాలయ్యాను. ఇవన్నీ చూస్తున్న అమ్మ విచారపడుతుంది. చిన్నన్నయ్య కోరుకున్న మనస్విని బాధపడుతుంది. పనిమనిషి నీల బాధపడుతుంది.

ప్రయత్నిస్తే బాధలన్నీ దూరం కాలేవా? ఎందుకు కావూ? తప్పకుండా అవుతాయి. ధైర్యం, మనోనిబ్బరం, చాతుర్యం, మంచితనం అనే గుణాలున్నప్పుడు అని అంటుంది విజ్జి. అంతలోనే ఉత్తరాలు వస్తాయి. అందులో రసికా విజ్జికి రాసిన ఉత్తరంలో తను అత్తగారింట్లో ఇప్పుడు బాగానే ఉంటున్నానని, తనను అందరూ బాగా చూసుకుంటున్నారని చెప్తూనే ఇందుకు కారణాలుగా రాఖీపౌర్ణమినాడు మధు(రసిక భర్త) మన ఇంటికి వచ్చినప్పుడు నువ్వు సరదాగా మాట వరసకు వదినతో రసికకు యాభైవేల రూపాయలు ఇస్తారన్న మాట గావచ్చు. అంటూనే అది అబద్ధం అని తెలిసిననాడు ఎంత బాధలు భరించాల్సి వస్తుందో అని, అలాగే మనస్విని చిన్నన్నయ్యను ఇష్టపడుతున్నారు. పెళ్ళికూడా చేసుకుంటారని ఇక్కడ వార్తలు వినబడుతున్నాయి. కాని మనస్విని వాళ్ళకు రెండవ భార్యకు పుట్టిందట. చిన్నన్నయ్య ఆమెను చేసుకుంటే లోకం ఏమంటుందో అని వ్రాసి ఉంది.

ఆ ఉత్తరంలో ఇదంతా చదివిన విజ్జి తిరిగి ఉత్తరంలో రసిక అత్తగారింట్లో సుఖంగా ఉన్నందుకు సంతోషపడ్తూ అతను చెప్పిన అబద్ధం ఎప్పటికీ బయటపడదు. నీకు డబ్బు వస్తుందనే భావనలో వాళ్ళు బతుకుతారు. నీవేమి బయపడాల్సిన అవసరం లేదు అని

మనస్విని విషయంలో తన కుటుంబ పరిస్థితిని వివరిస్తూ మా నాన్నకు ఇద్దరు భార్యలు. మన కుటుంబంలో జరిగిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆడది చేస్తే ఒక న్యాయం, మగాడు చేస్తే ఒక న్యాయమా? నీవు లోకం దృష్టితో చూసి భయపడి అలా అంటున్నావు. కాని రసికా ఇలాంటివన్నీ అందరికీ తెలిసేలా మనమే చెప్పాలి, ఆదరించాలి. అప్పుడే స్త్రీ, పురుషుడు సమానమైన న్యాయాన్ని, హక్కును పొందగల్గుతారు. న్యాయం, ధర్మం, నీతి అందరికీ ఒక్కటే అని ఉత్తరంలో రాస్తుంది. ఒకరోజు మనస్విని తన అన్నయ్య శంతన్ తీసుకొని బాపూరికి వస్తుంది. ఇక్కడ విజయను శంతన్‌కిచ్చి వివాహం చేయాలనుకుంటాడు చిన్నన్నయ్య. కాని ఈ పెళ్ళికి పెద్దన్నయ్య, అమ్మ ఒప్పుకోవాలి కదా! అనే సందేహన్ని వ్యక్తపరుస్తారు. మనస్విని శంతన్‌ల తల్లి ఒకటేనని తండ్రులు మాత్రం ఇద్దరు. ఈ విషయం మన పెద్దవాళ్ళకు తెలిస్తే ఒప్పుకోరు. అంతలోకే చిన్నన్నయ్య చూడు చెల్లి మనస్విని తల్లి చేసిన నేరం ఏమిటి? అపరాధం ఏమిటి? శంతన్ పుట్టిన కొన్ని నెలల్లోగా తనభర్త చనిపోతే, ఆ పదిహేడేళ్ళ వయసులో పాడుతోవలు తొక్కకుండా చక్కగా ఇంకో పెళ్ళి చేసుకుంది. యవ్వనంలో పొంగులు పొర్లుతున్న వయసులో ఆమె మానసికంగా మలినం కాకుండా ధైర్యం ఇంకో వ్యక్తిని వివాహం ఆడింది. నిజంగా ఆమె ధైర్యానికి మెచ్చుకోవాలి. దానికి బదులు యిలా కించపరుస్తున్నారు. నీతి, నిజాయితీ ఉంటే ఏమిటి సరిగ్గా తెలియని వాళ్ళకే ఇలాంటివన్నీ తప్పుగా తోస్తాయ్ అని అంటాడు. ఇంతలోగా ఒక పెద్ద వయస్కుడు వృద్ధుడు వీళ్ళ ఇంటికి వచ్చి నీల గురించి ఆరా తీసి హెచ్చరిస్తాడు. నీల మీ ఇంటి రమ్యయేనా. నా మనుమడు నీలను ప్రేమించాను, పెళ్ళి చేసుకుంటాను అంటున్నాడు. అంతేగాక ఆమె విధవ అని కూడా తెలిసింది అంటూ హెచ్చరిస్తాడు. జాగ్రత్తగా ఉండండీ. దీనికి సమాధానంగా చిన్నన్నయ్య(విష్ణు) నీలని కోరుకుంది మీవాడు కాబట్టి, మీరు జాగ్రత్తగా ఉండాలని చెప్తాడు. మీరు అంతగా ఇష్టపడితే వారికి పెళ్ళి చేయమని కోరుతాడు. అంతేగాక వాళ్ళు ఒకరు విడిచి మరొకరు ఉండలేకపోతే ఉంపుడుగత్తెగా ఉండమని వృద్ధుడంటాడు. ఇదే అనాదిగా వస్తోన్న ఆచారం అంటాడు. మనుషులు మారినప్పుడు ఆచారాలు కూడా మారాలని విశ్వం అంటాడు. కాని పెద్దాయన వినకుండా కోపంగా అక్కడి నుండి వెళ్ళిపోతాడు.

కొంతకాలానికి నీలని ప్రేమించిన భరత్ శాంతన్ కలిసి డబ్బు తీసుకెళ్తాడు. ఇదంతా చూసిన విజయ శంతన్ నిలదీస్తుంది. మొన్నటివరకు వారికి భయపెట్టి ఇప్పుడు వీరికి డబ్బులు ఎందుకిస్తున్నావో అంటే అతను వీరిద్దరు ఒకరంటే ఒకరు పంచప్రాణాలు, ప్రేమ ఉన్నాయి. కాబట్టి పట్నం వెళ్ళి పెళ్ళి చేసుకొని కొంతకాలం గడిపి తిరిగి రమ్మన్నాను అని సమాధానమిస్తాడు. ఇంతలో మనస్విని నీలకోసం కాలువ దగ్గరికి ఒక సంఘటన ఎదురవుతుంది. ఆ విషయాన్ని అన్నయ్య శాంతన్‌తో చెప్పినప్పుడు శాంతన్ జరిగిన సంఘటన వివరంగా చెప్తాడు. ఒక జంటకు పెళ్ళై ఐదుసంవత్సరాలు దాటిన పిల్లలు పుట్టరు. దాంతో వారి ఇంట్లో వాళ్ళు ఒత్తిడి పిల్లలు లేక వంశం నిర్వంశం అవుతుందనే కారణాల వల్ల రెండవ పెళ్ళికి సిద్ధమవుతారు అంటూనే భర్త ఇంకో పెళ్ళి చేసుకోవడం భార్య అదృష్ట, దురదృష్టాల కిందకు వస్తుంది. అదే మళ్ళీ భార్య అట్లాంటి పనేదైనా చేస్తే అపరాధం, అవినీతి, అధర్మాలై కూచుంటాయి. భర్త సవతిని తెస్తే, భార్య ఆ పద్ధతిలోకి అలవాటు పడాలి. అలాగే భార్య వల్ల ఏదైనా జరిగితే, భర్త చేతిలోకి కత్తి వచ్చినా అది సబబుగానే కనిపిస్తుంది. ఆడవాళ్ళలో ఐకమత్యం లేకపోవడం వల్ల ఇన్ని అనర్థాలు. ఒకసారి పెళ్ళైన స్త్రీవైపు పురుషుడు కన్నెత్తి చూడడు. అలాగే మరి ఆడవాళ్ళు నలుగురు పిల్లల తండ్రినైనా ఎందుకిష్టపడాలి. ఎంగిలి వస్తువుని చూచినట్టు స్త్రీ కూడా పెళ్ళైన పురుషుల్ని ఎందుకు చూడదు? ఎంతసేపు సవతులు సవతులు పోట్లాడ్తారేం. కాని వాళ్ళకీ తగవులు తెచ్చిపెట్టిన మొగుడ్ని వాళ్ళ జీవితాలు నాశనం కావటానికి మూల కారకుడైన భర్తను భార్యలు పూజింపబడటంలో అసలు తప్పెవరిది అంటుంది విజయ.

ఇక్కడ ఈ నలుగురు కలిసి ఉంటున్న సంగతి తెలిసే పెద్దన్నయ్య, అమ్మ బాధపడుతుంటూ రోజులు, వారాలు, నెలలు గడుస్తుంటాయి. వీరింట్లో ఒక్కరు సంతోషంగా ఉండలేదు. విష్ణు ఈ బాధలో చాలామంచి నవలలు రాసి పేరుప్రతిష్టతలు సంపాదిస్తాడు. కాని సంతోషంగా ఉండలేదు. తాగుడుకు బానిస అవుతాడు. ఇదంతా భరించలేని విజ్జి వాళ్ళ అమ్మతో ఇలాగే ఇంక కొన్ని రోజులు గడిస్తే మన చిన్నన్నయ్య మనకు ఇంకా ఉండదు. లోకంతో మనకు పనేంటి బయటి ప్రపంచంకోసం మన అన్నయ్యను మనం

చంపుకుంటామా! వాడికి మనస్విని ఇచ్చి పెళ్ళి చేద్దామని అడుగుతుంది. అందరు ఒప్పుకోవడంతోపాటు శంతన్‌తో విజ్జి వివాహం కూడా నిశ్చయమవుతుంది. చిన్నన్నయ్య రాసిన నవలను 'మనస్విని' అనే శీర్షిక ప్రకటించి పబ్లికేషన్స్ వేయడానికి బయలుదేరడంతో ఈ నవల ముగుస్తుంది.

ప్రేమ పెళ్ళిళ్ళు లోకంతో సంబంధం లేకుండా జరగాలి. అప్పుడే ఒకటవ్వాల్సినవారు జీవితాంతం సంతోషంగా ఉంటారనే విషయాన్ని ఇందులో చూడవచ్చు.

### 3.1.14. సంసార బంధం-1976

ఈ నవలను బొమ్మ హేమాదేవి రాశారు. పార్వతి కుటుంబాన్ని ఎంతో నేర్పుగా నెట్టుకొస్తూ భర్తే దైవంగా భావించిన స్త్రీ. ఈమె భర్త సుబ్బారావు. ఒంటరిదైనా సుబ్బారావు తల్లి వాళ్ళతోపాటు కలిసి ఉండడానికి కొడుకు దగ్గరకు వస్తుంది. ఆమె రావడం ఇష్టంలేని సుబ్బారావు తప్పించుకోవాలని చూస్తాడు. కాని పార్వతి అతడికి సర్ది చెప్పుతుంది. సుబ్బమ్మ ఆ ఇంటికి వచ్చినప్పటి నుండి పార్వతిని సూటిపోటి మాటలతో ఆడిపోసుకుటుంది. కొడుకుకి పార్వతి మీద లేనిపోని అబద్దాలు చెప్తుంది. తల్లి మనస్సు ఎరిగిన సుబ్బారావు ఆమె మాటలు పట్టించుకోక భార్యను వెనకేసుకొస్తాడు. అది జీర్ణించుకోలేని సుబ్బమ్మ పార్వతికి అక్రమ సంబంధం అంటగడుతుంది. పార్వతిని ఇంటినుండి వెళ్ళగొట్టాలి అనుకున్న సుబ్బమ్మ, కొడుకుకి మరో పెళ్ళి చేయడానికి పూనుకుటుంది. పార్వతి సంసారం గురించి తెలుసుకున్న ఆమె తమ్ముడు గోపాల్, అత్తగారినుండి అక్కను కాపాడుకోవడానికి తను ప్రేమించిన ప్రతిమను, సుబ్బారావుకి సన్నిహితంగా ఉండమని నాటకం ఆడిస్తాడు. ఈ నాటకం గురించి తెలియని సుబ్బమ్మ ప్రతిమను తన కొడుక్కి చేసుకోవడానికి ఒప్పుకుంటుంది. తన కొడుకును పెళ్ళి చేసుకోవాలంటే సుబ్బమ్మను ముందు ఇంట్లో నుండి వెళ్ళిపొమ్మంటుంది. ప్రేమగా చూసుకునే కోడలు పార్వతిని ఇంట్లో నుండి వెళ్ళగొట్టడం కోసం, తన కొడుకుకు రెండో పెళ్ళి చేయడం కోసం, ప్రతిమ పథకం తెలియని సుబ్బమ్మ ఆమె కోరిక ప్రకారం తానే ఇంట్లో నుండి వెళ్ళిపోతుంది. చివరకు అత్తగారిని ఇంటినుండి పంపిచడానికి భర్త, తమ్ముడు, మరదలు పథకం ప్రకారం నాటకం ఆడారని తెలుసుకున్న పార్వతి సంతోషిస్తుంది.

ప్రతిమ, సుబ్బారావు ప్రేమించుకున్నట్టు నాటకమాడినా పార్వతి ఎదురించి అడగదు. అర్థం చేసుకుంటుంది. ఓపిక పడుతుంది. పార్వతి చిన్నప్పటి స్నేహితుని(మహేశ్)తో సన్నిహితంగా ఉన్నా సుబ్బారావు అర్థం చేసుకుంటాడు. ఈ నవలలో భార్యాభర్తల మధ్య నమ్మకం ముఖ్యం అనేది చెప్పదలిచారు రచయిత్రి.

### 3.1.15. వైతరణి ఒడ్డున వయ్యారి-1977

**రచయిత పరిచయం:** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం జాజి జమాల్పూర్ గ్రామానికి చెందినవారు. ఇతని పూర్తిపేరు అబ్రహం. ఇతను 'భరత్ కుమార్' అనే కలం పేరుతో దాదాపు 23 నవలలకు పైగా రచించారు. ఇతని భార్య శాంత. ఇతను పి.యూ.సి వరకు చదివిన తర్వాత 1970 శక్కర్ నగరంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో క్లర్కుగా పని చేశారు.

**రచనలు**: ఆశోపహతులు, రక్తాశ్రువులు, పవిత్ర హృదయులు, మనిషి, మహాకాలం, మంచికి మెట్లెక్కడ, మధుర స్వప్నం, కలలు–కన్నీళ్ళు, డాక్టర్ సురేఖ, అమృతం కురిసిన రాత్రి, ప్రేమ–ప్రతీకారం, ఎడారి కుసుమం, చైతన్య తరంగాల్లో స్త్రీ, వైతరణి ఒడ్డున వయ్యారి, కళా జలతారు, ప్రతీకారం వంటి మొదలైనవి 23 నవలలు రాశారు. ఆనాటి సామాజిక వస్తు నేపథ్యంతో అనేక నవలలు రచించాడు. స్త్రీ అభ్యుదయ భావాలతో వారి రచనలు కొనసాగాయి. స్వేచ్ఛా జీవన వైవిధ్యాన్ని వివరించారు. ఆర్థిక, రాజకీయ అంశాలను అందులోని వ్యాపార ధోరణులను ఈ నవలలు వెల్లడిస్తాయి.

**వస్తువు**: సమాజంలో తల్లిలేని ఆడపిల్ల జీవితం ఎలా ఉంటుందో చాలా చక్కగా ఈ నవలలో వివరించబడింది. ఇందులోని ప్రధాన పాత్ర, కథానాయకురాలు కల్పన. తండ్రి సంరక్షణలో ఏ లోటు లేకుండా పెరిగింది. మాతృప్రేమకు సమానమైన ప్రేమను తన తండ్రి కల్పనకు అందించాడు. కాని యవ్వనంలో తన తల్లిచాటున ఉండే అవసరం ఉంది. కాని తల్లిలేదు. 'తొలి యవ్వన దశ మాధుర్యమైనదేగాక చాలా భయంకరమైనది కూడా. ఆ దశలో కిశోర బాలికల్ని కట్టుదిట్టాల్లో, కఠినమైన నిబంధనలలో వుంచటం తల్లిదండ్రుల ప్రాథమిక కర్తవ్యం.

వికసిస్తున్న యవ్వనం, రేకులు విప్పుకుంటున్న శరీర భాగాలు ఆలోచనల్ని బంధించి, అనుభూతుల కోసం అదేపనిగా ప్రేరేపిస్తుంటాయి. ఈ విషయం ప్రతి స్త్రీకి తెల్సు కనుక మాతృమూర్తి అయిన స్త్రీ తన ఆడపిల్లల విషయంలో తొలియవ్వనంలో పాదం మోపినప్పుడు చాలా కఠినంగా వ్యవహరిస్తుంది. ఒక కంట ప్రతిక్షణం కనిపెడుతూ, ఏ మాత్రం స్వేచ్ఛగా విహరించకుండా కట్టుబాట్లలో వుంచుతుంది. కుమార్తె హావాభావాల్ని, మస్తిష్కంలో కదులుతుతున్న ఆలోచనల్ని, ఆంతర్యంలో వుదయిస్తున్న అతృప్తవాంఛల్ని పసికట్టి మృధువుగా, హృదయం గాయపడకుండా మందలిస్తుంది.'(భరత్ కుమార్. వైతరణి ఒడ్డున వయ్యారి. పుట: 19, 20). ప్రతి మనిషిలో యవ్వనంలో అనేక భావోద్రేకాలు ఉండటం సహజం. ఆ సమయంలో పెడదారి పట్టకుండా మార్గదర్శనం చేసేవాళ్ళు ఉండాలి. అప్పుడే సరైన మార్గంలో జీవితం సాగుతుంది. కల్పనకు అమ్మ లేకపోవడం, నాన్న అతిగారాభంగా పెంచి యవ్వనంలోని విషయాలను ఆలోచించకపోవడం వంటివి కల్పనను విచ్చలవిడిగా ఆలోచించేటట్లుగా చేశాయి. చదువుకునేవారికి తల్లిదండ్రుల తరువాత గురువే దైవంగా భావిస్తారు. కాని కల్పన కాలేజీ చదువుతున్న సమయంలో అధ్యాపకుడు ఆమె ప్రవర్తనను ఆసరాగా తీసుకొని కాటువేశాడు. తండ్రిలాగా చూడాల్సిన గురువే కాటువేయడంతో కల్పన జీవితంలో చాలా నీచమైన సంఘటనలు ఎదురయ్యాయి.

కాలేజీ సమయంలో సూర్యనారాయణ లెక్చరర్ పరిచయంతో కల్పన పూర్తిగా వేరేలోకంలోకి వెళ్ళిపోయింది. మందలించాల్సిన గురువు ఆమెను స్వాధీనపర్చుకున్నాడు. ఎక్కడికైనా వెళ్ళి పెళ్ళి చేసుకుందామని చెప్పి, ఆమెను లొంగదీసుకొని పట్టణం తీసుకెళ్ళి కల్పన తెచ్చిన నగలు, డబ్బులు ఖర్చు అయిపోయాక ఆమెను వదిలివెళ్తాడు. అప్పటినుంచి కల్పన జీవితం అంధకారంలోకి వెళ్తుంది. వేశ్యగా మారటంతో ఆమె జీవితం నాశనం అవుతుంది. తద్వారా ఒక అమ్మాయి పుడుతుంది. ఆమెను ఆనాధ శరణాలయంలో చేర్పిస్తుంది. ఎలాగు జీవితం పక్కదారి పట్టడంతో చేసేది లేక ఆలాంటి వృత్తినే ఎంచుకుని సుఖ జీవితాన్ని గడపుతూ మద్యానికి అలవాటు పడుతుంది. చివరకు సుఖరోగాల బారిన పడి మరణిస్తుంది. అభ్యుదయ భావాలు కలిగిన తన బాల్య స్నేహితుడికి తన కూతురు బిందును,

తన ఆస్తిని వీలునామాగా రాసి మరణిస్తుంది. స్త్రీ యవ్వన దశలో వచ్చే మార్పులను, కోరికలను, ఉద్రేకాలను ఆధీనంలో ఉంచుకోకపోవడం వల్ల వచ్చే సమస్యలను ఈ నవలలో చిత్రించారు. ఒక స్త్రీ జీవితం తల్లి లేని కారణంగా కూడా ఎన్ని బాధలు పడాల్సి వస్తుందో ఈ నవల ద్వారా భరత్ కుమార్ వివరించాడు.

### 3.1.16. ప్రేమించకు పెళ్ళవుతుంది-1978

ఈ నవలను బొమ్మ హేమాదేవి రాశారు. ఇందులో ప్రధాన పాత్రలుగా స్వప్న, శ్రీరాం, కస్తూరి, రత్నారావులు. వీరంతా కాలేజీలో మంచి స్నేహితులు. వీరి ముగ్గురి మధ్యే కథ ఎక్కువగా నడుస్తుంది. రత్నారావు వ్యక్తిత్వం మంచిది కాదు. తన సుఖం కోసం ఏమైనా చేయాలనుకుంటాడు. నలుగురిని వెంటేసుకొని తిరగడం అలవాటు. శ్రీరాం మంచి వ్యక్తి, ఆత్మాభిమానంతో బతికే వ్యక్తి. స్వప్న కూడా మంచి వ్యక్తే. కాని రత్నారావు వలలో పడి బాధపడుతుంది. శ్రీరాం స్వప్నను అమితంగా ప్రేమిస్తాడు. కాని లేనిపోనివి అన్ని కల్పించి శ్రీరాంను స్వప్న ప్రేమించకుండా ద్వేషించేందుకు ఉపాయాలు వెతుకుతూ ఉంటాడు రత్నారావు. ఇక చదువు విషయంలో రత్నారావు కాపీ కొట్టి పాసవ్వాలనుకుంటాడు. శ్రీరాం కాస్త చదివి ఉత్తీర్ణుడయ్యేవాడు. స్వప్న మాత్రం మంచిగా చదివేది.

విద్యార్థుల ఎన్నికల సమయంలో శ్రీరాం, రత్నారావు పోటీకి దిగుతారు. వీరి స్నేహితులంతా రెండు గ్రూపులుగా విడిపోతారు. ఒకరికి మించి ఒకరు ఎన్నికల ప్రచారం చేసుకుంటారు. రత్నారావు ఎత్తుగడలు వేసి శ్రీరాం మంచివాడు కాదని అందరికి ప్రచారం చేస్తూ నమ్మబలుకుతాడు. కాలేజీలో చెడుపనులు చేస్తూ శ్రీరాంపై మోపుతాడు. స్వప్న రత్నారావు మాటలు నమ్మి అమితంగా ప్రేమించే శ్రీరాంను ద్వేషిస్తుంది. శ్రీరాం ఎంతగానో బాధపడతాడు. చివరకు ఎన్నికల్లో రత్నారావు గెలుస్తాడు. అప్పటినుండి శ్రీరాం తాగటం మొదలు పెడతాడు. కారణం ఎన్నికల్లో దుర్మార్గుడైన రత్నారావు గెలవడం, తను ప్రేమించే వ్యక్తి స్వప్న తనను అపార్థం చేసుకోవడం వల్ల ఇలా తయారవుతాడు. శ్రీరాం ఉండే అద్దెగది

పక్కనే కస్తూరి ఉండేది. ఆమె శ్రీరాంను బాగా ఇష్టపడ్తుంది. కాని శ్రీరాం స్వప్నను ప్రేమిస్తున్నాడు. కనుక కస్తూరితో ఏమీ చెప్పలేక తటస్థంగా ఉండిపోతాడు.

స్వప్న వాళ్ళ నాన్న లాయరు. స్వప్నకు, నాకు అడ్డు వస్తడనే కారణంతో రత్నారావు స్వప్న తండ్రిని చంపడానికి ప్రయత్నించి, రౌడీలను కూడా పురమాయిస్తాడు. కాని రత్నారావు కాకుండా వేరేవాళ్ళు స్వప్న తండ్రిని చంపుతారు. ఆ సంఘటనకు తట్టుకోలేని తల్లి పిచ్చిదవుతుంది. చంపినవాళ్ళు స్వప్న చిన్నాన్న వాళ్ల కుటుంబీకులు అని చివరకు తెలుస్తుంది.

స్వప్న శ్రీరాంను దూరంగా పెట్టడంతో, రత్నారావు ఇదే అదును చూసుకొని స్వప్నకు దగ్గరై, ఆమె తండ్రి దగ్గరి ఒక కేసుకు సంబంధించిన దస్త్రాలను కూడా ఇవ్వమంటాడు. ఇక తట్టుకోలేని స్వప్న తండ్రికి విషయం చెప్తుంది. చిన్నప్పటినుండి తనను ఏమీ అనని అతను తిడతాడు. అది భరించలేక యాసిడ్ తాగి చనిపోవాలనుకుంటుంది. ఆ సమయానికి శ్రీరాం ఆమెను కాపాడతాడు. చివరకు రత్నారావు దగ్గర స్వప్న మోసపోయినట్లు తెలుసుకొని బయటపడి శ్రీరాం దగ్గరకు వస్తుంది. శ్రీరాంతో నేను గర్భవతిని అని కూడా చెప్తుంది. అయినా శ్రీరాం ఏం అనడు. తన గదిలోనే ఉండమంటాడు. అలా ఉన్నప్పుడు రత్నారావు గురించి మొత్తం చెప్తుంది. చివరకు స్వప్న తన మేనత్త కొడుకువే నీవే అని శ్రీరాంతో అంటుంది. శ్రీరాం ఆశ్చర్యపోతాడు. ఇన్నాళ్ళు చెప్పకపోవడానికి కారణమేమంటే నీవు ఎలాంటి వాడివో తెలుసుకుందామని చెప్పలేదంటుంది. రత్నారావుతో ఉండటం వల్ల కూడా గర్భం వచ్చింది కూడా అబద్ధమే. నీ ప్రవర్తన తెలుసుకోవాలని అలా చెప్పాను అని స్వప్న అంటుంది. రత్నారావు చేసిన దుర్మార్గపు పనులకు పెద్ద శిక్ష పడాల్సిందే. కాని స్వప్న సాటి ఆడదైన కస్తూరి జీవితం గురించి ఆలోచించి సాక్ష్యాలు అన్ని చెప్పకుండా తక్కువ శిక్షతో బయటపడేలా చేస్తుంది. కారణం కస్తూరిని రత్నారావు పెళ్ళి చేసుకోవడమే. ఇంతటితో నవల ముగుస్తుంది. ఎవరైతే గాఢంగా ప్రేమిస్తారో, ప్రేమించుకుంటారో వారికి ఎటువంటి

అవాంతరాలు ఎదురైనా, కొంత సంయమనం పాటించి, ఇబ్బందులను తట్టుకుంటే తర్వాతి జీవితం సుఖమయంగా ఉంటుందనేది ఈ నవల సారాంశం.

### 3.1.17. కళా జలతారు-1978

ఈ నవలను భరత్ కుమార్ రాశాడు. ఇందులో ప్రధాన పాత్ర సునంద(నందిత). ఈమె తండ్రి ప్రభుత్వోగి. ఆమె తల్లి వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంటుంది. తద్వారా ఆమె తండ్రిని అడ్డు తొలగించుకోవడం కోసం చంపుతారు. తల్లితో అక్రమ సంబంధం పెట్టుకున్న వ్యక్తి సునందను కూడా చెరచడానికి, శారీరక వాంఛతో ఎగబడతాడు. అప్పుడు ఆమెతో ప్రేమగా ఉండే సుబ్బారావు దగ్గరికి వెళ్తుంది. సునంద అందంగా ఉంటుంది. ఒకానొక సందర్భంలో నువ్వు అందంగా ఉంటావు, సినిమాల్లో నటించవచ్చు కదా అంటాడు సుబ్బారావు. ఇంట్లో గొడవ భరించలేక బయటకు వచ్చిన నన్ను నువ్వు మద్రాసుకు తీసుకెళ్ళు, సినిమాల్లో నటిస్తాను అని అంటుంది. అతను తెలిసిన వ్యక్తి చిరునామా కనుక్కొని తీసుకెళ్తాడు. అక్కడికి వెళ్ళిన తర్వాత సిని ప్రపంచంలోని జీవితం ఎలా ఉంటుందో వారికి అర్థమవుతుంది. అవకాశాలు దొరికేదాకా పూరిగుడిసెల్లో గడపడం, ప్రొడ్యూసర్ల, డైరెక్టర్ల శారీరక వాంఛను తీర్చాల్సి వస్తుంది. అయినా తప్పని పరిస్థితుల్లో అక్కడే ఉండాల్సి వస్తుంది. ఎందుకంటే తిరిగి ఇంటికి రాలేని పరిస్థితి. కనుక అక్కడే ఉంటానని సుబ్బారావుతో తెగేసి చెప్తుంది. సుబ్బారావు శ్రీరాం అనే వ్యక్తికి పరిచయం చేపించి తిరుగు పయణం పడతాడు. అక్కడ ఆమె అనేక ఇబ్బందులు పడి తన శరీరాన్ని పెట్టుబడిగా పెట్టి పెద్ద స్టార్ హీరోయిన్ అవుతుంది. ఎప్పుడైతే శారీరక వాంఛను తీర్చనని ఎదురు తిరుగుతుందో అప్పుడు ఆమెకు అవకాశాలు రాకుండా పాతాళానికి తొక్కేస్తారు. సినిమా జీవితం ఎలా ఉంటుందో ఈ నవల ద్వారా తెలియజేశారు రచయిత.

### 3.1.18. నవరసాలు-1979

ఈ నవలను బొమ్మ హేమాదేవి రచించారు. ఇందులో అమ్మా, నాన్న తొమ్మిదిమంది పిల్లలు ఉంటారు. వారి పేర్లు వరుసగా రజిని, అరవింద, అఖిల, అజయ్, అలక్, మోతీ,

శేఖర్, ఆనంద్, అనిత. ఇందులో రజని, అఖిల కవల పిల్లలు. ఎవరు రజని? ఎవరు అఖిల? అని పోల్చుకోలేనంత దగ్గరగా ఉంటారు. రజని, అఖిల ఒకరికొకరు ప్రాణం ఇచ్చుకునేంతగా కలిసి మెలిసి ఉంటారు. రమేష్, రజని క్లాస్‌మేట్స్. రజని చలాకితనం, తెలివితేటలు నచ్చి రమేష్ ఆమెపట్ల ఆకర్షితుడవుతాడు. రజనికి కూడా రమేష్ నచ్చడంతో తల్లిదండ్రుల నిర్ణయం తెలుసుకొనేంతవరకు అతనికి దూరంగా ఉంటుంది. రమేష్ గురించి తెలుసుకుని వారి పెళ్ళికి ఆమోదం తెలుపుతారు. రజని, అఖిల కవలపిల్లలు కావడంతో ఇద్దరికి పెళ్ళిళ్ళు ఒకేసారి జరగాలని, అఖిలకు పెళ్ళి సంబంధాలు చూస్తారు. ఇంతలో రజనిని, అఖిలను పోల్చుకోలేని రమేష్ అఖిల అందానికి ముగ్ధుడై ఆమెను అనుభవిస్తాడు. దానితో రజని, రమేష్‌తో అఖిలను పెళ్ళి చేసుకోమని కోరుతుంది. అందుకు మొదట రమేష్ నిరాకరించినా, చేసిన తప్పును సరిదిద్దుకోవడానికి అఖిలతో పెళ్ళికి అంగీకరిస్తాడు. అందుకు సిద్ధంగాలేని అఖిల చదువుకోవాలనే నెపంతో మద్రాస్ వెళ్ళిపోతుంది. అక్కడ యూసఫ్ చూపే ఆదరణ వల్ల అతడికి ఆకర్షితురాలవుతుంది. కాని జరిగిన తప్పుని తలుచుకొని బాధపడుతుంది. వీరి ఆకర్షణ గురించి తెలుసుకున్న రమేష్ తనవల్ల జరిగిన తప్పును యూసఫ్‌కి చెప్పడంతో అతడు అఖిలతో పెళ్ళికి అంగీకరిస్తాడు. చివరకి రమేష్ ప్రోద్బలంతో రజనికి, రమేష్‌కి వివాహం జరగుతుంది.

వీరి కుటుంబంలోని శేఖర్ విధవరాలైన హరిజన అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని అనుకుంటాడు. ఆ అమ్మాయికి చిన్నతనంలోనే పెళ్ళి చేయడంవల్ల భర్త చనిపోయి వైధవ్యంలోకి వెళ్తుంది. తనవారంటూ ఎవరూ లేకపోవడం వల్ల అత్తవారింటిలో వారు పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటుంది. అప్పుడు ఎవరో ఆపారు. రెండవసారి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేసినప్పుడు ఈ శేఖర్ అడ్డుపడి ఇంటికి తీసుకువచ్చి పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. ఎప్పటిలాగే అందరూ సరే అన్నా, వాళ్ల అమ్మ మాత్రం ససేమీర కాదు అంటుంది. ఆమెను ఒప్పించే ప్రయత్నంలో వాళ్ళ నాన్న చాలా విషయాలను వాళ్ళ అమ్మకు వివరిస్తాడు. చివరకు పెళ్ళి చేసుకుంటాడు.

వీరి ఇంటిలో చిత్ర అనే అనాధ అమ్మాయి పెరిగి పెద్దదవుతుంది. ఆమె కూడా హరిజన అమ్మాయని తెలుస్తుంది వాళ్ల అమ్మకు. అప్పుడు చిత్ర గురించి ఎంతో బాధపడుతుంది. ఆమెను ఎవరు పెళ్ళి చేసుకుంటారని, కాని ఆనంద్ ముందుకొస్తాడు నేను చేసుకుంటానని. శేఖర్ హరిజన విధవ అమ్మాయి, ఆనంద్ చిత్రల పెళ్ళిళ్ళు ఒకేసారి జరుగుతాయి.

ఈ ఉమ్మడి కుటుంబంలోని అఖిల అనే అమ్మాయి వేరే మతం అబ్బాయి యూసఫ్‌ను పెళ్ళి చేసుకుంటుంది. ఈమె సినీపరిశ్రమలో పనిచేస్తుండగా యూసఫ్ అనే అతను పరిచయం అయ్యాడు. ఇతనికి ముందే పెళ్లై అనారోగ్య కారణాల వల్ల భార్య చనిపోతుంది. ఆమె హిందువు. వారు కూడా మత రహిత వివాహం చేసుకున్నారు. వారికి ఒక పాప ఉంది. ఆమె చనిపోయిన తర్వాత ఒంటరిగానే ఉంటున్నాడు. వారిమీద గౌరవం, ప్రేమ పెరిగి అఖిల అతన్ని పెళ్ళి చేసుకుంటుంది. ఇలా రకరకాలుగా పెళ్లిళ్ళు జరుగుతాయి.

ఈ నవలలోని చివరి సంభాషణ చూస్తే 'నవరసాలు' అనే పేరెందుకు పెట్టారో మనకు సులభంగా అర్థమవుతుంది. అంటే ఇందులో తొమ్మిదిమంది జీవితాలను వివిధ రకాల బాధలను అనుభవించారు. వివిధ రకాల పెళ్ళిళ్ళు కూడా చేసుకున్నారు. "సుఖ-దుఃఖాలతోను, నవరసాలతోను నిండినదే జీవితం. నా జీవితంలో అన్ని రసాలను అనుభవించాను. మన కుటుంబంలోని ఒక్కొక్కరు ఒక్కొక్క రసాన్ని కలిగించారు. నవరసాలను నేను చవి చూశాను." (హేమాదేవి, బొమ్మా. నవరసాలు. పుట: 195). అంటాడు వీరి తండ్రి. కుటుంబంలో తొమ్మిదిమంది పిల్లలు ఉంటే తొమ్మిది రకాలుగా ఆదర్శంగా ఉంటారు. కనుక ఈ నవలకు 'నవరసాలు' అనే పేరు రచయిత్రి పెట్టారు.

### 3.1.19. లవ్ స్టోరీ-1979

ఈ నవలను బొమ్మ హేమాదేవి రాశారు. ముగ్గురు ఆడపిల్లల తరువాత మగపిల్లాడు పుడతాడు అనుకున్న కాంతారావు దంపతులకు మళ్ళీ కూతురు పుట్టడంతో ఆమెను

కొడుకులాగా పెంచుతారు. రాధిక చూడడానికి అమ్మాయే అయినా ఆమె చేసే పనులు, ఆటలు, దుస్తులలో మగవాళ్ళ కంటే చాకచక్యంగా పెరుగుతుంది. రాధిక, ఆమె బావ అయిన సుధీర్ ప్రేమించుకుటారు. మేనరికం కావడంతో కాంతారావు కూడా వాళ్ళ పెళ్ళికి అంగీకరిస్తాడు. రాధికకు వేటాడే అభిలాష ఉండటంతో వేటకు వెళ్ళి అడువుల్లో చిక్కుకుపోతుంది. అక్కడ తమలాగే ఉన్న ముగ్గురు అన్నదమ్ములలో చివరివాడయినా విష్ణు ఆమెని ఆకర్షిస్తాడు. రూపంలో అబ్బాయి అయిన విష్ణు అమ్మాయిలా సున్నితంగా ఉంటాడు. రాధికకు విష్ణుపై జాలితోపాటు ప్రేమ కూడా కలుగుతుంది. అందరూ అతడిని చూసి ఈర్ష్యపడేలా, సంస్కారం గల వ్యక్తిగా మార్చాలని, తన బావ ప్రేమను త్యాగం చేసి విష్ణును పెళ్ళి చేసుకుంటుంది. ఆమె ఆలోచనలు కార్యరూపం దాల్చి, అతడిని ఉన్నతమైన వ్యక్తిగా మారుస్తుంది. చివరకు ఒక బాబుకి జన్మనిచ్చి, ఆ బాబు లోకం చూడకముందే కన్ను మూస్తుంది. చనిపోయిన రాధిక మళ్ళీ జన్మఎత్తి తనవారిని గుర్తించడానికి విష్ణు ఇంటికి వెళ్తుంది. అక్కడ తమ బాబు అయిన కిషోర్ ఆమెను ఆకలిగొన్న చూపులతో చూస్తాడు. తల్లిగా అది భరించలేని రాధిక అక్కడ నుండి వచ్చేస్తుంది. చివరకు తన బావ అయిన సుధీర్ ఆమె ప్రేమకు దూరమై ఒంటరిగా మిగిలిపోవడంతో, ఈ జన్మలో అతడిని కలుసుకోవడంతో నవల ముగుస్తుంది.

ఈ 'లవ్ స్టోరీ' నవల 'ప్రేమంటే నవలను పోలి ఉంటుంది. కేవలం పాత్రలు వేరు తప్ప కథ, కథనం అంతా యథాతథంగా ఉంటుంది. మధు అనే పాత్ర పేరు మాత్రం రెండింటిలోనూ ఒకటే. ఆ పాత్ర ద్వారా రెండు నవలలో కథ రాయిస్తుంది రచయిత్రి. 'ప్రేమంటే' నవలను చూస్తే 'లవ్ స్టీరీ' నవల పూర్తిగా అర్థమవుతుంది.

### 3.1.20. నడుస్తున్న కథ-1980

**రచయిత పరిచయం**: రాజీవ అసలు పేరు లక్ష్మీ వాసన్. ఈమె బి.ఎ. పూర్తిచేసి సమాజాన్ని మార్చాలనే లక్ష్యంతో జర్నలిజం కోర్సును పూర్తిచేశారు. "ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టమెంట్" విధులు నిర్వహిస్తున్నంత కాలం అక్కడ పొందిన అనుభవాలను ఈమె

రచనలుగా వెలువరించారు. ముఖ్యంగా ఈమె రచనా వ్యాసంగానికి ప్రధాన కారణం తల్లి చెల్లెల జీవితాలే ఆధారంగా చేసుకొని రచనలు కొనసాగించారు. అతి చిన్న వయసులో పెళ్ళిచేసుకొని భర్తను కోల్పోయిన తల్లి జీవితం, ఒక విధవగా తల్లి అనుభవించిన కష్టాలు, అవమానాలు ఈమెను కలం పట్టుకునేట్టు చేసాయి.

రాజీవ సమాజం, ప్రజల్లోని కష్టాలు, వారి జీవితాల్లోని ఆటుపోటులు అనుభవంలోకి రాకముందు ప్రేమ గీతాలను, స్నేహ గీతాలను రాశారు. ఈ గేయాలను 'కొత్త చిగుళ్ళు' అనే కవితా సంపుటిగా వెలువరించి, భావకవిగా తన రచన వ్యాసాంగాన్ని ప్రారంభించారు. తరువాత ఆమె రచనా వస్తువులోనూ, ఎంచుకున్న ప్రక్రియలోనూ, వ్యక్తీకరణలోనూ ఎంతో మార్పు వచ్చినట్టు "కొత్త చిగుళ్లు" అనంతర రచనలు పరిశీస్తే మనకు తెలుస్తుంది. రాజీవ తెలుగులో రాబందులు, విస్ఫోటనం అనే పేరుతో రెండు కవిత సంపుటాలను, 'లవ్ ఇన్ వన్' అనే ఆంగ్లంలో రచించారు. వీటిల్లో ప్రధాన వస్తువుగా ప్రజల చైతన్యాన్ని, స్త్రీ సమస్యలను వర్ణించారు. 'కొత్త నిజం', 'మనసు మంట' అనే రెండు కథా సంపుటాలను రాశారు. 'నడుస్తున్న కథ', 'రాబోవు తరం స్త్రీ' అనే నవలలను రాశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండిస్తూ, 'ధిక్కార' అనే వ్యాస సంపుటాన్ని వెలువరించారు. 2010లో మలిదశ ఉద్యమం జరుగుతున్న సమయంలో తెలంగాణ రచయిత్రులంతా కలిసి "గాయాలే.. గేయాలై" అనే కవితా సంపుటిని తీసుకొచ్చారు. ఈమె 1999లో ఉద్యోగ శిఖామణి అవార్డును, కవిత్వంలో అపురూప అవార్డుని అందుకుంది. తెలుగునేల మీద జరుగుతున్న మహిళ ఉద్యమాలకు బాసటగా, దీపదారిగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఒక మాస పత్రికను తీసుకొస్తున్నారు.

**వస్తువు**: రాణి బాల్య వితంతువు. పదహారేళ్ళకే పెళ్ళై భర్త మరణించే నాటికి ఇద్దరు బిడ్డలతో ఇరవై ఏళ్ళకు వితంతువు అయింది. మెట్రిక్ పాసైన రాణి తన బాబాయి సహాయంతో టైపు పరీక్షకు డబ్బులు కట్టి, రిజిస్ట్రార్ ఆఫీస్‌లో టైపిస్టుగా చేరుతుంది. ఈమెకు అత్తింటి నుండిగాని, పుట్టింటి నుండిగాని ఎవరు బంధువులు లేరు. ఉద్యోగంలో ప్రమోషన్

రావడంతో వేరే ఊరు వెళ్తుంది. అక్కడ ఒంటరిగా ఉన్న రాణికి కొద్ది రోజులు తోడుగా బాబాయి కొడుకు గాంగేయిని తెచ్చుకుంటుంది. అంతలో అతనికి చదువు పూర్తి అవడం, వెంటనే ఉద్యోగం రావడం, పెళ్ళి కావడంతో గాంగేయి వెళ్తు వెళ్తూ రాణికి మధును పరిచయం చేసి వెళ్తాడు. మధు ఆ పట్టణంలో చాలా పలుకుబడి కల్గినవాడు అవటంచేత అతడు తలచుకుంటే రాణిని వాళ్ళ బాబాయి ఉన్న ఊరికి బదిలీ చేయగలడు. అందుకోసం గాంగేయి ముందుగా మధుని పరిచయం చేసుకొని, ఆ తర్వాత రాణికి పరిచయం చేస్తాడు. ఆనాటినుండి మధు, రాణిల మధ్య పరిచయం పెరిగి, రాణి వాళ్ళ ఇంటికి తరుచు వస్తూ పోతుండేవాడు. రాణి అతని రాకను వారించకపోగా, అతనిపట్ల ఆకర్షితురాలవుతుంది. మధు రాణిని ప్రేమగా ఉండడంతోపాటు, పిల్లలని తండ్రిలా లాలించడం, ఆదరించడం, పిక్నిక్‌లకు తీసుకెళ్ళడం లాంటవి చేస్తూ వారికి దగ్గర అవుతాడు. ఒకనాడు క్షణికావేశానికి లోనై మధు, రాణిలు ఒక్కటవుతారు. దాంతో రాణి జరిగిన దానిగురించి చాలా బాధపడుతుండడంతో మధుకి పెళ్ళైందని, అంతేగాక తనకు ముగ్గురు పిల్లలున్నారని, తన భార్యతో విడాకులు తీసుకోవాలని అనుకుంటున్నానని చేప్పడంతో తన జీవితం ఒక మగవాడి చేతిలో నాశనం అయ్యిందని చాలా బాధపడుతుంది. కొద్దికాలం గడిచిన తర్వాత రాణి గర్భవతి అని తెలుస్తుంది. కాని రాణి లోకం దృష్టిలో వితంతువు. కాబట్టి తనకు పుట్టబోయే బిడ్డని కని, పెంచే ధైర్యం లేక అబార్షన్ చేయించుకుంటుంది. ఆనాటినుండి తన జీవితంలో జరిగిన సంఘటనాలన్నింటిని గురించి ఆలోచించి, ఆనారోగ్యంతో బాగా క్షీణించి మతిస్థిమితం లేక చివరికి పిచ్చిదవుతుంది. చివరకు మధు, రాణి పిల్లలని తన పిల్లలుగా చూసుకుంటానని మాట ఇచ్చి ఆమెను ఆస్పత్రిలో చేర్చడంతో ఈ నవల ముగుస్తుంది.

బాల్య వితంతువుగా సమాజం నుండి ఎన్నో సమస్యలను ఎదుర్కోన్న స్త్రీ ఇతివృత్తంగా రచయిత్రి నవల రాశారు. భర్తలేని స్త్రీని సమాజం చూసే చిన్నచూపు, అనుమానపు కోణాలు రాణిని చాలా ఇబ్బంది పెట్టాయి. చివరికి సమాజ కట్టుబాట్లకు ఎదురు నిలవలేక తనని తానే ఆహుతి చేసుకుంటుంది. సమాజం పరిస్థితులకు అనుగుణంగా ఒక మనిషిని అంచనా

వేయాలే తప్ప, ప్రతీ విషయాన్ని భూతద్ధంలో పెట్టి చూసి హింసించకూడదనే సందేశాన్ని రచయిత్రి ఇచ్చారు.

### 3.1.21. మహానంద-1983

**వస్తువు**: 'మహానంద' నవలలో కృష్ణవేణి తల్లిదండ్రులకు మూడో సంతానం. తండ్రి కష్టపడి తన ఇద్దరు పిల్లలకు పెళ్లిచేసినా, కృష్ణవేణి పెళ్ళి అతనికి పెద్ద సమస్య అవుతుంది. అప్పులు చేసి తన తాహతుకు మించి కృష్ణవేణికి పెళ్ళి చేస్తాడు తండ్రి. పెళ్ళి అయిన మొదటి రోజే కృష్ణవేణి భర్త ఆమెను అనేక చిత్రహింసలు పెడతాడు. తండ్రికి తెలిస్తే బాధపడతారని కృష్ణవేణి అతడి హింసను మౌనంగా భరిస్తుంది. అత్తావారింటికి వెళ్ళిన కృష్ణవేణి అక్కడ అనేక సమస్యలు ఎదుర్కోంటుంది. భర్త హింసను భరించలేక ఇంట్లోనుంచి వచ్చేస్తుంది. ఇల్లు దాటిన కృష్ణవేణికి నందన్ ఆశ్రయం కల్పిస్తాడు. అతని దగ్గరే ఉండి తనని తాను రక్షించుకోవడానికి కరాటే నేర్చుకుంటుంది. నందన్ ద్వారా అతని గత జీవితపు జ్ఞాపకాలు విని బాధపడుతుంది. నందన్, మహానందకు అప్పటికే పెళ్ళి అయి ఉంటుంది. హనిమూన్‌కి వేరే దేశం వెళ్ళడంతో అక్కడ నందన్ రోడ్డు ప్రమాదం జరిగి తీవ్ర గాయాల పాలవుతాడు. ఆ సమయంలో మహానంద తెల్ల జాతీయుడైన క్రిష్టియన్‌కి దగ్గరవుతుంది. దానితో నందన్ ఇండియాకు ఒంటరిగా తిరిగి వస్తాడు. నందన్ జీవితం గురించి తెలుసుకున్న కృష్ణవేణి అతనికి ఆకర్షితురాలు అవుతుంది. చివరికు నందన్‌ను వివాహం చేసుకొని సమాజానికి తనవంతు సహాయం చేస్తుంది.

పుట్టింటికి, అత్తింటికి దూరమై వేరేవారి పంచన చేరి అనేక బాధలు అనుభవించిన స్త్రీ ఇతివృత్తంగా రచయిత్రి ఈ నవల రాశారు. తనలాంటి వారి కోసం తన వంతుగా సాయం చేస్తుంది.

### 3.1.22. పిచ్చి మనిషి-1984

ఈ నవలను బొమ్మ హేమాదేవి (దేవీరమ) రాశారు. ఇందులో ప్రధాన పాత్ర విజయ. ఈమెకు పెళ్ళిచూపులు అనే తంతు బాగానే జరుగుతుంది. కాని పెళ్ళి కుదరదు. చివరకి ఒక

ప్రభాత్ అనే అబ్బాయితో పెళ్ళి కుదురుతుంది. పెళ్ళి తర్వాత వీరిరువురు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. విజయకు నవలలు చదవడం చాలా ఇష్టం. పెళ్ళి తర్వాత హైదరాబాదు వచ్చినప్పుడు వాటిని సర్దే క్రమంలో ఒక ఉత్తరం దొరుకుతుంది. అది విజయ తన ఇంటి దగ్గర షాప్ అంకుల్‌కు రాసిన ఉత్తరం. అందులో "అంకుల్ దయచేసి ఎప్పటిలా నాకు పుస్తకాలు పంపిస్తు ఉండండి. నాకు ఓ పది రూపాయలు కూడా కావాలి. నన్ను మీ కూతురుగా భావిస్తారని ఆశిస్తాను. మిగతావన్నీ మరచిపోండి" అని ఉంటుంది. అది చదివింది కూడా ప్రభాతే. అప్పటినుండి  అతనిలో అనుమానాలు మొదలయ్యాయి. వివరాలు అడగగా విజయ ఇలా చెప్తుంది. నిజమే నా చిన్నతనంలో జరిగిన సంఘటన అది. అంకుల్ చాలా ఇబ్బంది పెట్టేవాడు. తర్వాత నాకు అర్థమైనప్పటి నుండి అతని దగ్గరికే వెళ్ళడం లేదని చెప్తుంది. కాని ప్రభాత్ నమ్మే పరిస్థితుల్లో లేడు. చివరకు విజయను వదిలేసే వరకు వెళ్తాడు. ఆ సమయానికే అతని చెల్లెలు అటువంటి కారణంతోనే తన ఇంటికి వస్తుంది. అంటే పెళ్ళి కాకముందు ప్రేమించిన విషయం తెలియడం వల్ల ఆమె భర్త వెళ్ళగొడతాడు. అప్పుడు ప్రభాత్ తన చెల్లెలివైపు మాట్లాడి, బావను తిడతాడు. అతను మనిషా? పశువా?. కాని ప్రభాత్ తన భార్య విజయ విషయంలో చేసే తప్పును మాత్రం గుర్తించుకోలేకపోతాడు.

చివరకి విజయ కూడా వాళ్ల అమ్మవాళ్ళింటికి వెళ్తుంది. చాలా రోజుల తర్వాత ప్రభాత్ విజయకు ఉత్తరం రాస్తాడు. మనం కలిసుండలేమనిపిస్తోంది. కనుక విడాకుల పేపర్లపై సంతకం పెట్టి పంపించూ అని. దీనికి సమాధానంగా ప్రత్యుత్తరం రాయలేదు. చివరకు ప్రభాతే విజయ దగ్గరకు వస్తాడు. నిన్ను వదిలి ఉండటం నావల్ల కావడం లేదు. మనం ఇద్దరం కలిసుందాం అంటాడు. కాని విజయ నమ్మదు. ఎప్పుడూ ఎలా మారతావో, ఎప్పుడు నీకు ఏం గుర్తుకు వస్తుందో తెలియదు అని అంటుంది. ఇద్దరికీ ఒకరిపై ఒకరికి నమ్మకం ఉండాలి. లేకపోతే నేను కూడా నిన్ను పెళ్ళికి ముందట జరిగిన విషయాలపై ప్రశ్నలు వేయవచ్చు. నీకు కూడా అలాంటి అనుభవాలు ఉండవచ్చు కదా! అని అంటుంది. కనుక ఒకరిపై ఒకరికి నమ్మకం ఉండాలి. నన్ను ఈ విధంగా ఎప్పుడూ ఇబ్బంది పెట్టను

అంటే ఎక్కడికైనా వస్తానని అంటుంది. ఇద్దరు కలిసి హైదరాబాదుకు వెళ్ళిపోతారు. అదే సమయంలో ప్రభాత్ చెల్లెలు కూడా ఆమె భర్తకు దగ్గరకు వెళ్తుంది.

రచయిత్రి ఈ నవలలో భర్తల అనుమానాల వల్ల స్త్రీల పరిస్థితి తెలియజేశారు. ఒకవేళ తెలిసీ తెలియని వయసులో చేసిన తప్పులకు ఇంకా అనుమానిస్తూ భార్యను ఇబ్బందిపెట్టే మగవాళ్ళ గురించి, అదేవిధంగా ప్రేమ విఫలం వల్ల వేరే పెళ్ళి చేసుకున్నపుడు పెళ్ళికి ముందు ప్రేమ విషయాలను చెప్పమని ఇబ్బంది పెట్టే పురుషుల గురించి ఇందులో తెలియజేశారు. తప్పులు మగవారు కూడా చేస్తారు. కాని పురుషాధిక్య సమాజంలో స్త్రీని ఒక వస్తువుగా చూస్తూ అణచివేసే స్థితి మన సమాజంలో కనిపిస్తుంది. తప్పులు చేయకుండా జాగ్రత్త పడాలి తప్ప, తప్పులు జరిగిన తర్వాత వాటి గురించి అన్వేషిస్తూ తను బాధపడుతూ, ఎదుటివారిని బాధపెట్టడం ఏమాత్రం తగదని రచయిత్రి ఈ నవల ద్వారా తెలియజేసింది. భార్యాభర్తల మధ్య నమ్మకం ముఖ్యమని, ఏ విషయంలోనైనా ఇద్దరూ సహకరించుకుని అర్థం చేసుకొని, సమస్యలను పరిష్కరించుకోవాలి. అప్పుడే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని చెప్తుంది.

### 3.1.23. నర్తకి-1985

ఈ నవలను భరత్ కుమార్ రాశారు. ఇందులో ప్రధానమైన పాత్రలు చంద్రశేఖర్, సంధ్యారాణి. వీరిద్దరూ కళాకారులు. చంద్రశేఖర్ చిత్రలేఖకుడు, సంధ్యారాణి నాట్యంచేసే నర్తకి. వీరిరువురు ప్రేమించుకుంటారు. ఇందులో చంద్రశేఖర్ ధనవంతుడి కుమారుడు. సంధ్యారాణి బీదకుటుంబీకురాలు. తండ్రిలేని పిల్ల. వీరి ప్రేమను చంద్రశేఖర్ తండ్రి ఒప్పుకోడు. అంతేకాకుండా సంధ్యారాణిని, ఆమె తల్లిని ఊరు విడచి వెళ్ళాలని బెదిరిస్తాడు. చంద్రశేఖర్‌ను ఇంట్లో బందిస్తాడు. తట్టుకోలేని చంద్రశేఖర్ సంధ్యారాణికోసం ఇంట్లోంచి పారిపోయి వెతుకుతుంటాడు. కాని కనిపించదు. చంద్రశేఖర్ అన్న రాజశేఖర్ వీరిరువురు కవలలు. ఒకేలాగా ఉంటారు. చంద్రశేఖర్ యాక్సిడెంట్‌లో చనిపోతాడు. అతని మరణాన్ని తట్టుకోలేక అతని తండ్రి గుండెపోటుతో నేలకొరుగుతాడు. చంద్రశేఖర్ చనిపోయే ముందు సంధ్యారాణి గురించే ఆలోచించడం, ఆమెకు అన్యాయం చేశాను అని అంటాడు. రాజశేఖర్

వృత్తిరీత్యా డాక్టర్. ఒకరోజు యాక్సిడెంట్‌లో గాయపడితే సంధ్యారాణిని తన హాస్పిటల్‌కి తీసుకువచ్చి వైద్యం చేస్తాడు. కాని అప్పటికి కూడా ఆమె చంద్రశేఖర్ ప్రేమించిన సంధ్యారాణి అని అతనికి తెలియదు. ఆమె కోమాలోకి వెళ్ళి గతం కూడా మర్చిపోతుంది. నెమ్మదిగా కోలుకుని చంద్రశేఖర్ లాగే ఉన్న రాజశేఖర్‌ను చూసి చాలా సంతోషిస్తుంది. అప్పుడు రాజశేఖర్ చంద్రశేఖర్‌ను గుర్తుచేసుకొని అప్పటికే తన సహోద్యోగైన శోభారాణి తనను అమితంగా ప్రేమిస్తుంది. కాని సంధ్యారాణి తనను చంద్రశేఖర్ అనుకొని అమితంగా ఇష్టపడుతుంది. కనుక ఆమె ఏమైపోతుందోనని భయంతో, తమ్ముని ఆత్మశాంతికోసం ఆమెని వివాహం చేసుకోలేక తప్పలేదు. చంద్రశేఖర్, సంధ్యారాణిలకు ఒక బాబు పుడతాడు. ఆ బాబుని సంధ్యారాణికి తెలియకుండా బాబు పుట్టి చనిపోయాడని చెప్పి అనాథ శరణాలయంలో చేర్పిస్తారు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు పుడతారు. మగపిల్లవానికోసం ఆరాటపడుతుండగా రాజశేఖర్ అనాథశరణాలయంలో ఉన్న రవి(బాబు)ని తీసుకువస్తాడు. కాని సంధ్యారాణికి నిజం చెప్పడు. పెంచుకోవడానికి ఒక అబ్బాయికి తీసుకువచ్చాననే చెప్తాడు. కాని సంధ్యారాణి మాత్రం రాజశేఖర్‌కు, శోభారాణికి పుట్టిన అక్రమ సంతానంగా బావించి గొడవ చేస్తుంది. రవిని మంచిగా చూసుకోదు. హింసిస్తుంది. చివరికి ఆమెనే తల్లి అని నిజం తెలియడంతో ఆశ్చర్యపోయి రవి తన కొడుకు అని తెలిసి ప్రేమగా చూసుకుంటుంది. శోభారాణి మాత్రం రాజశేఖర్‌నే తలచుకొని బాధపడుతూ జబ్బుపడి మరణిస్తుంది.

దీనివల్ల ప్రేమ ఎంత గొప్పదో, ప్రేమ త్యాగం ఎంత గొప్పదో రచయిత ఈ నవలలో తెలియజేశారు.

### 3.1.24. స్వప్న ప్రియ-1986

వస్తువు: ఈ నవలను భరత్ కుమార్ రాశారు. ఇందులో సైన్స్ మానవ జీవితంలో ఎలాంటి పాత్ర పోషిస్తుందనే విషయాన్ని ఈ నవల తెలియజేస్తుంది. ప్రధానంగా విద్యుత్ మానవ పరిణామాన్ని ఏ విధంగా ప్రభావింతం చేస్తుందో ఇందులో కనబడుతుంది. ఇందులో ప్రధాన పాత్రలు శ్రీప్రియ, ప్రొఫెసర్ రాయ్, రవిచంద్ర, స్వప్నలు. శ్రీప్రియ గొప్ప రచయిత్రి. ఆమెకు

అనేకమంది అభిమానులున్నారు. చాలమంది ఉత్తరాలు రాయడం, ఇంటికి వచ్చి కలిసిపోవడం జరుగుతూ ఉంటుంది. ఒకనాడు రాంమోహన్ అనే అభిమాని వచ్చి పరిచయం చేసుకుంటాడు శ్రీప్రియతో. అప్పటినుండి అతనితో ప్రేమలో పడుతుంది. అతను మాత్రం పెళ్ళి కాకుండానే శారీరకంగా కలవడానికి సిద్ధపడతాడు. అప్పుడు శ్రీప్రియ ఏమాత్రం ఒప్పుకోదు. అతను శారీరక వాంఛకోసమే నా దగ్గరకు వచ్చాడని అర్థం చేసుకొని అతనితో సంబంధం తెంపుకుంటుంది. కాని అదే విషయాన్ని మనసులో తలచుకొని తీవ్రాతితీవ్రంగా బాధపడుతుంది.

శ్రీప్రియ తన బాధను మరచిపోవడానికి తన అభిమాని, స్నేహితురాలు అయిన విమల దగ్గరకి వెళ్తుంది. అక్కడ ప్రశాంతత లభిస్తుందనే ఆశతో. అక్కడ రవిచంద్ర అనే శిల్పకారుడు ఉంటాడు. అతని దగ్గర ఆమెకు మంచి కాలక్షేపం దొరుకుతుంది. కొంత మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. అతని ద్వారా సైన్స్ ప్రొఫెసర్ రాయ్ పరిచయం అవుతాడు. అక్కడికి వెళ్తే మీ ఆరోగ్యం బాగుపడుతుందని రవిచంద్ర చెప్పగా అక్కడికి వెళ్తుంది. ఆమెకు విద్యుత్ ద్రవాన్ని ఇచ్చి, హిప్నాటిజం ద్వారా నిద్రపుచ్చి గత బాధలను మరిచిపోయేలా చేసి ఆమెకు ప్రశాంతతను చేకూరుస్తాడు. ప్రొఫెసర్ రాయ్ చెల్లెలు స్వప్న, రవిచంద్ర ఇద్దరూ కళాకారులు. వీరిద్దరూ ప్రేమించుకుంటారు. ఆ విషయం శ్రీప్రియ ప్రొఫెసర్ రాయ్ ఇంటికి వెళ్ళిన తర్వాత శ్రీప్రియ ద్వారా రవిచంద్ర గురించి స్వప్న తెలియజేస్తుంది. విషయం అర్థమైన తర్వాత ఇద్దరు లేఖలు రాసుకుంటారు. రవిచంద్ర స్వప్నను చేరుకునే సరికి స్వప్న మెరుపు విద్యుద్ఘాతానికి బలై చనిపోతుంది. వీరిద్దరి ప్రేమ గురించి కూడా ఇందులో ఉంటుంది. రెండు జంటల ప్రేమ గురించి చెప్పాడు రచయిత. శ్రీప్రియ రాంమోహన్‌లది ఒకరకమైన ప్రేమ. అది విఫలమవుతుంది. రవిచంద్ర, స్వప్నలది ఒక రకమైనది. వీరిద్దరూ చిత్ర, శిల్ప కళాకారులు. ఇలా ప్రేమను గురించి చెప్తూనే సైన్స్ ఫిక్షన్ గురించి చెప్తాడు రచయిత. కళానైపుణ్యాలను వివరిస్తాడు.

### 3.1.25. గాయపడ్డ సూరీడు-2004

**రచయిత పరిచయం**: యాటకర్ల మల్లేష్ 25జూలై, 1964లో జన్మించారు. వీరి గ్రామం కేశ్‌పల్లి, మండలం జక్రాన్ పల్లి, జిల్లా నిజామాబాద్. వీరు ఎమ్.ఏ, ఎల్ ఎల్ బి చేశారు. వీరు జర్నలిజాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. ఉదయం, ఆంధ్రజ్యోతి, వార్త దినపత్రికలలో రిపోర్టర్‌గా పనిచేశారు. వీరు రాతి బొమ్మలు(కవితా సంపుటి), జనవరి 1995, అన్నలతో ఒకరోజు(వాస్తవ కథనం), అగస్టు 2001. అవార్డులు: ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు(సాహిద్ భగత్ సింగ్ అభిమాన సంఘం నుండి 1997లో, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు(వార్త ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా 1997లో, ప్రజా రక్షక అవార్డు(ఎస్.పి. శ్రీ శంకబ్రత బాగ్జీ గారి నుండి 2002లో, ఉత్తమ కథనాలకు ప్రశంసా పత్రం(వార్త మేనేజింగ్ ఎడిటర్ అండ్ సి.ఎండి. శ్రీ గిరీష్ సంఘీ గారినుండి 10జూలై 2003లో. 1983లో కేశ్‌పల్లిలో నవోదయ యూత్ క్లబ్‌ను ఏర్పాటు చేశాడు. 2001లో ప్రజా స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేశాడు. వీరు ప్రవృత్తిగా ఆయా సంస్థల ద్వారా అన్యాయాల్ని ఎదురిస్తూ కష్టాల్లో ఉన్న పేదవారి కన్నీళ్ళు తుడిచే ప్రయత్నం చేస్తుంటారు.

**వస్తువు**: 'గాయపడ్డ సూరీడు' నవలలో ప్రధానంగా 1980ల తర్వాత తెలంగాణలో దొరల, భూస్వాముల ఆగడాల వల్ల ప్రజలు ఎంత హింసను అనుభవించారో తెలుస్తుంది. ఆ హింసలోంచి యువత నక్సలైట్లుగా తయారుకావడం, అడవుల్లోకి వెళ్ళడం వంటివి జరిగాయి. నక్సలైట్లు, పోలీసుల మధ్య ప్రజానీకం ఎలా బాధపడిందో సవివరంగా ఈ నవలలో మనం గమనించవచ్చు. ముఖ్యంగా కేశ్ పల్లి ఊరి ప్రజల ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక వ్యవహారాలను ఈ నవల చిత్రించింది. అక్కడి పరిసర ప్రాంత గ్రామాలా వాతావరణం, దొరల, భూస్వాములు ఇతర కులస్థులపై చూపే వివక్షను చూడవచ్చు. గ్రామంలోని ప్రజలు దొరలు ముందు కనీసం చెప్పులు కూడా వేసుకోని తిరగలేని పరిస్థితి. ఇంకో ప్రధాన విషయం ఏమంటే ఇక్కడ దొరల ఆగడాలకు తట్టుకోలేక, తిండిలేక ప్రజలు దుబాయ్ లాంటి అరబ్ దేశాలకు వలసలు వెళ్ళడం కనిపిస్తుంది. అందులో ప్రధానంగా యువకులు ఎక్కువగా వెళ్ళేవారు. కారణం దొరల ఆగడాలను తట్టుకోలేక నక్సలైట్లు/అన్నలు ఊర్లలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపే దిశగా దొరలను, దళారులను మట్టుబెట్టడం

వంటి కార్యకలాపాలు చేయడం వల్ల, పోలీసులు కనిపించిన ప్రతి యువకున్ని అనుమానించి అన్నల గురించిన జాడ చెప్పమని చిత్రహింసలు పెట్టేవారు. కనుక యువత ఇక్కడ ఉండలేక, తిండి దొరకక బొంబాయి, దుబాయి వంటి ప్రాంతాలకు వలసలు వెళ్ళేవారు. అలా వెళ్ళడానికి కావాల్సిన డబ్బును ఊర్లోని వడ్డీవ్యాపారులు ఇచ్చేవారు. ఊర్లో ఏ ఇతర పనికో అయితే వడ్డీకి ఇవ్వనివారు దుబాయ్ వెళ్తామంటే మాత్రం ఇస్తారు. వడ్డీకి వడ్డి వసూలు చేసి ప్రజలను హింసించేవారు. "జిల్లాలో ముఖ్యంగా వాణిజ్య పంటలకు పేరుగాంచిన ఆర్మూర్ బెల్టులో వడ్డీ వ్యాపారులు, సంపన్న రైతులు ఒకటికి ఒకటిన్నర(డబ్బు), తులంకు తులంన్నర(బంగారం) చొప్పున యేడాదికొకసారి తిరిగి చెల్లించే ఒప్పందంపై అనేక మందికి పెట్టుబడి పెట్టారు." (మల్లేష్, యాటకర్ల(రచయిత), గాయపడ్డ సూరీడు. రామదాసు, బైస– ముందుమాట. పుట: 7).

దీన్నిబట్టి చూస్తే ప్రజల ఆర్థిక పరిస్థితి, వడ్డీవ్యాపారుల ఆగడాలు ఎలా ఉన్నాయో అర్థం అవుతుంది. మొత్తంగా ఈ నవల రచయిత యాటకర్ల మల్లేష్ తన జీవితంలోని అనుభవాలను ఈ నవల ద్వారా తెలియజేశారు. తాను దుబాయ్ వెళ్ళడం వల్ల అక్కడ నివసించే మన తెలంగాణ ప్రజల దీనగాథలను ఇందులో వాస్తవికంగా కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించారు."కల్పితాలకు తావులేకుండా, కఠిన సత్యాలు ఎప్పటికప్పుడు అక్షరాల రూపంలోనో, దృశ్యరూపంలోనో కళ్ళ ముందుంటున్న రోజులివి. మల్లేశ్ జర్నలిస్ట్ కావడంతో తన అనుభవాలన్నిటినీ అక్షరరూపంలో మన ముందుంచారు. ఎక్కడా తడబడలేదు. రాజీ పడలేదు. ఎవరి ముఖస్థితికో పాకులాడలేదు. నాకు తెలిసి ఇన్ని సంఘర్షణల మధ్య నలిగిన, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఒక జర్నలిస్టు, తెలుగులో పుస్తకరూపంలో తన కుల, మతాల వైషమ్యాల్ని, పేద, ధనిక తేడాల్ని చివరికి తాను పనిచేసే పెట్టుబడిదారీ పత్రికా యాజమాన్యాల నిజ స్వరూపాల్ని ఎండగట్టడంలో ఎక్కడా వెనుకాడలేదు. గ్రామీణుల అమాయకత్వం, వారి ఆప్యాయతలు, తోటివారికి చేతనైన సహాయం చేయాలనే వారి సంఘత్వాన్ని ఎలాంటి కృత్రిమత్వం లేకుండా వివరించారు. మల్లేష్ గురించి తెలిసినవారు ఆయన్ను నిత్యం మండుతున్న ఒక అగ్నిగోళంగా ఎరుగుదురు. కల్మషం లేదు, కపటం లేదు.

మనసులోది చెప్పడానికి సంకోచం లేదు.” (మల్లేష్, యాటకర్ల(రచయిత), గాయపడ్డ సూరీడు. రామదాసు, బైస–ముందుమాట. పుట: 8).

ఈ నవలలో తెలంగాణ గ్రామాల్లో దొరల, భూస్వాముల ఆగడాలను తట్టుకోలేక ప్రజల విసిగి వేసారిపోతున్న సమయాల్లో యువత నక్సలైట్లలోకి, లేదా విదేశాలకు వలస వెళ్ళడం వంటివి జరిగేవి. అందులో భాగంగా ఈ నవల రచయిత  వృత్తిరీత్యా జర్నలిస్టు అయిన యాటకర్ల మల్లేశ్‌కు కూడా నక్సలైట్లతో సంబంధాలు ఏర్పర్చుకొని, వారి గురించి, ప్రజల గురించి వార్తలను రాసేవాడు. నక్సలైట్లతో సంబంధాలున్నాయని పోలీసులు పెట్టే ఇబ్బందులను తట్టుకోలేక దుబాయ్ వెళ్తాడు. అక్కడ తెలంగాణ వలస జీవుల కష్టాలను ఈ నవల ద్వారా తన అనుభవాల రూపంలో ఈ నవలను వెలువరించారు.

### 3.1.26. జోగిని-2004

**రచయిత పరిచయం**: వల్లూరి శాంతి ప్రబోధ అక్టోబరు24, 1961లో రంగారావు, కల్పన అనే దంపతులకు ఏకైక సంతానంగా వరంగల్ జిల్లా పాలంపేట దగ్గర ఘన్పూరులో జన్మించారు. తండ్రి వృత్తి రీత్యా అదిలాబాదులో కొంతకాలం గడిపారు. ఇంటర్ నిజామాబాదులో పూర్తి చేశారు. తిరపతిలోని శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో జర్నలిజం కోర్సును, దూర విద్య ద్వారా కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ సోషియాలజీ, ఎం.ఎ. తెలుగును పూర్తి చేశారు. నిజామాబాదుకి చెందిన శ్రీనివాసరావుతో ఇరవైఐదు సంవత్సరాల వయస్సులో వివాహం అయింది. వివాహానంతరం నిజామాబాదులోని వర్ని గ్రామానికి వచ్చింది. ఇక్కడ ప్రసిద్ధ నాస్తిక ఉద్యమ నాయకులు లవణం దంపతులు జోగినీ వ్యవస్థ నిర్మూలనకుగాను ‘సంస్కార్’ అనే సేవా సంస్థను నిర్వహిస్తున్నారు. చదువుకునే రోజులనుండి సామాజిక సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తి ఉండడంతో శాంతి ప్రబోధ ఈ సంస్థలో చేరారు. సామాజిక కార్యకర్తగా ఎదిగిన వీరి రచన వ్యాసంగం తండ్రి రంగారావు నుండే అలవడిందని రచయిత్రి వివరించారు. ఈమె కథలు, నవలలు వ్యాసాలు రాశారు.

శాంతి ప్రబోధ నాస్తికోద్యమ నాయకులు స్వాతంత్ర్యానంతర కాలంలో సంఘసంస్కర్తలైన లవణం దంపతులతో కలిసి సామాజిక సేవారంగంలో కృషి చేశారు. అలా వారితో జోగిని దురాచార నిర్మూలన, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కాలంలోనే బాలల హక్కులకోసం పోరాడుతూ పొందిన అనుభావాల్నే 'భావవీచికలు' అనే పుస్తక రూపాన్ని 2004లో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్, ఆంధ్ర మహిళా సభ వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రచురించారు. అలాగే జోగిని నవల వార్తా పత్రిక 2004లో సీరియల్‌గా ప్రచురించబడింది. 2005లో ప్రజాశక్తి బుక్ హౌస్ వారు దీనిని పుస్తకంగా ప్రచురించారు. ఈ నవలకు 2006లో తెలుగు విశ్వవిద్యాలయం వారిచే సాహితీ పురాస్కారం, 2009లో వెంకటసుబ్బ అవార్డు(జస్టిస్ అల్లాణి కుప్పుస్వామి కుటుంబం అవార్డు), అలాగే 2014లో కందుకూరి నవలా వంటి పురస్కారాలు అందుకుంది.

జోగిని నవలలో కవిత, విద్య ప్రాణ స్నేహితులు. కవిత నిజామాబాదు జిల్లాలోని సిరిపురం అనే గ్రామానికి  చెందినది. విద్య విజయవాడకి చెందిన అమ్మాయి. శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో ఎం.సి.ఎ. కోర్సులో కవిత చదువుతుంది. ఇక్కడే ఉమెన్ డెవలప్‌మెంట్ స్టడీలో ఎం.ఎ.లో చేరుతుంది విద్య. వీళ్లిద్దరు రూమ్మేట్స్ కావడం వల్ల వారి మధ్య మంచి స్నేహం ఏర్పడుతుంది. పరీక్షలు పూర్తి కావడంతో ఒకరి నొకరు విడిచి ఉండలేక భవిష్యత్తులో కలుస్తామో లేదోనని కవిత వాళ్ళ గ్రామానికి విద్యని రమ్మని ఆహ్వానిస్తుంది. అందుకు ఒప్పుకున్న విద్య ముందుగా మా ఇంటికి వెళ్దాం అంటుంది. అలాగేనని ముందుగా విజయవాడకి వెళ్లి నాలుగు రోజులుండి ఆ తరువాత కవిత ఊరైన నిజామాబాదు జిల్లాలోని సిరిపురం వెళ్ళారు. కవిత వాళ్ల గ్రామంలో 'ఊరపండుగ'. అందరు ఆరు బయట నిద్రిస్తున్న సమయంలో విద్యకి డప్పుల మోత వల్ల నిద్రపట్టక అటువైపుగా వెళ్తుంది. ఊరి జనమంతా అక్కడే ఉంటారు. అక్కడంతా కోలాహాలంగా ఉంది. అక్కడ పొడవాటి జుట్టు విరబోసుకుని, చేతిలో కొరడాతో ఒక వ్యక్తి, ముగ్గురు స్త్రీలు, పది సంవత్సరాలున్న ఒక పాప డప్పుల మోతకనుగుణంగా ఆడుతున్నారు. ఒక మేకపోతు అలంకరించబడి అందంగా కనిపిస్తోంది. పట్టణంలో ఉన్న విద్యకి పల్లెలోని ఆచారాలు,

సంప్రదాయాలు తెలియవు. ఏమి జరుగుతోందని పక్కవారిని అడిగి తెలుసుకొని పల్లెల్లో సంప్రదాయలు, ఆచారాలు పేరిట జరిగే జంతు బలులను అసహ్యించుకుంటుంది. ఆ తరువాత రోజు రాజాగౌడ్ ద్వారా ఆ ఊళ్ళో ఆచారాల పేరిట జరిగే అన్ని విషయాలను అడిగి మరీ తెలుసుకుంటుంది. కాని రాజాగౌడ్ అన్నింటిని చెప్పి జోగిని వ్యవస్థ గురించి చెప్పకపోవడంతో తను ఎలాగైనా తెలుసుకోవాన్న కుతూహాలంతో ఆ ఊళ్ళోని జోగినుల దగ్గరకి వెళ్తుంది. అక్కడి పరిస్థితులు గమనించి, వీళ్ళు అభివృద్ధికి చాలా దూరంలో ఉన్నారని గ్రహిస్తుంది. అంతేగాక అక్కడి జోగినుల కుటుంబానికి చెందిన జోగు సాయవ్వ, జోగు పోశవ్వ ఈమె కూతురు సబితలను చూసి ఆ ఊర పండగలో నృత్యం చేసింది వీరేనని గుర్తించి వాళ్ల దగ్గరకి వెళ్ళి ముందుగా తన గురించి వివరించి, ఆప్యాయంగా వారితో మాట్లాడుతుంది. ఆ తరువాత జోగిని అంటే ఎవరు? అలా జోగినులుగా మార్చేదెవరు? అని వినయంగా అడిగింది. అందరూ హీనంగా, నీచంగా చూస్తూ అసహ్యంగా మాట్లాడే మాతో, మా బాగోగులు గురించి అడిగేసరికి వారి గుండెల్లోని బాధనంతా ఒకసారిగా విద్యతో చెప్పుకున్నారు. అక్కడ జోగు సాయవ్వ అన్ని విషయాలు చెప్తుంది. కాని పోశవ్వ మాత్రం విద్యను చీదరించుకుంటుంది. కారణం తమ జీవితాలను బయట పెట్టి, దానిద్వారా విద్య లాభపడుతుందని భయం.

జోగిని వ్యవస్థ గురించి తెలుసుకున్న విద్య అదే అంశం మీద పి.హెచ్.డి. చెయ్యాలని నిశ్చయించుకుంటుంది. జోగినుల గురించి తెలుసుకోవడానికి మొదటి రోజున విద్యను చీదరించుకున్న పోశవ్వ వారంరోజుల తరువాత విద్యపై గౌరవం పెంచుకుంటుంది. జోగిని వ్యవస్థపై పి,హెచ్.డి. చెయ్యాలనుకున్న విద్య తిరుపతికి వెళ్ళి తనకు ఎం.ఎ.లో పాఠాలు చెప్పిన భారతి మేడమ్ గారిని కలవడం, నవీన్ పరిచయం, ఒకరినొకరు ఇష్టపడడంతో వారికి పెళ్ళి జరుగుతుంది. నవీన్ ఉద్యోగరీత్యా అతడితోపాటు అమెరికా వెళ్ళిపోతుంది. రెండు సంవత్సరాల తరువాత పి.హెచ్.డి. చెయ్యాలనే ఉద్దేశ్యంతో ఇండియాకు తిరిగి వస్తుంది. సిరిపురం వెళ్ళి పోశవ్వను కలవగా అప్పటికే వారి జీవితాల్లో అనేక మార్పులు రావడం గమనిస్తుంది. వారి జీవితాల్లో గల మార్పుకి కారణం ప్రభుత్వ చొరవ, అమ్మ సంస్థ ఇచ్చిన

ప్రోత్సాహం అని తెలిసి అమ్మను కలవడానికి వెళ్తుంది. జోగినిల జీవితాలను బాగుపరచడానికి అమ్మ చేసే కార్యక్రమాలు తెలుసుకొని, పదిహేను రోజులపాటు అక్కడే ఉండి, చుట్టుప్రక్కన గల జోగినులతో మాట్లాడి తనకు కావలసిన సమాచారాన్ని సేకరిస్తుంది.

1995 ఎన్నికల్లో సిరిపురం గ్రామ పంచాయతీ జనరల్ మహిళలకు రిజర్వ్ చేయబడి ఉంటుంది. ఎస్.సి.ల ఓట్లు గెలుచుకోవాలనే ఉద్దేశ్యంతో జోగు పోశవ్వను తన అభ్యర్థిగా నిలబెట్టి తానే ఆధికారం చెలాయించుకోవాలనుకుంటాడు రాజాగౌడ్. చివరికి పంచాయితీ ఎన్నికల్లో గెలిచిన జోగు పోశవ్వ సర్పంచ్ అవుతుంది. సర్పంచుగా శిక్షణ తీసుకన్న పోశవ్వ గ్రామంలో అనేక సదుపాయాలు కల్పించి మంచి పేరు సంపాదించుకోవడంతోపాటు ఉత్తమ మహిళ ప్రతినిధిగా ఎన్నికవుతుంది. అలాగే మండల ప్రెసిడెంటుగా పోటి చేసి గెలుస్తుంది. పోశవ్వ గ్రామాలలో సమస్యలన్ని పరిష్కరిస్తూనే, మహిళల చైతన్యం కొరకు పోరాడుతుంది. పలు కార్యక్రమాలతో ఎల్లారెడ్డి మండలం జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక "నీరజా బానోత్ అవార్డు"కు ఎంపికవుతుంది. ఈ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న ఫోటోలను పలు జాతీయ, అంతర్జాతీయ పత్రికలు ప్రచురిస్తాయి. ఈ వార్తాను న్యూస్ న్యూయార్క్‌లో హ్యూమన్ రైట్స్ మహిళా విభాగంలో పనిచేస్తున్న విద్య ఇంటర్నెట్‌లో చూసి చాలా సంతోషిస్తుంది. పోశవ్వ అవార్డును అందుకున్నపుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 33 శాతం మహిళ రిజర్వేషన్ తన జీవిత గమనాన్నే మార్చిందని, మహిళలకు చేయూతనిస్తే వారు గొప్ప గొప్ప విజయాలను సాధించగలరని ప్రసంగించడంతో ఈ నవల ముగుస్తుంది.

'జోగిని' నవలను శాంతిప్రబోధ తెలంగాణ దళిత స్త్రీలు జోగినులుగా అనుభవిస్తున్న బాధలను స్వయంగా తిరిగి సమాచారం సేకరించి, జోగినీ వ్యవస్థ నిర్మూలన కోసం తనవంతుగా కష్టపడుతుంది. ఆ సమాచార ఆధారంగా నవలను రాస్తుంది. ఈ నవలలో ముఖ్యంగా దళిత స్త్రీల వర్ణనాతీతమైన బాధలను చూడవచ్చు. 'జోగిని' సంప్రదాయం ద్వారా దళిత స్త్రీలు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా పడిన బాధలను విశ్లేషిస్తూనే, వారు చైతన్యవంతమై ప్రజాప్రతినిధిగా ఎదిగిన తీరును కూడా మనం గమనించవచ్చు.

### 3.1.27. సృష్టిలో తీయనిది-2005

**రచయిత పరిచయం**: డా. అమృతలత 7జూలై, 1948న నిజామాబాద్ జిల్లాలో జన్మించారు. వీరు సృజనాత్మక రచయిత్రిగా, సంపాదకురాలిగా, విద్యావేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా దర్శనమిస్తారు. ఈమె శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో "రీడింగ్ కాంప్రహెన్షన్ ఆఫ్ X క్లాస్ స్టూడెంట్స్ ఇన్ తెలుగు లాంగ్వేజ్ స్టడీ" అనే అంశంపై పరిశోధనకుగానూ 2015లో డాక్టరేట్ పట్టా పొన్దారు. ఈమె విజయ్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూటుకు అధిపతిగా ఉంటూ విద్యను అందిస్తున్నారు. అమృతలత 'అమృత కిరణ్' పక్ష పత్రికకు రాసిన సంపాదకీయాల వ్యాస సంపుటిని "అమృత వర్షిణి" పేరుతో వెలువరించారు. సృష్టిలో తీయనిది(నవల), స్పందన(కథల సంపుటి), స్కూల్ పెట్టి చూడు(నాటికల సంపుటి) రాశారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు యెక్క విలువను, దాని ప్రాధాన్యతను తెలుపుతూ చేసిన రచన "ఓటేందుకు". అంతేకాకుండగా వీరు అనేక పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో "గాయాలే...గేయాలై" అనే కవితా సంపుటిని విడుదల 2010 లో చేశారు. ఇది పూర్తిగా తెలంగాణ రచయిత్రుల కవితా సంకలనం కావడం దీని ప్రత్యేకత. అదేవిధంగా "వేతలే...కథలై". అనే కథా సంకలనాన్ని 2011లో వెలువరించారు. ఇది కూడా తెలంగాణ రచయిత్రుల కథల సంకలనం. ఇవేగాక అపురూపం, అభినందన వంటి సావనీర్స్‌ను కూడా వెలువరించారు. ఈమె ప్రవృత్తి రచనా వ్యాసంగం.

ఇప్పటివరకు అనేక బాహుమతులు అందుకున్నారు. స్వాతి వారపత్రిక వారు ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల కోసం 1971లో నిర్వహించిన కథల పోటిలో "మనసు ఎదగని మనుషులు" కథానిక ఉత్తమ కథగా ఎంపికైంది. అలాగే ఎమెస్కో సాహితీ సంస్థవారు నిర్వహించిన పోటిలో "కన్నీళ్ళతో కాలక్షేపం" కథానికకు ప్రథమ బహుమతి లభించింది. సృజన మాస పత్రిక వారు చేపట్టిన కవితల పోటిలో "కూలి" ఉత్తమ కవితగా ఎంపికైంది. ఈమె సామాజిక కార్యకర్తగా, విజయ్ విద్యాసంస్థల తరుపున నిర్వహిస్తున్న విద్యాసేవకు ప్రతిఫలంగా అనేక అవార్డులు అందుకున్నారు. భరతముని ఆర్ట్స్ అకాడామీ,

శ్రీకాకుళం వారి ఆదర్శవనిత అవార్డును 1996లోనూ, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారాన్ని 2012కి గాను, ఐఐఐటిఆర్ఒడిడిడి, హైదరాబాద్ వారిచే ఉత్తమ విద్యావేత్త అవార్డుని 1999-2000 గా ఎంపికైయింది.

**వస్తువు**: సృష్టిలో తీయనిది నవలలో జయ, రజిత ఇద్దరు ప్రాణస్నేహితులు. కాలేజీ రోజుల్లో ఒకే హాస్టల్‌లో చదువుకున్నారు. సెలవుల్లో కూడా ఉత్తరాలు రాసుకోని ఒకరి గురించి ఒకరు వారి యోగక్షేమాలను, అనుభవాలను ఉత్తరాల రూపంలో తెలుసుకునేవారు. కాలేజీ చదువులు ముగిశాక ఒకరిని విడిచి ఒకరు ఉండలేక కన్నీరు మున్నీరౌవుతారు. కాలేజీ చదువుకునే రోజుల్లో రజితని కలవడానికి ఆమె అన్నయ్య వినోద్ వచ్చేవాడు. ఇతనికి జయను పరిచయం చేస్తుంది రజిత. తొలిచూపులోనే వినోద్ జయను ప్రేమిస్తాడు. కాని జయకి పెళ్లిమీద సదాభిప్రాయం ఉండదు. వివాహమన్న, దాంపత్య జీవితమన్నా, స్త్రీ పురుషులు కలిసి జీవించడమన్న అసహ్యం, కోపం, ద్వేషం ఏర్పడుతుంది. వినోద్ తనను ఇష్టపడుతున్నాడని తెలిసిన అతనికి దూరంగా ఉంటుంది. రజిత ద్వారా జయ ప్రవర్తన గురించి తెలుసుకోని, జయ తనంతట తానే అతనికి దగ్గరయ్యేంత వరకు ఆమె కోరకు నిరీక్షిస్తానని, అప్పటివరకు ఆమెను తాకనని నిశ్చయించుకుంటాడు.

కొద్దికాలం తర్వాత జయ, వినోదుల మధ్య ప్రేమ ఫలించి పెళ్లివరకు దారి తీస్తుంది. ఏకకాలంలో రజిత, జయల వివాహం జరుగుతుంది. సంవత్సర కాలంలో రజిత మగబిడ్డకి జన్మనిస్తుంది. ఆ బాబు ఆలన పాలనలో కాలం గడిపేస్తుంది. కాని జయ వినోద్‌ల దాంపత్య జీవితం సరిగ్గా ఉండదు. జయ రజిత వాళ్ళ బాబుని చూడడానికి తరచు వస్తూ, పోతూ అతనిలో నిమగ్నమై, అందులోనే సంతోషాన్ని వెతుకుంటుంది. ఒకరోజు జయ తరుచులాగే బాబును ఆడిస్తూ ఎత్తుకోని ముద్దాడుతుంది. అది చూసిన రజిత జయతో నీ రక్తం పంచుకొని పుట్టిన బిడ్డకు నివ్వు ముద్దాడినపుడు కలిగే సంతృప్తి మరెవరి బిడ్డను ముద్దాడితే లంభించదని చేప్పడంతో అప్పటివరకు తన మనసులో నాటుకున్నా చెడు అభిప్రాయాన్ని ఒక్కసారిగా

పటాపంచలు అవుతాయి. దాంతో తన నిర్ణయాన్ని మార్చుకొని ఒక మగబిడ్డకు జన్మనివ్వడంతో ఈ నవల ముగుస్తుంది.

సృష్టిలో తీయనిది అనే నవలలో జయ, రజితల మంచి స్నేహంతోపాటు సృష్టిలో తీయనిది మాతృత్వం అని చెప్తూ, ఆడది అమ్మగా పరిణతి చెందినపుడే స్త్రీగా పరిపూర్ణత లభిస్తుందని రచయిత్రి సందేశమిచ్చారు.

### 3.1.28. విజేత-2008

**రచయిత పరిచయం:** వివిధ ప్రక్రియలలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాధించుకున్నవారు మేడిచర్ల ప్రభాకర్. కేవలం దశాబ్ద కాలంలోనే ఇరువైఏడు రచనలు చేసిన ఘనత వీరి సొంతం. అన్నింటికి మించి ఈయన మాతా శారదాంబ భక్తుడు. తన సర్వస్వమును ఆమెకు సమర్పించుకున్న పరమ భక్తసేవకుడు. ఈయన నిజామాబాదు జిల్లాలోని సిరికొండ గ్రామములో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు సుభద్రమ్మ వేంకటరావులు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. బాల్యం నుండే ఆధ్యాత్మిక విద్యాభిమానం గల ప్రభాకర్ తన వృత్తి వదలి ఏదైనా సాధంచాలనే జిజ్ఞాసతో అనేక ఆధ్యాత్మిక గ్రంథాలను రచించాడు. అంతేగాక ఎం.ఏ. సంస్కృతంలో పట్టా పొందినాడు. ధార్మిక అనే పత్రికను స్థాపించి దానికి తానే సంపాదకత్వం వహించి 1990-1995 వరకు నిర్వహించాడు. కవి భారతి, వాణి మనోజ, 'సాహిత్యశ్రీ' అనే బిరుదులు ఉన్నాయి.

**వస్తువు**: విజేత నవలలో ప్రధాన పాత్ర బాలాజీ. ఇతను భారత ఆర్మీలో సిపాయిగా పనిచేసి ఉద్యోగ విరమణతో తన మిత్రుల ఇచ్చిన వీడ్కోలు విందును తీసుకొంటాడు. వారితోగల జ్ఞాపకాలను, అనుభంధాలను గుర్తుచేసుకుంటూ బాధని అనుచుకుంటూ ఇంటిముఖం పడ్తాడు. ఒకవైపు ఇక్కడి మిత్రులు వీడిపోతున్నారనే బాధ, మరోవైపు తన చిన్నానాటి స్నేహితులతో మిగతా జీవితకాలాన్ని పంచుకుంటున్నాన్న అనందం రెండింటిని కలబోసుకొని, తన గతజీవితాన్ని నేమరు వేసుకుంటు వాటిలో తాను పొందిన బాధలను,

ఉద్యోగంలో పొందిన సంతృప్తిని జ్ఞాప్తికి తెచ్చుకుంటూ మూడు రోజులకు ఇంటికి వెళ్తాడు. ఇంటికి చేరుకోగానే తాను తెచ్చిన వస్తువులను ఎవరివి వారికిచ్చాదు. మరుసటి రోజు తన చిన్నతనంలో పాఠాలు బోధించిన గురువుని కలుసుకొని తెచ్చిన కానుకను అందంచి పాదాభివందనము చేసి వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. రెండు రోజుల తరువాత చిన్ననాటి మిత్రుడు ఆ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన రాజారాంను కలిసి మనసు విప్పి మాట్లాడతాడు. సర్పంచ్ పదవి తను ఏవిధంగా సంపాదించుకొన్నది, ఎంత వెనుకేసుకుంది అన్ని వివరించేసరికి బాలాజీ ఆశ్చర్యపోయాడు. మరునాడు తన దగ్గరి బంధువైన సాయమ్మను కలిస్తే ఆమె భర్తకి వచ్చిన పక్షవాతం గురించి తెలిపి తాను ఏవిధంగా బ్రతుకుదెరువు కోసం నిస్సహాయస్థితలో విధవగా మారి 'విధవ పింఛన్' పొందుతున్నదో తెలిపి తనకు ఇప్పుడు ఎలాంటి బాధలేకుండా, ఏ కొదువలేకుండా జీవిస్తున్నానని చేప్పగానే బాలాజీ మరోకసారి ఆశ్చర్యపొతాడు. అలాగే తన మరో స్నేహితుడు వెంకట్‌ని కలిస్తే, అతడు ఎలా ధనవంతుడయ్యాడో వివరించేసరికి బాలాజీ మనసు తట్టుకోలేకపోయింది. ఒకనాడు తన గురువుని కలిసి ఆ గ్రామములో జరుగుతున్న మోసాలను గురించి చెప్పి తన బాధను వ్యక్తం చేస్తాడు. దానికి ఆ గురువు బాలాజీ పెరిగిన వాతావారణం, తీరును సమాజంలో జరిగే మార్పులను విడమరిచి చెప్పి ఊతమందిస్తాడు. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన వృత్తి సరిగ్గా నిర్వహించక అడ్డదారుల్లో సంపాదించడం తట్టుకోలేకపొతాడు. మరల గురువుని ఆశ్రయించి ఇలాంటి ఆగడాలు ఎందుకు జరుగుతున్నాయేమో తెలుసుకొని కాలమే అన్నింటికి సమాధానం చెప్తుందనే నిర్ణయానికి వస్తాడు.

ఇవన్నీ చూసిన బాలాజీకి దేశ సేవ చేసిన నేను గ్రామానికి ఏదైనా చేయాలన్న నిర్ణయం తీసుకుంటాడు. బాలాజీ బావగారు ఒకనాడు బాగా తాగి ఎవరితోనో పొట్లాటలో తన ప్రాణాలను కోల్పోతాడు. బావ మరణంతో తన బావ ఒక తాగుబోతు అని పనిపాటలేని వాడని తెలుస్తుంది. తమ కులంలో ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయి? తమ కులాన్ని ఎందుకు దూరం ఉంచినారో అర్థచేసుకుని లోకంలో తమ కులానికి ఎంతో కొంత పేరు గుర్తింపు తీసుకురావాలని నిశ్చయించుకున్నాడు. బాలాజీకి చిన్నతనం నుండే తాగడం

అలవాటు లేదు. ఇతరులను ఏవిధంగా మాన్పించాలో అర్థంగాక, తన గురువు బాలాజీకి ఎన్నో విషయాలను, కథలను, క్రమశిక్షణను పాటించాలో కొన్ని సూచనలు సలహాలతో ముందుకు సాగాడు. బాలాజీ తన ఉద్యోగ ప్రయత్నం పూర్తిగా మానుకొని వ్యవసాయమే ప్రాధాన వృత్తిగా మార్చుకుని గ్రామంలో ఉండి తను అనుకున్న నిర్ణయాన్ని తన కుటుంబంతోనే ప్రారంభిస్తాడు. ఇంట్లో మాంసం, సారా తాగటాన్ని మాన్పించాడు. ఆ గ్రామ దొర ఆత్మహత్య చేసుకుంటాడు. దొర మరణంతో ఎంత సంపద ఉన్న ఆత్మీయులను సంపాదించుకోలేకపోతే ఎవరైన ఆత్మహత్య చేసుకుంటారు. అని అర్థం అవుతుంది. దాంతో తన ఉద్యమానికి ముందు అభిమానులని సంపాదించుకోవాలనుకుంటాడు. క్రమక్రమంగా తను అనుకున్నట్టు మిత్రులు, బంధువులు, కులస్థులందరు అభిమానులుగా పెరిగి మందు, మాంసం మానేసి ఉన్నదాంట్లోనే తృప్తిగా ఉల్లాసంగా ఉంటూ జీవితం గడుపసాగారు. ఇలా కొన్ని నెలల్లో గ్రామమంత సిరిసంపదలతో నిండిపోయింది.

గురువు బాలాజీని అభినందిస్తూ నిజమైన విజేత ప్రశంసించడంతోపాటు గురువు ఆశ్రమానికి సంబంధించిన ఆస్తినంతటికి వారసునిగా ప్రకటిస్తా అని అనడంతో నవల ముగుస్తుంది. ఇందులో ఒక ఆర్మీ అధికారి పదవీ విరమణ తర్వాత నిస్వార్థంగా సమాజ సేవ చేయాలనుకుంటాడు. కాని సమాజం అంతా భ్రష్టుపట్టిపోతుంది. దానిని తట్టుకోలేని అతను గ్రామాన్ని క్రమక్రమంగా అభివృద్ధిలోకి తీసుకువస్తాడు. విజేతగా నిలుస్తాడు.

### 3.1.29. సర్వేజనః సుఖినోభవంతు-2009

ఈ నవలను మేడిచర్ల ప్రభాకరరావు రాశారు. ఈ నవలలో ముఖ్యమైన పాత్ర న్యాయమూర్తి జగన్నాథం. ఇయన తన న్యాయ వృత్తి పదవికి రాజీనామ చేసి, భార్యతో సహ తన స్వగ్రామానికి ప్రయాణమైతాడు. తన రాజీనామాకు కారణమేమిటో ఎవ్వరికి చెప్పడంలేదు. చివరికి తన భార్యకు కూడా విషయం తెలియదు. అందరు ఆశ్చర్యంలో, అందోళనలో మునిగిపోయారు. అతన్ని అడిగే సాహసం కూడా ఎవ్వరు చేయడం లేదు. కారణం జగన్నాథం మితభాషి, న్యాయమూర్తి. ప్రయాణ మార్గమధ్యలో ఒక గ్రామంలో ఆగి

అక్కడ ఒక గుడిసెలోకి వెళ్ళి ముసలమ్మను కలిసి యాభైవేల రూపాయలనిచ్చి నీ కోడలికి మంచి మందులిప్పించి, ఒక మంచి న్యాయవాదిని పెట్టుకోమని చెప్పివచ్చి తిరిగి మరల కారులో కూర్చోని తన జన్మస్థానమైన సిరికొండను చేరుకుంటాడు. మరునాడు ఉదయాన్నే తన చిన్ననాటి స్నేహితుడు, ప్రస్తుత గురూజీని కలుసుకుంటాడు. ఒకరినొకరు కుశల ప్రశ్నల తదనంతరం తను రాజీనామా ఎందుకోసం చేసినాడో చెప్పడానికి, దానికి కారణమైన ఉత్తరాన్ని చూపిస్తాడు. ఆ ఉత్తరంలో రౌడీగా మారిన తన కొడుకు మూలంగా ఎందరో బాధపడుతుంటే చూడలేక తానే తన కొడుకును చంపి తనకు కారాగార శిక్ష వేసిన బాధపడనుగాని, తన కోడలుకు, మనుమలకు బ్రతికే దారిని చూపించమని అంటుంది. ఆ ముసలి తల్లి రాసిన ఉత్తరంలో రాసిన విషయం గురించి రాజీనామా చేసినావా అని అడుగుతాడు గురూజీ. అందుకు తాను ఎంతగా పశ్చాత్తాపం పొందాడో, తన మానసిక వేదనను గురూజీకి వివరిస్తాడు. అప్పుడు గురూజీ తగిన ఉపదేశం చేసి శాంతపరుస్తాడు. ఈ క్రమంలో గురూజీ తన జీవితానికి సంబంధించిన అన్ని విషయాలను జగన్నాథానికి తెలియపరుస్తాడు. గురూజీ ఆధ్యాత్మిక జ్ఞానార్జనతో మానవసేవ చేయాలనే సంకల్పాన్ని గ్రహిస్తాడు. విధవరాలైన తన సోదరి కూతురుని, కొడుకుని చేరదీసి వారి బాధ్యత తీసుకొని వాళ్ళకొక మార్గం చూపించాలనుకుంటాడు. కాని అప్పటికే తన సోదరి కూతురు కులాంతర వివాహం చేసుకొని వెళ్ళిపోతుంది. కోడుకేమో నాటకాల పిచ్చితో కుటుంబాన్ని వదిలి వెళ్ళిపోతాడు.

అలాగే జగన్నాథం పెద్ద కుమారుడు ధనవంతుల అమ్మాయిని పెళ్లి చేసుకొని అత్తగారింటికే పరిమితమై పోతాడు. రెండవ కుమారుడు అనేక వ్యాపారాలు చేసి చేసి నష్టపోయి అరబ్ దేశాలకు పారిపోతాడు. తల్లిదండ్రులు వయస్సు కారణంగా జీవితాలను చాలించుకుంటారు. అందరుండి కూడా ఎవరులేని ఒంటరి జీవి అయ్యాడు జగన్నాథం. కుటుంబాన్ని సరిదిద్దుకొలేని నేను సమాజానికైన ఎంతోకొంత సేవ చేయాలని నిర్ణయం తీసుకుంటాడు. శివరాత్రి ఉత్సవాలలో గురూజీ జగన్నాథానికి మూడు దినాలు బోధనలను బోధిస్తాడు. గురూజీ సూచన ప్రకారం గ్రామాలన్ని తిరిగి అక్కడి వారందరి అవేదనలు,

అభిప్రాయాలను తెలుసుకొని వారికి సహకారం అందించడం కొరకు పదవి విరమణ మరియు బాధ్యతలు ముగించుకున్న వారందరిని కలుపుకొని ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. సేవ చేయగలిగినవారు నిస్వార్థంగా పాల్గొని సంఘసేవను గ్రామ స్థాయిలోను, మండల స్థాయిలోనూ, అంతేగాక జిల్లాస్థాయి వరకు అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. కాలగమనంలో జగన్నాథం కుమారుడు పశ్చాత్తాపంతో, రెండవ కుమారుడు కావలసినంత సంపాదనతో, కులాంతర వివాహం చేసుకున్న సోదరి కూతురు, నాటకాల పిచ్చితో పారిపోయిన అక్కకొడుకు వీరంతా కలిసి జగన్నాథం గారి సేవా సంఘంలో స్వచ్ఛందంగా చేరి సేవ చేస్తూ జగన్నాథానికి విశ్రాంతినిస్తారు. దాంతో జగన్నాథం తన శేష జీవితాన్ని తృప్తిగా గడుపుతానడంతో నవల ముగుస్తుంది. తప్పు చేశామని బాధపడేవారు పాశ్చాత్తాపం చెందితే సరిపోదు, సమాజ సేవ చేస్తేనే దానికి తగిన పరిష్కరం అవుతుందని గురూజీ చెప్తాడు. సమాజంలో ఎవరైనా తప్పులు చేస్తుంటారు. అయితే పాశ్చాత్తాపం చెంది మళ్ళీ అటువంటి తప్పులు పునరావృతం కాకుండా చేసుకోవాలని రచయిత ఈ నవల ద్వారా చెప్పాడు.

### 3.1.30. కావేరి కళ్యాణం-2010

ఈ నవలను మేడిచర్ల ప్రభాకరరావు రాశారు. ఈ నవలలో ప్రధానంగా నిలిచేది కావేరి పాత్ర. కథలోనికి వెళ్ళినట్లైతే, పరీక్షలు ముగిసిపోవడంతో తాతా, అమ్మమ్మల వెంటనే రమ్మని కబురు పంపితే శ్రీకరుడు గ్రామానికి వచ్చి చేరుకుంటాడు. విషయమేమిటో తెలుసుకొనేవరకు అది తనకు కావేరితో వివాహం గూర్చిన విషయమని తెలియదు. తాత మాట కాదనలేక కావేరి అభిప్రాయం కూడా అడిగి తెలుసుకోమని సూచన చేస్తాడు శ్రీకరుడు. తరువాత రోజు తన చిన్ననాటి స్నేహితుడైన మనోహరశర్మను కలిసి మాట్లాడుకుంటూ అక్కడి మందిరం, ఆశ్రమాలు తిరిగి చూసి మరల ఇంటికి చేరుకున్నాడు. నవలలో గతంలో జరిగిన విషయానికి వెళ్తే అనందరావు అనే పెద్ద మనిషి తన గ్రామాన్ని బాగా ఉద్దరించి ఆధునిక పోకడలకు ఏ మాత్రం తగ్గకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాడు. అనందరావుకి ఒక కొడుకు, కూతురు. వీరిద్దరికి కూడా వివాహాలు జరిపిస్తాడు. అయితే కుమారునికి సంతానం

కలుగలేదు. కూతురు మాత్రం ఒక కుమారుడికి జన్మనిస్తుంది. కొద్ది కాలానికే ఒక అగ్ని ప్రమాదంలో కూతురు, అల్లుడు మరణిస్తారు. చేసేది లేక కూతురి కుమారుడైన శ్రీకరుని కూడా తానే పోషిస్తాడు. శ్రీకరుడు కాలు పెట్టిన వేళావిశేషం అనందరావు కోడలు గర్భవతి అని తెలుస్తుంది. అంతే పండంటి ఆడ బిడ్డకి జన్మనిస్తుంది. ఆ కూతురు పేరే కావేరి. ఈ కథకి కథానాయకి. శ్రీకరుడు ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసి భాగ్యనగరం చేరి ఇంజనీరింగ్ చేరతాడు. ఇక్కడ కావేరి మెట్రిక్యులేషన్ పూర్తి చేస్తుంది. అలాగే తన స్నేహితుడు మనోహారశర్మ బి.ఏ. పూర్తి చేసాడు. శ్రీకరుడు ఐ.ఎ.ఎస్. చదవడానికి ఢిల్లీకి వెళ్లిపోతాడు. కావేరి ఒంటరితనం భరించలేకపోతుంది. యవ్వనంలో జరిగే మార్పులకు తట్టుకోలేక ఒక తోడును కోరుకుంటుంది. కాని తన మనస్సు నిండా శ్రీకరుడు ఉన్నప్పటికి తను అందుబాటులో లేకపోవడంతో అక్కడే వారితోపాటు పెరిగిన మనోహారశర్మ అందుబాటులో ఉండడంతో కాలక్షేపానికి కావాలనుకుంటుంది. కాని కావేరి కట్టుబాట్లు కలిగిన సంస్కారంతో పెరగడం వల్ల ఎక్కడ బయటపడకుండా జాగ్రత్త పడుతుంది. అలాగే మనోహారశర్మ మాత్రం కావేరి మనస్సును గ్రహించి తాను జాగ్రత్త పడ్తువచ్చాడు. శర్మ కూడా సంస్కారవంతుడు కావున కావేరి తప్పుదారి పడకుండా ఆమెను ఎలాగైనా కాపాడాలని ఉద్దేశంతో మాత్రమే తోడుగా మెదులుతూ ఆమెను నిరంతరం సంతోషపెట్టేవాడు.

శ్రీకరుడు తన వివాహం కావేరితో నిశ్చయం చేశాక శ్రీకరునికి కావేరిమీద ఎందుకో అనుమానం కలుగుతుంది. ఆ అనుమానాన్ని గ్రహించిన మనోహారశర్మ శ్రీకరుని అనుమానాన్ని తొలగించి కావేరితో వివాహానికి సిద్ధపరుస్తాడు. శ్రీకరుని తాత అమ్మమ్మలు, తన స్నేహితుడైన మనోహారశర్మ కోరిక మేరకు, అంతకన్నా ప్రాణంగా ప్రేమించిన తన మరదలైన కావేరి వివాహం చేసుకుంటాడు. కాని కావేరి మనస్సులో మనోహరశర్మ మీద ఇష్టం ఉండడంతో పెళ్ళైన వెంటనే ఎవరికి తెలియకుండా శర్మను కలవడానికి వెళ్తుంది. తనను పెళ్లి చేసుకోమని అడుగుతుంది దానికి నిరాకించి తన స్నేహితుడి భార్యను తను కావాలనెప్పుడు అనుకోలేదని, నాకు నీ మీద అలాంటి ఉద్దేశ్యం లేదని, చిన్ననాటి నుండే కావేరికి శ్రీకరునికి పెళ్ళని పెద్దలు నిర్ణయించారని, నీకు నా మీద ఉన్నది కేవలం ఆకర్షణ

మాత్రమేనని చెప్తాడు. నిన్ను నిజంగా ప్రేమించేది శ్రీకరుడుని నచ్చజేప్పి ఆమెకు జ్ఞానజ్యోతిని వెలిగించి తిరిగి పంపిస్తాడు.

ప్రేమ అనేది ఎవరిమీద ఎప్పుడైన కలుగవచ్చు. కాని అందులో ఎదుటి ప్రేమికులు నైతికతను పాటించాలనే విషయాన్ని రచయిత చెప్పకనే చెప్తాడు. ఒక స్త్రీ మొదటి నుంచి ఒకరిని, అందులో బావను ప్రేమించి, తరువాత మరొకరిని ప్రేమిస్తుంది. కాని ఎదుటి పురుషుడు ఇదంతా ఆకర్షణ అని, నీవు మొదటగా మీ బావను ప్రేమించావు అని నైతికతను పాటించి ఆమెలో చైతన్యం కలిగిస్తాడు. ఈ విధంగా రచయిత నవలలో సందేశమిచ్చాడు.

### 3.1.31. పునరాగమనం-2011

**రచయిత పరిచయం:** స్వాతి శ్రీపాద జూలై16, 1953లో జన్మించారు. నిజామాబాదులో పుట్టి, తన చదువునంత ఇక్కడే పూర్తి చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా కవిత, కథ, నవల, వంటి ప్రక్రియలతో పాటు అనువాదాలు చేశారు. స్వాతి తెలుగులో నుండి ఆంగ్లంలోకి, ఆంగ్లంలో నుండి తెలుగులోకి సమర్థవంతంగా అనువాదం చేయగలరు. ముప్పైమంది రచయిత్రుల తెలుగు కథలను ఆంగ్లంలోకి అనువాదించారు. సాహిత్య అకాడామీ వారికోసం "భవానీ భట్టాచార్య జీవిత చరిత్ర"ను ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించారు. హృదయంలో అడుగులు, మనసుకు చూపుంటే, ఎడారులు ఎండమావులు వంటి కవిత సంపుటాలను, మౌణవీణ, గోడలు, అవతలివైపు వంటి కథ సంపుటాలను, పునరాగమనం, చిరుజల్లు కురిసేనా వంటి నవలలను రాశారు. సమాజాన్ని నిశితంగా పరిశీలించి, చెడుని వ్యతిరేకించడం. వీరు ఏది రాసిన వాటిల్లో మానవీయ విలువల కోసం తపన పడతూ స్త్రీ కోణంలో నుండి సాగే రచనలు చేయడం వీరి ప్రత్యేకత. తెలుగు విశ్వవిద్యాలయం నుండి కీర్తి, ప్రతభ పురస్కారాలను, వంశీ తెన్నెటి హేమలత, వాకాటి పాండు రంగరావు స్మారక కథల పురస్కారాలను అందుకున్నారు. అనువాదానికిగాను 'మహాత్మ పూలే' అవార్డును స్వీకరించారు.

ఈ నవలలో ప్రధాన పాత్ర వసంతలక్ష్మీ . నవలంతా కూడా ఈమె దృక్కోణంలోంచే సాగుతుంది. వసంతలక్ష్మీ భర్త పేరు శ్రీ. ఇతను డాక్టరు. వాళ్ళు ఎంతో అన్యోన్యంగా కాపురం చేస్తున్న దంపతులు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేని నిజమైన ప్రేమికులు. వాళ్ళకిద్దరు పిల్లలు. కూతురు సుమ ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిగ్రీ సంపాదించి లండన్‌లో ఉద్యోగం చేస్తుంది. కొడుకు సుమంత్ ముంబైలో ఉంటూ సినిమారంగంలో స్థిరపడ్డాడు. భర్త శ్రీ పుట్టిన రోజు కావడంతో అతనికి సర్‌ప్రైజ్ పార్టీ ఇవ్వాలని వసంతలక్ష్మీ ఆలోచిస్తూ అతని రాకకోసం ఎదురుచూస్తుంటుంది. అతడు వస్తాడు బాగా అలసిపోయి కనిపిస్తాడు. పార్టీకోసం చాలామంది స్నేహితులు వస్తారు. అందరు కలిసి ఆడ్తారు, పాడ్తారు. అందరు వెళ్ళపోయాక వాళ్ళిద్దరు బెడ్ రూంలోకి వెళ్తారు. శ్రీ ఇంకా అలసిపోయినట్టు కనిపిస్తాడు. పాలు తాగి కాసేపు పడుకుంటానంటాడు శ్రీ., తెస్తాను తాగి పడుకోండి అంటూ వెళ్ళి తెచ్చేలోగా శ్రీ గాఢ నిద్రలోకి జారుకుంటాడు. బాగా అలసట వల్ల నిద్రపోతున్నాడేమో అనుకుంటుంది. అంతే అతడు మళ్ళీ తిరిగి లేవలేదు, చనిపోయి ఉంటాడు. వసంతపైన పిడుగు పడ్డటైంది. చాలాకాలం వరకు షాక్ నుంచి తేరుకోలేక బయటకు రాదు. ఒంటరి జీవితాన్ని గడుపుతుంది. ఆమె కొడుకు, కూతురు దూరంగా ఉంటూ అమె అనుభవిస్తున్న వేదనను చూసి పట్టించుకోరు. "టేకిట్ ఈజీ" ధోరణిని ప్రదర్శిస్తారు. తన స్నేహితులు యామిని, స్వప్నిక, లత ఇలా ఎందరు వచ్చినా కలిసేది కాదు. ఎంత చెప్పిన వారి మాట లెక్కచేయలేదు. కాలమే మాన్పగల గాయం అది. కొంతకాలం గడిచిన తరువాత స్నేహితురాలు యామిని అన్న ఒక మాట వసంతను మార్చేస్తుంది. "వసంతా ఒక్కటి గుర్తుపెట్టుకో ఏదేం జరిగినా, స్టిల్ నీ జీవితం నీది. లివ్ ఫర్ యువర్ సెల్ఫ్" అంటుంది యామిని. మనం మనకోసం జీవించాలి అనే యామిని మాటతోపాటు భర్త శ్రీ అన్న మాటలు గుర్తుకువస్తాయి. ఎంత విపత్తునైనా చిరునవ్వుతోటే అనుభవించాలి అంటుండేవారు. శ్రీ తన చివరిక్షణం వరకు ఆ మాటకే కట్టుపడ్డాడు. ఆరోగ్య సమస్యలున్న, ఉద్యోగంలో ఒడిదుడుకులు, అప్పులు, అవమానాలు ఎన్ని ఎదురైనా అతనొక్కరోజు కూడా కంటతడి పెట్టలేదు. అతని ఆశయాన్ని తను గౌరవించింది. ఇంతకాలం తను పడిన బాధకు స్వస్తి పలకాలని, మళ్ళెప్పుడు కంటనీరు రాకూడదని నిర్ణయించుకుంటుంది. శ్రీ భౌతికంగా తనతో లేకపోయినా అతడు అనుక్షణం

తనవెంటే, తనలోనే ఉన్నాడని తాను సంతోషంగా ఉండాలని నిశ్చయించుకుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుంది. అక్కడ ఈ వయస్సులో నీకు జాబ్ ఎందుకని, ఏం చేయగలవనే విమర్శలు ఎదుర్కోంటుంది. ఒక పెద్ద హోటల్‌లో రిసప్షెనిస్ట్ గా ఉద్యోగం సంపాదిస్తుంది. అక్కడ రిసప్షనిస్ట్ అంటే జుట్టు క్రాప్ చేయించుకుని, పెదాలకు లిపిస్టిక్ రాసుకోని అందంగా తయారవ్వాలి. ఇదంతా ఇష్టంలేని వసంత ఉద్యోగం మానేస్తుంది. అలాగే ఒక కార్పోరేట్ స్కూలులో టీచరుగా చేరుతుంది. అక్కడ కొన్ని సమస్యలు రావడంతో ఆ ఉద్యోగం మానేస్తుంది. చివరకు ఒక పత్రికలో ఉద్యోగానికి కోసం ప్రకటన చూసి వెళ్తుంది. ఆ పత్రిక ఎడిటర్ ప్రభాకర్ ఆమెకు బాగా తెలిసినవాడే కావడంతో ఉద్యోగం దొరుకుతుంది. ఆ పత్రికలో చేరాక ఆమెకు తనలో ఒక సృజనాత్మక రచయిత్రి ఉన్నదని తెలుస్తుంది. ఆమె నవలలు రాయడం మొదలు పెట్టి చాలా తక్కువ కాలంలోనే గొప్ప పేరు ప్రఖ్యాతులను సంపాదిస్తుంది. ఇలా ఆమె ముగిసిపోతుందనుకున్న జీవితం తిరిగి మళ్ళీ రావడంతో ప్రేమిస్తుంది. ఇదే ఈమె పునరాగమనం.

వసంతలక్ష్మీ ఓ అందమైన స్త్రీ. ఆమెకు యాభైయేళ్ళు కూడా నిండలేదు. ఆమె భర్త చనిపోవడం, పిల్లలు కూడా దూరంగా ఉంటూ తల్లిని పట్టించుకోకపోవడం లేదు. కాబట్టి ఆమెకు దగ్గరై తమ కోరికలను తీర్చుకోవాలని కొందరు పురుషులు ప్రయత్నింస్తుంటారు. వాళ్ళలో మొదటివాడు ప్రభాకర్. ఇతడో పత్రికను నడుపుతుంటాడు. అతని ఆఫీసులో ఉద్యోగం కోసం వచ్చిన వసంతలక్ష్మీ ని చూడగానే అతడు పరవశించిపోయి వెంటనే ఆమెకు ఉద్యోగం ఇస్తాడు. కారణం కాలేజీలో చదువుకునే రోజుల్లో ప్రభాకర్ కి వసంతతో స్నేహం ఉంటుంది. ఆ రోజుల్లో నిన్ను ప్రేమించాను. కాని మీ నాన్నకు భయపడి విషయం నీకు చెప్పలేదు అని ప్రభాకర్ చెప్పినప్పుడు ఇంత పిరికివాడు ప్రేమించడానికి అర్హుడు కాదు అని తన మనస్సులో అనుకుంటుంది. అయినా తనకు ఉద్యోగం ఇచ్చాడనే కృతజ్ఞత భావంతో అతనితో స్నేహంగానే ఉంటుంది. ప్రభాకర్ మాత్రం ఆమెను తన మనస్సులో ఆరాధిస్తుంటాడు తప్ప ఆమెను మరోరకంగా ఇబ్బంది పెట్టాలని ప్రయత్నంచడు. విజయేంద్ర చక్రవర్తి అనే ధనికుడు వసంతలక్ష్మీ కి భర్తలేదనే విషయం తెలిసినప్పటినుండి ఆమెతో

పరిచయం పెంచుకోవాలని అనుకుంటాడు. ఆమెను తనతో హోటళ్ళకూ, సినిమాలకు రమ్మని ఆహ్వానిస్తుంటాడు. కొద్దికాలానికి తనకు చిక్కదని తెలిసిన మరుక్షణం నుండి ఆమె గురించి దుష్ప్రచారం చెయ్యడం మొదలుపెట్టాడు. ఇక మూడో వ్యక్తి డా. చైతన్య. ఇతడు వసంతలక్ష్మీ భర్తైన శ్రీతో కొంతకాలంపాటు బెంగళూరులో పనిచేశారు. ఆవిధంగా ఇద్దరు డాక్టర్లు కావడంతో వాళ్ళిద్దరి మధ్య స్నేహం ఉండేది. భర్త చనిపోకముందు వసంత డా. చైతన్యను చాలాసార్లు చూసింది. వసంత భర్త శ్రీ చనిపోయిన కొంతకాలానికి డా. చైతన్య భార్య కూడా చనిపోతుంది. అప్పడినుండి అతడు వసంత దగ్గరకు రావడం మొదలుపెట్టాడు. వసంతలక్ష్మీ కి అతడు తన భర్త స్నేహితుడని తెలుసు కాబట్టి అతనితో కలివిడిగానే ఉంటుంది. అలా కొంతకాలం గడిచాక ఒక రోజు డా. చైతన్య మీరు ఒక్కరే ఉంటున్నారు. నేనూ ఒక్కడినే కారణం ఏదైనా కాని మనం మన పిల్లలతో రాజీ పడలేం. మనమిద్దరం పెళ్ళి చేసుకుంటే తప్పేంటి అంటాడు. అప్పుడు వసంత మనం ఇలాగే స్నేహంగా ఉండిపోదాం. మీకు తోచినప్పుడల్లా మా ఇంటికి రండి. కలిసి సినిమాలు చూద్దాం, డిన్నర్లు చేద్దాం అంతేగానీ, మరో ఆలోచనలు వద్దు అని సమాధానం చెబుతుంది. అయితే వసంత నవలలు రాస్తూ సమాజంలో ఒక ముఖ్యమైన వ్యక్తిగా మారుతుంది. ఆమెకు చాలా ఆవార్డులు, మంచిపేరు రావడంతో మీడియా వాళ్ళు వెంటపడి ఇంటర్వ్యూ చేస్తూ ఆమె వ్యక్తిగత జీవితాన్ని గూర్చి ప్రశ్నిస్తారు. మీ నవలల్లో రాసినదంతా మీ వ్యక్తిగత జీవితమే అంటారు నిజమేనా? అని అడుగుతారు. మీ పిల్లల్ని గురించి చెప్పమంటారు. మీరు మళ్ళీ పెళ్ళెందుకు చెసుకోలేదని అడుగుతారు. ఇలా అడుగుతున్న ప్రశ్నలకు వసంత నిర్భయంగా సమాధానం చెప్తూ, నాకు ఇంకా పెళ్ళి కాలేదని ఎవరు అన్నారు. ఏడు నెలల క్రితమే నాకు వివాహం జరిగిందని వెంటనే మంగళ సూత్రాలను తీసి చూపిస్తూ పెళ్ళి జరిగినట్టు లోకానికి ప్రకటించుకోవాలా నాకూ చైతన్యకు అది ఇష్టం లేదు. ఓ.కే. నో. మోర్. క్వశ్చన్స్ అంటూ వసంత లోపలకు వెళ్ళిపోతుంది.

మొదట తానూ, చైతన్య స్నేహితులుగానే ఉండి పోదామనుకున్నప్పటికీ తరువాత తన నిర్ణయాన్ని మార్చుకొని డా. చైతన్యను వసంత పెళ్ళి చేసుకోవడంలో తప్పేమి లేదని మనం గ్రహించుకోవాలని రచయిత అభిప్రాయన్ని వ్యక్తం చేయడంతో తన నవలను ముగిస్తుంది.

ఆపదలు వచ్చాయని కుంగిపోకూడదనే సందేశం ఈ నవలలో కనిపిస్తుంది. భర్త చనిపోవడంతో కొన్నాళ్ళపాటు ఆంధకారంతో ఆందోళనలో ఉంటుంది. చివరకు తన భర్త చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకొని కష్టాలను ఎదుర్కొని ముందుకు సాగిస్తున్న స్త్రీ జీవితం ఈ నవలలో మనకు కనిపిస్తుంది.

### 3.1.32. శ్రీమతి గోమతి-2012

ఈ నవలను మేడిచర్ల ప్రభాకరరావు రాశారు. ఈ నవలలో ముఖ్యమైన పాత్ర గోమతి. ఈ పాత్ర చుట్టూ నవల అంత అల్లబడి ఉంటుంది. గోమతి దృఢచిత్తురాలు. నవల ప్రారంభంలోనే గోమతి తన భర్త నుండి విడాకులు తీసుకోవడం ఒక ఆశ్చర్యమైతే, రెండవది తను చేస్తున్న ఐ.ఎ.యస్. ఉద్యోగానికి కూడా రాజీనామా చేయడం మరొక విశేషం. సాధరణంగా విడాకులు తీసుకోవడానికి కారణం భర్త విసిగిస్తున్నాడనో, నిత్యం హింసిస్తున్నాడనో, అనుమానంతో వేధిస్తున్నాడనో, మరే ఇతర కారణాల చేతనో విడాకులు తప్పనిసరిగా తీసుకోవడం జరుగుతుంది. కాని వేలకు వేలు జీతం వచ్చే ఉద్యోగాన్ని, దానితోపాటు అధికారాన్ని కూడా వదిలేయడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ విషయాన్ని కూడ ఎంతో శ్రద్దగా విలేఖరులను పిలిచి విషయాన్ని తెలియజేస్తుంది. మీరు ఉద్యోగానికి రాజీనామా చేసి, మరోవైపు వ్యక్తిగతంగా భర్తకు విడాకులు ఇచ్చి తరువాత ఏమి చేయాలనుకుంటున్నారు అని ప్రశ్నలు విలేకర్లు అడిగినా ఇంకా నిర్ణయించుకోలేదు అని చెప్తుంది. ప్రస్తుత జీవితం మాత్రం ప్రశాంతంగా జీవించాలని ఉంది అని తెలియజేస్తుంది గోమతి. ఈ విషయాలన్ని విన్న స్నేహితురాలు, న్యాయవాదైన సుమంగళి గోమతిని అదే ప్రశ్న వేస్తుంది. తనకు అదే సమాధానం ఇస్తుంది. ఇకపై దైవకార్యలకు, సమాజసేవకు నా మిగిలిన సమయాన్ని వెచ్చించాలనుకుంటున్నాను అని చెబితే ఇద్దరూ కలిసి చాలా

రోజులయిందని కలిసి భోజనానికి బయటే కానించి ఇంకా సమయం ఉండటంతో సుమంగళి సలహా మేరకు తాను ఒక ఆశ్రమానికి వెళ్ళాలని నిర్ణయించుకొంటుంది. వెంటనే గోమతి ఆలోచించి తనకూ అలాంటి వాతవరణమంటే ఎంతో ఇష్టమని బయలుదేరుతారు. దారిలో గోమతికి ఆలోచన వచ్చి సుమంగళిని అడుగుతుంది. ఇంతకీ నీకు ఈ ఆశ్రమం ఎంతకాలం నుండి తెలుసని అడిగితే తాను ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు వచ్చానని, తనకెంతో ప్రశాంతంగా అనిపించింది అనడంతో గోమతి కూడా ఎంతో ఆసక్తిని కనపరిచింది. ప్రయాణిస్తున్న మార్గమధ్యంలో సుమంగళికి తాను ఇలా ఆశ్రమంలోకి ఎందుకు రావల్సివచ్చిందో తెలియజేస్తుంది. మొండితనం, అహంకారం కలగలిపిన స్వభావంతో తల్లిదండ్రుల మాటలను లెక్క చేయకుండా తన జీవితాన్ని ఎంతలా నాశనం చేసుకున్నదో తీరా తనను తాను పరిశీలించుకునే సమయంలో తనకు జీవితమే ఎలా తనను దూరంగా ఉంచిందో తెలుపుకున్నది. తర్వాత ఆశ్రమానికి వెళ్ళి కాసేపు పరికించి చూసిన గోమతి కూడా వచ్చేదారిలో తాను ఎదుర్కొన్న బాధలు, తన పిల్లలు, స్నేహితుల కారణంగా ద్విచక్రవాహనంలో ముగ్గురు ప్రయాణం చేసి యాక్సిడెంట్‌లో ఎలా చనిపోయాడో వివరించింది.

అంతేకాకుండా తన అన్న కూతురైన మాజీ ఎం.ఎల్.ఏ. శుభాంగిని తన అత్యాశతో, పదవిపై వ్యామోహంతో ఏదీ సాధించలేక, అందని ఆశలకు ఆహుతై ఆత్మహత్య చేసుకుంది. తండ్రికి కూడ తన కూతుర్ని ఎంతో ఉన్నత స్థానంలో చూడాలనుకుని చేసిన పొరపాటును సరిదిద్దుకోలేనంతగా చివరకి ఆ కన్న కూతురినే ఎలా కోల్పోయాడో తెలిపింది. గోమతి ఆశ్రమాన్ని చేరుకుని తన అన్న కూతురు మరణం గూర్చి వివరించగా ఎంతో సానుభూతిని ప్రదర్శించి ఓదార్చాడు. కాని గోమతికి ఒక సంశయం కలిగింది. స్వామిజీ మిమ్మల్ని చూస్తుంటే పెద్ద వయస్సు గలవారిలా అనిపించటంలేదు. కాని ఎందుకని మీరు స్వామీజీగా మారారు. అందుకు ఏమైనా విశేషం ఉందా అని గోమతి అడుగగా, సుమంగళి అందుకు తెలసుకోవాలని కుతూహలం ప్రదర్శించింది. దాంతో స్వామిజీ తన చిన్నతనంలో తన మేనమామ వద్ద పెరగటం, తన ఉన్నత విద్య, మేనమామ కూతురు మృదులతో వివాహం

చేసుకోవటం మృదుల తన అహంకారంతో తనను చిన్నచూపు చూసేదని, ఆధునికత పేరుతో చేసిన విన్యాసాలు, ఆడిన మాటలు ఎంతగా భరించినా చివరకు గర్భాన్ని కూడా విచ్ఛిన్నం(అబార్షన్) చేసుకునే స్థాయికి రావడంతో తాను తట్టుకోలేక తనను వదిలి అనేక ప్రాంతాలు పిచ్చివానిలా తిరిగి ఒక మహిళను మార్చకోలేని వాడు ఇక జీవితానికి ఏమాత్రం పనికిరాడనే నిర్ణయంతో నేను ఆశ్రమవాసిని అయ్యాను అని తన దీనగాథను వినిపించాడు.

ఇలా ఆశ్రమానికి ఇద్దరు ఎంతో అనుబంధం ఏర్పరుచుకున్నారు కూడా. ఒకనాడు స్వామీజీ ఏకాంతంగా కలిసి తన జీవితం ఆశ్రమంలో గడపాలని, దైవసన్నిధిలో ఉంటే బావుంటుందని అన్న గోమతి మాటలకు స్వామీజీ చలించి తప్పకుండ దైవసేవ అనేది దేవునికి ఎవరికి ఇష్టులో వారిచేతనే చేయించుకుంటాడని తెలిపి తన జీవిత వృత్తాంతాన్ని అడుగుతాడు. యవ్వనంలో తన ప్రేమ, పెళ్ళి, పిల్లలు, తర్వాత తన భర్త స్టేటస్ పెరగటం, తద్వారా పరిచయాలు, తన భర్త వ్యసనాలు, మోసపూరితమైన సంపాదన చేయడమే కాకుండా తనను కూడా చేయమని చెప్పడంతో స్వామీజీ చలించిపోయి మీరు ఈ ఆశ్రమంలో సేదతీరుతాను అంటే అందుకు నాకు అభ్యంతరం లేదు. కాని కేవలం ఆశ్రమంలో ఉండటమే కాకుండా పదిమందికి సహాయపడే తీరులో జీవితం మలచుకోవాలి. అంటే బాధితులకు చేయూతనివ్వడమే కాకుండా మానసిక బాధితులకు కూడా సలహా ఇవ్వగలగాలి. ప్రతి మనిషిలో తాను కోల్పోతున్న మానసిక ధైర్యాన్ని మీద్వారా ప్రజలకు అందించండి. తద్వారా మీ శేషజీవితం పదిమందికి ఉపయోగపడే తీరులో ఉంటుందని చెప్పడం, తగురీతిలో గోమతి స్పందించడం జరుగుతుంది. దాంతో గోమతి తన నివాసం ఆశ్రమానికి మార్చడం, ఎన్నో సమాజానికి ఉపయోగపడే ఎన్నో పనులు చేయడం ప్రారంభించి, కొద్ది కాలంలోనే తాను అనుకున్న రీతిలో మంచి పేరును సంపాదించింది. ఆ నోట ఈ నోట తన భార్య ఔన్నత్యాన్ని విన్న భర్త మన్మధరావు కూడ తనలో మార్పు తెచ్చుకుని తన యావదాస్తిని ఆశ్రమానికి రాసి తానుకూడా ఆశ్రమంలో చేరడం కొసమెరపు. దాంతో తిరిగి భార్యాభర్తలుగా మారి తామిద్దరు సంఘ సంస్కర్తలుగా పేరుగాంచడం విశేషం. చివరకు తన స్నేహితురాలు సుమంగళి కూడ అశ్రమంలో చేరడంతో కథ ముగుస్తుంది.

అహంకారంతో మనుషులు ఎప్పటికైనా చేసిన తప్పులు తెలుసుకొని, వాస్తవ ప్రపంచంలోకి రావాల్సిందే అని రచయిత ఈ నవల ద్వారా చెప్తాడు. తప్పు చేసిన వారు తెలుసుకున్న తర్వాత వారిని ఆదరించక తప్పదు అనే విషయాన్ని కూడా రచయిత ఇందులో చెప్పాడు.

### 3.1.33. ఆడపిల్లేనా-2012

**రచయిత పరిచయం:** సిరిగాద శంకర్ 1947లో నిజామాబాదు జిల్లా దోమకొండ తాలూకాలో గల బీబీపేట గ్రామానికి చెందినవారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరి తల్లిదండ్రులు బాలమ్మ, నర్సయ్యలు. కలంపేరు 'సూర్యశ్రీ'. ఇతనికి సాహితీ బంధు, సాహిత్యశ్రీ అనే బిరుదులున్నాయి. అంతేగాక తన ఉపాధ్యాయ వృత్తిలో ఉండగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఉపాధ్యాయ రత్న, యూనిక్ వరల్డ్ రికార్డు, వండర్ వరల్డ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ఇలా ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఇతని కలం నుంచి జాలువారిన రచనలు "పో, పద, రా(కవితా సంపుటిలు), కూడెల్లి రామేశ్వరం(స్థల పురాణం), తెలంగాణ ఉయ్యాల పాట, ప్లీజ్ తాళి తెంపకు" మొదలైనవి రాశారు.

ఆడపిల్లేనా నవలలో స్వప్న పాత్ర చాలా ప్రధానమైంది. కథ ఆద్యాంతం ఈమె చుట్టూ తిరుగుతుంది. స్వప్న తెలివైనది, మంచి వ్యక్తిత్వం గలది. తను ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేసి తల్లిదండ్రులకు అండగా నిలవాలనుకుంటుంది. ఈమె తల్లిదండ్రులు చిరు వ్యాపారస్తులు. వీరికి ఇద్దరు కూతురులు. పెద్ద అమ్మాయి స్వప్న, చిన్నమ్మాయి సంధ్య. ఇద్దరు అమ్మాయిలు కావడంతో చదివించే స్తోమత లేక స్వప్న చదువు మాన్పించి రాముకిచ్చి ఆధిక మొత్తంలో కట్నకానుకలిచ్చి ఘనంగా వివాహం జరిపిస్తాడు. కొంతకాలం గడిచిన తర్వాత అత్తగారింట్లో కష్టాల పాలవుతుంది. అదనపు కట్నం కొరకు చిత్రహింసలకు గురిచేస్తూ, కష్టపెడుతుంటారు. తెచ్చిన కట్నంతో కట్టుకున్నవాడు, అత్తమామలు జల్సాలు చేస్తూ, వారి ఆడబిడ్డల పెళ్లిలు జరిపిస్తారు. వీరి గొంతమ్మ కోర్కెలు కాదనలేక ఇవ్వడం వలన స్వప్న తల్లిదండ్రుల ఆస్తి అంతా ఆవిరి అవుతుంది. తమ చిన్న కూతురు పెళ్లి కొరకు బ్యాంకులో పది

లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తారు. రాము తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు కావడంతో గారాబంగా పెంచారు. దాంతో బాధ్యత రహితంగా మారి, చేదు వ్యసనాలకు బానిసైయ్యాడు. ఉద్యోగం లేక జూలాయిగా తిరుగుతూ, భార్యను తిట్టడం, కొట్టడం లాంటి పనులు చేస్తూ పుట్టింటి నుండి అదనపు కట్నం లేదా డబ్బులు తీసుకొని రమ్మని బాధిస్తుండేవాడు. ఒకనాడు రాము తన మామ ఆస్తి తనకే సొంతం కావాలనే దురాలోచనాతో స్వప్న చెల్లి సంధ్యని పెళ్ళి చేసుకుంటే ఆస్తితోపాటు అందాన్ని అనుభవించవచ్చు. ఆ కుట్రలో భాగంగా సంధ్యను లోబరచుకొనే ప్రయత్నం చేస్తాడు. కాని సంధ్య నిరాకరించి, అతనికి ఎదురు తిరుగుతుంది. ఎలాగైనా డబ్బు సంపాదించాలని రాము తన స్నేహితులతో కలిసి తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించి ధనవంతుడిని కావాలని జూదం, దొంగ నోట్ల ముద్రణ, స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు పట్టుపడతాడు. అతనికి పదిహేను సంవత్సరాల జైలుశిక్ష అనుభవించి తిరిగి వస్తాడు. తన అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుని అటూ కుటుంబానికి, ఇటూ సమాజానికి మాయని మచ్చగా మిగిలిపోయాడు. భర్త జైలుపాలైన తర్వాత స్వప్న తన కూతురుతో పుట్టింటికి వచ్చి జీవితాన్ని కొనసాగిస్తుంది. తను ఎంతోకాలం క్రితం మానేసిన చదువును తిరిగి ప్రారంభించి ఉన్నత చదువులు బి.ఎ, ఎం.ఎ, పి.హెచ్.డి. పూర్తిచేసి అధ్యాపకురాలిగా ఉద్యోగం చేస్తుంది. కష్టాల సుడిగుండాలలోంచి బయటపడి తన కూతురిని చదివించి డాక్టరుని చేస్తుంది. ఒకనాడు స్వప్న కూతురికి యాక్సిడెంట్ అవుతుంది. ఈమెకు అనుకోకుండా రాము రక్తధానం చేసి ప్రాణాన్ని నిలబెడతాడు. అది తెలుసుకున్న స్వప్న తన భర్త మారుమనస్సును పొందాడని గ్రహించి రాముని ఆరాధిస్తుంది. ఇద్దరు కలిసి జీవితాన్ని పునఃప్రారంభించడంతో ఈ నవల ముగుస్తుంది.

ఈ నవలలో స్వప్న పాత్ర దైర్యవంతురాలిగా, కష్టాలన్నింటిని ఎదుర్కొని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సంపాదించి తన కూతురు భవిష్యత్తుకోసం పాటుపడుతుంది. రాము ధనిక కుటుంబంలో గారాభంగా పెరగడంవల్ల, కష్టం విలువ తెలియక అప్పణంగా వచ్చిన ధనంతో జల్సాలు చేయడంతోపాటు, అక్రమంగా సంపాదంచాలని అడ్డదారులు పడ్డాడు. చేసిన తప్పుకు తగిన ప్రతిఫలం చెల్లించి, మిగతా జీవితాన్ని సంతోషంగా కలిసి ఉంటారు.

కేవలం ఆడదే కదా అని విర్రవీగే పురుషాహంకారులకు స్త్రీ తలుచుకుంటే ఎమైనా సాధిస్తుందని రచయిత ఈ నవలలో తెలియజేశాడు.

### 3.1.34. స్వేఛ్ఛా విహంగాలు-2013

ఈ నవలను సిరిగాద శంకర్ రాశారు. ఈ నవలలో రమ, ప్రవళిక వీరిద్దరు చిన్ననాటినుండి స్నేహితులు. వీరి కులాలు వేరైనా రెండు కుటుంబాలు కలిసే ఉండేవి. రమ వాళ్ల నాన్నకి ఉద్యోగరీత్యా బదిలీ కావడంతో హైదరాబాదులో స్థిరపడతారు. రమ ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం చేస్తుంటుంది. ప్రవళికను చదివించే స్తోమత లేక మెట్రిక్యులేషన్ వరకు చదివి మానేపిస్తారు. రమకి మధుతో పరిచయమై, అది ప్రేమగా మారి పెళ్ళి వరకు దారి తీస్తుంది. కాని వీరిరువురు ఒకే కులానికి చెందినవారు కాదు. పెద్దలు దీనికి అంగీకరించకపోవడంతో వీరి ప్రేమ ప్రేమగానే మిగిలిపోతుంది. తర్వాత రమకి వేరే వారితో వివాహం జరిగిపోతుంది. కాని రమ, మధులు నిత్యం రహస్యంగా కలుసుకొని సినిమాలూ, షికార్లు కొడుతూ తమ వాంఛలను తీర్చుకుంటుంటారు. ఒకనాడు వీరిద్దరు కలిసి ఒక పథకం వేసి. తన చిన్ననాటి స్నేహితురాలైన ప్రవళికను మధుకిచ్చి వివాహం చేస్తే బాగుంటుందని పథకాన్ని వేస్తారు. ప్రవళిక పెద్దగా చదువుకోని పల్లేటూరి పిల్ల. పైగా పట్నం విషయాలు అంతగా తెలియదు. కాబట్టి తమ చాటుమాటు వ్యవహరాలేమి తెలియనీయకుండా, తమ రహస్య జీవితం ఇదేవిధంగా కొనసాగించవచ్చని అనుకుంటారు. అనుకున్నదే తరువాయిగా రమ, వాళ్ళ ఊరికి వెళ్ళి ప్రవళిక తల్లిదండ్రులతో మాట్లాడి పెళ్లికి ఒప్పిస్తుంది. తానే దగ్గరుండి అన్ని పనులు చేసి రమ, మధుల వివాహం జరిపిస్తుంది. ప్రవళిక తన స్నేహితురాలిని కలవడానికి వస్తుందనే వంకతో మధుని కలుసుకోవడం చేస్తుంది. రమ, మధుల ప్రేమకి ప్రవళిక ఎక్కడ అడ్డం వస్తుందేమోనని, ఆమెతో నువ్వు మానేసిన చదువును మళ్ళి తిరిగి ప్రారంభించాలని, నీవు చదివినంత చదివిస్తారని చెప్పి పై చదువుల కొరకు దూరం పంపించి వీరు రాసలీలలు కొనసాగించేవారు.

ఈ విధంగా కాలక్రమంలో ప్రవళిక బి.ఎ., యం.ఎ., యల్.యల్.బి., ఐ.ఎ.యస్. వరకు చదువుతుంది. ఒకనాడు మధు వాళ్ళ అక్క(శ్వేత) వీరి సంగతి తెలిసి తమ్ముడిని హెచ్చరించి వెళ్తుంది. కాని మధు ఏమాత్రం మారలేదు. మరొకనాడు ప్రవళిక దృష్టిలో పడతారు. భర్తను ఎదిరిస్తుంది. కాని అతనిలో చలనంలేదు. భర్తకు బాగా ఆరోగ్యం క్షీణించి కిడ్నీలు పాడవుతాయి. దాతల కోసం ఎంత ప్రయత్నించిన మ్యాచింగ్ బ్లడ్ గ్రూపు దొరకదు. చివరికి రమ తన ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమించన మధు చావుబ్రతుకుల మధ్య ఉన్నాడని తెలిసి తన కిడ్నీనిచ్చి కాపాడుతుంది. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత కూడా మారలేదు. రమ భర్త అనుకోకుండా యాక్సిడెంట్లో చనిపోతాడు. చివరికి ప్రవళిక ఒక నిర్ణయం తీసుకుంటుంది. తను ఎక్కడో పల్లెటూరిలో ఉండేదాన్ని తెచ్చి ఉన్నత చదువులు చదవించి నన్ను ఈ స్థాయికి ఎదగడానికి సహాయం చేసిన నా భర్త, నా స్నేహితురాలు రమ, అంతేగాక నా భర్తకు కిడ్నీ ఇచ్చి ప్రాణం కాపాడింది. వీరిద్దరి ప్రేమ ఎంతో గొప్పదని భావించి, మధు చేతిని రమ చేతిలో పెట్టి, తాళి కట్టించి ప్రవళిక అక్కడి నుండి వెళ్ళిపోవడంతో ఈ నవల ముగుస్తుంది.

పేదరికంలో పుట్టిన ప్రవళికను ఇంత గొప్ప చదువులు చదివించినందుకు రమ, మధుల ప్రేమకు నేను అడ్డుగా నిలవకూడదని, వారి స్వేచ్ఛకు నా నుండి విముక్తి లభించాలని అక్కడి నుండి వెళ్ళిపోతుంది. అంతేగాక తన వెంట తాను సంపాదంచుకున్న డిగ్రీలు చేత పట్టుకని తన ఏలాగైన బ్రతకగలదనే ధైర్యం ఈ నవలలో కనిపిస్తుంది. మనుషులు తమ ప్రేమకోసం ఎలాంటి సాహసాలు చేస్తారో ఈ నవలలో మనం గమనించవచ్చు. అదేవిధంగా ఒకరి వైవాహిక జీవితాన్ని కూడా గాఢమైనా ప్రేమికులు ఎలా చిద్రం చేస్తారో రచయిత చిత్రించారు.

### 3.1.35. యశోధరుడు-2014

యశోధరుడు నవలను మేడిచర్ల ప్రభాకరరావు రాశారు. ఈ నవలలో ప్రాధాన పాత్ర యశోధరుడు. ఇతను గత కొంతకాలంగా ఆత్మహత్య చేసుకోవాలనే ప్రయత్నం చేసి విఫలం

చెంది, నిరాశ నిస్పృహలకు లోనవుతాడు. విజయం సాధించలేక విసిగి, మానసికంగా చాలా బాధపడుతూ పశ్చాతాపానికి గురవుతాడు. పశ్చాత్తాప విముక్తికై అనేక ప్రయత్నాలు చేసి, మతిభ్రమించి పిచ్చివాడై గమ్యం లేక తిరుగుతుంటే అనుకోకుండా ఒక ఆశ్రమ బోర్డు కనపడుతుంది. ఇక్కడైతే తనకు మనశ్శాంతి, బ్రతుకు మార్గం దొరుకుతుందని ఆ ఆశ్రమాన్ని చేరి, స్వామిని దర్శించుకుని అతను చెప్పిన ప్రవచనాలు విని ఆ ఆశ్రమంలో కొంతకాలం ఉండడానికి అనుమతి తీసుకుంటాడు. ఆరు నెలలు గడిచేసరికి అక్కడి సేవకులతో, శిష్యులతో కలిసిపోయి వారికి విశ్వాసపాత్రుడుగా మారాడు. ఒకనాడు స్వామిజీ యశోధరునికి సంబంధించిన విషయాలను తెలిసుకునే ప్రయత్నంలో భాగంగా స్వామిజీ తన గత జీవితాన్ని చెప్తాడు. కాని యశోధరుడు తన గురించి మాత్రం ఏం చెప్పడు. కాలమే అతనితో సమాధానం చెప్పిస్తుందని స్వామిజీ వెళ్ళిపోతాడు. అనుకోకుండా స్వామిజీ ఒక పత్రికను చూసి ఆశ్చర్యంతో యశోధరుడని పిలిపించి నీవొక ముఖ్యమంత్రికి భర్తవైయుండి ఇక్కడ అతిసామాన్యడిగా జీవిస్తున్నావని అని ప్రశ్నించేసరికి తన గురించి చెప్పడం ప్రారంభిస్తాడు. తనొక నిరుపేద కుటుంబంలో జన్మించాడు. తండ్రి పట్టించుకోక పోయేసరికి తల్లే ఆధారమైంది. కాస్త తెలివి గలవాడినని అందరూ ఆదరించారు. అలా నన్ను నాయకుడిని చేశారు. దాంతో మంత్రుల వద్ద చేరి బాగా సంపాదించి స్వగ్రామం చేరి గ్రామ సర్పంచిగా ఎన్నుకొబడి కావలసినంత వెనుకేసుకున్నాను. అమ్మ నేను సుఖజీవనం సాగించాము. అమ్మ ప్రోద్బలంతో సౌందర్యవతైన దమయంతిని వివాహం చేసుకున్నాను. దురదృష్టవశాత్తు నా భార్యకి, తల్లికి నాతీరు నచ్చక వేరే ఉండాల్సి వచ్చింది. కాలగమనంలో నాకు ఒక అంధవికారమైన కూతురు, మందబుద్ధిగల కొడుకు జన్మించారు. వీళ్ళని చూశాక అర్థమైంది. ఇది నా పాపకర్మ ఫలితమని, అయినా చేసేదేముందని మౌనం పాటించాను. కాని బుద్ధి మారలేదు. అవకాశం దొరికినప్పుడల్లా ఉపయోగించుకుని మంత్రి పదవిదాక ఎదిగిపోయాను. ముఖ్యమంత్రి కావాలనే కోరికతో అడ్డదారుల్లో బాగా సంపాదించి స్థిరపడ్డాను. భగవంతుని దృష్టిలో ఎవరు అతీతంగాదనే విషయంతో తనకు యాక్సిడెంట్ అయి కోమా స్థితిలో పడవేశాడు. నా ఈ స్థితికి కారణం నివ్వంటే నివని నా తల్లి, భార్యలు ఒకరినొకరు ధూషించుకుని దూరమైయ్యారు. నన్ను చూడాలనే నెపంతో హోంశాఖ మంత్రి

నా భార్యైన దమయంతిని లోబరుచుకుంటాడు. కొంతకాలంగా భర్తను మరిచిపోయి పూర్తిగా రాజకీయాల్లో లీనమైంది. దాంతో తనేవ్వరికి పనికిరానప్పుడు ఎవరికోసం బ్రతకాలని ఆత్మహత్య చేసుకొవాలని ప్రయత్నించి విఫలమై ఇక్కడికి చేరుకున్నానని తన కథను ముగించాడు. దానికి స్వామిజీ నీ భార్య ముఖ్యమంత్రి అయి నిన్ను ఆహ్వానిస్తుంది. ఇప్పుడేమంటావని అడిగితే నేనిక్కడే ఉండి ఆధ్యాత్మిక జీవితమే కొనసాగిస్తాను అక్కడికి వెళ్ళను అంటాడు.

అందుకు స్వామిజీ అంగీకరించక నీవెక్కడైతే పాపము చేసినావో అక్కడనే పాప ప్రక్షాళన చేసుకో అప్పుడే నీ పశ్చాత్తాపము ఫలించి నీ జీవితిము తరిస్తుంది. అదే ఆధ్యాత్మిక జీవితమని పరిపరి విధాల బోధించి యశోధరుడిని ఒప్పిస్తాడు. అలా ముఖ్యమంత్రి అయిన భార్యను చేరుకొని చేయవలసిన సంస్కరణలు వివరించాడు. స్వామిజీ చెప్పినట్టుగా భార్యను చేరి తగిన గౌరవస్థానం సంపాదించి స్వామిజీ చెప్పిన సంస్కరణలను సమయానుకూలంగా ఆచరణలో పెట్టి భార్యచేత భర్తగా ఆదరింపబడ్డాడు. తన జీవితం సార్థకమైంది. ఎప్పుడైన ఎవరైన తన జీవితం సార్థకత చేసుకోక తప్పదు. అప్పుడే వారు ధన్యులవుతారని ఈ నవల సారాంశం.

అంతేగాక ఏ జన్మల చేసుకున్న పాపకర్మ ఫలాలని ఆ జన్మలోనే అనుభవించాలని కర్మ సిద్ధాంతాన్ని పైకి చెప్తూ, పాపాలన్నింటికి ప్రాయశ్చిత్తం సేవా చేయడం ద్వారా పోతాయని దీనికోసం ఆశ్రమాన్ని తెరపైకి తెచ్చి దాని ద్వారా ఈ ఆశ్రమ ధర్మాలు పాటించమని బోధనలు చేయడం ఈ నవలలో కనిపిస్తుంది.

### 3.1.36. చిరుజల్లు కురిసేనా-2014

ఈ నవలను స్వాతి శ్రీపాద రాశారు. పెద్దలు నిర్ణయించిన వివాహం ఇష్టంలేని సుధీర తన చిన్ననాటి స్నేహితుడైన రమణతో పారిపోయి పెళ్ళి చేసుకుంటుంది. కట్టుబట్టలతో పారిపోయిన వారికి ఆశ్రయం ఇచ్చి సహాయ పడుతుంది జ్యోత్స్న. సుధీర, రమణల

తల్లిదండ్రులకు వీరి వివాహం ఇష్టం ఉండదు. సుధీర తండ్రి ఒక తాగుబోతు. కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. ఇమెకి ఇద్దరు చెల్లెల్లు. వీరి కుటుంబం పూట గడవడానికి అతి కష్టంగా ఉండేది. రమణ వాళ్ళది ధనవంతుల కుటుంబం. ఇష్టంలేని పెళ్ళి చేసుకున్నారని వీరిని అసహ్యంచుకుంటారు. కాలక్రమంలో సుధీర గర్భవతి అని తెలుస్తుంది. దానితో ఇరుకుటుంబాలు దగ్గరైనట్లు కనిపించిన వారి కోపం మాత్రం తగ్గలేదు. ఒక రోజున సుధీరకు కడుపునొప్పితో రక్తస్రావం ఏర్పడి అబార్షన్ అవుతుంది. ఆ సందర్భంలో తల్లిప్రాణాలు కాపాడాల్సిన పరిస్థితుల్లో డాక్టర్లు ఆమె గర్భసంచిని తొలిగించవలసి వస్తుంది. దానితో ఆమెకు జీవితంలో పిల్లలు పుట్టరు అనే విషయం తెలుసుకున్న రమణ, సుధీరలు కన్నీరుమున్నీరు అవుతారు. మేము కన్న కలలన్ని అడియాశలుగా మిగిలిపోతాయి. దీంతో రమణ తల్లిదండ్రులు అతనికి మరొక వివాహం చేయాలని ఆలోచిస్తారు. సుధీర చాలా బాధపడుతుంది. చివరకు రమణ తన భార్య(సుధీర)కు ఇక జీవితంలో పిల్లలు పుట్టరనే నిజాన్ని జీర్ణించుకోలేక ఇల్లు వదిలి ఎక్కడికో వెళ్ళిపోతాడు. సుధీరకి తన జీవితం కళ్ళముందు దర్శనమిస్తుంది. తను ఎందుకు బ్రతకాలి? ఎవరి కోసం బ్రతకాలి? ఒకపక్క తనను పట్టించుకోని తాగుబోతు తండ్రి, మరో ప్రక్క పారిపోయిన భర్త, అవసరానికి అప్పుడో ఇప్పుడో కనిపిస్తూ వారి అవసరాలు తీర్చుకునే అమ్మచెల్లెళ్ళు, మరొవంక దుమ్మెత్తిపోసి, శాపనార్ధాలు పెట్టే అత్తింటివారు. ఇలా తన నూరేళ్ల జీవితం ఇలా గడపవల్సిందేనా! అంటూ ఒక నిర్ణయానికి వచ్చి, నిద్రకోసం డాక్టర్ ఇచ్చిన నిద్రమాత్రలు వేసుకుంటుంది. తనమీద తనో రకమైన కసి తీర్చుకున్నానకున్నది. కాని తను పిరికిదికాదు. వెంటనే తను ఎలాగైన జీవితంలో గెలవాలని ప్రతిసమస్యను ఎదుర్కోవాలనుకుంటుంది. అర్ధరాత్రి లేచి తడబడుతూ పక్కింటికి వెళ్ళి నన్ను కాపాడమని అంటూ నిద్రలోకి వెళ్తుంది. కళ్లు తెరచి చూచేసరికి తను హస్పిటల్‌లో ఉంటుంది.

సుధీరకు వ్యైదం చేసిన డాక్టర్ పేరు సుశాంత్ ఇతనొక అనాథ. తను ఆశ్రమంలో పెరుగుతాడు. సుధీరకు సుశాంత్‌తో పరిచయం అవుతుంది. అతడు చూపించే ఆప్యాయతకు ఆధారాభిమానాలకు సుధీర ముగ్దురాలు అవుతుంది. అయితే ఇదివరకే సుశాంత్‌కి చిన్నప్పటి

స్నేహితురాలైన శకుంతలతో ప్రేమలో పడతాడు. కాని ఆమె అతన్ని తిరస్కరిస్తుంది. దాంతో జీవితం మీద విరక్తిచెంది అత్మహత్య చేసుకోవాలని హుస్సేన్ సాగర్‌లో దూకితే ఈత పోటీలు ప్రాక్టీస్ చేస్తున్న వాళ్ళు రక్షించడం, తిరిగి నడిరోడ్డు మీద నిలబడి యాక్సిడెంట్ చేసుకోవాలనుకున్నాడు. కాని అతని ఆశ ఆశగానే మిగిలింది. చివరసారిగా గన్నేరు పప్పు తిని చావాలనుకున్నాడు. కాని ఆశ్రమ ధర్మకర్త వచ్చి పసరుపోసి కాపాడుతాడు. అప్పటికే ఎంసెట్ మొదటి ర్యాంక్ సాధించిన సుశాంత్ ఇలా చేయడం బాధాకరమని అతన్ని మందలించి మంచి విషయాలు చెప్పి వెళ్తాడు. దాంతో మనస్సు మార్చుకొని, జీవితంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదురించాలే! తప్ప పిరికివారిలా మరణించొద్దనే విషయం గ్రహించాడు. ఈ విషయాలన్ని సుధీరకు చెప్తాడు. దీంతో వారు ఒకరి గురించి ఒకరు తెలుసుకొని మరింత దగ్గరవుతారు. ఒకరోజు సుశాంత్ ఐ.సి.యూ.లో ఉన్న సమీరను తన భార్యంటూ పరిచయం చేస్తాడు. సమీర ఒక ధనవంతురాలు. తల్లి లేకపోవడంతో తండ్రి బాగా గారాభం చేసి పెంచుతాడు. తన భార్య మరణంతో చెడు వ్యసనాలకు అలవాటుపడి రోజుకో అమ్మాయిని ఇంటికి తెచ్చుకునేవాడు. సమీర కళ్ళముందే తన తండ్రి చెడిపోవడంతో తాను కూడా నెమ్మదిగా చెడు వ్యసనాలకు అలవాటుపడుతుంది. సమీర ఓ ఆటోవాడిని ప్రేమించి ఇంట్లోని డబ్బులు, నగలతో పారిపోతుంది. ఆ ఆటో డ్రైవర్ ఆమెని వదిలివేసి తన దగ్గరున్న డబ్బులు కాజేస్తాడు. దాంతో ఆమె తండ్రికి ఫోన్ చేస్తే వచ్చి తీసుకెళ్తాడు. ఆటో డ్రైవర్ కారణంగా సమీరకు ఎయిడ్స్ వస్తుంది. సుశాంత్ పనిచేసే హస్పిటల్లో ఆమెను ఆడ్మిట్ చేస్తే సుశాంత్ మంచితనం వారికి నచ్చి సుశాంత్‌ను సమీరకు ఇచ్చి వివాహం చేయిస్తాడు సమీర తండ్రి. కాని సుశాంత్ ఏప్పటికి తనకు సమీర కేవలం ఒక బాధ్యతగా మాత్రమే చూస్తాడు. అయితే సుధీర, సుశాంత్ ఒకరికొకరు నచ్చుకొని వివాహం చేసుకోవాలనుకుంటారు. కాని సమాజం దృష్టిలో సుధీరకి, రమణలకి విడాకులు తీసుకొలేదు. అంతేకాక భర్త ఉన్నడో లేడో కూడా తెలియదు. సుశాంత్ సమీరని బాధ్యతే కాని భార్యగా స్వీకరించడు. వీరిద్దరు ఒక నిర్ణయానికి వచ్చి, పెళ్ళి అనేది కేవలం సంఘం, సమాజం కోసం. ఒక్కరికొకరు మనస్సులు ఇచ్చిపుచ్చుకున్నాక పెళ్లికంటే ఉన్నతమైన

బంధమని, ఒక్కరికొకరు సహజీవనం గడుపుతూ వారి వారి పనులు చేసుకుంటూ జీవినాన్ని కొనసాగడంతో ఈ నవల ముగుస్తుంది.

జీవితంలో సమస్యలు వచ్చినప్పుడు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగిపోవాలనే సందేశం ఈ నవలలో కనిపిస్తుంది. తొందరపాటు నిర్ణయాల వల్ల తప్పులు జరుగుతుంటాయి. కాని వాటిని సర్దుకొనిపోవాలి. అదేవిధంగా పెళ్ళి అనేది సంఘంకోసమే. కాని మనస్సు ఇచ్చుకొని, అర్థం చేసుకుంటూ సహజీవనం చేస్తు జీవితాన్ని గడపవచ్చనే విషయాన్ని రచయిత ఈ నవల ద్వారా తెలియజేస్తుంది.

### 3.1.37. కిడ్నాప్-2017

ఈ నవలను యాటకర్ల మల్లేశ్ రాశారు. వాస్తవ సంఘటనల ఆధారంగా 1980 దశకంలో నిజామాబాదులో జరిగిన కథను ఈ నవలలో పొందుపర్చారు. నక్సలైట్లు నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పరితపిస్తూ తన వాళ్ళకు దూరమై నిత్యం అడవుల్లో తలదాచుకుంటూ, ప్రజలకు మేలు చేసే పనులను చేస్తూ, ఆదరణను పొందుతున్నారు. వీరిని పోలీసులు వెంబడించడం, పోలీసులను నక్సలైట్లు ఎదుర్కోవడం వంటి సంఘటనలు నిత్యం తెలంగాణ పల్లెల్లో నాడు ఎక్కువగా కనిపించేవి. ఇలా చాలా ఎన్‌కౌంటర్‌లు జరగడం అటు నక్సలైట్లు, ఇటు పోలీసులు నేలకొరగడం భూస్వామ్య విధానం రాజ్యమేలుతున్న తెలంగాణలో సర్వ సాధారణమైపోయింది. ఈ సందర్భాలలో నక్సలైట్లను పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడం లేదా దొరికితే జైల్లో బంధించడం వంటివి చేస్తుండేవారు. ఆ క్రమంలో నక్సలైట్లు ప్రతీకారం తీర్చుకోవడం కోసం పోలీసులను కాపుకాసి మట్టుపెట్టడం లేదా ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేసి తమకు ఏం కావాలో ప్రభుత్వం ద్వారా చేయించుకునేవారు. అలా కిడ్నాప్ చేసినవారిని విడిచిపెట్టడం లేదంటే వారు ప్రజలను ఇబ్బంది పెట్టిన సందర్భాలు ఏమైనా ఉంటే కాల్చిపడేయటం వంటివి చేస్తుండేవారు. అటువంటి సంఘటన ఆధారంగానే యాటకర్ల మల్లేశ్ రాసిన నవల 'కిడ్నాప్'.

మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రేస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎమ్మెల్యే మండవ వెంకటేశ్వరరావును నక్సలైట్లు కిడ్నాప్ చేశారు. ఇతను టిడిపికి చెందిన ఎమ్మెల్యే. నక్సలైట్లను అరెస్ట్ చేసి జైల్లలో వేసినవారిని విడిచిపెట్టాలనే షరతు పెట్టి ఎమ్మెల్యేను కిడ్నాప్ చేస్తారు. ఇతను రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా కృతజ్ఞతాపూర్వకమైన సమావేశాలు ఏర్పాటు చేయడం కోసం వెళ్ళే సమయంలో నక్సలైట్లు అతన్ని కిడ్నాప్ చేస్తారు. ఇతనికి ప్రజల్లో కలియ తిరిగి, ప్రజాసమస్యలను తీర్చేవాడు. అందువల్ల అతని కిడ్నాప్‌ను ప్రజలు వ్యతిరేకించి, ఎదురుతిరిగారు. అడవుల్లో అతన్ని తీసుకెళ్ళి మర్యాదగానే ప్రవర్తించారు నక్సలైట్లు. ఇతను అధికార పార్టీ ఎమ్మెల్యే కాకపోవడంతో ప్రభుత్వం అంత సీరియస్‌గా తీసుకోలేదు. నక్సలైట్ల షరతులు అమలు చేయకపోవడంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులను సైతం కిడ్నాప్ చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపడితే ఎమ్మెల్యేను కాల్చిపడేస్తామని బెదిరించారు. చివరకు కొన్ని డిమాండ్లే అమలు అయినా, ఎమ్మెల్యేకు ఉన్న మంచితనాన్ని చూసి విడిచిపెట్టారు నక్సలైట్లు. "ఏ రాజకీయ నాయకుడికైనా బలం పోలీసు బలం కాదు. నాకోసం ఇంతమంది ప్రజలు పరితపించడం వల్లనే నక్సల్స్ నన్ను విడుదల చేసారు. నేను రాజకీయాల్లోకి డబ్బులు సంపాదించడానికి రాలేదు. డబ్బులకు కక్కుర్తిపడి ఉంటే, ప్రజాభిమానం నాకు లేకుంటే నన్ను నక్సల్స్ విడుదల చేయకపోయేవారు. ఏదోఒకరోజు ఇలాంటి పరిస్థితి రావచ్చని తెలిసినప్పటికి ప్రజాప్రతినిధిగా తన బాధ్యత నెరవేర్చడానికి గ్రామాల్లో పర్యటించాను. నన్ను ఆదరించిన ప్రజలకు సేవ చేసి వారి రుణం తీర్చుకుంటాను. నా తండ్రి నిజాయితీ, వ్యక్తిత్వం ఆచరణలే నన్ను ఉన్నతుడిగా తీర్చిదిద్దాయి."(మల్లేష్, యాటకర్ల. కిడ్నాప్. పుట: 92). తన మాటల్లో ఎమ్మెల్యేను విడుదల చేసిన విధానం చెప్పాడు.

ఇందులో ప్రధానంగా ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల ఓట్లతో ప్రజల కొరకు గెలిచిన ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులు చేయకపోవటంతో యువత నక్సలైట్లలో చేరి ప్రభుత్వాలను ఎదిరించే ప్రయత్నం చేస్తోంది. ప్రధానంగా తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో దొరల, భూస్వాముల ఆగడాలను అణచి, వారికి 'ప్రజాకోర్టు' పేరిట శిక్షలు విధించడం వంటివి చేస్తూ ప్రజల దృష్టిలో మంచివారిగా పేరు తెచ్చుకుంటున్నారు. వారినే మనం

నక్సలైట్లు అంటున్నాం. తప్పు చేసిన ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేసి తమ డిమాండ్లను సాధించుకునే విషయాన్ని ఈ నవలలో మనం గమనించవచ్చు.

### 3.1.38. కానుక-2017

**రచయిత పరిచయం:** డా. వి.ఆర్.శర్మ. ఇతని పూర్తి పేరు విఠల రాజేశ్వరశర్మ. తల్లిదండ్రులు విఠల లలిత, విఠల బాలరాజయ్య. 1956లో జన్మించారు. స్వస్థలం కామారెడ్డి. పుట్టి పెరిగింది ఇక్కడే. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. వీరి రచనలు: కానుక, ప్రయాణం, బాల వర్ధన్, రక్ష అనే నవలలు. కవితా సంపుటాలు: వానపూల కొండ, తెల్లచీకటి, సూర్యుడు అనేక రంగుల్లో ఉదయిస్తాడు, మా వూరి మట్టివాసన, గులేర్, తెలంగాణ, ప్రత్యేక తెలంగాణ, నాలుగున్నర కోట్ల నదుల హోరు. పాటల సంకలనాలు: సూర్యుల్లను వెలిగించండి, పిల్లలకోసం ఆనందం మొదలైనవి. కొందరు విద్యావేత్తలు అనే వ్యాస సంపుటిని కూడా రాశారు. 'సాహు జీవితం–రచనలు పరిశీలన' అనే అంశంపై ఎం.ఫిల్ పరిశోధన చేశాడు. 'ఆధునిక కవిత్వంలో బాల్య చిత్రణ' అనే అంశంపై పిహెచ్.డి పరిశోధన కాకతీయ విశ్వవిద్యాలయంలో చేశాడు. బాల సాహిత్య వేదికకు వ్యవస్థాపక అధ్యక్షులుగా పనిచేశారు. కామారెడ్డి జిల్లాలో బాలలకోసం నవలలు రాసిన రచయితల్లో లోకమలహరి తర్వాత వీరే అనవచ్చు. అయితే వీరి రచనల్లో బాల సాహిత్యానికి పెద్దపీట వేయటం పిల్లల పట్ల వారికి గల అనురాగానికి చిహ్నం అని చెప్పవచ్చు. పిల్లలతో రాయించడం, పిల్లల కొరకు రాయించడం ఈ రెండు వీరికి రెండు కళ్ళలాంటివి.

వి.ఆర్. శర్మ బాలల కోసమేనంటూ 'కానుక' పేరుతో ఆధునిక బాలల అద్భుత సాహస, కాల్పనిక నవలను రచించారు. ఈ నవల 2017లో ముద్రితమైంది. రచయిత తన ముందుమాటలో ఈనాటి బాల్యానికి నేను ప్రేమతో గొప్ప గౌరవంతో విశ్వాసంతో ఇస్తున్న 'కానుక' నా మొదటి నవల రచయిత పేర్కొన్నాడు.

**వస్తువు:** ఇందులోని ప్రధాన పాత్రలు ప్రణవి, శరత్‌చంద్ర, వేదప్రకాశ్, భువన్, ఆదిత్య. వీరికి సహకరించిన అంగార, నక్షత్రలు. భూమిపై ఉన్న మానవుల కన్నా అత్యాధునిక సాంకేతిక గ్రహాంతర(పవర్ ల్యాండ్)వాసులు భూమిపై దాడిచేసి, భూమిపై జీవరాసులు లేకుండా చేసి

భూమిని స్వాదీనపరుచుకొవాలని చూస్తారు. ఈ భూప్రపంచాన్ని ఎలాగైనా కాపాడుకోవాలనే ధ్యేయంతో పిల్లలు అదే సాంకేతికతను ఉపయోగించుకుని ఏవిధంగా సమస్త జీవరాశిని కాపాడిన విధనం గురించి ఈ నవల చర్చిస్తుంది. ఈ నవలలో ఐదుగురు పిల్లలకు మరో ఇతర గ్రహాంతవాసుల ఇద్దరు పిల్లలు సహరిస్తారు. వీరు ఉండే గ్రహాలపై కూడా పవర్ ల్యాండ్ వారి ఆధిపత్యం ఉంటుంది. కనుక భూగ్రహంపై ఉండేవారిని రక్షించాలనే ఉద్దేశంతో ఐదుగురు పిల్లల దండ్రులకు జరిగే ఉపద్రవాన్ని, ఎదుర్కొనే తీరును వివరిస్తారు.

తెలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా గల నల్లమల అడవుల్లోకి వారివారి తండ్రుల కోరికమేరకు బయలుదేరి అక్కడే సాయంత్రం మూడుగంటల వరకు అక్కడే గడపాలని చెప్పడంతో పది పదిహేడేళ్ళ వయసుగల ఐదుగురు పిల్లలు అడవిని చేరతారు. కొంతసమయం తర్వాత వాతావరణంలో జరిగే మార్పులను గమనించిన పిల్లలు భయపడి ఇంటిముఖం పడతారు. దారిమధ్యలో మానవ సంచారంగాని, పశుపక్ష్యాదులుగాని సమస్త జీవకోటి శబ్దాలుగాని ఇలాంటివేవీ లేకుండా నిర్మానుష్యంగా ఉండటం గ్రహించి ఏదో పెద్ద పెను ప్రమాదం సంభవిస్తుందని గ్రహించి పిల్లలు ఇంటికి చేరతారు. అక్కడికి వెళ్ళేసరికి వారి తండ్రులు ఉండరు. ఎక్కడికి వెళ్ళాలో తెలియని స్థితిలో వారికి అక్కడ రాసిపెట్టిన ఒక ఉత్తరం దొరుకుతుంది. ఆ ఉత్తరంలో ఇలా రాసి ఉంది. ‘మేమంతా నిద్రపోతున్నప్పుడు కలలో అందరికీ ఒకే సమయంలో ఒకే విధంగా ఒకే రకమైన వ్యక్తి ఎవరో పదే పదే చెప్పడం మాకు ఆశ్చర్యం కలిగించింది. మొదట మేము పట్టించుకోలేదు. కాని అదే కల పదే పదే అందరికీ వస్తూ ఉండటం వల్ల మేం దాని గురించి ఆలోచించాం. అలాగే మాకు అసాధ్యమైన ప్రయోగాలతో మానవుల ఊహకు కూడా అందని కొన్ని పరికరాలను మేము తయారుచేశాం. కాని ఎలా చేయగలిగామో మాకు ఎంత ప్రయత్నించినా అర్థం కాలేదు.

ఈ విషయాలు ఎవరికి చెప్పినా మీకు ప్రాణహాని ఉంటుందని కూడా మాకు కలలో హెచ్చరించారు. అసలు అది కల కాదని ఎవరో మానవుల కన్నా అడ్వాన్స్ టెక్నాలజీ సైన్స్ ఉపయోగించి మా మెదడుతో మాట్లాడినట్లు అనిపించింది. ఇది తేలికగా తీసిపారేయాల్సిన

విషయం కాదనిపించింది. అందుకే మిమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చి ఈరోజు ఆ కొండమీదికి మిమ్మల్ని పంపాం. ఏం జరుగుతుందో మాకు కూడా తెలియదు. ఏమీ జరగకపోవచ్చు కూడా. కాని ఏమైనా జరిగితే మిమ్మల్ని మీరే కాపాడుకోవాలనేది తండ్రులుగా మా ఆశ అని ఆ ఉత్తరంలో రాసిపెట్టి ఉంది.'

గెలాక్సికి అవతల రెండువేల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న బిగ్ లైఫ్ అనే సూర్యకుటుంబంలో ఐదవ గ్రహానికి చెందిన అంగార అనే గ్రహాంతర వాసి పరిచయంతో ప్రపంచమంతా తమ గుప్పెట్లో పెట్టుకోవాలని ఇదంతా చేస్తున్న పవర్ ల్యాండ్ వాళ్ళు(సూర్య కుటుంబంలోని చివరి గ్రహానికి చెందినవారు) 'అంగార' అనే అమ్మాయి నివసించే గ్రహాన్ని స్వాధీనపర్చుకొని అక్కడి వారినందరినీ శూన్యంలో అణువులుగా మార్చివేశారు. అలాగే అక్కడి పది నుండి పదిహేడు వయసుగల పిల్లల్ని వాళ్ళు మామూలు రూపమిచ్చి బానిసలుగా మార్చుకున్నారు. ఇప్పుడు అదేవిధంగా ఆ పవర్ ల్యాండ్ గ్రహానికి చెందినవారు మీ భూ గ్రహాన్ని ఆక్రమించుకున్నారు. దాని ప్రభావం వల్లనే ఈ భూ ప్రపంచమంతా నిర్మానుష్యమై సమస్త జీవరాశులు అనంతశూన్యంలో కలిసిపోయాయి. మా దగ్గరున్న టెక్నాలజీతో మీ అయిదుగుర్ని కాపాడుకున్నాం. ఈ ప్రపంచాన్ని రక్షించుకునే భారం ఇప్పుడు మీ పైనే ఉంది. అలాగే మా ప్రపంచాన్ని రక్షించుకోవడానికి మేం చేస్తున్న ప్రయత్నానికి మీ విజయం తోడ్పడుతుందన్ని చెప్పి అక్కడినుంచి 'అంగార' నిష్క్రమిస్తుంది.

భూ ప్రపంచాన్ని రక్షించడానికి వారి తండ్రులు తయారు చేసిన కొన్ని విలువైన వస్తువులు పరికరాల సహాయంతో రక్షించాలనుకుంటారు. కాని ఏమీ తెలియని స్థితిలో ఉన్నప్పుడు వారికి 'నక్షత్ర' అనే ఇంకో గ్రహాంతరవాసి పరిచయం చేసుకుంటూ పవర్ ల్యాండ్ వాళ్ళు చేసిన దుష్ట క్రియలను మరొకసారి తెలియజేస్తూ సరిగ్గా ఐదురోజులపాటు ఆ సమస్త జీవరాశుల అణువులు సజీవంగా ఉండి తరువాత విశ్వధూళిలో కలిసిపోయి నిర్జీవమైపోయి అనంతవిశ్వంలో కలిసిపోతాయి.

సరిగ్గా మూడవ రోజున పది పదిహేడు వయసుగల పిల్లలను మళ్ళీ తిరిగి వాళ్ళ సొంత రూపంలోకి మార్చి ఆ పిల్లలని బానిసలుగా మార్చుకొని తాము సృష్టించిన మారణాయుధాలకు ఆ పిల్లల జీవకణాల్ని బదిలీచేసి వాటి సహాయంతో తమ పాలన భూ గ్రహంపై కొనసాగిస్తారు. దీనికోసం పవర్ ల్యాండ్ వాళ్ళు తమ పవర్ సెంటర్‌లు, శక్తి కేంద్రాలను భూ లోకంలోనే ఐదుచోట్ల యాక్టివేట్ చేయబోతున్నారు. ఒకసారి గనుక అది పనిచేయడం మొదలైతే వాళ్లను ఎవరూ అదిగమించలేరు. ఆపలేరు కూడా. ఆలోగా వాటిని నిర్వీర్యం చేయగలిగితే వాటిని నాశనం చేస్తే వారు ఇక ఏమీ చేయలేరు అని నక్షత్ర ఆ పిల్లలతో చెప్తుంది. అయితే ఆ ఐదు పవర్ ప్లాంట్లలో ఒకటి అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసీలోనూ, రెండోది యూరప్‌లోని ఇంగ్లాండ్ రాజధానిలోనూ, మూడవది చైనా ఆధీనంలో ఉన్న టిబెట్ ప్రాంతంలోని మౌంట్ కైలాస్ ప్రాంతంలో ఉంది. నాలుగవది భారతదేశంలోని కన్యాకుమారిలో ఉంది. ఇక ఐదొవది హైదరాబాదులో ఉందని తెలుసుకుంటారు.

సరిగ్గా మూడవరోజు ప్రపంచవ్యాప్తంగా పది పదిహేడు సంవత్సరాల యవస్సుగల పిల్లలందరూ యధారూపం పొందుతారు. వాళ్ళలో ఈ పిల్లలు కలిసిపోయి అక్కడి ఆరంభ కేంద్రాలకు తీసుకెళ్తారు. ఆ విధంగా వీరంతా వాటి పవర్ స్టేషన్‌లను ఏకకాలంలో ఒకేసారి వాటిని ఏ విధంగా నాశనం చేశారో తెలుపుతూ ఆ పిల్లల తమ శక్తిని మించి అంగార నక్షత్రాల సహాయంతో భూ గ్రహాన్ని రక్షించారో ఈ నవలలో చిత్రించింది.

ఐదుగురు పిల్లలు తమ ధైర్య సాహసాలతో ప్రపంచాన్ని రక్షించిన ఆధునిక అద్భుత కాల్పనిక సాహస నవల ఇది. పిల్లలకే కాదు పెద్దలకు కూడా కుతూహాలాన్ని కలిగించే ఆధునిక బాలల అద్భుతరస నవలగా వి.ఆర్.శర్మ చిత్రించారు. భూమి మీద నివసించే మానవుల కన్నా అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని మానవులపై ఆధిపత్యం చెలాయిస్తే పరిస్థితి ఎలా ఉంటుందనే విషయాన్ని ఈ నవలలో మనం చూడవచ్చు. గ్రహాంతరవాసులు/ఏలియన్స్ మన భూమిపైకి వస్తున్నారనే ఊహాగానాలు వస్తున్నాయి. అదేవిధంగా ఎగిరే పల్లాలు భూమిపై తిరుగుతున్నాయనే వార్తలు కూడా వస్తున్నాయి. వాటికి

ఇంకా పూర్తి ఆధారాలు ఇంకా లభ్యం కాలేదు. ఈ నవలను బాలల చిత్రంగా రూపొందిస్తే మరింత బాగుంటుందని రచయిత అభిప్రాయం.

### 3.1.39. చుక్కాని చిరుదీపం-2017

స్వాతి శ్రీపాద రాసిన ఈ నవలలో వసంతలక్ష్మి ప్రధాన పాత్రగా కనిపిస్తుంది. ఎప్పుడు ఎటువైపు ఎందుకు అడుగులు వేస్తుందో తనకే తెలియకుండా సాగిపోయే ఆధునిక జీవన సంఘర్షణకు ప్రతీకగా వసంతలక్ష్మి ని చెప్పవచ్చు. రేపు ఏం జరుగుతుందో! ఎవ్వరు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో అర్థం కానట్టి పునరాగమనంలోకి కథానాయిక ప్రయాణిస్తుంది. నగరంలో చదువుకున్న ఒంటరి మహిళలకు ప్రతినిధిగా నిలుస్తుంది వసంతలక్ష్మి . కాలం అంతే ఒకరిని ఒకరికి ఎందుకు కలుపుతుందో ఒకరి నుండి మరొకరిని ఎందుకు దూరం చేస్తుందో తెలియని స్థితి. మనసులు కలిసినచోట దేవతలుంటారట. మనుషులు కలిసిన చోటే మనసులు ఉంటారు. కాని మనసుంటే మనిషి దూరమవ్వడం మనిషికి మనిషి మరింత దగ్గర కావడమే ఈ రెండూ విపరీతాలే. ఇదే జీవితం ఎవరికీ అంతుచిక్కని తారతమ్యం. విధి ఆడే వింతవిచిత్రం. ఇటువంటి కథానాయికను తీర్చిదిద్దడంలో రచయిత అనుసరించిన శైలి అనితర సాధ్యమైనది.

నిత్యం సంఘర్షణలకు లోనయ్యే ఆధునిక మహిళా అంతరంగాన్ని ఎంతో అలవోకగా సరళంగా ఆవిష్కరించారు శ్రీపాద.

### 3.1.40. కాలస్పర్శ-2018

**రచయిత పరిచయం:** ఈ నవలను రాసిన మల్లవరపు చిన్నయ్య 1955లో జన్మించారు. తల్లిదండ్రులు మల్లవరపు లుద్దయ్య, తేరేసమ్మ. జన్మస్థలం నిజామాబాద్ జిల్లా, బోధన్ మండలం, జాడి జమల్పూర్ గ్రామానికి చెందినవారు. బి.ఏ. ఆంగ్లం, పిజి డిప్లొమా ఇన్ పిఎమ్ఐఆర్. వృత్తి ఆర్టీసీలో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతిని స్వీకరించి పదవీ విరమణ చేశారు. ఇతని ప్రవృత్తి తెలుగు, ఇంగ్లీషు ఉభయ భాషలలో రచనలు చేసాడు. చాలా పుస్తకాలను అనువాదించాడు. ఇప్పటివరకు ఇరవై పురస్కారాలు అందుకున్నాడు. ఇతను

యాభైకి పైగా రచనలు చేశాడు. 1.కాలస్పర్శ, 2.మృత్యోర్మ అమృతాంగమయ, 3.చిరంతనులు, 4.అరణ్యరోధన, 5.కరణేశుమాత, 6.దాంట్ లెస్ సైలెన్స్(ఇంగ్లీషు అనువాద నవల), 6.వేకువ, మనసు పాడిన మౌనగీతం(కవితా సంపుటి), 7.భగదాన్వేషి, 8.జ్ఞాన ప్రసూనాలు, 9.ఆమని(రెక్కలు), 10.కొమ్మబొమ్మ, మృత్యు శకలం (ధీర్ఘ కవితలు), 11.గొలుసులు(ఆధునిక వచన కావ్యం), 12.కలం చెక్కిన శిల్పాలు, కుంచె అద్దిన రంగులు (నాటికల సంపుటి), 13.కన్నీటి తెర, గెలుపు జెండా, కళేబరం, అనార్కలి, చట్టం ఎవరి చుట్టం(వచన కావ్యాలు). 14.రేడియో నాటికలు: ఆహుతి, పారిజాతం, ప్రయాణంలో పదనిసలు, ఓ ప్రేమ నీకు జోహార్లు, ఎడారి బతుకుల్లో ఊటి నీటి బుగ్గలు, చెక్కర పొంగళి, ఆశాజీవులు, హాలాహలం, సమాజంలో ఓ సమిధ, 15.అనువాదాలు: ఎథిక్స్ ఆఫ్ చాణక్య, ఎథిక్స్ ఆఫ్ విదుర, సుర మొదలైనవి. పురస్కారాలు: తెలంగాణ కళా తేజస్వి-2004, దేవులపల్లి కృష్ణమూర్తి-2011, కుందుర్తి ఉత్తమ పురస్కారం- 2011. బిరుదులు: సాహిత్య ధురీణ-2017, సాహితీ సేవరత్న బిరుదు-2017 మొదలైనవి.

**వస్తువు:** మల్లవరపు చిన్నయ్య 'కాలస్పర్శ' అనే నవలను తెలంగాణా మాండలికంలో రాశారు. కథావస్తువు సూర్యం పాత్రను అనుసరించి నడుస్తుంది. ఈ నవలలో సూర్యం దళిత కుటుంబానికి చెందినవాడు. తన చిన్నతనంలోనే తల్లిదండ్రులు దూరమైతే మేనమామ పెంచి పెద్దచేసి, తన కూతురునిచ్చి వివాహం చేస్తాడు. పెద్దగా చదువుకోకపోయినప్పటికీ తెలంగాణ తొలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొనే రెడ్డన్న అనుచరునిగా పనిచేసేవాడు. రెడ్డన్న సహాయంతో చదువుకొని తన కుటుంబానికి అండగా నిలుస్తాడు. అంతేకాకుండా తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ నేపథ్యంలో చాలా చురుకుగా పనిచేసి మంచిపేరును సంపాదిస్తాడు. తనకు పుట్టిన ఇద్దరు కొడుకుల్ని బాగా చదివించి ప్రయోజకుల్ని చేస్తాడు. తన కొడుకులకు గొప్పింటి పిల్లలను తీసుకొచ్చి పెళ్ళి చేస్తాడు. కోడళ్లకు పల్లెటూరి జీవితం నచ్చక వాళ్ళ అమ్మగారింటికి మకాం మారుస్తారు. తన పరిస్థితిని చూసి ఎప్పుడూ అవహేళన చేసే బావమర్దులను సైతం స్మగ్లింగ్ కేసునుండి విడిపిస్తాడు. జీవనోపాధికోసం ప్రింటింగ్ ప్రెస్‌ను తిరిగి ప్రారంభిస్తాడు. సూర్యానికి విప్లవ భావాలు ఎక్కువగా ఉన్నప్పటికీ అందులో మానవత్వ

దృక్పథం కూడా మనం గమనించవచ్చు. మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ, నీరు దొరకాలని సూర్యం పరితపిస్తుండేవాడు. కనీస అవసరాలు తీరాలనే ఆరాటపడే మనస్తత్వం కలిగినవాడు సూర్యం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కూడా సగటు మనిషికి న్యాయం జరగలేదనే అసంతృప్తితో సూర్యం పాత్ర వ్యక్తమవుతుంది.

ఇదే కాలస్పర్శ... మనిషి గోల స్పర్శ... మనిషి పడుతున్న గోస స్పర్శ... గోడు స్పర్శ... తెలంగాణలో ఉద్యమాలలికిన స్పర్శ... కన్నీరొలికిన స్పర్శ... కృత్రిమ నవ్వుల నయాగారాల స్పర్శ... వాసనలేని కాగితం మాటల స్పర్శ... అనుబంధాలు నశించిన వేదన స్పర్శ... కొత్తవేకువకోసం శోధన స్పర్శ... కొత్తకోణంలోని అన్వేషణ స్పర్శ...ఎదురుచూపుల్లో నలిగి సొలిగి దశాబ్దాల కల సాకారమైన స్పర్శ... మిన్నంటిన సంబురాల స్పర్శ... ఇదే కాలస్పర్శ. ఈ విధంగా రచయిత తన ముగింపు పలుకులు పలకడంతో ఈ నవల ముగుస్తుంది.

### 3.1.41. మృత్యోర్మ అమృతాంగమయ-2018

ఈ నవలలో ప్రధాన పాత్ర పతంజలి. మంచి మానవత్వం కలిగిన మనిషి. పతంజలి పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి. డిగ్రీలో పతంజలికి చిన్నా అనే వ్యక్తితో పరిచయమవుతుంది. కొన్ని కారణాల వల్ల వారిద్దరిమధ్య దూరం పెరుగుతుంది. చిన్నా స్వార్థబుద్ది గలవాడు. అనుబంధాలు, ఆప్యాయతలు అతనికి అవసరం లేదు. ఇది ఇలా ఉండగా పతంజలికి జబ్బు చేసి చావు బతుకుల మధ్య ఉంటాడు. తాను చనిపోయేముందు లోకానికి జీవన తత్వాన్ని బోధించాలనుకుంటాడు. ఆ బోధనలు విన్న చిన్నా పూర్తిగా మారిపోతాడు. మానవతా విలువలను తెలుసుకుంటాడు. పతంజలి కన్ను మూసిన తరువాత చిన్న యోగిగా మారిపోతాడు. యోగిగా మారిపోవడంతో నవల ముగుస్తుంది.

అణువణువులో ఇగోని నింపుకొని జీవిస్తున్న ఆధునిక మానవుడు దానిని దశల వారీగా ఎలా త్యజించి మహోన్నతత్వాన్ని సాధిస్తాడో ఈ ప్రపంచానికి ఒక జ్యోతిలా ఎలా

మారతాడనే విషయాన్ని తెల్పుతూనే అలా మారగలడనే జీవన సత్యాన్ని రచయిత ఈ మృత్యోర్మ అమృతాంగమయ నవలలో తెలియజేశాడు.

### 3.1.42. ప్రయాణం-2019

పిల్లలకోసం రాయబడిన నవల ఇది. దీనిని వి.ఆర్.శర్మ రాశారు. ఇది ఒక రకంగా చెప్పాలంటే ఇతడు రాసిన 'కానుక' నవలను పోలి ఉంటుంది. ఈ రెండు నవలలు కూడా పిల్లల సంబందించిన కథవస్తువువే. ఈ నవలలో కథా వస్తువు అద్భుతంగా చిత్రించబడింది. 'కానుక'లోనూ, 'ప్రయాణం' నవలలోనూ కథా నాయకత్వం పిల్లలదే. అయితే ఆ పిల్లలంతా మామూలు పిల్లలు కాదు. ఎంతో చురుకైన వాళ్ళు, తెలివైన వాళ్ళు, ధైర్య సాహసాలు ఉన్నవాళ్ళు. ఈ కథా నాయకులు తమ శక్తి సామర్థ్యాలకు తోడుగా నిలబద్ద అపారమైన గ్రహాంతర మేధోశక్తి తమ సాంకేతిక పరిజ్ఞానంతో తమ శక్తిమేరకు కృషి చేస్తూ, భూగోళంలోని మానవజాతి రక్షణకోసం పనిచేస్తారు. అయితే ఈ పిల్లలు చేసే అద్భుతమైన మానవ రక్షణ, కృషి సంబంధీకులకు తెలియదు. కథలోకి వెళ్తే గ్రహాంతవాసులు భూమిమీద మనుషుల కన్నా చాలా బలవంతులు. విశ్వంలో చాలా గ్రహాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అందులో రెండు వర్గాలున్నాయి. ఒకవర్గం ఆధిపత్యం సాధించి భూమిని తమ ఆధీనంలోకి తెచ్చుకుంటుంది. మానవుల్ని తమ బానిసలుగా చెయ్యాలని పథకం వేస్తుంది. దానిలో భాగంగానే భూమ్మీది సాంకేతికతను విచ్చిన్నం చేస్తారు. సెల్‌ఫోన్‌లు, టీవిలు, విద్యుత్ ఇలా ఎక్కడికక్కడ నిర్వీర్యమవుతాయి. ఎక్కడి వాహనాలు అక్కడే రోడ్లమీదే నిలిచిపోతాయి. ఇంకొవర్గం మానవ జాతిని ఈ విపత్తునుండి కాపాడటానికి మరో గ్రహాంతర వాసుల్లోని పిల్లలిద్దరు దీనిని కాపాడటానికి పథకం వేస్తారు. దాన్ని అమలు పర్చేందుకు భూగ్రహంలోని విహాన్, అనిష్, శరత్, అనిరుధ్, ప్రణవి, ముక్తలను ఎంపిక చేసుకుంటారు. ఈ ఎనిమిది మంది చేసే సాహసయాత్ర, శతృ విధ్వంసం మానవ జాతికి దాపరించిన ముప్పును రూపుమాపి చంద్రమండలంలోని ముప్పైమందిని విముక్తి చేసి, భూ గ్రహానికి ప్రయాణమవడంతో కథ సుఖాంతమవుతుంది.

అయితే మనుషుల్ని నాశనం చేసే కుట్రను ఆరుగురు పిల్లలు పరిష్కారం చేసిన సంగతి మానవజాతికి తెలియదు. తమ మిషన్ కోసం ఎంపిక చేసుకున్న ఈ పిల్లలందరూ కులాంతర వివాహం చేసుకున్న దంపతుల పిల్లలు వారి జ్ఞానస్థాయి పెద్దగా ఉంటుందని చెప్పారు.

ఈ సైన్స్ పిక్సన్‌కు, మిరాకిల్ నవలను పోలిన బాలల వరుసలో ప్రయాణం నవల బాల సాహిత్యం పట్ల రచయితకున్న నిబద్ధతకు మానవజాతి గమనంలో తప్పటడుగులు వేయకున్న ఆందోళనకు ఈ నవల అద్దంపడుతుంది. ఈ సీక్వెల్ ఇంకా కొనసాగుతుందని గ్రహాంతర కథల త్రయాలజీ దిశగా వి.ఆర్.శర్మగారి కలం పయనిస్తుందని ఈ నవల చదువుతుంటే తెలుస్తుంది. ఈ నవల బాల సాహిత్యానికి గొప్ప చేర్పుగా రచయిత చిత్రించాడు.

### 3.1.43. ఆరాటం-2019

**రచయిత పరిచయం:** దారం గంగాధర్ ఈ నవలను రాశారు. "మందారం" అనే కలం పేరుతో రచనలు చేశారు. ఈయన నిజామాబాదు జిల్లా నవీపేట్ మండలం బినోలా గ్రామానికి చెందినవాడు. ఇతని తల్లిదండ్రులు కీ.శే. శ్రీమతి లక్ష్మీ గంగారాంలు. ఇతని వృత్తి సాంఘిక శాస్త్ర బోధనోపాధ్యాయుడు. ప్రవృత్తి వ్యవసాయ సాహితీ సేవ. ఈయన ఇతర రచనలు బంగారం, సంస్కృతి(కథల సంపుటాలు). ఇతడు రాసిన ఏకైక నవల ఆరాటం. గిడుగు రామ్మూర్తి పంతులు సాహితీ పురస్కారం, విశ్వసమితి వారిచేత సాహితీ పురస్కారం. ఇంకొకటి కళా వాచస్పతి ప్రధానం, యాసపూరి కన్యకా పరమేశ్వరి సంస్థచేత రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు.

**వస్తువు:** నిజామాబాదు జిల్లా నాళేశ్వరం గ్రామానికి చెందిన నర్సారం శంకరయ్య పాఠకులకు చెప్తున్న కథ ఇది. ఉత్తమ పురుషలో ఈ కథ సాగుతుంది. ఏ ప్రాంతం వెళ్ళినా, ఏ పనికెళ్ళినా అంతా అయోమయమే. అన్ని చిత్ర విచిత్రాలే. వీటన్నింటిని అతీతంగా అధిగమించి ఏదైనా

ఒక ప్రశాంతమైన నివాసం దొరికితే అక్కడికి వెళ్దామన్నా నిర్ణయానికి తన నడక ముందుకు సాగుతూ ఉంటుందని శంకరయ్య కథ చెప్పడం మొదలు పెట్టడంతో ఈ నవల ప్రారంభమవుతుంది. సొంత ఊరిలో పని లేక బ్రతుకుదెరువు కోసం బొంబాయిలో ఉండే బాల్య మిత్రుడు నారాయణ సహాయంతో శంకరయ్య బొంబాయి వెళ్తాడు. అక్కడ చెత్తకాగితాలు జోకేకాడ పని దొరుకుతుంది. అలా కొంతకాలం గడిచిన తర్వాత హోటల్‌లో క్లీనర్‌గా, వెయిటర్‌గా ప్రమోషన్ వచ్చి లాడ్జిబాయ్‌గా పనిచేస్తాడు. ఇలా దినదినప్రవర్తమానం చెంది తక్కువ సమయంలోనే ఎక్కువ సంపాదిస్తాడు. లాడ్జిబాయ్‌గా పనిచేసే క్రమంలో ఒక స్మగ్లర్ వలలో చిక్కుకొని జైలు పాలవుతాడు. శిక్ష పూర్తిచేసుకొని జైలు నుండి విడుదలై ఎటు వెళ్లాలో తెలియక రోడ్లమీద బిచ్చగాళ్ళతో కలిసి భిక్షాటన చేయటం, బొమ్మలు చేసుకొని బతికేవారితో జీవితం గడపటం, మాఫియా చేతిలో దెబ్బతినటం, అలాగే జంతు కళేబరాల గుట్టలను దాటి తోటమాలి దగ్గరికి వచ్చి సేద తీరుతాడు. ఈ క్రమంలో యాక్సిడెంట్ అయ్యి కాలు విరుగుతుంది. మూడు కాళ్ళతో కుంటుతూ, తనకు ఎదురుగా బాజాబజంత్రీలతో వస్తున్న ప్రదర్శనలు చూసి అందులో చేరిపోతాడు. ఆ ప్రదర్శన ఒక సర్వమత సమ్మేళనం లాంటి ప్రాంగణంలోకి చేరిపోతుంది. శంకరయ్య కూడా అందులో చేరి సేవ చేస్తుంటాడు. ఆ ఆశ్రమాన్ని అన్వర్, సర్దార్ జీ, సుభోద్ సింగ్, పృథ్వి అనే నలుగురు నాలుగు మతాల యువకులు నిర్వహిస్తూ ఉంటారు. ఆదర్శ భావాలతో ఆ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న యువకులతో తన కథనంతా వివరించి దానిద్వారా బొంబాయిలోని అనేక వ్యవస్థలను కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు.

ఆ నలుగురు యువకులతో వారు తప్పకుండా తన ఆవేదనలకు సమాధానం సాధించిపెడతారని, ఈ దేశాన్ని పవిత్ర దేశంగా తీర్చిదిద్దుతారు. నా జీవితంలో నా సుధీర్ఘ ప్రయాణంలో స్వయంగా అనుభవించిన అనేక సంఘటనలతో పాటు ఈ చీకటి రాజ్యంలో దొరలెవరో, దొంగలెవరో అన్ని విషయాలు వారికి విడమరచి చెప్తాడు. ఈ అడ్డంకులనెలా అధిగమించి ముందుకెళ్ళలో, చీకటి తెరలను ఒక్కొక్కటి నరుక్కుంటూ ఎలా వెళతారో, అన్ని సంగతులు మీకు చెప్పాను. నా శ్వాస ఉన్నంతలో అవినీతి రహిత సమాజాన్ని,

లచ్చగొండితనం లేని మానవతావాదాన్ని నైతికత్వాన్ని పెంచి పంచుకునే సమాజాన్ని చూడాలన్న ఆరాటం నాలో ఉంది అని చెప్పి ఆ నలుగురు యువకుల దగ్గర హామీ తీసుకొని తన తుది శ్వాసను విడుస్తాడు శంకరయ్య.

స్వతంత్ర్యానంతరం గ్రామాల పతనమే ఒక పెద్ద వస్తువు రచనకోసం పట్టణీకరణ సమస్యలు ఇందులో చర్చకు వస్తాయి. హోటల్ దందాలు, డ్రగ్స్ మాఫియాలు, కోర్టుల వ్యవహార తీరు చర్చించబడుతుంది. మానవ విలువలు ఇందులో చర్చించబడతాయి. నమ్మిన వారినే మోసం చేస్తారనడానికి సురేందర్ పాత్రను, అపరిచితులను కూడా ఆత్మీయుల కంటే ఎక్కువగా సహాయపడతారనడానికి గంగేశ్వర్ పాత్రలు నిదర్శనంగా నిలుస్తాయి. అదేవిధంగా బిచ్చగాళ్ళైన ముసలాయన తన కోడలు అక్రమ సంబంధాన్ని గమనించినందుకుగాను వెలివేయబడిన బిచ్చగాడవుతున్న తీరును, తండ్రి చనిపోయి తల్లి మాత్రమే ఉండి ఇంకొక ప్రియుడితో కలిసి ఉండటాన్ని చూసి వారిని ఎదిరించలేక పారిపోయి బొంబాయి చేరిన బాలుడు ఏ విధంగా బిచ్చగాడిగా మారిన తీరును, మరుగున పడుతున్న మానవ విలువలకు సజీవ చిత్రాలుగా నిలుస్తాయి. నగరీకరణ వికృత రూపాన్ని బొంబాయిలో చూడగలిగినంతా మరెక్కడా చూడలేం. అందుకే రచయిత కథ కేంద్రంగా బొంబాయిని ఎంచుకున్నాడు. ఉత్తర భారతదేశం నుండి దక్షిణ భారతదేశం వరకు లక్షలకొద్దీ కూలీకోసం జనాలు బొంబాయిని ఆశ్రయించారు. కనీస సౌకర్యాలు లేక లుప్తమైన మానవ అవసరాల మధ్య బొంబాయి ఒక అక్రమాల అడ్డగా మారిపోయింది. అక్కడ మానవ ధైన్యం వివిధ రూపాలలో దర్శనమిస్తుంది. సామాన్య మానవుల వలసల జీవితాన్ని బొంబాయి నగర కేంద్రంగా చిత్రిస్తూ రచయిత దారం గంగాధర్ రాసిన నవల ఆరాటంగా చెప్పబడుతుంది.

### 3.1.44. అమర్ సాహసయాత్ర-2019

ఈ నవలను వి.శాంతిప్రబోధ రాశారు. పర్వతారోహణ చేయడం ఎవరికైనా కష్టతరమే. అందులో చిన్నపిల్లలు పర్వతాలను, దేశంలో అత్యంత ఎవరెస్ట్ బేస్ క్యాంప్

చేరడం మరింత కష్టతరమైన పనే. 'అమర్ సాహసయాత్ర' నవలలో అమర్ ప్రధాన పాత్ర. ఇతనికి పర్వతాలను అధిరోహించడం చాలా ఇష్టం. ఇతను తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇతని ఇష్టాన్ని బట్టి పాఠశాలలో భువనగిరి గుట్టను ఎక్కడానికి ఎంపికయ్యాడు. దీనికి అమర్ ఎంపిక కాకముందే ఉత్సాహంతో పర్వతారోహణ గురించే కలలు కంటాడు. ఈ నవలలోని వస్తువంతా అమర్ కలనే. ఇతడు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ఎక్కినట్టుగా కలగంటాడు. అక్కడికి వెళ్ళడానికి తల్లిదండ్రులను ఒప్పించడం మొదలు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ దగ్గరికి వెళ్ళేవరకు జరిగిన సంఘటనలను, అమర్ పడిన కష్టం, సాహసాలను ఈ నవలలో అద్భుతంగా రచయిత్రి చిత్రించారు.

అమర్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ దగ్గరికి వెళ్ళడానికి తల్లిదండ్రులను ఒప్పిస్తాడు. యాత్రకు కావాల్సిన ఆర్థిక వనరులను ఇన్‌స్టాగ్రామ్ వారు నిర్వహించిన గేమ్‌లో విజయం సాధించగా వచ్చిన డబ్బులతో ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు వెళ్ళడానికి కావాల్సిన సరుకులను అన్నింటిని సమకూర్చుకుంటాడు. అక్కడికి వెళ్ళే దారి అంత మంచిగా ఉండదు. వాతావరణంలో మార్పులు వస్తుంటాయి. అయినా వాటన్నింటిని తట్టుకొంటూ, అక్కడి జీవన విధానాన్ని గమనిస్తూ ముందుకు సాగుతాడు అమర్. వెళ్తున్న క్రమంలో అమర్ కంటే ఏడెనిమిదేళ్ళు పెద్దవాళ్ళైన ఆస్ట్రేలియన్ జంట జూలీ, రోజర్‌లు పరిచయమవుతారు. వీరి స్నేహం చివరి వరకు కొనసాగుతూ ఉంటుంది. వీరితోపాటు ఫ్రెంచ్ యువకుడు క్రిస్, కెనడా తాతయ్య మొదలైనవారు పరిచయం అవుతారు. ప్రయాణానికి కావాల్సిన వస్తువులతో బ్యాగ్ నింపుకొని బరువును మోస్తూ తన లక్ష్యాన్ని చేరుకుంటాడు అమర్. ఈ యాత్రలో ఎన్నో అనుభవాలను, విజ్ఞానాన్ని అమర్ సొంతం చేసుకుంటాడు. అనుకున్నది సాధించిన తర్వాత సంతోషంతో, గర్వంతో అమర్ ఉప్పొంగిపోతాడు. ఇదంతా అమర్ కలలో జరిగిన విషయం. అసలు విషయం ఏమిటంటే అమర్ భువనగిరి గుట్ట ట్రెకింగ్ చేయడానికి ఎంపికవుతాడు. ఆ విషయాన్ని చెప్పడం కోసం పడుకొని కలగంటున్న అమర్‌ను తన స్నేహితులైన నరేష్, కాశీరాం, అంజన్‌లు నిద్ర లేపుతారు. ఆ సమయంలో అమర్ మొహం చూసిన స్నేహితులు

ఏదో గొప్ప కల కంటున్నాడని ఎగతాళి చేస్తారు. కాని భువనగిరి గుట్ట ట్రెకింగ్‌కు ఎంపికవ్వడం స్నేహితులకు కూడా సంతోషం కలిగించే విషయమే.

ఈ నవలలో రచయిత్రి ప్రధానంగా విషయ జ్ఞానం, సమయస్ఫూర్తి ఉంటే ప్రయాణంలో ఎదురయ్యే అడ్డంకులు, అవాంతరాలను ఎదుర్కోవడం పెద్ద కష్టమేమీ కాదు అని బాలలను కష్టమైన పనులను కూడా సునాయాసంగా చేయగలిగే విధంగా ప్రోత్సహిస్తుంది.

## 3.2. 2020 తర్వాత వచ్చిన నవలలు

### 3.2.1. బతుకు సేద్యం-2021

ఈ నవలను అమృతలత రాశారు. ఇది 'కొలిమి' అంతర్జాల మాస పత్రికలో జనవరి, 2021 నుండి మార్చ్, 2022 వరకు సీరియల్‌గా వచ్చింది. ఇది మొత్తం 14 భాగాలు. ఇందులో బయట విసిరి పారేసినట్టుగా ఉండే తమ నివాసపు ఆనవాళ్లలో నుండి మహిళ స్వేదం చిందించి సేద్యం చేసింది. ఒక మహిళ తల్చుకుంటే ఏదైనా సాధించగల్గుతుంది. అందునా దళిత మహిళ ఎన్నో అవమానాలు, కష్టాలు భరించి చివరకు ఆదర్శంగా నిలిచే స్థాయికి మొగిలమ్మ లాంటి దళిత మహిళ ఎదిగిందంటే అది ఆమె ఆత్మస్థైర్యం.

చదువులేదు. తినడానికి తిండిగింజలు లేవు. పిల్లలకు సరైన గుడ్డ, తిండి పెట్టలేని దీనస్థితిలో మొగిలమ్మ కుటుంబం, వెలగని పొయ్యి, వెక్కిరించే ఖాళీగిన్నెలు, తాతముత్తాతల బాకీ కింద ఏడేండ్ల వయస్సు ఉండే పటేల్ దగ్గర మొగిలమ్మ భర్త పని. చిమ్మచీకటికిగానీ ఇంటికి రాడు. వచ్చినా అతను పిల్లల ఆకలిబాధ తీర్చడానికి చేయగలిగేది ఏమీలేదు. ఇదంతా ఆలోచిస్తూ మొగిలమ్మ లోలోనే బాధపడ్తుంది. చివరకు ఒకరోజు పిల్లల ఆకలి బాధ చూడలేక కొంతదూరంలో ఉన్న పశువుల కొట్టంలో పశువుల పేడ వేస్తే ఎవరికీ కనపడకుండా ఆ పేడలోని గింజల్ని చేతితో ఏరుకేని, ఇంటికి వెళ్ళి వడ్లగింజల్ని, జొన్నల్ని

వేరుచేసి, శుభ్రంగా కడిగి జొన్నల్ని జావకాచి పిల్లలకు ఆ పూటకు కొంత నోరు తడిపింది. వడ్ల గింజల్ని మరుసటిరోజుకు బియ్యం చేసుకొని దాచిపెట్టింది.

మనిషి కడుపు ఆకలిని తీర్చుకోవడానికి ఇంతటి ఘోరావస్థను దాటాల్సిరావటం కడుహేమం. కనికరం లేని పటేల్. భర్త పని చేసినా ఒక్క పైసా కూడా రాని స్థితి. ఇంచుమించుగా ఈ గూడెంలో దళితులందరి పరిస్థితి ఇదే.

ఈ క్రమంలోనే గూడెంకు ఇద్దరు ముగ్గురు మహిళలు వచ్చి ఆ గూడెంలోని మహిళల్ని సంఘంగా ఏర్పడి పొదుపును అలవర్చుకొమ్మంటారు. తద్వారా కుటుంబంలో కొంతవరకు కడుధీన పరిస్థితులను అధిగమించవచ్చని చెప్తారు. సంఘంలో చేరిన సభ్యులకు ఉపాధి హామీలాంటి పనులు, పంటల ఎరువులు తయారుచేయడం మొదలైనవి నేర్పిస్తారని, ఆపదలో ఉన్నవారికి చేయూతగా ఉంటుందని అంటారు. ఈ విషయాలన్నీ మొగిలమ్మ తన చుట్టుపక్కల దళిత మహిళలు అందరూ వింటారు. కాని సంఘంలో చేరటం, మీటింగులకు హాజరవడం లాంటివి తమకు కుదరవనుకుంటారు. మొగిలమ్మ మాత్రం ఇంటికి వెళ్ళి తన ధీనస్థితికి మనసులో బాధపడి ఎలాగైనా సంఘంలో చేరాలనుకుంటుంది. అనుకున్నదే తడవుగా సంఘంలో చేరి చిన్నచిన్న పనులకు వెళ్తుంది. అన్ని మీటింగులకు హాజరయ్యి స్వయం సహాయక సంఘాల ద్వారా కుటుంబాలకు జరిగే మేలును మిగతావారికి కూడా చెప్పి కొంతమందిని చేర్పిస్తుంది.

ఇలా మొగిలమ్మ ఉపాధి హామీ లాంటి పనులు చేస్తూ కొంత తెలివిని సంపాదించుకుంటుంది. మొగిలమ్మతో పాటుగా సంతోషమ్మ కూడా చేరుతుంది.

ఇంట్లో పిల్లల్ని చూసుకుంటూ పెద్దబిడ్డ పూలమ్మి మొగిలమ్మకు ఆసరగా ఉండేది. మొగిలమ్మ ధైర్యం చేసి మొదటి సంఘ సభ్యురాలవుతుంది. తర్వాత ఒక్కొక్కరు చేరుతారు. సంతోషమ్మ, బాలమ్మ, సుశీలమ్మ, సంగమ్మ, రూతమ్మ సభ్యులుగా చేరుతారు. సంఘంలోని సభ్యులకు పని కల్పించబడి కొంత ఆసరగా ఉంటుంది. మసకబారిన వీరి కుటుంబాలకు

సంఘం ఓ చిరుదివ్వె అవుతుంది. మొగిలమ్మ ఆరోగ్యం సరిగా లేక ఆపరేషన్ చేయాల్సి వస్తే కూడా సంఘం సహకారం ద్వారా డబ్బు ఇప్పించి ఆపరేషన్ చేయిస్తారు. సంతోషమ్మ సహాయంగా ఉంటుంది. తరువాత కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇంటిని కూడా సంఘం సహాయంతోనే నిర్మించుకోగలుగుతారు. గూడెం మహిళలు ఇలా ఒక్కొక్కరి కష్టాల్ని అవసరాన్ని బట్టి ఆదుకోని అండగా నిలిచి దళిత స్త్రీలు స్వయం సహాయక సంఘంగా ఏర్పడి ఆదర్శంగా నిలబడాలని ఎప్పటికప్పుడు సంఘం ఆఫీసువాళ్ళు వెన్నుతట్టి ప్రోత్సహిస్తుంటారు.

ఈ క్రమంలోనే భూమిలేని పేదలకు రెండెకరాలా భూమి కూడా సంఘం ద్వారా ఇప్పించడం జరుగుతుంది. ఆ భూముల్ని దళిత మహిళలే కష్టపడి కలిసి మెలసి చదును చేసుకుంటారు. ఇలా అందరూ కలిసికట్టుగా పనిచేస్తే కుటుంబాల్లో ఆకలి బాధలు లేకుండా ఉంటారు. మొగిలమ్మ తన గర్భసంచి తీశాక ఆరోగ్యం కుదుటపడగానే నెమ్మదిగా అప్పు తీర్చుకొని బర్రెను కూడా కొంటుంది. అర్ధాకలితో ఉన్న తన పిల్లలకు పాలు పెరుగు కూడా ఇస్తుంది. ఆ పిల్లల సంతోషాలకు అవధులు ఉండవు. ఆకలి తీర్చే ఆనందం అలాంటిది.

మొగిలమ్మకు ఆరోగ్యం బాగలేనప్పుడు పక్క ఊరికి ఎడ్లబండిలో వెళ్ళడం లాంటి సమస్యల్ని గుర్తెరిగి, ఇకముందు తమ ఊర్లోనే అందుబాటులో ఉండేలా సంఘం ఆఫీసువారి అనుమతితో ఎవరికైతే ఆకుమందుల పట్ల ఆసక్తి ఉందో వారికి శిక్షణ ఇస్తామంటారు. అందుకు సంతోషమ్మ ముందుకు వచ్చి ఆరోగ్య కార్యకర్తగా మారుతుంది.

కూలి పనులు చేసుకునే సంతోషమ్మకు తొమ్మిదేళ్ళ వయసులోనే పెళ్ళవుతుంది. పదిహేనేళ్ళు వచ్చేసరికి ఒకకొడుకు. తర్వాతి ఏడాదికి భర్త పాముకాటుతో చనిపోతాడు. అప్పటికే ఆమె నాలుగు నెలల గర్భవతి. భర్త చనిపోయాక కొద్దిరోజుల వరకు అత్తమామలతో కలిసి ఉంది. ఆ తర్వాత తోడబుట్టిన వాళ్ల ఆసరా ఉంటుందని పుట్టింటికి వెళ్తుంది. కూలి పనులు చేసుకొని స్వతంత్రంగా బతకడం మొదలు పెడ్తుంది. మళ్ళీ పెళ్ళి చేసుకుంటామని ఒకరిద్దరు ఆమె వెంట పడ్డప్పటికీ ఆమె మళ్ళీ పెళ్ళికి ఒప్పుకోకుండా బతుకుతుంది. ఆరోగ్య

కార్యకర్తగా గూడెంలో ఇల్లిల్లు తిరుగుతుంది. ఓవైపు మొక్కల పెంపకం కార్యక్రమ పర్యవేక్షణ చేస్తూనే ఆరోగ్య కార్యక్రమాల్లోనూ తీరిక లేకుండా ఉంటుంది. నర్సరీ పెంపకంలో సంఘం మహిళలు శిక్షణ కూడా తీసుకుంటారు. రాజమ్మ, సాయమ్మ, శివమ్మలు కూడా. ప్రతిగ్రామంలో మొక్కలను పర్యవేక్షిస్తుంటారు. ఈ క్రమంలో అనేక ఇబ్బందులు ఇటు కుటుంబం నుండి అటు సమాజం నుండి ఎదుర్కొన్నారు. రవాణా సౌకర్యాలు లేక ఒక్కోసారి ఆ గ్రామాల్లోనే ఉండాల్సి రావడంతో వారి శీలాన్ని శంకిస్తారు వారి అభివృద్ధిని ఓర్వనివారు. ఆ నలుగురు ఒంటరి స్త్రీలు కావడంతో అనుమానాలకు ఆజ్యం పోస్తారు.

"అనుమాన శూలాలు చెవిన పడ్డప్పుడు రెక్కలు తెగిన పక్షుల్లా విలవిలలాడుతున్నారు. మనసులో రంపపు కోత అనుభవిస్తూనే ఉన్నప్పటికీ వారు వెనక్కి తగ్గరు. చీల్చి చెండాడే తోడేళ్ళు అన్నిచోట్లా ఉంటాయని, ఏమి చేసినా వెంటాడటమే వాటి పని అనుకుంటారు.

సంఘం సభ్యులందరూ తమ పని తాము దీక్షతో, ఉద్యమ స్ఫూర్తితో కసిగా చేసుకుపోతుంటారు. ప్రతివారం తమ గుంపు సభ్యులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఇతర గ్రామాల్లో ఎదురవుతున్న అనుభవాలను సంఘం నెలవారీ గ్రామ లీడర్ల మీటింగులో చర్చించేది మొగిలమ్మ.

వాడలో వీరికి తాగునీటి సమస్య. వీరు నీళ్ళు చేదకూడదు. ఆ సమస్యను సంఘంలో ఉంచి పరిష్కరించుకుంటారు. అలాగే సంఘం మహిళలు వ్యవసాయ పనులకు పోతే వారి పిల్లల్ని చూసుకొనేవారు లేక పొలాలకు తీసుకెళ్తారు. అక్కడ పాములు, పురుగులకు భయపడి ఆ విషయం కూడా చర్చించుకొని పిల్లలకోసం ఒక అంగన్వాడి సెంటర్‌ను ఏర్పాటు చేసుకుంటారు. అంగన్వాడి కార్యకర్తగా రూతమ్మ పిల్లలకు వండిపెడ్తుంది. మొగిలమ్మ నలుగురు పిల్లలు అక్కడికే వెళ్తారు. ఇలా సంఘం సభ్యులు వారి కుటుంబాల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా తీర్చుకుంటారు. మహిళలైనప్పటికీ వ్యవసాయంపై మొగ్గుచూపుతారు. సంఘం ఆఫీసువాళ్ళు హైబ్రీడు విత్తనాలు వాడమంటే ఒప్పుకోరు. సేంద్రీయ ఎరువులతో కొర్రలు,

రాగులు, జొన్నలు, అరికెలు లాంటి పంటలే సమాజానికి ఆరోగ్యాన్ని అందించే పంటలని ఆ దిశగా అడుగులు ముందుకేస్తారు మొగిలమ్మ బృందం. అంతేకాకుండా మొగిలమ్మ జెర్రల ఎరువు శిక్షణ తీసుకొని, ఎరువును కూడా తయారుచేసి, ఇతర ప్రాంతాలవారికి కూడా అమ్మగలిగే స్థాయికి ఎదుగుతుంది. ఇదంతా జీర్ణించుకోలేని పటేల్, మొగిలమ్మ భర్త చిన్నయ్యకు ఆమెపై లేనిపోనివి చెప్తాడు. దాంతో కోపంతో భార్యను బాగా కొడ్తాడు. దాంతో విషయం అర్థమైన మొగిలమ్మ పటేల్‌కి ఎదురు తిరుగుతుంది. నా మొగుడు పటేల్ ఇంటిపనివాడని నేను ఆ ఇంటివాళ్ళు చెప్పినట్టు ఆడాల్సిన పనిలేదు. వాళ్ళు చెప్పింది నాకు నచ్చితే చేస్త, లేకుంటే లేదు. వాళ్ళ చెప్పుచేతల్లో ఉండాల్సిన పనిలేదని వొణుకు బెణుకు లేకుండా చెప్తుంది. దాంతో సంఘ మహిళలకు, పటేల్‌కు భయపడాల్సిన అవసరం లేదని తమ పంథాన్ని కొనసాగిస్తారు. జొన్నలు, కందులు, అవిసెలు, ఊదలు లాంటి సేంద్రియ పంటల గొప్పతనాన్ని, అవిచ్చే ఆరోగ్యాన్ని వివరించిన మొగిలమ్మ మాటలు విన్న రేఖ, వినోద్ లాంటి వ్యవసాయంపై పరిశోధన చేసేవారే ఆశ్చర్యానికి గురౌతారు.

లాభాల్ని ఆర్జించే దృష్టితో కాకుండా ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సేంద్రీయ పంటల్ని పండించి ఎంతో ఎత్తుకు ఎదిగి అందరి అంచనాల్ని తలక్రిందులు చేస్తుంది మొగిలమ్మ. ప్రభుత్వాలు కూడా అనారోగ్యాల పాలుచేసే వరిబియ్యం కాకుండా తృణధాన్యాల్ని పంపిణీ చేయాలని, ఆ పంటల్ని పండించే దిశగా ప్రోత్సహించాలని, సంఘం ఆఫీసర్లు, వ్యవసాయ అధికారులు, పరిశోధకులకు చెప్తుంది. ఒక పేద దళిత మహిళ, అందునా నిరక్షరాస్యులైన మహిళా రైతుగా మారి, సేంద్రీయ పద్ధతుల్లో పట్టుదలతో పంటలు పండించడం మామూలు విషయం కాదు. తినడానికి ఒక్కగింజ కూడా దొరకలేని ఒక స్థితి నుండి ఒక గొప్ప మహిళా రైతుగా విజయాన్ని సాధించడం ఆమె కృషికి, నమ్మకానికి ప్రతీకలు. నోబెల్ పురస్కారానికి సమానమైన ఈక్వెటర్ పురస్కారానికి మొగిలమ్మ బృందం ఎంపిక కావడం ఆ పురస్కారాన్ని విదేశాల్లో అందుకోవడం ఇదంతా తన బృంద శ్రమ ఫలితం. ఇదంతా ఒక ఎత్తైతే మొగిలమ్మకు వీసాకి అనుమతివ్వకపోవడం, పెద్దలని చెప్పుకునేవారికి మింగుడు పడక కల్గించే అడ్డంకులు. చివరకు సంఘం ఆఫీసు సభ్యుల

ద్వారా ఆ అవాంతరాలను దాటి, విదేశాల్లో ఈక్వెటర్ పురస్కారాన్ని అందుకున్న మొగులమ్మ బృందం అణగారిన దళిత చైతన్యానికి ప్రతీకలు.

ఈ నవలలో బండచాకిరి బతుకులు అందలమెక్కిన వైనం కనివినీ ఎరుగని ప్రగతిని చెమటను చిందించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దళిత మహిళ నవల మొగిలమ్మ, ఆమె బృందం సాధించిన విజయగాథే శాంతి ప్రబోధ 'బతుకు సేద్యం' నవల. ఈ విధంగా నిజామాబాదు జిల్లా నవలల్లో విభిన్నమైన వస్తువులు కనిపిస్తాయి. సమాజంలో చదువు ఎంత అవసరమో తెలియజెప్పేవి, స్త్రీ, దళిత జీవితాలు, వివిధ వృత్తికారుల జీవితాలు, ప్రేమ, స్నేహం, మానవ అనుబంధాలు, కుటుంబ జీవనం, జర్నలిస్టు జీవితం, నక్సలైట్ల జీవితం మొదలైన అంశాలు ఈ అధ్యాయంలో చూడవచ్చు.

### 3.2.2. హవేలి-2021

ఈ నవలను లలితవర్మ(పి.లలిత కుమారి) రాశారు. ఈమె 15.03.1956 నిజామాబాదులో జన్మించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలిగా హైదరాబాదులో స్థిరపడ్డారు. వీరి తల్లిదండ్రులు కీ.శే. శ్రీ రామదాసువర్మ, శ్రీమతి నాగలక్ష్మి . 1976 నుండి తెలుగు భాషోపాధ్యాయురాలిగా ముప్పై సంవత్సరాలపాటు నిర్విరామంగా చేశారు. అనివార్య పరిస్థితుల దృష్ట్యా స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈమె రచనలు: హవేలి (నవల), కలిసుందామా? (నవల).

హవేలి కాల్పనిక సాంఘిక నవల. దీనిని జూన్ 2021లో ముద్రించారు. స్త్రీలమీద జరిగే దురాగతాలు హత్యలు ప్రతి యుగంలో జరుగుతూనే ఉన్నాయని ఏ కాలానికి అతీతం కాదని, ఈ నవలలో తెలియజేశారు. దురాగతాలు జగరని ప్రపంచం, అవినీతి రహిత ప్రపంచం చూడాలనే ఆకాంక్ష ఇందులో ఉంది. వాస్తవిక కథతో కాల్పనికతను జోడించి రాయబడిన నవల ఇది.

పారానార్మల్ సైకాలజీతో బాధపడుతున్న అమెరికాలో ఉన్న ఒక అమ్మాయికి సంబంధించిన కథ ఇందులో ఉంది. తాను కలలో చూసిన సంఘటన ఇండియాలో నిజం కావటం, నిజాయితికి మారుపేరైనా ఒక మహిళా పోలీసు అధికారి దానిని చేధించడం ఇవన్నీ పూర్వాశ్రమంలో ఒకానొక హవేలితో ముడిపడి ఉండటం ఆసక్తిని కలిగిస్తుంది. సస్పెన్స్ ను రేకెత్తిస్తూ సాగే కథాంశం కలిగిన నవల హవేలి.

### 3.2.3. కలిసుందామా?-2021

ఈ నవలని లలితవర్మగారు రాశారు. కలిసుందామా (సాంఘిక నవల)ను డిసెంబర్ 2021లో ప్రచురించారు. 'వసుదైక కుటుంబం' అనే సూక్తిని సార్థకం చేస్తూ ప్రపంచం గుప్పెటలో వచ్చిన నేపథ్యంలో భాష, వేషం, సంస్కృతీ సంప్రదాయాల్లో అనుభవించిన మార్పు అనూహ్యమైంది. ఇటువంటి కాల పరిణామం ఈ నవలలో కనిపిస్తుంది.

మనదేశంలో నేటి యువత పాశ్చాత్య నాగరికతను అనుసరించారంటే పాశ్చాత్యులే మనదేశ సంస్కృతీ సంప్రదాయాల ఔన్నత్యం గురించి మనకే వివరించి చెప్పేవరకు తెలుసుకోలేని స్థితిలో ఉన్నాం! అలాంటి ఆధునిక నాగరికత వ్యామోహంలో పడిన ఒక మధ్యతరగతి అమ్మాయి పెళ్ళిపట్ల విముకత కలిగి "లివ్ ఇన్ రిలేషన్‌షిప్"(సహ జీవనం) చేయడానికి సిద్ధపడటం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు, ఓ మధ్యతరగతి తల్లి... తల్లిగా... సమాజంలో బాధ్యత కలిగిన వ్యక్తిగా పడిన ఆవేదన, పెళ్ళా? సహజీవనమా? అని చదువరులను ఆలోచింపజేసే నవలగా 'కలిసుందామా?' నిలుస్తుంది.

### 3.2.4. ఆడజన్మ శాపమా? వరమా?-2021

ఈ నవలను కర్క రమేశ్ రాశారు. ఇతని జన్మస్థలం నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలం వాడి గ్రామం. ఇతని తల్లిదండ్రులు కర్క బోజవ్వ, రాములు. ఇతని వృత్తి వ్యవసాయం, ప్రవృత్తి సేవ, సాహిత్యం, జర్నలిజం. ఇతని రచన ఆడజన్మ శాపమా? వరమా?

అనే సాంఘిక నవల. ఆనాటి నుంచి ఈనాటి వరకు స్త్రీలు అమాయకంగా మోసపోతూనే ఉన్నారని ఈ నవలలో రచయిత చర్చించారు.

పల్లెటూరైన శ్రీరాంపురం అనే గ్రామ నేపథ్యంలో వచ్చిన నవల. నెలలు నిండకుండానే పురిటి నొప్పులు పడుతున్న మహిళ ప్రసవిస్తే ఊళ్ళోనే ప్రసవించాలి తప్ప పెద్ద దవఖానకు వెళ్ళాల్సిన అవసరం లేదని చెప్పే పల్లెటూరి కట్టుబాట్ల నడుమ బాగా చదువుకొని ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కిరణ్ కథానాయకుడిగా కనిపిస్తాడు. పురిటినొప్పులు పడుతున్న గర్భిని స్త్రీని ఎడ్లబండిలో కురుస్తున్న వర్షంలో దావఖానకు తీసుకుపోతున్న క్రమంలో ఎన్నో అవాంతరాలు ఎదురవుతాయి. దేవుడు లాంటి పటేల్ సాబ్ వచ్చి తన కారు ఇచ్చి పట్నానికి పంపుతారు. ఎలాగోలా దావఖానకు చేరాక అందుబాటులో లేని డాక్టర్‌ను సైతం రైలునుంచి వెనక్కు తీసుకువస్తాడు కిరణ్. ఇద్దరిలో తల్లి బిడ్డ ఒకరే బతుకుతారని డాక్టర్ చెప్పడం, ఆ భగవంతుని దయతో ఇద్దరూ బతికి బయట పడటం జరుగుతుంది.

విచ్చలవిడిగా తిరిగే అజయ్, స్నేహితుడు ప్రణయ్. ఆడపిల్లలను లొంగదీసుకునే పాత్రలో కనిపిస్తాడు. తోటి విద్యార్థి అయిన రజనిని విహారయాత్రలో మత్తుమందు కలిపి మోసం చేయడం, ఇదేంటి ప్రశ్నించిన రజని తండ్రిని హత్య చేయడం వంటి కౄర ప్రవృత్తి కనిపిస్తుంది. అలాగే ఈ నవలలో కథానాయకి అయిన అలేఖ్య చదువుకున్న చదువుతో మహిళలకు జరిగుతున్న అన్యాయాలు, అరాచకాలపై పోరాటం చేస్తున్న ఓ సంఘసంస్కర్తలా మహిళల వెన్నంటి ఉంటూ వారి కష్టాలకు అండగా నిలుస్తుంది. మరో కథానాయకుడి అజయ్ తన తల్లిదండ్రులు ఉన్న మూడెకరాల పొలాన్ని అమ్మి, తల్లి తన కిడ్నీ సైతం అమ్మి పై చదువులకోసం పంపిస్తే అక్కడ ఓ లూసీ అనే అమ్మాయి వలలోపడి తల్లిదండ్రులను తనను ప్రేమించిన ప్రియురాలిని మరచిపోతాడు. అలాంటి సమయంలో కిరణ్ అన్ని విషయాలను తెలియజేస్తూ అజయ్‌ను ఇండియాకు రప్పిస్తాడు. అజయ్ అన్నీ గుర్తు తెచ్చుకొని మారిపోయి తల్లిదండ్రులకోసం ఇండియాకు తిరిగి వస్తాడు.

ముగింపులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అజయ్ మిత్రులందరూ కలుసుకుంటారు. అక్కడ మాటల సందర్భంగా వారి సంభాషణలో ఆడజన్మకు ఉన్నటువంటి ప్రత్యేకతను గుర్తిస్తారు. మహిళా సార్థకత సాధించాలంటే ఈ సమాజంలో అందరీ పాత్ర అవసరమని చర్చిస్తారు.

ఆడ జన్మ శాపమా? వరమా? అని సందేహంలో ఉన్న వారందరికీ ఆడజన్మ ఎన్నటికీ శాపం కాదని తీర్మానిస్తారు. ఒకవేళ శాపం అయితే దానికి మూలకారణం పురుషుడే అవుతాడని నిర్ణయిస్తారు. మొత్తంమీద ఆడజన్మ శాంపం కాదు వరమే అని చూపించడం ఈ నవల ముఖ్య ఉద్దేశం.

### 3.2.5. మాధవి ఐపియస్-2021

ఈ నవలను ఎల్ది సుదర్శన్ రాశారు. ఇది దేశభక్తికి సంబంధిన నవల. ఇందులో ప్రధాన పాత్ర మల్లక్క. ఈమె తరువాతి భాగంలో మాధవి ఐపీయస్‌గా అవుతుంది. మల్లక్కతోపాటుగా ఎల్లవ్వ పాత్ర కూడా ఇందులో ప్రాధాన్యం కలదు. వీరిద్దరు కష్టజీవులు. మొదట మల్లక్క మేస్త్రి దగ్గర భవన నిర్మాణ పనిలో ఉంటుంది. దొంగ కాంట్రాక్టర్ అయిన రామన్నను పోలీసులకు పట్టిస్తుంది. వారి అరాచకాలను, అవినీతి పనులను బయట పెడుతుంది. ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్ వేణిమాధవ్‌తో పరిచయం ఏర్పడుతుంది. ఆమె పనులకు ఆకర్షితుడైన కలెక్టర్ ఆమె సహాయంతో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం, నివాస ప్రదేశాలను ల్యాండ్ గ్రాబర్స్ ను మల్లక్క ద్వార బయటపెట్టి ప్రభుత్వానికి పట్టిస్తాడు. మల్లక్క కలెక్టర్ చాలా రోజులుగా కలిసి పనిచేసి మళ్ళీ వివాహం చేసుంటారు. చివరికి నవలలో మల్లక్క మాధవి ఐపియస్‌గా మారటం కనిపిస్తుంది.

ఇందులో మరో మాధవి ఉంటుంది. తన కొడుకును బాగా చదివింది కొడుకు అమెరికా వెళ్ళి మెడిసన్ పూర్తిచేస్తాడు. అక్కడే హీనాను ప్రేమించి పెళ్ళిచేసుకుంటాడు. హీనా

భారతదేశంమీది మమకారంతో భర్తతో కలిసి ఇండియాకు వచ్చి పెద్ద హాస్పిటల్‌ను స్థాపిస్తుంది. అమెరికాలో స్థిరపడ్డ సంపన్న భారతీయ కుటుంబాలు, మాతృ దేశంలో తమ సేవలను అందించాలని ఈ నవల ముఖ్యోద్దేశం. ఎన్నారైలు అందరూ కలిసి ఒక కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని రచయిత కోరుకుంటాడు. ఆ నేపథ్యంలోనే ఈ నవల దేశభక్తి నవలగా నిలిచిపోతుంది.

### 3.2.6. బాలవర్ధన్-2021

ఈ నవలను వి.ఆర్. శర్మ రాశారు. అవిశ్రాంతంగా బాలల లోకంలో సేవలందిస్తూ నిరంతర సృజనామూర్తిగా పిల్లలకోసం వినూత్న ప్రయత్నంగా బాల నాగమ్మ అనే జానపద కథకు కొత్త మెరుగులు అద్ది నవలగా తీర్చిదిద్దారు. ఈ నవలలో ప్రస్తుత సమాజాన్ని, సమాజంలోని మార్పుల్ని స్వచ్ఛమైన భాషతో సులభశైలిలో అందించిన తీరు ఆబాలగోపాలాన్ని అలరించేదిగా ఉంది. ఈ నవలలోని బాలవర్ధన్ పాత్ర ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో జీవితాలను చక్కబెట్టుకోవచ్చుననే సందేశాన్ని అందించారు. కాల్పనిక ప్రపంచంలో పిల్లల్ని విహరింపజేడం, అద్భుతాలు, వింతలు విశేషాలు ఈ నవలకు మరింత వన్నె తెచ్చాయి. ఈ నవలలో తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని ప్రస్తావించి పిల్లలకు సామాజిక, చారిత్రక నేపథ్యాన్ని పరిచయం చేశారు. అలాగే కరోనా వంటి సమకాలీన సమస్యలను అంతర్భాగం చేయడం ద్వారా రచయిత వాస్తవిక దృక్పథం వెల్లడవుతుంది. అంతేకాకుండా పిల్లలకు తల్లిదండ్రుల పట్ల ఉండాల్సిన ప్రేమ, బాధ్యతలతోపాటు ప్రకృతి ప్రేమ, జీవకారుణ్య భావనల ఆవశ్యకతలను తెలియజేశారు.

ఈ నవల ద్వారా రచయిత ప్రకృతికి మనం ఏది ఇస్తే దానికి అనేక రెట్లు పెంచి ఇస్తుంది అంటూ మానవ జాతికి ఆలోచనాత్మకమైన సందేశాన్ని అందించారు. ఈ నవలను నేటి నిజాం పత్రికల్లో ధారావాహికంగా వెలువరించడం జరిగింది.

### 3.2.7. రక్ష-2021

వి.ఆర్ శర్మ ఇదే క్రమంలో బాల సాహితీ సేద్యంలో భాగంగా అక్షర కర్షకుడై 'రక్ష' అనే మరో నవలను 2021లో వెలువరించారు. ఈ నవల చదివిన ప్రతివారికి నవలలో ప్రపంచం వాస్తవమైతే బాగుంటుందనిపిస్తుంది. పట్టణంలో చదువుకుంటున్న రక్ష అనే అమ్మాయి నానమ్మ వాళ్ళ ఊరికి వెళ్ళడం, అక్కడ విచిత్రమైన అనుభవం కలుగడం వంటి విషయాలను చదువుతున్నంత సేపు పాఠకులకు ఉత్కంఠను కలిగిస్తుంది. రక్షకు మాత్రమే కనిపించిన ఆ నల్లబిలం ఆమెకు తెలియని వింతలోకాలకు తీసుకెళ్ళి తెలియని విషయాన్ని తెలియజేస్తుంది. కొత్త అనుభవాలు, కొత్త బంధాలు ఏర్పర్చుకొని తల్లిదండ్రుల రుణం తీర్చుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడమే రక్ష. ఈ నవల చదివిన బాలలందరూ తామూ నల్లబిలం వెళ్ళాలని ఆశిస్తారు. అక్కడి ప్రపంచాన్ని స్వాగతిస్తారు. ఈ నవలలోని కాల్పనికతకు వాస్తవరూపం తేవడానికి భవిష్యత్తులో ప్రయత్నిస్తారని కూడా ఆశించవచ్చు.

## నిజామాబాదు జిల్లా నవలలు-వస్తు పరిణామం: పట్టిక

| క్రమ సంఖ్య | నవల పేరు | రచయిత పేరు | సంవత్సరం | వస్తువు |
|---|---|---|---|---|
| 1 | జెగ్గని యిద్దె | లోకమలహరి | 1955 | చదుకోసం తాపత్రయపడే దళితుడు 'జెగ్గని' గురించిన ఇతివృత్తం |
| 2 | సంఘం | లోకమలహరి | 1955 | పద్మశాలీల వృత్తి జీవిత చిత్రణ |
| 3 | భావన భార్గవి | బొమ్మ హేమాదేవి | 1960 | అక్రమ సంబంధాల విషయంలో మగవారి ఆధిపత్యమే కనిపిస్తుంది |
| 4 | నవభారతి | బొమ్మ హేమాదేవి | 1960 | స్త్రీ జీవితం, నిరుద్యోగం, పేదరికం, పురుషాధిపత్యం |
| 5 | కళావతి | బొమ్మ హేమాదేవి | 1960 | అన్నా చెల్లల్ల అనుభందం–రాఖీ పండగ విశిష్టత |
| 6 | తరంగాలు | బొమ్మ హేమాదేవి | 1961 | ప్రేమ ఎంత మధురమైనదో, అదే ప్రేమ విఫలమైతే తీవ్రమైన బాధను కలిగిస్తుందని తెలిపే వస్తువు |
| 7 | ప్రేమంటే | బొమ్మ హేమాదేవి | 1962 | స్త్రీ చైతన్యవంతంగా ఆలోచించి కుటుంబాన్ని సరిదిద్దుకునే క్రమాన్ని నిరూపించిన వస్తువు |
| 8 | ఆరాధకులు | బొమ్మ హేమాదేవి | 1962 | అతిప్రేమ, పురుషాధిపత్యం |
| 9 | నవోదయం | బొమ్మ హేమాదేవి | 1963 | స్త్రీ చదువు, 'సమాజం' అనే పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేసుకొని, సమస్యల పరిష్కారాలను చూపించే వస్తువు |
| 10 | సూత్రధారి–పాత్రధారులు | బొమ్మ హేమాదేవి | 1964 | పేదరికం |
| 11 | పొగమంచు | బొమ్మ హేమాదేవి | 1976 | తన భర్తను పరాయి స్త్రీ పంచుకోవడంతో స్త్రీ ఎదుర్కొన్న మనోవేదన |
| 12 | బంగారు గూడు | బొమ్మ హేమాదేవి | 1976 | అధిక సంతానం, వారి పెంపకం, స్వయం ప్రతిపత్తి |
| 13 | మనస్విని | బొమ్మ హేమాదేవి | 1976 | మారుతున్న సమాజానికి తగ్గట్టుగా మనుషులు మారాలి అనే సందేశం |
| 14 | సంసార బంధం | బొమ్మ హేమాదేవి | 1976 | భార్యాభర్తల మధ్య నమ్మకం ముఖ్యమని తెలియజేసే వస్తువు |
| 15 | వైతరణి ఒడ్డున ఒయ్యారి | భరత్ కుమార్ | 1977 | సమాజంలో తల్లిలేని ఆడపిల్ల జీవితం గురించిన వస్తువు |
| 16 | ప్రేమించకు | బొమ్మ | 1978 | నిజాయితీ కలిగిన ప్రేమ ఫలించి, అవాంతరాలన్నీ |

| | | | | |
|---|---|---|---|---|
| | పెళ్ళవుతుంది | హేమాదేవి | | తొలిగిపోయి పెళ్ళికి దారితీయడం |
| 17 | కళాజలతారు | భరత్ కుమార్ | 1978 | సినిమా ప్రపంచంలో స్త్రీ జీవితం ఎలా ఉంటుందో చెప్పే వస్తువు |
| 18 | నవరసాలు | బొమ్మ హేమాదేవి | 1979 | సుఖదుఃఖాలతో నవరసాలుతో నిండిన మనిషి జీవితం. అన్ని ఒడుదొడుకులను అనుభవిస్తూ ముందుకు సాగేదే జీవితం |
| 19 | లవ్ స్టోరీ | బొమ్మ హేమాదేవి | 1979 | ఆడపిల్లను కొడుకులాగా పెంచి, అన్ని విద్యలు నేర్పి, చైతన్యవంగా ఆలోచించే స్త్రీ వస్తువు |
| 20 | నడుస్తున్న కథ | రాజీవ | 1980 | బాల్య వితంతువును సమాజం చిన్నచూపు చూస్తుంది |
| 21 | మహానంద | బొమ్మ హేమాదేవి | 1983 | పుట్టింటి, అత్తవారింటికి దూరమై వేరొకరి పంచన చేరి, అనేక సమస్యలు బాధలు అనుభవించిన విధానం |
| 22 | పిచ్చిమనిషి | బొమ్మ హేమాదేవి | 1984 | భర్తల అనుమానాల వల్ల స్త్రీల పరిస్థితిని తెలియజేశారు |
| 23 | నర్తకి | భరత్ కుమార్ | 1985 | ప్రేమ, త్యాగం గొప్పతనం |
| 24 | స్వప్న ప్రియ | భరత్ కుమార్ | 1986 | ప్రేమ, సైన్స్–హిప్నాటిజం |
| 25 | గాయపడ్డ సూర్యుడు | యాటకర్ల మల్లేశ్ | 2004 | 1980 తర్వాత దొరల, భూస్వాముల ఆగడాల వల్ల యువత నక్సలైట్లుగా మారడం, కొందరు బతుకుదెరువుకోసం వలసలు వెల్లడం |
| 26 | జోగిని | శాంతి ప్రబోధ | 2004 | జోగిని వ్యవస్థ |
| 27 | సృష్టిలో తీయనిది | అమృతలత | 2005 | సృష్టిలో తోయనిది మాతృత్వం అని చెప్పే వస్తువు |
| 28 | విజేత | మేడిచర్ల ప్రభాకర్ | 2008 | పదవీవిరమణ తర్వాత ఆర్మీఉద్యోగి సమాజ సేవ చేయడం. స్వంత గ్రామంలో తనవారిని చైతన్యంవంతం చేయడం |
| 29 | సర్వేజన సుఖినోభవం తు | మేడిచర్ల ప్రభాకర్ | 2009 | సంఘ సేవ, సమాజ సేవ |
| 30 | కావేరి కళ్యాణం | మేడిచర్ల ప్రభాకర్ | 2010 | ప్రేమ, పెళ్ళి |
| 31 | పునరాగమ నం | స్వాతి శ్రీపాద | 2011 | స్త్రీ జీవిత చిత్రణ |
| 32 | శ్రీమతి గోమతి | మేడిచర్ల ప్రభాకర్ | 2012 | క్షమాగుణం |
| 33 | ఆడపిల్లేనా | సిరిగాద శంకర్ | 2012 | పురుషాంహకారానికి దీటుగా స్త్రీ తలచుకుంటే ఏదైనా సాధిస్తుందని చెప్పడం |

| | | | | |
|---|---|---|---|---|
| 34 | స్వేచ్ఛా విహంగాలు | సిరిగాద శంకర్ | 2013 | ప్రేమ, చదువు |
| 35 | యశోధరుడు | మేడిచర్ల ప్రభాకర్ | 2014 | కర్మ సిద్ధాంతం, పాప ప్రాయశ్చిత్త సేవ చేయడం ద్వారా తొలగిపోతుందని చెప్పడం |
| 36 | చిరుజల్లు కురిసేనా | స్వాతి శ్రీపాద | 2014 | సహజీవనం |
| 37 | కిడ్నాప్ | యాటకర్ల మల్లేశ్ | 2017 | ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించిన ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేసి, నక్సలైట్లు తమ డిమాండ్లను సాధించుకునే తీరు |
| 38 | కానుక | వి.ఆర్.శర్మ | 2017 | ఆధునిక బాలల అద్భుత సాహస సైన్స్ కాల్పనిక నవల |
| 39 | చుక్కాని చిరుదీపం | స్వాతి శ్రీపాద | 2017 | స్త్రీల జీవిత చిత్రణ |
| 40 | కాలసర్ప | మల్లవరపు చిన్నయ్య | 2018 | తొలిదశ, మలిదశ తెలంగాణోద్యమం తర్వాత సగటు మనిషిని న్యాయం జరగలేదని చెప్పిన నవల |
| 41 | మృత్యోర్మా మృతాంగమయ | మల్లవరపు చిన్నయ్య | 2018 | ప్రపంచానికి జీవన తత్వాన్ని, మానవ విలువలను బోధించే యోగిగా మారే కథ |
| 42 | ప్రయాణం | వి.ఆర్.శర్మ | 2019 | సైన్స్ ఫిక్షన్‌కు మిరాకిల్, బాలల కాల్పనక వస్తువు |
| 43 | ఆరాటం | దారం గంగాధర్ | 2019 | అవినీతి అరహిత సమాజం, లంచగొండితనం లేని, మానవతా సమాజాన్ని చూడాలనే ఆరాటం |
| 44 | అమర్ సాహసయాత్ర | శాంతి ప్రబోధ | 2019 | బాలల సాహస యాత్ర. విషయజ్ఞానం, సమయస్ఫూర్తి ఉంటే బాలలు దేనినైనా సాధించవచ్చు. |

*****

# అధ్యాయం-4

# నిజామాబాదు జిల్లా నవలలు-సామాజిక విశ్లేషణ

### 4.1. మూఢ నమ్మకాలు

మానవ జీవన పరిణామ క్రమంలో ఎన్నో ఎన్నెన్నో సంఘటనలు, వింతలు చూస్తూ తన అవసరాల నిమిత్తం కొత్త ఆవిష్కరణలను కనిపెట్టుకుంటూ అభివృద్ధిపథంలో పయనం చేస్తున్నాడు. క్రమక్రమంగా నేడు అత్యాధునిక కంప్యూటర్ యుగంలోకి అడుగుపెట్టాం. ప్రతిది డిజిటల్ మయంగా మారిపోతుంది. ఇటువంటి కాలంలో కూడా మూఢనమ్మకాలను పెంచి పోషించేవారు కొందరు మనకు కన్పిస్తారు. చదుకున్నవారు కూడా మూఢనమ్మకాలను పాటిస్తూ ఉండటం కూడా సమాజంలో గమనార్హం. శాస్త్ర, సాంకేతిక అంశాలను ప్రతిపాదించే శాస్త్రవేత్తలు సైతం మూఢ నమ్మకాలపై ఆధారపడటం ఆశ్చర్యకరం. బాబాలను, స్వామిజీలను నమ్మి, వారు చెప్పిన బాటలో మూఢంగా పయనించడం, తరువాత మోసపోవడం లాంటి సంఘటనలన్నీ మన సమాజంలో నిత్యకృత్యమవుతున్నాయి.

మూఢాచారమైన 'జోగిని' వ్యవస్థ గురించి గమనించినట్లైతే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి. తెలంగాణలో 'జోగిని' ఆచారం చాలాకాలం నుండి కొనసాగింది. నేడు పెద్దగా కనిపించకపోయినా, మూఢంగా విశ్వసించేవారు లేకపోలేదు. జోగిని అంటే వివాహం కాని ఆడపిల్లలను దేవతలకు అంకితం చేసే ఆచారం. ఇది అనాదిగా వస్తున్న మూఢ సంప్రదాయం. దీనినే తెలంగాణలో 'జోగిని' అని పిలుస్తారు. పన్నెండు, పదమూడేళ్ళలోపు ఆడపిల్లల్ని దేవతకు జోగినిగా అంకితం చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఐదు నుండి ఆరు సంవత్సరాల వయస్సులోనే జోగినిగా మారుస్తారు. దీనినే 'జోగుపట్టా కట్టడం' అంటారు. ఈ కార్యక్రమాన్ని పోతరాజే చేస్తాడు. అతడే మంగళ సూత్రధారణ చేస్తాడు. పోతరాజు ఎల్లమ్మ

మొదలైన గ్రామదేవతలందరికి తమ్ముడు. ఆనాటి నుండి ఆ జోగినిగా మారిన అమ్మాయి దేవత అంశగా నిత్యసుమంగళిగా మారుతుంది. “దళిత అమ్మాయిలకు, గ్రామ దేవతలకు బదులు పోతరాజు మంగళసూత్రధారణ చేస్తాడు. గ్రామదేవత పండగను ‘ఊరపండగ’ అంటారు. వీళ్ళ అధికారిక పూజారి పోతరాజే. అతనికి పుట్టు వెంట్రుకలు తీయరు. జుట్టును ముడివేసుకుంటాడు. ఆ ముడి పవిత్రమైందనీ, అందులో ఎన్నో మంత్ర శక్తులున్నాయని నమ్ముతారు. చేతిలో కొరడా, మణికట్టుకు కడియం, కాళ్ళకు కడియాలు ఉంటాయి. ఒక్కోక్కప్పుడు పోతరాజుకి బదులుగా గౌడుకులస్థుల్లో పెద్దవాడైన వ్యక్తి కూడా మంగళ సూత్రధారణ చేస్తాడు. అతడు ఆ గ్రామానికి భూస్వామి. ఒక్కొక్కప్పుడు అనుభవపరులైన జోగినీల్లో వృద్ధురాలైన వ్యక్తి కూడా మంగళసూత్ర ధారణ చేయవచ్చు. తెలంగాణాలో దేవతలను సంతృప్తిపర్చడానికి పోతరాజు విధానం చాలా ప్రధానమైంది.” (లలిత, వకుళాభరణం. జోగిని వ్యవస్థ. పుట: 29, 30).

‘ముఖ్యంగా షెడ్యూల్డు కులాలకు చెందిన మాల, మాదిగ కులాల్లోనే ఈ ఆచారం ఎక్కువగా కన్పిస్తుంది. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ ప్రాంతంలో ఒక ఊరిలోనే ఇరవై నుండి మూఫ్పై మంది జోగినీలు కన్పిస్తారు. ఎల్లారెడ్డి ప్రాంతంలో నాలుగైదు ఊర్లకు కలిపి ఒకరు జోగినిగా ఉంటారు. అది ఆ కుటుంబానికి వంశపార పర్యంగా వచ్చే ఆచారం.’ (శాంతిప్రబోధ, వి. జోగిని. పుట: 60).

ఆచారాల పేరుతో అనేక గ్రామాల్లో తరతరాలుగా ఎందరో అమాయక స్త్రీలను దారుణంగా దోచుకుంటున్నదీ ‘జోగినీ వ్యవస్థ’. ప్రభుత్వం ఎప్పుడో నిషేధించిన జోగిని దురాచారం నేటికి కొన్ని ప్రాంతాలలో కొనసాగుతోంది. తెలంగాణ సామాజిక వ్యవస్థలో అత్యంత అమానవీయకరమైన జోగిని వ్యవస్థ ఆచారమనే ముసుగులో దళిత స్త్రీపై లైంగిక బానిసత్వాన్ని, సామాజిక దోపిడిని చేస్తుంది. స్త్రీని ఆటవస్తువుగా చేసి దేవుని పేరిట పెద్ద మనిషికి అర్పించే వికృత విధానం కనిపిస్తుంది. అధికారులు మత్తులో జోగుతుంటే, జోగిని నడివీధిలో

నాట్యమాడుతోంది. పశువుకన్నా హీనం జోగిని వ్యవస్థ. ఒక ఆడపిల్లన్ను జోగినిగా మార్చాలంటే కేవలం ఒక చిన్న సాకు చాలు. ఆ సాకు పిల్లలు కలగలేదని మరియు పిల్లలు పుట్టినా చనిపోతున్నారని లేదా ఇంట్లో వాళ్ళకు ఏదో జబ్బు వచ్చిందని మొదలైన కారణాలచేత దళిత స్త్రీని జోగినిగా మారుస్తారు. జోగినిగా అవతారం ఎత్తబోయే ఆ అమ్మాయి తల్లిదండ్రులు బయపడి ఎల్లమ్మ దేవతనో, పోచమ్మ దేవతనో తలచుకొని తమ సంతానాన్ని 'జోగి' ఇడుస్తామని మొక్కుకుంటారు. అలా అనుకొని ఆ దేవత పేరుమీద ముడుపు కడతారు. ఇక అప్పటినుండి వారి జీవితాల్లో మార్పు వస్తే అమ్మవారి మహిమని, మార్పు రాకపోతే ఇంకా అమ్మవారికి మనసు కరగలేదని అనుకుంటూ ఆ పసిపిల్లను పూర్తిగా జోగిని వ్యవస్థలోకి దింపడానికి కావాల్సిన తదుపది కార్యక్రమాలను అమలు చేస్తారు. అప్పటినుండి సహజంగా పెత్తందారు అయిన గ్రామ పెద్ద ఆమెను తన లైంగిక కోరికలు తీర్చుకోవడానికి వాడుకుంటాడు. కొన్ని గ్రామాల్లో ఒక్కడే కొంతమంది జోగినిలకు తాళికట్టి అందరితో శారీరక సంబంధం కలిగి ఉంటాడు. ఆమె కూడా ఆ పెద్ద మనిషి మీద ఆధారపడి, ప్రాణం ఉన్న శవంలా బతుకు ఈడ్చుతుంది. సహజంగా యవ్వనాన్ని అనుభవించే దాకా వాడుకొని ఆ పెద్దమనిషి ఆమెను వదిలిపెడ్తాడు. ఇక అప్పటినుండి ఆమెకు దారుణమైన కష్టాలు మొదలవుతాయి. గ్రామంలోని దాదాపు ప్రతి ఒక్క పురుషుడు ఆమెను లైంగికంగా వేదిస్తూనే ఉంటాడు. ఎటూ తప్పించుకోలేక పంజరంలోని చిలకలాగా తయారవుతుంది ఆ 'జోగిని' బతుకు. కనీసం ఆమెకు పుట్టిన పిల్లలకు తండ్రి ఎవరో చెప్పుకోలేని పరిస్థితిలో దారుణమైన మానసిక వేదనను అనుభవిస్తూ ఉంటుంది. "అదో దుష్ట సంప్రదాయం, దురాచారం ఆచారం ముసుగులో సంప్రదాయం పేరిట అభం శుభం తెలియని ఆడపిల్లని జోగినిగా మార్చడం అంటే దేవతకిచ్చి పెళ్ళి చేయడం ఆమెకు మనసుతో పని లేకుండా, మనిషిగా చూడకుండా మానసికంగా, శారీరకంగా, లైంగిక, ఆలోచనలపై హింస అంతా హింసే." (శాంతి ప్రబోధ, వి. జోగిని. పుట: 164)

మూఢ నమ్మకాలు, భూస్వాముల పెత్తందారీతనం, పేదవారైన తల్లిదండ్రుల స్వార్థం. బానిస మనస్తత్వం అన్నీ కూడా వారికి ఇష్టం ఉన్నా, లేకున్నా ఈ జోగినీ ఆచారాన్ని కొనసాగించేలా చేస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే దాదాపు రెండువేల మంది జోగినులు ఉన్నారని వెల్లడైంది. మెడలో తోలుతో చేసిన పుస్తె, ఊరి పండగలప్పుడూ, జాతరలప్పుడు భక్తులకు కుంకుమ బొట్లు పెడ్తూ, గ్రామ దేవత ముందు నాట్యం చేస్తూ కన్పిస్తారు. శవయాత్రలో ముందు నడుస్తారు. చిల్లర డబ్బులు ఏరుకుంటారు. పంట కళ్ళాల్లో అడుక్కుంటారు. డబ్బున్న వాళ్ళ పంచన చేరిన వాళ్ళు కాస్త సుఖంగా బతికితే, మిగతా వాళ్ళది సామాన్యమైన పాతరోత జోగిని జీవితమే. వాళ్ళు ఒకరికంటే ఎక్కువ మందితో కామకలాపాలలో పాల్గొనడం వల్ల సుఖవ్యాధులతో బాధపడుతున్నారు.

"అసలు జోగినీ ఆచారం ఎక్కడనుండి పుట్టిందని ఆచోచిస్తే "బసవన్నలను పూజించేవారు శైవులు. అంటే శైవమతంలోంచి పుట్టుకొచ్చింది జోగిని వ్యవస్థ. ఆనాడు దక్షిణాది ప్రాంతంలో శైవులు, వీరశైవులు ఎక్కువగా ఉండేవారు. వీరికి కుల, మత భేదం లేదు. అస్పృశ్యులు కూడా వీరశైవుల దృష్టిలో బ్రహ్మణుడికన్నా తక్కువేం కాదు. వీరశైవుల్లో అనేకమంది భిక్షాటనలోనే జీవించేవారు. భూములు మొదలైన ఆస్తిపాస్తులు ఉన్నవారు, తమ ఆదాయాన్ని మఠాల నిర్వహణకు, శివ కైంకర్యానికి ఖర్చు పెట్టేవారు. శైవ గురువుల్లో కూడా బోలెడు దురాచారాలు ఉండేవి. అందులోంచి వచ్చిందే జోగిని లేదా బసివి వ్యవస్థ అయి ఉండవచ్చు. దైవ సన్నిధిలో కాలం గడుపుతూ, దైవ కార్యాలలో పాల్గొనే కొందరు బాలికలను శైవులు జోగినులు, బసివిలు, మాతంగులు, మాతమ్మలు, శివసత్తులు, పార్వతులు అని రకరకాలుగా పిలిస్తే, వైష్ణవులు మాత్రం దేవదాసీలు అనేవారన్న మాట మనసులో అనుకొంది. మహాభారతంలోనూ మాతంగుల ప్రస్తావన కన్పిస్తుంది. పెళ్ళికాని ఆడపిల్లల్ని దేవతలకు ఇచ్చి పెళ్ళి చేయడం, గ్రామాలలో దేవతలకు అంకితం చేయడం ఆనాటి నుండే ఉందన్నమాట. జీగిని వ్యవస్థ ఆవిర్భావం గురించే ఆలోచిస్తూన్న విద్య."(శాంతి ప్రభోధ, వి. జోగిని. పుట: 64).

జోగిని విధానం భూస్వామ్య విధానం అవశేషంగా మతం పేరుతో స్త్రీలను దోపిడికి గురిచేసే విధానం. మత సంప్రదాయాల ముసుగులో సామాజిక అనుమతితో జోగినిలను వ్యభిచారంలోకి దించేవారు. ఈ మొత్తం విధానం మూఢ నమ్మకాలకు నిలయమైంది. చిన్న వయసులోనే అమ్మాయిల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కష్టమైన జీవన విధానానికి నిండు జీవితాన్ని బలిచేసేవారు.

"జోగిని పిల్లలు భూస్వాముల సంపర్కంలో పుట్టినప్పటికీ వీరు ఆమె బిడ్డలేగానీ, ఆయన బిడ్డలు కాలేరు. దురదృష్టవంతులైన వీరు తండ్రి ఉండి కూడా తమ తండ్రి అని చెప్పలేని నికృష్ట పరిస్థితిలో ఉంటారు. జోగిని కొడుకు ఆ కాలంలో ఎవరినైనా వివాహం చేసుకోవచ్చు. అభ్యంతరం ఏమీ ఉండదు. కాని జోగిని కూతురు మాత్రం ఆ కాలంలో వివాహం చేసుకోకూడదు. కనీసం ఒక్కరైనా తల్లిలాగే జోగిని అవుతుంది. జోగినికి ఆడపిల్ల పుట్టడమంటే ఈ సంప్రదాయం కొనసాగించడమనే అర్థం." (లలిత, వకుళాభరణం. జోగిని వ్యవస్థ. పుట: పుట: 66)

కుటుంబంలోగాని, గ్రామంలోగాని, అరిష్టం వాటిల్లడం, క్షామంగాని, వరదలు సంభవించి అంటువ్యాధులు ప్రబలడం మొదలైన కారణాల వల్ల ఈ వ్యవస్థ ఆచారంగా నిలబడిందని చెప్పవచ్చు. ఇవి సంభవించడానికి గ్రామదేవత ఆగ్రహమే కారణం అని, దేవతకు ఆ అమ్మాయిని సమర్పించి సంతృప్తిపర్చాలని అమ్మాయిలను జోగినులుగా చేస్తారు. దాంతో మొదటి ఘట్టం ముగుస్తుంది.

రెండో ఘట్టాన్ని 'మైలపట్టం' అంటారు. రజస్వల అనంతరం జోగినికి మొదటి ఘట్టంలో ఖర్చును భరించిన భూస్వామితో సమాగమం జరుగుతుంది. 'ఆ అమ్మాయి భౌతిక ఆకర్షణను బట్టి ఆ భూస్వామి ఒకరాత్రి ఉంచుకోవచ్చు. లేదా కొన్ని రోజులు ఉంచుకోవచ్చు. అతను

వదిలేసిన తర్వాత ఆమె జీవితం ‘కుక్కలు చింపిన విస్తరిలాగా’ తయారవుతుంది. ఫలితంగా ఆమె యవ్వనాన్ని, ఆరోగ్యాన్ని కోల్పోయి శరీరంలో శక్తి నశించి జీవచ్ఛవంలా బతుకుతుంది.” (లలిత, వకుళాభరణం. జోగిని వ్యవస్థ. పుట: 68)

ఈ పరిస్థితి కేవలం ఒక ప్రాంత సమస్యగా కాక మానవ సమస్యగా పరిగణించి ఈ పద్ధతి మూఢాచారాలతో మిళితమై ఉంది. ఉన్నట్లుండి ఒక్కసారిగా వాళ్ళు తమ అలవాటు మానుకోలేరు. నెమ్మదిగా వాళ్ళలో మార్పును తీసుకురావాలి. ఈ దిశగా ప్రభుత్వం ఇతర సామాజిక, స్వచ్ఛంద సంస్థలు విశేషంగా కృషి చేశాయి. ప్రభుత్వం 1988వ సంవత్సరంలో దేవదాసీ నిర్మూలన చట్టం చేసినా ఇంతవరకు కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా మాసిపోలేదు. ఈ అంశం మొత్తం కూడా రచయిత్రివి. శాంతి ప్రబోధ ‘జోగిని’ నవలలో ముత్తెమ్మ, సాయవ్వ, పోశవ్వ పాత్రల ద్వారా జోగినిల జీవితాల గురించి వివరించడం జరిగింది.

కర్ణాటక రాష్ట్రంలో దేవదాసీలనే ‘బసివిలని’, ‘ముత్తుకట్టి’, ‘కొండవాళ్ళు’ అని, ‘గజ్జెపూజ మడిసికాండ’ వాళ్ళు అని, ‘నాగసాలని’, ‘కసాసీలని’, అనేక పేర్లతో పిలిచేవారు. కర్ణాటకలో దేవదాసీలను బసవన్నలగ ‘నంది’ అని శివునికి వాహనంగా పేర్కొనటం. ఒక్కొక్కప్పుడు ఎద్దులను దేవుని పేరుతో వదిలివేయడం చూస్తుంటాం. ఊరి ప్రజల కోసమే దాన్ని అలా వదిలివేస్తారు. అలాగే అమ్మాయినీ దేవుళ్ళకి అర్పించినప్పుడు ఆ అమ్మాయిని ‘బసవీ’ అని అంటారు. ప్రజలందరి ఉపయోగం కోసమే వారిని వాడుకుంటారు. వారిది ఊరుమ్మడి బతుకు. ఇటువంటి సామాజిక సమస్యను తెలియజేస్తూ రాయలసీమ రచయిత వి.ఆర్.రాసాని ‘ముద్ర’ అనే నవల రాయడం విశేషం.

**మొక్కుబడి**

"తల్లిదండ్రులు మగపిల్లలు పుట్టలేదనో లేదా ఆర్థిక వెనుకబాటుతనం వల్లనో, తమకు పుట్టే ఆడపిల్లలను దేవతకు సమర్పిస్తామని మొక్కుకుంటారు. గ్రామాల్లో ముఖ్యంగా దళితుల్లో మొక్కుబడికి మాత్రం చాలా ప్రాధాన్యం ఉంది. కరీంనగర్‌లో వేములవాడ రాజరాజేశ్వర దేవునికి పార్వతులను సమర్పిస్తారు. వీరిని శివసత్తులని అంటారు. అట్లే జోగినిలను ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ దేవతలకు అంకితమిస్తారు." (లలిత, వకుళాభరణం. జోగిని వ్యవస్థ. పుట: 29)

వి.శాంతి ప్రబోధ 'జోగిని' నవలలో మొక్కుబడి ఆచారం వల్ల దళిత స్త్రీలు జోగినులుగా ఎలా మార్చబడ్డారో చిత్రించారు. మొదటి పిల్లను దేవతకు అంకితం ఇస్తామని పిల్ల పుట్టకముందే మొక్కుకుంటారు. కాబట్టి ఆడపిల్లను జోగినిగా మార్చారు. ఎల్లయ్య దంపతులకు పుట్టిన పిల్లలు పుట్టినట్టు చనిపోతూ ఉంటే ఊరి దేవతకు మొక్కుకొని కూతురిని జోగినిగా మార్చారు.

ప్రజలలో ఉన్న అంధవిశ్వాసాలు జోగిని వ్యవస్థ వేళ్ళూనికొనిపోవడానికి మూలకారణం. యువతుల్ని గ్రామదేవతలకు బాల్యంలోనే అర్పించేస్తే ఊరిని అనేక ప్రకృతి విపత్తుల నుంచి కాపాడుకోవచ్చనే మూఢనమ్మకం ప్రజలలో నాటుకొనిపోయి ఉండటమే జోగిని వ్యవస్థ కొనసాగింపుకు కారణమని చెప్పవచ్చు.

దళిత స్త్రీలు జోగినిలుగా, బసివిలుగా మార్చడానికి ప్రధాన కారణం ప్రజల మూఢవిశ్వాసం. "గ్రామంలో ఉన్న అభిప్రాయం ఏమంటే అమ్మాయిలను స్థానికంగా గ్రామదేవతలకు అర్పించినట్లైతే గ్రామాల్ని ప్రకృతి వైపరిత్యాల నుంచి, మరణాల నుంచి, ఇతర క్లిష్ట పరిస్థితుల నుంచి కాపాడుకోవచ్చు." (లలిత, వకుళాభరణం. జోగిని వ్యవస్థ. పుట: 15)

జోగిని నవలలో దళితుల పిల్లలు పుట్టి చనిపోతూ ఉంటారు. వారు సరైన వైద్యం చేయించకుండా మూఢవిశ్వాసంతో దేవతలకు మొక్కుకొని ఆడపిల్లలను జోగినిలు తయారుచేస్తారు.

ఊరపండగ ఎందుకు జరుగుతుంది అని విద్య రాజాగౌడ్‌ను అడిగినప్పుడు 'గత పదిహేను ఇరవై రోజులుగా గ్రామంలో పశువులు అనారోగ్యానికి గురై చనిపోతున్నాయి. అందుకు కారణం గ్రామ దేవత ఆగ్రహించడమేనని మా ఊరి ప్రజల నమ్మకం. కొన్ని చిల్లర పైసలు, కుంకుమ, పసుపు, బియ్యం చిన్న ముళ్ళె(మూట)గా కట్టి గ్రామ దేవత దగ్గర ఆ మూట ఉంచుతారు. దాన్ని" ముడుపు" అంటారని చెప్తాడు.

దేవతలకు అంకితమైన ఆడపిల్లలు ప్రాపంచిక ఆకర్షణలకు లోనూ కాకుండా, తమ కాలాన్ని భగవంతుని సేవలో గడిపే దేవదాసీలు, బసివిలకు, భగవంతుని సేవే వారికి పరమార్థం. ఎన్నో శతాబ్దాల క్రితం ప్రారంభమైన ఆ సంప్రదాయం నేటికీ మనకు సజీవంగా కన్పిస్తోంది. రోమన్ కాథలిక్స్, జైన భిక్కులు, హిందూ పీఠాలలో సన్యాసినులు ఈ కోవకు చెందినవారే.

"జోగినులుగాని, మాతంగులుగాని శివసత్తులుగాని, దేవదాసీలుగాని ఈ వ్యవస్థలోంచి వచ్చినవారే. ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో ఉన్నప్పటికీ వారు దైవ సన్నిధిలో గడుపుతూ దైవ కార్యాలలో పాల్గొనేవారు. అయితే కాలక్రమంలో ఎన్నో మార్పులు వచ్చాయి. సమాజంలో వచ్చే మార్పుల ప్రభావం వల్ల, నైతిక విలువలు పతనం కారణంగా ఈ జోగిని వ్యవస్థ, దేవదాసీల వ్యవస్థ నీతి బాహ్యమైన స్థితికి దిగజారింది. గ్రామంలో పెద్దలు, ధనికులు, భూస్వాములు యవ్వనంలో ఉన్న ఆ యువతులను ఆకర్షించి, ప్రలోభపెట్టి తమ కామవాంఛలు తీర్చుకునేవారు. మొదట్లో గుట్టుచప్పుడు కాకుండా సాగిన ఈ కామకలాపాలు క్రమక్రమంగా బహిర్గతం కావడం

విచ్చలవిడి రూపం దాల్చడం, చివరకు కొందరు డబ్బున్న వాళ్ళు, అధికారం ఉన్నవాళ్ళు వీరిని చేరదీసి ఉంచుకొని ఇష్టమైతే వారికి ఆస్తులు కట్టబెట్టడం, వారిలో ఆకర్షణ తగ్గిపోగానే వారిని కాదనడం, వారికి ఆశ్రయం కరువు కావడంతో ఆకలి బాధనుండి తప్పించుకోవడం కోసం వీరు మరొకర్ని చూసుకోవడం ప్రారంభమైంది. వ్యభిచరించడం సాధారణమైంది. ఈ రోజుల్లో దైవ సాన్నిధ్యంలో గడిపే దేవదాసీలు మనకి కన్పిస్తారా..? సర్వ సాధారణంగా వీరంతా వ్యభిచార వృత్తిలో ఉన్నవారే. పెళ్ళి చేసుకోక పోవడమొక్కటే నాటికీ నేటికీ ఈ దేవదాసీ వ్యవస్థలో కన్పించే సామ్యం. మిగతా ఆశయాలతో, ఆచరణలో పూర్తిగా భిన్నరూపం దాల్చాయి." (శాంతి ప్రబోధ, వి. జోగిని. పుట:66)

"సాధారణంగా భక్తులు తమ కోరికలు తీరాలంటే నైవేద్యంగాని, జంతువులనుగాని, స్త్రీలనుగాని దేవతలకు అర్పించాలి. స్త్రీలకు శీలం ప్రధానం కాబట్టి ఆశలన్నీ అర్పించడమనేది పాతుకుపోయిన ఆచారాలకు, సంప్రదాయాలకు అనుగుణంగా అమ్మాయిలను అర్పించే పద్ధతి అమల్లోకి వచ్చింది." (లలిత, వకుళాభరణం. జోగిని వ్యవస్థ. పుట: 64)

జోగిని సంప్రదాయ మూఢనమ్మకం గురించి 'జోగిని' నవలలో ప్రధాన పాత్ర అయిన విద్య జోగిని వ్యవస్థపై పరిశోధన పూనుకొని అటువంటి సంప్రదాయం ఉన్న ప్రాంతాలను సందర్శించినప్పుడు అక్కడ ఒక జోగిని స్త్రీని ఇంటర్వ్యూ చేసినప్పుడు ఆమె జోగినిల కట్టుబాట్ల గురించి ఇలా చెప్తుంది. "జోగిని నిత్య సుమంగళి. ఆమెకు వైదవ్యం లేదు. చిన్నప్పుడే దేవతను లగ్గం చేసుకుంది కాబట్టి దేవత ప్రతిరూపం. ఊరు విడిచి ఎక్కడికీ పోరాదు. వేరే ఎవర్నీ లగ్గం చేస్కోవద్దు. దేవునితో లగ్గమయ్యింది కాబట్టి ఆమె ఊరందరికీ పెండ్లాం అసింటిది, ఆమె దగ్గరకు ఎప్పుడంటే అప్పుడు రావచ్చు. పోవచ్చు. అప్పుడామె కాదనొద్దు. జోగిని పిల్లలకు తండ్రి ఉండడు. ఊరపండుగల్లో, శవాల ముందు ఆడుకుంట, అడుక్కుంట, కళ్యాల్ల గింజలడుక్కుంట జీవనం చేసుడు మా బతుకు. నిర్వికారంగా చెప్పింది సాయవ్వ." (శాంతి ప్రబోధ, వి. జోగిని. పుట: 15)

ఈ జోగిని సంప్రదాయం అగ్రవర్ణాల సుఖాల కోసం, అవసరాల కోసం పురుడు పోసుకుంది. దళితుల, బీదవారి నిస్సహాయతను ఆసరగా తీసుకొని అగ్రవర్ణాల వారు ముఖ్యంగా శారీరక సుఖంకోసం ఈ 'జోగిని' సంప్రదాయాన్ని నెలకొల్పారు. దేవుడి పేరు చెప్పి, అనర్థాలు జరుగుతాయని చెప్పి, ఊళ్ళో ఏ జబ్బు చేసో ఎవరైనా చనిపోతే అది దేవుడిని ఆడపిల్లలను దేవుడికి అర్పించాలనే నెపంతో 'జోగిని' పేరుతో విడిచిపెట్టాలని భయపెట్టిస్తారు. శాంతి ప్రబోధగారు రాసిన 'జోగిని' నవలలోని సంభాషణను గమనిస్తే "ఎల్లయ్యకు నలుగురు పిల్లలు పుట్టారు. నలుగురూ పురిట్లోనే చనిపోయారు. ఊరి దేవతకు మొక్కుకుని మొదలు పుట్టిన ఆడపిల్లను దేవతకు అంకితం చేస్తానని మొక్కుకున్నాడు ఎల్లయ్య. అతనికి సలహా ఇచ్చింది అతని అత్త లస్మవ్వ. ఈ సారి ఎల్లయ్య భార్య కూతుర్ని కంది. ఆ పిల్ల బాగానే ఉంది. మరో ఏడాది మరో పిల్లను కంది. పెద్ద పిల్లకు పీరవ్వ అనీ, రెండో పిల్లకు పోశాని అని పేరు పెట్టుకున్నారు. పెద్ద పిల్లకు మాటలు రాలే, చెవులు విన్పించడం లేదు. ఇంటికి ఓ ఆచారం ఉంది. మొదటి పిల్లను దేవతకు అంకితం ఇస్తామని పిల్ల పుట్టకముందే మొక్కుకున్నారు. కాబట్టి ఆ పిల్లను జోగినిగా మార్చారు. పోశానికి, ఆరో ఏట పుట్టెంటుకలు తీస్తానంటే లస్మవ్వ ఒప్పుకోలేదు.

ఆ తర్వాత కొద్ది రోజులకే పోశానికి పెద్దమ్మవారు(మశూచి) సోకింది. అప్పటికే ఊర్లో పది శవాలు లేచాయి. పిల్ల ఏమౌతుందోనని బెంగపడిపోయారు ఎల్లయ్య దంపతులు. పిల్ల మూసిన కన్ను తెరుస్తలేదు. ఎలా? చేతిలో చిల్లిగవ్వలేదు. ఎల్లమ్మకు కల్లుసాక బెట్టి, కోడి కోయాలె అని ఊరి పెద్ద ప్రతాపరెడ్డి దగ్గరకు వెళ్ళారు. ఆ సమయంలో అతను అందుబాటులో లేకపోవడంతో ఊర్లో వడ్డీకి తిప్పే భోజాగౌడ్ తండ్రి దగ్గరకు వెళ్ళారు. భోజాగౌడ్ ఆ పిల్లను చూసి మాదిగ ఇళ్ళలో ఉండాల్సిన పిల్ల కాదనుకున్నాడు. ఇప్పుడు ఎల్లయ్య దంపతులు వచ్చిన వైనం తెల్సుకొని జేబులోంచి యాభై రూపాయలు తీసి ఇచ్చాడు. పిల్ల సక్కదనంగున్నది. దాన్ని మట్టిల కలపద్దు. దవాఖానకు కొంటబో అని, మళ్ళీ తానే అమ్మోరు కోపానికయ్యింది. అమ్మోరికి బోయి దీన్ని జోగిడుస్తమని ఎల్లవ్వ బందారు పెట్టు, లేకుంటే ఊల్లె ఎన్ని పీనుగలెల్లాల్నో...? చెప్పాడు.

చెప్పింది ఆచరించడం తప్ప మరో ఆలోచన, వివేచన లేని ఎల్లయ్య దంపతులు ఆ విధంగానే చేశారు. మొత్తంమీద పోశానికి గండం గడిచింది. నెమ్మ నెమ్మదిగా కోలుకుంది. మామూలు మనిషి అయింది. అమ్మోరు అనుగ్రయించింది. అందుకే పిల్ల మీద నుండి వెళ్ళిపోయింది అనుకున్నారు అంత. ఆ రోజు నుండి ఎల్లయ్య దంపతులకు భోజగౌడ్ మాటంటే గురి పెరిగింది. వయస్సులో చిన్నవాడే కాని వివరం కలవాడు. విషయం తెల్సినవాడు అంటూ భోజాగౌడ్‌ని కీర్తించారు. తర్వాత మీ పోశాన్ని జోగినిగా చేయాలి లేకపోతే ఊరంతా గత్తర వస్తుంది, శవాల దిబ్బ అవుతుంది. మీరప్పుడు దేవునికి పోశానిని జోగిదుస్తం అంటేనే దాని ఆరోగ్యం బాగుపడింది. ఇప్పుడు కచ్చితంగా పోశానిని జోగినిగా మార్చాలి అంటాడు. ఈ విధంగా తెలంగాణలో జోగిని వ్యవస్థ వల్ల దళిత స్త్రీలు అనుభవిస్తున్న బాధలను జోగిని నవలలో చూడవచ్చు.

### 4.2. అంటరానితనం, వివక్ష

జోగిని నవలలో విద్య కవిత వాళ్ళింటికి వచ్చినపుడు దళితుల ఇళ్ళకు వెళ్ళి స్త్రీల సమస్యలు, జోగిని సంప్రదాయం గురించి తెలుకొని వస్తుంది. అప్పుడు కవిత వాళ్ల ఇంటిల్లిపాది స్పందించిన తీరు కింది సంభాషణలో మనకు కన్పిస్తుంది.

"కవితా ఆమెను ముట్టుకోకు. దూరం ఉండు మాలోల్ల మాదిగోళ్ళ ఇళ్ళు తిరిగొచ్చింది కదా! అని విద్యవైపు తిరిగి స్నానం చేసి లోపలికి రా బిడ్డా అంది రాంబాయి. ఉండవే నీ బట్టలు బాత్రూంలో వేస్తాను. అంటూ లోపలికెళ్ళింది కవిత. విద్య నడిచి వచ్చిన దారంతా పసుపు నీళ్ళు జల్లి శుద్ధి చేస్తోంది రాంబాయి. విద్యకి ఈ తంతు కొత్తగాను, అసహ్యంగాను తోచింది. ఈ చాదస్తం బ్రాహ్మణులకు, వైశ్యులకు ఉంటుందని వింది. వీళ్ళకు కూడా ఉందని ఈ ఆచారాన్ని ప్రత్యక్షంగా చూసింది. అనుభవించింది ఇప్పుడే. మనం బయటకు వెళ్ళింది మొదలు ఎంతోమందిని కలుస్తాం. మరెంతో మందిని తెలిసో, తెలియకో ముట్టుకుంటాం. ఎన్నో

ప్రదేశాల్లో తిరుగుతాం. అప్పుడు అక్కడ వాళ్ళది ఏ కులం? ఏ మతం అని చూడం ఆలోచించం కదా! ఎవరి పని వాళ్ళది. మరి ఇప్పుడు ఏమిటో వీళ్ళ ఆచారాలు... పద్ధతులూ, తెలంగాణా ప్రాంతం అంతా వెనుకబడిన ప్రాంతం అని తెలుసు. కాని ఇప్పుడు కూడా, ఈ రోజుల్లో కూడా ఇంకా భూస్వామ్య పెత్తందారీ విధానం, అంటరానితనం, అణచివేత, మూఢవిశ్వాసాలు, అచారాలు, స్త్రీవివక్ష ఇంత బలంగా నాటుకుపోయి ఉండటం ఆశ్చర్యమే. ఈ అణగారిన తనంలోంచి, ఈ పెత్తందారీ వ్యవస్థ నుంచే నక్సలిజం ఎదుగుతూ వస్తోందేమో." (శాంతి ప్రబోధ, వి. జోగిని. పుట: 18).

"జాతి వివక్ష గురించి మొన్ననే విన్నాను. కాని అంతగా తెలియదు. అయితే మా సమాజంలో దళితుల పట్ల వివక్ష కొత్త వారికైనా స్పష్టంగా తెలుస్తుంది. మేం అంటే దళితులం దాదాపు ఇరవై ఆరుకోట్ల పైచిలుకే ఉన్నాం. ఈ దేశంలో సంఖ్య పరంగా ఇంత ఎక్కువ ఉన్న మమ్మల్ని, మా పుట్టుక, మా వృత్తి ఆధారంగా వివక్షకు గురి చేస్తున్నారు. ఏ పల్లెల్లో ఎంత చిన్న హోటల్‌కు వెళ్ళినా మా గ్లాసులు వేరే ఉంటాయి. మా యిళ్ళు ఊరవతల దూరంగా విసిరేసినట్లు... వివక్షకు చిహ్నంగా కనిపిస్తాయి. అంటరానివారం కదా... అందుకనే ఊరికి అంటకుండా, చట్టాల్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే మమ్మల్ని దూరంగా ఉంచేస్తున్నాయి. చాలా గ్రామాల్లో దళిత వ్యక్తి సర్పంచ్ అయినా, పంచాయతీ ఆఫీసులోని కుర్చీలో నేటికీ కూర్చోనివ్వరు. పెద్ద కులస్తుల కాళ్ళకు కొద్ది దూరంలో కింద కూడా కూర్చోనివ్వరు. గ్రామాలలో ఎవరు చనిపోయినా బొందతవ్వేది దళితులే. పూడ్చేది దళితులే. పశువులు చనిపోతే కళేబరాలు తీసి బయట పారేసేది దళితులే. వాటి చర్మం తీసి చెప్పులు కుట్టి ఆ పసువు యజమానికి అందించాల్సింది దళితులే. ఇలా ఎన్నో పనులు ఊరికోసం చేసే దళితులకు నెలకింత అని వేతనం ఉండదు. దినసరి కూలి చేయడం మా వృత్తి. వ్యవసాయం చేసి పుట్లు పండిస్తాం. కాని తినడానికింత ముద్దకోసం మేం పడరాని పాట్లు పడాల్సిందే. అలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో. భూస్వాములు, వ్యాపారులు అధికారం ఉన్నవాళ్ళు, పెద్దవాళ్ళు, పెద్ద కులాల వాళ్ళ నుండి

మమ్ములను గుర్తించడం చాలా సులభం. మేం చెప్పులు వేస్కోకూడదు. ఎంత చిన్న వయసైనా కొప్పు పెట్టుకోవాలి. మగవాళ్ళు లుంగి కిందకి కట్టుకోకూడదు పెద్ద కులస్తుల ముందు. నక్కకీ నాగలోకానికీ ఉన్నంత అంతరం ఉంది. అయినా అందరూ ఇది సామాన్య విషయం అనుకుంటూ ఐదువేళ్ళు ఎప్పుడూ సమానంగా ఉండలేవన్నట్లూ మాట్లాడతారు.” (శాంతి ప్రబోధ, వి. జోగిని. పుట: 18)

దళితులను ఎంత అవమానంగా చూస్తూ హింసేంచేవారో ఈ నవలలో మనం గమనించవచ్చు. కనీసం మనుషులుగానైనా గుర్తించరు. బహుజన వర్గాలు కొంతవరకు కలిసిపోయే ప్రయత్నం చేసినా, భూస్వాములు, దొరలు, గ్రామ పెద్దలుగా వ్యవహరించే ఇతర బహుజన కుల నాయకులు కూడా దళితులపై ఆధిపత్యం చూపిస్తారు. బానిసలుగా చేసుకుంటారు.

## 4.3. దళిత చైతన్యం

దళితుల్లో జోగినిగా మారిన స్త్రీలు చాలా బాధలు అనుభవించారు. అగ్రవర్ణాల కుట్ర వల్ల ‘జోగిని’గా మారి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న దళిత స్త్రీలలో మార్పుకోసం చేయూతనిస్తూ అండగా నిలిచాయి ప్రజాసంఘాలు. తద్వారా సమాజంలో గుర్తింపు, గౌరవం వచ్చేలా సేవామార్గాన్ని ఎంచుకున్నారు. అటువంటి శాంతి ప్రబోధగారు రాసిన ‘జోగిని నవలలో మనకు కన్పిస్తుంది. “నా కట్టు బొట్టు మారకపోయినా నా భాష, భావ ప్రకటనలో ఈ ఆరేళ్ళలో ఎంతో మార్పు. నేనే ఎన్నడూ ఊహించని మార్పు. నా ఎదుగుదలకు దోహదకారులైన ప్రతి ఒక్కరిదీ అవార్డు. ఇకముందు నా మీద మరింత బాధ్యతను పెంచింది ఆ అవార్డు. నా ప్రియమైన అక్కలు, చెల్లెళ్లకోసం, దళిత అన్నదమ్ములకోసం నేను మరింత కృషి చేస్తాను అని విన్నవించు కుంటున్నాను. నా అవార్డులో సగం, నా మండలంలోని బాలబాలికల కోసం, మిగతా సగం మొత్తాన్ని ఏ అండాలేని, ఏ ఆసరాలేని బతుకు కష్టమైన వృద్ధ జోగినుల కోసం అందజేయాలి

అనుకుంటున్నానని సభాముఖంగా ప్రకటించింది. సర్పంచ్‌గా మూడున్నరేళ్ళు పని చేసినా, మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఉన్నా ఆర్థికంగా ఏమాత్రం ఎదగని పోశవ్వ మానసికంగా చాలా ఎదిగిపోయింది. అందుకే అంత మొత్తాన్ని మళ్ళీ ప్రజలకే చెందాలనుకోవడం ఆమెలోని నిస్వార్థ సేవాగుణానికి, ఆమె నిరాడంబరతకు తార్కాణమని పేర్కొన్నాయి పత్రికలు."(శాంతి ప్రబోధ, వి. జోగిని. పుట: 162). దళితులను అణగదొక్కే అగ్రవర్ణాలు తప్ప వారిని చైతన్యపరిచే వారు ఉంటే ఎంతటి చైతన్యంతో ముందుకు సాగుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారో 'జోగిని' నవలలో చూడవచ్చు.

'విజేత' నవలలో మేడిచర్ల ప్రభాకరరావు గురువు పాత్ర ద్వారా కులానికి సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించారు. బాలాజీ అనే వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగ విరమణ తర్వాత వారి సొంత గ్రామంలోకి వెళ్ళి సేవ చేయాలనుకొని అతని స్నేహితుని అభిప్రాయాలు అడిగినప్పుడు చాలామంది అతన్ని దళితునివి అని పదే పదే గుర్తు చేస్తారు. ఆశ్రమ గురువు ద్వారా బాలాజీకి కులం గురించిన విశ్లేషణను చేస్తున్నట్టుగా ఈ నవలలో చర్చించారు. ఏదో లాభం జరుగుతుందని ఏ మానవుడు కులాన్ని నిర్ణయించుకొని జన్మించడు. లేదా ప్రకృతిలో ఏర్పడ్డ అవకాశాల ద్వారా ఏదో ఒక కులంలో జన్మిస్తాడు. కులాలకు నీచము ఉన్నతాలనేవి లేవు. అన్ని కులాలను సమాజం సమానంగానే గౌరవిస్తుంది. ఎవరి వృత్తిని అనుసరించి వారికి కులాలు ఏర్పడ్డాయి. వృత్తులు అందరికి ఉపయోగపడేవి కదా! ఉపయోగపడేవారిని ఎవ్వరు కూడా న్యూనతా భావముతో చూడరు కదా! కులాన్ని అనుసరించి గౌరవం ఏర్పడదు. సజ్జనులు ఏ కులంలో ఉన్నా సమాజం ఎప్పుడూ గౌరవిస్తుందనే విషయాన్ని చర్చించారు. రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కుల మూలంగా కొంతవరకు ఏ కులంలోని మేధావులనైనా గౌరవస్తుందీ సమాజం. కొన్ని విషయాల్లో ఏదో ఒక రూపంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దళితులు కులవివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారు. బాలాజీ తన దళిత జాతి చైతన్యం కోసం పాటుపడతాడు.

## 4.4. చదువు

అనాదిగా సమాజంలో దళితులుగా ముద్ర వేయబడ్డ పేదల అన్ని రంగాలలో వెనుకబాటుతనం కనిపిస్తుంది. దీనికి కారణం అగ్రవర్ణాల ఆధిపత్యం వల్ల హింసకు, బానిసత్వానికి గురై ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు దళితులు. వీరికి చదువైతే అసలే లేదు. ఒకవేళ దళితులు చదువుకుంటే ప్రశ్నించడం నేర్చుకుంటారు. తమ కొడుకులు, కుమార్తెల వలే ఉన్నత స్థానానికి ఎదుగుతారని కుట్రపన్ని చదవనీయకుండా చేస్తారు భూస్వాములు, దొరలు. వారి కబంధహస్తాల్లో ఎంత కష్టం చేసినా, కనీసం తిండికి కూడా లేక తల్లిడిల్లుతున్నారు దళితులు. 'జెగ్గని యిద్దె' నవలలో బీద–సాదా ఏ భేదం లేకుండా అందరూ చదువుకోవాలని చైతన్యం చేసేందుకు గ్రామంలోకి వచ్చిన పెద్దల మాటలు విని చదువుకుంటానని జెగ్గడు తండ్రితో చెప్తాడు. కాని దొర దగ్గర నిన్ను జీతగాడిగా ఉంచుతానని మాట ఇచ్చాను. నువ్వు చదివి ఏం సాధిస్తావని తండ్రి వద్దంటాడు. కాని చదువుకుంటే ఏం లాభాలు ఉంటాయో గ్రామంలోని సభలో విన్నాడు జెగ్గడు. ఆ విషయాన్నింటిని కూలంకుషంగా తండ్రికి చెప్పి మొండిపట్టు పట్టి ఖచ్చితంగా చదువుకుంటానని తెగేసి చెప్తాడు. తద్వారా చైతన్యవంతమై న్యాయవాద వృత్తిని ఎంచుకొని, తను పుట్టిన గ్రామానికి సేవ చేస్తాడు జెగ్గడు. తద్వారా దళితులు చదువుకోవాలనే పిలుపును ఈ నవల ద్వారా రచయిత చెప్పాడు.

“అనుమాండ్ల గాడనేకం మంది గుంపు గూడింగ్రు. వొగాయిన నిలబడి సబ జెప్పిండు. చిన్నా, పెద్దా, ఆడోల్లు, మొగోల్లు, సాకలోల్లు, మంగలోల్లు, మాలమాదిగ, యీల్లు ఆల్లనక సకులం జదువుకోవాల్నట. అహ్హా! సదువు దెంత మంచిపాట బాడిండే! నేను పోస్గిలాసనే అనుకున్న సదువునేర్తె అందరం మంచిగుంటమట, జాగ్గిర్తెతమట. భూమీ్మద మంచీచెడ్డ దెలుత్తదట. సత్తెంగాదె మరి? సదువచ్చినోల్లంత యెట్లావుంటరు. ఆల్ల బట్టలు, అంకరంకర పాపెట్లు, శోకులు యెట్లుంటయి, ఆ బొట్టలు పిట్టలుజూడు. నడిస్తే కాల్లర్గిపోతయి, కంద గరిగిపోతది. బైస్కిల్, మోటర్ కచ్చురాల్, గుఱ్ఱాల్ ఇవన్ని యాడి కేలత్తయి. సదువు నేర్సి, రాత

రాసి బాగ పైకం జంపాయించి యింత గమ్మత్తుగా వాల్లుంటే మనం పసులోలె రెక్కలిర్గ కట్టంజెయ్యాలె. అయిపాయె యింత కట్టంజేసినా కడుపుకన్న యింతనిండ దొర్కాల్నా. కాట్లానికి బయపడ్తాఞ్జ! చేసిన రెక్కలు శాగబార్తయి చెయ్యనియి బూజు బడ్తయోంటరు. సెముటడిసిన గంజే మంచిదిరా. యింతజేసినా యేదే? సింపుల బట్టలు మాడుచెక్కలేగ తాయెమనకు. అయ్యా! నాకు సదువు జెప్పియ్యే! నేను సదువు నేర్చుకొని సంపాయించుకుంటా మిమ్ములను గూసుండబెట్టి నడుపుత. యేంరో! యియ్యాల్లేమో యిసిత్రం జెప్పవడ్తివో! యిగ సదువు నేర్చి సంపాయిత్తవు. నడుమంత్రపేశాలు బాగనే వున్నయి. బామనీల్లండ్ల గలిసినావురా యీ బారమంత పొద్దుగూకి సెప్తువుగని సరుగ్గు నింత దాగి మందకాడికుర్కు. పొద్దువాయె పటేలు గిట్ట జూసెనా యీపుల పాపాయిలేప్తడు." (లోకమలహరి. జెగ్గని యిద్దె. పుట: 22, 23) జెగ్గడు చదువుకోవటం ద్వారా తన జాతిని, గ్రామాన్ని చైతన్యవంతం చేస్తాడు.

### 4.5. స్త్రీ జీవిత చిత్రణ

"ఓ యువకుడు ఆమె జాకెట్లో నోటు పెట్టాడు. మరొకడు రూపాయి నోటును ఆమె జాకెట్‌కి పిన్నీసుతో పెట్టారు. అందుకు ఆమె ఏమీ అభ్యంతరం పెట్టడం లేదు. ఆ దృశ్యం చూస్తుంటేనే జుగుప్స కల్గింది విద్యకి. వెళ్ళి వాళ్ళని తన్నాలనిపించింది.

దప్పుల మోత, ఈలలు, కేకలు, అరుపుల మధ్య ఆ దృశ్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. అంతలో ఓ యువకుడు తన మోచేతి మధ్యలో నాణెం పెట్టుకొని 'ఒసేయ్ ఇదితియ్' ఆదేశించాడు. ఒంటినిండా జనం పెట్టిన నోట్లతో అలా డాన్స్ చేస్తూనే అతని దగ్గరకు వెళ్ళిందామె. 'తియ్...తియ్... తీయడం కోసం నెమ్మదిగా ముందుకు వంగింది. వంగిన ఆమె వక్ష స్థలాన్ని తాకుతున్నాయి అతని వేళ్ళు." (శాంతి ప్రబోధ, వి. జోగిని. పుట: 27)

ఈ సన్నివేషం స్త్రీని ఎలా చూస్తున్నారనే విషయం మనకు అర్థమవుతుంది. ఇలా జరుగుతుంటే ప్రజలు చోద్యం చూస్తూ ఉండిపోయారే తప్ప స్త్రీపట్ల జాలి, దయ చూపలేక పోయారు. ఆనందంతో కేకలు వేస్తున్నారు తప్ప, సహకరించ లేకపోతున్నారు. తమ పట్ల అంత అసహ్యంగా, నీచంగా, అవమానకరంగా, అనాగరికంగా ప్రవర్తిస్తుంటే నీచంగా బూతు మాటలతో కలిపి సంబోధిస్తుంటే, ఆమె కూడా వారించకుండా వాటిని భరిస్తూ అది మా వృత్తి ధర్మం అని సర్దిచెప్పుకుందే కాని వారిలో ఎలాంటి ప్రతిచర్య లేదు. అంటే సమాజమే వారిని విధి నిర్వహణలో భాగంగానే మేము చేస్తున్నాం అనుకునే విధంగా వారిని తయారుచేసింది. స్త్రీని హింసించే ఇటువంటి సంప్రదాయాలను రూపుమాపాల్సిన బాధ్యత సమాజంపైనే ఉందని ఈ సన్నివేశం ద్వారా రచయిత్రి ఆకాంక్షించింది.

మరో నవల 'నవభారతి' ఎంతో పేదరికంలో ఉండి గత్యంతరం లేక భారతి కుటుంబం దేవాలయంలో తలదాచుకోవడానికి వెళ్ళినప్పుడు అక్కడ పూజారి ప్రవర్తించిన తీరు స్త్రీపట్ల మనకు ఔదార్యాన్ని కల్గిస్తుంది. అక్కడ తినడానికి ప్రసాదం కూడా దొరుకుతుందని కొంత ఆశ. దేవుడికి నైవేద్యం పెట్టగా మిగిలిన ఆహార పదార్థాలను తినవచ్చని అనుకుంటారు. కాని పూజారి మాత్రం నేను మిగిలిన ప్రసాదాలను ఇస్తాను. కాని మీరు నా శృంగారవాంఛ తీర్చాలని భారతి, ఆమె చెల్లె కవితలను కోరతాడు. ఇటు పూజారితో బాధలు ఈ రకంగా ఉంటే, అటు దేవాలయానికి వచ్చి వెళ్ళే మనుషులతో ఇంకోరకమైన భయం. యుక్తవయస్సుకు వచ్చిన ఆడపిల్లలు కనిపించగానే పురుషులు అదోరకంగా చూసే సమాజం మనది. "అక్కయ్యా! ఈ వారం రోజుల్లో మందిరంలోకి వచ్చే యువకుల సంఖ్య మరీ పెరిగిపోతోంది. అంది కవిత అప్పుడే వస్తున్న ఓ విద్యార్థుల గుంపును చూస్తూ. పరీక్ష రోజులేమో మొక్కుకునేందుకు వస్తున్నారు అన్నాను. కాని వాళ్ళు ఎందుకొస్తున్నారో నాకు అర్థంగాక పోలేదు. మందిరంలోకి వస్తున్న ప్రతి యువకుని మలినమైన చూపుల్లో పడి నా శరీరం విపరీతంగా నలిగిపోతోంది. వివిధ కోణాల్లోంచీ చూసే వారి అసభ్యమైన చూపులకు ఓర్చుకోలేక పోతోంది నా శరీరం.

అయినా చేయగలిగింది మాత్రం ఏముంది–ఓర్చుకోవడం తప్ప?" (హేమాదేవి, బొమ్మ. నవభారతి. పుట: 22, 23) . సమాజంలో స్త్రీ, అందునా పేదింటి స్త్రీ కనిపిస్తే పురుషులు కామోద్రేకులు అవుతారు. స్త్రీ అంటే అవసరాన్ని తీర్చే వస్తువుగా మాత్రమే పురుష సమాజం చూస్తూ ఉంటుంది.

'నవభారతి' నవలలో భారతీ పాత్రతో సహా ప్రధాన పాత్రల ద్వారా స్త్రీ జీవితంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలియజేస్తుంది రచయిత్రి బొమ్మ హేమాదేవి. భారతి, కవిత, చిట్టి, బిజ్జూ, వాళ్ళ అమ్మ, అన్నయ్య భారతీ కుటుంబ సభ్యులు. వీరిది నిరుపేద కుటుంబం. వీరి నాన్న స్వాతంత్ర్య సమర యోధుడు. కాని పేదరికం వెంటాడుతూనే ఉంది. కవిత బట్టలు కుట్టి, భారతి ట్యూషన్లు చెప్పి, అన్నయ్య ఉద్యోగం చేస్తాడు. కాని ఆ ఉద్యోగం కొన్నాళ్ళపాటు చేయగానే తీసేస్తారు. ఎన్నో ఇబ్బందులు పడుతూ కాలం గడుపుతారు. స్త్రీ అందంగా ఉండటం శాపంగా మారుతుందీ ఈ పురుష సమాజంలో. ఈ నవలలోని భారతి పరిస్థితి ఆ విధంగానే తయారైంది. రోడ్డుమీదకు వెళ్ళాలంటే భయం భయంగా వెళ్ళాల్సి వస్తుంది. ఏదైనా జాబ్ చేద్దామంటే యుక్తవయస్సులోని ఆడ పిల్లలను పురుషుల చూపులు కాకుళ్ళాగా పొడుచుకు తింటాయి. అద్దెకుంటున్న ఇంట్లో నలభైయేళ్ల, నలుగురు పిల్లల, భార్య చనిపోయిన పురుషుడు సైతం యుక్త వయస్సులోని అమ్మాయిని సైతం ఏడిపించడం, కావలనుకోవటం, పెళ్ళి చేసుకొమ్మని వేధించడం వంటివి చాలా ఉన్నాయి. అదే విధంగా అద్దెలు కట్టలేక దేవాలయంలో తలదాచుకున్నప్పుడు పూజారి సైతం కవితను, భారతిని లైంగికంగా వేధించడం, ఆ దేవాలయానికి వచ్చే భక్తులు సైతం వీరి మీద కన్నేయడం మొదలైనవి ఈ భారతీ, కవితలకు ఎదురైన అవమానాలు. చివరకు ఉద్యోగం చేద్దామని హైదరాబాదు వస్తే అక్కడ తెలిసిన వాళ్ళ ఇంట్లో బినాయ్‌బాబు కళ్ళు సైతం భారతీపై పడింది. మూలంగా, ఉద్యోగం చేసినా అక్కడ కూడా పురుషుల కళ్ళు నన్ను కొరుక్కుతింటాయి. కనుక 'భారతీ నిలయం' అనే పేరుతో భారతి సౌందర్య ప్రదర్శన చేయాలనుకుంది. విషయాన్ని అర్థం చేసుకున్న బినాయ్‌బాబు భార్య

చంద్రభామ భారతికి సహకరిస్తుంది. కాని చివరికి ఇలా డబ్బు సంపాదించడం అన్యాయం అనిపిస్తోందని చంద్రభామ అన్నప్పుడు “బాగుంది వదినా! ఇందులో మోసం, అన్యాయం ఏముంది? సౌందర్యానికి, మగవాళ్ళ మూర్ఖత్వానికి ఓ విధంగా విలువ కడుతున్నాం. అంతే! పోతే, ఈ సౌందర్యం నన్ను నానా రకాలుగా బాధపెట్టింది. దాన్ని కూడా నేను బాధపెట్టందే విడువను. ఈ మగవాళ్ళు కూడా నన్ను ఎన్నో విధాలుగా అల్లరిపెట్టారు. అంత అల్లరీ వాళ్ళను పెట్టాల్సిన బాధ్యత కూడా నాకుంది.” (హేమాదేవి, బొమ్మ. నవభారతి. పుట: 96).

చివరకు భారతీ నిలయాన్ని స్థాపించి ప్రారంభించారు. “భారతీ సౌందర్య ప్రదర్శన ఆట. అసమాన సౌందర్యవతైన ఓ స్త్రీ తన కాళ్ళూ, చేతులూ, ముఖం చివరకు తలవెంట్రుకల్ని కూడా ప్రదర్శిస్తుందట. ప్రతిదానికీ వేరు వేరు టిక్కెట్లు. అంటే–కాళ్ళు చూసేవాడు ఓ టిక్కెట్టు, చేతులు చూసేవాడు మరో టిక్కెట్టు తీసుకోవాలన్నమాట! ఆమె సౌందర్యాన్ని గురించి మరీ విపరీతంగా వ్రాశారు. ముఖ ప్రదర్శనకోసం రాత్రిపూట టైమ్ నిశ్చయించారు. అప్పుడు మాత్రమే ఆమె అందాన్ని చూడగలుగుతారు. అదైనా వాళ్ళు కొన్ని గజాల దూరం నుండే చూడాలని నిర్ణయించారు. అంత దూరంలో నుండే సన్నని తెరల చాటునుండి మాత్రమే చూసి వెళ్ళాలట. రేట్సు చూడు ఎంత తమాషాగా ఉన్నాయో! విను. పాద ప్రదర్శన అయిదు రూపాయలు–సమయం అయిదు నిమిషాలు; హస్త ప్రదర్శన పది రూపాయలు–సమయం అయిదు నిమిషాలు; శిరోజాలు కూడా అంతే! ముఖ ప్రదర్శన ఇరవై రూపాయలు–సమయం అయిదు నిమిషాలు; నవ్వుకు నలభై రూపాయలు, సమయం అయిదు సెకనులు; పూర్తి స్వరూపంతో నాట్య ప్రదర్శన–సమయం పది నిమిషాలు, వంద రూపాయలు–విన్నావా, భారతీ–ఇదేం వింతో! ఎన్నడూ కనీ వినని వింత. ఎటువైపో చూస్తూ అన్నాడు.” (హేమాదేవి, బొమ్మ. నవభారతి. పుట: 99, 100). ఇష్టంలేని పనినైనా తప్పని పరిస్థితుల్లో భారతి మొదలు పెట్టింది. అది దినదినాభివృద్ధి చెందుతూ ఎక్కువ డబ్బుల వర్షం కురిపించసాగింది. ఆమె డబ్బు మోజులో పడి అంతా తానే ఉంచుకోకుండా, వాటితో సమాజ సేవ చేయసాగింది. స్వచ్ఛంద సంస్థ స్థాపించి పేదలకు

పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేస్తూ అందరికి సహకరిస్తుంది. వందల మందికి ఉపాధిని కూడా కల్పిస్తుంది. దీన్నిబట్టి స్త్రీ జీవితం ఎంత ఘోరమైన పరిస్థితులను ఎదుర్కొంటుందో మనం తెలుసుకోవచ్చు.

'పిచ్చిమనిషి' నవలలో స్త్రీ జీవితం, వారి సమస్యలు కన్పిస్తాయి. ఈ నవలను బొమ్మ హేమాదేవి రాసారు. విజయ, ప్రభాత్. వీరిద్దరికి పెళ్ళవుతుంది. హైదరాబాదు వస్తారు. విజయకు నవలలు చదివే అలవాటుంటుంది. ఒకరోజు ఊరినుంచి తెచ్చిన సమానంతా సర్దుతుంటే నవలలో ఒక ఉత్తరం దొరుకుతుంది. అందులో విజయ వాళ్ళ అమ్మవాళ్ల ఇంటిపక్కన ఉండే అంకుల్‌కు ఇలా ఉత్తరం రాస్తుంది. 'అంకుల్ దయచేసి ఎప్పటిలా నాకు పుస్తకాలు పంపిస్తో ఉండండి. నాకు ఓ పది రూపాయలు కూడా కావాలి. నన్ను మీకూతురుగా భావిస్తారని ఆశిస్తాను. మిగతావన్నీ మర్చిపోండి.' అని ఉంటుంది. అది చూసిన ప్రభాత్ అనుమానించి, అతనికి నీకు ఏమి సంబంధం అని అడుగుతాడు. నిజంగా సంబంధమే ఉండేది. కాని అది ఏమీ తెలియని వయసులో ఆ అంకుల్‌కు కిరాణ దుకాణంలో విజయకు కావాల్సినవి ఇచ్చి, ఆమెను అతను లొంగదీసుకునేవాడు. విజయ ప్రభాత్‌తో చిన్నతనంలో అలా జరిగిపోయింది. నాకు తెలిసినప్పటినుండి అతనికి దూరంగానే ఉంటూ వచ్చాను అని చెప్పితే, ప్రభాత్ నమ్మడు. మరీ ఇన్ని రోజులు నాకు ఎందుకు చెప్పలేదని విజయను ప్రభాత్ అడిగితే, 'నా చిన్నతనంలో ఎవరో పాపాత్ములు చేసినపనికి సంజాయిషీ నేనే ఇచ్చుకోవాల్సి వుంటుందని తెలిస్తే ముందే ఆ విషయాన్ని చెప్పేదాన్నేమో' అని అంటుంది. మీ పుట్టింటికి వెళ్ళిపొమ్మని ప్రభాత్ విజయను వేదిస్తుంటాడు.

అంతలోనే ప్రభాత్ చెల్లెలు ప్రభ వీరింటికి వస్తుంది. ఎందుకు వచ్చావు ఏమైందని ఆరా తీయగా, విజయ ప్రభాత్ మధ్య జరిగిందే, ప్రభ అతని భర్త మధ్యన ఘర్షణ జరిగింది.  ఆమె భర్త

వెళ్ళగొట్టాడని ప్రభ వచ్చింది. చిన్నప్పుడు ప్రభ అతని ప్రేమికునికి రాసిన ప్రేమలేఖల గురించి ఆమె భర్తకు చెప్పడంతో అతనికి అనుమానం కలిగి వెళ్లగొడతాడు.

పురుషునికి(ప్రభాత్) తన ఇంటి ఆడపడుచు అయితే ఒకరకంగా ఆలోచిస్తాడు. ఎందుకంటే అతని చెల్లెలు ప్రభను ఆమె భర్త అనుమానంతో వెళ్ళగొడితే ఇతని దగ్గరికి వస్తుంది. అప్పుడు ప్రభాత్ మాత్రం 'వాడసలు మనిషా! పశువా' అని అరుస్తాడు భావను దూషిస్తూ... అదే తన భార్య విషయంలో తన చిన్నప్పుడు అమ్మవాళ్ళ ఇంటిదగ్గరి కిరాణషాపు అంకుల్‌తో సంబంధం ఉన్నట్లు పుస్తకంలోని లెటర్ ద్వారా తెలుసుకొని విజయను ఇంటినుండి వెళ్ళగొడతాడు. ఇక్కడ మనం గమనించే విషయం ఏమంటే ఎటుపోయి స్త్రీ జీవితమే అగమ్య గోచరంగా తయారవుతుంది. పురుషులు మాత్రం ఏ ఇబ్బంది లేకుండా ఉంటారు.

పెళ్ళి కాకముందు స్త్రీలకైనా, పురుషులకైనా లైంగిక సంబంధాలు ఉండవచ్చు. కాని పెళ్ళి తర్వాత నిజాయితీ చెప్పి, అనుమానాలు లేకుండా ఉండాలని, జీవిత భాగస్వామితో చెప్పినప్పుడు వారి నిజాయితీ గౌరవించి, వారు ఏ సందర్భంలో అలా చేయాల్సి వచ్చిందో అర్థం చేసుకోవాలి. అలా ఉన్నప్పుడే సంసారం బాగుపడుతుంది.

బొమ్మ హేమాదేవి రాసిన 'తరంగాలు' నవలలో నవలత, రుమా ఇద్దరూ అక్క చెల్లెల్లు. రుమా పెద్దది, ఆమె చెల్లెలు నవలత. ఇద్దరికి ఒకేసారి పెళ్ళిళ్ళు అవుతాయి. ఇద్దరికి మంచి సంబంధాలే దొరుకుతాయి. కాని తర్వాత ఒక్కొక్కరి జీవితం ఒకరకంగా తయారవుతుంది. నవలతను చెంచల్‌బాబు అనే అతను పెళ్ళి చేసుకుంటాడు. రుమా వివాహం నిర్మల్‌బాబుతో జరుగుతుంది. నవలత అత్తారింటివాళ్ళు అబ్బాయే పుట్టాలని అని అంటుండేవారు. వారు ఎంత కోరుకున్నారో దానికి విరుద్ధంగా అమ్మాయే పుడుతుంది. అప్పటినుండి నవలత అమ్మవాళ్ళ ఇంటిలోనే ఉండిపోతుంది. అప్పుడు రుమా విషయం తెలుసుకొని నిర్మల్ బాబును చంచల్‌బాబు

దగ్గరికి పంపించి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చేస్తుంది. తద్వారా చంచల్‌బాబు అత్తారింటికి అంటే నవలత అమ్మవాళ్ళ ఇంటికి వస్తాడు. రుమా వాళ్ళు కూడా అక్కడికి వస్తారు. ఆ సమయంలో నవలత అన్ని విషయాలు రుమాతో పంచుకుంటుంది. మొదట్లో అన్ని పనులు చంచల్‌బాబే చేసేవారు. చాలా మంచిగా చూసుకునేవారని చెప్తూనే, ఇబ్బందులకు సంబంధించిన విషయాలను కూడా చెప్తుంది అక్క రుమాతో.

"ఓ రోజు ఏదో సందర్భంలో 'నీకు తెలీదక్కయ్యా! వారు ముందటిలా లేరు. చాలా మారిపోయారు. పాప కడుపులో ఉన్నప్పుడే నన్ను చాలా రకాలుగా హింసించారు. అభిమానం వల్ల నేను ఎవరితో చెప్పుకోలేదు. కొన్ని విషయాలు చెప్పుకునేందుకు కూడా సిగ్గుగా ఉంటాయ్. అక్కయ్యా! మగవాళ్ళకు కావలసింది 'క్షణిక సౌఖ్యం' వారికి ఎదుటి మనిషి కష్టసుఖాలతో నిమిత్తం లేదేమో అనిపిస్తుంది. కడుపులోకి అహారం లేక నేను నీరసపడిపోయి ఉంటే, నన్ను రకరకాలుగా సింగారించుకోమని, సినిమాకు రమ్మని ఇంకా పిచ్చిపిచ్చిగా విసిగించేవారు. వారి కోరికలేవి నేను తీర్చలేకపోవడం వల్ల నన్ను చూచి విసుక్కోవడం మొదలుపెట్టారు. అక్కయ్యా! ఆడదానికి అందంగా, ఆరోగ్యంగా ఉన్నంతవరకే, మగవాళ్ళు విలువ ఇస్తూ ఉంటారేమో! పెళ్ళి చేసుకుని సుఖపడ్డవారు ఎవరున్నారని నన్ను సుఖంకొరకు చేయి చాపమంటావ్? అంది." (హేమాదేవి, బొమ్మ. తరంగాలు. పుట: 77, 78). అంటే మగవాళ్ళ కోరికలు తీర్చడానికే ఆడవాళ్ళు అవసరం అవుతుంటారు. అందంగా, ఆరోగ్యంగా ఉన్నంతవరకే ఆడావారికి గౌరవమా? అన్న విషయాన్ని నవలా రచయిత హేమాదేవి, బొమ్మ నవలత పాత్ర ద్వారా స్త్రీ జీవితాన్ని చాలా చక్కగా వివరించారు.

ఆడకూతురును వద్దనుకుంటారే తప్ప పుట్టిన తర్వాత పెరిగి పెద్దదైన పిమ్మట పెళ్ళి చేయాల్సి వస్తుంది. అప్పుడు కూతుళ్ళు అత్తారింటికి వెళ్ళాల్సి వస్తుంది. ఆ క్రమంలో అమ్మవారి ఇంటివాళ్ళు, తోబుట్టువులు, కొత్త పెళ్ళికూతురు ఎలా బాధపడుతుందో కింది సంభాషణ ద్వారా

చూడవచ్చు. ఆ సన్నివేశాల్ని హేమాదేవి 'తరంగాలు' నవలలో పొందుపర్చారు. అప్పగింతలు, సాగనంపడం మొదలైన తతంగాలలో అనురాగాలను, అనుబంధాలను విడిచివెళ్తున్నట్టుగా కూతుళ్ళు బాధపడుతుంటారు. ఈరోజు నుంచి మా కూతురు కాదు అని తల్లిగారింటివారు బాధపడతారు.

**కట్నకానుకలు-సంప్రదాయాలు**

"తరంగాలు" నవలలో పెళ్ళి తర్వాత అల్లుడు–కూతుళ్ళకు ఇచ్చే కట్నకానుకల గురించి హేమాదేవి, బొమ్మ చాలా చక్కగా విశ్లేషించారు. నిర్మల్, చంచల్ బాబుల పాత్రల ద్వారా మనం గమనించవచ్చు. నవలత–చంచల్, రుమా–నిర్మల్ పెళ్ళిళ్ళు ఒకేసారి జరుగుతాయి. అయితే పెళ్ళి తర్వాతా హైదరాబాదుకు వెళ్ళి నివాసం ఉంటారు. పెళ్ళి అయిన రోజునుండి నెలరోజుల లోపు ఇంటికి రావాలి. అది వాళ్ళ సంప్రదాయం. నవలత, రుమా నాన్నగారు ఉత్తరం రాసి ఊరికి రమ్మని చెప్పారు. అప్పుడు రెండు జంటలు అక్కడికి వెళ్తారు. అల్లుళ్ళు, కూతుర్లు వచ్చినప్పుడు కట్నకానుకలు ఇచ్చి పంపాల్సి ఉంటుంది. ఆ సమయంలో వాళ్ళు కట్నకానుకలు సమర్పిస్తామంటే అల్లుళ్ళు అవి పెద్దగా అవసరం లేదులే అన్నట్టుగా మాట్లాడతారు. వారి సంభాషణ చూస్తే మనకు అర్థమవుతుంది. "ఏమో వదినా! నానకిలాంటివేవీ అంతగా తెలియవు. కట్నాలు తీసుకొని ఆనందపడలేను. తీసుకోకపోవడం వల్ల బాధపడలేను. మజ్జిగతో అన్నం కలుపుకుంటూ అన్నాడు చంచల్. చిన్న పిల్లలు వాళ్ళకేం తెలుస్తాయండీ... ఆచారం–సంప్రదాయం అవీను. ఉప్పు సీసాను తన దగ్గరకు జరుపుకుంటూ అంది అమ్మ. కాదత్తయ్యా! ఎన్ని కష్టాలు పడ్తూ, కట్నాలు ఇవ్వడం ఆచారమా? అవి తీసుకుంటూ బాధపడటం కూడా సాంప్రదాయమేనా? ఈ రకం పట్టుదలలు వదులుకోవాలి అత్తయ్యా! లేకపోతే ఈ నవనాగరిక యుగంలో అనాగరికులుగానే లెక్కింపబడ్తాము. భోజనం ముగిస్తూ అన్నారు వారు. నాగరికతా, విజ్ఞానంతోపాటు కట్నాల మొత్తాలు హెచ్చుతున్నాయి నిర్మల్! నీకు తెలియదేమో కాని... నాన్న అన్నారు"(హేమాదేవి, బొమ్మ తరంగాలు. పుట: 59, 60).

సమాజంలో నాగరికత మారుతున్నా కొద్దీ మార్పులు సంభవించడం సహజం. పై సంభాషణలో కాలం మారుతున్నా కొద్దీ మనం మారాలి. ఈ కట్న కానుకలెందుకు, కష్టలు పడుతూ ఇవ్వడం, తీసుకునేవారిని సంతోషపెట్టే వంటివన్ని అనాగరికుల లాగానే లెక్కింపబడతాం అంటాడు నిర్మల్. అంటే చదువుకున్న వాళ్ళలో మార్పు ఉండాలి అనే విషయాన్ని మనకు రచయిత బొమ్మ హేమాదేవి తెలియజేస్తున్నారు. కాని నేటికి చదువుకున్న వాళ్ళు కూడా కట్నకానుకల కోసం ఎదురుచూసే వాళ్ళున్నారు. స్త్రీలను హింసించేవారు ఉన్నారు. ఈ నవల 1961లో వచ్చింది. అప్పటికే ఇలాంటివారు ఉన్నారు అంటే ఆశ్చర్యమే. కాని ఉండవచ్చు. అటువంటి ఉన్నత పాత్రల ద్వారా కట్నాల వ్యతిరేకించి. కట్నాలు ఇచ్చేవారి బాధలను అర్థం చేసుకునేటట్టుగా చిత్రించడం ఆహ్వానించదగ్గ విషయమే.

సమాజంలో ప్రేమ పెళ్ళిళ్ళు జరగడగడం పెద్ద సవాలే. పెద్దలు ఒప్పుకోకపోవడం ఒక ఎత్తైతే, ఒప్పుకున్నా అనివార్య కారణాల వలన పెళ్ళి సమయానికి ప్రేమించిన వ్యక్తి రాకపోతే పరువుపోతుందని పెద్దలు నిశ్చయించిన వరునితో పెళ్ళి చేసుకోక తప్పదు. ఆ సమయంలో పెద్దలు వరుడు ఎటువంటివాడో అని చూడరు. పెళ్ళి అయ్యిందా లేదా? అని చూస్తారు. కాని కూతురు జీవితం ఎలా ఉంటుందో కూడా కనీసం ఊహించరు. అటువంటి పరిణామాన్ని హేమాదేవి 'ఆరాధకులు' నవలలో చిత్రించారు. ఇందులో ధనలక్ష్మి, భూషన్‌బాబు ప్రేమించుకుంటారు. కాని పెళ్ళి సమయానికి భూషన్ బాబు పెళ్ళి పందిట్లోకి రాలేకపోతారు. కారణం పెళ్ళి కూతురుకు స్వయంగా నగలు, వస్త్రాలు తీసుకురావడం కోసం బొంబాయి వెళ్ళి వస్తుండగా యాక్సిడెంట్ జరగడం, గాయాలవడం వంటి కారణాల వల్ల వీరిద్దరి ప్రేమికుల పెళ్ళి జరగదు. యాక్సిడెంట్ జరగడం చూసిన ధనలక్ష్మి మేనబావ అయిన కేశవ్ ఇదే అవకాశంగా చేసుకొని, పెళ్ళికొడుకు ఇకరాడు. అతనెందుకు వస్తాడు. అతనిది ధనవంతుని కుటుంబం కనుక అతను మన పెళ్ళి ధనలక్ష్మి చేసుకోడు అని లేనిపోని మాటలు కల్పించి చెప్తాడు. ఆ సమయంలో ఏం చేయాలో తోచని ధనలక్ష్మి తల్లిదండ్రులు కేశవ్‌కు ధనలక్ష్మి ఇచ్చి పెళ్ళి చేయాలనుకుంటారు.

అవారాగా తిరిగే అతని మేనబావ కేశవ్‌తో పెళ్ళి జరుగుతుంది. పెళ్ళి తర్వాత కేశవ్ ధనలక్ష్మీని నానా ఇబ్బందులు పెడుతూ హింసించేవాడు. విషయం తెలుసుకున్న బూషన్‌బాబు కేశవ్ దగ్గరికి వెళ్ళి ధనలక్ష్మీని విడిచిపెట్టు అని ప్రాధేయపడినా, జాలిచూపడు. పైగా కేశవ్ డబ్బులు డిమాండ్ చేస్తాడు. అప్పటినుండి అడిగిన ప్రతిసారీ డబ్బులు ఇస్తూ వచ్చాడు బూషన్‌బాబు.

"ఈ లోపలే మా అత్తా, మామా కూడా కళ్ళు మూశారు. సరే బాగానే జరిగింది. కాని పిల్ల దాంతోనే ప్రతీసారి పేచీ వచ్చేది. రమ్మంటే రాదు. అది దెబ్బలు తిని, నేను కొట్టి యిద్దరం అలసిపోయేవాళ్ళం. రాత్రి కాస్తా గడచిపోయేది. చివరకు కొంత దారికి వచ్చిందనుకో. ఓసారి ఈ కొట్టడం దాని ప్రియుడి కళ్ళలో పడింది. దీన్ని కొడితే వాడు బాధపడతాడు. అది అరుస్తే, వాడి కళ్ళల్లో నీళ్ళు. చివరకు ఓసారి 'ఏడవకురా నాయనా! ఏమైనా ముట్టజెప్పు అన్నాను. ఫరవాలేదు. భరించుకోగలుగుతాం అన్నాడు చేతకాని వాడు. దానికి వేవిళ్ళు ప్రారంభం అయ్యాయి. ఒకటి రెండు నెలలు గడిచిపోయాయి. ఇప్పుడు కొంచెం ఫరవాలేదనుకున్నాను. కాని, దీంతో నాకేం లాభం? దమ్మిడి లాభం లేదు. ఏం చేయాలి అని ఆలోచిస్తున్నాను. ఓ రోజు బజార్లో దాని ప్రియుడు కనిపిస్తే దాని వేవిళ్ళ వైనం చెప్పాను. వెంటనే వాడు మా ఇంటివైపు పరుగెత్తాడు. దాని ఆరోగ్యం సంగతి కనుక్కున్నాడట. వాడేరకం మగ మనిషి కాని... వాణ్ణి చూడగానే అది పిచ్చిదానిలా అయిపోయేది. ఆరోజు అదే జరిగింది. నేను చేయి చేసుకోలేక తప్పలేదు"(హేమాదేవి, బొమ్మ. ఆరాధకులు. పుట: 135). పై సంభాషణ ద్వారా స్త్రీ తన ప్రేమించిన వ్యక్తి కోల్పోయిన, తప్పని సరి పరిస్థితుల్లో పెళ్ళి చేసుకున్న భర్త హింసను భరిస్తున్న తీరును మనం గమనించవచ్చు.

'మహానంద' నవలలో స్త్రీ జీవిత పరిస్థితులను చూడవచ్చు. ఇందులోని పాత్రలు కృష్ణవేణి, కార్తీక ప్రధానంగా కనిపిస్తారు. అలాగే శారద, నందన్, సుభద్ర మొదలైనవారు ఉంటారు. వీరి ఇంటిలో మగవారి ఆధిపత్యమే నడుస్తుంటుంది. నాడు పురుషాధిక్య సమాజమే

రాజ్యమేలుతుంది. స్త్రీ పురుషులనుగాని, ఇంటిలోని పెద్ద స్త్రీలనుగాని ఏమి ఎదురు మాట్లాడకూడదు, ప్రశ్నించకూడదు. సంప్రదాయాలు, కట్టుబాట్ల నడుమ ఉండాలి. చదవడం అంటే ఇక కలే. కృష్ణవేణి ఆధునిక ఆలోచిన కలిగినది. కారణం ఆమె స్నేహితురాలు చదువుకున్న వ్యక్తి, సామాజిక ఉద్యమాల్లో పనిచేసే వ్యక్తి కాబట్టి, కృష్ణవేణికి చదువుకోవడానికి పుస్తకాలు పంపడం, స్త్రీ చైతన్యవంతంగా ఆలోచించేటటువంటి విషయాలను చెప్పడం కనిపిస్తాయి. "స్త్రీని, ప్రకృతి చిన్నచూపు చూచి పుట్టించడంలోనే మగ వారి కన్నా స్త్రీని శారీరకంగా బలహీనంగా సృష్టిస్తుంది. పైగా పిల్లల్ని కనేవన్ని స్త్రీకి అంటగట్టింది ప్రకృతి. ఈ విధానంలో శారీరకంగా స్త్రీ పురుషుడి కన్నా బలహీనురాలు అయిపోతుంది. మానసికంగా స్త్రీ యెంతో బలంగా వుండగలదు. కాని ఆ శక్తిని చిన్నతనం నుంచే మన సంఘ నియమాలు, ఆచారాలు, పరిసరాలు బలహీనపరుస్తుంటాయి." (హేమాదేవి, బొమ్మ. మహానంద. పుట: 15). కృష్ణ సందేహాలను శారద నివృత్తి చేస్తూ ఉంటుంది. శారద ఇచ్చిన పుస్తకాలను ఇంటిలో ఎవరికి కనపడకుండా ఉంచి, పగలంతా ఇంటి చాకిరి చేసి, రాత్రిళ్ళు దొంగతనంగా చదువుకునేది. మధ్యతరగతి, బీదవారి ఇళ్ళలో స్త్రీలకు తిండి కరువే. దాదాపు అప్పులతోనే ఇళ్ళు గడుపుతారు. అందులో ఉన్నదాంట్లో సర్దుకున్నా సరే మగవారికి మాత్రం సరైన వంటకాలు చేసిపెట్టి, మిగిలింది తినాలి లేదంటే ఒట్టి కారంతో తిని పూట గడపాలి.

సమాజంలో మగవారు వయసు ఎక్కువగా ఉన్నా, చాలా తక్కువ వయస్సు ఉన్న స్త్రీలను పెళ్ళి చేసుకుంటారు. ఆడవాళ్ళు ఎదురు తిరిగి పెళ్ళి ఇష్టంలేదని చెప్పకూడదు. అబ్బాయి అమ్మాయిని నచ్చాడంటే, అంతే అతన్నే పెళ్ళి చేసుకోవాల్సి వస్తుంది. అలాగే భార్య చనిపోయిన మగవారు రెండోపెళ్ళికి అసలే పెళ్ళికాని స్త్రీలను చేసుకుంటారు. అప్పుడు కూడా ఆడవాళ్ళు నోరు మెదపకూడదు. ఇంట్లోవాళ్ళు చెప్పింది చెప్పినట్టు వినాలి, లేదంటే సంప్రదాయాలను అదిగమించిన వారిగా ఎన్నో నిందలు మోపి అవమానపర్చి, హింసించిన పరిస్థితిని ఈ 'మహానంద' నవలలో రచయిత్రి చిత్రించారు.

స్త్రీలను వదిలేసిన పురుషులు రెండో పెళ్ళి సులభంగా చేసుకోగలరు. ఏ చిన్న కారణంగానైనా స్త్రీలకు విడాకులు ఇవ్వగలరు. అలాంటప్పుడు ఏ తప్పూ చేయని స్త్రీ జీవితం నాశనం అవుతుంది. మగవారి దగ్గర అణిగిమణిగి లేకపోతే ఎన్నో ఇబ్బందులకు ఎదుర్కోవాల్సి వస్తుంది. బొమ్మ హేమాదేవి రచించిన 'మహానంద' నవలలో "నా యిష్టాలకి, కోరికలకి, నా అలవాట్లకు నువ్వు ఏమాత్రం సహకరించక పోయినా, నీ దారి నీది. నా దారి నాది. నిన్ను వదిలేస్తే నాకు లోటేం వుండదు. మళ్ళీ పదిహేను ఇరవై వేలిచ్చి రత్నంలాంటి పిల్లనిస్తారు. నీ బ్రతుకే కుక్క చింపిన విస్తరిలా అయిపోయతుంది. అందుకే నీమీద దయతలచి జాలిపడి నీ మంచికోరి నీకు ఇన్ని మాటలు చెపుతున్నాను.

కృష్ణవేణి కళ్ళు బాగా తెరిచి పూర్తిగా మేలుకొని ఈ మాటలన్నీ విన్నది. భర్త చెప్పిన మాటల్లో అతిశయోక్తి ఏం లేదనిపించింది. అమాయకత్వం వల్ల తన దేహ సౌందర్యానికి లొంగిపోయి ఈ వివరాలన్నీ ఇంత స్పష్టంగా చెబుతున్నాడు పాపం అనుకొని రామచంద్రంవైపు గౌరవంగా ఆత్మీయంగా చూచింది. ఆ చూపులకు చలించిపోయినట్లున్నాడు మనిషి. భార్యను దగ్గరకు తీసుకొని భయపడకు నువ్వు మంచిగా ఉంటే నువ్వు బ్రతికినంతకాలం నీకు కూడు గుడ్డకు లోపం లేకుండా చూచుకోగలను ఇంకేం... చెప్పానుగా, రా దగ్గరకు అని ఇంకా దగ్గరకు తీసుకున్నాడు."(హేమాదేవి, బొమ్మ. మహానంద. పుట: 37, 38). అంటే మగవారు పెళ్ళి చేసుకోవచ్చు, భార్యను వద్దనుకుంటే వదిలిపెట్టవచ్చు. అత్తవారింట్లో ఎంత చాకిరీ చేసినా విలువ ఉండదు. అత్తగారి ఆజ్ఞలు, ఆడపడుచుల సూటిపోటి మాటలు, అందరూ కోడలి కోసం ఏదో త్యాగం చేసినట్టుగా చెప్తారు. జాలి చూపిస్తున్నట్టు చేస్తారు, హింస పెడుతుంటారు. కృష్ణవేణి ఈ పనులన్నీ నేనెందుకు చేయాలి, ఇన్ని ఇబ్బందులు ఎందుకు పడాలి, పిడికెడు మెతుకుల కోసమేనా, జానెడు కూడు గుడ్డకోసమేనా అని అనుకుంటుంది. ఇంట్లో వంటపనులు, గిన్నెలు తోమే పనులు అన్నీ కృష్ణవేణి చేస్తుంది. ఇంట్లో వారందరూ తినగా మిగిలిన పదార్థాలు ఏమైనా ఉంటే తనకు అత్తగారు పెడుతుంది. కనీసం నవ్వే స్వేచ్ఛకూడా లేదు కృష్ణవేణికి. "ఆడదానికి,

కుక్కకు చనువిస్తే నెత్తికెక్కి కూచుంటాయని మనవాళ్ళు వూరికెనే చెప్పిపోలేదు. జన్మనిచ్చిన తల్లీ కొడుకులకు ఎన్నిరకాల ఉపచర్యలు చేస్తుంది. భార్యవల్ల ఎంత సుఖం, ఎన్ని ఉపచర్యలు, ఉపకారలు చేస్తుంది. లాభాలు పొందుతుంటారు వీళ్ళు. అవన్నీ మరచిపోయే ఇంలాటి మనుషులు ఆడదాని సంగతి అటుంచి కుక్క పేరెత్తుకునేందుకైనా అర్హులేనా అని యోచిస్తుంది కృష్ణ."(హేమాదేవి, బొమ్మ. మహానంద. పుట: 42). స్త్రీ అమ్మగా, భార్యగా పురుషులకు ఎన్ని రకాల సేవలు చేస్తుందో ఊహిస్తేనే చాలా బాధగా అనిపిస్తుంది. కాని ఏం చేయలేని. నిస్సహాయురాలు.

కట్నంగా రేడియో తేలేదని భర్త ఇంట్లోనుండి వెళ్ళగొడతాడు. పుట్టింటివారు కూడా ఆ రేడియోను ఇవ్వలేమని చెప్పడంతో తనను ఆదరించే వారు లేక ఇంట్లోనుంచి వెళ్ళిపోయి పూణె చేరుతుంది. అక్కడ శివాని, ఆమె పిల్లలతో స్నేహం కుదిరి కొన్నాళ్ళపాటు అక్కడ పలు రకాల పళ్ళ వ్యాపారం చేస్తుంది. చివరకు కొందరి దుర్మార్గుల వల్ల వ్యభిచారం గృహంలో చిక్కుకుంటుంది. తర్వాత నందన్‌బాబు సహకారంతో బయటపడి భర్త దగ్గరకు మళ్ళీ వచ్చే ప్రయత్నం చేస్తుంది. కాని భర్త మాట్లాడే తీరు చూసి ఆశ్చర్యపోతారు. కట్నానికి ఆశపడి మరో పెళ్ళి చేసుకుంటాడు. నందన్‌బాబు, కృష్ణవేణిలను చూసి అనుమానిస్తాడు. నీచంగా మాట్లాడతాడు. ఇంట్లోనుండి బయటకు వెళ్ళు. లేకపోతే ఎలా? మిమ్మల్ని వెళ్లగొట్టాలో నాకు తెలుసు అని అనగానే కోపంతో ఊగిపోయిన కృష్ణవేణి తాలికట్టిన భర్తవి కాబట్టి ఊరుకున్నాను. లేదంటే నేను మీలాంటి పదిమంది మగాళ్ళను చిత్తుచిత్తుగా కొట్టగలను అని అంటుంది. ఆడవాళ్ళు తలుచుకుంటే దృఢంగా తయారై మగవాళ్ళను కూడా కొట్టగల శక్తి స్వరూపంగా మారగలదని రచయిత్రి 'మహానంద' నవలలో తెలియజేశారు.

రాణి బాల్య వితంతువు. పదహారేళ్లకు పెళ్ళై భర్త మరణించేనాటికి ఇద్దరు పిల్లలతో ఇరవై ఏళ్ళకే వితంతువు అవుతుంది. ఈమె రిజిస్టార్ ఆఫీసులో ఉద్యోగం చేస్తుంది. ఈమెకు

బంధువులు ఎవరూ లేరు. తర్వాత మధు పరిచయమవుతాడు. ఆ పరిచయం స్నేహంగా, ప్రేమగా మారి, ఒక్కటై ఆమె గర్భవతి కూడా అవుతుంది. మధుకు ఇంతకుముందే పెళ్ళై పిల్లలు కూడా ఉన్నారు. ఈ కారణంగా మధును నేరుగా వివాహం చేసుకొని ఇంటికి తీసుకెళ్ళలేదు. రాణి, మధులు సమాజానికి భయపడి బ్రతుకుతారు. మధు పెళ్ళి చేసుకుంటానంటాడు. కాని రాణి మధు వాళ్ళ భార్య అనుమతి కావాలంటుంది. కాకపోతే మధు రాణికి బొట్టు పెట్టి ఇకనుండి నీవు నా భార్యవు అని అంటాడు. మధు రాణి నా భార్యే అని జాగ్రత్తగా చూసుకుంటాడు. రాణి మాత్రం సమాజం వితంతువైన స్త్రీ వేరొక మగాడితో చాటుమాటు వ్యవహారం నడిపిస్తోందని అనుకుంటారని నిత్యం మధనపడుతూ ఉంటుంది. మధు పగటిపూట మాత్రమే రాణి దగ్గరకు వచ్చేవాడు. రాత్రి తన భార్య ఉన్న ఇంటికి వెళ్ళేవాడు. రాణికి మధు అంటే విపరీతమైన ప్రేమ. రాణి గర్భవతి కూడా అవుతుంది. ఆమె మానసికంగా సరిగా లేకపోవడం, శారీరకంగా కూడా బలహీనంగా ఉండటం. బి.పి. రావటం మూలంగా ఆమెకు అభార్షన్ అవుతుంది. తర్వాత ఇంకా మెంటల్‌గా బాగా డిస్టర్బ్ అయ్యి ఘోరంగా తయారవుతుంది. మెంటల్ ఆసుపత్రిలో చేరిపిస్తారు. కాని ఆ స్థితిలో ఆమె సమాజంపై, ముఖ్యంగా మగవారిపై గల తన అభిప్రాయాన్ని వెలిబుచ్చుతుంది.

"తల్లి ఏం మాట్లాడుతుంది? తెల్లబోయారు పిల్లలు. రాణి వాళ్ళను మరింత దగ్గరికి తీసుకుంటూ 'సురేశ్ నువ్వు యింటికి పెద్దాడివి. నేను వున్నంతవరకూ నా జీతం సరిపోతుందనుకో ఒకవేళ నేను చెల్లి డెలివరీ టైమ్‌లో చనిపోయినా మీరు ముగ్గురూ ఎవ్వరింటికీ వెళ్ళొద్దు. ఎవరి సహాయం కోరగూడదు. రోషంగా ఆత్మాభిమానంతో ఒకరికి చేయి చాచకుండా బ్రతకాలి. మరినేను చచ్చిపోతే ఆదాయం ఏమిటా అనుకుంటారా వెర్రినాగన్నలూ ఏనుగు చచ్చినా బ్రతికినా వెయ్యే. వెయ్యేరా నేను చస్తే నా యిన్సూరెన్సు ప్రావిడెంట్ ఫండ్, జి.పి.ఎఫ్ అన్నీ మీకే వస్తాయి. అదంతా మీరే ఖర్చు పెట్టుకుంటారా వద్దు బేంక్‌లో వేసి వడ్డీతో మీరు

చదువుకొని మీరు ఉద్యోగాలు చేసుకోండి. చెల్లికి ఆ డబ్బంతా తీసి కట్నం యిచ్చి ఘనంగా పెండ్లిచేయండి సరేనా?

ఊ అనరే వెధవల్లారా మీకిప్పటి నుండే మగ బుద్దులు వచ్చేసాయి స్వార్థం, అవకాశతత్వం మీ మగజాతికి అణువణువు అహం జీర్ణించుకు పోయాయి. మగాడు మగాడే కొడుకయినా మొగుడయినా ప్రియుడయిన తనకు సుఖం దొరుకుతుంది అనుకుంటేనే మస్కాకొట్టి చేరుతారుగాని కష్టం అనుకుంటే మాత్రం ముఖం చాటేస్తారు. మీరు చూసేదేవిట్రా నేనే యిస్తాను. యీ సమాజమంతా నామీద కత్తికట్టినా నా బిడ్డను యీ సంప్రదాయాలకు, శాస్త్రాలకు దూరంగా తీసుకెళ్ళి యీ మూఢాచారాలకు అతీతంగా మానవత్వం మమతలు నిండిన, నిండైన స్త్రీగా తయారుచేస్తాను."(రాజీవ. నడుస్తున్న కథ. పుట: 156). తనకు పుట్టే ఆడబిడ్డను ఎలా తయారు చేయాలనే ఆలోచన చేసిందంటే ఆమె పిచ్చిదెలా? అవుతుంది. ఆమె నిజాలే మాట్లాడుతుందని అనుకోవచ్చు.

"బాబు మీరు హాస్టలులోనే ఉండండి. మధు అంకుల్ ఎప్పుడైనా కనిపిస్తే విష్ చేయండి. వారి మంచి చెడులు కనుక్కోండి. మర్చిపోవద్దు కాని మీరు మాత్రం మధుతో వెళ్ళవద్దు. అతను ఏదిచ్చినా తీసుకోవద్దు. మనం ప్రేమను ఆశించాం అంతే పైసలు కాదు. పైసలు మనం మస్తు సంపాదించుకోవచ్చు. కాని ప్రేమనెక్కడ కొనుక్కుంటాం? చెప్పు."(రాజీవ. నడుస్తున్న కథ. పుట: 156). స్త్రీ తన మాంగళ్యం కోల్పోవడంతో వితంతువై తన సగభాగాన్ని కోల్పోయినట్లవుతుంది. తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తుంది. కనుక అటువంటి స్త్రీ కోరుకునేది ఎక్కువశాతం ప్రేమనే, ఆప్యాయతనే, తోడు మాత్రమే అనేది పై సంభాషణ ద్వారా అర్థమవుతుంది. ఇదే నిజం కూడా. ఆర్థికంగా కోలుకునే అవకాశం కూడా ఉంటుంది. కాని అది రెండవ ప్రాధాన్యంగా ఉంటుంది.

సమాజంలో 'నడుస్తున్న కథ'ను చూసి ఏంటో రాణి పరిపరి విధాలా ఆలోచిస్తుంది. 'తన పిల్లల్ని పురాణ పురుషులు, ప్రబంధ నాయకులు కావాలనుకోవడం లేదు. ప్రజల మనుషులు, ప్రజాసేవకులు కావాలనుకుంటుంది. ఈ కృత్రిమ సంప్రదాయాలు కుహనాసంస్కారాలు చేధించి ఎదిరించే విప్లవకారులు కావాలనుకుంటుంది'. అంటే ఈ సంప్రదాయాల నడుమ తన జీవితం అంతా నష్టపోయింది. కనుక అటువంటి సంప్రదాయాలను పాటించే పురాణాల్లోని పురుషులు, ప్రబంధంలోని శృంగార నాయకులు కాకుండా తన పిల్లలు మార్పును కోరే విప్లవకారులు కావాలనుకోనుకోవడం తప్పులేదు. నడుస్తున్న కథ నశించి, కొత్త సమాజం రావాలని రచయిత కోరుకుంటున్నాడని మనం అర్థం చేసుకోవచ్చు.

ఈ సమాజాన్ని స్త్రీ కోణంలో ప్రశ్నించడం కోసం కమల పాత్రను ప్రవేశపెట్టింది రచయిత్రి. రాణి ఆసుపత్రిలో ఉండగా, విషయం ఆలస్యంగా తెలియడంతో ఆసుపత్రికి వస్తాడు. అక్కడ ఉన్న కమల ఇలా ప్రశ్నిస్తుంది. "మీరా రాణి యింకా చావలేదా అని చూడ్డానికి వచ్చారా! అంది. కమలకు దుఃఖం ఆగడంలేదు. తరతరాల నుండి స్త్రీ జీవితాలింతేనా!. తప్పు చేసేది ఇద్దరైనా శిక్ష మాత్రం స్త్రీకి ఒక్కదానికేనా! అరవై ఏళ్ళొచ్చి మనవల పెండ్లిడ్లయినా తాతయ్య పెళ్ళాం పోయిన ఏడాదికే మనవరాలు వయస్సు కన్నె పిల్లను చేసుకున్నా తప్పు అనదు సమాజం. అదే ముక్కుపచ్చలారని ఆడది భర్తపోతే చాటు వ్యవహారం సానుభూతి చూపిస్తూ నడిపిస్తాడు ఏ మగాడైనా కాని పెండ్లి చేసుకొని ఆమెకు సమాజంలో స్థానం చూపించడు."(రాజీవ. నడుస్తున్న కథ. పుట: 151). అప్పుడు మధు సమాధనం చెపూ్త పెళ్ళి చేసుకుంటానని అంటాడు. కాని రాణి ఒప్పుకోలేదు. కాని నాభార్య అనుమతి కావాలంటోంది. రాణి ఎప్పుడయితే బొట్టు పెట్టించుకుంటుందో అప్పటినుండి నా భార్య అయినట్టే అంటాడు. అదేవిధంగా పదిమందిలో పుస్తె కట్టిన ప్రతీ మగాడు భార్యపట్ల తన బాధ్యత అంత చక్కగా నిర్వర్తిస్తున్నాడా మూడో రోజునే పెళ్ళాన్ని తన్ని, ఏ అనామకురాలినో తెచ్చి యింట్లో పెడుతూంటే ఏం చేస్తున్నారీ స్త్రీ జనమంతా మీతో వాదించాల్సిన అవసరం కాని సంజాయిషీ యిచ్చుకునే అవసరం గానీ నాకు లేదని

అంటాడు. ఇందులో మధు అన్నది కూడా వాస్తవంగానే అనిపిస్తుంది. రచయిత్రి మరో బసవేశ్వర్ అనే పాత్ర ద్వారా ఈ నవల ముగింపును పలికించింది.

"యీనాటి విద్యావంతురాలైన స్త్రీ అటు పాతరోత సంప్రదాయాలతో పెరగటం వల్ల అటు వదులుకోలేక యిటు విద్య ఉద్యోగంలో వచ్చిన అధునాతన భావాలను అమలులో పెట్టలేక పూర్వపు పద్ధతులను ఎదిరించలేని భయం, పిరికితనంతో ప్రస్తుతపు కోర్కెలను జయించలేని బలహీనతల మధ్య నలిగిపోతుంది. స్త్రీలలో మానసిక చైతన్యం, ధైర్యం లేనంతవరకూ యీ కథ యింతే యిలాగే నడుస్తుంది." (రాజీవ. నడుస్తున్న కథ. పుట: 159).

మొత్తానికి సమాజంలో సందర్భానుసారంగా, కాలానుగుణంగా మార్పు అనేది రావాల్సిన అవసరం ఉంది. అన్ని సందర్భాలలో సంప్రదాయాలను పాటంచడం అవసరంలేదు. ప్రతిదానిలో తప్పు వెతికి, సాటి మనుషులను హింసించాల్సిన అవసరం లేదు. అందుకే రాణి తన కొడుకులు పురాణపురుషులు, ప్రబంధ నాయకులు కావాలనుకోవడం లేదు. ప్రజా మార్పుకోసం విప్లవకారులు కావాలనుకుంటుంది.

భరత్ కుమార్ రాసిన 'వైతరణి ఒడ్డున వయ్యారి' నవలలో తల్లిలేని యువతి జీవితం ఏ విధంగా ఉంటుందో కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు. ఇందులోని ప్రధాన పాత్ర కల్పన. ఆమె తల్లి చనిపోతే, తండ్రి అన్నీతానై ఏ లోటు రానీయకుండా పెంచుతాడు. కాని యుక్త వయసులో తల్లి తోడనేది యువతులకు చాలా అవసరం. కాలేజీ చదివే యుక్తవయసులో అనేక కోరికలతో అధ్యాపకుడి దగ్గర చనువుగా ఉంటుంది. అయితే మంచి చెడులు చెప్పి మార్గదర్శకంగా ఉండాల్సిన అధ్యాపకుడు ఆమెను మంచిదారిలో పెట్టాల్సింది పోయి, అవకాశంగా తీసుకొని ఆమెను లొంగదీసుకుంటాడు. ఆమెను వాడుకొని వదిలేస్తాడు. పెళ్ళి చేసుకొని కలిసి బతుకుదామని చెప్పి ఆమెను పట్టణంలో వదిలేసి వెళ్తాడు. అప్పటినుండి ఆమెకు అనేక సమస్యలు

ఎదుర్కొంటుంది. శరీరాన్ని అమ్ముకొని బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎలాగు జీవితం నాశనం అయిందని ఆమె మత్తుపదార్థాలకు అలవాటు పడి, సుఖవ్యాధులకు లొనై తన జీవితాన్ని పాడుచేసుకొని చేతులార ప్రాణం మీదకు తెచ్చుకుంటుంది. కాని తన జీవితం ఇలా కావడానికి కారకుడైన అధ్యాపకుడు సూర్యనారాయణను మాత్రం చిత్ర హింసలు పెట్టి వదిలిపెడుతుంది. ఈ నవలలో తల్లిలేని స్త్రీ జీవితం, ప్రతీకారం తీర్చుకునే స్త్రీ జీవితంగా మనకు కన్పిస్తుంది.

### 4.6. పురుషాధిక్యత

బొమ్మ హేమాదేవిగారు రాసిన 'పొగమంచు' నవలలో అంబర్, అవని, రాగిని, పవన్ అనే పాత్రలు ఉంటాయి. అందులో అంబర్, అవనిలు భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. అంబర్ మంచి ఉద్యోగమే చేసేవాడు. అతను ఉద్యోగం చేస్తున్న క్రమంలో రాగిణి అనే అమ్మాయి అతని ఆఫీసులోనే ఉద్యోగంలో చేరుతుంది. ఆమె అంబర్‌ను ప్రేమిస్తుంది. అంబర్ నిరాకరించినప్పటికీ రాగిణి మాత్రం అతని వెంటపడుతుంది. చివరకు రాగిణికి అంబర్ లొంగిపోతాడు. "కోరికలు ఉన్నంత వరకే మనిషికి సుఖదుఃఖాలు, బాధలు వుంటాయి. అవే లేకపోతే ఏమీ ఉండవు. మనిషి బ్రతికినన్నాళ్ళు కోరికలు లేకుండా బ్రతకలేడు. ఈ మాట ఎంత నిజం!" (హేమాదేవి, బొమ్మ. పొగమంచు. పుట: 45). కోరికలు లేకుండా ఏ మనిషి ఉండలేడు అని గ్రహించవచ్చు. అంబర్ భార్య అవని జరిగిన విషయం తెలుసుకొని ఏమిటి? మీరు చేస్తున్న పని అని ప్రశ్నిస్తే నాకు నువ్వు కావాలి, రాగిణి కావాలని అంటాడు. చివరకు ఇంట్లోకి కూడా తీసుకొస్తాడు. రాగిణి అవని అక్కయ్య అంటూ బంధుత్వాలు కలుపుకుపోతుంది ఎన్ని ప్రయత్నాలు చేసినా అవని రాగిణిని దగ్గరకు కూడా రానియ్యదు, కోప్పడదు. ఎవరిని ఏమి అనాలో అర్థం కాక ఎన్నో ఇబ్బందులు పడుతుంది. అవని ఎంత ఓపికగా వ్యవహరిస్తుందో కింది సంభాషణను చూస్తే అర్థమవుతుంది. "ఏం నిర్ణయానికొచ్చావు అవనీ? అని, మిమ్మల్ని నేను ప్రేమించడం నిజమే. మీ సుఖం. మీ ఆనందం నా సుఖం నా ఆనందం అన్నాను." (హేమాదేవి, బొమ్మ. పొగమంచు. పుట: 45) అంటే తాను బాధ భరించుకుంటూనే భర్త సుఖాన్ని కాదనలేక,

అవుననలేక చాలా ఆందోళనకు గురవుతుంది. చివరకు చనిపోవాలా? అని అనుకుంటుంది. అంబర్ మాత్రం ఇద్దరూ కావాలి అంటాడు.

అంబర్, రాగిణి మధ్య సంబంధాన్ని అవని చూడలేకపోతుంది. ఆమె మాటల్లోనే మనం గమనించవచ్చు. “వాళ్ళిద్దరూ షాపింగ్‌కు వెళతారు. వెంట నేనూ వెళ్ళాలి. లేకపోతే రాగిణి బాధపడుతుందని వారు బాధపడతారు. నన్ను బలవంతపెడతారు. సినిమాకు వెళతారు, వెంట నేనూ వెళ్ళాలి. వారిద్దరి మధ్యన నేను కూర్చోవాలి, ఓ వైపు వారు, యింకోవైపు నుంచి రాగిణి ఒకరివైపు ఒకరు చూసుకుంటున్నప్పుడు వాళ్ళ హృదయాల్లో కదలిక ఏర్పడి ఒకరి నొకరు తాకాలని అనుకున్నప్పుడు నేను అటూ ఇటూ జరుగుతూ వాళ్లకా అవకాశాన్ని ఇస్తుండాలి. ఈరకం పనులన్నీ ఏ భార్యా చేసి వుండదు. ఈరోజు నేను చేస్తున్నాను. నా అభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని నన్ను నేను చంపుకొని, చివరకు ఓ రోజు అన్నాను. పోనీ మధ్యలో మీరు కూర్చోండి ఎవరిపై ఇష్టంగా అనిపిస్తే వారికి తాకొచ్చు. చూడొచ్చు అని”(హేమాదేవి, బొమ్మ పొగమంచు. పుట: 48). చివరకు అవని స్నేహితుడు కల్పించుకొని అంబర్ తప్పిదాన్ని గుర్తుచేసి అవని, అంబర్ చక్కగా కలిసుండేటట్టు చేస్తాడు. పవన్ అవనిని ఒప్పించి పథకం ప్రకారం అవని ఇంట్లో నుంచి బయటకు వచ్చేటట్టు చేస్తాడు. అప్పుడు అంబర్ పవన్‌ను, అవనిని అనుమానిస్తాడు. పవన్‌ను తిడతాడు. అతనివెంట అవనిని వెళ్ళొద్దంటాడు. ఇక్కడ మనం గమనించవచ్చు. అంబర్ మాత్రం రాగిని ఇంట్లోకి తెచ్చుకోవచ్చు. కాని అవని పవన్ తో వెళ్ళవద్దు అని అంటాడు. మొదట్లో అంబర్ చాలా మంచివాడే కావొచ్చు. కాని రాగినితో వ్యవహారం కుదిరిన తర్వాత ఇటు అవని కావాలి, అటు రాగిణి కావాలి అంటాడు. అవని వేరే వాళ్ళతో సంబంధం పెట్టుకోవద్దంటాడు. “ఇలాగే ఈ దేశం మగమనిషికి కొన్ని అలాంటివి ఉన్నాయి. ఇంకెందరి పెళ్ళాలన్నయినా తాను చూడొచ్చు, తాకొచ్చు. తన పెళ్ళాన్ని మాత్రం ఇంకొకడు తాకకూడదు. కన్నెత్తి చూడగూడదు. ఆ మాటకొస్తే తాను తాకడు, చూడడు అయితే దాని దారి వేరు, ఇహ ఆ తాను తాకని పెళ్ళాన్ని కూడా యింకొకడు తాకితే ఒప్పుకోడు, భరించలేడు. తన ప్రాణాలు పోయినా ఒప్పుకుంటాడు.

భరిస్తాడుగాని... ఈ యిద్దరు మనుషులకు రెండు రకాల బలహీనతలున్నాయని స్పష్టం అయిపోయింది." (హేమాదేవి, బొమ్మ. పొగమంచు. పుట: 79) ఈ విధంగా పురుషాధిక్య సమాజం స్త్రీని ఎన్ని హింసలకు గురిసేస్తుందో 'పొగమంచు' నవలలో చూడవచ్చు.

'సృష్టిలో తీయనిది' నవలలో అమృతలత జయ పాత్రను విద్యార్థిగా, రచయిత్రిగా తీర్చిదిద్దుతుంది. జయ కథలు రాస్తుంది. జయ స్నేహితురాలు రజిత వాళ్ళ అన్నయ్య వినోద్ వచ్చినప్పుడు పరిచయం అవుతుంది. అప్పుడు తన కథల గురించి చెప్తుంది. జయ ఎక్కువగా ప్రేమ కథలే రాస్తుంది. వినోద్ జయతో కథ చెప్పే విధానం బాగుంది. చదివినకొద్దీ చదవాలనిపిస్తుంది. మున్ముందు ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠను కలిగిస్తుంది. కాని కథా వస్తువే నచ్చలేదంటాడు. ప్రేమ నవలలు సమాజాన్ని ఏమి ఉద్దరించవు. సాధారణ పాఠకుడికి జీవితమంటే ఏమిటో తెలియనీయకుండా చేస్తాయి. ప్రేమ కథలకు మించి ఎదగనీయకుండా చేస్తాయని అంటాడు. మీలాంటి రచయిత్రులు స్త్రీల పరిస్థితుల గురించి రాయాలి. లేకపోతే ఇంకో వందేళ్ళకు కూడా ఏ మార్పులు లేకుండా ఉంటాయని అంటాడు. అప్పుడు జయ, రజిత కింది విధంగా మాట్లాడతారు. "బహుషా ఇంతకు పూర్వం స్త్రీ పరిస్థితులు నువ్వు చెప్తోన్నంత దారుణంగా ఉండేవేమోగాని, మన సమాజంలో ఇప్పుడు స్త్రీకి స్వేచ్ఛ లేదన్నా మగావాళ్ళ దౌర్జన్యానికి గురవుతోందన్నా నేనొప్పుకోను అన్నయ్యా... కారణం.... పురుషులతో సమానంగా మేమిప్పుడు చదువుకుంటున్నాం, ఉద్యోగాలు చేస్తున్నాం! చివరకు రాజ్యాలను కూడా ఏలుతున్నాం! ఇంతకన్నా స్వేచ్ఛ ఇంకేముంటుంది? పిచ్చిదానా, చదువుకుని ఉద్యోగాలు చేసినంత మాత్రాన అది స్వేచ్ఛ అన్పించుకుంటుందా? సపోజ్ నీకో ఫ్రెండుంది! నీకు ఉన్నట్టుండి సినిమా చూడాలనే బుద్ధిపుట్టి, ఆమెని పిక్చర్‌కి రమ్మని అడిగావ్. ఏమోనమ్మా! వాళ్ళ నాన్న ఊళ్ళోలేరు. చెప్పకుండా వెళ్తే ఆయనకు కోపం అంటూ వాళ్ళమ్మ మీ సరదాలకు అడ్డుకట్ట వేస్తుంది. అదే అక్కడ తన కూతురుకు బదులుగా తన కొడుకే వుంటే ఆ మాట అనేదేనా ఆ తల్లి? పెళ్ళయ్యేదాకా మీ పరిస్థితులు అలా వుంటే పెళ్ళయ్యాక మరోలా? అకస్మాత్తుగా నీ క్లోజ్

ఫ్రెండ్‌ది... మాట వరుసకు జయదే... అనుకో... వెడ్డింగ్ కార్డ్ వస్తుంది. నీకు వెళ్ళాలని ఉంది. భర్త క్యాంపులో వున్నాడు. అడక్కుండా వెళ్తే ఆయనకు కోపం! అతడొచ్చేదాకా నీవు ఆగినా నీకోసం ఆ పెళ్ళి ఆగదు. ఆ పరిస్థితుల్లో ఎలా? ఇలాంటి చిన్న చిన్న విషయాల్లోనే మన కుటుంబాల్లోని స్త్రీలు స్వతంత్రించి స్టెప్ తీసుకోలేక పోతున్నప్పుడు... ఆమె స్వేచ్ఛావాయువులు పీలుస్తోందని ఎలా ఒప్పుకుంటున్నావ్?" (అమృతలత. సృష్టిలో తీయనిది. పుట: 57, 58). అంటే దీన్నిబట్టి చూస్తే సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య జరిగే సంఘటనలు చూసినా, పూర్తిగా స్త్రీ చైతన్యం రాలేదు. అందునా పురుషాధిక్య సమాజంలోనే మనం ఉన్నామనే విషయం మర్చిపోకూడదు. ప్రభుత్వం కూడా చాలా రకాలుగా స్త్రీలను ప్రోత్సహిస్తుంది. కాని అందరూ బయటికి రావడం లేదు. కొన్ని విషయాల్లో ప్రభుత్వ చిత్తశుద్ధి కూడా కన్పించదు. ప్రభుత్వమొకటే కాదు, ఎవరికి వారు స్త్రీ హక్కులను, పురుషుడితో సమాన గౌరవం పొందేలా పూనుకోవాలి. అప్పుడే పుషాధిక్యత సమాజం పోయి స్త్రీ చైతన్యవంతంగా పురుషుడితో సమానంగా బతికే కాలం వస్తుంది.

'నవభారతి' నవలలో స్త్రీ ఎంత తీవ్రమైన పురుషాధిక్యతను ఎదుర్కొంటుందో మనం చూడవచ్చు. "ఇంతలోనే అన్నయ్య భారతీ! కొంచెం వయస్సు మీరినవాడైనా శాస్త్రి అన్ని విధాల యోగ్యులు. నలుగురు పిల్లల తండ్రే అయినా, వయస్సు నలభై సంవత్సరాల లోపుగానే ఉంటుంది. కీర్తి ప్రతిష్టలు గల సద్బ్రాహ్మణులు. ముఖ్యంగా ఆస్తిపరులు. నా ఉద్యోగం దొరికేంతవరకూ అమ్మ, చిట్టి, బిజ్జూల భారం కూడా ఆయనే భరిస్తానన్నారు. ఇందరి భవిష్యత్తు కోసం, మేలుకోసం నువ్వు ఆయన్ని వివాహం చేసుకోవాలమ్మా" (హేమాదేవి, బొమ్మ. నవభారతి. పుట: 39) అన్నాడు. ఎందుకంటే భారతి త్యాగం చేసి ఇరవై ఏళ్ళ తను నలభై ఏళ్ళ అతన్ని పెళ్ళి చేసుకోవాలట. అమ్మకు జబ్బు ఉంది కాబట్టి ఆ ఖర్చులు మనం భరించలేం. కవిత పెళ్ళి చేస్తానన్న నమ్మకం కూడా లేదు. చిట్టి, బిజ్జూలకు మంచి చదువు చెప్పించలేను. కనుక నువ్వు ఈ త్యాగం చేయాల్సిందే అంటాడు అన్నయ్య. అందరి కోసం త్యాగం చేయమని ఒక స్త్రీని

వాళ్ళ అన్నయ్య అనటం ఎంతవరకు సమంజసం. పేదరికమే అటువంటి పని పురిగొల్పి ఉండవచ్చుగాక. కాని భారతి వాళ్ళ అన్నను తిరిగి ప్రశ్నిస్తుంది. "అయితే ధనవంతురాలై ఉండి, ఎన్నో యోగ్యతలు కలిగి వున్న ఓ స్త్రీని నువ్వు వివాహం చేసుకుంటావా? అడిగాను ఆవేశంగా. తప్పకుండా మళ్ళీ దృఢంగానే అన్నాడు అన్నయ్య. నలుగురు పిల్లల తల్లి అయినా? వెంటనే అడిగాను. ఏమిటన్నయ్యా? చిన్నగా నవ్వుతూ అడిగాను. భారతీ ఎంత నీచంగా మాట్లాడుతున్నావ్! అన్నాడు. ఇందులో నీచమేముందన్నయ్యా? నువ్వు మాట్లాడిన మాటలే నేనూ అంటున్నాని. నేను ఏ పని చేస్తే అధర్మం, అన్యాయం కాదో, ఆ పనే నువ్వు చేస్తే నీచం ఎందుకవుతుందన్నయ్యా? మా అందరి భవిష్యత్తును గురించి నువ్వీ త్యాగం ఎందుకు చెయ్యలేవు? నీలాగే నేనూ ఓ నలభై ఏళ్ళ స్త్రీకి మాటిస్తే, దాన్ని నెరవేర్చడంలో నీ బాధ్యత ఎంతవరకు వుంటుంది? చెప్పన్నయ్యా!... నా ప్రశ్నకు సమాధానం చెప్పన్నయ్యా! నీ ప్రశ్నకు నేను కాదు, నా శవం సమాధానమిస్తుంది. విపరీతమైన కోపంతో మండిపడుతూ అన్నాడు అన్నయ్య.

లేదన్నయ్యా! నీ శవం కూడా నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. ఎందుచేతనంటే అది మగ శవం కాబట్టి. పోతే, నీలా నేను ప్రాణాలు తీసుకుంటానని భయపెట్టడం లేదు. నువ్వు కోరినట్లే శాస్త్రినే వివాహం చేసుకుంటాను. కాని, బీదతనం మానవుని చేత ఏయే పనుల్ని చేయిస్తుందో చూస్తూంటే నవ్వు వస్తోంది. నువ్వు ఎటువంటి వాడివో నాకు తెలుసన్నయ్యా! ఈ నీచపు పని నువ్వు స్వయంగా చేయటం లేదు. నిన్ను అలుముకున్న బీదతనమే నిన్నీ పనికి పురికొల్పుతోంది. ఈ పని చెయ్యమని నిన్ను నిర్భందిస్తోంది. నువ్వేకాదు; నీ స్థితిలో ఇంకెవరున్నా ఇలాంటి పనికి వెనుకాడరు. కాని, పెద్ద పెద్ద మాటలు చెబుతూ సమయానికి తప్పుకునే వాళ్ళను చూస్తూనే వాళ్ళపై జాలి కలుగుతుంది. ప్రాణాలైనా ఇచ్చే త్యాగమూర్తివి నువ్వు. మరి, ఇంత చిన్ని త్యాగం ఎందుకు చేయడం లేదు? మరి, అంత అమూల్యమైనదాన్ని 'చిన్ని త్యాగం' అన్న పేరుతో నేనెందుకు వదులుకోవాలి?... స్వార్థం మగ రూపంలో బయటపడుతుంది. అంతే! నిన్ననిమాత్రం

లాభమేమిటి? వెళ్ళన్నయ్యా! సంతోషంగా నీ మాటను నిలబెట్టుకో! అన్ని విధాలా ఉత్సాహపడు. ఆనందించు. పెళ్ళి అనే నెపంతో చెల్లెలిని అమ్ముకునే బేరం దిగ్విజయంగా కొనసాగించుకో!" (హేమాదేవి, బొమ్మ. నవభారతి. పుట: 42, 43). అంటే స్త్రీలు నలుగురు పిల్లల తండ్రిని, అధిక వయస్సున్న వ్యక్తిని పెళ్ళి చేసుకోవాలి. కాని మగవారు మాత్రం నలుగురు పిల్లల తల్లి, అందునా వయస్సు ఎక్కువ కలిగిన స్త్రీని చేసుకోలేం అంటున్నట్టుగా పై సంభాషణలో తెలుస్తుంది. అంటే పురుషాధిక్యత ఎలా ఉందో గమనించవచ్చు. చివరకు వాళ్ళ అన్నయ్య సన్యాసిగా మారతాడు గాని, భారతి చెప్పినట్టుగా పెళ్ళి చేసుకోలేదు.

మరో నవల 'భావన భార్గవి'లో హేమాదేవి పురుషాధిక్యతను చిత్రించింది. అదేవిధంగా దానికి పరిష్కారం మార్గంగా స్త్రీ ఎదురు తిరిగితే పరిష్కారం లభిస్తుందనే సంకేతం కూడా ఇచ్చింది. 'యమున' ప్రధాన పాత్రగా ఇందులోని కథ నడుస్తుంది. పురుషుడు వేరొక స్త్రీతో లైంగిక సంబంధం పెట్టుకుంటే నేరం కాదు. కాని అదే స్త్రీ చేస్తే తప్పుగా పరిగణించబడుతుంది. కారణం మనది పురుషాధిపత్య సమాజం కాబట్టి. యమున సెలవు రోజుల్లో తన పిన్ని వాళ్ళింటికి వెళ్తుంది. ఆ క్రమంలో తమ ఇంటి పనిమనిషైన హరి ద్వారా బాబాయ్ ఎలాంటి వాడో తెలుస్తుంది. యమున చిన్నపిల్లే అయినా పెద్ద పెద్ద ఆలోచనలు చేస్తుంది. "హరీ మానవులు సాధించలేని పనులు లోకంలో చాలా తక్కువగా ఉన్నాయ్. ప్రయత్నిస్తే ఈ ఆధునిక యుగంలో అసాధ్యమైన పని ఏదీ లేదనే అనవచ్చు. రష్యా వైజ్ఞానికులు చంద్రమండలానికి రాకెట్ పంపించగల్గుతారు. మనం ఓ మనిషి జీవితాన్ని మార్చలేమా?" (హేమాదేవి, బొమ్మ. భావన భార్గవి. పుట: 12). ఇలా యమున హరితో వాదించి పిన్ని, బాబాయ్ గురించి వివరంగా తెలుసుకొని, అక్కడికి వెళ్ళిన తర్వాత స్వయంగా గమనించి మరీ బాబాయ్ యొక్క పరస్త్రీ వ్యామోహాన్ని, పురుషాంహకారాన్ని పిన్ని సహాయం ద్వారా అణిచివేయిస్తుంది. హరి భారతనారి ఒకే పురుషుణ్ణి నమ్ముకుని ఉంటుందమ్మా! అతన్నే భర్తగాను, అతన్నే దైవంగాను, అతన్నే సర్వస్వంగాను భావిస్తుంది. తను అంతగా కొలుస్తున్న భర్త తన్ను కాదని, మరో స్త్రీని చేపట్టడం

మన దేశపు స్త్రీ సహించలేదమ్మా!... మన దేశంలో ఒక భార్య ఉండగానే మరో స్త్రీ కోసం ప్రాకులాడే పురుషులున్నారు. కాని, స్త్రీల విషయం అలా కాదుగా? అంటాడు. అప్పుడు యమున ఇంకో భర్త కావాలని అంత నిశ్చయంగా అనుకున్నప్పుడు దొరకరా? రాజు పోతే–రాజ్యం ఏలేవాడే ఉండడా? అని అంటుంది. అలా తప్పు కదా అన్నప్పుడు మళ్ళీ యమున కలుగజేసుకొని మరి పురుషుడు మరో భార్యను వెతుక్కుంటే తప్పులేదుగాని, స్త్రీ మరో భర్తను వెతుక్కుంటే తప్పేమిటని అంటుంది. 'మగవాళ్ళకు సంప్రదాయం ఆడవాళ్ళకు ప్రాణగండమా? అని అంటుంది.

"బాబాయ్ ప్రతిక్షణం ప్రపంచంలో మార్పు జరుగుతూనే వుంది. ఎన్నో భేదాలు సమసి పోయాయి. ఆ కాలం, ఈ కాలం ఒక్కటి కాదు, బాబాయ్! పది సంవత్సరాల క్రితం కడజాతి వాళ్ళు ఉండేవారు. వాళ్ళే ఇప్పుడు హరిజనులయ్యారు. అప్పుడు వాళ్ళను ముట్టుకుంటే మనం స్నానం చేసేవాళ్ళం. ఇంకా కొన్నాళ్ళు పోతే, మనల్ని ముట్టుకుంటే వాళ్ళు స్నానం చేసేట్టున్నారు. ప్రతి చోటా ఇప్పుడు హరిజనులకు విలువ ఏర్పడింది. దైవ మందిరాల్లో ప్రవేశం దొరికింది. ఉద్యోగాల్లో వాళ్ళకు ప్రత్యేకత ఉంది. అలాగే ఇంకా అనేక మార్పులు జరుగుతున్నాయ్. ఈ మార్పులు రావడానికి కారణం ఏమిటి? వాళ్ళను మరీ నీచంగా చూసి, వాళ్ళ గౌరవాలను కృంగదీసి, ఒత్తిడి కలిగించి, మేల్కొల్పడం జరిగింది. హద్దు మీరిన ప్రతిపని పర్యావసానం ఇలాగే ఉంటుంది. వాళ్ళను మనం ఎంతో నీచంగా చూశాం. జంతువులకిచ్చిన విలువ కూడా తోటి మానవునికి ఇవ్వలేకపోయాం. ఇంట్లో కుక్కల్ని పెంచుకుని, వాటిని ముద్దాడతారు కొందరు. కాని, కడజాతి వారిని ముట్టుకుంటే స్నానం చేస్తారు. తోటి మానవుల్ని కుక్కకన్నా హీనంగా చూశాం. ఇలాంటి సమయాలు, సంఘటనలే అకస్మాత్తుగా విప్లవాన్ని తీసుకువస్తాయ్. అలాగే ఓ రోజు ఆడవాళ్ళలో కూడా విప్లవం బయలుదేరుతుంది. అప్పుడు మీకు ఉన్న అన్ని అధికారాలు మారి వారి హస్తగతం కావచ్చు. వారికున్న రీతులు, నియమాలు, బంధనాలు మీ హస్తగతం కావచ్చు. ఎన్ని యుగాలైనా భేదం సమసిపోదు. మార్పు రాదు, అన్న మీ మాటలు యదార్థాలు

కావు, బాబాయ్! మార్పులు జరగడమే ప్రకృతి లక్షణం. ప్రకృతే ప్రపంచం. పతివ్రతలకు నిలయమైన భారతదేశంలో విధవా వివాహాలు, విడాకుల చట్టాలు ఆచరణలోకి వచ్చాయ్. మార్పులు జరుగుతున్నాయని చెప్పేందుకు ఇంతకన్నా ఏం నిదర్శనం కావాలి, బాబాయ్! అంటూ నా మాటలు బాబాయ్ వింటున్నారా, లేదా అని బాబాయ్ వైపుకు దృష్టి మరల్చాను.

యమునా! నువ్వు చెప్పిన మాటల్లో యదార్థం లేకపోలేదు. కాని, మగవాళ్ళలో ఈ భేదాభిప్రాయాలు కల్గించడానికి కొంతవరకు స్త్రీలే కారకులు. పోతే మన పురాణాలు, వేదాలు, ఇతిహాసాలు గూడా 'స్త్రీ కంటే పురుషుడే గొప్ప' భర్త ఇల్లాలికి దేవుడు, దైవం అని ఎంతో నిశ్చయంగా చెబుతూ ఉన్నాయ్. వాటిని తు.చ తప్పకుండా అమలులో పెడతారు స్త్రీలు. మగవాడికి 'ఆధిక్యత' పుట్టినప్పటి నుండే ఆరంభం ఔతుంది. 'కొడుకు పుట్టాడు' అనగానే ఇంట్లో పని మనిషి మొదలు కన్నతల్లి వరకూ ఎంతో ఆనందాన్ని పొందుతారు. అలాగే ఆడపిల్ల పుట్టిందనగానే ఏదో తెలియని 'తక్కువ తనం' చివరకు ఆడమనిషైన కన్నతల్లి కూడా అనుభవిస్తుంది." (హేమాదేవి, బొమ్మ. భావన భార్గవి. పుట: 25-27). అంటే చిన్నతనం నుండి మగవారికి నేనే గొప్ప అనే భావాన్ని అందరు కలిగిస్తారు. ఆడవాళ్లు కూడా ఈ వివక్షలో పాలు పంచుకొంటారు. కారణం సమాజంలో అలా ఉంది కాబట్టి. ఆడపిల్లలకు పెళ్ళిలు చేసి, కట్నాలు ఇవ్వాలి. ఇంకా చాలా రకాల కష్టాలు ఆడవారితో ఉంటాయని బాధపడుతూ మగవాతరిపైనే ఇష్టం పెంచుకుంటారు. తద్వారా మగవాళ్ళకు అహంకారం పెరిగి, ఆడవాళ్లను అణచివేసే స్థాయికి వస్తారు. ప్రతి మనిషి, సంఘటన ఏదైతేనేం మగవారికే మద్దతు అన్నట్లుగా చూడటంతో సమాజంలో పురుషాధిక్యత పెరిగి ఆడవాళ్ళు వివక్షని ఎదుర్కోవాల్సి వస్తుంది. స్వయంగా రక్తంలో ఆ ఆధిక్యత ఇమిడి ఉన్నట్టు అనిపిస్తుంది. స్త్రీలకంటే పురుషులు శారీరకంగా బలంగా ఉండవచ్చు. కాని నేటి రోజుల్లో దేనినైన నైపుణ్యంతో, సాధనతో స్త్రీలు కూడా సాధించగల్గుతున్నారు. చిన్నప్పటినుండి పిల్లలను పెంచే విధానంలో మార్పులు తీసుకువస్తే ఆ భావన మారే అవకాశం ఉంటుంది. కనుక అందరూ అదే పనికి పూనుకుంటే మార్పు వచ్చే

అవకాశం లేకపోలేదు. కాని అలా జరగడం లేదు. పురుషులు తమ ఆధిపత్యం ఎక్కడ చేజారిపోతుందోననే భావనను వదలలేక పోతున్నారు.

## 4.7. వరకట్న సమస్య, స్త్రీ చైతన్యం

వరకట్న సమస్య సమాజాన్ని, ముఖ్యంగా స్త్రీ జాతిని సమస్తం కల్లోలపరుస్తుంది. ఈ సమస్య వల్ల ఎందరో వనితలు ప్రాణత్యాగాలు చేసారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు జరిగాయి. ప్రభుత్వ పరంగా చట్టాలు కూడా వచ్చాయి. కాని ఇవేవీ కూడా ఏమీ చేయలేక పోతున్నాయి. కుటుంబాలలో అల్లుళ్ళ పాత్ర ఎలాగుందో, కొడుకల పాత్ర కూడా అలాగే కట్నాలపై ఆశపడి స్త్రీలను హింసిస్తూనే ఉన్నారు. మొత్తంగా పురుష సమాజం స్త్రీలను కట్నాల పేరుతో హింసిస్తూనే ఉన్నారు. అలాంటి సమయంలో ఎవరికి వారు కట్నాలు, తీసుకోకూడదు ఇవ్వకూడదు అనే నినాదంతో ముందుకు వెళ్ళాలి. కుటుంబ పెద్ద అలాంటి నిర్ణయాలు తీసుకోవాలి. అలాంటిదే 'నవోదయం' నవలలో కన్పిస్తుంది. కుటుంబ పెద్ద సంస్కరణవాదే. కాని అతని మాట కొందరు వింటారు. కొందరు వినరు. అక్కడే వస్తుంది సమస్యంతా. "కవులు తమ కావ్యాల్లో, రచయితలు తమ రచనల్లో, ఉపన్యాసకులు వేదికలపై, కొందరు సమర్థులైన కథకులు, డైరెక్టర్స్ సినిమాల ద్వారా ఎన్నో రకాలుగా వివరించారు. చివరకు ప్రభుత్వం కూడా ఎంతో శ్రద్ధ తీసుకొని కూడా ఏమి చేయలేకపోయింది. మరి మనం తర్జన భర్జన చేసి లాభం ఏముంటుందని" (హేమాదేవి, బొమ్మ నవోదయం. పుట: 19). అంటే వరకట్న సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాని వరకట్నం పూర్తి నిషేధంగా రూపుదాల్చడం లేదు. నేటికి అదే పరిస్థితులు కనబడుతున్నాయి. మనకు తరచుగా భర్తతోపాటు అతని తల్లిదండ్రులు అనగా ఆమె అత్తమామలు కట్నాల కోసం, అదనపు కట్నాల కోసం హింసిస్తుంటారు. కాని ఈ నవలలో అత్తమామలు కోడలివైపే మద్ధతు ప్రకటించడం రచయిత్రి హేమాదేవి, ఉన్నతంగా ఆలోచించి కట్నాలు రూపుమాపే విధంగా ఈ నవలను చిత్రించింది. "అమ్మాయి ఇక్కడే ఉంటుంది. రఘూ! కోడలిగా సాధ్యం కాకపోతే కూతురుగా ఉంటుంది. పిచ్చి కోరికలకు,

బెదిరింపులకు లొంగిపోయి, బెదిరిపోయి అమ్మాయిని లోకానికి అప్పగించాలని నేను అనుకోవడం లేదు. మనిషికి మనిషికి ఉండే సంబంధ బాంధ్యవ్యాలను కూడా మమత లాక్కోవడం నేను సహించను" (హేమాదేవి, బొమ్మ నవోదయం. పుట: 36). కొడుకు కట్నంకోసం కోడల్ని పుట్టింటికి పంపాలని పథకం వేస్తే అత్తమాత్రం కోడల్ని ఎంతో ప్రేమగా చూసుకోవడం 'నవోదయం' నవలలో కన్పిస్తుంది.

ఆడపిల్లలపై వివక్ష తగదు. వరకట్నం పేరుతో స్త్రీపై హింస కూడదు. స్త్రీ అభ్యుదయాన్ని కోరుకున్న రచయిత సిరిగాద శంకర్ 'ఆడ పిల్లేనా' నవలలో 'స్వప్న' వరకట్న మహమ్మారికి బలికాకుండా చైతన్యవంతమైన, ఆదర్శవంతమైన మహిళగా కన్పించడం విశేషం.

స్త్రీకి సహనం ఎక్కువ అంటారు. సహనం ఉండాలి కాని స్త్రీ భవిష్యత్తును కోల్పోకూడదు అనడానికి స్వప్న పాత్ర ఈ నవలలో నిదర్శనంగా కన్పిస్తుంది. జైలు పాలైన భర్తను తలచుకోకుండా మానేసిన చదువును మళ్ళీ కొనసాగించి, తన గమ్యాన్ని ముందుకు నడుపుతుంది స్వప్న. మధ్యలో ఆగిన చదువును ఉన్నత చదువుల వరకు కొనసాగించడమే కాకుండా, ఉపాధ్యాయురాలిగా ఉద్యోగాన్ని సంపాదించడం ఆమె పట్టుదలకు నిదర్శనంగా చెప్పవచ్చును. అంతేకాకుండా జీవితాంతం ఎదురైన ఆటుపోట్లను తట్టుకొని, తన కూతురుని కూడా డాక్టరును చేయడం ఆమె విజయానికి దర్పణం పట్టే అంశం.

ఆడపిల్లలు ఎంత చదువుకున్నా, ఏ స్థాయిలో ఉన్నా, వరకట్నం అనే దురాచారాన్ని ప్రోత్సహించడం చాలా నేరం. నేడు స్త్రీలు లేని రంగం లేదు. కాబట్టి స్త్రీలను వరకట్న మహమ్మారికి బలికాకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిదీ. తల్లిదండ్రులు కట్నం ఇవ్వడం తమ హోదాగా భావించకూడదు. అబ్బాయి తరపువారు కూడా తమ ఇంటికి వచ్చే ఆడపిల్లను, సొంత మనిషిలా చూసుకోవాలి.

బొమ్మ హేమాదేవి 'నవోదయం' నవలను స్త్రీని చైతన్యపరిచే విధంగా చిత్రించింది. "అయితే ఏదైనా ఉద్యోగం చేస్తేనే ఆ డిగ్రీ విజ్ఞానం సద్వినియోగం అవుతుందని, ఆ విద్యకు విలువ ఉంటుందని మీ అభిప్రాయమా?... అదే మీ అభిప్రాయమైతే నేను మీతో ఏకీభవించలేను. మగవారు విద్య, విజ్ఞానాన్ని ఆర్జించి ఉద్యోగం చేసి, కొంత డబ్బును సంపాదించవచ్చు. కాని, స్త్రీ తన విద్య, విజ్ఞానంతో పూర్తి సంసారాన్ని మార్చివేయ గలుగుతుంది. ఆమె చదువు సంస్కారంతో ఆ ఇల్లు రూపమే మారవచ్చు. ఆ ఇంట్లో సరస్వతి రకరకాల రూపాల్తో మనకు కనిపిస్తోంటుంది. ధనూగారూ! ఈ విషయంలో ఇంకా చెప్పాల్సింది ఎంతో ఎన్నో ఉన్నాయి. కాని, ఇప్పుడు కాదు... అయితే ఒక్కమాట మాత్రం చెప్తాను. చదువుకు, విజ్ఞానాన్ని ఆర్జించడానికి స్త్రీ పురుష భేదం ఏమాత్రం ఉండకూడదు. విజ్ఞానాన్ని ఆర్జించేది కేవలం డబ్బును సంపాయించేందుకు మాత్రమే అని అనుకోవడం కూడా పొరపాటే ధనుగారూ! ఎన్నో ఆర్జించేందుకు విజ్ఞానాన్ని ఆర్జిస్తాం. అందులో ధనాన్ని ఆర్జించడం ఓ భాగం మాత్రమే... ప్రతి స్త్రీ తన చేతనైనంత తప్పకుండా చదువుకోవాలి. ఇదే ఎంతో మనకు అవసరం కూడా. మనం, మన ఇల్లు, మన దేశం బాగుపడేందుకు ఇది కూడా ఓ మార్గమే ధనూగారూ! చదువు, సంస్కారం ఉన్న తల్లి చేతుల్లో పెరిగిన పిల్లల పెంపకం చాలావరకు మంచి పెంపకంగా గుర్తించబడుతుంది."(హేమాదేవి, బొమ్మ. నవోదయం. పుట: 11, 13). చదువు, విజ్ఞానాన్ని ఆర్జించేందుకు స్త్రీ, పురుష భేదం ఉండదు. అందరూ సమానంగా చదువుకోవచ్చు. స్త్రీ చదువుకుంటే ఎదురు తిరుగుతుందనే నెపంతో చదువుకోనీకుండా చేయడం సమాజంలో స్త్రీని అణగదొక్కే ప్రయత్నం జరుగుతుంది. కాబట్టి స్త్రీని చైతన్యం చేసే క్రమంలో ఇందులోని పాత్రల ద్వారా చక్కగా చెప్పించారు. అదేవిధంగా చదువు అనేది కేవలం ఉద్యోగం కోసమే కాదని, ఆ విజ్ఞానాన్ని ప్రతి విషయంలోనూ ఉపయోగించి, ప్రతి సమస్యను సమయస్ఫూర్తితో పరిష్కరించుకోవచ్చని వెలువరించారు రచయిత్రి.

బొమ్మ హేమాదేవి 'పంచరంగులు' నవలలో కూడా స్త్రీ చదువుకు సంబంధించిన విషయాలను చిత్రించారు. "మెల్లిగా మాట్లాడక్కయ్యా! ఎవరైనా వింటే మళ్ళీ భారతం మొదలవుతుంది. ఆడవాళ్ళు మెల్లిగా మాట్లాడాలి, కోపం తెచ్చుకోకూడదు. మెల్లిగా భయంగానే అంది రచన. ఈ రకం మాటలు ఇంట్లో అంతా ప్రతిసారి చెపుతూనే ఉంటారు. కాని, ఆడవాళ్ళకే ఈ నిర్బంధాలన్నీ ఏమిటి! కారణం ఏదో ఉండాలి. బాగా చదువుకుంటే ఇల్లాంటివన్నీ అర్థం చేసుకోగలిగే దాన్నేమో! ఫోర్త్ క్లాస్ వరకే చదువుకోవడం అయింది. అదైనా వరుడు కొరకు ఆ కాస్త చదువు ఉండాలి. లేకపోతే వరుడు దొరకడు.

రచనా! మనల్ని చదువుకోకూడదని అమ్మా, నాన్నా అంతా ఎందుకంటారు? మనచేతిలో ఏదైనా పుస్తకం కనిపిస్తే అన్నయ్య ఎందుకు మండిపడతాడు! అయినా... అబ్బా మళ్ళీ ఈ ఆలోచనే వచ్చిందా నీకు? మనం ఆడవాళ్ళం అక్కయ్యా! మనకు పెద్దపెద్ద చదువులు అవసరం లేదు. మధ్యలోనే అంది రచన. అదే ఆడావాళ్ళకు చదువు అవసరం ఎందుకు ఉండదు? ప్చ్ నీకెమీ తెలియదు ఊరుకో. మరీ చదువుకుంటే పెళ్ళికి ఇబ్బంది ఔతుంది. మొన్న చూచావుగా బి.ఏ. చదివిందన్న కారణానే రేశ్మాకు వచ్చిన మంచి సంబంధం తిరిగిపోయింది."(హేమాదేవి, బొమ్మ. పంచరంగులు. పుట: 6, 7). ఈ సంభాషణలో మనకు రెండురకాల విషయాలు అర్థమవుతున్నాయి. స్త్రీలు అసలు చదువుకోకూడదు. చదువుకుంటే పెళ్ళికాదు. అలాగని ఊరుకుంటే అసలే పెళ్ళికాదు. ఎందుకంటే కనీస చదువు అనేది అవసరం ఉంటుందనేది దీనర్థం. ఎక్కువ చదువుకుంటే పురుషులపై తిరగబడతారనే భయం పురుషుల్లో ఉంటుంది. కనుక ఆడవాళ్ళు చదువుకోకూడదు, ఎక్కువగా మాట్లాడకూడదు అనే నిర్బంధాలను అమలు చేస్తుందీ సమాజం. ఈ నవల రాసే కాలానికి బీద, మధ్యతరగతి కుటుంబాల్లో చదువు అనేది అందని ద్రాక్షగానే ఉంది. కాని నేడు దాదాపుగా ఆడవాళ్ళందరూ చదువుకుంటున్నారు. రచయిత్రి హేమాదేవి, చాలా నవలల్లో స్త్రీ సమస్యలు, చైతన్యాన్ని చిత్రించింది.

“నాకు తెలుసు నువ్వు ‘లోకం దృష్టి’తో చూసి భయపడి అలా అంటున్నావని, కాని, రసికా, ఇలాంటివన్నీ నలుగురికీ తెలిసేలా మనం చెప్పాలి; ఆచరించాలి. అప్పుడే స్త్రీ పురుషుడు సమానమైన న్యాయాన్నీ, హక్కునూ పొందగలుగుతారు. న్యాయం, ధర్మం, నీతి స్త్రీ పురుషులకు ఒకేరకంగా ఉంటాయి. రసికా!

లేకపోతే ఆ పక్షపాతంగల న్యాయం న్యాయమెలా అవుతుంది? అన్యాయమే కదా రసికా! ఆ అన్యాయం గురించి నలుగురికీ చెప్పాలనే నేనంటున్నాను. మనం న్యాయాన్నే ఆచరించాలని అంటున్నాను. పోతే, మనం ‘ముందడుగు’ వేయడం వల్ల లేదా న్యాయంగా నడుచుకోవడం వల్ల కొన్ని బాధలు, కష్టాలు తాత్కాలికంగా కలుగవచ్చు. కాని, రసికా! నిజంగానే నీకు న్యాయం, ధర్మం, నీతి కావాలనుకుంటే, ఆ కష్టాలను, బాధలను సహించుకోవలసి ఉంటుంది.” (హేమాదేవి, బొమ్మ. కళావతి. పుట: 74).

బొమ్మ హేమాదేవి రాసిన ‘కళావతి నవలలో ఒక స్త్రీ వితంతు వివాహం మూలంగా తన పిల్లలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో చిత్రించింది. హరినాథ్, కళావతి అన్నా చెల్లెళ్ళు. హరినాథ్ పుట్టిన తర్వాత వాళ్ళ నాన్న చనిపోతాడు. వాళ్ళ అమ్మ వయసు పద్దెనిమిది సంవత్సరాలు. అప్పుడు ఆమె మరో పెళ్ళి చేసుకుంటుంది. అప్పుడు కళావతి పుడుతుంది. కొన్నేళ్ళకు ఆమె కూడా చనిపోతుంది. కళావతి, హరినాథ్ తండ్రులిద్దరైనా తల్లి ఒకతే. ఇద్దరూ తోబుట్టువులే. కాని సమాజం వీరిని చిన్నచూపు చూడటం మొదలు పెట్టింది. ఉమ, రసికా, విశ్వం, వీళ్ళందరికీ పెద్దన్నయ్య, వీరందరూ తోబుట్టువులు. ఉమా ప్రధాన పాత్రగా ఉంటుంది. వాళ్ళ చిన్నన్నయ్య విశ్వం నవలా రచయిత. ఇతని రచనలకు ఆకర్షితురాలై కళావతి విశ్వాన్ని ఇష్టపడ్తుంది. తద్వారా వీరింటికి కళావతి వస్తూ, వెళ్తుంటుంది. ఉమకు ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు రోజు వచ్చి సేవ చేసేది. ఉమాకు ఆరోగ్య నిమిత్తం ప్రశాంత వాతావరణం అవసరమైనపుడు వేరే గ్రామానికి వెళ్ళాల్సి వస్తుంది. అప్పుడు ఉమ చిన్నన్నయ్య విశ్వం ఉమను

తీసుకొని వెళ్తాడు. అప్పుడు కూడా కళావతి వెంటవెళ్ళి అక్కడ ఉమను, విశ్వంతో కలిసి స్నేహపూర్వకంగా ఉంటుంది. విశ్వాన్ని మరింతగా ప్రేమిస్తుంది. కాని విశ్వం వాళ్ళ ఇంటిలో వితంతువుకు పుట్టిన ఆమెను పెళ్ళి చేసుకోవేడమేమిటి? అని ఈ ప్రేమ పెళ్ళికి నిరాకరిస్తారు. వీరి చెల్లె రసికకు ముందే పెళ్ళవుతుంది. కళావతి విశ్వం(చిన్నన్నయ్య)ల పెళ్ళి గురించి సమాజం ఏమనుకుంటుందో! అలాంటపుడు మనం ఏం చేయాలో! ఉత్తరాల ద్వారా ఉమ, రసికలు చర్చించుకుంటారు.

ఇందులోనే మరో వివాహం జరుగుతుంది. హరినాథ్, కళ వాళ్ల ఇంటిలో పనిచేసే నీల వాళ్ళ భర్త చనిపోతాడు. ఆమె విధవ అవుతుంది. ఉమకు ఆనారోగ్యంగా ఉన్నప్పుడు ప్రశాంత వాతావరణం కోసం వేరే గ్రామానికి వెళ్ళాల్సి వచ్చినప్పుడు కళావతి, హరినాథ్‌ల వెంట వెళుతుంది. అక్కడి గ్రామంలోని పెద్దమనిషి కుమారుడు నీలను ప్రేమిస్తాడు. ఆ విషయం ఆ పెద్దమనిషికి తెలిసి వీరిని బెదిరించడానికి ఉమ, కళ, హరి, విశ్వం ఉంటున్న ఇంటవద్దకు వచ్చి, మీరు ఇక్కడినుండి వెళ్ళిపోవాలి. మా కులం వాళ్ళకు తెలిస్తే ఊరుకోరు అని హెచ్చరిస్తాడు. ఆ సమయంలో హరినాథ్, విశ్వం కలిసి వారు ప్రేమించుకుంటే వాళ్ళే పెళ్ళిచేసుకుంటారు. మీరు అడ్డురాకుండా ఉంటే మంచిది అని హెచ్చరిస్తారు. నీలను ముందే పథకం ప్రకారం హైదరాబాద్ పంపించివేస్తాడు. తర్వాత ఆ యువకున్ని కూడా హైదరాబాదు పంపించి అక్కడ పెళ్ళి ఏర్పాట్లను చేస్తాడు.

'కళావతి' నవలలో వితంతు స్త్రీ పెళ్ళి చేసుకోవడం నేరంగా భావిస్తుందీ సమాజం. ఆమెకు పుట్టిన పిల్లలను పెళ్ళి చేసుకోవడం కూడా నేరంగానే పరిగణించబడుతుంది. అటువంటి కట్లుబాట్లను చేదిస్తూ. కళావతితో విశ్వానికి, హరినాథ్ తో ఉమల వివాహం, అదేవిధంగా వితంతువైన పనిమనిషి నీల, పెద్దమనిషి కుమారుల వివాహం జరుగుతుంది. వితంతువుల వివాహం కాని, వితంతువుల పిల్లల వివాహాలు జరగాలి అనే ఉద్దేశంతో రచయిత్రి హేమాదేవి

ఈ నవలలో చిత్రించారు. ఇవన్నీ ఇప్పుడు అంత ఎక్కువ నిర్బంధాలు ఎదుర్కోవడం లేదు. కాని కొన్ని చోట్ల సంప్రదాయాల పేరిట ఇబ్బందులకు గురౌతున్నవారు ఉన్నారు.

హేమాదేవి రాసిన 'ప్రేమంటే నవలలో స్త్రీ చైతన్యం గురించిన వస్తువు కనిపిస్తుంది. "మీ ముందు సూటిగా మాట్లాడుతున్నందుకు క్షమించండి మామగారూ! ఆవేశం అందరికీ వస్తుంది. కాని, వచ్చిన ప్రతిసారీ దానికి విలువ కడుతూ కూర్చోవడం పడదు. ఇంట్లో వున్న ప్రతివాళ్ళకూ హృదయాలున్నాయి. కోరికలు, మనస్సులు వున్నాయి. వాటిని సక్రమమైన మార్గంలో కూడా తీర్చుకునేందుకు వీలుపడటం ఆరోగ్యకరమైన విషయం ఏమీ కాదు. మా ప్రయాణం వల్ల వారికి కలిగే నష్టం ఏమీ లేదు. కాని, ప్రయాణం మానుకోవడం వల్ల మేమెంతో నష్టపోతాం. ఈ విషయం మీరు గమనించడం ఎంతో అవసరం. అత్తగారిపై అభిమానం, గౌరవం తప్పకుండా ఉన్నాయి. కాని వాటిని ఈ విధంగా వ్యక్తపరచడం కుదరదు.

అవన్నీ నిజమేనమ్మా! కాని, ఆమె పట్టిన పట్టు వదిలే రకం కాదు. కొంచెం విసుగ్గా అన్నారు మామగారు. పెద్దల సమక్షంలో అతిగా మాట్లాడాల్సి వచ్చినందుకు విచారిస్తున్నాను. మీరు ఒకే పక్షంగా ఆలోచిస్తున్నారు. ఇది పట్టు పట్టాల్సిన విషయం కాదు. మీరు పెద్దలు, గౌరవనీయులు. ఇంకేం చెప్పగలుగుతాను! పట్టు పట్టడం ఆమెకు మాత్రమే అలవాటు వుండదు. సాగుతూంటే అందరూ అవసరం ఉన్నా, లేకున్నా పట్టు పడుతూనే వుంటారు."(హేమాదేవి, బొమ్మ. ప్రేమంటే. పుట: 112, 113)

స్వేచ్ఛగా, మగవారి లాగా పెరిగిన రాధా తన ప్రేమను త్యాగం చేసి మరీ తన అక్కలకోసం తల్లిదండ్రులకోసం తను ప్రేమించిన భావను వదిలి వేరే వ్యక్తిని పెళ్ళి చేసుకుంటుంది. అక్కడ అత్తవారింట్లో కొత్త సవాళ్ళు ఎదురవుతాయి. ఒకవైపు అమ్మాయి లక్షణాలతో, ప్రవర్తనతో బతుకుతున్న తన భర్తను సరిదిద్దుకోవాలి. ఒకవైపు అత్త అనవసరపు పెత్తనాన్ని ఎదిరించి పరిస్థితిని అర్థం చేయించాలి. అటువంటి సమయంలో వారిని తనదైన

శైలిలో విషయాల్ని అర్థం చేయిస్తూ తన భర్తకోసం చేయాల్సిన పనులను చెప్పగలిగేవి చెప్పి, చెప్పలేనివి తానంతట తాను చేసుకుంటూ వెళ్తుంది రాధా. ఈ నవలా రచనా కాలానికి అంటే 1960ల తర్వాత ఆడావాళ్ళు నోరెత్తి మాట్లాడే పరిస్థితి లేదు. అటువంటి సమయాల్లో కూడా నేర్పుగా స్త్రీ తన తెలివిని ఉపయోగించి కుటుంబాన్ని ఎలా తీర్చిదిద్దిందో రచయిత్రి ఈ 'ప్రేమంటే' నవల ద్వారా తెలియజేస్తుంది.

బొమ్మ హేమాదేవి రాసిన 'మహానంద' నవలలో స్త్రీ చైతన్యాన్ని పెంపొందించే పాత్రను సృష్టించింది రచయిత్రి. ఇందులో చైతన్య వంతమైన పాత్రగా శారద ఉంటుంది. ఆమె కృష్ణవేణికి స్నేహితురాలు. ఆమె సమాజంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను, దుర్మార్గాలను గమనిస్తూనే ఉంది. అలాగే స్వయంగా స్నేహితురాలైన కృష్ణవేణి జీవితాన్ని స్వయంగా చూస్తూ ఉంటుంది. శారద చదువుకున్న అమ్మాయి. సంఘ దురాచారాలన్నీ పోవాలంటే 'సమాజం' అనే సంఘం స్థాపించాలి. అది శారద కోరిక. దాన్ని గుర్తుచేస్తూ కృష్ణవేణి అడుగుతుంది. అప్పుడు శారద "ఎన్నో దురాచారాలకు సమాజం కలిగించే అన్యాయాలకు స్త్రీలు గురవుతూ ఉంటారు. తనింట్లో తానే స్త్రీ నిరాశ్రయురాలు ఔతుంది. అట్లాటి స్త్రీలకు ఆశ్రయం ఇవ్వటం, ఉపాధి కల్పించడం తాను స్థాపించబోయే సమాజ లక్ష్యం అని చెప్పింది శారద. ఓ పాతికమంది స్త్రీలు కలిసి ఎన్ని కష్టాలయినా పడి ఈ సమాజాన్ని నిర్వహించాలని చూస్తున్నట్టు, దానికోసం కొంతడబ్బు సమకూర్చినట్టు, కొంత ప్రభుత్వం నుంచి లభించినట్టు, భవన నిర్మాణం కూడా యోచనలో ఉన్నట్టు, ఈ ఆలోచనలకు ఓరూపం ఏర్పడదని చెప్పింది.

ఇట్లా ఆశ్రయం నిర్మించేకన్నా తన సమస్యలను స్త్రీ తానే ఎదుర్కొనగలిగే విజ్ఞానం, శారీరక బలం, ఆర్థిక బలం కలిగే ఏర్పాటు చేయడం మంచిదనిపిస్తుంది. ఎక్కువమంది స్త్రీలకు న్యాయం జరుగుతుంది అని అంటుంది."(హేమాదేవి, బొమ్మ. మహానంద. పుట: 58). అప్పుడు శారద అందులో స్త్రీలకు సమస్యలను ఎదుర్కునేందుకు కోచింగ్ కూడా ఉంటుందని చెప్తుంది.

అదేవిధంగా స్త్రీ స్వయంగా స్వయం కృషితో కష్టమైన పనిని కూడా ఎలా చేస్తుందో కూడా మనం 'మహానంద' నవలలో గమనించవచ్చు. కృష్ణవేణి అత్తింటివారు దీపావళికి కట్నకానుకల కింద రేడియో కావాలని ఆమెను నిత్యం ఇబ్బంది పెడుతూనే ఉంటారు. చివరకు అమ్మగారింటికి పంపించి రేడియో కొనిస్తేనే కృష్ణవేణిని తీసుకువెళ్తామని చెప్పటంతో కృష్ణవేణి కుటుంబీకులు అందరూ కృష్ణవేణిని అత్తారింటికి పంపడంకోసం ఆమెను హింసిస్తారు. చివరకు ఆమె అమ్మ కూతురును అత్తారింటికి తీసుకెళ్ళి విడిచిపెట్టి వస్తుంది. బలవంతంగా ఆ ఇంట్లో, భర్త దగ్గరకు చేరుతుంది. కాని అతను కామపిశాచి కనుక అప్పటికి ఎంతో ఆప్యాయంగా ఓదార్చి దగ్గరికి చేర్చుకొని, తన లైంగిక కోరికను తీర్చుకొని, అదే రాత్రి కట్నం కింద మీ అమ్మవాళ్ళింటి నుండి రేడియో తేలేదు కదా! ఇంట్లో వెళ్ళమని నిర్దాక్షిణ్యంగా వెళ్ళగొడతాడు. అప్పుడు దిక్కుతోచని స్థితిలో పరుగెత్తుతుంది. ఆ రాత్రిల్లు ఎక్కడ వెళ్తుందో ఆమెకు తెలియదు. తాగిన మైకంలో మగ కామపిశాచాలు వెంబడిస్తున్నాయి. ఇంట్లోని మగమహారాజు వెళ్ళగొట్టాడు. చివరకు రైల్వే స్టేషన్‌కు వెళ్తుంది. అక్కడ కనిపించిన రైలును ఎక్కుతుంది. అందులో తాగుబోతు భర్త వదిలేసిన ఒక భార్య, ఆమె తొమ్మిదిమంది పిల్లల తల్లి. ఆమె పేరు శివాని. వారికి అందరికీ సరిపడా టికెట్‌కు డబ్బులు ఉండవు. వారిని కిందికి దించడానికి టికెట్ కలెక్టర్ ప్రయత్నిస్తాడు. అప్పుడు కృష్ణ తన బంగారు పుస్తెలతాడు ఇచ్చి మరీ టికెట్స్ కొనుగోలు చేసి, వారితోపాటే ప్రయాణం చేస్తుంది. శివానితో స్నేహం ఏర్పడి పూనా వెళ్తుంది. అక్కడ వారితోనే కొన్నాళ్ళపాటు జీవనం సాగిస్తుంది. శివాని బట్టలు కుట్టి పిల్లలను సాకుతూ జీవనం సాగిస్తుంది.

'మహానంద' నవలలో శివాని, కృష్ణ పాత్రల ద్వారా స్త్రీల కష్టాలను, అదేవిధంగా వారు స్వయం కృషితో జీవనం సాగించిన విధానాన్ని తెలియజేశారు రచయిత్రి. శివాని బట్టలు కుడుతుంటే, కృష్ణ వాటికి గుండీలు, ఉక్కులు మొదలైన చిల్లర పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఇలా అయితే ఏపూట కాపూట గడుస్తూ వస్తుంది. పిల్లలకు చదువు చెప్పించలేక పోతున్నారు. కనుక కృష్ణ చుట్టుపక్కల వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళు ఏం చేసి బ్రతుకుతున్నారో

కనుక్కొని వస్తుంది. పళ్ళు అమ్మటం ద్వారా సగానికి సగం లాభం ఉంటుందని తెలుసుకొని వస్తుంది. అందుకోసం శివానిని కృష్ణవేణి ఐదు రూపాయలు అడుగుతుంది. అప్పుడు శివాని వయసులో ఉన్న అమ్మాయివి. నీవు పళ్ళమ్మి బతకడం వద్దు. బాగుండదు అనే విషయాన్ని చెప్తుంది. అప్పుడు కృష్ణ "ఇట్లా భయపడుతూ కూర్చుంటే బ్రతకలేము, చావాలేము. నువ్వు పిరికిమందు పోయకుగాని, ఓ ఐదు రూపాయలు నాకివ్వు. నేను జాగ్రత్తగానే ఇల్లు చేరుకుంటాను అంది కృష్ణ."(హేమాదేవి, బొమ్మ. మహానంద. పుట: 90).

శివాని మనసులో ఇలా అనుకుంటుంది. కృష్ణ గొప్పంటి పిల్ల. ఆ అమ్మాయిని బజార్లోకి పంపించడం అసలు ఇష్టం లేదని, కాని బతుకుదెరువుకు ఇంకో మార్గం లేదు. ఆమె ఎన్ని చెప్పినా వినదని ఊరుకుంటుంది. ఒక పళ్ళగంపతో వ్యాపారం ప్రారంభిన కృష్ణ, ఎక్కువ పళ్లగంపలు అమ్ముడు పోయేవరకు వాటిని మోయలేక చక్రాల బండిమీద కూడా అమ్ముతుంది. చాకచక్యంతో, కిటుకులతో పళ్ళు అమ్మటం నేర్చుకుంటుంది. శివాని కూతురు కూడా కృష్ణవేణితో వెళ్లడంతో కిటుకులతో అక్క పళ్ళమ్ముతుందని చెప్తుంది. "నువ్వు కూడా వెయ్యొచ్చు పద అంది కృష్ణ. తర్వాత కృష్ణ గంపని తలమీద పెట్టుకొని ఇంటిబైట అడుగుపెట్టింది. ఇందిర తనవెంట ఉంది. కృష్ణ చక్కని కంఠ స్వరంతో రాగంతో పాడుతున్నట్టు 'పళ్ళూ ఆపూస్ పళ్ళూ' అని కేకవేయటం కొందరికి ఆకర్షనీయంగా అనిపించి పళ్ళు కొన్నారు కొందరు. మనిషి ఆకర్షనీయంగా కనిపించడం వల్ల కొందరు గంపపైకి ఎగబడి కొన్నారు. కొందరేమో అవసరమై కొన్నారు. మొత్తంమీద రెండు గంటలలో పళ్ళన్నీ అమ్ముడైపోయాయి. కొనేవాళ్ళు అధికంగా కనిపించగానే కృష్ణ పళ్ళ ధరను పెంచింది. ఐనా నిమిషాలమీద అమ్ముడైపోయాయి పళ్ళు. ఇంటికి వచ్చాక లెక్కచూస్తే పదిహేను రూపాయలు మిగులు కనిపించాయి."(హేమాదేవి, బొమ్మ. మహానంద. పుట: 93). కిటుకులతో పళ్ళమ్ముతున్నావా కృష్ణ అని అడుగుతుంది. అప్పుడు కృష్ణ కిటుకులంటే అవి వ్యాపార నియమాలక్క అని చెప్తుంది. మోసం చేసి డబ్బులు

సంపాదించడం లేదని చెప్తుంది. కృష్ణవేణి రకరకాల మగవాళ్ళ చూపుల్లో, చేతల్లో తేడాలు ఉన్నా సరే తానే సర్దుకుంటూ పళ్ళు అమ్ముతూ వచ్చేది.

కృష్ణవేణి ఇలా పళ్ళను అమ్మగా వచ్చిన డబ్బుతో అందరూ రెండు పూటలా అన్నం తింటున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్తున్నారు. ఇంటిలో శివాని, కృష్ణ ఒంటరి ఆడవాళ్ళు కావడం తమకు తాము రక్షించుకోవడం కోసం పిల్లలకు మంచితిండి పెట్టి మంచి కసరత్తు చేపిస్తుంది. పిల్లలు దృఢంగా తయారవుతున్నారు. ఇదంతా ఎందుకు? మనం ఎవరితోనైనా పోట్లాటకు వెళ్ళాలా అని అడుగుతుంది శివాని. అప్పుడు కృష్ణ మనం పరాయి వాళ్ళవైపు కన్నెత్తి చూడకుండా ఉండాలి. మనం ఎవరితో పోట్లాడం. కాని మనతోకూడా ఎవరూ పోట్లాటకి రాకూడదు. వస్తే సరైన విధానంతో ఎదుర్కోగలిగెట్టు ఉండాలి. మరి పిల్లలు కసరత్తు మొదలు పెట్టిన్నించి నువ్వేచూడు మనతో ఎవరైనా దురుసుగా మాట్లాడుతున్నారా? అని అంటుంది.

ఒక స్త్రీ భర్తతో కష్టాలు పడుతూ, గెంటివేయబడి ఒంటిరిగా జీవనం సాగించడం కత్తిమీద సామె. పిల్లలతో మరీ కష్టం. శివాని బట్టలు కుడుతూ పిల్లలను పోషించుకుంటూ అతికష్టంమీద జీవనం సాగిస్తుంది. కృష్ణవేణికి పుట్టింటివారి ఆదరణ, భర్త ప్రేమ లేక ఇంటినుండి బయటకు వచ్చి శివాని లాంటివారితో స్నేహం కుదుర్చుకొని పళ్ళ వ్యాపారం చేస్తుంది. బతకాలంటే ఏదో ఒక వ్యాపారం(పని) చేయాల్సిందే. కనుక తనకు తోచిన వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంది. మగదిక్కు లేని శివాని కుటుంబానికి అండగా నిలుస్తుంది. వాళ్ళు కూడా ఈమెకు అండగా నిలుస్తున్నారు. అంతేగాక తమకు తాము రక్షించుకోవడం కోసం పిల్లలను శారీరకంగా దృఢంగా తయారు చేయడం స్త్రీ స్వయంకృషికి నిదర్శనం.

### 4.8. ఆదర్శ వివాహాలు

పెళ్ళి అంటే సరైన నిర్వచనం ఇవ్వలేమంటూనే ఒక్కొక్కరు ఒక్కొవిధంగా నిర్వచించారో చెప్తారు తాపి ధర్మారావుగారు. "చేతులారా మెడకు బండ కట్టుకోవడమే పెళ్ళి అంటాడు ఒకడు.

కామ భోగాలకు ఇతరులకు ఎలాంటి హక్కులు లేకుండా గుత్త తీసుకోవడం అంటుంది ఒకర్తె. ఇష్టం ఉన్నా లేకపోయినా ఇల్లు గడుపుకోవడం అంటుంది ఒకర్తె. పగలంతా పరమ చాకిరీ, రాత్రంతా రాద్ధాంత రణారణలు పెళ్ళి అంటాడు ఒకడు. ఇంటిపేరు నిలబెట్టుకోవడానికి ఇదొక సాధనం అంటాడొకడు. స్వర్గారోహణకు పెళ్ళి ఒక నిచ్చెన అంటాడొకడు. సంప్రదాయం అంటుందొకర్తె. అదొక సందడి అంటుంది ఒకర్తె..."(ధర్మరావు, తాపీ. పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు. పుట: 4).

పైన చెప్పినట్టుగా వివాహాల వల్ల ఏదో ఒక విధంగా బాధలు ఉంటూనే ఉంటాయి. సమాజంలో సాధారణంగా సంప్రదాయబద్ధంగా పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి. హంగు ఆర్భాటాలతో తమ కుల, మతాల వారితోనే పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి. పెళ్ళి అంటే వెనకా ముందు చూసుకొని, ఆలోచించుకొని చేసుకునే కార్యం అని అందరి నమ్మకం. ప్రాంతాలను బట్టి, కులాలను బట్టి, మతాలను బట్టి పెళ్ళి సంప్రదాయాలు, కట్టుబాట్లు, హంగు ఆర్భాటాల్లో తేడాలు ఉంటాయి. బొమ్మా హేమాదేవి రచించిన 'నవరసాలు' నవలలో పెళ్ళి అంటే ఇంత భిన్నంగా చేసుకుంటారా? అని ఆశ్చర్యపడేలాగా ఉంటుంది. ఇంత ఆదర్శవంతంగా ఈరోజుల్లో ఎవరుంటారని సందేహం కలుగవలసిందే. మన సమాజంలో అలా జరిగే పెళ్ళిళ్ళు అతి తక్కువ. ఇలాంటి పెళ్ళిళ్ళను పెళ్ళి చేసుకోబోయే అబ్బాయి, అమ్మాయి అంగీకారం ఉంటే సరిపోతుంది. కుటుంబం, బంధువులు ఎలాగూ ఒప్పుకోరు. ఇలాంటి పెళ్ళికి ఎవరు రారు. అటువంటి పెళ్ళే కుల, మత, బీద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా చేసుకునే పెళ్ళిళ్ళు ఆదర్శవంతమైన పెళ్ళిళ్ళు. ఒకరినొకరు గౌరవించుకునే విధంగా, అభిప్రాయ బేధాలు లేకుండా ఉంటాయి ఈ ఆదర్శవంతమైన పెళ్ళిళ్ళు. అలాంటి పెళ్ళిళ్ళే 'నవరసాలు' అనే నవలలో మనకు కన్పిస్తాయి. ఇందులో అమ్మా, నాన్న తొమ్మిదిమంది పిల్లలు ఉంటారు. వారి పేర్లు వరసగా రజిని, అరవింద, అఖిల, అజయ్, అలక్, మోతీ, శేఖర్, ఆనంద్, అనిత మొదలైనవారు.

అలఖ్ అనే అమ్మాయి డ్రైవర్‌ను పెళ్ళి చేసుకుంటుంది. ఈ విషయాన్ని ఇంట్లోవాళ్ళందిరికి చెప్పగానే అందరూ ఒకేసారి డ్రైవర్నా? అని ఆశ్చర్యపడతారు. తరువాత అందరూ ఆదర్శవంతమైన తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నారు కాబట్టి అర్థం చేసుకొని ఒప్పుకుంటారు. కాని వాళ్ళ అమ్మ ఒప్పుకోదు. ఆమె నాన్న సమన్వయం చేస్తూ అతన్నే పెళ్ళి చేసుకోవడంలో ప్రత్యేకమైన కారణం ఏమైనా ఉందా? అని అడుగుతాడు. అప్పుడు అలక్ అతడు బీదవాడు. బీదవాళ్ళంటే నాకిష్టం, అందులో వారిని ఉద్ధరించాలనే ఆశయం నాది అని చెప్తుంది. అతనికి చదువురాని అనాగరికుడు. దానికి కారణం డబ్బులేకపోవడం వల్లే అతడు చదువుకోలేకపోయాడని కూడా చెప్తుంది. నీవు వయస్సు రీత్యా, న్యాయవాద వృత్తిలో ఉండటం వల్ల కూడా అనుభవం సాధించావు. నువ్వు పూనుకుంటున్న ఇలాంటి పనికి నేనే కాదు ఎవరూ నీకు అడ్డురారు అని చెప్తాడు. ఆ విధంగా అలక్, డ్రైవర్ నర్సయ్య(నంద్)ల పెళ్ళి నిరాడంబరంగా అతికొద్దిమంది అతిథుల మధ్య జరిగింది. తర్వాత సంసారిక బంధంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది అలక్. ఆ డ్రైవర్ నందును మార్చడానికి, అతని అలవాట్లను మార్చడానికి, అతనికి చదువు చెప్పించడానికి నానా తంటాలు పడింది. చివరకు అనుకున్నది సాధించింది.

ఈ నవరసాలు నవలలోని ప్రధాన పాత్రలైన తల్లిదండ్రుల సంభాషణ వింటే తండ్రి ఎంతటి ఆదర్శప్రాయుడో మనకు అర్థమవుతుంది. అతడు తన పిల్లలందరిని ఆదర్శంగా పెంచాడు. వారికి స్వేచ్ఛగా ఎలా ఉండాలో నేర్పించి, ఏది కావాలో, వద్దో నిర్ణయించుకునే హక్కు వారిదేనన్నాడు.

"అది లోకానికి అలవాటే దుర్గా! ఉన్నా లేకపోయినా, కనిపించినా, కనిపించకపోయినా ఎప్పుడు ఏదో అంటూ ఉండటం, లోకానికి ఎప్పుడూ వున్న అలవాటే. పిల్లలకు పెళ్ళి చేసేందుకు నాకెలాంటి అభ్యంతరం లేదు. వాళ్ళు ఇష్టపడినప్పుడు వాళ్ళు కోరినవాళ్ళతో/కోరుకున్న వాళ్ళతో పెళ్ళిచేస్తాను. ఈ విషయంలో నా పిల్లలకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చాను. వాళ్ళకు బుద్ధి, జ్ఞానం,

మంచి చెడు తెలుసుకునే సామర్థ్యం ఉంది. నాకు నేనైతే ఓ వరుణ్ణి తెచ్చి వాళ్ల మెడకు కట్టలేను. దుర్గా! ఈరోజు నేనెంతో నిశ్చితంగా ఏ చీకూచింతా లేకుండా ఉన్నాను. బహుశః ఇంకే ఆడపిల్లల తండ్రీ ఇంత నిశ్చింతగా ఉండలేడేమో! ఇంకో విషయం విను దుర్గా! ఆడపిల్లలకు, చదువెందుకని, వాళ్ళకు విజ్ఞానం మధ్య అగాధం ఏర్పరచి, వయసు వచ్చేసిందని చిన్న ప్రాయంలోనే పెళ్ళి చేయడంతో ఆ బిడ్డకు ఎన్ని రకాల కష్టనష్టాలు సంభవిస్తాయో కొంచెం యోచించు. ఆ అమ్మాయికే చదువు చెప్పిస్తే, మంచి డాక్టరో, లాయరో, విజ్ఞానవేత్తో కావొచ్చు. ఆమెవల్ల దేశానికి, ప్రపంచానికి ఎంతో ఉపయోగం, ఉపకారం లభించవచ్చు. చిన్నతనంలో ఇంకా చదువుకుంటాను అన్నా వినకుండా పెళ్ళి చేయడంవల్ల ఆమెకే కాకుండా ఎందరికో ఎన్నో నష్టాలు కలుగుతాయి. పెళ్ళి అవసరం ప్రతి మనిషికి ఉంటుంది దుర్గా. కాని నువ్వు పెళ్ళి చెయ్యదల్చుకున్న వాళ్ళకు 'పెళ్ళి' అంటే ఏమిటో ముందు చెప్పి చెయ్యి. అంతే... నీ సంతోషం, గౌరవం కొరకు వాళ్ళకు పెళ్ళిచేసి వారిని నానా రకాల బాధకు గురిచేయడం అన్యాయం చేసినట్టే అవుతుంది. అరవింద అక్షయను కోరింది. సాధక బాధకాలను సర్దుకుపోయే వయస్సు, విజ్ఞానం ఆమెకు వచ్చాయి. అందుకే వారికి పెళ్ళి చేశాను. పోతే అజయ్ తన అవసరం ఏమిటో తానే తెల్సుకోలేకపోయాడు. అలాంటప్పుడు ఆత్మీయులు కలుగజేసుకోవాల్సి వస్తుంది. అందుకనే నీ మాట ప్రకారంగా అజయ్ పెళ్ళి చేశాను. ఇప్పుడంతా బావున్నారు. మిగతా పెళ్ళిళ్ళు కూడా ఈలాగే అయిపోతాయి. ఇంకా కట్నాల విషయంలో పిచ్చిపిచ్చి నిబంధనలకు, ఆర్భాటాలకు కష్టపడి సంపాదించిన డబ్బును ఖర్చు చేసేందుకు నేను ఒప్పుకోను. పెళ్ళి కావాలనుకున్నవాళ్ళు చెప్పండి క్లుప్తంగా రెండు గంటల్లో పెళ్ళి చేస్తాను. పెళ్ళి ఆర్భాటాలకు అయ్యే ఖర్చు, కట్నం కింద పోయే డబ్బు తమతమ జీవితావసరాలకు వినియోగించుకోండి..." (హేమాదేవి, బొమ్మా. నవరసాలు. పుట: 30, 31).

ఇదే మరొక కొడుకు అబ్బాయి శేఖర్ విధవరాలైన హరిజన అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని అనుకుంటాడు. ఆ అమ్మాయికి చిన్నతనంలోనే పెళ్ళి చేయడంవల్ల భర్త చనిపోయి

వైధవ్యంలోకి వస్తుంది. తల్లితరుపువారు ఎవరూ లేకపోవడం వల్ల అత్తవారింటిలోనే ఉంటుంది. వారి కుటుంబ సభ్యులు పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటుంది. అప్పుడు ఎవరో ఆపారు. తర్వాత ఎవరో సినిమాల్లో చేరమని సలహా ఇస్తే మద్రాసు వెళ్లి సినీ పరిశ్రమలో చేరి అక్కడ ఎన్నో ఇబ్బందులకు గురవుతుంది. మళ్ళీ ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేసినప్పుడు ఈ శేఖర్ ఆపి ఇంటికి తీసుకువచ్చి పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. ఎప్పటిలాగే అందరూ సరే అన్నా, వాళ్ల అమ్మ మాత్రం ససేమీర అంటుంది. ఆమెను ఒప్పించే ప్రయత్నంలో వాళ్ళ నాన్న చాలా విషయాలను వాళ్ళ అమ్మకు వివరిస్తాడు. కులమత విభేదాలవల్ల మనదేశం చాలా భాగాలుగా విడిపోయింది. నా, నీ అనే భేదాలవల్లే ఇలాంటివన్నీ ఉద్భవిస్తున్నాయి. అందరం సమభావంతో సమిష్టిగా ఉన్నప్పుడే దేశం అభివృద్ధిలోకి వస్తుంది. అప్పుడు అందరూ సమానంగా కష్టం, సుఖం అనుభవిస్తారు అని అంటాడు.

వీరి ఇంటిలో చిత్ర అనే అనాథ అమ్మాయి పెరిగి పెద్దదవుతుంది. ఆమె కూడా హరిజన అమ్మాయని తెలుస్తుంది వాళ్ల అమ్మకు. అప్పుడు చిత్ర గురించి ఎంతో బాధపడుతుంది. ఆమెను ఎవరు పెళ్ళి చేసుకుంటారని, కాని ఆనంద్ ముందుకొస్తాడు నేను చేసుకుంటానని. శేఖర్, హరిజన అమ్మాయి  ఆనంద్, చిత్ర పెళ్ళిళ్ళు ఒకేసారి జరుగుతాయి.

ఈ ఉమ్మడి కుటుంబంలోని అఖిల అనే అమ్మాయి వేరే మతం అబ్బాయిని పెళ్ళి చేసుకుంటుంది. ఈమె సినీపరిశ్రమలో పనిచేస్తుండగా యూసఫ్ అనే అతను పరిచయం అయ్యాడు. ఇతనికి ముందే పెళ్లై అనారోగ్య కారణాల వల్ల భార్య చనిపోతుంది. ఆమె హిందువు. వారు కూడా మత రహిత వివాహం చేసుకున్నారు. వారికి ఒక పాప ఉంది. ఆమె చనిపోయిన తర్వాత ఒంటరిగానే ఉంటున్నాడు. వారిమీద గౌరవం, ప్రేమ పెరిగి అఖిల అతన్ని పెళ్ళి చేసుకుంటుంది. ఇలా రకరకాలుగా పెళ్లిళ్ళు జరుగుతాయి.

నవలలోని చివరి సంభాషణ చూస్తే 'నవరసాలు' అనే పేరెందుకు పెట్టారో మనకు సులభంగా అర్థమవుతుంది. అంటే ఇందులో తొమ్మిదిమంది వివిధ రకాల బాధలను అనుభవించారు. వివిధ రకాల పెళ్ళిళ్ళు కూడా చేసుకున్నారు. "సుఖ దుఃఖాలతోను, నవరసాలతోను నిండినదే జీవితం. నా జీవితంలో అన్ని రసాలను అనుభవించాను. మన కుటుంబంలోని ఒక్కొక్కరు ఒక్కొక్క రసాన్ని కలిగించారు. నవరసాలను నేను చవి చూశాను." (హేమాదేవి, బొమ్మా. నవరసాలు. పుట: 195). అంటాడు కుటుంబ పెద్ద అయిన వీరందరి తండ్రి.

రజిని భర్త చంద్ర లేచి ఈ విధంగా అంటాడు. "మనింట్లో పెళ్ళిళ్ళు చాలా తమాషాగా జరుగుతూ వచ్చాయి. అయినా పెళ్ళిళ్ళు ఇంత నిరాడంబరంగా జరగడమే పొదుపు ప్రస్తుతం మన దేశీయులకు ఎంతో అవసరం. స్నేహితులు, ఆత్మీయులు, చుట్టపక్కాలు, బంధువులు– వీళ్ళెవరూ ఈ పెళ్ళిళ్ళకు వచ్చేందుకు సాహసించలేకపోయారు. వాళ్ళ సంస్కారానికి ఈ విషయం చాలా దూరంలో ఉంది. భయపడ్డారు. జడిసిపోయారు. పిరికితనంతో రాలేకపోయారు. వాళ్ళు అంతా రాలేకపోయినందుకు బాధగాలేదు కాని, ఎందుకు రాలేదో అర్థమై విచారంగా అనిపిస్తుంది. మన కుటుంబంలోని ప్రతివారు, ఎన్నో విషయాల్లో ఎన్నో ముందు అడుగులు ముందుకు వేశారు. అందరిలో ఇంత ధైర్యసాహసాలు ఉండేందుకు, పుట్టేందుకు కారకులు గౌరవనీయులైన మామగారు. వారి సాహసాన్ని అర్థం చేసుకునేందుకు ఎంతో సాహసించాల్సి వస్తుంది. వారి సహృదయతను, విశాల భావాలను గ్రహించే శక్తి కూడా సహృదయులు ఉన్నత భావాలుగల వారికే సాధ్యం అవుతుంది. బీదవాళ్ళు, గొప్పవాళ్ళు, అస్పృశ్యత, స్త్రీ, పురుష బేధం ఇన్నింటిని వారు ఎదుర్కొన్నారు. మనం ఇంకా ఎన్నో అవాంతరాలను, సంఘం కలిగించే ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పుడు మన సంఖ్య పెరిగింది. ఇంకా పెరుగుతుంది. క్రమంగా మన దేశంలో ఎందరో మామగారి లాంటి వ్యక్తులు ఉద్భవిస్తారు. అలాంటప్పుడు మనం ఎన్ని అవాంతరాలైనా ఎంతో ధైర్యంగా ఎదుర్కోగలుగుతాం. కొన్ని కొన్ని చిక్కులు

తప్పకుండా కలుగుతాయి. కాని మనం ఎందరమో ఉన్నాము. నిరాశ, నిస్పృహలతో మనకు అవసరం లేదు. మన బిడ్డలు మన ఆదర్శాలను, అభిప్రాయాలను, ఆశయాలను బలపరుస్తారు. ఇలాగే క్రమంగా మన దేశంలోని పక్షపాతం, సంకుచిత భావాలు, విభేదాలు అన్ని సమసిపోతాయి. భారతదేశం ఆదర్శప్రాయంగా నూతన తేజస్సుతో ప్రకాశిస్తుంది. ఆ కాలం సమీపంలోనే ఉంది."(హేమాదేవి, బొమ్మ. నవరసాలు. పుట: 195, 196). ఇటువంటి సందేశాన్ని నవరసాలు నవలలో బొమ్మ హేమాదేవిగారు ఇచ్చారు.

### 4.9. కుటుంబ సంబంధాలు

ఎక్కువమంది పిల్లలు ఉన్న పెద్ద కుటుంబం ఎలా ఉంటుందో 'బంగారు గూడు' నవలలో చూడవచ్చు. మధ్యతరగతికి కుటుంబానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి జీవితచిత్రణ ఇందులో ఉంటుంది. ఉన్నంతలో జీవితం చాలా సంతోషంగా సాగిపోతుంది. పిల్లలు తల్లిదండ్రులు ఎలా మసులుకోవాలి. ఎలా ప్రవర్తించాలనే విషయాలు ఈ నవలలో మనకు కన్పిస్తాయి. భార్య భర్తపై ఎంత మమకారాన్ని, ప్రేమను చూపిస్తుందో ఈ నవలలో చిత్రించారు. కుటుంబంలో పిల్లల్ని ఎలా పెంచాలో కూడా ఈ నవలలో చెప్పారు. ఇందులో తల్లి పాత్ర గాయత్రి పిల్లలకు తనకు తెలిసినంతలో చాలా బాగా గైడెన్స్ ఇస్తుంది. మీరు స్ట్రైకుల్లో పాల్గొన్నా, పరీక్షలకు చక్కగా ప్రిపేర్‌కాక కాపీ కొట్టడం లాంటి పనులు చేసినా, ఇక ముందు మీరు చదవాల్సిన అవసరం లేదు. మీ నాన్నకు డబ్బు ఖర్చు, నాకేమో అక్కడ ఆయనను  వదిలిపెట్టి మీ అందరికి ఈ చాకిరీ చేయటం ఇక ఉండవు. ఆడపిల్లలయితే మాకు చేతనైన సంబంధం చూసి వెళ్ళి పెళ్ళి చేసి పంపిస్తాం. మగవాళ్ళయితే సాధ్యం అయినంత తొందరగా ఉద్యోగాలు చూసుకోవాలి. అంతేకాని మీరు అడ్డగాడిదల్లా తిరుగుతామంటే మీకు మా సహకారం యెంతమాత్రం వుండదు. మీ చదువుకు సార్థకత ఉండాలి. మీరు నేర్చుకునే జ్ఞానానికి సరియైన విలువ ఉండాలి. అంతేగాని ఈ రకం చదువుల వల్ల మనిషి నుంచి పశువుకు మీలా దిగజారి పొతుంటే మాత్రం వెంటనే

చదువులు ఆపివేయటం చాలా అవసరం అని అంటుంది. అంటే పిల్లల్ని సరైన మార్గంలో నడిచేందుకు, కుటుంబం సంతోషంగా ఉండటం కోసం ఇల్లాలి తపన మనకు కనిపిస్తుంది.

"ఔను పక్షినించి మనిషి కొన్ని నేర్చుకోగలిగితే బాగుంటుంది అనిపిస్తుంది కొన్నిసార్లు. ముఖ్యంగా పక్షి తన పిల్లలకు రెక్కలు వచ్చేంత వరకు మాత్రమే తన గూటిలో తన పిల్లల్ని ఉంచుకుంటుంది. మనం కూడా సెంటిమెంట్స్ లేకుండా పిల్లల్ని అలాగే పెంచగలగాలి. పిల్లలు సోమరితనాన్ని వదిలి యుక్తవయస్సు రాగానే తమ బాధ్యతల్ని తెలుసుకోగలగాలి. రెక్కలు రాగానే పక్షిపిల్ల తన ఆహారాన్ని తానే సంపాయించుకుని తనూ ఓ కొత్తగూడు నిర్మించుకున్నట్టుగా మనిషి అట్లాగే ఉండగలగాలి ఋషి అన్నాడు."(హేమాదేవి, బొమ్మ. బంగారు గూడు. పుట: 208). పిల్లలు ఎదుగుతున్నా కొద్ది కుటుంబంలోని పనులకు సహకరించడం, వయస్సు వచ్చినా ఇంకా తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఎవరి దారి వారు వెతుక్కుని, బతుకుతెరువు ఏర్పాటు చేసుకోవాలి పక్షుల్లాగా. కాని ఇందులో ఓ చిక్కు వచ్చిపడింది. ఎవరి దారిన వారి వెళ్తే వృద్ధ తల్లిదండ్రులను ఎవరు చూసేదని. "ఆయన చెప్పినట్లు రెక్కలు రాగానే ఎగిరిపోతే ఇంట్లో ఉన్న ముసలి తల్లిదండ్రుల గురించేమిటి మరి? మనం పక్షులం కాము మనుషులం కాదా అంది కల్పన ఋషివైపు చిన్న ఎత్తుతో రుసరుస చూస్తూ. ఇప్పుడు మాత్రం ముసలి తల్లిదండ్రులను చూసుకునేవాళ్ళు ఎందరున్నారు? ముందుగానే తమ పిల్లల గురించి తెలుసుకుని ఉంటే పెద్ద మనుషులు వాళ్ళ భవిష్యత్తుకోసం ఏమయినా జాగ్రత్త పడగలరు. పిల్లల మీద అనవసరమైన ఆశలు పెట్టుకోరు. భంగపడరు. పైగా పిల్లలు ఎవరి బాధ్యతలు వాళ్ళు తెలుసుకుంటే తల్లిదండ్రులతో సహకరించినట్లే అన్నాడు ఋషి."(హేమాదేవి, బొమ్మ. బంగారు గూడు. పుట: 209). కని పెంచి పెద్దజేసి, మనకు ఏది కావాలంటే అది మన ముందుంచి మన భవిష్యత్తును కలగన్న తల్లిదండ్రులను మనం జాగ్రత్తగా కాపాడుకొని, వారిని బాధ్యతగా చూసుకోవాల్సి ఉంటుంది.

బొమ్మ హేమాదేవి రాసిన 'సంసార బంధం' నవలలో సంసారంలో పిల్లల్ని కనడం, సాకడం, ఇంటి పనులు చేస్తూ పిల్లల్ని, పెంచడం ప్రభుత్వ ఉద్యోగమైనా సరే నెలవారీగా డబ్బును పొదుపుగా ఖర్చుపెట్టడం వంటి విషయాలు కుటుంబాల్లో ఎలా ఉంటాయో పార్వతి, మహేశ్ దంపతుల పాత్రల ద్వారా చిత్రించారు. వీరికి అయిదుగురు పిల్లలు. సంసారంలో ఉన్న సాదక బాధకాలను పార్వతి కింది విధంగా చెప్తుంది.

"ఏమిటో? భార్యా, భర్త, పిల్లలు, సంసారం, జీవితం పుస్తకాల్లో ఉన్నంత మధురంగా, ఆకర్షనీయంగా అనిపించవు. నిజం చెప్పాలంటే 'నరకం' అంటే ఏమిటో అర్థం ఔతోన్నట్టు అనిపిస్తుంటుంది. అయితే ఈ మాట పైకి అనుకునే ధైర్యం, యిష్టం ఎవరికీ లేక అంతా అణచుకొని బ్రతుకుతున్నారేమో!

"సంపాదించలేక మగమనిషి, అతను తెచ్చిందాంట్లోనే సర్దలేక ఆడమనిషి రకరకాలుగా సతమతమౌతూ! అటు బ్రతకలేక, ఇటు చావలేక బ్రతుకుల్ని సాగదీస్తుంటారు. మళ్ళీ 'సంసారం' అంటే స్వర్గం అని, జీవితం అంటే 'మధురం' అని, ఎందుకంటుంటారో అర్థం అవదు. పోనీ సంసారంలో యిన్ని రకాల బాధలు, ఇంత యాతన ఉంటుందని సుఖం కన్నా దుఃఖం ఎక్కువ, సంతోషం కన్నా బాధ ఎక్కువ, అశాంతి తప్ప శాంతి లేదు అని అనుభావజ్ఞులు పెళ్ళికన్నా ముందు ఎందుకు చెప్పరో???"(హేమాదేవి, బొమ్మ. సంసార బంధం. పుట: 24).

సంసారాన్ని సముద్రంతో పోల్చారు. అంటే అంతటి విశాలంగా కుటుంబం ఉంటుంది. కావున దాన్ని కష్టమని పెద్దలు చెప్తుంటారు. ఎంత ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న కుటుంబంలో కూడా కలహాలు, కష్టాలు వస్తాయి. మధ్య తరగతి, బీద కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితుల వల్ల కష్టాలు ఏర్పడతాయి. సంసారాన్ని స్వర్గం, మధురం అని ఎందుకంటారంటే, ప్రేమ, ఆప్యాయతలు అందులో ఉంటాయి. కష్టాలు పడకుండానే మనకు కావాల్సినవి, ఇష్టమైనవి దొరకాలంటే దొరకవు కదా. ఎందులోనైనా కష్టాలు ఉండకుండా ఉండవు. కొన్ని సంసారాల్లో

కష్ట, సుఖాల్లో హెచ్చుతగ్గులు ఉండవచ్చు. కాని అసలే కష్టాలు లేకుండా నిత్యం సుఖవంతంగా స్వర్గంలో ఉన్నట్టు సాగిపోవడం కుదరదు. అదే జీవిత రహస్యం. కష్టాలుంటాయని సంసార జీవితంలోకి అడుగుపెట్టకపోతే ఒంటరిగా మిగిలిపోవాల్సి ఉంటుంది. సంసారంలో ఉన్న అనుభూతులు అందుకోలేం. సమాజ సృష్టి జరగదు. రోజుకింతా క్షీణించే అవకాశం ఉంటుంది.

'సంసార బంధం' నవలలో మరో విషయం గమనించవచ్చు. సంసారంలో భార్య లేదా భర్త అక్రమ సంబంధాల్లాంటివి పెట్టుకుంటే ఇద్దరిలో ఎవరికైనా సిగ్గుగా, బాధగా, కోపంగా ఉంటుంది. కాని ఇందులో అలాంటివి ఏమీ కనిపించవు. జరిగే విషయాలను నెమ్మదిగా గమనించే మనస్తత్వం గల గృహిణి పార్వతి. ఆమె భర్త మహేశ్, అతని మేన మరదలుతో సన్నిహితంగా ఉంటుండేవారు. వారిద్దరినీ కొంత అనుమానిస్తూ ఉండేది. కాని గొడవలకు దిగేది కాదు. ఆమె మాటల్లో "రోజులు ఎంతో భారంగా గడిచిపోతున్నాయి. స్త్రీ పురుషున్ని, పురుషుడు పరస్త్రీని ఈ విధనాల్లో ఒకరిని ఒకరు ఎలా తాకగలుగుతారు? ఆ సుఖాలన్నీ ఎలా అనుభవించగలుగుతారు, అన్న విషయాన్నే ఈ తొమ్మిది రోజులు రకరకాలుగా యోచించాను. సిగ్గు వేయదా? మనస్సు అంగీకరిస్తుందా అన్నీ ఈ రకమైన ప్రశ్నలే! ఒక్క ప్రశ్నకు సరైన సమాధానం దొరికింది కాదు. మరీ చికాగ్గా ఉన్నప్పుడు పిల్లలతో ఆడుకునేదాన్ని లేదా, వాళ్ళు చేస్తున్న అల్లరిని చూస్తూ అన్నీ మరచిపోయే ప్రయత్నం చేయటం జరిగేది."(హేమాదేవి. బొమ్మ. సంసార బంధం. పుట: 230, 231). చివరకు ఇదంతా నాటకం అని తెలుస్తుంది. మహేశ్ వాళ్ళ అమ్మ, అత్తగారు పార్వతిని అనుమానించడం, తిట్టడం మొదలైన కారణాల వల్ల మహేశ్, అతని మరదలు ప్రతిమ ప్రేమించుకున్నట్టు, దగ్గరగా ఉన్నట్టుగా నటించారు. ఆ విషయం పార్వతికి తెలియదు. కనుక కొంత అనుమానం, కొంత భర్తపై నమ్మకంతో వారిని ప్రశ్నించలేకపోయింది. ప్రధానంగా దాంపత్యంలో నమ్మకాలు, ప్రేమ, అభిమానం ఉండాలే తప్ప అనుమానం ఉండకూడదు. అప్పుడే దాంపత్య జీవితం కుటుంబ గౌరవం పెరుగుతుంది. మహేశ్, ప్రతిమ నాటకం ఆడినట్టు తెలిసిన తర్వాత ఎందుకు నాటకం ఆడారు అని అడిగితే,

మహేశ్ "ప్రతిమ అప్పుడు ఇప్పుడు, ఎప్పుడూ కూడా నాకు చెల్లెలితో సమానమే. ఐతే ప్రతిమ ఇక్కడికి వచ్చాక, ముఖ్యంగా మనింట్లోనే వుండిపోవడం జరిగాక, ఆమె ప్రవర్తనలో మార్పు కనిపించసాగింది. ఐతే ప్రతిమ ఏ రకందో నాకు తెలియంది కాదు. అలాంటప్పుడు ఆ మార్పుకు కారణం యోచిస్తే ప్రతిమ స్వభావం, అలవాట్లు జ్ఞాపకం వచ్చాయి. ఆమెకు జీవితాలతో ఆడుకోవడం, చిన్నతనంనుంచి బాగానే చేతనవుతోంది. అదో అలవాటు కూడా. అలాంటిదే ఏదో యిక్కడ ఆరంభం ఐనట్టు పసికట్టాను. అయితే ఎందుకా అని కల్పించుకుందో, మొదట్లో అర్థం కాలేదు. కొంత శ్రమ, ప్రయత్నం తరువాత మా అమ్మకోసం ఏదో చేస్తుందని అర్థం చేసుకున్నాను. మొదట్లో నువ్వు, ప్రతిమ ఇద్దరూ కలిసి చేస్తున్నారా ఈ పని అనిపించింది. అదేమిటో చూద్దాం అన్న ఉత్సాహం, శ్రద్ధకూడా పుట్టాయి. పోతే ప్రతిమ ఉద్దేశం అర్థం అయ్యాక మాత్రం మా అమ్మ గురించి కొంత యోచించడం మొదలుపెట్టాను. ఈ లోపలే ఈ నాటకానికి ఎలాటి సంబంధం లేదన్న విషయం కూడా దృఢపర్చుకున్నాను. ఐతే నీ గురించి ఏమైనా తెలుసుకోవాలన్న ఉత్సాహం మాత్రం అలాగే ఉండిపోయింది. ఆ ఉత్సాహం ఏదో చెడు ఉద్దేశంతోగాని, అనుమానంతోగాని పుట్టింది కాదు. ప్రతిమ నాటకానికి లొంగిపోయినట్టుగా ఉండాలంటే నీకు దూరంగా కొంత తప్పుకోందే పని జరుగదాయె! అందుకోసం ప్రతిమ నాటకంలో పాల్గొంటూనే, అటు 'నువ్వు' అంటే ఏమిటో అర్థం చేసుకునే గొప్ప అవకాశం చిక్కింది."(హేమాదేవి, బొమ్మ. సంసార బంధం. పుట: 237, 238).

మహేశ్‌కు కూడా ప్రతిమ నాటకం ఆలస్యంగా అర్థం అయ్యింది. ఆ విషయాన్ని పార్వతితో చెప్పకపోవడానికి కారణం ఏమంటే పార్వతీ ఎలా స్పందిస్తుందో తెలుసుకోవాలని చెప్పలేదు. మొత్తానికి మహేశ్ వాళ్ళ అమ్మ కూడా వాస్తవ ప్రపంచంలోకి రావడం. అంటే మహేశ్ వాళ్ళ అమ్మ పార్వతిని మెచ్చదు. ఎప్పుడూ తిడుతూ ఉంటుంది. ప్రతిమను మహేశ్ పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది. అప్పుడు ప్రతిమ నాటకమాడుతూ మహేశ్‌ను ప్రేమిస్తూ పెళ్ళి విషయానికి వచ్చేసరికి, మహేశ్ అమ్మగారి ముందర ఇలా అంటుంది. ఇప్పుడు పార్వతి

అక్కయ్యను వదిలి నన్ను చేసుకుంటానంటున్నాడు, మరి కొద్దిరోజుల తర్వాత నేను నచ్చకపోతే మరొకరిని ఇష్టపడదని నమ్మకం ఏమిటని అంటుంది. అప్పుడు మహేశ్ వాళ్ళ అమ్మ మౌనంగా ఉంటుంది. అప్పుడు ఈ నాటకానికి తెర పడుతుంది. ఈ నాటకం వల్ల మరో మేలు కూడా జరిగింది. మహేశ్, పార్వతిలు ఒకరికొకరు మరింతగా అర్థం చేసుకోవడానికి ఈ నాటకం పనికివచ్చిందని చెప్పవచ్చు.

పార్వతి చదువుకునే రోజుల్లోని మిత్రుడు శంకర్, మహేశ్ ఉద్యోగం చేసే దగ్గర స్నేహితులు. శంకర్ ఒకసారి వీరింటికి వచ్చాడు. ఈమె కూడా శంకర్ వాళ్ళ అమ్మను చూడటానికి వాళ్ళింటికి వెళ్ళి వస్తుండేది. మహేశ్ కూడా వారిద్దరినీ అర్థం చేసుకున్నాడే తప్ప అపార్థం చేసుకోలేదు. "శంకర్ గురించి అత్తగారు నన్ను అన్నిరకాల మాటలు అంటున్నప్పుడు వింటూ మీరు ఎలా ఊర్కోగలిగారూ? ఎందుకు ఊరుకున్నారూ? అబద్ధం అని తెలిశాక వూరుకోక ఇంకేం చేస్తాను పారూ! అన్నీ తెలియనట్టు అడుగుతున్నావ్? ఈ సంఘటనల వల్ల పిల్లలకెంత బాధ, ఇబ్బంది కలిగాయ్? ఆ లేత మనస్సులకు ఎంత నొప్పి కలిగిందో మీకేమైనా తెలుసా? కొంచెం కొంచెం... ఇప్పుడు మీకేమీ బాధగా లేదా?

లేదు ఎంతో సంతోషంగా ఉన్నాను. సంసారాల్లో ఈ రకంగా ఎన్నీ జరుగుతూ ఉంటాయి. మన సంసారంలో నాటకంగా మాత్రం జరిగింది. అందుకు నా అదృష్టాన్ని నేను అభినందించుకుంటున్నానో"(హేమాదేవి, బొమ్మ. సంసార బంధం. పుట: 239, 204). మొత్తంగా సంసారంలో ఎన్నో ఒడిదొడుకులు ఉంటాయి. వాటిని సంయమనంతో అర్థం చేసుకొని ముందుకు సాగిపోవాలే తప్ప ఆవేశపడకూడదు.

## 4.10. ప్రేమ

సమాజంలో ప్రేమ పలు రకాలుగా వ్యక్తం అవుతూ ఉంటుంది. తల్లి పిల్లల మధ్య, అన్నదమ్ముల మధ్య, అక్క చెల్లెల్ల మధ్య, ప్రేయసి ప్రియుడుల మధ్య మొదలైన కుటుంబ సభ్యుల, బంధుల మధ్య కూడా ప్రేమ సంబంధాలు కొనసాగుతుంటాయి. విజేత నవలలో మేడిచర్ల ప్రభాకరరావుగారు ప్రేమ గురించి చెప్తూ ఎక్కడ ప్రేమ ఉంటే అక్కడ అభిమానులు ఉండటం సహజం. కారణం ప్రేమ తత్త్వానికి ఉన్న సుగుణమది. ప్రేమ ఒక మధుర సుధ లాంటిది. అంతేగాదు అది అక్షయమైనది కూడా. ఎవరికైనా పంచవచ్చు. ఎంతైనా పంచు కొరత ఏర్పడదు. వృద్ధికి ఆటంకం కలుగదు. ఎందుకంటే ప్రేమ దైవ సంబంధమైనది. ఆ గుణం పుణ్యాత్ములకు మాత్రమే దక్కుతుంది. ఒకసారి వారితో సంబంధం ఏర్పడితే చాలు కలకాలం నిలిచిపోతుంది. అందుకే మన పూర్వీకులు ప్రేమ తత్త్వానికి అత్యధిక ప్రాధాన్యాన్ని ఇచ్చారు. ప్రేమ మానవులను ఏ సాధన లేకుండా బంధిస్తుంది. అందుకే మన భారతీయులు ప్రేమాభిమానాలకు ప్రాధాన్యతను సంతరింపజేశారు. ప్రేమ భావానికి బంధుత్వంతో సంబంధం లేదు. కులమత బేధం లేదు. చిన్నా పెద్ద బేధము లేదు. ప్రేమభావ సంపద కలవారిని ఏ అష్టైశ్వర్యాలతో కొలువలేము. వీరే అమరులుగా కీర్తించబడతారు. ఎక్కడ అమరులుంటారో అక్కడ అసురులు కూడా ఉంటారు. ఈ ప్రేమకు పరశత్రువు స్వార్థం. ఈ స్వార్థం పంచడానికి వీలు లేనిదని వివరించాడు.

సిరిగాద శంకర్ రాసిన 'స్వేచ్ఛా విహంగాలు' నవలలో ఉన్న ప్రేమ ప్రేయసి ప్రియుల మధ్య ప్రేమ. "ప్రేమ ప్రపంచ వైశాల్యాన్ని కుదించివేస్తుంది. నిద్రను ఆహారాన్ని మానిపిస్తుంది. ఎలాంటి హద్దులను కూడా లెక్కచేయదు. చావును పణంగా పెడుతుంది. అందుకేనేమో దాన్ని ప్రేమా అన్నారు. ప్రేమ గుడ్డిది అంటారు. ప్రేమికులు ఎవరి మాట చెవికెక్కించుకోరు. కులమనదు, మతమనదు, ఎవ్వరెన్ని అడ్డంకులు సృష్టించినా ఎదురిస్తారు. కొందరు పెళ్ళి చేసుకొని కలకాలం సుఖంగా ఉంటారు. కొందరైతే ప్రేమ మోజు తీరగానే నీవు ఏటిలో, నేను గూటిలో అని అంటూ, మరికొందరు కోర్టుల చుట్టూ విడాకుల కొరకు వారి జీవితాన్ని నాశనం

చేసుకుంటారు. మరికొందరు తమ ప్రేమకు అడ్డం వచ్చిన వారిని అడ్డంగా నరకడానికి వెనకాడరు. కొందరు అమ్మానాన్నలను బాధలను భరించలేక వారు చూసిన వారిని పెళ్ళి చేసుకొని తెరవెనుక నాటకాలను మాత్రం ఆడుతుంటారు. ఆ కోవకు చెందినదే ఈ కథ."(శంకర్, సిరిగాద. స్వేచ్ఛా విహంగాలు. పుట: 1) ప్రేమ ఎంతవరకు దారి తీసిందో, తద్వారా ఎటువంటి పరిణామాలు ఏర్పడాయో మొదలైన విషయాలను ఈ నవలలో మనం చూడవచ్చు.

ఇందులో రమ, ప్రవళిక ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. రమ చదువుకొని హైదరాబాదులో ఉద్యోగం చేస్తుంది. అక్కడ మధు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. వీరు పెళ్ళి చేసుకోవడం కోసం పెద్దలను సంప్రదిస్తారు. కాని కులాలు వేరవడంతో వారి ఇద్దరి తల్లిదండ్రులు ఈ పెళ్ళికి ఒప్పుకోరు. రమ ఏమీ చేయలేక తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్ళే చేసుకుంటుంది. కాని రమ ప్రేమించిన వ్యక్తితో పెళ్ళి జరగకపోవడాన్ని జీర్ణించుకోలేక పోతుంది. ఒక ఉపాయం ఆలోచించింది. తన బాల్య మిత్రురాలు ప్రవళిక, తాను ప్రేమించిన వ్యక్తి మధుది ఒకే కులం. వారిద్దరికి ఎలాగైనా పెళ్ళి కుదుర్చాలని అనుకుంటుంది. కారణం ప్రవళిక చదువులో తెలివైన అమ్మాయే కాని. అమాయకపు పల్లెటూరి అమ్మాయి. మధుతో ప్రవళిక పెళ్ళి చేస్తే "వారిద్దరికి వివాహము చేసి ప్రవళికను కలిసే సాకుతో మధు ఇంటికి పోవచ్చు, రావచ్చు. తన కోరికలు యథాతథముగా తీర్చుకోవచ్చునని ఆలోచించింది."(శంకర్, సిరిగాద. సేచ్ఛా విహంగాలు. పుట: 2). మొత్తానికి వారిరువురికి పెళ్ళి చేసింది. ప్రవళికను మధు కనీసం తాకడు. తర్వాత మధుతో రహస్యంగా శృంగార కోరికలు తీర్చుకునేది రమ. ఇవన్ని కొనసాగించడం కోసం మెట్రిక్యులేషన్ వరకే చదివి మానేసిన ప్రవళికను బయటకు పంపడం కోసం ఒక ఉపాయం ఆలోచించి ఓపెన్ డిగ్రీ చేయిస్తుంది. ఆమె ఆదివారం కాలేజీకి వెళ్ళిన తర్వాత రమ వీళ్ళ ఇంటికి వచ్చి మధుతో శృంగార జీవితం గడిపేది. ప్రవళిక మాత్రం చదువుపై శ్రద్ధతో డిగ్రీ ఎక్కువ మార్కులతో పాస్ అయ్యింది. తర్వాత ఐ.ఏ.ఎస్ పాస్ అవుతుంది. ఒకనాడు రమ భర్త

ప్రమాదంలో చనిపోతాడు. అప్పుడు ప్రవళిక అన్ని విధాలుగా ఆలోచించి రమ, ప్రవళిక పెళ్ళి చేస్తుంది. "నాకు మంగళసూత్రం, బొట్టు కావాలి. నీకు నా భర్త కావాలి. దానికి నేను ఇన్నాళ్ళు అడ్డుగా ఉన్నాను. ఇప్పుడే నేను మధ్య అడ్డుగా ఉన్నా నేడు తొలిగిపోతున్నాను. ఇవి నేను కోపంతో అంటున్న మాటలు కాదు. నేను హృదయపూర్వకంగా అంటున్నాను. నేను ఏ పూరి గుడిసెల్లోనో ఉండే మట్టి పని చేసేవాడికి ఇల్లాలుగా ఉండి ఎన్నో కష్టాలు అనుభవించేదానిని. కాని నువ్వు నన్ను పూలపందిరి కింద ఉండేలా చేశావు. మెట్రిక్యులేషన్‌తో ఆగిపోయిన నా చదువును ఐ.ఎ.ఎస్. వరకు ఎదగాడానికి, నా భర్తకు నచ్చజెప్పి, నా చదువు కొనసాగేటట్లు చేసినావు. ఈ రోజుల్లో ఎక్కువ మంది మగాళ్ళు తనకంటే తన భార్య ఉన్నత చదువులు చదవవద్దని, తనకంటే పెద్ద చదువులు చదివితే, తన పెద్దరికం పోవునని ఇష్టపడరు. కాని నా భర్త నా చదువుకు ఆటంకం కాలేదు. నీవు ఇన్నాళ్ళు అడుగుడుగునా అతనితో కలిసి ఉన్నావు. ఎన్ని లక్షలిచ్చిన ఈ రోజుల్లో కిడ్నీ ఇచ్చేవారు లేరు. నీ ప్రాణానికి తెగించి, నీ కిడ్నీ మావారికి ఇచ్చి, నా పసుపు కుంకుమలు కాపాడావు. నీవు పసుపు కుంకుమ లేకుండా ఉండి మా వారితో విచ్చలవిడిగా తిరిగడం వల్ల లోకులు కాకులై కూస్తున్నారు. ఎన్నాళ్ళు ఈ తెరచాటు నాటకాలు. చిన్ననాడు మనం ఒకే పల్లెంలో తినేవాళ్ళము. ఒకే చాక్లెట్‌ను కాకి ఎంగిలని ఒకరి ఎంగిలి ఒకరం తినేవాళ్ళము. ఒకరికి ఏదైనా కష్టం వస్తే ఒకరం బాధపడేవాళ్ళము. ఒకరి డ్రెస్సులు ఒకరము వేసుకొని ఫంక్షన్‌లకు వెళ్ళేవాళ్ళము, ఇది నాదీ, ఇది నీదీ అని ఏదీ లేకుండా బ్రతికిన వాళ్ళము. ముఖ్యంగా మేము పేరుకు మాత్రమే భార్యాభర్తలము కాని ఒకనాడు కూడా మాకు ఆ....... సంబంధం లేదు. అతన్ని నీవు, నిన్ను అతడు మనసా వాచా ప్రేమించుకున్నారు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోతున్నారు. కాబట్టి నేను కాని, ఇతర బంధువులు కాని ఎంత కాదన్నా ఒకరిని విడిచి ఒకరు బ్రతకలేరు. నన్ను ఎవ్వరు ఏమన్నా ఈ లోకంలో నేను చేసే పని తప్పన్నా నేను బాధపడను. రమా! నీవు చేసిన మేలుకు నా భర్తను ఇష్టపూర్వకంగానే నీకు బహుమతిగా ఇస్తున్నాను." (శంకర్, సిరిగాద. స్వేచ్ఛా విహంగాలు. పుట: 115, 116). ఇలా రమ, మధుల పెళ్ళి చేస్తుంది ప్రవళిక. వారి ప్రేమను అర్థం చేసుకున్న ప్రవళిక తన భర్తను త్యాగం చేస్తుంది.

రమ చేసింది మాత్రం ప్రేమ త్యాగం కాదు. ఒక విధంగా తన అవసరం కోసం ప్రవళికను మోసం చేయడమే అవుతుంది. ప్రవళికకు చదువు విషయంలో అనుకోకుండానే కోరిక నెరవేరుతుంది. రమ లాంటి వాళ్ళు చేసే పనుల వల్ల కుటుంబాలు చెల్లచెదురై కూలిపోతాయి.

మేడిచర్ల ప్రభాకరరావు 'కావేరి కళ్యాణం' నవలలో స్త్రీలు ప్రేమించే రకాలు ఎన్నో తెలియజేస్తాడు. స్త్రీలు మూడింటిని చూసి మూర్ఖంగా ప్రేమిస్తారని అంటాడు. వారి ప్రేమ అదుపు చెయ్యటానికి ఉండదు. మొదటిది ఆస్తి అంతస్తులను అనుభవించాలనుకునేవారు. రెండోది పదవి హోదాను చూసి, మూడు ఏదో తెలియని ఆకర్షణకు లోనై పోతారు. అందాన్ని, ఆకారాన్ని చాలా తక్కువమంది చూస్తారు. స్త్రీ అందాన్ని తనలోనే చూసుకొంటుంది. ఈ మూడు రకాల ప్రేమికులే భంగపడి దుఃఖాన్ని అనుభవిస్తారు. మిగతావారు ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతారని అంటాడు.

"ప్రేమ జీవితాలను నాశనం చేయదు. సంసారాల్లో చిచ్చు పుట్టించదు. మీలో వున్నది ప్రేమ కాదు. రుమాదేవి! మధ్యలోనే కొంచెం గట్టిగా పిల్చి 'రుమాదేవీ! సంకుచితమైన దృష్టితో స్వార్థబుద్ధితో ప్రేమను చూచేందుకు ప్రయత్నించకండి. అలా చూస్తే మీకది కనిపించదు. పోతే నా రాక మిమ్మల్ని ఎంతో బాధించినట్టుంది. కాని, నాకు తెలియకుండానే ప్రతిసారి యిక్కడికి నా శరీరం తనంతట తానే వస్తుంది. అయితే నా వల్ల పొరపాటే జరిగిందేమో! వెళ్ళొస్తా రుమాదేవి! మళ్ళీ తప్పకుండా కల్సుకుంటాను. కాని, ఎప్పుడో నాకు తెలియదు. ఆ కలయికకు కాలంతో నిమిత్తం లేదు. సుఖ శాంతులకు అడ్డు రావాలన్న ఉద్దేశం లేకుండానే నా వల్ల ఆ పని జరిగినందుకు విచారిస్తున్నాను. వీలైతే క్షమించండి... నా ముఖం చూస్తూనే ఈ మాటలని, అకస్మాత్తుగా కుర్చీపైనుండి లేచి బైటకు నడిచారు కమల్‌బాబు. నేను ఆయన వెళ్ళినవైపే చూస్తూ నిలుచున్నాను."(హేమాదేవి, బొమ్మ. తరంగాలు. పుట: 133)

ఈ 'తరంగాలు' నవలలో నవలత, రుమా పెళ్ళిళ్ళు జరిగేకంటే ముందే చంచల్‌బాబుతో నవలత పెళ్ళి నిశ్చయమవుతుంది. రుమా వివాహం కమల్‌బాబుతో నిశ్చయమవుతుంది. కమల్‌బాబు ఎప్పుడూ ఎక్కడికి పెళ్ళి చూపులకోసం వెళ్ళలేదు. కాని ఇక్కడికి కుటుంబ సభ్యుల బలవంతాన వచ్చాడు. అప్పుడే కమల్‌బాబు రుమాను పెళ్ళిచూపుల్లో చూడగానే ఇష్టపడి, చాలా చనువుగా మాట్లాడతాడు. ఇష్టమైతే నీకు ఉంగరం కూడా తొడుగుతానంటాడు. లేదా నీవే తొడగమంటాడు. రుమాకు పుట్టినరోజు కానుకగా ఆమె తండ్రి బహూకరించిన ఉంగరాన్ని కమల్‌బాబుకు తొడుగుతుంది. చంచల్‌బాబు వాళ్ళు, రుమా, నవలత వాళ్ళ తల్లిదండ్రులు కూడా పెళ్ళి పనులు చేసుకుంటూ పెళ్ళికి సిద్ధం అవుతున్నారు. కాని కమల్‌బాబు వాళ్ళ నుంచి మాత్రం ఏ సమాచారం లేదు. చివరకు ఉత్తరం రాస్తే ఒకసారి ఆరోగ్యం బాగాలేదని ప్రత్యుత్తరం వస్తుంది. ఇంకా చాలా రోజులే ఎదురుచూశారు. కాని ఎటువంటి సమాచారం లేకపోయేసరికి, రుమాకు వేరే సంబంధం చూస్తాడు చంచల్‌బాబు. అప్పుడు నిర్మల్‌బాబుతో వివాహం అవుతుంది. నిర్మల్–రుమా పెళ్ళి తర్వాత హైదారాబాద్ వెళ్తారు. అక్కడ నిర్మల్ ఉద్యోగం చేసే దగ్గర కమల్‌బాబు కూడా ఉద్యోగం చేస్తుంటాడు. కాని నిర్మల్‌బాబుకు, రుమాకు పెళ్ళి సంబంధం కాయమైనట్టు ఏమీ తెలియదు. అతడు రుమ వివాహం నాతో కాకుండా వేరొకతో జరగడం, రుమాను ఇతడు అత్యంత అమితంగా, విరహ వేదనతో ఒకవైపు నుంచే (వన్‌సైడ్ లవ్) ప్రేమించడం చేస్తున్నాడు. మనసు కకావికలం చేసుకుంటూ రుమా మరచిపోలేక, వేరొక అమ్మాయిని పెళ్ళి చేసుకోలేక నరకయాతన అనుభవిస్తూ, చాలా ఇబ్బందులు పడుతూ బ్రహ్మచారిగానే తిరుగుతున్నాడు. కమల్ గురించి నిర్మల్ రుమాతో చెప్తున్న సంభాషణను చూస్తే అర్థం చేసుకోవచ్చు. రుమాను కమల్ ఎంతగా ప్రేమించాడో. "ఇంకా పెళ్ళి చేసుకోలేదా? ఔను రుమా! ప్రేమ ఫలించలేదు. పెళ్ళి ఆగిపోయింది. హృదయం చితికిపోయింది. చితికిన ఆ హృదయపు తునకల్ని చేతిలో ఉంచుకొని నవ్వుకోబోతాడు. కాని, ఆ పని మానవునికి సాధ్యం కాదు. తనకు తాను మర్చిపోయేందుకు ఎన్నో విధాల ప్రయత్నిస్తాడు. త్రాగుతాడు. జూదం ఆడ్తాడు. కాని, రుమా! తెల్లవారగానే మళ్ళీ అదే ఆవేదన అలుముకుంటుంది.

మనిషి చాలా విశాలమైన భావాలు, ఉన్నతమైన ఆశయాలు కలవాడు. అతన్ని చూస్తే ఒక్కోసారి చేతులెత్తి నమస్కరించాలని అనిపిస్తుంది. అసలు అతను ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏమీ లేదు. పెద్దల ఆస్తి ఎంతో ఉంది. కాని, అతను ఉద్యోగం చేస్తూ ఎంతోమంది అభాగ్యుల్ని ఎన్నో రకాలుగా ఆదుకుంటుంటాడు. ఈ ఇరవై రోజుల్లో అతను నన్ను ఎన్ని విధాలుగా ఆకర్షించుకున్నాడో చెప్పలేను. మా ఇద్దరిలో ఏదో తెలియని ఆత్మీయత అకస్మాత్తుగా మొలకెత్తి విచిత్ర రీతిలో అభివృద్ధి పొందింది. ఓ రోజు నేనే అడిగాను. ఇంకా పెళ్ళెందుకు చేసుకోలేదూ? అని. ఆమె నాపై అలిగి దూరమైపోయింది అన్నాడు కొంచెం గట్టిగా నవ్వుతూ. 'పెళ్ళికి మీరు సరైన ప్రయత్నం చేయలేకపోయారా? అన్నాను. 'ఎలాంటి ప్రయత్నం నిర్మల్‌బాబూ! భగవంతుని ఆజ్ఞ ముందు మానవుని ప్రయత్నం ఆగిపోకుండా చూచాను. అయినా, ప్రయోజనం లేకపోయింది. నా కోరికలు, ఆశలు అడుగంటి పోయాయి. నిర్మల్‌బాబూ! పోతున్నామని ఘోషిస్తున్న నా ప్రాణాలు కూడా నిలిచిపోయాయి. చివరి మాటలంటూ నవ్వబోయి నవ్వలేకపోయాడు. 'మీ కథంతా వినాలని వుంది, అభ్యంతరం లేకపోతే చెప్పండి' ఏదో ఆత్మీయత కొద్దీ అడిగాను."(హేమాదేవి, బొమ్మ. తరంగాలు. పుట: 111, 112). అంటే కమల్‌బాబు రుమాను ఎంతగా ప్రేమించాడో తెలుస్తుంది. తనకు తాను ఎవనిరి ఇష్టపడని, పెళ్ళంటే అయిష్టంగా కమల్ రుమాను చూడగానే అప్పటికప్పుడే ఇష్టపడి, పెళ్ళి చేసుకుంటావా నన్ను అని అడిగి, రుమాను నీకు నేను ఇష్టమేనా అని అడిగి ఉంగరం తొడిగించుకున్నాడు. అదేవిధంగా ఏడెనిమిదేళ్ళుగా రుమాకోసమే తపిస్తూ పిచ్చివానిలా తయారవుతున్నాడంటే అతని స్వచ్ఛమైన ప్రేమను చూడవచ్చు.

హేమాదేవి రాసిన 'ప్రేమంటే' నవలలో తాను ప్రేమించిన మనిషిని త్యాగం చేసి, అబ్బాయే అయినా అమ్మాయి లక్షణాలతో పెరిగిన వరుడిని పెళ్ళి చేసుకోవడం. అదేవిధంగా తాను ప్రేమించిన మేనభావనే పెళ్ళి చేసుకొని తాను హాయిగా ఉంటే తన అక్కలకు పెళ్ళిళ్ళు కావు. కాబట్టి అమ్మాయి లక్షణాలతో పెరిగిన వరుడితో పెళ్ళికి ఒప్పుకుంటుంది. తనకంటే

ముందుపుట్టిన అక్కలు ముగ్గురు, తాను పెళ్ళి చేసుకోబోయే అబ్బాయి వాళ్ళ అన్నయ్యలు ముగ్గురు ఉన్నారు. వీళ్ళంతా ఒకే ఇంటి వారిని పెళ్ళిళ్ళు చేసుకుంటారు. అలా పెళ్ళి చేసుకున్న తర్వాత తన అక్కలు అందరూ బాగానే ఉన్నా తాను మాత్రం అమ్మాయి లక్షణాలతో ఉన్న తన భర్తను తన వివేకంతో క్రమక్రమంగా మార్చుకోగలిగింది.

"మరిదిగార్ని చాలా తొందరగా మార్చావ్. మేమందరం ఎంత సంతోషపడుతున్నామో చెప్పలేను. ఇంతకూ ఈ పని నీకెలా సాధ్యం అయింది?

మనకు సాధ్యం కాంది ఏముంటుందక్కా? మనస్సు, అంగీకారం, మనోబలం, ఆత్మ విశ్వాసం, కృత నిశ్చయం వుండాలిగాని!

మంచి జరిగిందేమో కాని, ఇలాటి సాహసాలు ప్రతిసారీ మంచివికావు. ఎన్నో అనర్థాలకు గురికావాల్సి వస్తోంది ఒక్కొక్కసారి. అందరూ అనుకున్నట్టుగా విష్ణు మగమనిషి కాకపోతే, జీవితమే నాశనం అయిపోయేది. ధీర్ఘంగా, బరువుగా వూపిరి పీల్చుకుంటూ అంది.

అన్నింటికి ప్రతిఫలం ఆపేక్షించడమే అయితే, జీవితంలో జీవం ఏముంటుందక్కా? నవ్వుతూ అన్నాను. ఏమైనా అపాయకరమైన మనస్తత్వంగలదానివి. జీవితంపై ఇంతపెద్ద రిస్క్ తీసుకోవడం వివేకమైన పనేమీ కాదు. నేను అకస్మాత్తుగా ఏమీ నిర్ణయించుకోలేదు. ముఖ్యంగా వారి డైరీ చదవడం ముందు జరిగింది. అందులో శారీరకంగా వారి వుద్రేకాన్ని వర్ణించుకున్నారు. అంతేకాదు అనుకోని విధంగా వారి పరిచయం నాకు వారి కౌగిటిలో కలిగింది. అప్పుడు నేను కొంతవారిని గుర్తించగలిగాను. అయితే, నువ్వు అనే రిస్క్ కు కొంత మార్జిన్ వదిలాను. అయినా మనస్సు తన అంగీకారాన్ని తెల్పుతూ, తన బలాన్ని వాడుకోమంది. ఆత్మ తన విశ్వాసాన్ని ప్రకటితం చేసింది. అంతే! నేను నిశ్చయం చేసుకున్నాను."(హేమాదేవి, బొమ్మ. ప్రేమంటే. పుట: 114, 115)

ప్రేమంటే ఏమిటో 'ప్రేమంటే' ఈ నవలలోని పాత్రల ద్వారా తెలియజేశారు రచయిత్రి. "చందా ఏదో అడగబోయింది. రాధా పిలుపు వినిపించింది. అదో మీ బావ వచ్చాడు. నేను వెళ్తున్నాను. నవ్వుతూ అంటూ చందా వెళ్ళిపోయింది. బావ గదిలోకి వచ్చి...ఉదయం నుంచి యింకా మీ కబుర్లే కాలేదా? రాత్రి తొమ్మిది అయింది అన్నాడు కొంచెం అలసటగా కుర్చీలో కూర్చుంటూ నిన్ను తాల్ అని పిలువాలనిపిస్తోంది. వెక్కిరిస్తూ అన్నాను. నీ యిష్టం రాధా! నువ్వు ఎలా పిలిచినా నాకు సంతోషమే. ప్రేమకు పిలుపులతోను, వలపులతోను ప్రమేయం లేదు రాధా! ప్రేమంటే...? కొంటెగా ప్రశ్నించాను. 'జన్మ జన్మలకు జీవాత్మలతో ఆనందాన్ని అనుభవించేదే ప్రేమ... ముందు జన్మలో నీ ఆత్మను నేను సొంతం చేసుకున్నాను. ఈ జన్మలో నీ సర్వస్వాన్ని నేను పొందగలిగాను. జన్మజన్మలకూ నిన్నే ఆరాధిస్తాను. నువ్వు దూరమయితే, నీ కోసం తపస్సు చేసి, సాధిస్తాను. ఈ అనిర్వచనీయమైన అనుబంధానికి మారు పేరే 'ప్రేమ' తెలిసిందా? అన్నాడు భావ. ఊఁ! అన్నాను తన్మయత్వంతో. ఏదీ ఇలారా! రెండు చేతులు చాస్తూ పిలిచాడు. నేను రెండు కళ్ళు బాధగా భారంగా మూసుకున్నాను. వారి రూపం కళ్ళల్లో కదులూ మాయమైంది. నేను ముందుకు నడిచి, భావ చేతుల్లో వాలిపోయాను."(హేమాదేవి, బొమ్మ. ప్రేమంటే. పుట: 142).

మానవ జీవితంలో జన్మలు అనేవి ఉన్నా, లేకున్నా 'జన్మజన్మల బంధం' అంటారు. ఈ నవలలో ప్రేమకోసం ఒక జన్మ వెళ్ళిపోయి మరో జన్మ వచ్చేవరకు ఎదురు చూడటం కనిపిస్తుంది. స్త్రీ పాత్ర తన ప్రేమను త్యాగం చేస్తూ వేరొకరిని పెళ్ళి చేసుకొని తర్వాత జన్మలో తను ప్రేమించిన మేనభావను పెళ్ళి చేసుకుంటుంది. తన నిర్ణయం ద్వారా అందరికీ మంచి చేయడం కోసం తాను చెడ్డదైంది.

"ధన్నూ....అరె! ఇదేమిటి? నా ముఖం తనవైపు త్రిప్పుకొని అని మళ్ళీ ఏడుస్తోన్నావా? ఎందుకు? ఏం బాధ కలిగింది? చెప్పు రూపా! ఆందోళనకరంగా అన్నాడు. ఇంతవరకు చేసిన

పరిహాసం చాలు, భూషన్ బాబూ! ఇంకెప్పుడూ నన్ను 'రూపా' అని పిలవకండి ఎందుకూ? ఎన్నోరకాల ఆశ్చర్యం ధ్వనించింది భూషన్ బాబు కంఠస్వరంలో. ఈ ఆకారానికేనా ఆ పేరు పెట్టింది? అవును రూపా! అలా పిలిచేందుకు మీ మనస్సెలా అంగీకరిస్తోంది? మనస్సే ఎన్నో రకాలుగా ప్రేరేపించింది. ఓ విధంగా అలా పిలిచేందుకు... నేను నిర్బంధించబడ్డాను. ఆ ముక్కు, కళ్ళు, నుదురు, పెదవులు, పళ్ళు, ఆ వెంట్రుకలు, ఆ చెక్కిళ్ళు చూడు, ధన్నూ! ఎంతగా మెరిసిపోతున్నాయో! విధాత ప్రత్యేకమైన శ్రద్ధతో నీ మూర్తిని తయారు చేశాడు. కేవలం నాకోసమేనేమో! అందుకే నీ అపురూప సౌందర్యాన్ని... ధన్నూ, వింటున్నావా? ఏయ్, ధన్నూ!... నీ అందాన్నంతా నేను మాత్రమే చూడగలుగుతానేమో! నువ్వే అంటున్నావుగా నాకు నువ్వు కనిపించినట్టు నీకు నివ్వు కనిపించడం లేదని!... హుఁ! రూపా! చూడకలా! ఓహ్! ఇంత దూరంగా నిల్చున్న నన్ను–ఏమేమి చేస్తున్నావో, చూడు!... అందం, అనురాగం, ఆనందం– సమపాళ్ళుగా నీలోనుండి ప్రవహిస్తున్నాయేమో! నాకు ఆసరాగా చేతులకు నీ పాదాలు తాకుతున్నాయెమో! వాటిని నేను కళ్ళకు అద్దుకుంటున్నానేమో!... ధన్నూ!... నీ ఈ ఉపకారం ఎన్ని జన్మలెత్తినా మరిచిపోవడం జరగదు."(హేమాదేవి, బొమ్మ. ఆరాధకులు. పుట: 16, 17).

ఆరాధకులు నవలలో ధనలక్ష్మీ ని భూషన్ బాబు ప్రేమిస్తాడు. కాని అనుకోని కారణాల వలన పెళ్ళి చేసుకోలేకపోతాడు. కారణం ఏమిటంటే ప్రియురాలు ధనలక్ష్మీ కి కావాల్సిన నగలు, బట్టలు కొనుక్కురావడానికి బొంబాయి వెళ్ళి వస్తుండగా యాక్సిడెంట్ జరిగి గాయాలవుతాయి. కనుక పెళ్ళి సమయానికి పెళ్ళిపీటలపైకి భూషన్ బాబు వెళ్ళలేకపోతాడు. అదే సమయానికి ధనలక్ష్మీ ని ఆమె మేనబావ(కేశవ్) పెళ్ళిచేసుకుంటాడు. కాని అతడు జులాయిగా తిరిగే వ్యక్తి. పరువుకోసం ఆమె తల్లిదండ్రులు అతనికిచ్చి పెళ్ళి చేస్తారు. ఆమెను అతడు నానారకాల హింసలు పెడుతుంటాడు. తర్వాత భూషన్ బాబు వచ్చి నా ప్రియురాలిని వదిలిపెట్టు అని ఆమె భర్త కేశవ్‌తో అంటాడు. కాని అతడు మాత్రం జూలాయిగా తిరిగే వ్యక్తి కాబట్టి డబ్బులు ఇస్తేగాని వదిలిపెట్టను అని అంటాడు. చివరకు ధనలక్ష్మీ కేశవ్ పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్య

చేసుకుంటుంది. గాఢంగా ప్రేమించిన భూషన్ బాబు తట్టుకోలేకపోయాడు. ధనలక్ష్మీ రూపంలోనే ఉన్న భిక్షగత్తెను తన ఇంటికి తీసుకెళ్ళాడు. "అపరాధం ఏముంది? వాడు దాన్ని ఎంతగా ప్రేమిస్తున్నాడో చూడు. అది చచ్చిపోతే దాని రూపం పోలిన రూపాన్ని చూచుకొని తృప్తిపడుతున్నాడు. వాడు దాన్ని ప్రేమిస్తాడు. నా డబ్బుకు విధానం వేరైనా ప్రేమ స్వభావం వేరు కాదుగా! వాడినే చూడు. ప్రేమ కొరకు నీతి, నిజాయితీ, సంఘం, కట్టుబాట్లు, పాపం, పుణ్యం అన్నీ వదులుకున్నాడు."( హేమాదేవి, బొమ్మ. ఆరాధకులు. పుట: 137) అంటే ప్రేమకొరకు ఎన్ని త్యాగాలు చేస్తారో, ఎంత గాఢంగా మనసుకు తీసుకుంటారో ఈ నవల ద్వారా రచయిత్రి తెలియజేశారు.

భరత్ కుమార్ రాసిన 'నర్తకి' నవలలో విఫలమైన ప్రేమ, ప్రేమ త్యాగాని గురించి ఉంటుంది. ఇందులో చంద్రశేఖర్, సంధ్యారాణి ప్రేమించుకుంటారు. వీరిరువురూ కళాకారులు. సంధ్యారాణి నర్తకి, చంద్రశేఖర్ చిత్రలేఖకుడు. వీరి ప్రేమను చంద్రశేఖ వాళ్ళ నాన్న ఒప్పుకోడు. ఎందుకంటే వీరిది ఉన్నత కుటుంబం. సంధ్యారాణి, వాళ్ళ అమ్మను భయపెట్టి ఊరునుంచి వెళ్ళగొడతాడు చంద్రశేఖర్ నాన్న. చంద్రశేఖర్ యాక్సిడెంట్‌లో చనిపోతాడు. ఇతడు చనిపోవడంతో గుండెపోటుతో వీళ్ళ నాన్న కూడా చనిపోతాడు. ఇతని అన్న రాజశేఖర్. ఇతడు చంద్రశేఖర్ పోలికలతోనే ఉంటాడు. ఎందుకంటే వీరిద్దరూ కవలలు. సంధ్యారాణిని దుండగులు వెంటపడటం వల్ల యాక్సిడెంట్ కావడం వల్ల స్పృహ కోల్పోతుంది. ఆమెను డాక్టర్ వృత్తిలో ఉన్న చంద్రశేఖర్ అన్న హాస్పటల్ తీసుకొచ్చి చికిత్స చేస్తాడు. అప్పుడు ఆమె గతాన్ని మర్చిపోతుంది. తర్వాత గుర్తొచ్చి చంద్రశేఖర్ పోలికలతో ఉన్న రాజశేఖరుని చంద్రశేఖరే అని అనుకుంటుంది. చివరకు డా. రాజశేఖర్ తమ్ముని ఆత్మశాంతి కోసం, సంధ్యారాణి మానసికంగా ఏమైపోతుందోనని చంద్రశేఖర్‌గానే నటించి పెళ్ళి చేసుకుంటాడు. రాజశేఖర్ ను అప్పటికే డా. శోభారాణి ప్రేమిస్తుంది. సంధ్యారాణి కోసం శోభారాణి, రాజశేఖర్ తమ ప్రేమను త్యాగం చేస్తారు.

ఈ నవలలో చంద్రశేఖర్, సంధ్యారాణి గాఢమైన ప్రేమ. పెద్దలు వ్యతిరేకించినా ప్రేమకోసం తపిస్తూ ఒకరికోసం ఒకరు వెతుక్కోవడం, సంధ్యారాణి కోసం శోభారాణి, రాజశేఖర్ తమ ప్రేమను త్యాగం చేయడం వంటివి కనిపిస్తాయి.

### 4.11. అధికార బలం

ప్రజలచేత ప్రజలకొరకు ఏర్పాటు చేసుకున్న మన ప్రజాస్వామ్య వ్యవస్థే ప్రభుత్వం. దేశంలో ప్రజలచేత ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అధికార దుర్వినియోగం చేస్తున్నారు. తద్వారా సామాన్య ప్రజలు ఎన్నో హింసలకు, ఇబ్బందులకు గురవుతున్నారు. అధికార యంత్రాంగం, తమ చేతుల్లో ఉందని వారి కుటుంబీకులు, బంధువులు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ, చట్టానికి దొరకకుండా తప్పించుకుంటుంటారు.

నాడు రాచరిక వ్యవస్థలో ప్రజలు బానిసల్లాగా బతికారు. వెట్టిచాకిరి చేశారు. నేడు ప్రజాస్వామ్యం అన్న పేరేగాని అదే ముసుగు. రూపంలో తేడా ఉన్నా సారంలో మాత్రం సామాన్య ప్రజలు ప్రజాప్రతినిధుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు.

స్వాతంత్ర్యానంతర సమాజంలో రాచరిక వ్యవస్థపోయి ప్రజాస్వామ్యం అమల్లోకి వచ్చినా, గ్రామాల్లో చాలాచోట్ల భూస్వామ్య వ్యవస్థ, దొరల పెత్తనం పోలేదు. భూస్వాములు, దొరలు గ్రామంలోని సబ్బండ వర్ణాలను నానా హింసలకు గురిచేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 'సంఘము' నవలలో నాటి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని దొరలు పద్మశాలీలను పెట్టిన ఇబ్బందుల గురించి చర్చించబడ్డాయి. దొరలు, భూస్వాముల ముందు వారికంటే తక్కువ కులస్థులు, బీదలు తమకంటే అధికంగా ఎవ్వరూ ఎదగకూడదు. తమ మాటకు ఎవ్వరూ కూడా ఎదురు సమాధానం చెప్పకూడదు. చెప్పిన పనులు కాదనకుండా చేయాలి. సంఘము నవలలో బుక్కారావు పేట గ్రామంలో పద్మశాలీలు ఉండేవారు. అందులో బుచ్చమ్మ అనే పేద పద్మశాలీ మహిళ ఉండేది. భర్త చనిపోయాడు, కొడుకు, కూతురు ఉన్నారు. వారిని సాకడానికి వృత్తి

పనులు లేకపోవడంతో బ్రాహ్మణుల ఇంటిలో పాచిపనులు చేస్తుంటే కులపెద్దలు జరిమానా విధిస్తారు. ఆ ఊరిలో నర్సయ్య అనే పద్మశాలీ ఉండేవాడు. నిజానికి నర్సయ్య చాలా మంచివాడు బీదవాళ్ళను సమయానికి ఆదుకునే స్వభావం గలవాడు. పద్మశాలీలలో ఆర్థికంగా కొంచెం ఉన్నతంగా బతికేవాడు. అలా జరిమానా వేయడం సరికాదని కులపెద్ద రాజలింగానికి మర్యాద పూర్వకంగానే చెప్తాడు. కాని అతడు మనసులో పెట్టుకొని, గ్రామంలోని దొరకు ఉన్నవి లేనివి కల్పించి చెప్తాడు. అప్పుడు దొరకు చాలా కోపం వస్తుంది. నర్సయ్యను పిలిపించి బెదిరిస్తాడు. నర్సయ్య ప్రమాణం చేసి చెప్తున్న నేను ఎవ్వరిని ఏమీ అనలేదు అని వేడుకుంటాడు. అప్పుడు "ఇగవొట్లూ, బాసలు, చాల్లే. కులంల నీ వొక్కడవే మొనగాడవైనవు. నువ్వొక సావుకార్నని మురుస్తున్నవురా! నీకు పైస మదమే బాగున్నది. మా కండ్లల్ల బడ్డవు. నిన్ను నాశనం బట్టిచ్చేదాకా విడువ కొడుకా. ఏమో పాపం అక్కరబడేవాళ్ళు, మనవాళ్ళను మనం గాపాడుకోవాలెనని అనుకున్నాకొద్దీ మామీదకే సవారి. కట్టే, పిడుకా, పెండా, చెడ్డదీ, మంచిదీ ఎవ్వరి భూముల్ల నుంచి దెచ్చుకుంటట్లా? అసలు బైటికి బోతె మా భూముల్లకే కదా? ఇట్లుండగ ఇంత కావురమా! సాలోల్లకు కొత్తకొత్త పేర్లు పద్మశాలీలట వీని బొందశాలీలు.

నేను జేసిన దోషవేమిదొరా! ఊరోళ్ళంతా వొక్కరి కొక్కరు సాయపడకుంటే ఎట్లా నడుస్తది? తామింత దయచేస్తే, మేమింత చాకిరి జేస్తం. ఇంతదానికే ఉన్న కోపమంతా నామీదనే దీస్తిరి. నోరుగదిలై తప్పంటే యెట్లదొరా?

అదునా శాలోడు గ్రామమేలే దొరల మీదకే మాటందిస్తోండు. వీని పైత్యం దింపుదాము తేరా ముత్తిగా కట్టె? అని సుంకర ముత్తిగాని చేతుల్నుంచి కట్టందుకొని అయిదారు దెబ్బలు కొట్టి, నోటికి వచ్చినవన్నీ అనేసినాడు. అంతటితో తృప్తిపడక, వొరే ముత్తిగా! నేటినుండి ఈ శాలోల్లకు సాకలోల్లు బట్టలుతుకుట, మంగలోల్లు నెత్తులు గొరుగుట, మాదిగోల్లు దప్పులు గొట్టుట అన్ని బందుపెడ్తనని చెప్పు. ఏమి వినచ్చిందా? అని చెప్పి ఇంట్లకు లేచిపోయిండు."(లోకమలహరి.

సంఘము. పుట: 87, 88). ఈ సంఘటన జరిగిన తర్వాట కొన్ని రోజులకే నర్సయ్య ఇంటిని దొర భుజంగరాయుడు తగలబెట్టిస్తాడు. ఆ ఇల్లు దాదాపు చాలావరకు కాలిపోతుంది. ఇంట్లో డబ్బు, ధాన్యం అంతా కాలిపోగా మిగిలింది తీసుకుంటాడు. తొట్టెలో ఉన్న పసిపాప చనిపోతుంది. అంతటి దుర్మార్గానికి ఒడికట్టాడు దొర. తట్టుకోలేని నర్సయ్య మిల్లులో పనిచేయడానికి బొంబాయి వెళ్ళిపోతాడు.

## 4.12. పత్రికారంగం

"వారికి ఏదో వింతైన ఒక సమాచారం కోసం ఆశిస్తారు. దానికోసం ఎంతైనా శ్రమిస్తారు. కాని అది సమాజానికి అవసరమా! కాదా? అన్న విషయము వారికి అనవసరం. నూతనంగా ఇంతగా ఉంటే చాలు. అది తమ పత్రికలో వేసుకొని వ్యాపారం పెంచుకుంటారు. పత్రిక ఉన్నది ప్రజలను జాగ్రత్త పరచుటకే గాని వ్యాపారం చేసుకొనుటకు కాదు. కాని నేడది పెద్ద వ్యాపారం అయిపోయినది. అందుకే వారు ప్రజలు దేనిని కోరుకుంటున్నారు. వాటిని గురించి మాత్రమే తెలుపుతున్నారు. కాని ప్రజాక్షేమం గూర్చి ఏమాత్రం ప్రయత్నించడం లేదు. ఏది ప్రచురించాలో ఏది ప్రచురించకూడదు అన్న నిబంధనలకు నీళ్లు వదిలారు. ఏది ఆకర్షణీయంగా ఉంటుందో దానికోసం పడరాని పాట్లు పడతారు. ప్రస్తుతం న్యాయస్థానం విడాకుల విషయంలో తీర్పు కొనసాగింది. అదేమంతా విశేషమైన విషయము కాదు. అదేకాకుండా వ్యక్తిగతమైనది సమాజమునకు తెలుపవలసిన అవసరం లేదు. కాని అదొక ప్రముఖ వ్యక్తి విషయం. ప్రముఖుల ప్రతి విషయము వారికి అత్యవసరము అదొకటి వారికి ఆకర్షణ విషయం. ఇటువంటి విషయాలపై ఎనలేని శ్రద్దని చూపుతారు. ఒక సాధారణ వ్యక్తి సాహసించి ఏదైనా సాధిస్తే దానికి ఒక మూలకు చిన్నగా ప్రచురిస్తారు. సినిమా తారాలకం కామ క్రీడలను, రాజకీయ నాయకుల వింత చేష్టలను మాత్రం భూతద్దంలో పెట్టి చూపిస్తారు. మంచి వార్తలను కొంచెం కొంచెం వేస్తారు. వారికి కావలసినది వ్యాపారం. ప్రజాక్షేమము కాదు. దాని ముసుగులో చేస్తున్న వ్యాపారంగా మారిపోయింది. ప్రభుత్వము పట్టించుకున్నారు లెంది ప్రజలకు అవసరం లేదు.

ఇష్టమైతే కొంటాము చదువుతాము లేదా మానుకుంటాం. ఇది తామస గుణముల లక్షణము. అందుకే అందరూ మౌనము వహించారు. పాఠకులు అడిగేంతవరకు ఈ పత్రికలు ఈ విధంగా ఉంటాయి. ఇది ఒకటే కాదు ప్రజలు చైతన్యవంతులై ప్రశ్నించ గలిగిననాడే ప్రతీది ప్రజా ప్రయోగముగా మారిపోతుంది. లేకుంటే ప్రజలే ప్రవాహంలో కొట్టుకొని పోతారు. అడిగే వారు లేకుంటే అందరూ అందలం ఎక్కుతారు. అప్పుడు మోసే వారు ఉండరు. చూసేవారు ఉండరు." (ప్రభాకరరావు, మేడిచర్ల. శ్రీమతి గోమతి. పుట: 5).

పత్రికారంగం ఎప్పుడూ ప్రజల పక్షం పనిచేస్తూ, ప్రతిపక్షంగా నిలబడాలి. అధికార యంత్రాంగానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాచారాని చేరవేస్తూ సమాజ ప్రగతికి పాటుపడాలి. నిజమైన, సత్యమైన సమాచారాన్నే అందించాలి. కాని నేటి సమాజంలో ప్రభుత్వాలకు కొమ్ముకాస్తు వారి సంకన చేరిన పత్రికా సంస్థలు మనకు కన్పిస్తాయి. భయంతోనో లేక లాభాపేక్షకోసమో అధికార బలానికి అండగా ఉంటాయి. పనికిరాని వార్తలు రాస్తూ వ్యాపార సంస్థల్లాగా మారిపోయిన పత్రికా సంస్థలు కూడా ఉన్నాయి. పత్రిక అనేది పదునైన ఆయుధంగా ఉండాలి. అది నిస్వార్థంగా, నిస్సంకోచంగా, నిర్భయంగా వార్తలు ప్రచారం చేసినపుడే సమాజం ప్రగతిపథంలో ముందుకు నడుస్తుంది.

'ఆరాటం' నవలలో కూడా పత్రికా రంగం పనిచేస్తున్న తీరును రచయిత దారం గంగాధర్ చిత్రించాడు. "కాలేజీలో గా మధ్య ఎల్లగాండ్లు బంగ్లమీదికెంచి దుంకి చచ్చాదని ఉరేసుకొని చచ్చిరని పేపర్లొచ్చింది గా కాలేజీ. అవును గవెంతసేపుర బై. ఏ మినిస్టర్‌కో, ఏ పెద్దాఫీసర్‌కో, ఒక్క ఫోన్ చేస్తే చాలు. ఏం జరగనట్టే ఉంటరు. డబ్బులు కట్టలు పడేస్తే చాలు. అన్నీ మాఫీ అయిపోతయ్. పత్రికలొల్లు సుత ఏం రాయరు? అవును ఎందుకు రాస్తరె. రాయరు. పత్రికలొల్లకు పుల్లు చందాలు ఇస్తరు. అడ్వర్టైజ్‌మెంట్ల్ ఇస్తరు. అవ్విటితోనే గా పత్రికలు నడుస్తయ్. లేకపోతే గాళ్ళకు పైసలెక్కడివి. పేపరు నడవాలంటే గిసొంటి పెద్దపెద్ద సంస్థల్ని

పట్టుకోవాలి. ఒకవేళ వార్త రాసినా సుత ఆ కాలేజీ పేరు రాయక ఒక కాలేజీలో గిట్ల జరిగింది అని రాస్తారు. పేపరొల్లు, టి.వి. వార్తలొల్లు సక్కంగా రాతలు రాస్తే గీ బాధలు ఎందుకుంటయ్ రెడ్డయ్య. సమాజం బాగుపడాలంటే గీ పేపరోల్లు, నిజమైన నిఖార్సైన వార్తలు రాయాలగప్పుడే లోకంలో జరుగుతున్న ఇషయాలు జనంకు తెలుస్తది. రాబోయే నాయకుల్నిగాని, ప్రభుత్వాన్ని నిలదీసి అడిగే ఆలోచనలు వస్తాయి. దీంతోని తప్పుడు పనులు చేసే దొంగలు అంత కాకపోయినా కొంతైనా జంకుతారు. అందుకే వార్తలు రాసేవాళ్ళంతా దివిటీల లెక్క, చీకట్ల ఉన్నొల్లకు ఎలుగుచుక్కలెక్క ఉండాలే. మరి అదే అంటున్న మన బోటోళ్ళు తప్పులు చేస్తే ఉరికంబం ఎక్కుడే కదా! అంటే దీనిబట్టి అర్థమయ్యిందేంది? ఉన్నోడు ఎన్ని ఆగం దందాలు చేసినా, అక్కడికక్కడే ఖతం అవుతాయి." (గంగాధర్, దారం. ఆరాటం. పుట: 101).

రచయిత సమాజం బాగుపడాలంటే పత్రికారంగం, టీవీ ఛానెళ్ళు నిజమైన నిఖార్సైన నిజాలైన వార్తలు రాయగలిగినప్పుడే, చెప్పగలిగినప్పుడే ప్రపంచంలో జరుగుతున్న అన్ని విషయాలు ప్రజలకు తెలుస్తాయి. అప్పుడే నాయకుల్నిగాని, ప్రభుత్వాన్నిగాని నిలదీసి అడిగే ఆలోచనలు ప్రజలకు వస్తాయి. దీంతో తప్పుడు పనులు చేసే దొంగలు కొంతవరకైనా భయపడి మారిపోయే అవకాశం ఉంటుందంటాడు. అలాగే లేనివాళ్ళు తప్పులు చేస్తేమాత్రం వారు ఉరికంభం ఎక్కేంతవరకు పత్రికారంగాలు నిద్రపోవు. ఉన్నొళ్ళు ఎన్ని అరాచకాలు చేసినా, దందాలు చేసినా అక్కడికక్కడే మసిబూసి మారెడు కాయ చేస్తారు. అందుకే సమాజంలో 'ఫోర్త్ ఎస్టేట్'గా ఉన్న మీడియారంగం వాస్తవాలను నిక్కచ్చిగా రాసి సమసమాజ నిర్మాణంలో భాగం కావాలని రచయిత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

### 4.13. స్నేహం

విద్యార్థి దశలో అందులోను కళాశాల జీవితంలో ఎందరో విద్యార్థులు ఎక్కడెక్కడో పుట్టి, ఒకచోట చేరి చదువుకుంటుంటారు. వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని అన్ని

బాధలను, సంతోషాలను పంచుకుని స్నేహితులుగా మారిపోయి విడదీయరాని బంధాల్ని పెనవేసుకుంటారు. కళాశాలకి మధ్యలో వచ్చే సెలవులను విద్యార్థులు భరించలేకపోతారు. పాఠశాలలో సెలవులకోసం ఎదురుచూస్తుంటారు విద్యార్థులు. కాని కళాశాలలోని విద్యార్థులు మాత్రం ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తారు. విద్యా సంవత్సరం మధ్యలో వచ్చిన సెలవులు ఎప్పుడు ముగుస్తాయోనని ఎదురు చూస్తుంటారు.

అమృతలత 'సృష్టిలో తీయనిది' నవలను స్నేహపూరితమైన కథతో రాసింది. అందులో కాలేజీ హాస్టల్‌లో ఉంటూ స్నేహితుల మధ్య చదువుకునే విద్యార్థులు ఎంతో కాలక్షేపంతో, సంతోషంగా గడుపుతారు. ఆ విద్యార్థి దశ జీవితమే వేరు. కొత్త కొత్త స్నేహితులు, రాజకీయాలు, ప్రాపంచిక జ్ఞానం ఒక్కటేమిటి ఎన్నెన్నో విషయాలకు నెలవైన వేదిక విద్యాసంస్థ/కాలేజీ. చదువుకునేటప్పుడు స్నేహితులు, లెక్చరర్స్, హాస్టల్ వార్డెన్స్, అందరూ కలిసి తినడం, ముచ్చట్లు, గొడవలు, గ్రూపులు ఇలా ఎన్నెన్నో రకాలుగా విద్యార్థి జీవితం తయారవుతుంది.

మహిళా కళాశాల, హాస్టల్‌లో జయ, నిర్మల, రజిత, అరుణ, చంద్ర మొదలైనవారు స్నేహితులుగా ఉంటారు. ఒకరిని విడిచి ఒకరు ఉండేవారు కాదు. ఇందులో జయ అనే అమ్మాయి చాలా చురుకైనది. చదువులోనూ, ఎదురించే తత్త్వంలోనూ గడుసైన అమ్మాయి. అందరితోనూ మంచిగా స్నేహంగా, సున్నితంగా కలివిడిగా ఉండటం ఈమెకు బాగా అలవాటు. అందుకే జయతో స్నేహం అంటే అందరూ చెవులు కోసుకుంటారు. కింది సంభాషణ చూస్తే స్నేహమంటే ఇలా ఉండాలని అనిపిస్తుంది మనకు.

"రచయిత్రివి! ఇంకా అర్థం కాలేదా? నన్ను మించిన స్నేహితురాలు... నీకింకొకరు వున్నప్పుడు ఇక నాకున్న విలువేమిటి? తను నాతో అంత ఫ్రెండ్లీగా మూవ్ అవుతున్నప్పుడు... నేను దూరదూరంగా ఎలాపోను? నేను అరుణా వీళ్ళంతా చాలరా జయా? ఇంకా కొత్త కొత్త

వాళ్ళతో కూడా ఫ్రెండ్షిప్ ఎందుకూ? ఏమో రాజీ నువ్వెంత నన్ను ఇష్టపడుతున్నావో... నిర్మల కూడా నన్నంతే యిష్టపడ్తోంది, అలాంటప్పుడు ఆమెనెలా కాదనాలి? అయితే అలా నిన్నిలా ఇష్టపడ్తున్నామని ఎంతమంది వస్తే అంత మందిని ఫ్రెండ్స్‌గా ఆదరిస్తావా? స్నేహితులకు లిమిట్ వుంటుందా రాజీ? జయ ప్రశ్నకంటే ఆమె అడిగే తీరులో అమాయకత్వం కన్పించింది రజితకి.

ఆఫ్‌కోర్స్, వుండవచ్చూ ఉండకపోవచ్చు! అది ఆయా వ్యక్తుల అభిప్రాయాలని బట్టి వుంటుంది. కాని నా భయమల్లా ఒక్కటే! ఇలా నిన్నిష్టపడే వాళ్ళందర్నీ నువ్వు చేరదీస్తూ వుంటే ఎవరికీ సంతృప్తి కల్గించకపోగా అందరి హృదయాలనూ క్షోభ పెట్టినదానివవుతావు! మోరోవర్ నువ్వు ఎదుటి మనుషుల్ని ఇట్టే నమ్మి, ఫ్రెండ్సిఫ్ చేస్తావు! అదెప్పటికైనా నిన్ను ఎదురుదెబ్బ తీస్తుందేమో? ఏమో రాజీ, నన్ను కావాలని నా దగ్గరికి వచ్చేవాళ్ళని దూరం నెట్టేసేంత కఠిన హృదయం నాకివ్వలేదు దేవుడు! నన్ను క్షమించు! అంటూ వెళ్ళిపోయింది జయ. ఇలా ఎదురైనవాళ్ళ హృదయాలనల్లా దోచుకుంటూ పోతే వాటినెక్కడ భద్రపర్చుకోవాలో తెలీక ఉక్కిరిబిక్కిరైనపుడుగానీ నేను చెప్పిన మాటలు నీకు అర్థం కావు జయా! ఇంత చిన్న చిన్న విషయాలే తెలీని నువ్వు నీలోని ఏ ఆకర్షణతో ఇంతమందిని కట్టి పడేస్తున్నావ్? కారిడార్ స్థంబాన్నానుకొని అలాగే ఆలోచిస్తూ నించుండిపోయింది రజిత.” (అమృతలత. సృష్టిలో తీయనిది. పుట: 34, 35). దీన్నిబట్టి చూస్తే ‘నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది’ అనే సామెత గుర్తుకు వస్తుంది. జయ పాత్ర ద్వారా తోటివారితో స్నేహంగా ఎలా ఉండాలి? ఎలా ఆకట్టుకోవాలనే విషయాలను ‘సృష్టిలో తీయనిది’ నవలలో చూడవచ్చు.

### 4.14. రాజకీయం

రాచరిక వ్యవస్థల్లోంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి అడుగుపెట్టాం మనం. కాని పేరుకు మాత్రమే ప్రజాస్వామ్యం. జరుగుతున్నదంతా రాచరిక పాలనగా సాగుతుంది. కారణం నేడు రాజకీయ వ్యవస్థలో జరుతున్న పరిణామాలు. వారి వారి స్థాయిని బట్టి ఓట్లకోసం ప్రజలను

మభ్యపెట్టి రకరకాల ఉచిత పథకాలను పెట్టి అందులో నాయకులు తలా కొంత దోచుకుంటున్నారు. కనుక ప్రజలు ఎప్పుడూ ఏదో ఒక రకంగా మోసపోతూనే ఉన్నారు. విజేత నవలలో ఎన్నో రాజకీయాంశాలు విశ్లేషించబడ్డాయి. ఈ నవలలో ప్రధాన పాత్ర అయిన బాలాజీ ప్రభుత్వ ఉద్యోగ పదవీ విరమణ చేసిన తర్వాత ప్రజాసేవ చేయాలనుకుంటారు. ఆ సమయంలో వారి స్వంత గ్రామంలోని ఆశ్రమంలో ఉండే గురువును కలిసి చేయబోయే పనుల గురించి చర్చిస్తున్నప్పుడు, ఏ పని చేయాలని యోచిస్తున్నపుడు అందులో ఒకటి రాజకీయం కూడా ప్రస్థావన వస్తుంది. వారి మిత్రుడు రాజారాం సర్పంచిగా ఉంటాడు. అతనితో ఆ పదవిలోని సాదకబాధకాలను చర్చిస్తాడు. అప్పుడు అతను చెప్పిన విషయాలను గమనిస్తే "ఇక్కడ తృప్తి, ఆనందం అన్న పదాలకు అవకాశమే లేదు. అటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు దోచుకోవడానికి అవకాశము కల్పిస్తున్నది. నాయకులు దానికి వంత పాడుతున్నారు. ప్రజలు కూడా కాదనకుండా లేనివి కల్పించుకొని అందినంత వరకు లాభాన్ని పొందుతున్నారు. న్యాయాన్ని కోరవలసిన ప్రజలే అధర్మానికి అవకాశము కల్పిస్తే ఇక మేము చేయవలసినది ఏమున్నది. మేము చాలా చిన్న నాయకులము. అటు పెద్ద నాయకులు చెప్పినట్లు నడుచుకోవాలి. ఇటు ప్రజలకు సంతోషము కలిగించాలి. ఈ రెండు పనులు చేస్తుంటే మాకు మిగిలేది లాభమే కదా! అందుకని న్యాయము, ధర్మము అనకుండా కనులు మూసుకొని కూర్చున్నాము. ప్రస్తుతము ప్రజాసేవ పేరిట ఏ చిన్న పదవి దొరికినా చాలు లక్ష్మీ దేవి పరుగెత్తుకుంటూ వస్తుంది. ఇదీ నేటి నాయకుల పరిస్థితి అని సవివరంగా తెలిపాడు." (ప్రభాకరరావు, మేడిచర్ల. విజేత. పుట: 19)

పైన చెప్పిన విధంగా అధికశాతం రాజకీయ నాయకులు అలాగే ఆలోచిస్తున్నారు. ప్రజల పేరుతో పథకాలు రూపొందించి నీకెంత, నాకెంత అనే విధంగా ప్రజాధనం పంచుకుంటున్నారు. నవల రాసే కాలానికైనా, ప్రస్తుతం అయినా కొంచెం హెచ్చుతగ్గులు ఉండవచ్చు. కాని అదే తంతు. నాయకులంటేనే ప్రజలు విసుగు చెందేలా చేస్తున్నారు. ప్రజలు ఓటు అనే ఆయుధంతో తిరగబడితేనే తప్ప న్యాయం జరగదు. కనుక ప్రజలంతా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి.

### 4.15. పేదరికం

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై అయిదు సంవత్సరాలు పూర్తిచేసుకున్నా ఇంకా పేద ప్రజలతో అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంది. కనీసం తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట కూడా లేని పేదలెందరో మనదేశంలో ఉన్నారు. చాలామందికి పేదవారంటే చులకన భావమే ఉంటుంది. ధనవంతులు ధనవంతులుగానే, పేదవారు మరింత పేదవారుగా తయారవుతున్నారు. పేదవారు పేదవారుగానే ఉండటానికి కారణం సమాజం. వారస్థితిలో ఉండటం అందరూ బాధ్యత వహించాల్సిందే.

బొమ్మ హేమాదేవి రాసిన 'నవభారతి' నవలలో పేదరికం మనిషిని ఎన్ని ఇబ్బందులకు గురిచేస్తుందో మనం గమనించవచ్చు. అయిదుగురు ఉన్న కుటుంబంలో ఒకరు ఉద్యోగం చేస్తేనే సంసార జీవనం సాగుతుంది. ఆ ఉద్యోగం కూడా ఎప్పుడు ఊడుతుందో చెప్పలేం. ఏపూట కాపూట తిండి సరిపడ సరుకులు తెచ్చుకొని పూట గడపాల్సి వస్తుంది. అదికూడా అప్పులు, చేబదళ్ళతో కాలం వెళ్ళదీయాల్సి వస్తుంది. భారతి పాత్ర ద్వారా మనం కడుబీదరికాన్ని చూడవచ్చు. భారతి ఇంట్లో రెండు రోజులనుండి పొయ్యి వెలగలేదు. చిన్నపిల్లలు మంచం పట్టి లేవలేకున్నారు. పగలంతా పనిచేసి మనందరిని ఉద్యోగం చేసి సాదే వ్యక్తి కూడా అన్నం పెట్టకపోతే ఎలా అని భారతిని ఇంట్లో సరుకులు లేవని, పక్కింటి మహాలక్ష్మీ గారి దగ్గర రెండు రూపాయలు చేబదులు తీసుకురమ్మని పంపుతుంది. అంటే భారతి మాత్రం మహాలక్ష్మీ కి ఇంతకుముందే అయిదు రూపాయలు ఇవ్వాలి, అవి అడుగుతుందేమోనని అంటుంది. అప్పుడు భారతి కింది విధంగా ఊహించుకుంటూ ఉంటుంది. "హుఁ! ఎవరిమీద ఆ కోపం? విచక్షణా జ్ఞానం లేకుండా తనలాంటి మనిషిని ఎన్నుకుందన్న క్షయరోగంపైనా? ఎన్నో యమయాతనల తరువాతైనా తాత్కాలికపు ఉద్యోగం చేస్తున్న అన్నయ్యపైనా? ప్రక్కింటి మహాలక్ష్మీ గారి పిల్లలు పంచభక్ష్య పరమాన్నాలు తాము తిన్న వైనాన్ని చెబుతూంటే ఇక వినడానికి ఓర్పు చాలక అప్పటికప్పుడు తృప్తిపడేందుకు తమ నాలుకతో పెదవుల్ని తడుపుకునే చిట్టి, బిజ్జూలపైనా?

ఉబికివచ్చే యవ్వనాన్ని జీర్ణమైన వస్త్రాల్లోనే సభ్యతగా దాచుకోలేని కవితపైనా? లేక భాగ్యవంతుల వంశజ్యోతుల మదమెక్కిన శరీరాలను ఉద్రేకపరుస్తుందన్న నెపంతో, చేరిన రెండు నెలలకే కాలేజీలోనుండి గెంటివేయబడ్డ నా బాహ్య సౌందర్యంపైనా? లేదా ఇన్ని యోగ్యతలు మా ఒక్క కుటుంబానికే ఇచ్చిన అదృష్టంపైనా? అమ్మకు ఎవరిపై ఆ కోపం? మానవుని పతనానికి అన్నివిధాల కారకులైన మా అభిమాన దేవతయైన దారిద్ర్య దేవత పైనా? విలువలేని కోపం ఆలోచించకుండా అమ్మ ఎందుకు తెచ్చుకుంటుందో? ఏవేవో ఆలోచిస్తూనే పక్కింటి మహాలక్ష్మీ గారింట్లోకి నడిచాను.” (హేమాదేవి, బొమ్మ. నవభారతి. పుట: 4). పేదరికం పేదవాళ్ళ ఆడపిల్లలపై కూడా ప్రభావం చూపుతుందనడానికి పైన భారతి చెప్పిన విషయాలను చూస్తే అర్థమవుతుంది.

‘నవభారతి’ నవలలలో బీదరికాన్ని కళ్ళకు కట్టినట్టు చిత్రించింది బొమ్మ హేమాదేవి. భారతి బదులు అడుక్కొచ్చిన డబ్బులతోనే అన్నీ కొనలేం. ఎదో కొంతవరకు సర్దుకోవచ్చు. పెరటిలో ఎప్పుడో పెట్టిన కందగడ్డను తీసి చారు పెట్టే ప్రయత్నం భారతి వాళ్ళ అమ్మ చేస్తోంది. “ఒక రూపాయి బియ్యం, నాలుగు అణాల కట్టెలు, అణా నిప్పుపెట్టె తీసుకొని ఇంటికి తిరిగి వచ్చాను. పదిహేను ఇరవై నిమిషాల్లో పావుసేరు బియ్యంతో పదిమందికి సరిపడే గంజి తయారైంది. రెండు రోజుల్నుండీ కటిక ఉపవాసం. అన్నం తినలేదు. కవిత, చిట్టి, బిజ్జూలచేత కొంచెం కొంచెం గంజి తాగించి, అమ్మ దగ్గరికి వెళ్ళి ‘పదమ్మా’ అన్నాను.” (హేమాదేవి, బొమ్మ. నవభారతి. పుట: 9). అంటే పావుసేరు బియ్యాన్ని ఎక్కువ నీటిని పోసి ఉడికించి గంజి చేసుకొని తాగాల్సిన పరిస్థితిని గమనించవచ్చు. ఎంత ఆకలితో ఉంటే ఆ పని చేస్తారు.

ముఖ్యంగా భారతి వాళ్ళ నాన్న స్వాతంత్ర్య సమరయోధుడు. అయినా ఇంటిలో పేదరికం. అంటే కుటుంబాన్నేగాక, ఆస్తిని కూడా దేశంకోసం త్యాగంచేసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వారి కుటుంబాన్ని కూడా గౌరవించలేని స్థితి ఉంది. వారి చిన్న కూతురు కవిత అంటుంది

నాన్నగారి పేరుమీద జన్మదినోత్సవం, స్మారక దినోత్సవం పెద్దగా జరుపుకుంటారు. వాటికోసం పెద్దమొత్తంలో డబ్బు కూడా వసూలు చేస్తారు. ఆ డబ్బు ఏం చేస్తారు అని భారతి అక్కయ్యను అడుగుతుంది. ఆ డబ్బులో కొంచెమైనా మనకు ఇస్తే మన జీవనం కొద్దిరోజులైనా గడుస్తుంది కదా! అని ఆమె ఆశ. కాని భారతి అవన్నీ మనం ఆలోచించకూడదు. కీర్తి ప్రతిష్టలు దొరికాయి కదా అని అంటుంది. మన నాన్నగారు చేసిన గొప్ప పనులకు ఇలా విలువ కట్టడం మంచిపని కాదని అంటుంది. పెద్దల ఆస్తిపాస్తుల మనం పంచుకోవడం నాకు నచ్చదు. చేతనైతే స్వయంకృషితో లోకంలో ఓ మనిషిగా గుర్తింపబడాలిగాని, ఫలానా వారి కొడుకు మనుమడు అని అనిపించుకోవడం చేతగాని తనంగానే అనిపిస్తుందని భారతి అంటుంది. అంటే పేదవారికి ఎంతటి ఆత్మాభిమానం ఉంటుంది. అవునూ పేదవారికే ఆత్మాభిమానం ఎక్కువ. ధనవంతులకు ఆత్మాభిమానం కాదుకదా, సిగ్గు, బిడియం అస్సలు ఉండవు.

మనదేశంలో పేదవారికి పిడికెడు అన్నం పంచిపెట్టలేరు కాని, చేసిన తప్పులను, పాపాలను చెరపుకోవాలనే సంకల్పంతో దేవుళ్ళకు ఉత్సవాలు, పాలాభిషేకాలు చేస్తారు. రకరకాల పిండి వంటలు వండి వడ్డిస్తారు. "రక్త మాంసాలు లేని ఆ విగ్రహాలకు ఈ మందిరాలెందుకు? ఆ బొమ్మలు ఏంతింటాయనా ఇన్ని రకాల తినుబండారాలు? ఆ శిలలకు కళ్ళున్నాయి. కనుకనా ఇవన్నీ చూడ్డానికి? హృదయం ఉంది కనుకనా! ఆ ఉత్సవాలను చూసి ఆనందించడానికి? మరైతే ఈ లోకంలో ఈ ఆకలి మంటలెందుకు? భగవంతుడు తాను అన్నీ ఆరగిస్తూ, అనుభవిస్తూ తాను సృష్టించిన వాళ్ళను తన కళ్ళముందే ఇలా నూదుస్తాడా? తన బిడ్డల్ని తానే యిలా ఎందుకు హింసిస్తాడు?..."( హేమాదేవి, బొమ్మ. నవభారతి. పుట: 14)

వీరు తమ బతుకుబండిని నపడటంకోసం కిరాయి ఇంట్లో అద్దె చెల్లించలేక ఎన్నో ఇబ్బందులు పడుతూ ఏమీ తోచని పరిస్థితుల్లో ఒక దేవాలయంలో తలదాచుకోవడానికి వెళ్తారు. అక్కడ మిగిలిన దేవుని ప్రసాదాల కోసం ఎదురుచూస్తూ గడపాల్సి ఉంటుంది. అదేవిధంగా ఆ

దేవాలయ పూజారి వయసుకొచ్చిన అమ్మాయిలు కవిత, భారతిలను లైంగికంగా వాడుకోవడానికి చూస్తాడు. ప్రసాదం కోసం పూజారి ఉన్న గదిలోకి వెళ్ళగానే కవితను చెరచటానికి చూస్తాడు.

దేశంలో పేదలు అంటే అందరికి చులకనే. పేదల అవసరాలను ఆసరాగ చేసుకొని వారిని నిత్యం ఇబ్బందులు పెడుతూనే ఉంటుంది సమాజం. పేదరికాన్ని నిర్మూలించాలంటే ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

## 4.16. నిరుద్యోగం

'నవభారతి' నవలలో నిరుద్యోగ సమస్యను చిత్రించారు రచయిత హేమాదేవి. ఇందులో భరత్ భూషన్ కుటుంబం ముందే పేదరికంతో అల్లాడుతోంది. దానికి తోడు అతనికి ఉద్యోగం లేక చాలాకాలం తర్వాత అతనికి ఉద్యోగం లభిస్తుంది. కాని అది ఎప్పుడు ఊడిపోతుందో తెలియదు. అసలు ఉద్యోగమే దొరకక తన పెద్దచెల్లి భారతిని, భార్య చనిపోయి నలుగురు పిల్లలు కలిగిన నలభై ఏళ్ళ పురుషుడిని పెళ్ళి చేసుకోమంటాడు. అతని పేరు శాస్త్రి. ఆర్థికంగా బాగా ఉన్నవాడు. అతడు మీ చెల్లిని నాకు ఇచ్చి పెళ్ళి చేస్తే కనుక మీ ఇంటి వాళ్ళ ఆర్థిక సమస్యలు కూడా తీరుస్తానంటాడు. అంటే వీళ్ళెంత తీవ్రమైన పేదరికంలో ఉన్నారో దీన్ని బట్టే అర్థమవుతుంది. దీనికితోడు నిరుద్యోగ సమస్య వల్ల భూషన్‌బాబు ఏమీచేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడో మనం అర్థం చేసుకోవచ్చు. మనదేశంలో ఈ నవల రాసేనాటికే కాదు, ఇప్పుడు కూడా నిరుద్యోగ సమస్య వెంటాడుతోంది. ఈ భారతదేశం ఇంకా అభివృద్ధిచెందే దశలోనే ఉంది. ఈ నవలలో ఇతను ఒక్కడే కాదు, నిరుద్యోగ సమస్యతో ఇబ్బందిపడేవాడు, గాక నూతన్‌బాబు కూడా ఇటువంటి సమస్యనే ఎదుర్కొని ఏమీ తోయని స్థితిలో రోడ్లవెంబడి తిరుగుతూ ఎన్నో కష్టాలు పడుతూ, తిండే దొరకక ఉపవాసాలు ఉంటూ కాలం గడుపుతాడు. భూషన్‌బాబు చివరకు ఇంట్లోంచి వెళ్ళిపోతాడు. ఆ తర్వాత వారి చెల్లెల్లు భారతీ, కవితా ట్యూషన్ కోసం శీతల్‌బాబు ఇంటికి వెళ్తారు. అక్కడే ఇదివరకే నూతన్‌బాబు ట్యూషన్ చెప్తూ ఉంటాడు. వీళ్ళు ట్యూషన్ చెప్పడంకోసం కుదిరే సరికి నూతన్‌బాబును వెళ్ళిపొమ్మంటారు. ఇతడు

హైదరాబాదు వెళ్తాడు. భూషన్ కూడా హైదరాబాదు వెళ్ళిపోయాడు. ఇద్దరు వెళ్ళింది ఉద్యోగ వేటకోసమే.

బొమ్మ హేమాదేవి రాసిన 'సంసార బంధం' నవలలో నిరుద్యోగం గురించి చెప్తూ చదువుకున్నోళ్ళంతా ఉద్యోగం చేయాలని కాదు అనే విషయం బోధపడేట్టు ఉంటుంది. ఇందులో పాత్రలైన బావ బామ్మర్ధులు మాట్లాడుకుంటూ ఉంటారు. బావ బట్టలు ఉతుకుతూ భార్యకూ సహాయం చేస్తాడు. అతడు గెజిటెడ్ ఆఫీసర్. అప్పుదు బావమరిది అయిన గోపి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ నువ్వు బట్టలు ఉతకడమా అంటాడు. నేనేమి తప్పు పని చేయడం లేదు. లంచమైతే తీసుకోవడం లేదు. నా ఉద్యోగానికి డోకా లేదని అంటాడు. నువ్వేం చేస్తావని గోపిని అడగగా బట్టలు కుడతాను అంటాడు. వాళ్ళ అక్క పార్వతి ఆ మాత్రం సంపాదన ఏ క్లర్కు ఉద్యోగానికైనా దొరుకుతుంది. గుడ్డలు కుట్టేందుకు బి.ఎ చదవాల్సిన అవసరం ఏముందని దానికి అటు డబ్బును, ఇటు కాలాన్ని వ్యయం చేశావని అంటుంది. గోపి సమాధానమిస్తూ ఇలా అంటాడు. "ఉద్యోగం కోసం విద్యను ఆర్జించాలన్న ఆభిప్రాయం నాకు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ లేదుగా! మంచి చెడు, పరిస్థితి, మనిషి అవసరాలు, డబ్బు ఈ రకం ముఖ్యమైన విషయాలను స్పష్టంగా అర్థం చేసుకునేందుకు విజ్ఞానం కావాలి. విజ్ఞానం కావాలంటే విద్య ఎంతో అవసరం. పోతే నాలుగు ఇంగ్లీషు ముక్కలు రాగానే గవర్నమెంటు ఉద్యోగమో లేదా ఏవైనా ఆఫీసుల్లోకి పనికివచ్చే పనులో చేయాలని అనుకోవటం వల్లే ఈ నిరుద్యోగ సమస్య రోజు రోజుకు పెరుగుతూ మరీ జటిలంగా తయారవుతోంది అన్నాడు."(హేమాదేవి, బొమ్మ. సంసార బంధం. పుట: 17). ఒక విధంగా ఆలోచిస్తే చదివిన వారందరికీ ఉద్యోగాలు రావు. నేరుగా గవర్నమెంట్ ఉద్యోగమో, ప్రవేటుదో చేయాలంటే అందరికీ అవకాశం రాదు. కనుక సొంతంగా ఏ పని చేసుకున్నా, వ్యాపారం చేసుకున్నా విజ్ఞానం కావాల్సిందేగా అని రచయిత ఉద్దేశం. కాని ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలను ఎన్ని ఉన్నాయో అన్నీ నింపడం లేదు. దానివల్ల కూడా నిరుద్యోగ సమస్య జటిలంగా మారుతుందని చెప్పవచ్చు.

### 4.17. అనుబంధాలు-సంబంధాలు

**ఇరుగు-పొరుగు**

సమాజంలో బాంధవ్యాలు రకరకాలుగా ఉంటాయి. మనుషుల మధ్య అన్యోన్యత, ప్రేమానురాగాలు ఉంటే అందరూ జీవితాంతం కలిసి ఉండవచ్చు. పెద్ద కుటుంబాలుగా, ఉమ్మడి కుటుంబాలుగా ఉండవచ్చు. అదే విధంగా పట్టణాలకు వలస వెళ్ళినప్పుడు పెళ్ళికాక ముందు అబ్బాయిలు కొంతమంది కలిసి ఒక ఇంటిలో లేదా గదిలో ఉంటారు. అదేవిధంగా అమ్మాయిలు కూడా. కాని ప్రత్యేకంగా రెండు వేర్వేరు ప్రాంతాల కుటుంబాలు ఒకే ఇంటిలో అద్దెకుండటం అనేది అరుదుగా కన్పిస్తుంది.

బొమ్మ హేమాదేవి రాసిన 'తరంగాలు' అనే నవలలో ఇరుగు పొరుగు సంబంధాలను చూడవచ్చు. రుమాను పెళ్ళి చేసుకున్న నిర్మల్, విలాస్‌లు ఇంతకు ముందే స్నేహితులు. పెళ్ళి తర్వాత పక్క పక్క ఇళ్ళల్లో ఉండేవారు. తర్వాత వీరిరువురి దంపతులు రుమా–నిర్మల్, విలాస్–సుజ్జీలు ఒకే ఇంటిలో ఉంటారు. ఆ క్రమంలో ఈ విషయాన్ని ముందుకు తెచ్చింది నిర్మల్. రుమా, నిర్మల్‌ల మధ్య జరిగిన సంభాషణ ద్వారా ఇద్దరి కుటుంబాలు అద్దెకు ఉండటం ఎలా సాధ్యమనేది తెలుస్తుంది. ఇలా చిత్రించడం మానవ సంబంధాలు మరింత దృఢంగా ఉండటం కోసం సమాజానికి దోహదపడుతుంది.

"అది కాదు రుమా! ఈలా అందరం ఒకేచోట ఉండటంవల్ల చాలా రకాల లాభాలుంటాయ్... ప్రతి పనిలో ఒకరి సహాయం ఒకరికి దొరకడం వల్ల పని మనుషుల అవసరం ఉండదు. పనిభారం ఉండదు. పోతే నేను టూర్ వెళుతుంటాను. అప్పుడు నిన్ను ఒంటరితనం బాధించదు. ఒంట్లో ఆరోగ్యంగా లేనప్పుడు పరస్పరం సానుభూతి, పరిచర్యలు దొరుకుతాయి రుమా! అన్నీగాక, ఎకనామికల్ పాయింట్‌లో కూడా ఎంతో లాభసాటిగా ఉంటుంది. సమిష్టి కుటుంబంలో ఎన్నో లాభాలు ఉంటాయ్ రుమా! సహనం, ఓర్పు, విశాల

దృష్టి కొంత అలవర్చుకున్నామంటే సంసారంలో చాలా ఆనందాన్ని అనుభవించగలుగుతాము. మొదట్లో బాగానే అనిపించవచ్చు. కాని, క్రమేపి మనస్పర్థలేమైనా వస్తాయేమో!

మనస్పర్థలు రావడానికి మూల కారణం డబ్బు. వాడో వంద ఇస్తాడనుకో, మనమో వంద వేసి మొత్తం రెండు వందలతో సంసారాన్ని నడిపించుకోవాలి. అంటే ముఖ్యమైన అవసరాలకు ఇద్దరం డబ్బు వేస్తాం. కొన్ని చిన్న చిన్న కోరికలుంటాయ్. చూడు సినిమాలకో, మరో వినోదానికో ఎవరి ఖర్చులు వారివే...నేననేది భోజనం వసతి గురించి మాత్రమే. వాళ్ళకన్నా మన మెంబర్స్ ఎక్కువుంటారు, అప్పుడు? ఒకో మెంబర్‌కు 'ఇంత' అని లెక్క వేసుకోవాలి. అలాంటప్పుడు, ఎవరివైపు మెంబర్స్ ఎందరు పెరిగినా చిక్కేముంటుంది? నాకీ విషయాలు అంతగా తెలియవు. మీకిష్టమైతే నాకూ ఇష్టమే. ఇంకో విషయం రుమా! తప్పులు ఎవరివల్ల జరిగినా సర్దుకుపోవాలి. అంతే. తెలివిపరులవల్ల తప్పులు జరగవు రుమా! అమాయకులవల్ల జరుగుతాయని జ్ఞాపకం ఉంచుకోవాలి" (హేమాదేవి, బొమ్మ తరంగాలు. పుట: 75, 76).

ఒకరిపై ఒకరికి ప్రేమ, నమ్మకం, స్పష్టత, సందర్భానుసారంగా వ్యవహరించడం, పరస్పరం సహకరించుకోవడం వంటివి ఉంటే ఎవరైనా ఇరుగు పొరుగు వారి సంబంధాలు బాగుంటాయి. తద్వారా సమజంలో కలహాలు లేకుండా మనిషి సుఖ జీవనం సాగించగలుగుతాడు.

**అన్నా- చెల్లెళ్ళు సంబంధాలు**

చరిత్రలో అన్నా చెల్లెళ్ళ అనుబంధాల గురించి, రాఖీ పౌర్ణమి గురించి పురాణాల్లో అనేక విషయాలు ఉన్నాయి. ప్రధానంగా ఈ అన్నా చెల్లెళ్ల రాఖీ పండగ. తనకు రక్షగా ఉండమని వేడుకునే సందర్భంలోనిదని అందరికి తెలుసు. ఆడపడుచులు వారివారి అన్నయ్య, లేదా తమ్ముళ్ళను రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకోవడం. జీవితాంతం తమకు ప్రేమతో, ఆప్యాయతతో

తోడునీడగా ఉండాలని కోరుకుంటారు ఆడపడుచులు. కట్టిన తర్వాత ఆడపడుచుల కాళ్ళు మగవాళ్ళు మొక్కుతారు. కాని కొన్నిచోట్ల వయసులో ఎవరు పెద్దవారైతే చిన్నవాళ్ళు వారి కాళ్ళు మొక్కాలి. అది రాను రాను రాఖీ కట్టిన తర్వాత సోదరులు కట్నకానుకలు ఇచ్చేస్థాయికి చేరింది. అంటే ఎప్పటికప్పుడు బాకీ తీర్చుకోవడమే అవుతుంది. అటువంటి విషయాలను హేమాదేవి, బొమ్మ 'కళావతి' నవలలో చిత్రించారు. "ఇలాంటి ఆచారాలను పాటించగూడదు రసికా! ఇవ్వలేక వాళ్ళు బాధపడతారు. వాళ్ళ బాధను చూసి మనం బాధపడతాం. అయితే, ఇంక ఈ రోజుకోసం ఇంతగా నిరీక్షించడం ఎందుకు? ఇన్ని ఆర్భాటాలు, అలంకరణలు ఎందుకు? బాధ పడేందుకేనా? పండుగ రోజు సంతోషంగా ఉండాలి. అలా ఉంటేనే దాన్ని 'పండుగ' అని అనగలుగుతాం. రాఖీ పౌర్ణిమ వస్తుందనగానే అన్నయ్యలిద్దరూ తమ పనులన్నీ మరచిపోయి, చెల్లెళ్ళకు ఏం ఇవ్వాలి? అనే ఆలోచనల్లో మునిగిపోతారు. అనుకోకుండానే ఆరోజు వాళ్ళకు భారాన్ని బాధను తెచ్చిపెడుతుంది.

ఆ కాస్త అయినా ఇచ్చుకోకపోతే వాళ్ళు మరీ బాధపడరు. వాళ్ళ ప్రేమను ఈ విధంగా కొలవడం బాగుండదు, రసికా! కట్నాలు, కానుకల రూపంలో వాళ్ళ ప్రేమంతా ఖర్చయిపోతుంది. ఇక మనుష్యుల విలువలు మాసిపోయి, నాణేల విలువలే మిగులుతాయ్! ఆత్మీయతను అమ్ముకోవడం, కొనుక్కోవడం అవుతుంది. 'రాఖీ కడుతున్నాను' అన్న నెపంతో నువ్వు ఆత్మీయతను అమ్ముతావు; 'కట్నం ఇస్తున్నాను' అన్న ధీమతో అన్నయ్య దాన్ని కొనుక్కుంటాడు. కొన్నిరోజులు పోయాక నీ దగ్గర ఆత్మీయత ఉండదు, అన్నయ్య దగ్గర కట్నం ఉండదు. ఆత్మీయతనే ఇచ్చి, ఆత్మీయతనే పుచ్చుకోవడంవల్ల ఇలాంటి ఇబ్బందులేవీ కలగవు. నువ్వు, ఎంత, ఏమిస్తావో అన్నయ్య అంతే దాన్నిస్తాడు. ఈ విధంగా ఖర్చయినదీ మళ్ళీ తిరిగి వస్తుంది." (హేమాదేవి, బొమ్మ. కళావతి. పుట: 8). ప్రేమను, ఆప్యాయతను కొనుక్కోవడం వంటివి జరగకూడదని రచయిత్రి బొమ్మ హేమాదేవి కళావతి నవల ద్వారా తెలియజేశారు.

## 4.18. లైంగిక బానిసగా స్త్రీ - శరీర వాంఛను కోరే స్త్రీ

మగవారు స్త్రీని లైంగికంగా మాత్రమే చూస్తారనటానికి మహానంద నవల సాక్ష్యంగా నిలుస్తుంది. "నీ సౌందర్యానికి నేను దాసుణ్ణి ఐపోయాను. నీ అందం యింత... అంత... అని తానేం మాట్లాడుతున్నాడో తనకే తెలియని విధానంలో మాట్లాడి. మోటుగా కృష్ణని తనపై లాక్కొని తన అవసరం పూర్తిచేసుకొని మంచంలో పడి నిద్రపోయాడు.

దగ్గరగా మూడు గంటల రాత్రయింది. కృష్ణ మంచం మీదనుండి లేచి కిటికీలో కూర్చుని బయటికి చీకట్లోకి చూడసాగింది. మనస్సులో ఎన్నెన్నో ఆలోచనలు భార్యాభర్తల అనురాగం అంటే ఇదేనా? ఇంతేనా. దీనికోసమే స్త్రీ తనని పురుషుడికి అర్పితం చేసుకుంటుందా? ఆత్మాభిమానం, స్వతంత్ర్యం, స్వేచ్ఛకన్నా ఇందులో ఆనందం, ఆకర్షణ ఈ సుఖంలో ఉంటుందని అంటారే అట్లాంటిదేం లేదే అనుకుని మళ్ళీ తొందరపడి నిర్ణయం చేస్తున్నానేమో అనుకుంది." (హేమాదేవి, బొమ్మ. మహానంద. పుట: 32). ఇలా ఒంటరిగా బాధపడుతూ కూర్చున్న కృష్ణని తన భర్త రామచంద్రం అక్కడ కూర్చున్నావా? అని అంటూ మళ్ళీ దగ్గరకు తీసుకొని అవసరం తీరగానే, ఇక కిందపడుకో, ఒంటరిగా తప్ప నేను నిద్రపోలేను అని చెప్తాడు. అప్పుడు కృష్ణ అవసరం పూర్తికాగానే మనిషి ఎంత సంస్కార విహీనంగా మారిపోతాడేమిటి! అని, ఇట్లాంటి ప్రవర్తన కేవలం మగవాళ్ళే ప్రవర్తించగలుగుతారేమో అని కూడా అనుకుంటుంది. తల్లిగారింట్లో మోడు బారినట్లుగా ఉండేది. కాని అత్తవారింట్లోనైనా ఏదైనా మార్పుకు ఆశించి వుంటుంది. అంతకంటే హీనంగా అనిపించడంతో కృష్ణ ఏడుస్తుంది.

అత్తగారింట్లో వంచిన నడుం ఎత్తకుండా పని చేయాల్సి వస్తుంది. తల్లిగారింటో అసలు చేయకుండా ఉండేదని కాదు. కాని తల్లి దగ్గర సుభద్ర, కార్తి, తల్లి వీళ్ళ సహాయం ఉండేది. ఇక్కడ అత్తగారు పనులు పురమాయించడమేగాని చేత్తో ఒక్కపని తాకదు. సుహాసిని చేసిన పనులకు వంకలు పెట్టడం తప్ప చిన్న పని కూడా ముట్టుకోదు. సుభద్రకు తాను, కార్తి ఆ చివరకు తన తల్లికూడా ఎంతో సహాయకారంగా ఉండేవాళ్ళు. వీళ్ళేమిటి ఇట్లా ఉన్నారు?

అనుకుంది కృష్ణ. ఈ దేశంలోని స్త్రీలు ఇంకెన్ని కష్టాలు పడుతున్నారో, ఆ కొందరికన్నా తను నయమేమో అనుకుంది. సాయంకాలం టిఫిన్, టీ రాత్రికి భోజనం, ఆ తర్వాత వంటిల్లు సర్దడం అన్నీ ఐపోయాక మేడ మీదికి భర్త ఉండే గదిలోకి వెళ్ళేసరికి రాత్రి పదకొండు గంటలైంది. అప్పుడు కృష్ణ రాకను గమనించగానే ఇప్పుడా వచ్చేది, నేను ఎంతసేపు నీకోసం ఎదురుచూడలి అని అంటాడు. అప్పుడు పనవ్వగానే వెంటనే వచ్చాను అంటూ నవ్వుతుంది. ముందు ఆ నవ్వాపు అంటాడు రామచంద్రం. ఎందుకు అని కృష్ణ ప్రశ్నించగానే "చూడు మొదటిసారి ప్రశ్నించావ్ గాబట్టి ఊరుకుంటున్నాను. ఇంకోసారి ప్రశ్నించటం, నేను సమాధానం ఇవ్వటం అంటూ ఉండదు. నేను చెప్పింది నీకు బ్రహ్మ వాక్కు. నామాటే నీకు వేదం. నేను చెప్పినట్టు వినటమే నీ ధర్మం. నేనే నీలోకం. మరి అతని ధర్మాలు అతని లోకం గురించి అడగాలనుకుంది కృష్ణవేణి. కాని, ప్రశ్నించకూడదన్న భర్త శాసనం గుర్తుకు రాగానే ఊరుకుంది. తొమ్మిదిగంటల రాత్రికల్లా నువ్వు నా గదిలోకి వచ్చేయాలి రామచంద్రం అన్నాడు. అంత తొందరగా తెమలదండీ. అందరూ అన్నాలు తిన్నాక కంచాలు కడిగి వంటిల్లు కడిగిగాని అత్తయ్య వెళ్ళగూడదంటారు. అవన్నీ నాకు తెలియవు. అమ్మతో ఏం చెప్పుకుంటావో నీకే తెలుసు. రోజంతా ఆఫీసులో చాకిరీ చేసి మళ్ళీ యింటికి వచ్చాక నిరీక్షిస్తూ కూర్చోలేను. మీ ఆఫీసులో పనికి ఇన్నిగంటల నియమం వుంటుంది. యింటి పనులకు అట్లా కాదుకదాండీ. ఐతే ప్రియురాలి కోసం నిరీక్షిస్తూ కూచున్నట్లు పెళ్ళాంకోసం కూడా నిరీక్షిస్తూ కూచోమంటావా? నేనే నీ లోకం అన్న భర్త తనని కనీసం ప్రియురాలిగానైనా చూళ్ళేకపోయినాడు. నవ్వు వచ్చింది కృష్ణకు."(హేమాదేవి, బొమ్మ మహానంద. పుట: 34, 35). ఇంట్లో పనులన్నీ ఎన్ని ఉన్నాసరే పడకగదిలోకి సమయానికి రావాలని హుకూం జారీ చేస్తాడు భర్త. ఇంట్లో పనులన్నీ తప్పక చేసి మరీ వెళ్ళాల్సిందే అంటుంది అత్త. అంటే స్త్రీ వంటింటి బానిసగా ఉంటూనే 'లైంగిక బానిస'గా తన వంతు పాత్రను బలవంతంగానైనా పోషిస్తూనే ఉండాలి. లేకపోతే అటూ చూస్తే అత్తగారి అజామాయిషీ. ఇటు చూస్తే లైంగిక వాంఛతో ఉన్న భర్తతో నలిగిపోతుంటుంది.

ఇంకా భర్తైన రామచంద్రం తినందే భార్య తినకూడదు. అతను పడుకోందే ఆమె పడుకోకూడదు. భర్త శారీరక సుఖం కోరివచ్చినప్పుడు అదే మహాభాగ్యం అని సహకరించాలి. లేనప్పుడు అట్లాంటి తలంపులే రానీయకూడదు. అన్నట్లు నీకు ఇల్లాటి విషయాలేవీ మీవాళ్ళు చెప్పనట్టున్నారు. ఐతే నీకు స్త్రీ ధర్మాలు అన్న పుస్తకం కొనుక్కొచ్చి యిస్తేగాని సరిపడదనుకుంటాను. ఆ ధర్మాలన్నీ నువ్వు చదివి పాటించావంటే మన ఇల్లు స్వర్గలోకం, నువ్వు దేవతవు అవుతావు అని అంటాడు రామచంద్రం. ఇక్కడ లైంగిక బానిస అనడంలో ఉద్దేశమేమిటో పైన మొదట ఇచ్చిన సంభాషణను చూడవచ్చు.

లైంగిక వాంఛకు సంబంధించి ఇంకో కోణాన్ని కూడా చూడవచ్చు. మహానంద నవలలోనే కృష్ణవేణి చెల్లెలు కార్తీకి సంబంధించిన విషయంలో చూస్తే తనకు లైంగిక ఆనందం దక్కదు. కారణం తన భర్త సహకరించకపోవడం వల్ల ఆమె లైంగిక కోరికను చంపుకోవాల్సి వస్తుంది. కాని ఏదో నైరాశ్యంతో ఉన్నా, తనకు తాను సముదాయించుకుంటుంది. కార్తీ మాటల్లోనే చూస్తే "ఐనా అది... ఆ సుఖం మాత్రమే కాదుగా. వారు నన్నెంతో ఆదరంగా చూచుకుంటారు. నాకా ఇంట్లో నేను కనివిని, ఎరుగని, ఆశించని విధానాల్లో సుఖభోగాలున్నాయి. వారు వయస్సు మీరిన వారన్న చిన్న లోపం తప్పా యింకేం లేదు. ఆ లోపం గురించి నాకు పెద్దగా పట్టించుకోవాలని ఉండదు. ఆ కోరికలన్నీ క్రమంగా అదుపులో ఉంచుకోగల్గుతున్నాను.

అదుపులో కాదు. ఆ కోరికల్ని, ఆశల్ని చంపుకుంటున్నావు కార్తీ. నీ బాధ, అసంతృప్తి చాలా హింసాత్మకమైనవి మనిషిని చాలా బాధిస్తాయి. నీకు ఆ కోరికలుండటం సహజం. అవి కావాలని కోరడం నీ జన్మహక్కు. అంతేగాని పెద్దపెద్ద భవనాలను చూచి యౌవనపు కోరికలు కృంగిపోవు. దాస దాసీలవల్ల చల్లారే ఉద్రేకము కాదు. విలువైన ఆభరణాల తాకిడికి శరీర వాంఛలు అంతం కావు. వయసులో ఉన్న భార్యను వయసు మీరిన భర్త ఏ విధంగాను తృప్తి

పరచలేదు." (హేమాదేవి, బొమ్మ. మహానంద. పుట: 55). అంటే ఇక్కడ ప్రకృతి ధర్మంగా స్త్రీ పురుషులిరువురికి శరీర వాంఛ ఉండటం సహజం. కాని ఇద్దరికీ కోరికలు, మనస్సులు ఒకటై సహకరించుకుంటేనే అవి సాధ్యమవుతాయని చెప్పవచ్చు.

కృష్ణవేణికి శరీర వాంఛ తీరుతుంది. కాని యాంత్రికంగా భర్త అవసరం మేరకు మాత్రమే. కాని మనసు నిండా మాట్లాడి, హృదయానికి తాకేలా ప్రేమతో తన భర్త చూడటం లేదు. కేవలం మగవారి అవసరం తీరే ఒక యంత్రం లాగా చూస్తున్నాడు తప్ప ప్రేమ ఏమాత్రం లేదు, హింసే ఉంటుంది. అదే కార్తీ విషయంలో యుక్తవయసులో ఉండటం, తన భర్తేమే వయసు మీరినవాడు కావడం వల్ల తనను శారీరకంగా తృప్తిపరచడం లేదు. రచయిత్రి లైంగికానికి సంబంధించిన ద్వైదీభావాలను 'మహానంద' నవలలో చెప్పారు.

### 4.19. కుల ఆచార వ్యవహారాలు - జరిమానాలు

"స్వాతంత్ర్యానంతరం గ్రామీణ కుటీర పరిశ్రమగా, స్వయం సాధికారత కలిగిన చేనేత పరిశ్రమకు పెద్దగ మేలు జరిగిందేమీ లేదు. అంతకుముందు నుంచే దేశంలో స్వయం ఉపాధి మార్గంలో పరస్పరం సహకారంతో బతుకు వెళ్ళదీస్తున్న చేనేత పరిశ్రమపై బ్రిటీష్ సామ్రాజ్యవాదుల ఆధునిక యంత్రపరికరాల రాకతో ప్రభావం క్రమంగా మొదలైంది. చేతి మగ్గాల స్థానంలో మర మగ్గాలు క్రమంగా ఆక్రమించడం ప్రారంభించాయి." (లోకమలహరి. కోడం కుమారస్వామి(ముందుమాట). జెగ్గని యిద్దె, సంఘము. పుట: 69). లోకమలహరి రాసిన 'సంఘము' నవలలో పద్మశాలీల చేనేత వృత్తి గురించిన కష్ట నష్టాలను ఇందులో విశ్లేషించారు.

ఆనాటి సమాజంలోని కులపెద్దలు సాటి కులస్తులను ఎన్నో ఇబ్బందులకు గురి చేసేవారు. అలా పద్మశాలీల కులపెద్దల అరాచకాలను, గ్రామ అధికారుల అణచివేతలను

వివరిస్తూ కుల చైతన్యాన్ని మేల్కొల్పారు. ముఖ్యంగా కులపెద్దల అక్రమ పద్ధతులు, కులం కట్టుబాట్లు, నిర్బంధ తీర్పులవల్ల అనాధలైన నిరుపేద మహిళలకు సంభవించిన ధీనావస్థను చిత్రించారు రచయిత. నేడు ఆశ్చర్యంగా కనిపించే విషయాలు నాటి సమాజంలో జరిగిన విషయాల ఆధారంగానే 'సంఘము' నవల రాశారు. కులపెద్దల అఘాయిత్యాలు నిజామాబాదు, కరీంనగర్ జిల్లాలలో జరిగిన ఘటనల వాస్తవికతలే నేపథ్యంగా నవలకు ఇతివృత్తంగా స్వీకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పద్మశాలీల గాధలను చిత్రించారు రచయిత. అదేవిధంగా నాటి సమాజంలో మొత్తంగా పల్లెల్లో దొరల అధికార ఆగడాలను కూడా ఇందులో చిత్రించారు. ఈ నవల స్వాతంత్ర్యానంతరం వచ్చిన నవల కాబట్టి దానికి ముందు వెనక పద్మశాలీల పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు.

సంఘము నవలలో ప్రధాన పాత్ర పద్మాశాలీ కులానికి చెందిన భర్త చనిపోయిన బుచ్చమ్మ నిరుపేదరాలి బతుకు చిత్రణ. ఈమెకు ఆరేళ్ళ కొడుకు రామస్వామి. ఇతడు చిన్నతనంలో పక్క గ్రామంలో జరిగే జాతరకు వెళ్ళి కనిపించకుండా వెళ్తాడు. ఉన్న ఒక్క బిడ్డను సాదుకుంటూ బుచ్చమ్మ కూలీనాలీ చేసుకుంటూ బతుకుతుంది. కూలీ పనులు దొరకనపుడు కోమట్లు, బ్రాహ్మణుల ఇండ్లలో పాచీపనులు చేస్తూ జీవనం గడుపుతుంది. ఇతర కులాలకు చెందిన ఇళ్ళలో బుచ్చమ్మ పనిచేయడం కులపెద్దలు తప్పుగా ఆరోపిస్తూ, కుల బహిష్కరణ చేస్తారు. అలా చేయవలసి వచ్చినప్పుడు నర్సయ్య కులపెద్దను ప్రశ్నిస్తాడు. ఆమెను వెలివేయడం సరికాదంటాడు. "ఇది కాని పనని ఎట్లా అంటారు రామలింగంగారూ? పద్మశాలీలు నేతపని తప్ప ఇక వేరే కృషి చేయవద్దంటారా? ఈ కాలంలో నేసేవాళ్ళకే పొట్టడచుట దుస్తరంగా వుంది. కొందరు మన బీద సోదరులు పడుగులనే పాగాలుగా జుట్టుకొంటున్నారు. ఇంకా ఎందరో పొక్కపూటకైనా సరిగా లేక వేగిస్తున్నారు. అట్టి రోజుల్లో ఒక బీద స్త్రీ చేసుకొని బతుకుతూంటే కాదంటారేమిటి? కాలమొచ్చిందంటే అదే బ్రాహ్మడు శ్రీమంతుడైన మన కులస్తునింట్లో వంటవాడుగా వుండడా? అంత మాత్రాన అతని కులగౌరవాలకేమి లోటొస్తుంది? ఏమైనాగాని

తాము కాస్త కులస్థులతో ఈమాత్రమైనా జెప్పి సహాయపడాలి."(లోకమలహరి. సంఘము. పుట: 76). కుల కట్టడి అన్నప్పుడు చాలా విషయాల్లో మన కులం పాటించని వాటిని చెప్పి మరీ ఈ బీదరాలుకి జరిమానా విధించడం ఏమాత్రం సమంజసం కాదని చెప్తాడు. ఆమెకు ఇరువై రూపాయలు జరిమానా కూడా విధిస్తారు. ఇంట్లో వస్తువులమ్మి, కూలీనాలీ చేసి కులపెద్దలకు చెల్లించినప్పటికీ బుచ్చమ్మకు బ్రాహ్మణుల ఇళ్ళలో పాచీపనులు చేయడం తప్ప మరోమార్గం లేదు. మళ్ళీ కులపెద్దల బెదిరింపులు, వేదింపులకు దిగడంతో చివరకు ఉన్న ఊరును విడిచిపెట్టి పక్కన వెంకటాపురం వెళ్ళి ఒక కోమట్ల ఇంట్లో చేరినప్పటికీ సేటమ్మ చీదరింపులు భరించలేక ఇంద్రసాగరంలోని దేశ్‌పాండేల ఇంటిలో పనికి కుదుర్చుకుంటుంది. సుమారు డెబ్బై ఏళ్ళ క్రితం తెలంగాణ సమాజంలోని సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలను రచయిత లోకమలహరి చక్కగా తన నవలలో విశ్లేషించడం గమనార్హం. పద్మశాలీల సామాజిక వర్గంలోనే తమకంటే నిరుపేదలపై కుల బహిష్కరణ ఆయుధం అడ్డుపెట్టుకొని ఊర్లను ఏలుతున్న కులపిశాచాల నైజాన్ని 'సంఘం' బట్టబయలు చేస్తుంది.

### 4.20. చేనేత వృత్తి - కష్టాలు

హైదరాబాదు రాజ్య పాలకుడైన నిజాంపై పోలీసు చర్య తర్వాత జరిగిన పరిణామాలను సంఘము నవలలో చూడవచ్చు. పటేలు, కరణాలు, సర్కారు ఉద్యోగులు, వేదింపులు, వెట్టిచాకిరుల వల్ల కలిగే కష్టాలు కొంతమేర తగ్గినప్పటికీ పల్లెల్లో చాలాచోట్ల అలాగే ఉండేవి. లోకమలహరి సంఘము నవలలో ప్రధానంగా చేనేత వృత్తువారైన పద్మశాలీల కష్ట నష్టాలను చూడవచ్చు. "తెలుగు సాహిత్యంలో మొదటిసారిగ వృత్తి నవలను రాసిన ఘనత కేవలం లోకమలహరి గారికే దక్కిందని నేను భావిస్తున్నాను. సంఘ సంస్కరణ, అభ్యుదయం, తెలంగాణ సాయుధ పోరాటం, భూ సమస్య తదితర అంశాలు తెలుగు నవలల్లో చిత్రించినప్పటికీ వృత్తి జీవితాలను చిత్రించిన తొలి నవల 'సంఘం'." (లోకమలహరి. కుమారస్వామి, కోదం

(ముందుమాట). సంఘము. పుట: 74). దీన్ని బట్టి వృత్తి జీవితాలను చిత్రించిన తొలి నవల 'సంఘము' అని తెలుస్తుంది.

మిల్లు గుడ్డలకు, చేనేత బట్టలకు మధ్య పోటీ తీవ్రతవల్ల చేనేత బట్ట ప్రాధాన్యతను పారిశ్రామిక సంఘాల ద్వారా ప్రజలకు తెలియజేయడమే కాకుండా, చేనేత వృత్తుల వారికి సరిపడ నూలు అందజేయాలని, వినియోగదారులను ఆకర్షించే విధంగా నేయాలని పద్మశాలీలకు ఆత్మస్థైర్యం కల్పిస్తాడు. కొన్నిరకాల వస్త్రాలను మాత్రమే మిల్లుద్వారా తయారుచేయాలని వాటికి సుంకం విధించాలని, చేనేత గుడ్డలకు సుంకం విధించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దుర్గాప్రసాద్ రాత్రింబవళ్ళు కృషి చేస్తూ బుక్కరావుపేట చేనేత పారిశ్రామిక సంఘానికి అధ్యక్షుడవుతాడు. ఊళ్ళోని ఏ పద్మశాలీలు బుచ్చమ్మను వెలివేస్తారో అదే కులం ఆర్థికాభివృద్ధికి లాయర్ ప్రసాద్ చేస్తున్న కృషిని వెంకయ్య గోపాల్‌కు చెప్పడంతో ఆశ్చర్యపోతాడు.

నూలు ఇచ్చే ఏజెంట్ల వల్ల నష్టపోయి చేనేత వృత్తి చేయలేక, వీరికి వ్యతిరేకంగా వచ్చే నూలు మిల్లుల్లో పనిచేయడానికే బొంబాయి వెళ్లేవారు పద్మశాలీలు. "ఇంకా విను సోమన్నా! మన బొంబాయి మిత్రులకు ఎంతోమందికి నేత అసలే రాదు. వారి స్త్రీలకు మన కులకశిపి ఆవంతైనా రాదు. రెండు పనులు బాగా వస్తాయి. 'బీడీలు కట్టుట, బీడాలు నములుట' ఒకప్పుడీ శాలీలు పద్మ తంతువులచే సున్నితమగు వస్త్రాలు నేసి ముందుగా దేవతల కర్పించి సంతుష్టిపరచి 'పద్మశాలీ'లను సార్థక నామము వడసినారు. ఇంతేగాదు. మన శాలీలు నేసిన దూదు గుడ్డలు శాలీని వలకంటే మిక్కిలి సున్నితంగా ఉండేవట. సనుగులు తయారుచేసి డబ్బీలలో ఇముడ్చువారట. ఇంకాయెన్నో కథలుగా చెప్పుకుంటారు. అదంతా నిజమే. అందులోని ఒక చిన్న సంగతి వినిపిస్తాను వినండి. మొగులాయి సుల్తానుల్లోని ఔరంగజేబు పేరు విననివారుండరు. అతన్ని 'ఆలంగీరు' అని కూడా అంటారు. అతని పుత్రిక పేరు జేబున్నిసా బేగం. ఆమెతో

ఒకనాడు 'దేహం కనిపించేటట్టు చీరె కట్టుకున్నావెందుకు? అని అలంగీరన్నాడట. అందుకు ఈ చీరెను ఏడువరుసలు(చుట్లు) చుట్టుకున్నాను. అని జీబున్నిసా జవాబు చెప్పిందట. అప్పటికే మిల్లులైతే లేవుగదా! చేతవడికి చేత నేసిన గుడ్డలు కూడా అంత నుతికెక్కి యుండినవన్నమాట. మన భారతదేశపు చేనేత గుడ్డలు పాశ్చాత్య దేశాలందేగాక అన్ని నాగరిక దేశాలందునూ మన్నికా, గౌరవము పొంది యుండెను. ఇప్పటి మిల్లుల యెదుట మన పనితనముకేమి గౌరవం లేదు. అంతతి ఓర్పుతో పనిచేసే శ్రామికులు కూడా ఇప్పుడరుదైనారు. ఉన్నను పొట్ట గడవక పని మానేశారు, తెలిసిందా!

అయితే గుడ్డ మిల్లులు మన పాలిటి శత్రువులనిన తప్పుకాదు. వీని మూలాన మన వృత్తికి మిక్కిలి నష్టము కలిగింది. మనమందరం ఈ మిల్లులో పని చేయొద్దని ఒట్టుపెట్టుకొని మానేస్తె కార్మికులు చిక్కక యజమానులు మిల్లులు మూసేస్తారు. తర్వాత మనవారంతా క్రమంగా మన చేనేతపనికే పాటుపడతారు. నేత గుడ్డకు మళ్ళీ పూర్వపు గొప్పదనం లభిస్తాది. మన స్త్రీలను బీడీలు చేయుట కూడా మాన్పాలి." (లోకమలహరి. సంఘము. పుట: 94).

సంఘము నవలలో ప్రధాన పాత్ర బుచ్చమ్మ. ఆమె భర్తలేక ఇద్దరు పిల్లలు దుర్గాప్రసాద్, శ్యామల. చేనేత వృత్తిలో తినడానికి తిండికి కూడా గడవని పరిస్థితుల్లో బ్రాహ్మణుల ఇళ్ళలో పనిచేస్తుంది. దాన్ని తప్పుబట్టి జరిమానా కూడా విధిస్తారు. తట్టుకోలేని బుచ్చమ్మ ఊర్లోనుంచి వెళ్తుంది. కొడుకు దుర్గాప్రసాద్ జాతరకు వెళ్లి కనబడకుండా పోతాడు. తర్వాత లాయర్‌గా తన ఊరికి వచ్చి, తన తల్లిని వెలివేసిన కులానికే సేవ చేయడానికి వస్తాడు. పద్మశాలీలను ఏకంచేసి సంఘం ఏర్పాటు చేపించి, వారికి అన్నివిధాల సహకరించుకుంటూ మిల్లుల బట్టలకంటే, చేనేత బట్టలకు మంచి ఆకర్షణ కలిగేలా తయారుచేస్తే ప్రజలు మన నేసిన వస్త్రాలనే కొంటారని సలహాలనిస్తూ, సహకార సంఘం ద్వారా రుణాలు ఇప్పిస్తూ పద్మాశాలీల చేనేత వృత్తికై దోహదపడతాడు.

రాధ వాళ్ళ నాన్నకు యాత్ర ప్రయాణాలు చేయటం అలవాటు. ఆ క్రమంలో ప్రపంచ యాత్రికులు డాలర్, రూబుల్ అనే ఇద్దరు యాత్రికులు ఆయనకు పరిచయమవుతారు. వారిని ఇంటికి తీసుకువస్తాడు. "అయితే మొదట అమ్మాయి పుట్టింది. 'శివాయిని' అని పేరు పెట్టాం. రెండవసారి అమ్మాయే 'దాక్షాయణీ' మళ్ళీ మూడవమారు కూడ అమ్మాయే పుట్టింది. 'పార్వతి' అని పేరు పెట్టుకున్నాము. ఇంకా కొన్ని రోజులకు మా ఆవిడ 'పాపను కంటాను' అంది. 'ఆడపాపను మాత్రం వద్దు' అన్నాను. ఇంట్లో ఎవరూ ఈసారి ఆడపాపను పేరుపెట్టి పిల్చేందుకు ఒప్పుకోలేదు. యాత్రలకు బయలుదేరాము. ఏ భగవంతుని అనుగ్రహం వల్లనైనా కడుపులోని అమ్మాయి అబ్బాయి కాకపోతాడా అని! 'బృందావనం'లో మా ఆవిడ పాపను కంది. ఆ స్థలానికీ సంబంధించినట్లు 'రాధ' అని పేరు పెట్టాము. ఇంట్లో అందర్నీ ఎదిరించుకుంటూ ఎంతో దర్జాగా వచ్చింది. అందుకే మేము 'రాజా బేటీ' అని పిలుస్తూ వుంటాం' నవ్వుతూ ముగించారు నాన్న. అతిథులు యిద్దరూ నవ్వుతూ ఊఁ ఇంకా? ఎంతో ఉత్సాహంగా అన్నారు.

ఇంకేముంది. పుట్టడమయితే ఆడపిల్లగానే పుట్టిందిగాని పెరగడంలో అన్నీ మగలక్షణాలే. క్షణం యింట్లో వుండదు. మగవాళ్ళు ఆడే అన్నిరకాల ఆటలో ఈమెకు ప్రావీణ్యత వుంది. 'హార్స్ రేస్'లో మొన్న ఓ కప్పుకూడ గెల్చుకుంది. మోటార్ బైక్ రేసులోనే అనుకుంటాను కాలు విరగ్గొట్టుకొని కప్పు తెచ్చుకుంది. అయితే కాలు యిప్పుడు బాగానే ఉందనుకోండి. దుస్తులు కూడా యివే. చీర కట్టుకోదు. చక్కగా జడవేసుకుని ఎరుగదు. ఇహ ఆ హంటర్ ఒకటి చేతిలో వుంచుకుని, యింట్లో అందరినీ భయపెట్టాలని చూస్తూ వుంటుంది. పేరంటాలకు వెళ్ళమంటే ఆడవాళ్ళను చూస్తే సిగ్గేస్తుంది. అని అంటుంది. అని నా వైపుకు తిరిగి ఏం బాబూ, అంతేనా? నవ్వుతూ అడిగారు నాన్న." (హేమాదేవి, బొమ్మ. లవ్ స్టోరీ. పుట: 9, 10).

కాంతారావు దంపతులకు నలుగురు కూతుర్లు పుడతారు. వారు అబ్బాయి కావాలని ఎంతో ఎదురుచూశారు. కాని ముగ్గురు అమ్మాయిల తర్వాత కూడా అమ్మాయే పుడుతుంది. చివరమ్మాయి రాధను మగపిల్లవాడిలా పెంచుతారు. ఆడవాళ్లు చేయలేని సాహసోపేతమైన పనులను కూడా అలవోకగా చేస్తుంది.

వీరి కుటుంబం లాగే రాధాపురి జమీందారిగారి కుటుంబం కూడా అలాగే ఉంది. జమీందారికి కూడా ముగ్గురు కొడుకుల తర్వాత కూడా మళ్ళో కొడుకే పుడతాడు. అతన్ని ఆడపిల్లగా పెంచుతారు. లక్షణాలు, ప్రవర్తన కూడా అమ్మాయిలాగే ఉంటాయి. ఆ అబ్బాయిని చిన్నతనం నుండి తల్లి ఆడపిల్లను పెంచినట్లుగా  తలదువ్వి జడ వేయడం, అతన నగల్ని అబ్బాయికి పెట్టి సంబరపడటం, ఫ్రాకులు, లంగాలు వేయటం, వయస్సు వచ్చేవరకు కూడా తల్లి అబ్బాయిని అమ్మాయిలాగే. కాని విచక్షణ లేని ఈ పనివల్ల అబ్బాయి చాలావరకు అమ్మాయిలాగే మారిపోయాడు. చూసింది మగవాళ్లను చూసి అప్పుడప్పుడు సిగ్గుపడుతుంటాడట. నడవటం, కూర్చోవటం, మాట్లాడటం అన్నీ ఆడలక్షణాలే. ఇతనికంటే పెద్దబ్బాయిలకు పెళ్ళి చేయాలనుకుంటారు. వారు మాత్రం తమ్ముని పెళ్ళి సంబంధం కుదిరితేనా మేము చేసుకుంటాం అని అంటారు. రాధా విషయంలో వాళ్ళ అక్కలు కూడా అందరి పెళ్ళిళ్ళు ఒకేసారి చేసుకోవాలని చూస్తారు. రాధకు మేనబావ ఉన్నారు. వాళ్ళు ప్రేమించున్నారు. కాని ఈమె అతన్ని పెళ్ళి చేసుకుంటే ఈమె అక్కల పెళ్ళిళ్ళు కావు. కనుక తండ్రి తెచ్చిన రాధాపురి జమిందారి కొడుకుల సంబంధం తీసుకువస్తాడు. కాని చివరి కొడుకు విష్ణుని పెళ్ళి చేసుకోవాలా? వద్దా అని తర్జన భర్జన పడుతుంది.

“పెళ్ళి కొడుకుల మాట చెవుల్లో పడగానే ముగ్గురక్కయ్యలు వికసించిన ముఖాలతో ఎంతో ఆశగా నాన్నవైపు చూచారు. తర్వాత వాళ్ళముఖాలు ఎలా కుచించుకుపోయాయి! ఆ అబ్బాయి అన్నయ్యలు, తల్లీ, తండ్రీ వాళ్ళు ఎంత బాధపడుతూ వుండి వుంటారు! ఎన్నెన్నో

ఆలోచనలు నిద్రను రానిచ్చాయి కాదు. పరిచయంలేని చిన్నబ్బాయి ముఖంకూడా కళ్ళల్లోకి వచ్చింది. దీనత్వం, నిరాశ, సిగ్గు, చేతగానితనం ఇవన్నీ కలిపి ఓ మూర్తిని తయారుచేస్తే ఎలా ఉంటుందో ఆ అబ్బాయి ఆకారం ఆ రూపంగా అనిపించింది.

నన్ను ఎవరూ దగ్గరకు తీసుకోరు, నేను ఎవరికీ పనికిరాను. నన్ను అమ్మ, నాన్న యిలా తయారుచేశారు. రెండు చేతుల్లో ముఖం దాచుకుని ఈ మాటలు అతను అంటున్నట్టు అనిపించింది. వెంటనే హృదయంలో ఏదో కదలాండింది. ఏ పండు విత్తనమైనా పడిందా? చిగురించి మొగ్గ తొడిగిందా? ఏమిటది? అనిపించింది.

అవును ఆ అబ్బాయిని నేనెందుకు పెళ్ళి చేసుకోకూడదు? నాకు తెలియకుండానే ఈ మాటల్ని ఉచ్చరించాను. రాధా! అకస్మాత్తుగా బావ పిలుపు వినిపించి చుట్టుపక్కల చూచాను. గదిలో బెడ్ లైట్ వెలుగు తప్ప మరేమీ కనిపించలేదు. అవును... మరి బావ? నేను లేకుండా బావ, బావ లేకుండా నేను వుండగలుగుతామా? వెంటనే పార్వతితో నేను ప్రేమ వేరు, పెళ్ళి వేరు అన్న మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. అనుభవంలేని మాట! పార్వతి అక్క అన్న మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి నిజమే! అనుభవంలేని మాటే అన్నాను.

బావను నేను బాధపెట్టలేను. బావ నా కొరకు తపించి పోతూవుంటే చూస్తూ ఊరుకోలేను. భగవంతుడా! ఏమిటీ ఈ రోజు ఈ ఆలోచన వచ్చింది? చిన్నతనంలోనే తల్లిదండ్రుల ప్రేమకు దూరమై, యవ్వనంలో ప్రేయసి అనురాగానికి దూరమవుతాడా? లేదు, లేదు, లేదు.. నేను బావను మోసం చేయను! అయినా ఇది మోసం ఎలా అవుతుంది? నేను, బావ కష్టపడ్డామంటే ఎందరి జీవితాల్లోనో ఆనందం, సుఖం ప్రవేశిస్తుంది. నలుగురు వాళ్ళు. వాళ్ళ తల్లి తండ్రి, అక్కయ్యలు, అమ్మా, నాన్న ఇందరికొరకు మేమిద్దరం కష్టపడటం లెక్కకు వచ్చే విషయం ఏమీకాదు. లాభసాటి బేరమే. అవును ప్రపంచమే ఓ పెద్ద వ్యాపార కేంద్రం కాని

బావ... బావకు లోటు లోపం ఏమిటి? నాకన్నా ఎన్నో రెట్లు అధికురాలు అతనికి అర్థాంగిగా దొరుకుతుంది. కాని ఆ అబ్బాయి విషయం అలాక్కాదు..."(హేమాదేవి, బొమ్మ. లవ్ స్టోరీ. పుట: 51-53). అందరికోసం తన ప్రేమను త్యాగం చేయాలనుకుంటుంది. బావ కూడా త్యాగం చేస్తే అందరూ సంతోషిస్తారు. బావ నేనే పెళ్ళి చేసుకుంటే మా అక్కలను ఎవరు పెళ్ళి చేసుకుంటారు, ఆ విష్ణుని ఎవరు పెళ్ళి చేసుకుంటారు. కనుక నేను త్యాగం చేయక తప్పదు. అతన్ని పురుష వ్యక్తిగా మార్చుకోక తప్పదు.

నిజామాబాదు జిల్లా నవలల్లో రచయితలు, రచయిత్రులు అనేక సామాజికాంశాలతో సృజన చేశారు. ముఖ్యంగా మూఢ నమ్మకాలు, స్త్రీ జీవితం, చైతన్యం, దళిత చైతన్యం, అంటరానితనం, పురుషాధిక్యత, ప్రేమ, అవినీతి, అధికార బలం, పత్రికారంగం, స్నేహం, రాజకీయం, పేదరికం, నిరుద్యోగం, కులాచారాలు, చేనేత వృత్తి జీవితం మొదలైనవి. వీటి ద్వారా సమాజంలో ఉన్న అంతరాలను అర్థం చేసుకోవచ్చు. సమాజాన్ని చైతన్యం చేసే దిశగా ఈ నవలలన్నీ ఉన్నాయనడంలో సందేహం లేదు.

### 4.21. సినిమా ప్రపంచం

సినిమా అనగానే మనిషికి వినోదాన్ని, కాలక్షేపాన్ని, సందేశాన్ని ఇస్తుందని చూస్తుంటాం. కాని దాని తెరవెనక ఎన్నెన్ని నాటకాలు, ఎంత హింస, క్షోభ, కష్టం ఉంటుందో చాలా తక్కువమందికే తెలుసు. అటువంటి సినిమాలోని సమస్యలను చిత్రించాడు భరత్ కుమార్ 'కళా జలతారు' అనే నవలలో. సినీ ప్రపంచంలో ఎక్కువ సమస్యలను ఎదుర్కొనేది స్త్రీలే. ఈ నవలలో ప్రధాన పాత్ర సునంద(నందిత). ఈమె స్వయంగా సినీ ప్రపంచంలోకి వెళ్దామని అనుకోలేదు. కాకపోతే ఇంట్లో పరిస్థితులు బాగాలేక ప్రియుడు సుబ్బారావు సహాయంతో సినిమాల్లో నటించాలని మద్రాసు వెళ్తుంది. కాని అక్కడ ఉండే ఇబ్బందులు చూసి వద్దనుకుంది. తర్వాత తప్పని పరిస్థితుల్లో అక్కడే ఉండాల్సి వచ్చింది. "ఆ మందహాస రేఖను క్షణకాలం వీక్షించిన

శ్రీరాం 'బేబీ! ఆ ప్రొడ్యూసర్ ముందు అలా నవ్వావంటే తేనెలో పడ్డ ఈగలా గిల గిలా కొట్టుకుంటాడనుకో! అలా అందంగా మధురంగా నవ్వాల్సింది ఆ ప్రొడ్యూసర్ ముందేకాదు డయిరెక్టర్ ముందు, కెమెరామన్ ముందు, మేకప్ వాడి ముందూ, సౌండ్ టెక్నీషియన్ ముందు కూడా అలాగే నవ్వాలి. లేకపోతే ప్రొడ్యూసర్ ఓ.కే. చేసినా వెదవ అభ్యంతరాలు పెడుతూ వుంటారు. డయిరెక్టర్ యాక్షన్ బాగా లేదంటాడు. కెమెరామాన్ భూతద్దంలోంచి భూతాన్ని చూస్తే కన్పించినట్టు వికారంగా ఫోటోలు తీసి ఫొటోజెనిక్ ఫేస్ కాదంటాడు. సౌండ్ టెక్నీషియన్ మధురమైన సున్నితమైన నీ కంఠాన్ని గార్ధభకంఠంలా మార్చి, నీ కంఠం మైక్‌కు సూటుకాలేదంటాడు. ఒక్కక్షణం ఆగి బేబీ నువ్వు నేర్చుకోవాల్సిన విషయాలు చాలా వున్నాయి ఇక్కడ ఏ విషయాన్నిగానీ సీరియస్‌గా తీసుకోకూడదు. ప్రొడ్యూసర్, ఫైనాన్సియర్ నుంచి తోటి ఆర్టిస్టులు ఏం చేసినా దానికంత ప్రాధాన్యత యివ్వకూడదు. ఇంతకుముందు నవ్వావే అలా మృదువుగా, మధురంగా నవ్వుతూ వెళ్ళిపోవాలి. పరువూ, ప్రతిష్ట, మానం, శీలం వీటిని పూర్తిగా మర్చిపోవాలి. ఇంతకుముందు మాసిన నీ చీరను విడిచేశావే అలా ఆ స్టూడియో గేటు వెలుపల విడిచెయ్యాలి. మెట్టు వెంట మెట్టెక్కి తారాపథం అందుకోవాలంటే వినయ విధేయతలు ముఖ్యం. అసభ్యంగా ప్రవర్తించాడని కాస్త పేరున్న ఆర్టిస్టును కసురుకున్నావనుకో! అతను ఫిలిమ్ పరిశ్రమలో తనకున్న పలుబడినంతా వినియోగించి, నీకు కాల్ షీట్లు దొరక్కుండ చేస్తాడు. ఇంతకుముందు బాగా పేరున్న ఓతార పేరున్న హీరోను కసురుకుంటే ఆమె పక్కన నటించమని తతిమ్మా హీరోలు, ఆమె ఉన్న చిత్రాన్ని డైరెక్షన్ చేయమని దర్శకులు ఆమెను బాయ్ కాట్ చేశారు. అంత పెద్ద హీరోయిన్ కూడా పేరు లేకుండా తుడుచుకుపోయింది. యిదియిలా మరికొంత కాలం సాగితే తన కుమార్తె ఈ తేనాంపేటలో వొళ్ళు అమ్ముకొని బ్రతకాల్సి వస్తుందని భయపడిన ఆమె తండ్రిగారు ఏదో చిన్న పిల్ల తెలియక కసురుకుంది క్షమించి మర్చిపొమ్మని, ఇక ముందెప్పుడూ అలా పెంకిగా ప్రవర్తించదని ఆ హీరోకూ నచ్చచెప్పిన తర్వాత తిరిగి తెరమీద కనపడింది ఆమె. ఇంతెందుకు? నొప్పులకు, తానొవ్వక తప్పించుకు తిరుగువారు సక్సెస్ అవుతారు ఈ పరిశ్రమలో. ఈ సూక్తిని గుర్తించుకుంటె చాలు. అన్నాడు శ్రీరాం." (భరత్

కుమార్. కళా జలతారు. పుట: 45, 46). అక్కడ మొదటగా సినీరంగంలోకి అడుగుపెట్టి ఏదో ఒక్క పాత్ర ద్వారా రంగప్రవేశం చేయాలని ఆరాటపడేవారు పూరిగుడెసెల్లో, ఇరుకుగదుల్లో ఉండాల్సి వస్తుంది. కొన్నిసార్లు పస్తులు ఉండాల్సి వస్తుంది. వాటిని తట్టుకొని ఏదో పాత్రద్వారా ముందుకు వెళ్దామనుకున్న యువతులకు ప్రొడ్యూసర్స్, డైరెక్టర్స్ వల్ల తమ మానానికి, శీలానికి ఇబ్బందులు వచ్చినట్లే. వీటన్నింటినీ తట్టుకుంటూ ముందుకు వెళ్తూ పెద్ద హీరోయిన్ అయితే, అప్పుడు కూడా స్త్రీలకు పురుషుల వల్ల ఇబ్బందులు తగ్గవు. ఎదురు తిరిగితే మళ్ళీ పాతాళానికి తొక్కేస్తారు. సునంద (నందిత) పరిస్థితి కూడా అలాగే జరిగింది. దుర్మార్గాలు చేసే ప్రొడ్యూసర్స్, డైరెక్టర్స్ ను ఎదిరిస్తే సినిమా అవకాశాలు రాకుండా చేసి, చివరకు ప్రేమించిన ప్రియుణ్ణి కూడా దూరం చేశారు. చిరవకు ఏమి చేయాలో బోదపడలేదు. బూతు చిత్రాలు తీసే నిర్మాతలు వచ్చి మా బూతు సినిమాల్లో నటించమని అడుగుతారు. ఇంతవరకు వచ్చి, తిరిగి వెననకు వెళ్ళి బతకలేని పరిస్థితుల్లో ఒప్పుకుంటుంది. ప్రస్తుత రోజుల్లో కూడా 'కాస్టింగ్ కౌచ్' జరుగుతుందని కొందరు కథానాయికలు తమ గోడును పరోక్షంగా వెల్లడిచేస్తున్నారు. కాని ఈ విధానం సమాజానికి అంత మంచిది కాదు.

### 4.22. మానవ జీవితంలో సైన్స్

ఈ భూమ్మీద ప్రకృతిలో దొరికే ప్రతిదీ ప్రతిజీవికి ఏదో ఒక రూపంలో ఉపయోగపడుతుంది. అందులో ఏ ఒక్కటి తగిన పాళ్ళలో లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కనుకనే భూ ప్రపంచం మీద జీవరాశులు, మరీ ముఖ్యంగా మానవజాతి మనుగడ సాగించగల్గుతున్నాయి. సైన్స్‌లో భాగంగా విద్యుత్ మానవ శరీరంలో ఏ విధంగా ఉంటుంది? ఏ విధంగా ఉండగల్గితే మనిషి ఇంకాస్త దృఢంగా తయారవుతాడు అనే అంశాలతో స్వప్న ప్రియ అనే నవలలో చిత్రించాడు భరత్ కుమార్. ఇందులో ప్రధాన పాత్రగా శ్రీప్రియ, ప్రొఫెసర్ రాయ్, స్వప్న మొదలైనవారు ఉంటారు. శ్రీప్రియ గొప్ప నవలా రచయిత్రి. ఆమెకు చాలామంది అభిమానులున్నారు. అందులో చాలామంది ఇంటికి వచ్చి కలిసి వెళ్తుంటారు. ఆ రకంగా

రామ్మోహన్ అనే వ్యక్తి వచ్చి శ్రీప్రియను ప్రేమిస్తాడు కాని శారీరక వాంఛ కలిగిన వ్యక్తి అతను. పెళ్ళికాకముందే శారీరంగా కలుద్దామని శ్రీప్రియను ఒత్తిడి చేస్తాడు. కాని ఆమె అస్సలు ఒప్పుకోదు. ఇద్దరు విడిపోతారు. అప్పటినుంచి శ్రీప్రియ అశాంతితో ఉంటూ మానసికమైన రుగ్మతతో బాధపడుతూ ఉంటుంది. ఆ విషయాన్ని మరో అభిమాని, స్నేహితురాలైన విమల చెప్తుంది. ఆమె ఉండే చోటైన విజయవాడకు వెళ్తుంది. అక్కడ ప్రశాంతత దొరుకుతుందనే ఆశతో. విమల అక్కడ ఒక చిత్రకారుడైన రవిచంద్రను పరిచయం చేపిస్తుంది. అక్కడ శ్రీప్రియకు కొంత ఊరట దొరుకుతుంది. అతను ఇంకా శ్రీప్రియ ఆరోగ్యం బాగుపడాలంటే ప్రొఫెసర్ రాయ్ దగ్గరకు వెళ్ళాలని సలహా ఇస్తాడు. “నేను డాక్టర్ను కానని నీకు తెలుసనుకుంటాను అన్నాడు. తెల్సు... మీరు యూనివర్సిటీలో బయోఫిజిక్స్ ప్రొఫెసర్గా పనిచేస్తున్నారని రవిచంద్రగారు చెప్పారు. అందులో ఒక భాగం ఎలక్ట్రో బయాలజీ. సజీవ ప్రాణుల్లో విద్యుచ్ఛక్తి వునికికి సంబంధించిన విజ్ఞాన శాస్త్రం. ఆ శాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నదే నా జీవిత లక్ష్యం. ఒక్క క్షణం ఆగి రవిచంద్ర నా గురించి ఎంత చెప్పినా పూర్తిగా చెప్పి వుండడు. నా స్వవిజ్ఞానంతో, స్వవిధానంతో కొన్ని ఔషధాల్ని తయారు చేశాను. అందులో కేవలం పన్నెండు రకాల ఔషధాలే మిళితమవుతాయి. అవిగాక మానవ యంత్రానికి ఉపయోగపడే మరో ఔషదం ఏదీలేదు నిజం చెప్పాలంటే... చెట్ల రసంతో తయారుచేయబడిన ఆ పన్నెండింటిలో ఆరింటిలో మాత్రం విద్యుత్ వుంటుంది. యిందులోని ఒక ఔషదాన్ని రవిచంద్ర నీకిచ్చాడు త్రాగడానికి అవును కదూ!” (భరత్ కుమార్. స్వప్న ప్రియ. పుట: 98). శ్రీపియకు ఫ్రొపెసర్ రాయ్ విద్యుచ్ఛక్తి ద్వారా చికిత్స చేయడం ద్వారా చాలావరకు కోలుకుంది. ఆమె తెలుసుకున్న విద్యుచ్ఛక్తి గురించి ఇలా అంటుంది. “శ్రీప్రియ తన గదిలో కెళ్ళి పడుకుందిగాని, ఎంతకూ నిద్ర రావటం లేదు. ఒకనాడు దివ్యశక్తి, మానవాతీత శక్తి అని విశ్వసించి ఈ మానవ విద్యుచ్ఛక్తే అని విశ్వసించడానికి సందేహం లేదు. విద్యుచ్ఛక్తి మనిషిలో యిప్పటికే వుంది. కాని, ఆ విషయం తెలియక దాన్ని నిర్లక్ష్యం చేయటం వలన అది బహిర్గతం కావటం. నిజం చెప్పాలంటే శాస్త్ర విజ్ఞానం తెల్సిన వాళ్ళెవరూ దీన్ని కాదనలేరు. సాధనతో, ఏకాగ్రతతో, ఆధ్యాత్మిక చింతనతో ఈ

విద్యుచ్ఛక్తిని పొందటం అసాధ్యం కాదు. ఈ విద్యుచ్ఛక్తినే దివ్యంగా పరివర్తన కూడా చేయవచ్చు. కాదనటం, అసాధ్యమనటం మూర్ఖత్వం... ఏ శాస్త్రజ్ఞుడైనా ఓ కొత్త విషయాన్ని కనిపెట్టినప్పుడు మొదట ఎవరికీ నమ్మకం కలగదు. అంతేగాక అతన్ని, అతని సిద్ధాంతాన్ని, విజ్ఞానాన్ని హేళన చేసిన సంఘటనలూ ఉన్నాయి" (భరత్ కుమార్. స్వప్న ప్రియ. పుట: 189). అని అనుకుంటుంది మనసులో శ్రీప్రియ.

చివరకు శత్రువులను అంతమొందించడానికి కూడా ఈ శక్తిని వాడతారు. ప్రొఫెసర్ రాయ్, అతని చెల్లెలు స్వప్న శరీరంలో అందరిలో ఉండే విద్యుచ్ఛక్తి కన్నా ఎక్కువ మోతాదులో విద్యుచ్ఛక్తి ఉంటుంది. దీనిద్వారా ఎదుటివారిని ఎదుర్కొని నివారించగలరు. 'మానవునిలో విద్యుత్ ప్రసారంలో, విద్యుద్వాహకత్వంలో విద్యుత్ చర్యలో అంతరాయం కల్గినచో మరణం లేక విపరీత పరిణామం సంభవిస్తుంది. జీవ పదార్థంలోని, జీవి కండరాలలోని విద్యుద్వాహకత్వం గురించి పరిపూర్ణంగా తెల్సుకొని, ఎలక్ట్రాన్స్ ప్రవాహాన్ని తమ ఆదుపాజ్ఞలలో వుంచుకోగలిగిన–వ్యాధుల్ని నిరోధించవచ్చును. నివారించవచ్చును. జీవన ప్రమాణాన్ని సంపాదించవచ్చు. జీవాణువులోని సూక్ష్మ విద్యుత్కణాల సాంకేతిక పరిజ్ఞానం–మానవ జీవితంలో నూతన శకారంభాన్ని సూచిస్తుందని' రచయిత ఈ నవలలో చెప్తాడు.

### 4.23. సైన్స్ - బాలల అద్భుత సాహసాలు

మనం నివసిస్తున్న ఈ భూమ్మీద ప్రకృతిలోని సమస్త జీవరాశులతో పాటు మానవజాతి కూడా మనుగడ సాగిస్తోంది. మానవుడు పుట్టిన నాటి నుండి నేటి వరకు తన అవసరం కోసం, తిండికోసం అనేక ప్రయోగాలు చేస్తూ అవసరమైన సాధనాలను సృష్టించుకుంటూ నేటి కంప్యూటర్ యుగం, నానో టెక్నాలజీ వరకు చేరుకున్నాడు. తన సౌకర్యంకోసం ఎన్నో జీవరాశులపై, ప్రకృతిపై ఆధిపత్యం సాగిస్తూ వస్తున్నాడు. ధనికుడు బీద జనాలపై, అధిక కులస్థుడు అల్ప కులస్థునిపై, ఆయుధాలు, సాంకేతిక విజ్ఞానం ఉన్న దేశం సాధారణ దేశంపై

ఇలా అనేకమైన ఆధిపత్యాలు ఈ భూమ్మీద మనకు కనిపిస్తున్నాయి. కాని మనకంటే వంద సంవత్సరాల ముందు టెక్నాలజీతో మన భూగ్రహంపై ఆధిపత్యం సాధించి మానవజాతిని నాశనం చేయడానికి వేరే గ్రహం నుంచి గ్రహాంతరవాసులు భూమిపై యుద్ధాన్ని ప్రకటించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తూ, వారినే 'ఏలియన్స్' అంటూ ఇంకా పూర్తి సమాచారంకోసం పరిశోధన కొనసాగుతూనే ఉన్నాయి.

వి.ఆర్.శర్మ రాసిన 'కానుక' నవలలో అత్యాధునిక టెక్నాలజీతో 'పవర్ ప్లానెట్' వాసులు మన భూమిపై దాడికి ప్రయత్నిస్తున్నట్టు ఐదుగురు సాహస బాలలు 'మదర్ ప్లానెట్' వారి సహకారంతో భూమిపై ఉన్న సమస్త మానవాళిని కాపాడిన విధానాన్ని వి.ఆర్.శర్మ అత్యద్భుతంగా ఈ నవలలో తీర్చిదిద్దాడు.

ఇందులో ప్రధానంగా ఐదుగురు పిల్లల పాత్రలచేత కథ నడుస్తుంది. వారు శరత్, వేద, ఆది, ప్రణవి, భువనలు. వీరి కుటుంబీకుల వల్ల వీరు ఫ్రెండ్స్ అయ్యారు. మనకంటే వందేళ్ళ ముందస్తు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 'పవర్ ప్లానెట్' వాళ్ళు మొదటగా 'మదర్ ప్లానెట్'పై దాడి చేసి, భూగ్రహంపైకి దాడి చేయడానికి వచ్చారు. ఈ విషయాన్ని ముందే భూలోకంలోని ఈ ఐదుగురి పిల్లల తల్లిదండ్రులకు చేరవేస్తూ వచ్చారు 'మదర్ ప్లానెట్' పిల్లలైన అంగార, నక్షత్ర. వీళ్ళు పవర్ ప్లానెట్ వారి టెక్నాలజీతో ఆయుధాలు ఎలా తయారు చేయాలనే విషయాలను మెసేజ్ రూపంలో ఈ ఐదుగురి తల్లిదండ్రులకు వచ్చింది. ఐదుగురు పిల్లల తండ్రులు తమ పిల్లలను నల్లమల అడవుల్లోని కొండమీదకు తీసుకువచ్చారు. ఈ కొండదగ్గరకు ఎవరూ రారు. వీరిని ఇక్కడ విడిచిపెట్టి వెళ్ళిపోయారు. తరువాత పిల్లలకు చీకటి కమ్మేసినట్టుగా ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అప్పుడు ఏమైందంటే పవర్ ప్లానెట్ వాళ్ళు వారి సాంకేతిక పరిజ్ఞానంతో భూ గ్రహంమీద ఉన్న మానవ జాతినంతటినీ ఒక్కసారికి మాయం చేశారు. వాళ్ళ ప్లాన్ ఏమిటంటే మనుషులందరినీ దుమ్ము రేణువులుగా మార్చివేశారు. పిల్లలను మాత్రం

మూడవరోజు మళ్ళీ కనిపించేలా చేశారు. కాని ఈ ఐదుగురు సురక్షిత ప్రాంతంలో ఉండటం వల్ల వీళ్ళకు ఏం కాలేదు. వీళ్ళు తిరిగి వచ్చి చూస్తే తండ్రులు లేరు. వారు రాసిన ఒక లేఖమాత్రం దొరికింది. వాళ్ళు ఏమని రాశారంటే మీరు మీకు కావాల్సిన ఆయుధాలను తయారు చేశాం. అవి పెట్టెల్లో ఉన్నాయి చూడండి. ఏం జరిగిందో మాకు తెలియదు. మిమ్మల్ని రక్షించడానికి ముందే ఏర్పాట్లు చేసి ఆ కొండపైకి తీసుకెళ్ళాం అని రాసి ఉంది. దాని ఆధారంగా, అదే విధంగా మదర్ ప్లానెట్ అమ్మాయి 'అంగార' వీరికి సహాయం చేసింది.

ఈ ఐదుగురు పిల్లలు అంగార సహాయంతో అత్యాధునిక టెక్నాలజీతో గంటలో ప్రపంచాన్ని చుట్టే వచ్చే వాహనంతో గాల్లో తిప్పి చూపించింది. పవర్ ప్లానెట్ వాళ్ళు పెద్దలను తమ టెక్నాలజీతో కనిపించకుండా చేశారు. పిల్లలను ఎందుకు ఉంచారంటే వారి శక్తి కేంద్రాలలో ఆయుధాలను తయారు చేయడానికి "పది నిమిషాల్లో ఆ గాజు ప్లేటు పనిచేయడం ప్రారంభిస్తుంది. అదే వాళ్ళ శక్తి కేంద్రం. అది పనిచేయడం ప్రారంభం కావడానికి పదీ–పదిహేడేళ్ళ మధ్య వయస్సు గల పిల్లల శరీరంలోని కొన్ని భాగాల జీవకణాలు సజీవంగా దానికి బదిలీ చేయబడాలి. ఆ ప్రక్రియే జరుగుతున్నదక్కడ. ఓ ఐదు నిమిషాలు గడిచేటప్పకి ఆ ప్లేటు మీద విచిత్రమైన మెరుపులు, పొగ లాంటివి కనిపించడం మొదలైంది." (శర్మ, వి.ఆర్. కానుక. పుట: 38). అందుకోసమే పిల్లలను మూడవరోజు కనిపించేలా చేసి వారిని వారి ఆయుధాల కోసం వాడుకొంటున్నారు. వారు భూమ్మీద మొత్తం ఐదు శక్తికేంద్రాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అవి పనిచేస్తే భూమ్మీద ఉన్న మానవజాతి మొత్తం కూడా నాశనమే. కనుక ఏం చేసినా అతితొందరగా వాటిని నాశనం చేయడమే మీ ముందున్న కర్తవ్యం అని అంగార అనే అమ్మాయి చెప్పింది. మీ తండ్రులు తయారుచేసిన ఆయుధాలే మీరు ఉపయోగించాలని చెప్తుంది. ఆ కేంద్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయంటే ఒకటి అమెరికా రాజధాని వాషింగ్ టన్ డీసీ. రెండవది యూరప్‌లోని ఇంగ్లాండ్ రాజధానైన లండన్. మూడవది చైనా ఆధీనంలో ఉన్న టిబెట్‌లో మౌంట్ కైలాస్ ప్రాంతం. నాల్గవది భారతదేశంలోని కన్యాకుమారి. ఐదవది హైదరాబాదు.

వీటన్నింటిని గంటన్నర వ్యవధిలో ప్రారంభిస్తారు. ఆ సమయంలో వారికి పిల్లలు అవసరం కాబట్టి, మీతోపాటు మూడవరోజు ఉనికిలోకి వచ్చిన పిల్లలను కూడా మీ అక్కడకు తీసుకెళ్తారు. కనుక మీరు ఒక్కొక్కరు ఒక్కో శక్తి కేంద్రాన్ని నిర్మూలించాలి అని చెప్తుంది అంగార. అదేవిధంగా పవర్ ప్లానెట్ సైనికులకు తమ వద్ద ఉన్న ఆయుధాలు చిక్కకుండా వారి శక్తి కేంద్రాలపై దాడి చేస్తారు. అప్పుడు ఒక్కసారిగా శబ్దం వచ్చి వారు, వారి శక్తి కేంద్రాలు నాశనమవుతాయి. తర్వాత భూప్రపంచం యథాస్థానానికి వస్తుంది.

పిల్లలు పట్టుదల, ఆసక్తి, ధైర్యం ఉంటే దేన్నైనా అలవోకగా సాధించవచ్చు అనే విషయాన్ని వి. శాంతిప్రబోధ 'అమర్ సాహసయాత్ర' నవలలో వివరించారు. పిల్లలు చేసే సాహసం గురించి ఈ నవల నడుస్తుంది. ఈ నవలలో రచయిత్రి అమర్ పాత్ర ద్వారా పిల్లలు తమకు ఇష్టమైన దానిని మనోధైర్యంతో, పట్టుదలతో, జిజ్ఞాసతో ఎంతటి కష్టమైనా సాధిస్తారనే విషయాన్ని తెలియజేశారు. ఇందులో ప్రధాన పాత్రగా ఉన్న అమర్ పాఠశాలలో భువనగిరి గుట్ట ట్రెకింగ్ చేయడానికి ఎంపికవుతాడు. కానీ అతను కనే కల మాత్రం ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ఎక్కినట్టుగా కలగంటాడు. ఆ సాహసం చేస్తున్న క్రమంలో వచ్చిన అడ్డంకులు, కష్టాలు, ప్రయాణంలో వాతావరణ మార్పులు, అక్కడి ప్రజల జీవన విధానం, ప్రకృతి సౌందర్యం మొదలైనవన్నీ అనుభవాల్లోకి వచ్చిన విధానం ఈ నవలలో కనిపిస్తుంది. ఈ సాహసయాత్రలో కావాల్సిన వస్తువులను మోసుకుంటూ ఎన్నో ఇబ్బందులను అధిగమిస్తూ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ చేరుకుంటాడు అమర్. అయితే ఈ ఎవరెస్ట్ సాహసయాత్రను అమర్ కేవలం కలగన్నాడు. కానీ భువనగిరి గుట్టను ట్రెకింగ్ చేయడం కోసం పాఠశాలలో ఎంపికయ్యాడు. అయితే దీని ద్వారా రచయిత్రి చిన్న విజయం స్ఫూర్తితో గొప్ప కలలు కని లక్ష్యాన్ని సాధించాలనే విషయాన్ని 'అమర్ సాహయాత్ర ద్వారా ద్వారా తెలియజేశారు.

విషయజ్ఞానం, సమయస్ఫూర్తి ఉంటే ప్రయాణంలో ఎదురయ్యే అడ్డంకులు, అవాంతరాలను ఎదుర్కోవడం పెద్ద కష్టమేమీ కాదు అని రచయిత్రి బాలలను ఉత్సాహపరిచే విధంగా ఈ నవలను చిత్రించింది. 'మనసుకు, శరీరానికి ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపడంతోపాటు, సవాళ్ళను ఎదుర్కోవడానికి సిద్ధమైతే ఎవరెస్టు బేస్ క్యాంపుకు రావడం పెద్ద కష్టమేమీ కాదు' అని అమర్ పాత్ర ద్వారా రచయిత్రి శాంతిప్రబోధ తెలియజేశారు.

### 4.24. యువత - నిరుద్యోగం

ఒక శక్తివంతమైన సమాజాన్ని నిర్మించడంలో యువత పాత్ర ప్రముఖమైనది. ఆధునిక యుగంలో కాలంతోపాటు పరుగులు తీస్తూ ప్రకృతిని శాసించే స్థాయిలో సాంకేతికంగా ఎంతో పురోగమించాం. ఎన్నో అవకాశాలు, వసతులు, సౌకర్యవంతమైన జీవన విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ఇదే సమయంలో ఒత్తిడితో కూడిన చదువులు ఉద్యోగాలు, ఆర్థికంగా ఆకాశాన్ని అందుకోవాలే ఆలోచనలు విలాసవంతమైన జీవన విధానాలతోపాటు ప్రస్తుత సమాజాన్ని పరిశీలిస్తే ఎన్నో విపరీత ధోరణులు కనిపిస్తాయి. ఆరాటం నవలలో శంకరయ్య పాత్ర నలుగురు యువకులతో సంభాషించిన విధానం చూస్తే యువత సంబంధిన విషయాలు ఎలా ఉన్నాయో తెలుస్తాయి. "ముఖ్యంగా మీలాంటి యువతలో మార్పు రావాలి. వారి నిరుద్యోగాన్ని రూపుమాపటానికి ఉపాధి హామీ పథకాలు ప్రవేశపెట్టాలి. వీరికి చెప్పే చదువులు డిగ్రీలు పరోక్షంగా బతుకుదెరువుకు సంబంధించినవై ఉండాలి.

యువతకు సరైన ఉపాధిలేక నిరుద్యోగులై నిరాశ నిస్పృహలకు లోనై అనేక అసాంఘిక కార్యకలాపాలతో కాలక్షేపం చేస్తూ అటు కన్నవారికి ఇటు సమాజానికి దూరంగా బారంగా ఉంటూ మంచి చెడుల విచక్షణ జ్ఞానం కోల్పోయి తమ యవ్వనంలోని కోర్కెలను అదుపులో పెట్టుకోలేక ఎంతకైనా బరితెగిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా ఉన్నత చదువులు చదివిన యువతే అధికం. ఈనాడు టెర్రరిజం, సంఘ విద్రోహశక్తుల ఆరాచకాలు, రేపులు, హత్యలు,

క్రూర హింసలు, పెట్రేగిపోవడానికి ముఖ్యకారణం యువతకు సంతృప్తికరమైన బతుకుదెరువు దారులు లేకనే అనే విషయాన్ని మనం గ్రహించాలి.” (గంగాధర్, దారం. ఆరాటం. పుట: 13).

తమకు తముగా స్వయంగా ఉపాధితో బతికే కోర్సులు ప్రవేశపెట్టాలి. ఏయే ప్రాంతంలో ఏయే పరిశ్రమలు నెలకొల్పాలో చిన్నతరహా బారీ పరిశ్రమల స్థాపనలు జరిగి ఆయా సంబంధింత సాంకేతిక పరిజ్ఞానం వారిలో కల్పించి అందులో నియుక్తులు గావించాలి. లేదా ఇద్దరు ముగ్గురు యువకులను కలిపి ఉపాధి హామీకోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ప్రభుత్వం చేయూతనివ్వాలి. అప్పుడు యువకునిలో ఉత్సాహమధికమై ఏదో ఒక వృత్తితో తాను తన కుటుంబాన్ని పోషించుకోవటమే గాక నలుగురికి ఉపాధి కల్పించి మార్గదర్శకులవుతారు.

## 4.25. విద్యా వ్యవస్థ - నాడు నేడు

ఆరాటం నవలలో శంకరయ్య, అతని మిత్రుడైన బాల్‌రెడ్డయ్య మధ్య జరిగిన సంభాషణల ఆధారంగా వీరిద్దరూ ఒకరికొకరు సమాజంలో నడుస్తున్న విద్యావ్యవస్థ తీరును ఉద్దేశించి మాట్లాతున్న సందర్భంలోనిది. “అవును శంకర్‌భాయ్, ముందు చదువు చెప్పిన గురువులు ఎక్కడ కనబడితే భయంతో మొకం చాటేసుకొని భక్తితో ఉండెటోల్లం. ఇప్పుడు అలా కాదు. విద్యార్థే ఎదురెల్లి ఉపాధ్యాయులకు కనబడుతూ వెళ్తున్నారు. కాలం మారిందిరా బై. కాలమేం మారలేదు బాల్‌రెడ్డయ్య. మనమే మారినం. టీచర్ బెదిరిస్తే అతని మీదికి ఫైటింకెళ్తున్నం. దీంతో విద్యార్థుల్లో చులకన భావం ఏర్పడి ఆ టీచర్‌ను సరైన రీతిలో గౌరవించడం లేదు. టీచర్ కూడా వంతుకు దాసరి కాలాడిచ్చినట్టు తనకు కేటాయించిన సమయాన్ని తూతూ మంత్రంగా కాలక్షేపం చేసి ‘బజే చార్, చలే యార్’ నెల వేతనం కోసం ఎదురుచూస్తున్నారే తప్ప విద్యార్థులకు బోధనాంశాలను మనసారా బోధించడం లేదు. దీంతో విద్యార్థుల్లో దాగియున్న ప్రజ్ఞా పాటవాలు బయటకు రాక, మూసపద్ధతిలో చదువులు పూర్తిచేసుకుంటున్నారు. ఇలాంటి విద్యా విధానాన్ని సమూలంగా మార్చేసిన్నాడే ఏమన్న చదువుకున్న వారికి విలువ, అటు వారి

జీవితానికి, ఇటు సమాజానికి ఉపయోగపడుతుంది." (గంగాధర్, దారం. ఆరాటం. పుట: 103)

రాత్రనక పగలనగ విద్యార్థులకు కోచింగ్ క్లాసులంటూ వాళ్ళను మానసికంగా ఒత్తిడికి గురిచేస్తున్నారు. వందమంది విద్యార్థులు ఉంటే ఏ పదిమందో ర్యాంకులు సాధిస్తే దాన్ని గొప్పగా చెప్పి వేలమంది విద్యార్థుల్ని తమ కాలేజీల్లో జాయిన్ చేసుకొని వేలకు వేలు ఫీజులు లాగేస్తూ బంగ్లాలమీద బంగ్లాలు కడుతూ కోట్లకు కోట్లు కూడబెడుతున్నారు. విద్యను ఒక వ్యాపారం చేసేసారు. ప్రభుత్వం కూడా వారిచ్చే తాయిళాలకు మెత్తబడి ఆ కార్పోరేట్ బడులకు, కాలేజీలకే వత్తాసు పలుకుతుంది. దీంతో ప్రభుత్వపరంగా నడిచే బడులు, కాలేజీలు చిక్కి శల్యమై నామరూపాల్లేకుండా అయిపోతున్నాయి. ఇలాంటి లోగుట్టు తెలియని పిచ్చిజనం అటువంటి విద్యాసంస్థలవైపే పరుగెత్తున్నారు. ఇప్పుడు ఊర్లలో చూడండి ప్రభుత్వం ద్వారా నడిచే విద్యాసంస్థల గతి ఎలా ఉందో? ప్రభుత్వం పైకి ఎన్నో చెబుతుంది. మేము కెజి టు పిజిల వరకు విద్యను ప్రభుత్వం ద్వారా బోధిస్తామని, కాని అక్కడ ప్రైవేటు పాఠశాలలే హైఫైగా ఉండగా గీ అరకొర సౌకర్యాలతో ఉండే ప్రభుత్వ పాఠశాలలో ఎవరు చదివిస్తారు. పరిక్షల్లో రాసిన పేపర్లను సరిగ్గా దిద్దక ఎంతమంది విద్యార్థులు నష్టపోయారు. ఎంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎంబీబీఎస్ లాంటి విలువైన విద్యాకోర్సుల్లో కూడా అనేకమైన అవకతవకలు, ఎంతవరకైతే ప్రవేట్ సంస్థలను రానీయకుండా ప్రభుత్వం చర్య తీసుకోదో అంతవరకు ఈ విద్యావిధానమంతా రోజురోజుకు అధ్వాన్నమైపోతూనే ఉంటుంది. ఈనాడు చదుకోవడం కాదు, చదువు కొనుక్కోవడం జరుగుతుంది.

పూర్వకాలంలో ప్రాథమిక పాఠశాలలో ఒకటో రెండో తరగతులు లేదా పెద్దబాలశిక్ష పుస్తకాన్నో చదువుతేనే ఎంతో విజ్ఞానాన్ని పొందేవారు. ఇవ్వాళ పదవ తరగతి వరకు చదివినా వారికి అంత జ్ఞానం రావడం లేదు. ఆనాడు తెలుగు, గణితం, సాంఘిక శాస్త్రాలతోపాటు నీతిశాస్త్ర బోధన తప్పక ఉండేది. ఇవ్వాళ నీతిశాస్త్ర బోధనలేక విద్యార్థులకు మానవ విలువలు

బోధించేవారు లేక నైతిక విలువలు నశించి చిన్నాపెద్ద ఆలోచనలు గౌరవ మర్యాదలు పూర్తిగా కనుమరుగైపోతున్నాయి. ఆ కాలంలో చదువుచెప్పిన ఉపాధ్యాయులంటే ఎంతో భక్తి గౌరవం ఉండేడిది. గురువులను దైవ స్వరూపాలుగా భావించేవారు. అదే ఈనాడు టీచర్లంటే సమాజంలోని అందరు ఉద్యోగుల మాదిరిగానే వీరిని భావిస్తున్నారు. గురు శిష్యుల భావనలు మారిపోయాయి. దీంతో ఉపాధ్యాయులు బోధించే పాఠాలలోని విలువలు వాటి ప్రాముఖ్యత తగ్గిపోయాయి. కేవలం పరీక్షలు, వాటికి జవాబులు అనే రీతిన తయారయ్యారు. బోధన విధానం మారిపోయి భక్తిభావం శూన్యమైంది.

## 4.26. కల్తి వ్యాపారం

సమాజంలో నేడు పసిపిల్లల పాలదగ్గర నుంచి పండు ముసలి తినే ఆహారం దాకా ప్రతీదాంట్లో కల్తీ జరగడం మనం చూస్తూనే ఉంటాం. అయితే ఆరాటం నవలలో రచయిత కల్తీ గురించిన విషయాల్ని ఉద్దేశిస్తూ శంకరయ్య, బాల్‌రెడ్డయ్య మధ్య జరిగిన సంభాషణ ద్వారా రచయిత వివరించాడు. “అయ్యా నేను ఒచ్చేటప్పుడు గా తొవ్వల కంపు వాసన లేచిపోతున్న బొమికెలు కనబడ్డాయి. వాట్నెటో తీసుకపోతున్నరు. గన్నిగానం బొక్కలు గక్కడెక్కడికి వయ్యా! అని అడిగా. ఓరి నీ గవ్వా! ఎడ్లను, ఆవుల్ని, గాడిదల్ని చంపి పెద్ద పెద్ద స్టార్ హోటల్ల దాబాల్లా కూరొండుతరు, గా నంకగా చెత్తనంత తీసుకొచ్చి గీ ఊరౌతల గిట్ల పోస్తరు. మళ్ళా ఆ నంక గా బొక్కలన్నీ తీసుకవోయి మిషన్ల లీల్లతోని మంచిగ కడిగేసి పెద్దపెద్ద దేక్సల్లో బాగా కాగవెడ్తరు. గప్పుడా గా బొక్కల్లకెల్లి చమురు ఎల్తది. గదే నూనె. గా నూనెను డబ్బలల్ల నింపి హోటల్లకు సప్లై చేస్తరు. గా నూనెతోనే కమ్మగా వాసనొచ్చె బిర్యాని తయారు.

అరే శంకరం నీకో ముచ్చట చెప్త విను. ఆరొక్క చీజుల కల్తీని మిరప్పొడిలా రంపపుపొడి పసుపుల మొక్కజొన్న పొడి, పప్పుల్ల, జిలకర్రల, వాముల్ల ఆరోక్క దాంట్ల కల్తే. అసలు కల్తీ లేని వస్తువే లేదు. తినేతిండికేంచి, తాగే నీళ్ళు, పీల్చే గాలి, మాట్లాడే మాట, మనిషి నడవడి, భూమి

ఆకాశం అంతా కల్తీతోనే నిండిపోవట్టె. ఆకరికి ఈ దునియా ఏమైపోతదో తెలుస్తలేదు." (గంగాధర్, దారం. ఆరాటం. పుట: 104, 105).

రచయిత కల్తీ గురించి పైన చిత్రించిన విధానం చూస్తే కల్తీ సమాజంలోనే కాదు సర్వసృష్టిలో స్వార్థంతో కూడిన మనుషుల వల్ల ప్రతీది కల్తీచేసి ధనార్జన కొరకు సృష్టిని సైతం కలుషితం చేస్తున్నారు. ప్రతి చిన్న వస్తువుతో మొదలుకొని తినే తిండి, పీల్చే గాలి, మాట్లాడే మాట మనిషి నడవడి కలుషితమన్నట్లు ఈ భూమి ఆకాశమంతా కల్తీతోనే నిండిపోతున్నదని, అయితే కల్తీలేని ప్రపంచాన్ని రచయిత చూడాలనే ఆరాటం 'ఆరాటం' నవలలో చూడవచ్చు.

**4.27. వలస బతుకులు**

జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పుట్టిపెరిగిన ఊరును, తోబుట్టువులను, స్నేహితులను వదిలి పొట్టకూటికోసం బతుకు జీవుడా అంటూ ఉద్యోగం కోసమో, రోజువారీ కూలీకోసమో పిడికెడు మెతుకులకోసం పట్నం నడిరోడ్డులో అడ్డాకూలీలుగా, హోటల్లో పనిచేసే క్లీనర్లుగా, కొంత వయసుడిగినవారు బిచ్చగాళ్ళుగా ఇలా అనేక రకాలుగా వివిధ పనుల్లో చేరుతారు. ఏడాదికొకసారి పండగకో, పబ్బానికో సొంత ఊరు గుర్తొచ్చి తల్లిదండ్రులు గుర్తొచ్చి ఇంటి పయనం పడతారు. తాము పట్నంలో చేసే చిన్నపనిని గూర్చి చెప్పకుండా, పెద్దకొలువు చేస్తున్నామని చెప్తారు. అటువంటి పరిస్థితిని రచయిత ఆరాటం నవలలో చూపించాడు. "మన ఊళ్ళల్లకెల్లి మస్కట్ పోయినోళ్ళు దేశంకెళ్ళి రాగానే టిక్ టాక్‌గా వస్తారు. గీ నారిగాని లెక్కనే కావచ్చు. ఎంతరోత పని చేస్తారో ఎవరికెరుక? బట్టలుతుకుతున్నారా? ఎంగిలి గిన్నెలు కడుగుతున్నారా? ఒళ్ళు పడుతున్నారా? ఏ దాసిపని చేస్తున్నారో ఎవలికి ఎరుక, వాళ్ళు తినే తిండి ఎసొంటిది, వాళ్ళు నిద్రపోయే జాగెసొంటిది, మనకేమెరుక, ఇళ్ళు జాగ ఇడిసి అయ్యవ్వను ఒదిలేసి, పెండ్లాం పిల్లలను ఇడిసి దేశంగాని దేశం ఒచ్చెటోడు, నాలుగు పైసల్ కూడా పెట్టుకొనడానికేగదా!" (గంగాధర్, దారం. ఆరాటం. పుట: 25).

దీనంతటికి కారణం కరువు, బీదవారికి భూవసతుల లేమి, అప్పులపాలు కావడం మొదలైనవి. వలస వెళ్ళిన చోట ఏదో పనిదొరికినా, ఊర్లోవారికి ఫలానా పని చేస్తున్నామని చెపితే ఏమనుకుంటారోననే న్యూనతా భావం ఉండటంచేత కూడా చెప్పుకోలేకపోతున్నారు. దీనింతటికి పరిష్కారం ప్రభుత్వాలు చొరవ చూపి ప్రజలు వలస వెళ్ళకుండా నివారణ చర్యలు చేపట్టి అభువృద్ధివైపు అడుగులు వేసేలా చూడాలి.

నిజామాబాదు జిల్లా నవలల్లో సామాజికాంశాలుగా మూఢనమ్మకాలు, అంటరానితనం, వివక్ష, దళిత చైతన్యం, చదువు, స్త్రీ జీవిత చిత్రణ, పురుషాధిక్యత, వరకట్న సమస్య, స్త్రీ చైతన్యం, ఆదర్శ వివాహాలు, కుటుంబం సంబంధాలు, ప్రేమ, అధికార బలం, ప్రతికారంగం, స్నేహం, రాజకీయం, పేదరికం, నిరుద్యోగం, అనుబంధాలు-సంబంధాలు, లైంగిక బానిసగా స్త్రీ, శరీర వాంఛను కోరే స్త్రీ, కుల ఆచారాలు-జరిమానాలు, చేనేత వృత్తి కష్టాలు, సినిమా ప్రపంచం, మానవ జీవితంలో సైన్స్-బాలల అద్భుత సాహసం, యువత-నిరుద్యోగం, విద్యావ్యవస్థ-నాడు నేడు, కల్తీ వ్యాపారం, వలస బతుకులు మొదలైనవి  సామాజిక అంశాలుగా ఉన్నాయి.

*****

# అధ్యాయం-5

## నిజామాబాదు జిల్లా నవలలు-భాషాంశాలు

మానవునికి, మానవేతరాలకు ఉన్న ప్రధానమైన తేడా భాష. భాష లేకుండా ఏ ఒక్కరూ కూడా మరొకరితో భావవ్యక్తీకరణ సులభంగా చేసుకోలేరు. కనుక మానవ సమాజం భాషను సైగల నుంచి నేటివరకు అనేక రకాల మార్పులతో అభివృద్ధి చేసుకుంటూ ఉంటుంది. ఆ క్రమంలో మాట్లాడే స్థాయికి, మాట్లాడిన దానిని రికార్డు చేసి దాచుకోవడం, ఇతరులకు పేపరు ద్వారా వారి వారి అభిప్రాయాలను తెలుపడానికి భాషకు లిఖిత రూపాన్ని సంతరింపజేశారు. భాషకు లిఖిత రూపాన్ని ఏర్పర్చిన తర్వాత మానవులు తన అభిప్రాయాలను ఉన్నది ఉన్నట్టు కాకుండా కొత్త ప్రయోగాలు చేస్తూ సమాచార మార్పిడి చేసుకుంటూ వస్తున్నారు. దాన్నే మనం సాహిత్యం అంటున్నాం. సాహిత్యం ద్వారా వివిధ ప్రక్రియలు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రక్రియలు సమాచార మార్పిడిలో భాగంగా సామాజిక అంశాలను చాలా అందంగా, తొందరగా తక్కువ నిడివితో ఎక్కువ సమాచారాన్ని అందిస్తూ, మానవ సమాజాన్ని చైతన్యం చేస్తూ అభివృద్ధివైపు పయనింపజేస్తున్నాయి.

"భాష సమాజ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. భాషలోని పదజాలానికి సాంస్కృతిక వైశిష్ట్యం ఉంటుంది. భాషా వ్యవహర్తల కార్యకలాపాలు, ఆచారాలు, అభిప్రాయాలు, సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి. సంస్కృతి భాషను నిర్దేశిస్తుంది. అంటే సంస్కృతికి అనుగుణంగానే భాష రూపుదిద్దుకుంటుంది. సంస్కృతిలో జరిగే క్రమానుగత పరిణామాలు భాషలో చోటుచేసుకుంటాయి." (శైలమ్మ, జి. తెలుగు కథా సాహిత్యం–గిరిజన జీవితం. 2011: 275).

ఇటువంటి ప్రధాన పాత్ర పోషించే భాషను నా పరిశోధనకు ఎంచుకున్న నిజామాబాదు జిల్లాలోని రచయితలు నవలా రచనల్లో తమ తమ స్థానిక భాష/మాండలికాలతో వారివారి శైలిలో వెలువరించారు. వారి కథల్లోని మాండలికం, నుడికారాలు, జాతీయాలు, సామెతలు, అన్యదేశ్యాలు మొదలైన ప్రత్యేక పదజాలాన్ని 'నిజామాబాదు జిల్లా నవలలు–భాషాంశాలు' పేరుతో అయిదవ అధ్యాయాన్ని రాసాను.

### 5.1. నామ పదాలు

వస్తువులు, జంతువులు, పండ్లు మొదలైన వాటి పేర్లను కథల్లో మాండలిక పదాలతో వాడారు. వాటిని ఈ విభాగంలో చేర్చాను. వాటికి అర్థాలు లేదా వివరణను కూడా ఇచ్చాను. అవి

| | |
|---|---|
| అంటుకం | = అన్నం లేదా జొన్న గట్క మాడిన చెక్కలు(జె.యి. పుట: 19) |
| అంబటాళ్ళ | = అంబలి తాగేవేళ(జె.యి. పుట: 19) |
| అక్కెర | = అవసరం |
| అటెన్క | = ఆ తర్వాత (జోగిని. పుట: 59) |
| అడ్డెడు | = ప్రాచీన కొలమానం 8 కేజీలు (జోగిని. పుట: 46) |
| అధ్వానం | = హీనం, నీచం (ఆరాటం. పుట: 30) |
| అయుద్ధం | = వైద్యం (జె.యి. పుట: 30) |
| అలుకటి | = తేలికగా(జె.యి. పుట: 24) |
| అసరాబు పిల్ల | = మంచివాడు అని చెప్పే సందర్భంలో వాడే ఉపమానం (జె.యి. పుట: 29) |
| ఆకుటిల్లు | = ఆకులతో కూడిన ఇల్లు (జె.యి. పుట: 28) |
| ఆఖరు | = చివరి (స.బ. పుట: 6) |

ఆనికి = వానికి(జె.యి. పుట: 19)

ఆయలపొంటి = గడ్డి పుష్కలంగా దొరికే స్థలం(జె.యి. పుట: 22)

ఆయి = నానమ్మ (జోగిని. పుట: 24)

ఆల్లెక్కోల్లు = వాళ్ళు ఎక్కువ కులం వారు/ధనవంతులు(జె.యి. పుట: 19)

ఆవల = అవతల, తరువాత (జె.యి. పుట: 28)

ఇయాల = ఈరోజు(జోగిని. పుట: 29)

ఇరికిచ్చు = నెట్టు, దూర్చు(జె.యి. పుట: 20)

ఇసారం = సమాచారం (కాలస్పర్శ. పుట: 63)

ఈడికెల్లి = ఇక్కడ నుంచి (జోగిని. పుట: 53)

ఉరికురికి = పరుగెత్తి (జోగిని. పుట: 51)

ఊకైతదా? = ఊరికెనె, సులభంగా అవుతుందా(జె.యి. పుట: 22)

ఊరపండగ = గ్రామదేవతను పూజించే పండగ (జోగిని. పుట: 2)

ఎనకెటి కెల్లి = మొదటినుండి, ప్రాచీనంనుండి (జోగిని. పుట: 15)

ఎరుక = తెలియటం(జె.యి. పుట: 19)

ఎరుకలేక = తెలియక (జోగిని. పుట: 53)

ఐద్దుడు = వైద్యుడు (జె.యి. పుట: 27)

ఓదిచ్చు = కల్పించుకోవడం (ఆరాటం. పుట: 26)

కంచం = అన్నం తినే పళ్ళెం (జోగిని. పుట: 5)

కంచుడు = ఒకరకమైన మట్టిపాత్ర (జోగిని. పుట: 5)

కబురు = సమాచారం (జోగిని. పుట: 50)

కమికెడు = చేతి పరిమాణం (సంఘము. పుట: 75)

కమ్మ = పేజీ (జోగిని. పుట: 88)

కరుగుకచ్చిన పొలం = పంటకు వచ్చిన పొలం(జె.యి. పుట: 23)

కాట్లు పొగలు = అతిగా మాడిపోవడం (జె.యి. పుట: 48)

కాడ = దగ్గర (జోగిని. పుట: 5)

కాతర = లెక్కచేయని, గుర్తించని (జోగిని. పుట: 88)

కామ్‌దార్ = పర్యవేక్షకుడు (జోగిని. పుట: 6)

కారటు = కార్డు (జోగిని. పుట: 130)

కారు = వరి పండే పంట కాలం (జె.యి. పుట: 30)

కాల్వకుబోవు = కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్ళడం(జె.యి. పుట: 39)

కాసు = డబ్బు (సంఘము. పుట: 80)

కిరస్తాని = క్రైస్తవ (జె.యి. పుట: 27)

కుంచెడు = 16 కేజీలు (జోగిని. పుట: 46)

కూనపులీలు = ఇంటికో పూట పద్మశాలీల ఇళ్ళలో తింటూ కాలం గడిపే ఆశ్రిత కులంవారు (సంఘము. పుట: 83)

కూర్కు రాత్తిరి = తెల్లవారుజామున (జె.యి. పుట: 42)

కెల్లి = వైపు (జోగిని. పుట: 46)

కైకిలి = కూలి (జె.యి. పుట: 42)

కొల్లమ్మ = శిగం ఊగేవారిని 'కొల్లమ్మ' అని అంటారు (జోగిని. పుట: 100)

ఖతం = పూర్తి (జోగిని. పుట: 85)

ఖరా = నిజం (జోగిని. పుట: 105)

ఖరాబు = పాడవటం (జోగిని. పుట: 35)

ఖానూను = ఆదేశం (జోగిని. పుట: 2)

గటం = కుండ (జోగిని. పుట: 99)

గట్క = జొన్నలను విసిరి తయారు చేసేది (జోగిని. పుట: 5)

గత్తర = మహమ్మారి (సంఘము. పుట: 83)

గాబారా = కంగారు (జోగిని. పుట: 85)

గావు పట్టడం = గ్రామదేవతను శాంతింపజేసే క్రమంలో మేకపిల్లను బలివ్వటం–పానంతోటి ఉన్న మేకపిల్లను నోటితోటి చీల్చడమే గావుపట్టడం. (జోగిని. పుట: 2)

గుగ్గిలం = దేవుని దగ్గర పొగవేసేది (జోగిని. పుట: 100)

గురిగి = చిన్న మట్టిపాత్ర (జోగిని. పుట: 5)

గులాబు = బానిస (జోగిని. పుట: 104)

గులాబు = బానిస (జె.యి. పుట: 32)

గైని = కడప ముఖద్వారం (జోగిని. పుట: 6)

గొంగడి = గొర్రెల వెంట్రుకలతో నేసిన వస్త్రం (జోగిని. పుట: 100)

గోజలు = పశువులు(జె.యి. పుట: 19)

చిప్పలు = మట్టిపాత్ర (జోగిని. పుట: 5)

జమానా = తరం మారటం (జోగిని. పుట: 88)

జల్ది = తొందరగ (జోగిని. పుట: 100)

జల్మం = జన్మ (జోగిని. పుట: 97)

జాగ = స్థలం (జోగిని. పుట: 10)

జులూస్ = ర్యాలీ (కాలస్పర్శ. పుట: 18)

జోగిని = దళిత స్త్రీని దేవుని పేరుమీద అంకితం చేయడం (జోగిని. పుట: 6)

జోగుపట్టం = దళిత స్త్రీని జోగినిగా మార్చడం (జోగిని. పుట: 51)

తండ్లాట = పోరాటం (కాలస్పర్శ. పుట: 29)

తక్కెడ = త్రాసు (సంఘము. పుట: 81)

తక్కోల్లు = తక్కువ కులంవారు/బీదవారు(జె.యి. పుట: 19)

తక్లీబు = ఇబ్బంది, కష్టం (జోగిని. పుట: 47)

తగారా = రొట్టెపిండి పిసకడానికి వాడే మట్టిపాత్ర (జోగిని. పుట: 5)

తడికె = కట్టెలతో తయారుచేయబడినది (కాలస్పర్శ. పుట: 11)

తవ్వెడు = ధాన్యం కొలిచే పాత్ర (జె.యి. పుట: 28)

తాటికి = దగ్గరికి (జోగిని. పుట: 85)

తాటిల = కంచం, గిన్నె (కాలస్పర్శ. పుట: 15)

తాపకొకసారి = ప్రతిసారి (జోగిని. పుట: 13)

తీర్ల = రకాలుగా (కాలస్పర్శ. పుట: 43)

తూమెడు = నాలుకు కుంచాలు–50 కేజీలు (జె.యి. పుట: 41)

తొల్సూరు = మొదటి, తొట్టతొలి(జె.యి. పుట: 24)

తొవ్వ = దారి (జె.యి. పుట: 61)

దండుగ = జరిమానా (జోగిని. పుట: 51)

దమాక్ = మెదడు (జోగిని. పుట: 35)

దుష్మన్ = శత్రువు (జోగిని. పుట: 17)

దేవదాసీ = వైష్ణవ మతంలో దేవుని పేరుమీద వదిలిన స్త్రీలు (జోగిని. పుట: 63)

దొడ్డువాక = మంచిది(జె.యి. పుట: 24)

దొబ్బ = ఊపిరితిత్తి (జోగిని. పుట: 101)

దోకాబాజ్ = మోసం (సంఘము. పుట: 80)

దోస్త్ = స్నేహితుడు (జోగిని. పుట: 2)

ధర్మసాలె = ప్రభుత్వ పాఠశాల (జె.యి. పుట: 27)

నఖ్రాల్ = గర్వపు చేష్టలు, అతి చేయడం (సంఘము. పుట: 80)

నల్లగల్లు = (జోగిని. పుట: 99)

నసీబు = అదృష్టం (జోగిని. పుట: 116)

నాత్తిరి = రాత్రి(జె.యి. పుట: 19)

నారాలు = నినాదాలు (కాలస్పర్శ. పుట: 12)

నిశాని = వేలిముద్ర (జోగిని. పుట: 88)

నీరడి = చెరువుకు కాపాలగా ఉండి పొలాలకు నీరు సరిగా, అందరికి సమానంగా వెళ్తుందా లేదా అని చూచే గ్రామ ఉద్యోగి. (జోగిని. పుట: 5)

నెత్తిమీదికి పొద్దచ్చు = మిట్ట మధ్యాహ్నం(జె.యి. పుట: 20)

నెల్లాల్లు = నెలరోజులపాటు (జె.యి. పుట: 42)

పగార్లు = వేతనాలు (సంఘము. పుట: 92)

పన్నాలు = కమ్మలు (కాలస్పర్శ. పుట: 22)

పయెందాసాలు = పదిహేను రోజులు (జె.యి. పుట: 42)

పరేషాన్ = ఆందోళన (జోగిని. పుట: 35)

| | |
|---|---|
| పసురం | = పశువు (జె.యి. పుట: 28) |
| పింజర | = జైలు (జె.యి. పుట: 26) |
| పీనుగ | = శవం (జోగిని. పుట: 46) |
| పుటానపుర్గు | = ఒక్కరు కూడా లేకపోవడం (జె.యి. పుట: 48) |
| పుతివి | = పృథ్వీ, భూమి, ప్రపంచం, లోకం (జె.యి. పుట: 46) |
| పులుగోలియా | = పశువులకు అనారోగ్యం చేసినపుడు గ్రామదేవతను శాంతింపజేసేందుకు 'ఊరపండగ' చేస్తారు. అందులో భాగంగా పశువులపై మంత్రించిన నీటిని చల్లుతారు. ఆ సమయంలో దానిని 'పులుగోలియా' అంటారు. (జోగిని. పుట: 2) |
| పెద్ద గాసము | = ఎక్కువ ఆహారం(జె.యి. పుట: 23) |
| పెనిమిటి | = భర్త (జోగిని. పుట: 59) |
| పైకం | = డబ్బు(జె.యి. పుట: 22) |
| పొత్తుకాలు | = పుస్తకాలు(జె.యి. పుట: 20) |
| పొద్దుందాక | = పగలంతా(జె.యి. పుట: 26) |
| పొద్దుగూకి | = పొద్దు కుంకిన తరువాత, రాత్రి(జె.యి. పుట: 23) |
| పొల్లగాని | = పిలగాని(జె.యి. పుట: 23) |
| పోరి | = అమ్మాయి(జె.యి. పుట: 24) |
| ప్లీడరు | = న్యాయవాది (సంఘము. పుట: 105) |
| ఫరక్ | = తేడా (జోగిని. పుట: 2) |
| ఫిరంగోల్లు | = ఆంగ్లేయులు (జె.యి. పుట: 37) |
| బండారు | = దేవుని బొట్టు (పసుపు) (జోగిని. పుట: 50) |
| బక్కలు | = పశువులు(జె.యి. పుట: 22) |

బగ్గ = ఎక్కువ (జోగిని. పుట: 49)

బడి = పాఠశాల (జోగిని. పుట: 17)

బరాబర్ = ఖచ్చితంగా (జోగిని. పుట: 104)

బసివిరాండ్రు = శైవమతంలో దేవుని పేరుమీద వదిలిన స్త్రీలు (జోగిని. పుట: 63)

బాకి = రుణం, అప్పు(జె.యి. పుట: 24)

బాడ్కావ్ = ఒక తిట్టు (జోగిని. పుట: 35)

బిచ్చాలు = పిల్లలు (సంఘము. పుట: 75)

బీమారు = వ్యాధి (జోగిని. పుట: 50)

బుగులు = భయం (జోగిని. పుట: 116)

బెరకటం = తీయటం (మృత్యోర్మ అమృతాంగమయ. పుట: 10)

భత్తా = జీతభత్యం(సంఘము. పుట: 78)

మబ్బుల = ఉదయం (జె.యి. పుట: 41)

మరగడం = అలవాటు పడటం (కాలస్పర్శ. పుట: 66)

మర్లగొట్టు = తిప్పి పంపు, వెనకకు పంపు (జె.యి. పుట: 41)

మస్తు = ఎక్కువ, చాలా (జోగిని. పుట: 50)

మాతమ్మ = దేవుని పేరుమీద వదిలిన ఒక స్త్రీ (జోగిని. పుట: 69)

మానికలు = కొలమానం (జోగిని. పుట: 5)

మానెడు = ధాన్యం కొలిచే పాత్ర (జె.యి. పుట: 28)

మాపటేల = రాత్రివేళ (కాలస్పర్శ. పుట: 30)

మాఫీ = రద్దు (జోగిని. పుట: 51)

మాయ్యె = మా+అయ్య, మా నాన్న(జె.యి. పుట: 19)

మాలాస్కుందా = చాలా అందంగా(జె.యి. పుట: 23)

| | |
|---|---|
| ముతక పంచె | = పాత/మాసిన పంచె(జోగిని. పుట: 10) |
| మునుము | = వరుస(జె.యి. పుట: 24) |
| ముల్లె | = అప్పు/డబ్బు (సంఘము. పుట: 80) |
| ముల్లె/ముడుపు | = మూట. వివిధ సందర్భాలలో వాడతారు. గ్రామదేవత దగ్గర బియ్యం, పసుపు, కుంకుమ కలిపిన మిశ్రమాన్ని మూటగా కడతారు. గ్రామ ప్రజలు తమ మొక్కులను తీర్చుకోవడానికి ఈ ముల్లె/ముడుపు కడతారు. (జోగిని. పుట: 3) |
| మైలపట్టం | = స్త్రీ జోగినిగా మారేముందు చేసేది (జోగిని. పుట: 55) |
| మొదాలు | = మొదటిసారి (జోగిని. పుట: 13) |
| మోట | = పూర్వం బావి నీటిని ఎద్దులతో తోడేవారు. దీనిని మోటగొట్టడం అంటారు. బొక్కెనతో పైకి తోడిన నీటిని బావికి కొంత దూరంలో పోయటానికి ఏర్పర్చిన ప్రాంతం. (జె.యి. పుట: 36) |
| మోపెడు | = మోయగల్గినంత, ఎక్కువమొత్తం(జె.యి. పుట: 23) |
| యాట్ట | = అలసట (జె.యి. పుట: 34) |
| యాది | = జ్ఞాపకం (జె.యి. పుట: 46) |
| యాల్లపొద్దుగాల | = సరైన సమయానికి(జె.యి. పుట: 22) |
| యిటం | = గ్రామంలో పండగ జరిగినపుడు గ్రామపెద్ద, దొర ముందుగా ఇచ్చే కానుక. (జోగిని. పుట: 5) |
| యిద్దె | = విద్య(జె.యి. పుట: 26) |
| యినాం | = ఉచితంగా ఇవ్వబడిన భూమి (జోగిని. పుట: 133) |

| | |
|---|---|
| యిరాము | = విశ్రాంతి (జె.యి. పుట: 42) |
| యీనటం | = కనటం/వరికంకి వేయడం(జె.యి. పుట: 23) |
| యెటానెండ | = విపరీతమైన ఎండ(జె.యి. పుట: 26) |
| రంగం | = దేవుడు ఊగడం, శిగం ఊగడం (జోగిని. పుట: 100) |
| రికాం | = విరామం ఎరుగకుండా (కాలస్పర్శ. పుట: 28) |
| రోత | = మలమూత్రాదులు(జె.యి. పుట: 20) |
| లావు సింత | = ఎక్కువ ఆలోచన (జె.యి. పుట: 42) |
| లెక్కనే | = వలెనే (జోగిని. పుట: 46) |
| లెల్లం | = తొందరగా(జె.యి. పుట: 19) |
| వతను | = వంతుల వారీగా, సంప్రదాయంగా, కట్టుబాట్లు. గ్రామంలో ఏదైనా పండగ జరిగినపుడు ఎవరి పనులను వారు చేయడాన్నే వతను అంటారు. (జోగిని. పుట: 5) |
| వుల్లిగడ్డన్ని మెతుకులు | = ఉల్లిగడ్డ పరిమాణంలో ఉండే ఆహారం (జె.యి. పుట: 41) |
| వుసురు | = శాపం(జె.యి. పుట: 45) |
| వొడిపిలి | = గడ్డిరకం(జె.యి. పుట: 24) |
| వోలయినా | = ఎవరైనా(జె.యి. పుట: 19) |
| శాల | = పద్మశాలీ (సంఘము. పుట: 104) |
| సకుల గ్యానాలు | = సకల విజ్ఞానం (జె.యి. పుట: 61) |
| సకులం | = సర్వం(జె.యి. పుట: 20) |
| సనికి | = తలా నెత్తి(కాలస్పర్శ. పుట: 12) |

| | |
|---|---|
| సమజ్ | = అర్థం (జోగిని. పుట: 35) |
| సమజ్ | = అర్థం (జోగిని. పుట: 88) |
| సాగగొట్టు | = పంపించు, తోలిచ్చు(జె.యి. పుట: 20) |
| సామ నలుపు | = చామన చాయ నలుపు(జె.యి. పుట: 24) |
| సాలె | = బడి, పాఠశాల(జె.యి. పుట: 20) |
| సికాయ్తి | = ముద్ర (జె.యి. పుట: 45) |
| సుక | = కూడా (కాలస్పర్శ. పుట: 36) |
| సుదుపదు | = స్పృహ కోల్పోవు (సంఘము. పుట: 101) |
| సైసటం | = నచ్చరు(కాలస్పర్శ. పుట: 26) |
| సొరపాదు | = సోరకాయ తీగలతో కూడిన పందిరి (జె.యి. పుట: 28) |
| సోపతి | = స్నేహం (సంఘము. పుట: 81) |
| సోయి | = స్పృహ (జె.యి. పుట: 48) |
| సోలెడు | = ధాన్యం కొలిచే సాధనం సోల. దానికి తగిన పరిమాణం. దాదాపు ఒకకిలో(జె.యి. పుట: 24) |
| హల్కతనం | = చిన్నతనం (సంఘము. పుట: 78) |

**5.2. జాతీయాలు/సామెతలు/పలుకుబడులు**

| | |
|---|---|
| అన్నమో రామచంద్రా | = తీవ్రమైన కరువులో దీనిని వాడతారు. (సంఘము. పుట: 87) |
| అయిదేళ్ళు అంటుకపోవు | = అర చేయితో గట్టిగా కొట్టడం వల్ల వేళ్ళతో సహా అచ్చులు పడటం(జె.యి. పుట: 19) |

అరటికాయలో ఆవగింజంత = చాలా చిన్నది అని చెప్పడంలో దీనిని వాడతారు. (సంఘము. పుట: 85)

అరికాలుకు ముల్లు నాటుకును = ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదుర్కోవడాన్నే 'అరికాలుకు ముల్లు నాటుకొను అంటారు. (జె.యి. పుట: 45)

అరిటాకు మీద ముల్లు పడ్డా, ముల్లు మీద అరిటాకు పడ్డా అరిటాకుకే నష్టం = అధికార, అంగబలం ఉన్నవాడితో బీదవాడు తలపడలేడు. ఒకవేళ తలపడితే ఈ సామెతను వాడతారు (ఆ.పి. పుట: 12)

అల్లుడికి పంచెపెడితే అంచు లేదని అలిగిందన్నట్లు = గౌరవంగా ఇచ్చింది కాదని అలుగడం (కాలస్పర్శ. పుట: 58)

ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టలేడు = కుటుంబ సభ్యులు దొంగతం చేస్తే ఇంటిలోని వారెవరూ గుర్తించలేరు. (సంఘము. పుట: 107)

ఇటు నుయ్యి అటు గొయ్యి = ఎటువెళ్ళినా సమస్యలు వెంటాడుతున్నప్పుడు దీనిని వాడతారు. (కా. క. పుట: 42)

ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు = స్త్రీ చదువు ఇంటికి వెలుగులాగా ఉంటుంది. (స్వే.వి. పుట: 31)

ఉడుతా భక్తి = చేతనైనంత సహాయం చేయడాన్ని ఇలా అంటారు. రామసేతు నిర్మాణంలో రామునిమీద భక్తితో ఒక ఉడుత తాను కూడా నీటిలో తడిసి ఇసుకలో పొరలి తన శరీరానికి అంటిన ఇసుక రేణువులను ఆ సేతువుపై

రాల్చి పోతుంది. దానినుండే ఈ పలుకుబడి వచ్చిందని ప్రజల నమ్మకం. (జె.యి. పుట: 46)

ఉపవాసం ఉంటే అప్పు తీరది ఊపిరిపడితే బొర్ర నిండది = తినకుండా ఉంటే అప్పు తీరదు, ఊపిరి బిగపడితే కడుపు నిండదు తినాల్సిందే (కాలస్పర్శ. పుట: 29)

ఉప్పుల పోగొట్టుకొని పప్పుల దేవులాడితే దొరుకుతుంతా = ఒకదగ్గర పోగొట్టుకొని మరోచోట వెతికితే దొరకదు కదా (కాలస్పర్శ. పుట: 28)

ఎనుకటికి ప్రసూతి మంత్రసాని ఉండేదట పిండమొచ్చినా పట్టాలె పెండొొచ్చినా పట్టాలె = ఏదైనా వృత్తిలోకి దిగితే ఎటువంటి కష్టమైన పని ఎదురైనా చేయాల్సిందే (ఆరాటం. పుట: 40)

ఎలుకల బాధకని ఇల్లు తగులబెట్టుకొను = చిన్నపని కోసం పెద్దగా శక్తినిగాని, డబ్బును ఖర్చు చేసే సమయంలో దీనిని వాడతారు. (న.చ. పుట: 65)

ఏ రోటికాడ పాట ఆ రోటికాడ పాడేటోళ్ళు = న్యాయమైనా, అన్యాయమైనా ఎటువైపు ఉంటే అటువైపే మాట్లాడటం (కాలస్పర్శ. పుట: 14)

ఏదైనా వొంతులుంటే బంతులున్నా తప్పదన్నట్టు = ఏదైనా ప్రమాదం జరిగేదుంటే వ్యక్తిగా ఉన్నా జరుగుతుంది, గుంపులో ఉన్నా జరుగుతుంది. దాన్నే కర్మ, దురదృష్టం అంటారు (కాలస్పర్శ. పుట: 34)

ఏరెల్లినంక తెప్ప తగలేసినట్టు = అవసరం తీరిన తరువాత ఆపదలో ఆదుకున్నవారినేమరచిపోవడం/పట్టించుకోకపోవడం (జోగిని. పుట: 35)

ఒక్కాకుల జదువు = ఒకేరకమైన భావాలు కలిగిన వారిని 'ఒక్కాకుల జదువుకున్నారు' అని అంటారు. (జె.యి. పుట: 29)

ఓడలు బళ్ళు అవుతాయి బళ్ళు ఓడలవుతాయి = సంపద ఎప్పటికీ శాస్వతం కాదు. ధనికులు పేదవారిగా మారొచ్చు లేదా పేదవారు ధనికులు మారవచ్చు(యశోధరుడు. పుట: 47)

కండ్లంల్ల ఉండు = అందరి దృష్టిలో పడటం(జె.యి. పుట: 27)

కడుపు సల్లగుండు = ఆపదలో ఉండగా ఆదుకున్నవారిని కృతజ్ఞాపూర్వకంగా ఈ పలుకుబడి వాడతారు. చేసిన సహాయానికి ప్రతిగా మీరు చల్లగా ఉండాలని ధీవించడం (జె.యి. పుట: 45)

కల్లు త్రావిన కోతి = కోతి మామూలుగానే చిందర వందరగా చేస్తుంది. అదే కల్లు తాగితే భీభత్సం చూపిస్తుంది. కనుక ఎవరైనా పిచ్చిపిచ్చిగా చేస్తే దీనిని ఉదాహరణగా వాడతారు (సంఘము. పుట: 78)

కళ్యాణమచ్చినా, కక్కచ్చినా ఆగదు = ఏదైనా సమయం వచ్చినప్పుడు జరుగుతుందని అర్థం (స్వే.వి. పుట: 36)

కాకికి కరణికమిస్తే చేనంతా కలెదిర్గింది = మనవాడు కానివానికి అధికారం ఇస్తే ఇల్లంతా నాదేనని అన్నట్లుగా వ్యవహరించడం (కాలస్పర్శ. పుట: 58)

కానని మొకానికి కప్పనే పులి = గొప్ప విషయాలు/సంఘటనలు చూడలేనివారికి అందుబాటులో ఉన్నదే గొప్ప

అని భావించడాన్నే కానని మొకానికి కప్పనే పులిలాగా భావిస్తారు. (సంఘము. పుట: 93)

కారాలు మీరాలు = అతికోపం మీద ఉన్నప్పుడు దీనిని వాడతారు (జె.యి. పుట: 42)

కోటిపెట్టి కోమటిని కొనాలె = కోమటివాళ్ళలో బీదవాళ్ళు ఉండరు. ఒకవేళా ఉన్నా వారి వ్యాపార మెలకువలతో ఎదుగుతారు. కనుక దీనిని వాడతారు. (సంఘము. పుట: 78)

గంగదిక్కు జూసెటోనికి జంగం దేవర మెండైతడటన్నట్లు= నీటివైపు చూడటం అంటే శివుని భార్య గంగను దర్శించడమే. కాబట్టి గంగదిక్కు చూస్తే శివుడు దగ్గరవుతాడని అర్థం (కాలస్పర్శ. పుట: 15)

గడ్డాకు పువ్వు సుత రంగు పులుముకున్నట్లు = స్థోమత లేకున్నాగాని, అప్పుజేసైనా సరే అందరితో తందానా అంటూ వాళ్ళలో కలిసిపోయేట్లు తయారు కావాలి (కాలస్పర్శ. పుట: 43)

గడ్డిని బట్టి గొర్రె, గొర్రెను బట్టి గొల్లలన్నట్లు = తిండి, రూపురేఖలను బట్టి మనుషులను గుర్తించడం (కాలస్పర్శ. పుట: 60)

గద్దవచ్చి కోడిపిల్లను తన్నుకుపోయినట్టు = బలంగా ఉన్నవారు బలహీనుల్ని ఇబ్బంది పెట్టిన సందర్భంలో దీనిని వాడతారు (సంఘము: పుట: 75)

గాలికి రాలిపోవు = అతి బలహీనంగా/వయసు మళ్ళిన (జె.యి. పుట: 48)

| | |
|---|---|
| గుడ్డెద్దు చేలో పడ్డట్టు | = ఏదైనా పని చేసేటపుడు ఆచితూచి జాగ్రత్తగా చేయాలి. గుడ్డెద్దు చేలో పడితే ఎక్కడ మేస్తుందో, ఎలా మేస్తుందో తెలియదు. అందుకే గుడ్డెద్దుతో పోల్చారు. (జోగిని. పుట: 135) |
| గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్టు | = చిన్నవాళ్ళు పెద్దవారికి ఉచిత సలహాలివ్వడం (సృ.తీ. పుట: 60) |
| గొర్రెల మందల తోడేళ్ళున్నట్లు | = నమ్మించి గొంతు కోయడం లాంటిది. అందరిలోనే ఉంటూ కాటు వేయడం (కాలస్పర్శ. పుట: 57) |
| చల్లకొచ్చి ముంత దాయడమెందుకు | = చెప్పే విషయం, అడగాలనుకునేవి సూటిగా అడగకుండా పరోక్షంగా వ్యవహరిస్తే దీనిని వాడతారు (న.చ. పుట: 134) |
| చాలించు భారతం | = అవసరానికంటే ఎక్కువ విషయాన్ని చెప్తే ఇక ఆపు చెప్పడమే దీనర్థం (జె.యి. పుట: 48) |
| చేసిన రెక్కలు శాగబార్తయి చెయ్యనియ్యి-చెయ్యనియి బూజు బడ్తయోంటరు | = పని చేసే చేతులు చేట్లకు శాకబారినట్లు శాకబారి గట్టిపడతాయి. చేయని చేతులు ఎందుకు పనికిరాకుండా బూజు పడతాయి. కష్టం చేసేవారిని గుర్తించుట(జె.యి. పుట: 23) |
| జెనిగె పట్టు | = మొండిపట్టు, (బురదలో ఉండే బరిజెనిగె మనిషిని గట్టిగా పట్టుకుంటుంది. ఎంతకు వదలదు, రక్తం పీల్చే వరకు పట్టు వదలదు) (జె.యి. పుట: 28) |

జెర్రికి వెయ్యి కాళ్లున్నట్లు = అనేక ఉపాయాలు తెలిసినవారికి దీనిని వాడతారు. (కాలస్పర్శ. పుట: 37)

తగువుజెప్పు మారాజాంటే తల్లీ పిల్ల నాదేనన్నడట = పరిష్కారం చెప్పే సమయంలో న్యాయ అన్యాయాలను ఎంచకుండా అందరూ నావాల్లే అనటం (జె.యి. పుట: 29)

తమ తమ నెలవులు తప్పిన తమ మిత్రులు శత్రువులగుట = ఆర్థికంగా, బుద్ధిబలంగా (ఆ.పి. పుట: 50)

తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు బెదరటం = దేనికి భయపడం అని చెప్పే సందర్భంలో దీనిని వాడతారు (మహానంద. పుట: 164)

తాను మునిగిందే గంగ, తాను మెచ్చిందే రంభ = తను ఏది చేస్తే అదే. అతి స్వేచ్ఛా (స్వే.వి. పుట: 2)

తానొక్కటి తలిస్తే దైవం ఒక్కటి తలిచెనన్నట్టు = అనుకున్న పని కాకపోతే దీనిని వాడతారు (ఆ.పి. పుట: 33)

తాము కూర్చున్న కొమ్మనే నరుకొంటున్నారు = తమకు ఆసరాగా ఉన్న దానినే దూరం చేసుకోవడం (సంఘము. పుట: 92)

తియ్యటి మాటలకు తీర్థం పోతే నీవు గుల్లె నేను చల్లె = చెప్పుడు మాటలకు పోతే నష్టపోవాల్సి వస్తుందని అర్థం (ఆరాటం. పుట: 30)

తెలుపు బంగారాన్ని చూస్తేనే తెలుసుకునే యవకాశముందిగాని, అపరంజ్జి మాత్రం అనేకమార్లు గీటురాయిపై గీయబడి పరీక్షించబడతాది = స్వచ్ఛమైనదానికి దేనికైనా (జె.యి. పుట: 43)

తొడిగితె కాలుకు. ఇడిస్తెపంచకు = చిన్న వస్త్రం అని చెప్పే సందర్భంలో దీనిని వాడతారు(జె.యి. పుట: 32)

తొణికిన పాలు మళ్ళీ పోగుచేసుకోలేం = గడిచిన కాలాన్ని తిరిగి వెనక్కి తీసుకోలేం అనే అర్థం దీన్ని వాడారు. (న.చ. పుట: 15)

దరిద్రుని చేన్ల వడగండ్ల వాన పడ్డట్లు = ముందే బీదవాడు అందులో వడగండ్ల అతని చేనిలో పడితే కోలుకోడు కదా (కాలస్పర్శ. పుట: 61)

దిక్కులేనోళ్ళకు దివాణం లేదు అకల్ లేనోళ్ళకు అర్లెం లేదు = దిక్కులేనివారికి నివాసం ఉండదు. ఆకలి లేనివారికి అన్నం దొరకదు (కాలస్పర్శ. పుట: 21)

దీపముండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి = అన్ని ఉండగానే జాగ్రత్తగా పెట్టుకోవాలి. ముందే మేల్కోవాలని అర్థం (విజేత. పుట: 19)

నడుమంత్రపేశాలు = మధ్యలో వచ్చిన గుణం, ఆలోచన(జె.యి. పుట: 23)

నిమ్మకు నీరెత్తినట్లు = ఏ విషయంలోనైనా తనకు సంబంధం లేనట్లు వ్యవహరించడం (కాలస్పర్శ. పుట: 57)

నివురు గప్పిన నిప్పు = తనకు ఉన్న శక్తిని పైకి తెలియనీయకుండా, గర్వపడకుండా ఉంటాడు (స్వే.వి. పుట: 105)

నెత్తురు నీల్లు జేయు = నెత్తురు ధారపోసి ఎక్కువగా కష్టపడటం (జె.యి. పుట: 29)

పగాలనక పసూలోలె నాత్తిరనక బూతాలోలె= పగలంతా పశువులవలే కష్టం పడటం, రాత్రంతా బూతం/దయ్యం/పిశాచాలవలె కష్టంపడటం(జె.యి. పుట: 20)

పలుచగైతే అట్టు, గట్టిగైతె కుడుములు = సందర్భానుసారంగా వ్యవహరించాలని అర్థం. (సంఘము. పుట: 91)

పాత బట్టకి కొత్త పేలిక అద్దినట్టు = పాతదానిని కొత్తదానిగా మార్చడం (కాలస్పర్శ. పుట: 61)

పాలిచ్చే యావునే కట్టివేస్తారుగాని గొడ్డు ఆవుకా బాధలుండవుగదా? = పని చేసేవారికే ఇబ్బందులు అని దీనర్థం. (జె.యి. పుట: 43)

పూలమ్మినచోట కట్టెలమ్ముట = గొప్పగా బతికినచోటే చిన్న పనులు చేస్తూ బతకడం సాధ్యం కాదని అర్థం. కానీ అవసరం, సందర్భం వచ్చినప్పుడు ఏ పనులైనా చేయాల్సిందే. (సంఘము. పుట: 90)

పెద్దపెద్ద దొరల జీతాలు యెన్నేయిలున్న మల్లా అప్పులంగడేనట = దొరల జీతాలుంటే, జీతం ఎక్కువ ఉన్నాగాని, మళ్ళీ అప్పు చేయాల్సిందే, దానిమీద బతకాల్సిందేనని దీనర్థం (జె.యి. పుట: 52)

పెళ్ళాము బెల్లము, తల్లి అల్లము = కొందమంది మగవాళ్ళు పెళ్ళి అయిన తరువాత పూర్తిగా మారిపోతారు. పెళ్ళాన్ని ప్రేమగా చూసుకుంటారు, తల్లిని దూరంగా పెడతారు (ఆ.పి. పుట: 24)

పేదవాని మాట పెదవికి చేటు = పేదవాడు చెపితే ఎవరూ వినరు. విన్నా వీడు నాకేంటి చెప్పేది అని తిడతారు. తక్కువగా చూస్తారు (ఆరాటం. పుట: 68)

పేనుకు పెత్తనమిస్తే గుండంతా గోకేసిందట = అంటే చిన్నవారికి, అనుభవం తక్కువ ఉన్నవారికి అధికారం ఇవ్వకూడదని దీనర్థం. (జోగిని. పుట: 129)

మంది కలకల వుత్తగ బోదు = ఎవరికైనా అపకారం చేస్తే వారి ఉసురు, శాపం తగులుతుందని దీన్ని వాడతారు. (జె.యి. పుట: 45)

మందిసొమ్ము మంగళవారము = కొందరు ఇతరుల సొమ్ముపైనే ఆధారపడి జీవిస్తారు. (ఆ.పి. పుట: 52)

మనసు మనుమన్ని జూడాలంటొంటె, కాల్లుకాటిని జూస్తామంటొన్నై = మనసుకు అంతరాలు ఉండవు. అది దేనినైనా ఊహిస్తుంది. కానీ శారీరక వయస్సు మాత్రం క్షీణిస్తుంటుంది.(జె.యి. పుట: 61)

ముందొచ్చిన చెవులకన్నా వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు = ఏదైనా కొత్తది వచ్చినపుడు పాతదానిని మరచిపోవడం. (స్మృ.తీ. పుట: 70)

ముల్లుగుచ్చిన కోతి = చిందరవందర చేస్తున్నప్పుడు దీనిని వాడతారు(ఆ.పి. పుట: 12)

మూలవాన ముంచక తీరదన్నట్లు = ఒకమూల నుంచి వచ్చే వాన ముంచకుండ అంటే నష్టం కలిగించకుండా తగ్గదని అర్థం. (కాలస్పర్శ. పుట: 61)

మెరిసేదంతా బంగారం కాదు = మనకు కన్పించేదంతా నిజం కాకపోవచ్చు.(న. చ. పుట: 112)

మొక్కై వంగనిది మ్రానై వంగునా = ఏదైనా మొదటిలోనే చక్కదిద్దుకోవాలి. సమయం మించిన తర్వాత ఏం చేయలేం. (స్వే.వి. పుట: 25)

మొగడు సచ్చి ముండ మూలుగుతుంటే రాజుగాడొచ్చి రాళ్ళిసిరినట్టు = భర్త చనిపోయిన బాధలో స్త్రీ ఉంటే రాజుగాడు వచ్చి ఇబ్బందిపెట్టాడు (కాలస్పర్శ. పుట: 29)

యీపుల పాపాయి లేపుడు = వీపుమీద ఎక్కువగా కొట్టడం(జె.యి. పుట: 23)

యేస్గు దెచ్చుకొని యేస్గేదింటదట = బలవంతులు, బుద్ధిబలం ఉన్నవారు వారే తెచ్చుకొని వారే తింటారని దీనర్థం (జె.యి. పుట: 52)

రక్తం రుచికి మరిగిన పులికి జింక పిల్లలు కనిపిస్తే ఊరుకుంటుందా = అధికంగా దోచుకునేవాడికి చిన్నపాటివి నచ్చవు కదా (ఆ.పి. పుట: 29)

రెండు మూతుల పాము = ఇరుపక్షాలవైపు మాట్లాడటాన్ని 'రెండు మూతుల పాము' అంటారు. (జె.యి. పుట: 36)

రెక్కాడ్తే బుక్కాడ్తది = కష్టం చేస్తేనే కడుపులోకి అన్నం వస్తుంది (జె.యి. పుట: 29)

రోట్లె తల్కాయలు బెట్టి రోకండ్ల కెర్సేదుందా = ఇబ్బందులు ఉంటాయని తెలిసి కూడా ముందుకు వెళ్ళి, వాటికి బయపడి వెనకడుగు వేయవద్దన్ని చెప్పే సందర్భంలోనిది. (జె.యి. పుట: 43)

విద్యలేనివాడు వింత పశువట = విద్య లేనివాడు పశువుకన్నా హీనం అని అర్థం (జె.యి. పుట: 21)

సచ్చినా యింత సక్కంగ తొవ్వన్న దొర్కాలె = మంచి చేసేవారు స్వర్గానికి వెళ్తారంటారు. కనుక స్వర్గానికి దారి దొరకాలంటే మంచి చెయ్యాలి. (జె.యి. పుట: 42)

సదువుకు ముదురు, సాముకు ల్యాతనట= చదవటానికి వయసుతో సంబంధం లేదు, ఎవరైనా చదవవచ్చు. అదేవిధంగా యుద్ధం చేసే సమయంలో వయసు తక్కువగా ఉన్నవారు కూడా నేర్పుతో, తెలివితో యుద్ధంలో పాల్గొనవచ్చని అర్థం. (జె.యి. పుట: 30)

సిన్ననోటికి సిన్న మాటలే ముద్దురా = భూస్వాముల కాలంలో ఎవరు ఎంతల ఉండాలో అంతల ఉండాలె అని అర్థం(జె.యి. పుట: 37)

సిబ్బెదు బూడ్డి బడనీయు = కట్టెలతో వంట చేసినప్పుడు బూడిద పడుతుంది. ఎక్కువ రోజులు వంట చేస్తేనే ఎక్కువ భూడిద పడుతుంది. సిబ్బెదు అంటే వంట చేసేటపుడు గంజి వంచుతున్నపుడు అన్నం మెతుకులు కింద పడకుండా ఒకరకమైన గడ్డితీగతో అల్లుతారు. అది పాత్ర లాగా ఉంటుంది. దాని నిండా బూడిద కావాలని ఉద్దేశం. అంటే చాలా బూడిద పడాలి. అలా పడితేనే ఎక్కువ రోజులు వంట చేసినట్టు. ఒకే ప్రదేశంలో ఎక్కువ రోజులు ఉన్నట్టు. ఇటువంటి సందర్భంలో దీనిని వాడతారు.(జె.యి. పుట: 45)

సెముటడిపిన గంజి = కష్టం చేసి సంపాదించిన తిండి(జె.యి. పుట: 23)

**5.3. జంట పదాలు**

| | | |
|---|---|---|
| కల్లునీల్లు | = | (జె.యి. పుట: 23) |
| గబగబా | = | (సంఘము. పుట: 114) |
| గుట్టనక శెట్టనక | = | (జె.యి. పుట: 26) |
| చీర్కలు చీర్కలు | = | (జె.యి. పుట: 24) |
| డబ్బ్యా దస్కం | = | (జోగిని. పుట: 55) |
| తుక్కు తుక్కు | = | (జె.యి. పుట: 24) |
| పనో బాటో | = | (జె.యి. పుట: 41) |
| బట్టా పొట్ట | = | (జె.యి. పుట: 26) |
| బట్టాబాతా | = | (జె.యి. పుట: 23) |
| బిరబిర | = | (జోగిని. పుట: 100) |
| బిలబిల | = | (సంఘము. పుట: 110) |
| బొట బొట | = | (సంఘము. పుట: 100) |
| మక్తలా మాన్యాలా | = | (జె.యి. పుట: 29) |
| రాల్లురోల్లు | = | (జె.యి. పుట: 42) |
| సదువులు గిదువులు | = | (జె.యి. పుట: 27) |

*****

# ముగింపు

'నిజామాబాదు జిల్లా నవలలు–సామాజిక విశ్లేషణ' పరిశోధనలో చర్చించిన విషయాలను అధ్యాయాల వారీగా కింద పేర్కొన్నాను.

**మొదటి అధ్యాయం: నిజామాబాదు జిల్లా పరిచయం, నేపథ్యం**

తెలంగాణ చరిత్రలో నిజామాబాదు జిల్లాకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ ప్రాంతంలో పురావస్తు సంపద పుష్కలంగా బయటపడింది. క్రీస్తుపూర్వం వెయ్యి సంవత్సరాల కాలంనాటి రాక్షసగుళ్లు బయటపడ్డాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలలో నిజామాబాదు ఒకటి. ఈ జిల్లాను పూర్వం ఇందూరు మరియు ఇంద్రపురి అని పిలిచేవారు.

జైనయుగం నాటి పాలనా విభాగాలను దేశములు, రాజ్యములుగా అని పిలిచేవారు. అంగ–వంగ, కలింగ మొదలైన దేశాలు ఉండేవి. 'ఇందూరు సీమ' ప్రాంతం 'పులాకదేశం'గా పిలువబడింది. శాతవాహనుల కాలంలో ఈ ప్రాంతం 'మంజీరకాదేశం'గా పిలువబడింది. రాష్ట్రకూటుల కాలంలో మెదక్, నిజామబాద్, కరీంనగర్ ప్రాంతాలను 'నాగభూమి'గా పిలువబడ్డాయి.

నిజామాబాదు జిల్లాలోని కోటలు, సంస్థానాల ప్రస్థావన ఈ అధ్యాయంలో చేశాను. ప్రధానంగా కౌలాస్ సంస్థానం, సిర్నాపల్లి సంస్థానం, దోమకొండ సంస్థానం మొదలైన చారిత్రక విషయాలను ఇందులో చర్చించాను.

నిజామాబాదు జిల్లా భౌగోళిక నైసర్గిక స్వరూపంలో భాగంగా నేలలు, పంటలు, పర్వతాలు, అడవులు, నదులు–ప్రాజెక్టులు, ఖనిజాలు మొదలైన వాటిని ఇందులో చెప్పాను. జిల్లాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఆధ్యాత్మిక క్షేత్రాలైన లింబాద్రిగుట్ట, బడాపహడ్, సారంగాపూర్, శ్రీ సిద్ధరామేశ్వర స్వామి దేవాలయం, శ్రీ కాలభైరవ స్వామి దేవాలయం, కంఠేశ్వర్, డిచ్‌పల్లి రామాలయం, ఖిల్లా

రామాలయం, వంద స్తంభాల గుడి మొదలైన వాటిని వివరించాను. అదేవిధంగా జిల్లా సాంఘిక, ఆర్థిక, సాంస్కృతికాంశాలను కూడా విశ్లేషించాను. నిజామామాబాదు జిల్లాలోని రవాణా, జనాభాను పేర్కొన్నాను.

**రెండవ అధ్యాయం-నిజామాబాదు జిల్లా సాహిత్యం-విహంగ వీక్షణం**

ప్రాచీనకాలంలో సాహిత్యం పోషింపబడిందనడానికి సరైన ఆధారాలను పరిశీలించినట్లయితే, భవభూతి క్రీ.శ. 680-750 ప్రాంతానికి చెందినవాడు. అయితే భవభూతి తానే స్వయంగా విదర్భ దేశంలోని పద్మపురం గ్రామవాసినని చెప్పుకున్నాడు. ఇది నిజామాబాదు జిల్లాలోని బోధన్ నగరం. ఇది అత్యంత ప్రాచీన రాజధానీ నగరమైన 'పోదనపురం'. మహాభారతంలో పేర్కొనబడిన అశ్మకుని రాజధానీ నగరం. జైనతీర్థంకరుడైన బాహుబలి రాజధాని నగరం. బాహుబలిని గూర్చి కన్నడ పురాణంలో బోధన్ నగరాన్ని పద్మపురమని రాయబడింది. అయితే బోధన్‌కు వసుమతి, పద్మపుర, ఏకచక్రపుర, బహుధాన్యపుర పేర్లున్నాయి. చాళుక్య రాజైన ఇమ్మడి అరికేసరి-2 కవులకు, పండితులకు ఆశ్రయం కల్పించినట్లు తెలుస్తుంది. ఇతనివద్ద ఆశ్రయం పోందినవారిలో ఇందూరు జిల్లాకవిగా పేరుగాంచిన మహాకవి పంపడు. క్రీ.శ.902 ప్రాంతంలో జన్మించాడు. ఇతను కూడా పద్మపుర నివాసినని చెప్పుకున్నాడు. కన్నడ భాష త్రయంలో (పొన్న, రన్న, పంప) ఇతడు మొదటివాడు. ఇతను "ఆదిపురాణం", కన్నడ భాషలో "విక్రమార్జున విజయం" అనే కావ్యాన్ని రచించాడు. నన్నయ్య కంటే వంద సంవత్సరాలు పూర్వీకుడని, "జినేంద్రపురాణం" అనే కావ్యాన్ని రాశాడని చారిత్రకారుల అభిప్రాయం. కాని ఇది అలభ్య గ్రంథం. పంపకవి తమ్ముడు 'జినవల్లభుడు' కరీంనగర్ జిల్లాలోని గంగాధర సమీపంలో బోమ్మలగుట్ట మీద రచించిన "కుర్క్యాల శాసనం"లో తెలుగు కందపద్యాలు కనిపిస్తాయి. దీనిని బట్టి అన్నదమ్ములకు సంస్కృత, కన్నడ, తెలుగు భాషలల్లో ప్రావీణ్యం ఉందని తెలుస్తుంది. చివరకి జైనమతాన్ని స్వీకరించి 'శుభనంది' పేరుతో దేవేంద్ర సిద్ధాంతి శిష్యుడై బోధన్‌లో మరణించాడు. మధ్యయుగ కాలంనాటికి ముస్లిం పాలన ప్రభావం వల్ల తెలుగులో సాహిత్యం అంతగా అభివృద్ధి చెందలేదని చెప్పవచ్చు. క్రీ.శ.1405-1480 మధ్యకాలంలో నిజామాబాదు జిల్లా, ఆర్మూరు

తాలుకాలోని భీముగల్లుయే నేటి వేముగల్లు (ప్రస్తుత భీంగల్). ఈ ప్రాంత పాలకుడైన రాణామల్ల రాజాశ్రాయంలో ఆస్థానకవి కొఱవి గోపరాజు ఇతను నియోగి బ్రహ్మణుడు. వీరి తల్లిదండ్రులు కామాంబిక, కసవిరాజు. హరితస గోత్రానికి చెందినవాడు. ఈయన పన్నెండు ఆశ్వాసాల "సింహాసన ద్వాత్రింశిక" అనే సంస్కృత కావ్యానికి అనువాదం చేసి తెలుగులో కథాకావ్యంగా రచించాడు. ఇది అద్భుతరస ప్రధానం. గోపరాజు తన కావ్యాన్ని హరిహరనాథుడికి అంకితం చేశాడు. ప్రాచీన సాహిత్యంలోని ఇంకా అనేకమంది సాహితీవేత్తలను పరిచయం చేశాను.

తెలుగు సాహిత్యంలో 1875 తరువాత ఉన్న కాలాన్ని ఆధునికయుగంగా పేర్కొంటారు. సాహిత్యంలో ప్రాచీనకాలానికి ఆధునిక కాలానికి చాలా విస్తృతి కనబడుతుంది. ఈ కాలంలో తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అవి ఆంగ్లవిద్యా ప్రభావం, ఆనాటి రాజకీయ, సామాజిక పరిస్థితుల ప్రభావం, పాశ్చాత్య భావజాలం, లేక ముద్రణ యంత్రం, పత్రికలు అందుబాటులోకి రావడం, మరింకేదైనా కారణాలవల్ల సాహిత్యంలో మార్పులు వచ్చాయని చెప్పవచ్చు. అలా తెలుగు సాహిత్యంలో వచ్చినవే కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, మొదలైవి ప్రక్రియలు దర్శనమిస్తుంటాయి. సాహిత్య సంస్థలు, పత్రికలు చేసిన కృషితోపాటు రచయితలు చేసిన సేవలు మర్చిపోలేనివి.

ఆధునిక కాలంలో నిజామాబాదు జిల్లాలో వచ్చిన సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించింది. కావ్యాలు, శతకాలు, వచన, గేయ సాహిత్యం, యక్షగానం, భక్తి ఆధ్యాత్మిక, నాటకం, నాటిక, కథలు, నవలలు, జానపద సాహిత్యం, కళలు మొదలైన రంగాలకు చెందిన సాహిత్యం వెలువడింది. నిజామాబాదు జిల్లాకి సంబంధించిన సాహిత్యాన్ని పరిశీలిస్తే ఇలా ఎన్నో అమూల్యమైన సాహిత్య రూపాలు కనిపిస్తాయి. వీటిలో ముఖ్యంగా ఈ క్రింది వాటిని పేర్కొంటున్నాను.

కావ్య సాహిత్యంలో ప్రధానంగా శిరశినగల్ కళాశాలాభ్యుదయం, తాళ్ళ గంగాదాస యోగీంద్రులు జీవేశ్వరాద్వయ దోషరహితచల గురుబోధామృత చరిత్ర, శ్రీ నంబి శ్రీధరరావు గణితం, నింబాచల మహాత్మ్యం, మేడిచర్ల ప్రభాకరరావు భారత భారతి, నటేశ్వర శర్మ శ్రీ వేంకటేశ్వర విలాసం, మొదలైన వారు ఉన్నారు.

నిజామాబాదు జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు మూడు వందలకు పైగా శతకాలు వెలువడ్డాయి. శతక కర్తల్లో ప్రధానంగా లభిస్తున్న ఆధారాలను బట్టి కృష్ణాజివాడికి చెందిన బాబరాయుడు రాసిన 'రాజరాజేశ్వర శతకము' 1900వ ప్రాంతంలో వచ్చిన మొదటి శతకంగా చెప్పవచ్చు. రెడ్డిసెట్టి హనుమద్దాసు సాంబ శతకం, శ్రీరామోజు లక్ష్మణాచారి రాజరాజేశ్వర శతకం, రాగి చిన్నయ్య లక్ష్మీ శతకం, శ్రీ నంబి శ్రీధరరావు లొంక రామేశ్వర శతకం, మామిండ్ల రామగౌడు చౌడప్ప శతకం, పెనుగొండ శ్రీనివాసులు శ్రీ బసవలింగ శతకం, అయాచితం నటేశ్వర శర్మ ఏడు శతకాలు రాశాడు. శ్రీ శిరిశనగల్ కృష్ణమాచార్యులు గాంధీ శతకం, ఎలిగందుల లింబాద్రి నింబాద్రి శతకం మొదలైనవారు అనేక శతకాలు రాశారు.

నిజామాబాదు జిల్లాలో వచన సాహిత్యం కూడా విరివిగానే వెలువడింది. ముప్పై మంది రచయితలతో ఇందూరు భారతిలో 'నగ్న చిత్రాలు' అనే కవితా సంకలనం సమాజంలోని అరాచకాలను నిలదీసింది. సైబ పరందాములు పద చిత్రాలు, ఏ సూర్య ప్రకాశ్ సంస్పందన, చౌరస్తా, నగరం నీడలు మొదలైనవి, బైసరామదాసు, బెడిద రాజేశ్వరం రేపు, కన్నగంటి నరసింహారావు కారోటోచ్చింది, బొజ్జా తారకం నది పుట్టిన గొంతుక, కొల్లు రంగారావు వెలుగు పువ్వులు, మనపురం దేవేందర్ ఘన తెలంగాణ, తెలంగాణోద్యమంలో భాగంగా తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో 'గాయి', 'కామారెడ్డి కవుల పొలికేకలు', సిరిగాద శంకర్ పో, పద మొదలైనవి. ఇవిధంగా జిల్లా తరపున కవులు తెలుగు సాహిత్యానికి తమవంతు కవిత్వాన్ని వెలువరించారు.

గేయ సాహిత్యంలో రెడ్డిశెట్టి హనుమద్దాసు జ్ఞానబోధధ్యాత్మలు, తాళ్ళ లక్ష్మినారాయణ గౌడు గంగి పాటలు, మామిండ్ల కృష్ణమూర్తి పన్నీరులో కన్నీరు, మొండా ప్రభాకర్ రావు బాల సాహిత్యం, పాపాయి తువ్వాయి, సజ్జనపూడి అనంతరాములు నాట్యగీతరవళి, నటేశ్వర శర్మవసంత కుమారి, కామారెడ్డి పాట, వెలేటి గౌరీశంకరశర్మ మా అమ్మ, గన్ను కృష్ణమూర్తి మహా సంకల్పం, బోజన్నగారి రాజేశ్వరశర్మ కుమార జననం మొదలైనవి ఉన్నాయి.

నిజామాబాదు జిల్లాలో యక్షగాన సాహిత్యం కూడా ఉంది. యక్షగాన రచయితలలో చెర్విరాల బాగయ్యది అగ్రస్థానం. ప్రధానంగా ప్రజల వ్యవహరిక భాషలో యక్షగానాలు, చిరుతల నాటకాలను రచించి, అద్భుతమైన తన గానవాహినిలో సుమారు ఆరుదశాబ్ధాలపైగా ఇందూరు ప్రజలను ఓలాలడించిన గాన గంధర్వులు, కవి, నటులు ప్రయోక్త పలస హనుమద్దాసు పదిహేనేళ్ళ ప్రాయం నుండే కోలాట కీర్తనలు, యక్షగానాలు రచించడం ప్రారంభించాడు. ఇతను రుక్మాంగధ యక్షగానం, హనుమద్రాస సంగ్రామం, శకుంతలా విలాసం మొదలైనవి రచించాడు. మునిపంతులు మహాభారతాన్ని యక్షగానంగా రచించాడు. పెద్దిరాం పోచన్న పంతులు బీరప్ప చరిత్ర, గంగా కళ్యాణం మొదలైనవి.

నిజామాబాదు జిల్లా చారిత్రకంగా ఎన్నో దేవాలయాలకు, పుణ్యక్షేత్రలకు, తీర్థలకు, జాతరలకు ప్రసిద్ది. కాబట్టి భక్తి ఆధ్యాత్మిక సాహిత్యం కోకొల్లలుగా వచ్చింది. తాళ్ళగంగాదాస రాజయోగీంద్రులు రచించిన రచనలన్ని భక్తి, అధ్యాత్మిక, తాత్త్విక భావ సంపదకు నిలయాలు. కోనసముద్రం రాజమల్లిఖార్జునశర్మ శ్రీనావనాథ సిద్ధేశ్వర చరిత్ర (ఇది ఆర్మూరులోని సిద్ధులగుట్టగా ప్రసిద్ది). ఈ క్షేత్రానికి సంబంధించిన సమగ్ర చరిత్ర తెలియజేస్తుంది. ముత్యంపేటకి చెందిన కేదరనాథశర్మ ద్వాదశ జ్యోతిర్లింగ మహాత్మ్యం, శివజ్యోతి, శివదిక్షావిధి అనేవి ఇతని రచనలు. శృంగారం జనార్ధనాచారి శ్రీ పంచముఖాంజనేయ చరిత్ర, మంచినరావు యాదగిరాచార్యలు విశ్వబ్రహ్మణ వికాసం, డా. అయాచితం నటేశ్వరశర్మ భగవతామృతం, డొంకేశ్వర్ కృష్ణమూర్తి వెదాంత కిరణాలు, మేడిచర్ల ప్రభాకర రావు

ధ్యాన దర్శనం, గన్ను కృష్ణమూర్తి వస్త్రాపహరణం, గరిశకుర్తి రాజేంద్ర భక్తిసుధ, ఎస్. వెంకటాచార్య కిసాన్ నగర చరిత్రము, కర్మయోగి నారాయణ జిజ్ఞాసు మనశ్శాంతి, ఎం. బాబురావు రాఘవేంద్రస్తుతి, సిరిగాద శంకర్ కూడవెళ్ళి రానాలింగేశ్వర చరిత్ర, గణపురం కృష్ణమూర్తి పరమార్థ దర్శిని, గంగావరం అంజనేయ శర్మ గణేశగీత, జనగామ చంద్రశేఖరశర్మ సంప్రదాయ సుముహూర్త దీపిక. ఈ విధంగా భక్తి సాహిత్యం కూడా  జిల్లాలో వచ్చింది.

నిజామాబాదు జిల్లాలో నాటక సాహిత్యం కూడా చాలానే వచ్చింది. పనస హనుమద్దాసు సుమారు పద్దెనిమిది నాటకాలను రచించారు. వాటిలో పాండవుల ఆరణ్యవాసం, స్త్రీ సహస నాటకం, మదనసేన నాటకం మొదలైనవి. విశ్వజ్ఞ మంచిరాల జనార్దచారి సంపూర్ణ చంద్రిక విలాసం, శ్రీకృష్ణగారడి నాటకం, పాతాళభైరవి నాటకం మొదలైనవి. బండారు రఘుపతి సతీతులసి నాటకం, సత్యగుణ భూషిని, వేముగంటి శ్రీనివాసులు సత్యహరిశ్చంద్ర నాటకం మొదలైనవి ప్రముఖమైనవి.

నిజామాబాదు జిల్లా సాహిత్యంలో మిగతా ప్రక్రియలాగే కథ, నవల ప్రక్రియ కూడా చెప్పుకోదగినంత వచ్చింది. ముందుగా కథ విషయానికి వస్తే జిల్లాలో 1950 దశకంలో తొలి కథాసంకలనంగా తంగుడిగె నరసింహంగారు ‘తొలికాన్పు’ రచించారు. ఈ జిల్లాలో నిరంతరం సాహిత్యాన్ని రాస్తున్న రచయితగా పేర్కోంటున్న సి.హెచ్. మధుగారు ప్రసిద్ధి చెందారు. ఈయన రాసినవి. చెదలు, ముసలోడు, వ్యవస్థ, శాంతికథలు, ముళ్ళు వద్దు రాళ్ళు వద్దు డబ్బుకావాలి, ఉద్యమ కథలు కూడా రాశారు. బొమ్మ హేమదేవి యమున, దేవిరమ(బొమ్మ హేమాదేవి) అనే కలం పేరుతో రాసిన అన్నపూర్ణ, శాంతి నిలయం, బాంచెను దొరసాని, ఛోటి ఛోటి బాతే, గరిశకుర్తి రాజేంద్ర గారి ఇంటగెలిచి, పండుగ కథలు, మొదలైనవి. సి.హెచ్. వేణు గారు బూడిద, సమరం, జాబిలి, ఇలా ముప్పైకి పైగా కథలు రాశారు. అమృతలత రచించిన మనస్సు ఎరగని మనుషులు, కన్నీళ్ళతో కాలక్షేపం, స్పందన, వెతలే కతలై (కథల సంపుటి)కి సంపాదకత్వం వహించారు. స్వాతీ శ్రీపాద మనసుకు చూపుంటే, హృదయంలో అడుగులు, కిరణ్‌బాల ఇందిర పేరుతో కానుక,

చందమామమామె, స్విట్ సంథింగ్, తప్పిపోయిన ఉత్తరం. అయాచితం నటేశ్వరశర్మ నా బంగారు తల్లి, కన్నెగంటి నరసింహరావు సంఘశక్తి, పరిష్కారం, భారతీశర్మ జీవనసంధ్య, తిరిగిచ్చిన వసంతం, జానకీరామ్ కలనైనా నీవలపే, శ్రీపతి మూగ మల్లేశం, డ్యూటి, మృత్యుకోసం, మెత్కురి అశోక్ కమార్ నమ్మిక, డా. వడ్ల శంకర్ ఒక సూర్యుని ఉదయం.

**మూడవ అధ్యాయం: నిజామాబాదు జిల్లా నవలలు-వస్తు వివేచన**

తెలంగాణ సాహిత్యాన్ని పండించడంలో నిజామాబాద్ జిల్లా సాహిత్య ఒరవడిని, విశిష్టతను సంతరించకుంది. అందులో నవలా సాహిత్యం కూడా ఎక్కువే వచ్చింది. విభిన్న వస్తువులతో నిజామాబాద్ జిల్లా నుంచి నవలలు వచ్చాయి. అవి: జెగ్గని యిద్దె, సంఘము, మహానంద, పొగమంచు, నవరసాలు, లవ్ స్టోరీ, సంసార బంధం, నడుస్తున్న కథ, జోగిని, సృష్టిలో తీయనిది, విజేత, సర్వేజన సుఖినోభవంతు, కావేరి కళ్యాణం, శ్రీమతి గోమతి, యశోధరుడు, పునరాగమనం, చిరుజల్లు కురిసేనా, ఆడపిల్లేనా, స్వేచ్ఛా విహంగాలు, బతుకు సేద్యం, నవభారతి, బంగారు గూడు, ప్రేమంటే, ఆరాధకులు, గాయపడ్డ సూర్యుడు, మనస్విని, సూత్రధారి పాత్రధారులు, భావన భార్గవి, కిడ్నాప్, ప్రేమించకు పెళ్ళవుతుంది, కళావతి, నవోదయం, పిచ్చిమనిషి, తరంగాలు, కానుక, అమర్ సాహసయాత్ర మొదలైనవి.

'జెగ్గని యిద్దె' నవలలో జీతముండాల్సిన దళిత యువకుడు చదువుకొని లాయరుగా ఎదిగే విధానాన్ని చిత్రించారు రచయిత లోకమలహరి. చదువు వల్ల ఉపయోగాలు తెలియజేశారు. కుల, ధనిక పేద తేడాలు లేకుండా జరిగే వివాహాలను ప్రోత్సహించే దిశలో అటువంటి పాత్రలను సృష్టించి చిత్రించారు. దళితులను బానిసలుగా చూసే దొరలకు గుణపాఠం వచ్చేలా జెగ్గడు(జగదీశు) చదవుకొని ప్రయోజకుడుగా మారిన విధనాన్ని రచయిత చిత్రించారు.

'సంఘము' నవలలో చదువు గొప్పతనం చెప్తూనే, చేనేత వృత్తులవారు దళారుల వల్ల మోసపోయే విధానాన్ని చిత్రించాడు. భర్తలేని పద్మశాలీ స్త్రీ పడిన కష్టాలను, కొడుకు తప్పిపోయి హైదరాబాదులో చదువుకొని లాయర్‌గా ప్రయోజకుడిగా మారి తన సొంత గ్రామానికి తిరిగి వచ్చి పద్మశాలీల సమస్యల కోసం పోరాటం చేస్తాడు.

'మహానంద' నవలలో పురుషుల బాధలకు తట్టుకోలేని స్త్రీ జీవితాన్ని చిత్రించింది రచయిత్రి. పుట్టింటికి, అత్తింటికి దూరమై వేరేవారి పంచన చేరి అనేక బాధలు అనుభవించిన స్త్రీ ఇతివృత్తంగా రచయిత్రి ఈ నవల రాశారు. తనలాంటి వారి బ్రతుకుల కోసం తన వంతు సాయం చేస్తుంది.

బొమ్మ హేమాదేవి కలం పేరు: యమున, దేవీరమ. ఇమె చాలా నవలలు రాశారు. కొన్ని నవలను దేవీరమ పేరుతో కూడా రాశారు. ఆమె 'నవరసాలు నవలలో కుటుంబ జీవన చిత్రణ కనిపిస్తుంది. అదేవిధంగా రకరకాల సమస్యలకు పరిష్కారం, ఆదర్శ వివాహాలు చేసుకోవడం కన్పిస్తుంది. 'లవ్ స్టోరి' నవలలో ప్రేమను త్యాగం చేసి తన అక్కయ్యల పెళ్ళిళ్ళ కోసం పడే తపన యువతిలో కనిపిస్తుంది. 'సంసార బంధం' నవలలో స్త్రీ కుటుంబాన్ని నడిపే విధానాన్ని, భర్తను భార్య, భార్యను భర్త అర్థం చేసుకునే తీరును, సమస్యల పరిష్కరించుకునే తీరును చిత్రించింది రచయిత్రి హేమాదేవి.

'నడుస్తున్న కథ' నవలలో బాల్య వితంతువుగా సమాజం నుండి ఎన్నో సమస్యలను ఎదుర్కోన్న స్త్రీ ఇతివృత్తంగా రచయిత్రి నవల రాశారు. చివరికి సమాజ కట్టుబాట్లకు ఎదురు నిలవలేక తనని తానే ఆహుతి చేసుకుంటుంది. ఈ నవలలో సమాజంలోని చాలా విషయాలను చిత్రించింది.

'జోగిని' నవలను శాంతి ప్రబోధ రాశారు. ఇందులో దళిత స్త్రీలు 'జోగిని' గా మారటడానికి కారణం గ్రామ పెద్దలు చేస్తున్న అరాచకాలను, దళిత జోగిని స్త్రీల బాధలను, జీవన స్థితిని ఈ నవలలో

చూడవచ్చు. ఉపాధ్యాయుని ప్రోత్సాహంతో రాజకీయ రంగంలో ఎదిగి అనేక పదవులను చాలా చక్కగా నిర్వహించి, ప్రజలకు సేవ చేస్తుంది పోశవ్వ. పోశవ్వ అవార్డును అందుకున్నపుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 33 శాతం మహిళ రిజర్వేషన్ తన జీవిత గమనాన్నే మార్చిందని, మహిళలకు చేయూతనిస్తే వారు గొప్ప గొప్ప విజయాలను సాధించాగలరని ప్రసంగించడంతో ఈ నవల ముగుస్తుంది.

'సృష్టిలో తీయనిది' నవలను అమృతలత రాశారు. ఇందులో సృష్టిలో తీయ్యనిది మాతృత్వం అని చెప్తూ, ఆడది అమ్మగా పరిణతి చెందినపుడే పరిపూర్ణత లభిస్తుంది. జయ, రజితల మంచి స్నేహన్ని చిత్రించారు. 'విజేత' నవలలో పదవీ విరమణ అనంతరం ఆర్మీ ఉద్యోగి చేయాలనుకున్న సమాజ సేవలను ఈ నవలలో చూడవచ్చు. 'సర్వేజన సుఖినోభవంతు' నవలలో న్యాయవాద వృత్తికి రాజీనామా చేసి సమాజ చేసిన న్యాయవాది విధానాన్ని రచయిత చిత్రించారు. 'శ్రీమతి గోమతి' నవలలో ఐఏఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రశాంతంగా ఉంటూ సమాజ సేవ చేసే స్త్రీ జీవితాన్ని ఇందులో చిత్రించారు రచయిత. ఏ జన్మల చేసుకున్న కర్మ ఫలాలని ఆ జన్మలోనే అనుభవించాలని కర్మ సిద్ధాంతాన్ని పైకి చెప్తూ, పాపాలన్నింటికి ప్రాయశ్చిత్తం సేవా చేయడం ద్వారా పోతాయని దీనికోసం ఆశ్రమాన్ని తెరపైకి తెచ్చి దాని ద్వారా ఈ ఆశ్రమ ధర్మాలు పాటించమని బోధనలు చేశాడు. 'పునరాగమనం' నవలలో భర్త చనిపోయిన స్త్రీ ఎదుర్కొనే సమస్యలు, ఆ స్త్రీ చైతన్యవంతంగా మారి రచయితగా మారి తను సమాజానికి సేవ చేస్తుంది. 'ఆడపిల్లేనా' నవలలో కేవలం ఆడదే కదా అని విర్రవీగే పురుషాహంకారులకు స్త్రీ తలుచుకుంటే ఎమైనా సాధిస్తుందని రచయిత చెప్తాడు.

స్త్రీ జీవితం, నిరుద్యోగం, పురుషాధిక్యత, పేదరికం మొదలైనవన్నీ 'నవభారతి' నవలలో కనిపిస్తుంది. 'కన్నీటి లోయ' నవలలో ప్రేమ, మనిషి మానసిక స్థితిగతులు మొదలైనవి కన్పిస్తాయి.

ఎక్కువమంది పిల్లలు ఉన్న పెద్ద కుటుంబం ఎలా ఉంటుందో 'బంగారు గూడు' నవలలో చూడవచ్చు. మధ్యతరగతి ప్రభుత్వ ఉద్యోగి కుటుంబ జీవితం కూడా ఇందులో ఉంటుంది. వచ్చిన

జీతంతో ఏడెనిమిది మంది కుటుంబ సభ్యులు ఎలా జీవనం సాగిస్తారు. దేనికి ఎంత ఖర్చు చేయాలి వంటి మొదలైన విషయాలు మనకు ఇందులో కన్పిస్తాయి. ఇలాంటి కుంటుంబాలలో కొంత ఇబ్బంది ఉన్నా సంతోషంగా బతక గలుగుతారు. ఉన్నదానిలో హాయిగా ఉంటారు. కాబట్టి దీన్ని 'బంగారు గూడు' నవలగా పేరు పెట్టిందేమో బొమ్మ హేమాదేవి. 'ప్రేమంటే' నవలలో ప్రేమంటే ఏమిటి? ప్రేమించిన వ్యక్తికోసం ఎంతకాలం ఎదురుచూస్తారు? ప్రేమను ఎందుకు త్యాగం చేస్తారు? వంటి మొదలైన అంశాల దృష్టితో రచయిత్రి ఈ నవలను రాశారు. అదేవిధంగా 'ఆరాధకులు' నవలలో కూడా ప్రేమకు సంబంధించిన విషయమే కనిపిస్తుంది.

'గాయపడ్డ సూర్యుడు' నవలలో ఒక జర్నలిస్టు పడిన బాధలను, సమాజ సేవ చేయడానికి పూనుకున్న జర్నలిస్టుకు పత్రికా యాజమాన్యాల ద్వారా ఎదురైన చేదు అనుభవాలు యాటకర్ల మల్లేష్ తన జీవితంలోని అనుభవాలను ఈ నవల ద్వారా తెలియజేశారు. తాను దుబాయ్ వెళ్ళడం వల్ల అక్కడ నివసించే మన తెలంగాణ ప్రజల ధీనగాథలను ఇందులో వాస్తవికంగా కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించారు.

నలుగురు పిల్లల తండ్రి ఇంకో భార్యను వెతక్కుంటే తప్పులేదుగాని నలుగురు పిల్లల తల్లి ఇంకో భర్తను వెతుక్కోవడం తప్పా! మగవాళ్లకు సంప్రదాయం... ఆడవాళ్ళకు ప్రాణగండమునా మగవాళ్ళు, ఆడవాళ్ళు అని భేదం ఎందుకు? పుట్టడం, చావడం అన్నీ ఒక్కలాగే ఉన్నప్పుడు భేదమంతా ఆ ఒక విషయంలోనే ఎందుకు అనే విషయాలకు సమాధానమిస్తుంది 'భావన భార్గవి' నవల.

'కిడ్నాప్' నవలలో ప్రజలచేత ఎన్నుకోబడి ప్రజలకు సేవ చేయని నాయకులను నక్సలైట్లు కిడ్నాప్ చేయడం, వారి డిమాండ్లను ప్రభుత్వం ద్వారా సాధించుకోవడం మొదలైన విషయాలు కనిపిస్తాయి. 'ప్రేమించకు పెళ్ళవుతుంది' నవలలో ప్రేమ విలువ తెలియజేస్తుంది రచయిత్రి. 'కళావతి' నవలలో కుల మతాలు లేని పెళ్ళిళ్ళు జరిగిన విధానం కనిపిస్తుంది. 'నవోదయం' నవలలో ఆడవాళ్లకు

చదువు వల్ల ఉపయోగం ఏమటనేది కూడా ఈ నవలలో చెప్పారు రచయిత్రి. ఉద్యోగం చేసేవాళ్ళు చేయవచ్చు. కొన్ని కారణాలవల్ల చేయలేని వారు సంసారాన్ని చదువు అనే సంస్కారంతో చక్కబెట్టవచ్చు అని విషయాన్ని ఇందులో స్పష్టంగా తెలియజేశారు. 'పిచ్చి మనిషి' నవలలో తప్పులు చేయకుండా జాగ్రత్త పడాలి తప్ప, తప్పులు జరిగిన తర్వాత వాటి గురించి అన్వేషిస్తూ తను బాధపడుతూ, ఎదుటివారిని బాధపెట్టడం ఏమాత్రం తగదని రచయిత్రి ఈ నవల ద్వారా తెలియజేసింది. భార్యాభర్తల మధ్య నమ్మకం ముఖ్యమని, ఏ విషయంలోనైనా ఇద్దరూ సహకరించుకొని అర్థం చేసుకొని, విషయాలను పరిష్కరించుకోవాలి. అప్పుడే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని చెప్తుంది. 'తరంగాలు' నవలలో ప్రేమ సఫలమైతే ఎంత తీపిని, విఫలమైతే తీవ్రాతితీవ్రమైన బాధను కలిగిస్తుందో కూడా ఈ నవలలో చెప్పబడింది.

**నాల్గవ అధ్యాయం-నిజామాబాదు జిల్లా నవలలు-సామాజిక విశ్లేషణ**

ఈ అధ్యాయంలో మూఢ నమ్మకాలు, అంటరానితనం–వివక్ష, దళిత చైతన్యం, స్త్రీ జీవితం, పురుషాధిక్యత, వరకట్న సమస్య, స్త్రీ చైతన్యం, ఆదర్శ వివాహాలు, కుటుంబ సంబంధాలు, ప్రేమ, అవినీతి, అధికార బలం, పత్రికారంగం, స్నేహం, రాజకీయం, పేదరికం, నిరుద్యోగం, అనుబంధాలు, లైంగిక బానిసగా స్త్రీ, శరీర వాంఛను కోరే స్త్రీ, కుల ఆచారాలు, జరిమానాలు, చేనేత వృత్తి, కష్టాలు మొదలైన సామాజికాంశాలను విశ్లేషించాను.

తెలంగాణలో మూఢనమ్మకాలు అధికంగానే ఉన్నాయి. అందులో ప్రధానమైనది 'జోగిని' వ్యవస్థ. నేడు చాలావరకు తగ్గినా, అక్కడక్కడ దర్శనమిస్తూనే ఉంటాయి. నిజామాబాద్ లాంటి ప్రాంతాల్లో నాడు ఎక్కువగా ఉండేది. జోగిని వ్యవస్థలో దళిత అమ్మాయిలకు, గ్రామ దేవతలకు బదులు పోతరాజు మంగళ సూత్రధారణ చేస్తాడు. గ్రామదేవత పండగను 'ఊరపండగ' అంటారు. అధికారికమైన పూజారి పోతరాజే. అతనికి పుట్టు వెంట్రుకలు తీయరు. జుట్టును ముడి వేసుకుంటాడు. ఆ ముడి పవిత్రమైందనీ, అందులో ఎన్నో మంత్ర శక్తులున్నాయని నమ్ముతారు. చేతిలో కొరడా,

మణికట్టుకు కడియం, కాళ్ళకు కడియాలు ఉంటాయి. ఒక్కొక్కప్పుడు పోతరాజు కాకుండా గౌడుల్లో పెద్దవాడైన వ్యక్తి కూడా మంగళ సూత్రధారణ చేస్తాడు. అతడు ఆ గ్రామానికి భుస్వామి. ఒక్కొక్కప్పుడు అనుభవపరులైన జోగినీల్లో వృద్ధురాలైన వ్యక్తి కూడా మంగళ సూత్రధారణ చేయవచ్చు. తెలంగాణాలో దేవతలను సంతృప్తిపర్చడానికి పోతరాజు విధానం చాలా ప్రధానమైంది. దీని వల్ల స్త్రీలు ముఖ్యంగా దళిత స్త్రీలు బలవుతున్నారు.

సమాజంలో అంటరానితనం నిత్యం ఏదో ఒక రూపంలో బయటపడుతూనే ఉంటుంది. నాటికి నేటికి కొంత వ్యత్యాసం ఉండవచ్చు. కానీ దళితుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంటుంది. 'జోగిని' నవలలో విద్య స్నేహితురాలు కవిత ఇంటికి వచ్చి, జోగినిల జీవితంపై పరిశోధన చేయదలిచి వారు ఉండే దళిత వాడకు వెళ్ళి వస్తే ఆమెను ఇంటికి రాగానే స్నానం చేయమనడంలో దళితుల పట్ల వివక్ష ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దళితుల పట్ల చూపే వివక్షను జోవిని స్త్రీల పాత్రల చేత రచయిత్రి చిత్రించారు.

జోగిని నవలలో దళిత స్త్రీల చైతన్యం కనిపిస్తుంది. జోగినిగా ఉన్న పోశవ్వ కాలక్రమంలో జోగిని వ్యవస్థ దూరం అవుతున్న క్రమంలో దళితులకు రాజకీయాలలో రిజర్వేషన్ కారణంగా మొదటగా సర్పంచ్ గా ఎన్నికవ్వడం, ప్రజలకు సమర్థవంతమైన పాలన, సేవ చేసింది. తద్వారా అంతర్జాతీయ అవార్డు కూడా అందుకుంది. తర్వాత ఆమెను చాలామంది ఆదర్శంగా తీసుకుంటారు. 'నవ భారతి నవలలో స్త్రీ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న విధానాన్ని చూడవచ్చు. తన కుటుంబ పేదరికం వల్ల స్త్రీ సౌందర్య ఆట ద్వారా తన బాహ్య సౌందర్యాన్ని టికెట్లు పెట్టి ప్రదర్శించింది. అంటే స్త్రీకి ఎన్ని కష్టాలో అర్థం చేసుకోవచ్చు. స్త్రీ జీవితం ఇటు తల్లిదండ్రులకు అటు అత్తవారింట్లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. భర్త సరైన తీరులో అర్థం చేసుకోకపోవడం వల్ల కూడా స్త్రీ అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. అత్తవారింట్లో భర్త, అత్తమామలు పెట్టే ఇబ్బందులు కూడా స్త్రీని అనేక ఇబ్బందులకు గురి చేస్తుంది.

ఆడకూతురును వద్దనుకుంటారే తప్ప పుట్టిన తర్వాత పెరిగి పెద్దదైన పిమ్మట పెళ్ళి చేయాల్సి వస్తుంది. అప్పుడు కూతుళ్ళు అత్తారింటికి వెళ్ళాల్సి వస్తుంది. ఆ క్రమంలో అమ్మవారి ఇంటివాళ్ళు, తోబుట్టువు, కొత్త పెళ్ళికూతురు బాధపడుతుందో దేవీరమగారు 'తరంగాలు' నవలలో పొందుపర్చారు. అప్పగింతలు, సాగనంపడం మొదలైన తతంగాలలో అనురాగాలను, అనుబంధాలను విడిచివెళ్తున్నట్టుగా కూతుర్లు బాధపడుతుంటారు. ఈరోజు నుంచి మా కూతురు కాదు అని తల్లిగారింటివారు బాధపడతారు.

సమాజ నాగరికత మారుతున్నా కొద్దీ మార్పులు సంభవించడం సహజం. పై సంభాషణలో కాలం మారుతున్నా కొద్దీ మనం మారాలి. ఈ కట్న కానుకలెందుకు, కష్టలు పడుతూ ఇవ్వడం, తీసుకునేవారు బాధపడటం వంటివన్ని చేస్తే అనాగరికులలాగానే లెక్కింపబడతాం అంటాడు నిర్మల్. అంటే చదువుకున్న వాళ్ళలో మార్పు ఉండాలి అనే విషయాన్ని మనకు రచయిత దేవీరమ తెలియజేస్తున్నారు. కానీ నేటికి చదువుకున్నవాళ్ళు సైతం కట్నకానుకల కోసం ఎదురుచూసే వాళ్ళున్నారు. స్త్రీలను హింసించేవారు ఉన్నారు. 'తరంగాలు' నవల 1961లో వచ్చింది. అప్పటికే ఇలాంటివారు ఉన్నారు అంటే ఆశ్చర్యమే. ఉండవచ్చు. అటువంటి ఉన్నత పాత్రల ద్వారా కట్నాల వ్యతిరేకించి. కట్నాలు ఇచ్చేవారి బాధలను అర్థం చేసుకునేటట్టుగా చిత్రించడం ఆహ్వానించదగ్గ విషయమే.

సమాజంలో మగవారు వయసు ఎక్కువగా ఉన్నా, చాలా తక్కువ వయస్సు ఉన్నవారిని పెళ్ళి చేసుకుంటారు. ఆడవాళ్ళు ఎదురు తిరిగి పెళ్ళి ఇష్టంలేదని చెప్పకూడదు. అబ్బాయి అమ్మాయిని నచ్చాడంటే, అంతే అతన్నే పెళ్ళి చేసుకోవాల్సి వస్తుంది. అలాగే భార్య చనిపోయిన మగవారు రెండోపెళ్ళి, అసలు పెళ్ళికాని స్త్రీలను పెళ్ళి చేసుకుంటారు. అప్పుడు కూడా ఆడవాళ్ళు నోరు మెదపకూడదు. ఇంట్లోవాళ్ళు చెప్పింది చెప్పినట్టు వినాలి, లేదంటే సంప్రదాయాలను

అధిగమించినవారిగా ఎన్నో నిందలు మోపి అవమానపర్చి, హింసిస్తారు. ఈ 'మహానంద' నవలలో కూడా అదే జరిగింది. కృష్ణ పెళ్ళి రెండో పెళ్ళికోసం వచ్చిన అతనితో జరుగుతుంది.

పురుషులు స్త్రీలను వదిలేసి రెండో పెళ్ళి సులభంగా చేసుకోగలరు. ఏ చిన్న కారణం చేతనైనా స్త్రీలకు విడాకులు ఇవ్వగలరు. అలాంటప్పుడు ఏ తప్పూ చేయని స్త్రీ జీవితం నాశనం అవుతుంది. మగవారి దగ్గర అణిగిమణిగి లేకపోతే ఎన్నో ఇబ్బందులకు ఎదుర్కోవాల్సి వస్తుంది.

'నడుస్తున్న కథ' నవలలో భర్త చనిపోయిన స్త్రీని సమాజం చూసే విధానం చిత్రింబడింది. ఇందులోని రాణి పాత్ర ద్వారా ఆ బాధను రచయిత్రి మన ముందుంచింది. ఆమెకు పురుషులన్నా, సమాజం అన్న విపరీత అసహ్యం వేస్తుంది. మధు ఆమెను ప్రేమిస్తాడు. కానీ పెళ్ళి చేసుకొని నేరుగా ఇంటికి తీసుకెళ్ళలేడు. ఎందుకంటే అతనికి ముందే పెళ్ళవుతుంది. తాణి మాత్రం మొదటి భార్య దగ్గర అనుమతి తీసుకొని పెళ్ళి చేసుకోవాలి. కానీ చాటు మాటు పెళ్ళి చేసుకొని వేరేచోట మమ్మల్ని ఉంచకూడదు అని అంటుంది. కానీ మధు దానికి ఒప్పుకోకూడదు. అందుకే తన కొడుకులు అలా కాకూడదని కోరుకుటుంది. 'పురాణ పురుషులు, ప్రబంధ నాయకులుగా కాకూడదు, తన పిల్లలు మార్పును కోరే విప్లవకారులు కావాలనుకుంటుంది. సమాజంలో మార్పుకోసం రచయిత్రి ఈ నవలను రాశారు.

'నవ భారతి' నవలలో స్త్రీ పురుషాధిక్యతను ఎదుర్కొన్న సందర్భాలను చూడవచ్చు. భారతి అన్నయ్య ఆమెను  వయసుమీరిన, నలుగురు పిల్లలున్న, డబ్బున్న పురుషుణ్ణి పెళ్ళి చేసుకోమంటాడు. కారణం పేదరికమంటాడు. అలా చేయడం వల్ల కుటుంబం కష్టాలు తీరుతాయంటాడు. అదే పని ఎక్కువ వయసున్న, నలుగురు పిల్లల తల్లిని నువ్వు పెళ్ళి చేసుకోమని తన అన్నయ్యను అడుగుతుంది. అప్పుడు అతను భారతిని కోప్పడతాడు. అంటే స్త్రీపై పురుషాధిక్యత, వివక్షను మనం ఈ నవలలో గమనించవచ్చు. అదేవిధంగా 'భావన భార్గవి నవలలో కూడా పురుషాధిక్యత కనిపిస్తుంది. పురుషుడు

మాత్రం వివాహేతర సంబంధం పెట్టుకుంటే ప్రశ్నించవద్దు. కేవలం భర్త మార్పుకోసం వేరే పురుషునితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు నటిస్తేనే సహించదు భర్త. అంటే ఎంతటి పురుషాధిక్యత ఉందో చూడవచ్చు.

వరకట్న సమస్య సమాజాన్ని, ముఖ్యంగా స్త్రీజాతిని సమస్తం కల్లోలపరుస్తుంది. ఈ సమస్య వల్ల ఎందరో వనితలు ప్రాణత్యాగాలు చేసారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు జరిగాయి. ప్రభుత్వ పరంగా చట్టాలు కూడా వచ్చాయి. కానీ ఇవేవీ కూడా ఏమీ చేయలేకపోతున్నాయి. కుటుంబంలో అల్లుల్ల పాత్ర ఎలాగుందో, కొడుకల పాత్ర కూడా కట్నాలపై ఆశపడి స్త్రీలను హింసిస్తూనే ఉన్నారు. మొత్తంగా పురుష సమాజం స్త్రీలను కట్నాల పేరుతో హింసిస్తూనే ఉన్నారు. అలాంటి సమయంలో ఎవరికి వారు కట్నాలు, తీసుకోకూడదు ఇవ్వకూడదు అనే నినాదంతో ముందుకు వెళ్ళాలి. కుటుంబ పెద్ద అలాంటి నిర్ణయాలు తీసుకోవాలి. అలాంటిదే 'నవోదయం' నవలలో కన్పిస్తుంది. కుటుంబ పెద్ద సంస్కరణవాదే. కానీ అతని మాట కొందరు వింటారు. కొందరు వినరు. అక్కడే వస్తుంది సమస్యంతా.

ఆడపిల్లలపై వివక్ష తగదు. వరకట్నం పేరుతో స్త్రీపై హింస కూడదు. స్త్రీ అభ్యుదయాన్ని కోరుకున్న రచయిత సిరిగాద శంకర్ 'ఆడ పిల్లేనా' నవలలో స్వప్న వరకట్న మహమ్మారికి బలికాకుండా చైతన్యవంతమైన, ఆదర్శవంతమైన మహిళగా కన్పించడం విశేషం.

పెళ్ళిళ్ళ వల్ల ఏదో ఒక విధంగా బాధలు ఉంటూనే ఉంటాయి. సమాజంలో సాధారణంగా సంప్రదాయబద్ధంగా పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి. హంగు ఆర్భాటాలతో తమ కుల, తమ మతం వారితోనే పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి. పెళ్ళి అంటే అన్నీ వెనకా ముందు చూసుకొని, ఆలోచించుకొని చేసుకునే కార్యం అని అందరి నమ్మకం. ప్రాంతాలను బట్టి, కులాలను బట్టి, మతాలను బట్టి పెళ్ళి సంప్రదాయాలు, కట్టుబాట్లు, హంగు ఆర్భాటాల్లో తేడాలు ఉంటాయి. బొమ్మా హేమాదేవి రచించిన 'నవరసాలు' నవలలో పెళ్ళి అంటే ఇంత భిన్నంగా చేసుకుంటారా? అని ఆశ్చర్యపడేలాగా ఉంటుంది.

ఇంత ఆదర్శవంతంగా ఈ రోజుల్లో ఎవరుంటారని సందేహం కలుగవలసిందే. మన సమాజంలో అలా జరిగే పెళ్ళిళ్ళు అతి తక్కువ. ఇలాంటి పెళ్ళిళ్ళను పెళ్ళి చేసుకోబోయే అబ్బాయి, అమ్మాయి అంగీకారం ఉంటే సరిపోతుంది. కుటుంబం, బంధువులు ఎలాగూ ఒప్పుకోరు. ఇలాంటి పెళ్ళికి రారు. అటువంటి పెళ్ళే కుల, మత, బీద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా చేసుకునే పెళ్ళిళ్ళు ఆదర్శవంతమైన పెళ్ళిళ్ళు. ఒకరినొకరు గౌరవించుకునే విధంగా, ఒకరి అభిప్రాయ బేధాలు లేకుండా ఉంటాయి ఈ ఆదర్శవంతమైన పెళ్ళిళ్ళు. అలాంటి పెళ్ళిళ్ళే 'నవరసాలు' అనే నవలలో మనకు కన్పిస్తాయి.

కుటుంబ సంబంధాలను 'సంసార బంధం' నవలలో చూడవచ్చు. సంసారంలో పిల్లల్ని కనడం, సాకడం, ఇంటి పనులు చేస్తూ పిల్లల్ని చూడటం, ప్రభుత్వ ఉద్యోగమైనా నెలవారీగా డబ్బును పొదుపుగా ఖర్చుపెట్టడం వంటి విషయాలు కుటుంబంలో ఎలా ఉంటాయో పార్వతి, మహేశ్ దంపతుల పాత్రల ద్వారా చిత్రించారు. వీరికి అయిదుగురు పిల్లలు. సంసారంలో ఉన్న సాదక బాదకాలను పార్వతి కింది విధంగా చెప్తుంది.

మేడిచర్ల ప్రభాకరరావు 'కావేరి కళ్యాణం' నవలలో స్త్రీలు ప్రేమించే రకాలు ఎన్నో తెలియజేస్తాడు. స్త్రీలు మూడింటిని చూసి మూర్ఖంగా ప్రేమిస్తారని అంటాడు. వారి ప్రేమ అదుపు చెయ్యటానికి ఉండదు. మొదటిది ఆస్తి అంతస్తులను అనుభవించాలనుకునేవారు. రెండోది పదవి హోదాను చూసి, మూడు ఏదో తెలియని ఆకర్షణకు లోనై పోతారు. అందాన్ని, ఆకారాన్ని చాలా తక్కువమంది చూస్తారు. స్త్రీ అందాన్ని తనలోనే చూసుకొంటుంది. ఈ మూడు రకాల ప్రేమికులే భంగపడి దుఃఖాన్ని అనుభవిస్తారు. మిగతావారు ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతారని అంటాడు.

శ్రీమతి గోమతి నవలలో పత్రికారంగం గురించిన వివరాలను చూడవచ్చు. సృష్టిలో తీయనిది నవలలో కళాశాల విద్యార్థుల స్నేహభావాన్ని మనం చూడవచ్చు. 'విజేత' నవలలో రాజకీయ నాయకులు ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు అనే విషయాలను వివరించిన విధానం చూడవచ్చు.

'నవభారతి' నవలలో పేదరికం సంబంధిన అంశాలను గమనించవచ్చు. 75 సంవత్సరాల 'భారతం'లో కూడా మనదేశం పేదరిక ప్రజలతో ఇబ్బందులు పడుతూనే ఉంది. దీన్ని అధిగమించడానికి ప్రతి ఒక్కరం ప్రయత్నం చేయాలి.

సంసార బంధం నవలలో 'నిరుద్యోగం' అంటే చదువుకున్నవాళ్ళంతా ఉద్యోగాలు చేయాలని కాదు. ఏ పని చేసినా అందులో విజ్ఞానం అవసరం. అందుకోసం చదువోవాలే తప్పా, అందరికీ ఉద్యోగాలు చేయాలంటే కుదరదు కదా అని బొమ్మహేమాదేవి నవలలో పాత్రల ద్వారా చెప్తుంది. కానీ ప్రస్తుత ప్రభుత్వాలు అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేకపోయినా, ఉన్న ఖాళీలనైనా సరిగా నింపడం లేదు. కనుక నిరుద్యోగ సమస్య దినదినం పెరిగిపోతూనే ఉంది.

'సంఘము' నవలలో కులాచారాల నెపంతో మనుషులను ఇబ్బందులకు గురి చేయడం కనిపిస్తుంది.  జరిమానాలు విధించడం కూడా జరుగుతుంది. చేనేత వృత్తుల వారి కష్టాలను కూడా సంఘము నవలలో గమనించవచ్చు.

**ఐదో అధ్యాయం: నిజామాబాదు జిల్లా నవలలు-భాషాంశాలు**

ఇతర ప్రాణులతో పోలిస్తే మానవజాతి భాష అర్థవంతంగా, భావ ప్రకటనకు ఉపయోగించుకునే విధంగా చాలా సంవత్సరాల తర్వాత తయారయింది. ఒక భాషలో విభిన్న భాషా పదజాలం ఉంటుంది. ప్రతి భాషకు మాండలికాలు ఉంటాయి. అటువంటి మాండలిక పదాలను నిజామాబాదు జిల్లా నవలలో గమనించి అధ్యాయంగా కూర్చాను. ఉదా: అంబటాళ్ళ, ఎరుక, లెల్లం, బక్కలు మొదలైన పదజాలాన్ని ఈ అధ్యాయంలో పొందుపర్చాను. అదేవిధంగా సామెతలను సైతం విశ్లేషించాను. వీటివల్ల తెలుగు భాషా పదజాలం పెరిగి బృహత్ నిఘంటువుకు దోహదపడుతుంది.

ప్రజలలో ఉన్న ఈ సామాజికాంశాలను వెలుగులోకి తీసుకురావడం కోసం, ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం ఈ పరిశోధన దోహదపడుతుంది. ప్రజల భాషను కూడా నమోదు చేయడం సమగ్ర తెలుగు నిఘంటువుకోసం భాషాంశాల అధ్యయనం ఉపకరిస్తుంది.

నిజామాబాదు జిల్లాకు సంబంధించిన సాహిత్య ప్రక్రియలైన యక్షగానం, కవిత్వం, కథపై జరుగుతోంది, నా ఈ పరిశోధన నవలపై జరిగాయి/జరుగుతున్నాయి. మిగతా ప్రక్రియలై కూడా పరిశోధనలు జరిగితే మొత్తం నిజామాబాదు జిల్లా సమగ్ర సహిత్య చరిత్రను నమోదు చేయవచ్చు. తద్వారా తెలంగాణ చారిత్రక సాహిత్య నేపద్యాన్ని, తెలుగు సాహిత్యాభివృద్ధిలో నా పరిశోధన భాగమవుతుందని నమ్మకం.

*****

# ఉపయుక్త గ్రంథాలు


1. అమృతలత. 2005. సృష్టిలో తీయనిది. హైదరాబాదు: ఐడియల్ పబ్లిషర్స్.
2. ఆనందరామం, సి. నవలా విమర్శ. 1994. హైదరాబాదు: ఉమా పబ్లికేషన్స్.
3. ఆనందలక్ష్మి, సి. 1979. తెలుగు నవలలో కుటుంబ జీవన చిత్రణము. విజయవాడ: శోభనాచల ప్రెస్.
4. కాత్యాయని, విద్మహే. 1995. తెలుగు నవల కథానిక విమర్శన పరిణామం. హైదరాబాదు: చరిత ప్రచురణలు.
5. కాత్యాయని, విద్మహే. తెలంగాణ పోరాటం: తెలుగు కథ, నవల. వరంగల్.
6. గిరి నాగభూషణం. 1987. నిజామాబాదు జిల్లా సాహిత్యం పరిచయం.
7. చంద్రశేఖర రెడ్డి, రాచపాలెం. 2012. మన నవలలు–మన కథానికలు. అనంతపురం: లక్ష్మిగ్రాఫిక్స్.
8. చెన్నయ్య, జె. 2013. తెలంగాణాలో తెలుగు సాహిత్య వికాసం. హైదరాబాదు: ఆంధ్ర సారస్వర పరిషత్తు.
9. చెన్నయ్య, జె. 2022. నిజామాబాదు జిల్లా సమగ్ర స్వరూపం. హైదరాబాద్: తెలంగాణ సారస్వత పరిషత్తు.
10. దేవీరమ. 1960. కళావతి. మద్రాసు: భగవాన్ పబ్లికేషన్స్.
11. దేవీరమ. 1960. నవభారతి. మద్రాసు. భగవాన్ పబ్లికేషన్స్.
12. దేవీరమ. 1960. భావనభార్గవి. మద్రాసు. భగవాన్ పబ్లికేషన్స్.
13. దేవీరమ. 1961. తరంగాలు. మద్రాసు. భగవాన్ పబ్లికేషన్స్.
14. దేవీరమ. 1961. పంచరంగులు. మద్రాసు: భగవాన్ పబ్లికేషన్స్.
15. దేవీరమ. 1962. ఆరాధకులు. మద్రాసు: భగవాన్ పబ్లికేషన్స్.
16. దేవీరమ. 1962. ప్రేమంటే. మద్రాసు: భగవాన్ పబ్లికేషన్స్.
17. దేవీరమ. 1963. నవోదయం. మద్రాసు: భగవాన్ పబ్లికేషన్స్.
18. నవీన్, అంపశయ్య. 2012. తెలుగు నవల–సంక్షిప్త చరిత్ర. నాలుగవ తెలుగు ప్రపంచ 19. మహాసభలు. హైదరాబాదు: తెలుగు అకాడమి.

19. నాగభూషణ శర్మ, మొదలి. 1971. తెలుగు నవలా వికాసం. హైదరాబాదు నాట్య కళాప్రెస్.
20. పండరినాథ్, ఎ. 1997. నిజామాబాద్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర. హైదరాబాద్: స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధన సంస్థ.
21. ప్రతాపరెడ్డి, కాసుల. 2017. తెలంగాణ నవలా వికాసం. హైదరాబాదు: తెలంగాణ సాహిత్య అకాడమి.
22. ప్రతాపరెడ్డి, సురవరం. 2012. గోల్కొండ కవుల సంచిక. హైదరాబాదు: తెలంగాణ జాగృతి ప్రచురణ.
23. ప్రభాకరరావు, మేడిచర్ల. 2008. విజేత. నిజామాబాద్: అఖిల భారతీయ భగవద్గీతా ప్రచార మండలి.
24. ప్రభాకరరావు, మేడిచర్ల. 2009. సర్వేజన సుఖినోభవంతు. నిజామాబాద్: అఖిల భారతీయ భగవద్గీతా ప్రచార మండలి.
25. ప్రభాకరరావు, మేడిచర్ల. 2010. కావేరి కళ్యాణం. నిజామాబాద్: అఖిల భారతీయ భగవద్గీతా ప్రచారమండలి.
26. ప్రభాకరరావు, మేడిచర్ల. 2012. శ్రీమతి గోమతి. భాగ్యనగరం: ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్.
27. ప్రభాకరరావు, మేడిచర్ల. 2014. యశోధరుడు. నిజామాబాద్: అఖిల భారతీయ భగవద్గీతా ప్రచారమండలి.
28. భరత్ కుమార్. 1973. కలా జలతారు. విజయవాడ–2: విజయశ్రీ పబ్లిషింగ్ హౌస్.
29. భరత్ కుమార్. 1977. వైతరణి ఒడ్డున వయ్యారి. విజయవాడ: విజయశ్రీ పబ్లిషింగ్ హౌస్.
30. భరత్ కుమార్. 1981. మహా రచయిత్రి. విజయవాడ–2: నవరత్న బుక్ సెంటర్.
31. భరత్ కుమార్. 1981. స్వప్న బాలిక. విజయవాడ–2: నవరత్న బుక్ సెంటర్.
32. భరత్ కుమార్. 1985. నర్తకి. విజయవాడ: శ్రీ క్రాంతి బుక్ హౌస్.
33. భరత్ కుమార్. 1986. స్వప్న ప్రియ. విజయవాడ: నవరత్న బుక్ సెంటర్.
34. మల్లేశ్, మంత్రి. 2018. తెలంగాణ మాండలిక నవలలు–భాషా పరిశీలన. హైదరబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.

35. మృణాళిని, సి. 1988. సాంఘిక నవల కథన శిల్పం. హైదరాబాదు: నాట్య కళా ప్రెస్.
36. యాదగిరాచార్యులు, ఎం.ఎస్. దోమకొండ సంస్థానాధీశులు సాహిత్య సేవ.
37. రంగారావు, మాదిరాజు. 1984. నవల స్వరూప సమాలోచనం. రసధుని ప్రచురణ.
38. రఘురామశర్మ, శాస్త్రుల. ఇందూరు విజ్ఞాన సర్వస్వం.
39. రమాపతిరావు, అక్కిరాజు. 1975. తెలుగు నవల. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
40. రాజీవ. 1980. నడుస్తున్న కథ. నిజామాబాద్: రజినీ ప్రచురణలు.
41. రాజేశ్వరి, టి. 1991. స్వాతంత్ర్యానంతరం తెలుగు నవల వికాసం. విజయవాడ: గంగాధర ప్రచురణ.
42. రాధాకృష్ణమూర్తి, కంఠంనేని. 1988. కన్నీటి లోయ. విజయవాడ: డీలక్స్ పబ్లికేషన్స్.
43. రాధాకృష్ణమూర్తి, కంఠంనేని. 1988. వాల్మీకి. విజయవాడ: డీలక్స్ పబ్లికేషన్స్.
44. లోకమలహరి. 2018. జెగ్గని యిద్దె. హైదరాబాదు: తెలంగాణ సాహిత్య అకాడమి.
45. లోకమలహరి. 2018. సంఘము. హైదరాబాదు: తెలంగాణ సాహిత్య అకాడమి.
46. వరవరరావు. 1983. తెలంగాణ విమోచనోద్యమం–తెలుగు నవల.
47. విద్వేశ్వరి, డి. 1998 భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
48. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1989. నవలా శిల్పం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
49. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1994. నవలా శిల్పం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
50. వెంకటేశ్వరావు, దార్ల. 2009. వీచిక(సాహిత్య విమర్శ వ్యాసాలు). హైదరాబాదు: యూజిసి.
51. వెంకటేశ్వర్లు, పంతంగి. 2014. తెలంగాణ తెలుగు నవల. హనుమకొండ: శ్రీదీప్తి ప్రింటర్స్.
52. వెంకటేశ్వర్లు, పుల్లాభొట్ల. 1971. నవలా వికాసం. స్వీయ ప్రచురణ.
53. శంకర్, వి. 2016. నిజామాబాదు జిల్లా కవిత్వం. నిజామాబాదు: తెలంగాణ రచయితల సంఘం.

54. శంకర్, సిరిగాద. 2012. ఆడపిల్లేనా. నిజామాబాద్: స్వీయ ప్రచురణ.

55. శంకర్, సిరిగాద. 2013. స్వేచ్ఛా విహంగాలు. కామారెడ్డి: స్వరాజ్యం పబ్లికేషన్స్.

56. శాంతి ప్రబోధ, వి. 2010. జోగిని. నిజామాబాదు: సాహితీ సాధన పబ్లికేషన్స్. మలి ముద్రణ.

57. శాంసన్, పిల్లి. 2000. దళిత సాహిత్య చరిత్ర. గుంటూరు: యూనియన్ ప్రింటర్స్.

58. శైలమ్మ, జి. 2011. తెలుగు కథా సాహిత్యం–గిరిజన జీవితం. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.

59. శ్రీరామమూర్తి, కోడూరి. 2001. తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

60. సంజీవమ్మ, పి. 1985. తెలుగు నవలలో సామాజిక చైతన్యం. కడప: అరసం.

61. సుదర్శనం, ఆర్.ఎస్. 1972. సమాజం–సాహిత్యం. చిత్తూరు: చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం.

62. హేమాదేవి, బొమ్మ. 1976. పొగమంచు. విజయవాడ. నవసాహితి.

63. హేమాదేవి, బొమ్మా. 1979. నవరసాలు. విజయవాడ. డీలక్స్ పబ్లికేషన్స్.

64. హేమాదేవి, బొమ్మా. 1979. బంగారు గూడు. విజయవాడ: నవసాహితి.

65. హేమాదేవి, బొమ్మా. 1979. లవ్‌స్టోరీ. విజయవాడ: డీలక్స్ పబ్లికేషన్స్.

*****

# నవలా రచయితలతో పరిశోధకుడు-ఛాయా చిత్రాలు




**రాజీవతో పరిశోధకుడు**




బొమ్మ హేమాదేవి గారి కూతురు శోభారాణితో పరిశోధకుడు



**లలిత వర్మతో పరిశోధకుడు**




దారం గంగాధర్‌తో పరిశోధకుడు




**డా. వి.ఆర్. శర్మతో పరిశోధకుడు**




**మేడిచర్ల ప్రభాకరరావుతో పరిశోధకుడు**




**స్వాతి శ్రీపాదతో పరిశోధకుడు**




**మల్లవరపు చిన్నయ్యతో పరిశోధకుడు**




**యాటకట్ల మల్లేష్‌తో పరిశోధకుడు**



**శాంతి ప్రబోధతో పరిశోధకుడు**

*********

ज्ञान-विज्ञान विमुक्तये

# विश्व-मैत्री

## अंतर्राष्ट्रीय संगोष्ठी विशेषांक

## हिन्दी तथा अन्य भारतीय भाषाओं पर वैश्वीकरण का प्रभाव

**9-10 दिसंबर 2016**


संरक्षक

सिस्टर. आलिस मेरी

डॉ. सिस्टर. शैजी पी.डी.

प्रधान संपादक

डॉ. पी. के. जयलक्ष्मी

परामर्शदाता-मंडल

डॉ. सिस्टर. एन.डी. वेरोनिका

आचार्य के. लीलावती

आचार्य एस.ए.एस.एन. वर्मा

आचार्य वी. सिम्मन्ना

आचार्य आर.एस. सर्राजु

संपादक-मंडल

डॉ. एस. कृष्ण बाबु

डी.ए. रमणी

सिस्टर. के.सी. मेरी

डॉ. एस. दीप्ति

सी.एच. निर्मला देवी



संत जोसफ़ महिला महाविद्यालय (स्वायत्त)

St. Joseph's College for Women (A)

Reaccredited by NAAC with A Grade

Visakhapatnam - 530 004 (A.P.), Ph. : 0891-2558346

e-mail :sjcwvizag@gmail.com, web : www.stjosephsvizag.com


Scanned with OKEN Scanner

**Vishw Maitri - International Seminar Souvenir**

**Edited by : Dr. P.K. Jayalakshmi, HOD Hindi, SJC**

**ISBN : 978-93-83637-60-7**

9 789383 637607

Publisher :

**Quality Books Publishers & Distributors**

15, Siddhartha Nagar, Gooba Garden,

Kalyanpur, Kanpur-208016 (U.P.)

**Mob : 09044344050**

**Email : qualitybooks.knp@gmail.com**

Printers :

**Friendship Graphics**

Visakhapatnam

0891-6643352

---

* इस विशेषांक में प्रकाशित लेखों में व्यक्त विचार एवं दृष्टिकोण संबंधित लेखकों के हैं। संपादक-मंडल का उनसे सहमत होना आवश्यक नहीं है।

Scanned with OKEN Scanner

40. "ప్రపంచీకరణకు నిలువుటద్దం "కోకాకోలా" – పెరుగుపల్లి బలరామ్ 89

41. ప్రపంచీకరణ నేపథ్యంలో చితికిపోయిన దూదేకుల ముస్లిం జీవితం – పి. వస్నూర్ భాషా 91

42. ప్రపంచీకరణ యుగం: తెలుగు భాష, సంస్కృతులు– విమర్శనాత్మక అధ్యయనం – చంద్రయ్య ఎస్. 93

43. అన్నవరం దేవేందర్ కవిత్వం ప్రపంచీకరణ దృక్పథం – కె. రమేశ్ 96

44. ప్రపంచీకరణ – రాయలసీమ కథాసాహిత్యం – సి. దుర్గ 99

45. ముదిగంటి సుజాతారెడ్డి కథా సాహిత్యం – ప్రపంచీకరణ ప్రభావం – కళ్యాణి జిల్లా 101

46. జాజుల గౌరి 'మన్నుబువ్వ' కథల సంపుటి–ప్రపంచీకరణ ప్రభావం – కంఠం కృష్ణ 103

47. 'ఒక రోజు పది గాయాలు' ప్రపంచీకరణ వ్యతిరేకత దీర్ఘ కవిత – పరిశీలన – ఇమ్మిడి మహేందర్ 106

48. ప్రపంచీకరణ నేపథ్యంలో కరీంనగర్ జిల్లా కథా సాహిత్యం – గంద్ర మహేశ్ 109

49. ప్రపంచీకరణ – తెలుగు భాషా పరిరక్షణ – డా॥ లింగాల మంగమ్మ 111

50. తెలుగు కథా సాహిత్యం – ప్రపంచీకరణ ప్రభావం – డా॥ అల్లంశెట్టి నాగజ్యోతి 113

51. ప్రపంచీకరణ కవిత్వం – వృత్తుల స్థితిగతులు – వి. పవన్ కుమార్ రెడ్డి 115

52. గోపి కవిత్వం – ప్రపంచీకరణ ప్రభావం – బి.పావని 117

53. 'జూకంటి జగన్నాథం' కవిత్వం – ప్రపంచీకరణ ప్రభావ చిత్రణ – గరిగె రాజేశ్ 120

54. ప్రపంచీకరణ సందర్భం : పెద్దింటి అశోక్‌కుమార్ గారి "దాడి" నవల– పరిశీలన – తోడిందల ప్రసన్న కుమారి 123

55. 'తూర్పుగాలి' నవల – ప్రపంచీకరణ ప్రభావ చిత్రణ – రవి. కుర్మకోరె 125

56. "ప్రపంచీకరణ : బంజారా నానీలు" – ధారవత్ సంతోష్ కుమార్ 127

57. "జానపద కుల వృత్తులపై ప్రపంచీకరణ ప్రభావం" – డా॥ యస్.బి.టి.యస్.దేవి, 129

58. "సుద్దముక్క" కవితాసంపుటి – ప్రపంచీకరణ ప్రభావం – కడారి శ్రీధర్ 131

59. ప్రపంచీకరణపై ఉద్యమగీతం – 'కరీముల్లా' కవిత్వం – అందుగులపాటి శ్రీనివాసరావు 133

60. 'జిగిరి' నవల : ప్రపంచీకరణ ప్రతిఫలనం – పిల్లి సురేష్ 135

61. ప్రపంచీకరణ భారతీయ భాషల భవిష్యత్తు – శెట్టిపల్లి తిరుపాలు 137

62. ప్రపంచీకరణ కవిత్వం – తెలుగు సాహిత్య ప్రతిఫలనం – డా॥ ఏటూరు జ్యోతి 140

63. మెదక్ జిల్లా ఆధునిక కవిత్వం– ప్రపంచీకరణ ప్రతిఫలనం – విట్టబోయిన వెంకటేష్ 143

64. చేనేతను చిదిమేసిన ' ప్రపంచీకరణ ' – నీలం వెంకటేశ్వర్లు 145

65. ప్రపంచీకరణ–వృత్తి పనివారి జీవిత చిత్రీకరణ – జూటూరు అరుణ 147

66. ప్రపంచీకరణకు లోనైన తెలుగు నాటక రంగం – విశ్లేషణ – డా॥ బోనాల మురళి 149

67. గోరేటి వెంకన్న పాటలు – ప్రపంచీకరణ ప్రతిఫలనం – కె. కృష్ణయ్య 151

68. ప్రపంచీకరణ దృక్పథంలో – తెలంగాణ పాట – పల్లి చిన్నారావు 153

69. ప్రపంచీకరణ : పల్లె కన్నీరు పెడుతుందో పాట – ఆర్. గోపాల్ 155

70. గ్లోబలైజేషన్ కథలు – ప్రపంచీకరణ ప్రభావం – రాఘవేందర్ 157

71. 'కథావార్షిక' సంకలనాల్లో – ప్రపంచీకరణ ప్రభావ చిత్రణ (కథావార్షిక–2003, 2005) – మల్లేశ్ మంత్రి 159

72. ప్రపంచీకరణ – భాషా, సామాజికాంశాలు – వేముల శరణ్య 161

73. కాలువ మల్లయ్య కథలు – ప్రపంచీకరణ నేపథ్యం – లోకిరెడ్డి ఉమాశిరీష 163

74. సూర్యదినపత్రిక కవిత్వం ప్రపంచీకరణ దృక్పథం (2011) – బి.వి.ఎస్. గౌతమ 165

75. ప్రపంచీకరణ నేపథ్యంలో కనుమరుగవుతున్న (తెలంగాణ) మాండలికపు సొగసులు – డా॥ అడువాల సుజాత 167

76. ప్రపంచీకరణ ఫలితంగా అంతరించి పోతున్న తెలుగు భాష – బత్తుల రవీందర్ గౌడ్ 169

77. ప్రపంచీకరణ ప్రారంభ దశలోని తెలుగు కథానిక ఇలే కదా సురసీమ! – నలమోతు. సునీత 170


Scanned with OKEN Scanner

# 46. జాజుల గౌరి 'మన్నుబువ్వ' కథల సంపుటి – ప్రపంచీకరణ ప్రభావం

**కంతం కృష్ణ,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్

**సంక్షిప్తి :** స్వాతంత్ర్యానంతర కాలంలో హైదరాబాద్ చుట్టుపక్క గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన మార్పుల ప్రతిఫలనం ఈ కథాసంపుటిలో కనబడుతుంది. ఆర్థిక, రాజకీయ రంగాల్లో వచ్చిన పరిణామాలతో పాటు సామాజిక జీవితంపైన, సాంస్కృతిక జీవితంపైన ప్రభావం ఆవిష్కృతమైంది. మనసుల్లో ఒకప్పుడు ప్రేమ, దయ, ఆత్మీయత, కరుణ, అనురాగంవంటి విలువలు పోయి యాంత్రిక జీవనం గడుపుతూ మానవీయ విలువలను కనుమరుగుచేస్తున్న దృశ్యాలు ఈ కథలల్లో చిత్రితమైనాయి. ప్రపంచీకరణ ప్రభావంవల్ల భూములన్నీ రియల్ ఎస్టేట్‌గా మారుతున్న కోణాన్ని 'విద్యార్థి' కథలోనూ, వ్యవసాయానికి ఒకప్పుడు ఉపయోగించే మోట, ఏతాము, గూడ స్థానంలో కరెంటు మోటార్స్, బోర్‌వెల్స్ రావడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. శ్రమ తగ్గడంతో రైతులు సోమరులుగా మారే విధానాన్ని 'నీళ్ళబాయి' కథలో, అలాగే ఒక మధ్యతరగతి స్త్రీ పట్టణంలో పనిచేస్తూ కుటుంబ విలువలకు, భార్యభర్తల సంబంధాలకు, పిల్లలపట్ల ప్రేమ అప్యాయతలకు ఏవిధంగా దూరమవుతుందో 'నిట్టూర్పు' కథలో చిత్రించబడింది. మరియు జైన, బౌద్ధ మతాలు తెలిపే జాలి, దయ, కరుణ వంటి సామాజిక నైతిక విలువలను అందరిపట్ల చూపిచాలని చెబుతున్నా, మనిషి రాను రాను యాంత్రిక జీవనంలో మర మనిషిలా తయారై సాటి మనిషిని పట్టించుకోకపోవడమే కాకుండా అతన్ని అసహ్యించుకోవడం 'భంగిమ' కథలో కనిపిస్తుంది. ఇలాంటి విషయాలను నా పత్రంలో విశ్లేషించాను.

**1.పరిశోధన పత్ర నేపథ్యం :** ప్రపంచీకరణ అన్న పదం విన్నంతనే ఇది ప్రపంచం మొత్తానికి సంబంధించిన విషయమై (Globalization) అన్న పదానికి సమానార్థకంగా తెలుగులో ప్రపంచీకరణ అనే పదం స్థిరపడింది. ప్రపంచీకరణకు పర్యాయ పదాలుగా విశ్వీకరణ, విశ్వవ్యాప్తీకరణ, భౌగోళీకరణ, భౌమీకరణ అనే పదాలున్నప్పటికీ ప్రపంచీకరణ పదమే ఎక్కువ ప్రాచుర్యం పొందింది. మన దేశంలో ఈ పదం తొలిసారిగా 1990వ దశకంలో భారత ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాల పేరిట సంస్కరణలు ప్రవేశపెట్టినప్పటి నుండి వినబడుతుంది. 1990ల నుంచే మనకు తెలిసినప్పటికీ ఆ పదానికి గల చరిత్ర అతి ప్రాచీనమైనది. అతి విస్తృతమైనదని చెప్పవచ్చును. మన్నుబువ్వ కథా సంపుటిలో ప్రపంచీకరణ వల్ల ఆర్థిక, రాజకీయ, సాంఘీక, సాంస్కృతిక, సామాజిక రంగాలలో వచ్చిన మార్పులను ఏ విధంగా రచయిత్రి చిత్రించిందో చెప్పటం ఈ పత్రం యొక్క ముఖ్యోద్దేశ్యం.

**2.కవి పరిచయం :** జాజుల గౌరి 1969, మార్చి 2న సికింద్రాబాద్లోని లోతుకుంటలో జాజుల లక్ష్మమ్మ, మల్లయ్యలకు ఐదవ సంతానంగా జన్మించారు. 1980 నుంచి ఊహా కవితలు రాయడం ప్రారంభించారు. దాదాపు 300పైగా కవితలు రాశారు. ఈమె తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయి. దళిత జీవితం నుండి ఎదిగి, తిరిగి తమ జీవితాలను, గతాన్ని అక్షరీకరించే శక్తి, సామర్థ్యాలను సాధించుకున్న రచయిత్రి. ఈ కథలో సంపుటిలో మొత్తం 25 కథలున్నాయి. ఇందులో దళిత జీవిత కోణాలు, సంస్కృతి, దళిత భాషని ఇందులో చూడవచ్చు. ఈమె మొట్టమొదటి కథల సంపుటి ఇది. ఇదే గాక 'వాయినం' అనే నవల కూడా రాశారు.

**3.జాజుల గౌరి 'మన్నుబువ్వ' కథల సంపుటి – ప్రపంచీకరణ ప్రభావం**

**3.1.రియల్ ఎస్టేట్ – విద్యార్థి కథ :** సాధారణంగా విద్యార్థి ఎదుగుతున్న దశలో తనతోపాటే గ్రామంలో వచ్చిన మార్పులను తెలియజేస్తూ, విద్యాభ్యాసం ముగించుకొని తన గ్రామం చూడడానికి వచ్చిన విద్యార్థికి అగుపించిన చిన్నప్పటి విషయాలు, వారు సంతోషంగా గడిపిన క్షణాలు, జ్ఞాపకాలు అదే సమయంలో ఎదురైన సమస్యలు, ఆవేదనలు ఎలా ఉండేవో చెబుతూనే, ప్రపంచీకరణ ప్రభావం వల్ల ఆడిన ఆటలు, జ్ఞాపకాలు ఎలా కనుమరుగవుతున్నాయో ఈ కథలో జాజుల గౌరి వర్ణించారు. చిన్నప్పుడు వ్యవసాయం చేసి ధాన్యం ఆరబోసుకునేందుకు ఉపయోగించే బండరాయిని, కొండలను రియల్ ఎస్టేట్ వచ్చి ఏవిధంగా ధ్వంసం చేసిందో ఈ కథలో కనబడుతుంది. "రాను రాను కిలాసులు దాత్తనే పై సదువులు సదువుతా.... సదువుతా... చదువుతా పైపైకి పోతున్న వేషం మారింది. భాష మారింది. మా పొలాలన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల వశమైనాయి.

మా పశువులన్ని అంగడిపాలైనాయి. మా ఇండ్ల ముందరే బోరుబావులు వెలిసాయి. నా జ్ఞానం పెరిగినట్లుగానే ప్రపంచ జ్ఞానం వంద రెట్లు పెరిగింది. బడాబాబుల కన్ను కొండరాళ్ళ మీద పడింది. చుట్టుపక్కల ఉన్న కొండరాళ్ళని కంకరగా మార్చి లారీలల్లకి ఎత్తుతున్నారని తెలిసింది." (గౌరి, జాజుల. 2004: 4). అని చెప్పడంలో రచయిత్రి హైదరాబాద్ నగర శివారులలో నివసించే సామాన్య, సాధారణ దళిత కుటుంబాలకు ఉన్న కొద్దో, గొప్పో భూమిలో వ్యవసాయం చేసుకుని ధాన్యం పండించుకునేవారు. ఆ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఉపయోగించే బండరాయిని రియల్ ఎస్టేట్ కన్నుపడి కొండను చీల్చి, బండరాయిని పగలగొట్టి కంకరరాళ్ళుగా ఎలా మార్చుతున్నారో ఇక్కడ తెలుస్తుంది. మధ్యాహ్న వేళ ఆహారం తినడానికి కేంద్రంగా ఉండే బండరాయిని కూకటివేళ్ళతో తొలగించి ప్రపంచీకరణ పేరుతో కొండలు, గుట్టలతో సహా బండరాళ్ళను తొలగించి కూడా ఊర్లలో ఏం మిగిల్చని దారుణమైన స్థితి వచ్చింది.

**3.2. సాంస్కృతిక విధ్వంసం - విద్యార్థి కథ :** చిన్నతనంలో ఆడుకునే ఆటల్లో ఒక్కటైన ఐదురాళ్ళ ఆట గురించి రచయిత జ్ఞాపకం చేస్తూ కాలక్రమంలో గ్రామాల్లో టి.వి.లు, సెల్‌ఫోన్‌లు, వీడియో గేమ్స్‌ల వల్ల పిల్లలు అరుబయట ఆడుకోవడం మానేసి వాటికే పరిమితమైపోతున్నారు. మనషులతో మాట్లాడడం మానేసారు. "రెండు కాళ్ళు పారజాపుకుని కాళ్ళ నడుమ ఒక్కరాయి, రెండు రాళ్ళు, మూడు రాళ్ళు అయిపోయి గుప్పిచ్చి ఆడుతుంది. ఆ తరవాత అయిదువేళ్ళను భూమిమీద నిలువుగా ఆనించి రెండు రెండు వేళ్ల సందుల ఒక్కొక్క రాయిని ఉంచి ఆఖరికి మిగిలిన రాయిని కుడిచేతిలోకి తీసుకుని గాల్లోకి ఎగరేసి ఆ రాయి మల్లా వచ్చి కుడిచేతిలో పడేతాలకల్ల వేళ్ళ సందుల ఉన్న రాయిని లోపలకు నూకలేక అవస్థలు పడుకుంట మల్ల మల్ల ఆడుతుంది." (పైదే: 2). గ్రామీణ ప్రాంతాల్లో ఆడే ఆటలైన చిడుగుడు, కోతికొమ్మచ్చి, అష్టాచెమ్మ, దొంగాపోలీస్ మొదలైన ఆటలు కనుమరుగై వాటి స్థానంలో క్యాండిక్రష్, పొకెమన్, టెంపుల్ రన్ మొదలైన యాంత్రికమైన ఆటలు వచ్చి గ్రామీణ ఆటలపై ఉక్కుపాదాన్ని మోపాయి. మానసిక ఉల్లాసానికి ఆడే ఆటలు పోయి మలబద్ధకం నేర్పే ఆటలు వచ్చాయని రచయిత్రి వాపోయారు. ఈ విధంగా విద్యార్థి కథలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలు మధ్యాహ్న వేళలో తినడానికి, సేదతీరడానికి, ధాన్యాలు ఆరబెట్టడానికి ఉపయోగపడే బండరాయిని రియల్ ఎస్టేట్ ఏవిధంగా నాశనం చేసిందో, అలాగే పిల్లల ఆటలపైన ప్రపంచీకరణ ప్రభావాన్ని ఈ కథ తెలియజేస్తుంది.

**3.3. యంత్రాల ప్రవేశం - నీళ్ళబాయి కథ :** ఈ కథలో ప్రపంచీకరణ ప్రభావంవల్ల కరెంట్ వచ్చి రైతులకు ఏవిధంగా షాక్ ఇచ్చిందో తెలియజేశారు రచయిత్రి. "నేను శానా బుడ్డగున్నప్పుడు మొదట్లో మా బాయిమీద మోటుంటుండే. మా మోటకు ఎడ్లను కట్టి పెద్దబొక్కెన తోటి మా నాయినోళ్ళు ఎడ్లను ముందుకు, ఎనకకు అదలిస్తుంటే బొక్కెన బాయిలకి పోయి నీళ్ళుముంచుకుని సిల్లులు పడ్డ కుండలెక్క మీదికొచ్చి కాల్వల, నీళ్ళు పొయ్యంగనే గవి జరజర పారుకుంట, పారుకుంట సేండ్లల్లకు పోతుండె గాని ఎండకాలమప్పుడు ఎంతసేపు మోతకొట్టినా సేండ్లకు నీళ్ళు పారకుంటుండే. మీది మడ్లకే నీళ్ళు సరిపోతుండే కింది మడ్లకు పారాలంటె గగనమైతుండే." (గౌరి, జాజుల. 2004: 17).

**3.4. యాంత్రిక సంబంధాలు - నిట్టూర్పు కథ :** నేటి పోటి ప్రపంచంలో సామాన్య గృహ జీవితం గడిపే స్త్రీలు కుటుంబ పోషణ కోసం ఉద్యోగం చేయడం అనివార్యమైంది. పట్టణంలో ఒక ఇల్లాలు తన ఉద్యోగంలో ఎదురయ్యే సమస్యలవల్ల అటు భార్యగా, ఇటు తల్లిగా తన బాధ్యతలు నిర్వహించలేక ఇంట్లో ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటుందో ఈ కథలో చిత్రించారు కవయిత్రి. "పూర్ణా, ఇప్పుడు టైమెంతో తెల్సా, ఇలా మీరు ప్రతిరోజూ ఆఫీస్‌కి లేట్‌గా రావటం బాగోలేదు. ఇది ఆఫీసనుకుంటున్నారా, మీ ఇల్లనుకుంటున్నారా' అంటూ గుర్రుమనేసరికి 'సారీ సార్, బస్సు మిస్సయింది అందుకే ఆలస్యం' అని సంజాయిషీ ఇస్తుంటే 'ఇలా ప్రతిసారి ఏదో ఒక వంక చెప్తున్నారు, తోదరగా వస్తే బస్సు ఎందుకు మిస్సవుతుంది. దిసీజ్ టూ మచ్. రిజిష్టరులో మీ టైమింగ్స్ చూడండి, అందరికంటే మీవే ఎక్కువ లేట్లున్నాయి. పూర్ణా మీకిదే లాస్ట్ వార్నింగ్, ఇక నుంచి మీరు కరెక్టు టైంకి రాకుంటే మీ మీద చర్య తీసుకోవాల్సి వస్తుంది.... పొద్దున ఆఫీసులో బాస్ ఇచ్చిన వార్నింగ్ ప్రభావం నుంచి పూర్ణ తేరుకోలేదు. చేతిలోని హ్యాండ్ బ్యాగుని టెబుల్‌పైకి గిరాటేసి పిల్లల దగ్గరికి వచ్చి చెరో దెబ్బ వేస్తూ 'పుస్తకాలు ఇల్లంతా పరచొద్దని మీకు ఎన్నిసార్లు చెప్పాల్రా, వెధవలకి వెధవ పనులు రాకపోతే మంచి పనులెలా

వస్తాయి. మొత్తం బుక్స్‌ని బ్యాగుల్లో నీట్‌గా సర్దండి' అని గద్దించేసరికి అకారణంగా కొడ్తున్న తల్లిని బిత్తరచూపులు చూస్తు పాప పుస్తకాలు సర్దుకుంటుంటే బాబు 'వా' అని ఏడుపందుకున్నాడు" (గౌరి, జాజుల. 2004: 70 - 71). పై వాక్యాలను బట్టి రచయిత్రి ఒక మధ్యతరగతి కుటుంబంలోని స్త్రీ ఉద్యోగరీత్యా పనులు చేస్తూ రోజు ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళడంతో బాస్ ఇచ్చిన వార్నింగ్‌తో చివాట్లు పడుతుండేది. ఇలా జరుగుతున్న క్రమంలో తన భర్త, పిల్లలను సరిగ్గా పట్టించుకోక పోవడం, పిల్లలపైన అరవడం, దూషించడం, కొట్టడంలాంటి పనులు చేస్తుండేది. ఈవిధంగా భార్యాభర్తల, పిల్లల మధ్య ప్రేమ, అనురాగాలు తగ్గిపోయి పిల్లలపై ఆవేశం, కోపం, హింసలకు పాలు పడుతన్నారని, యాంత్రిక జీవనం గడుపుతున్నారని రచయిత్రి తెలిపారు.

**3.5.మానవ విలువల విధ్వంసం - భంగిమ కథ :** ప్రస్తుతకాలంలో మనుషులెంత యంత్రాలుగా మారారో చెప్పడానికి ఈ కథే నిదర్శనం. ఇందులో పట్టణంలో ప్యూన్‌గా ఉద్యోగం చేస్తున్న తన కొడుకును కలవడానికి చదువురాని తండ్రి చిరునామా అడుగుతూ కొన్ని రోజులుగా తిరుగుతుంటాడు. ఈ క్రమంలో అతను ఎండదెబ్బ తగిలి చనిపోతాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్నా వసుంధర అతడిని చూసి జరిగిన విషయం తెలుసుకోకుండానే చులకన భావంతో అసహ్యించుకుంటుంది. "అక్కడ చెట్టు నీడన ఓ వ్యక్తి పడుకొని ఉన్నాడు. పడుకొని ఉన్నాడనే కంటే బాగా తాగి తూలాడేమో బట్టలన్ని అస్తవ్యస్తమై అతడు పడున్న తీరును చూస్తే గుండె జల్లుమన్నది. ఛీ... ఛీ... జనాలు నడిచేచోట పబ్లిక్ ప్లేస్‌లో ఇలా పడున్నాడేంటి, ఇంట్లో భార్యా పిల్లలను సరిగా చూడలేరుకానీ ఇలా తప్పతాగి రోడ్ల మీద పడ్తారు వెధవలు..... తప్పతాగి అసహ్యంగా పడున్నాడని పదే పదే అంటున్నావే అది నిజం కాదు వసూ, నిజం కాదు. అది, అది అసభ్య భంగిమ కానేకాదు. అది మృత్యు భంగిమ, అతను తప్పతాగి పడలేదు. ఎండలో తిరిగి తిరిగి వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడుకుని ఆ నిద్రలోనే ప్రాణాలను వదిలాడు." (గౌరి, జాజుల. 2004: 104).ఆధునికయుగంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. మనుషులు సాటి మనిషిని పట్టించుకోవడం మానేశారు. డబ్బు వెనకసాగే ఉరుకుల పరుగుల జీవితాలతో మానవత విలువలను వదిలేశారు. సాటి మనిషికి సాయం చేయడం పూర్తిగా మరచిపోవడమేగాక, జరిగిన విషయం గురించి తెలుసుకోకుండానే అసభ్యకరమైన మాటలు, అవమానకరమైన ప్రేలాపనలను చేస్తున్నారు. ఈ భంగిమ కథలో ఆఫీసుకు వెళ్ళి వస్తున్న దారిలో ఒక పెద్దాయన వర్ణణాతీతమైన భంగిమలో ఒంటిమీద బట్టలు అస్తవస్తమై ఉంటాడు. అది చూసి వసుంధర ఆ వ్యక్తి గురించి ఏం తెలుసుకోకుండానే తన మనసులో తాగి రోడు మీద పడిపోయాడని, తన కుటుంబానికి అవమానమని మరింత నీచంగా అసహ్యించుకుంటుంది. కాని అసలు విషయానికొస్తే ఆమె పనిచేసే ఆఫీసులోనే ఆ పెద్దాయన కొడుకు వాచ్‌మెన్‌గా పనిచేస్తాడు. అతన్ని చూడ్డానికి ఆ పెద్దాయన చిరునామా కాగితం పట్టుకొని చాలా రోజులనుండి వెతుక్కుంటూ వెతుక్కుంటూ అక్కడికి వచ్చేసరికి ఎండ వడదెబ్బకు సొమ్మసిల్లి పడుకొని నిద్రలోనే ప్రాణాలు వదిలేస్తాడు. ఈ విషయం తెలుసుకున్న వసుంధర పశ్చాత్తాపంతో తానెంత మరగుజ్జుగా ఆలోచించానో అని అనుకుంటూనే అధఃపాతాళానికి దిగజారుతున్న భావన ఆమెను నిస్సత్తువగా చేస్తుంది. ఈ విధంగా మనిషి మారుతున్న కాలానుగుణంగా తాను మనిషిననే విషయం మరచిపోయి సాటి మనిషి గురించి ఆలోచించకుండా, మానవత విలువల్ని కాపాడకోకపోవడం ఈ కథలో కనిపిస్తుంది.

**4.ముగింపు :** ప్రపంచీకరణ ప్రభావం వల్ల కొంత మేలున్నప్పటికీ అంతకన్నా నష్టాలున్నాయి. జాజుల గౌరి 'మన్నుబువ్వ' కథా సంపుటిలో పేర్కొన్న అంశాలైన వ్యవసాయ సాగు భూములు రియల్ ఎస్టేట్‌ల హస్తగతమవుతున్నాయి. అలాగే యంత్రాలవల్ల ప్రయోజనం ఉన్నప్పటికీ వృత్తుల విధ్వంసం జరిగింది. దీనివల్ల పల్లె వాతావరణం పూర్తిగా నాశనమయ్యింది. పల్లెజనమంతా వలసబాటపట్టారు. అట్లే డబ్బుకు విలువ పెరగడంవల్ల మానవులమధ్య సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. పైన విశ్లేషించిన కథల్లో ఈ అంశాల్ని గమనించవచ్చు.

**ఉపయుక్త గ్రంథ సూచి :** 1. అరుణకుమారి, గడ్ల. "తెలుగు కవిత్వం - ప్రపంచీకరణ ప్రభావం". భవిత ఆర్గనైజేషన్స్. 2. గౌరి, జాజుల. 2004. "మన్నుబువ్వ కథలు". హైదరాబాద్. విశాల సాహిత్య అకాడమి. 3. దక్షిణామూర్తి, పోరంకి. 1989. "కథానిక స్వరూప స్వభావాలు". సికింద్రాబాద్: శివాజి ప్రెస్. 4. సత్యనారాయణ, ఎస్వీ. (సంపాదకుడు). 2007. "గ్లోబలైజేషన్ కథలు". హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్.



Scanned with OKEN Scanner

PALAPITTA

# పాలపిట్ట

మాసపత్రిక

ISSN 2582-7294

సంపుటి: 13 సంచిక: 11

**డిసెంబర్ 2022**

సంపాదకుడు

**గుడిపాటి**

సహ సంపాదకుడు

**డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్**

కవర్ డిజైన్

**వికర్ణ**

రిపోర్టర్

**నరేష్**

**చందా వివరాలు**

రెండేళ్ళ చందా: రూ.800/- (పోస్టేజీతో సహా)

మూడేళ్ళ చందా: రూ.1200/-(పోస్టేజీతో సహా)

జీవిత చందా: రూ.10000/-

లేఔట్, డిజైన్: అక్షయ డిజైన్ స్టూడియో

Mobile : 9553371056

ప్రకటనలు, చందాలకు మరియు

(రచనలు, అభిప్రాయాలు పంపవలసిన చిరునామా)

**PALAPITTA**

# Flat No.2, Block 6,

MIG-2, APHB, Baghlingampally,

Opp. Sundaraiah Park Gate,

Hyderabad - 500044, Telangana, India.

Phone : 040 - 2767 8430, Cell: 9490099327

E-mail : palapittabooks@gmail.com

**Published at**

H.No.16-11-20/6/1/1,403,

Vijaya Sai Residency, Saleem Nagar,

Malakpet, Hyderabad - 500 036,

Telangana, India

## సంపాదకీయం

# పుస్తకాలతో స్నేహం

మన జీవితంలో పుస్తకాలు భాగంగా ఉన్నాయా? ఊగించి శాసించే పుస్తకం చదివి ఎన్నాళ్ళయింది? పుస్తక పఠనం ఆనందాన్ని ఇస్తుందా? మనం పుస్తకాలు చదువుతున్నామా? మన పిల్లలు చదువుతున్నారా? మొబైల్‌తో కాలక్షేపం చేస్తున్నామా? పుస్తకాలు ఆనందాన్ని ఇవ్వలేకపోతున్నాయా? పుస్తకం పట్టుకోవాలనే ఆలోచన ఎందుకు రావడం లేదు. కొత్త బట్టలు, కొత్త మొబైల్స్ కొన్నట్టుగా అరుదుగానైనా ఓ పుస్తకం కొంటున్నామా? ఫంక్షన్లకు వెళ్ళేపుడు రకరకాల బహుమతులు ఇస్తుంటాం. కానీ ఓ పుస్తకం బహుమతిగా ఇవ్వాలనే ఆలోచన వచ్చిందా? సినిమాల గురించి, క్రికెట్ గురించి ఎంతో మాట్లాడుతుంటారు. ఓ పుస్తకం గురించి ఎపుడయినా మాట్లాడుతుంటారా? అసలు కవులు, రచయితల నడుమనైనా పుస్తకాల ప్రస్తావన వస్తుందా? తాము చదివిన పుస్తకాల గురించి చెబుతుంటారా? పుస్తకాల గురించి ఆలోచిస్తే ఇలాంటి ప్రశ్నలు అనేకం పరంపరగా పుట్టుకొస్తాయి.

తెలుగువాళ్ళకు పుస్తకాలతో పని తీరిందా? పాఠ్య పుస్తకాలు కాకుండా మరో పుస్తకం చదవాల్సిన పని లేకుండానే ఇరవై, ముప్పయ్యేళ్ళు దాటేస్తున్న యువతరాన్ని చూస్తుంటే మన బతుకుల్లో పుస్తకం స్థానం ఎంత అనే ప్రశ్న వస్తుంది. తెలుగు పుస్తకమనే కాదు, ఇంగ్లీషు పుస్తకాలైనా ఎంతమంది చదువుతున్నారు. పదేళ్ళ కిందట ఆంగ్ల పుస్తకాలు అమ్మే షాపులు హైదరాబాద్‌లో బాగానే వుండేవి. వాటిలో చాలావరకు క్రమంగా మూతబడ్డాయి. పాత పుస్తకాలు అమ్మే అబిడ్స్, కోఠీ, చిక్కడపల్లి వీధుల్లో, విజయవాడ నగర వీధుల్లో పుస్తకాలు చూడటం కోసం వచ్చేవారు అరుదయ్యారు.

డిజిటల్ టెక్నాలజీ అందుబాటులో ఉంది. మొబైల్‌లో, లాప్‌టాప్‌లో, టాబ్స్‌లో పుస్తకాలు చదువుకోవచ్చు. కానీ ఇలా మాత్రం చదివేవారు ఎంతమంది? దీనికి సంబంధించిన సర్వేలు ఏమైనా నిర్వహిస్తే గానీ మనలో పాఠకులు ఎందరో అంతుబట్టదు. కరోనా కల్లోల కాలంలో కేరళలో డి.సి. బుక్స్‌వారు జోమాటో సర్వీసుల ద్వారా ఇండ్లకు పుస్తకాలు కూడా సరఫరా చేశారు. మన దగ్గర మామూలు రోజుల్లోనూ పుస్తకాలు తెప్పించుకునే వారు ఎందరో అంచనా వేయాల్సివుంది.

సినిమాలు చూస్తూ, పాటలు వింటూ ఆనందం పొందినట్టుగా పుస్తకాలు చదవడంలో ఆనందానుభూతులు పొందితే తప్ప పుస్తకాలతో స్నేహం చేయలేం. పఠనాభిరుచిలోని ఆనందం తెలిసిన వారు పుస్తక పఠనం ద్వారా తాము చూడని లోకాల్ని తరచి చూస్తారు. తమ అనుభవపరిధిని విస్తృతం చేసుకుంటారు. జీవితచరిత్రలు, సామాజిక చరిత్రలు, కథలు, నవలలు చదవడంలో ఉండే ఆనందం ఏమిటో అనుభవంలోకి రావాలంటే చిన్నతనం నుంచి పిల్లల్లో పఠనాసక్తులు ప్రోది చేయాలి. ఈ దిశగా మన ఇండ్లల్లో, విద్యాసంస్థల్లో ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నామా. మన ఇండ్లలో పుస్తకాల ర్యాక్ అంటూ ఉందా. పిల్లలకు పుస్తకాలను బహుమతులుగా అందిస్తున్నామా. తరచి చూస్తే అర్థం కాని సంగతులివి. మన సమాజంలో పఠనాసక్తి పెంపొందించడానికి పుస్తక ప్రేమికులు పనిగట్టుకొని ప్రయత్నించాలి. జీవితాన్ని నవనవోన్మేషంగా తీర్చిదిద్దడంలో పుస్తకాల పాత్రని తెలియజెప్పాలి. ఈ దిశగా ఎవరి పరిధిలో వారు క్రియాశీలకంగా వ్యవహరిస్తేనే పుస్తకం బతుకుతుంది. మన జీవితాల్లో నిలిచి వెలుగుతుంది.

palapittamag@gmail.com

ISSN 2582-7294

# విషయసూచిక



## డా. కొండపల్లి నీహారిణి సాహిత్య ప్రయాణంపై ఓ అవలోకనం

ప్రత్యేక వ్యాసాల సమాహారం

పేజీ: 54 నుంచి 65 వరకు

### వ్యాసాలు

పేజీ నెం


- బలమైన స్త్రీవాద రచయిత్రి నీహారిణి –సీహెచ్. ఉషారాణి..... 54
- కొండపల్లి విమర్శామంజరి–సృజనరంజని –డా.వంగరి త్రివేణి. 56
- వైవిధ్యమైన కథల సమాహారం – బి.వి.ఎన్.స్వామి........... 60
- 'రాచిప్ప'లో పల్లవించిన అనురాగం – కూర చిదంబరం....... 61
- పత్రికప్రతినిధిగా గణుతికెక్కిన నీహారిణి –వేముగంటి శుక్తిమతి. 62
- కాలప్రభంజనం–హృదయ స్పందనం –కందాళై రాఘవాచార్య. 63
- తండ్రి పట్టుదల పుణికి పుచ్చుకున్న నీహారిణి – ఒద్దిరాజు మురళీధర్‌రావు....................................... 64


### కథ


- నడవకూడని చరిత్ర – వారాల కృష్ణమూర్తి.................... 6
- పనిమనిషి– జాలాది రత్న సుధీర్................ 12
- నల్లని వాన – బి. అజయ్ ప్రసాద్................ 24


### సీరియల్స్


- అగ్నిపునీత – ఝాన్సీ కొప్పిశెట్టి.............................. 18
- స్వర్ణమయూరం – గన్నవరపు నరసింహమూర్తి .............. 72


### సంగీతం


- రసజ్ఞుల మనసు దోచిన సజ్జద్ అలీ – చెమన్............... 10
- మూర్తీభవించిన సరస్వతీ తేజస్సు ఘంటసాల –మొదలి పద్మ. 72


**ఇంకా ఈ సంచికలో ఎల్.ఆర్.స్వామి, కరిపె రాజ్‌కుమార్, కె.హరనాథ్, కందుకూరి శ్రీరాములు, గురిజాల రామశేషయ్య, చంపావతి కవితలు, సాహిత్య పదరంగం...**

## డా. గురిజాల రామశేషయ్య సాహిత్య వివేచనపై విలక్షణ వ్యాసాల సమాహారం



పేజీ: 34 నుంచి 45 వరకు

### వ్యాసాలు


- గురిజాల వారి కావ్యసృష్టి, వివేచనా దర్శనం – రూప్‌కుమార్ డబ్బీకార్........................................................ 34
- దార్శనికుడు – బెల్లి యాదయ్య .............................. 37
- సాహిత్యారామశేషయ్య – బూదాటి వెంకటేశ్వర్లు.............. 40
- రామశేషయ్య కవితా ప్రతిభ – గంధ్ర లక్ష్మణరావు............. 42


### సమీక్షలు


- మధుశాలలో మనిషి ఓ రహస్య పేటిక – రూప్‌కుమార్....... 17
- పి.వి.ని బహుముఖంగా చూపిన చరిత్ర – నరసింహారెడ్డి..... 22
- విశిష్టకావ్యం 'వైరాయణం' – డా. చింతల రాకేష్ భవాని...... 52
- హృదయాల్ని కలిపే ఉపగ్రహాలు ఉమామహేష్ కథలు – ఎమ్వీ రామిరెడ్డి ................................................ 66
- గోపగాని విమర్శా వాచకం – శ్రీ రామోజు హరగోపాల్..... 68
- తనతో స్నేహం కవిత్వమై పూసిన వేళ – సాహితి మోదుగుల... 70
- ఆదర్శవాద ధోరణులతో కూడిన కథలు – అశోక్‌కుమార్...... 71
- కొత్తదనం కలిగిన కథలు – అంపశయ్య నవీన్............... 74


### సినిమా


- సహజ నటుడు సంజీవ్ కుమార్ – పొన్నం రవిచంద్ర....... 14


### పరిశోధనా వ్యాసం


- నిజామాబాద్ జిల్లా సాహిత్యం–విహంగ వీక్షణం–కంఠం కృష్ణ. 46

RNI NO: APTEL/2010/32190 ISSN-2582-7294

# నిజామాబాదు జిల్లా సాహిత్యం-విహంగ వీక్షణం



**కంతం కృష్ణ**
**పిహెచ్.డి. పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ**
**హైదరాబాదు విశ్వవిద్యాలయం**
మెయిల్: krishna.kamtam@gmail.com

సమాజానికి హితాన్ని బోధించేది సాహిత్యం. అనేకానేకాంశాలతో మనిషి జీవితంలో అన్ని కోణాలను ప్రభావితం చేసేది సాహిత్యం. మానవాళి అభివృద్ధికి తోడ్పడంతోపాటు, చరిత్ర రచనకు ఆధారంగా నిలుస్తుంది. అలాగే తెలంగాణ సాహిత్యాన్ని పండించడంలో నిజామాబాదు జిల్లాకు ఒక స్థానం ఉంది. క్రీ.పూ. 6వ శతాబ్ది నాటికే బోధన్ కేంద్రంగా 'అస్మకరాజ్యం' వర్ధిల్లింది. అప్పటినుండే ఇక్కడ సంస్కృత, ప్రాకృత సాహిత్యం వెల్లివిరిసింది. ఆ కాలంలో జైనమతం ప్రబలంగా ఉండటంవల్ల ఆ మతానికి సంబంధించిన సాహిత్యమే ఎక్కువ వచ్చింది. అయితే వస్తువు జైన సంబంధి కావడం, భాష ప్రాకృతం కావడంవల్ల అది తర్వాత సాహిత్య పరంపరతో సంబంధం లేకుండాపోయింది. తర్వాత బోధన్ చాళుక్యుల కాలంలో సంస్కృత, కన్నడ భాషల్లో గొప్ప సాహిత్యం సృజించబడింది. అప్పడప్పుడే సాహిత్యంలో స్థిరపడుతున్న తెలుగు భాషలోనూ చక్కని కవిత్వం నాంది పలికింది. అప్పటినుండే నిజామాబాదులో సాహిత్య పరిమళాలు వికసించి సమాజానికి మార్గదర్శనం చేసిన ఆనవాళ్ళున్నాయి. అంతేకాకుండా ఈ జిల్లాకు ఆనుకొని సరిహద్దులుగా పడమరన కర్ణాటక, మహారాష్ట్రలు ఉండడంవల్ల కన్నడ, మరాఠీల భాష ప్రభావం ఉంది. అలాగే అప్పటి నిజాంనవాబుల పరిపాలనకాలంలో ఉర్దూ రాజభాషగా అమల్లో ఉండేది. దీంతో ఈ జిల్లా ప్రజలపై కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల ప్రభావంతో తెలుగుభాష, సాహిత్యాల గురించి ఎవరు పట్టించుకోలేదు. కాని తెలుగు ప్రజల గుండెల్లో తెలుగు కవిత్వం, పాటలు, పద్యాలు మొదలైనవి సజీవంగా మౌఖిక రూపంలో ఉన్నాయి. వాటిని వెలికితీసి పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నిజామాబాదు జిల్లా ప్రాచీన సాహిత్యం

ప్రాచీనకాలంలో సాహిత్యం పోషింపబడిందనడానికి సరైన ఆధారాలను పరిశీలించినట్లయితే, భవభూతి క్రీ.శ. 680-750 ప్రాంతానికి చెందినవాడు. అయితే భవభూతి తానే స్వయంగా విదర్భ దేశంలోని పద్మపురం గ్రామవాసినని చెప్పుకున్నాడు. ఇది నిజామాబాదు జిల్లాలోని బోధన్ నగరం. ఇది అత్యంత ప్రాచీన రాజధానీ నగరమైన 'పోదనపురం'. మహాభారతంలో పేర్కొనబడిన అశ్మకుని రాజధానీ నగరం. జైనతీర్థంకరుడైన బాహుబలి రాజధాని నగరం. బాహుబలిని గూర్చి కన్నడ పురాణంలో బోధన్ నగరాన్ని పద్మపురమని రాయబడింది. అయితే బోధన్‌కు వసుమతి, పద్మపుర, ఏకచక్రపుర, బహుధాన్యపుర పేర్లున్నాయి. చాళుక్య రాజైన ఇమ్మడి అరికేసరి-2 కవులకు, పండితులకు ఆశ్రయం కల్పించినట్లు తెలుస్తుంది. ఇతనివద్ద ఆశ్రయం పొందినవారిలో ఇందూరు జిల్లాకవిగా పేరుగాంచిన మహాకవి పంపడు. క్రీ.శ.902 ప్రాంతంలో జన్మించాడు. ఇతను కూడా పద్మపుర నివాసినని చెప్పుకున్నాడు. కన్నడ భాష త్రయం (పొన్న, రన్న, పంప)లో ఇతడు మొదటివాడు. ఇతను "ఆది పురాణం", కన్నడ భాషలో "విక్రమార్జున విజయం" అనే కావ్యాన్ని రచించాడు. నన్నయ్య కంటే వంద సంవత్సరాలు పూర్వీకుడని, "జినేంద్రపురాణం" అనే కావ్యాన్ని రాశాడని చారిత్రకారుల అభిప్రాయం. కాని ఇది అలభ్య గ్రంథం. పంపకవి తమ్ముడు 'జినవల్లభుడు' కరీంనగర్ జిల్లాలోని గంగాధర సమీపంలో బొమ్మలగుట్ట మీద రచించిన "కుర్క్యాల శాసనం"లో తెలుగు కందపద్యాలు కనిపిస్తాయి. దీనిని బట్టి అన్నదమ్ములకు సంస్కృత, కన్నడ, తెలుగు భాషలల్లో ప్రావీణ్యం ఉందని తెలుస్తుంది. చివరకి జైనమతాన్ని స్వీకరించి 'శుభనంది' పేరుతో దేవేంద్ర సిద్ధాంతి శిష్యుడై బోధన్‌లో మరణించాడు.

మధ్యయుగ కాలంనాటికి ముస్లిం పాలన ప్రభావం వల్ల తెలుగులో సాహిత్యం అంతగా అభివృద్ధి చెందలేదని చెప్పవచ్చు. క్రీ.శ.1405-1480 మధ్యకాలంలో నిజామాబాదు జిల్లా, ఆర్మూరు తాలుకాలోని భీముగల్లుయే నేటి వేముగల్లు (ప్రస్తుత భీంగల్). ఈ ప్రాంత పాలకుడైన రాణామల్ల రాజాశ్రమంలో ఆస్థానకవి కొఱవి గోపరాజు నియోగి బ్రాహ్మణుడు. వీరి తల్లిదండ్రులు కామాంబిక, కసవిరాజు. హరితస గోత్రానికి చెందినవాడు. ఈయన 12 ఆశ్వాసాల "సింహాసన ద్వాత్రింశిక" అనే సంస్కృత కావ్యానికి అనువాదం తెలుగులో కథాకావ్యంగా రచించాడు. ఇది అద్భుతరస ప్రధానం. గోవరాజు తన కావ్యాన్ని హరిహరనాథుడికి అంకితం చేశాడు. అంతేకాకుండా కొఱవి గోపరాజు పినతాత కొఱవి సత్యనారాయణ కవి ఇతను రాచకొండలో నివసించాడు. 'ప్రప్రథమ ఆంధ్ర కవితాపితమహా' అనే బిరుదు కలదు. ఇక్కడే నివసించిన మరొక కవి దత్తోజి పండితుడు. ఈయన క్రీ.శ.1784 ప్రాంతానికి చెందినవాడు. కృష్ణార్జున సంవాదం, భగవద్గీత, యోగాశాస్త్రములు ఇతని రచనలు. సురవరం ప్రతాపరెడ్డిగారు సంకలనం చేసిన "గోల్కొండ కవుల సంచిక"లో నిజామాబాదు జిల్లాకి చెందిన కవుల వివరాలు ఉన్నాయి. శ్రీ శాస్త్రుల వారి ఆనంతరామ శాస్త్రి ఈయన జన్మస్థలం లింగంపేట, తాలుకా ఎల్లారెడ్డి. ఇంకొకరు రెడ్డి హనుమద్దాసుగారు ఇతను నిజామాబాదు జిల్లా, దోమకొండ దగ్గరగల బీబీపేటలో నివసించాడు. ఆధ్యాత్మిక భక్తి తత్వాన్ని ప్రబోధించే, జ్ఞానమార్గం ప్రవచించే గేయాలను రాశాడు. సాంబశతకం, జ్ఞానబోధాధ్యాత్మలు, జగదాంబ కీర్తనలు, జీవబోధ శతకం, భక్తిపాటలు కొన్ని రాశారు. అంతేగాక సరళమైన పదాలతో భక్తిని, ముక్తిని, బాటను, గురుసేవను వైరాగ్యభావనలు ప్రబోధించేలా రాసిన పాటలను ఈ ప్రాంత ప్రజలను బాగా ఆకర్షించాయి. ఇప్పటికి వీటిని భజన బృందాలు పాడుకుంటారు. 1934లో గోల్కొండ కవుల సంచిక వెలువడిన నాటికి 6యేళ్ళ క్రితం అంటే 1928లో హనుమద్దాసుగారు మరణించారు.

మరొక కవి 'శిరిశనహళ్ కృష్ణమాచార్యులు'. ఈయన నిజామాబాదు జిల్లాలోని మోర్తాడులో పుట్టాడు. తెలుగు, సంస్కృత భాషల్లో మహా పండితుడు, అష్టావధాని. నిజాం రాజ్యాంలో తొలి శతావధానిగా గుర్తింపు పొందాడు. 1925 నాటికే నిజామాబాదు, కరీంనగర్ జిల్లాలలో కవిగా, అవధానిగా ప్రసిద్ధి పొందాడు. పద్యాన్ని రమణీయ భావాలతో పలికించగల దిట్ట. ఇతని రచనలు కళాశాలాభ్యుదయం, కోరుట్ల జగిత్యాల అవధానములు, పద్మావతీ పరిణయము, రుక్మిణి కళ్యాణం, మనోజవిజయ బాణము (సంస్కృతం) గురువంశ మహాకావ్యం (సంస్కృతం), సంపత్కుమార సంభవం (సంస్కృతం), రామానుజ

చరిత్రము, గీతాతత్వ మీమాంస గ్రంథములు రచించాడు. వీరే కాకుండా కామినేని కవులైన కామినేని కామిరెడ్డి, కామినేని రెండో ఎల్లారెడ్డి, కామినేని మల్లారెడ్డిలు. వీరు క్రీ.శ. 1530-1611 మధ్యకాలంలో జీవించారు. బిక్కనవోలు (ఇప్పటి బిక్కనూరు, నిజామాబాద్ జిల్లా) సంస్థానం రాజధానిని 1787లో దోమకొండకి మార్చారు. అప్పటినుండి దోమకొండ సంస్థానంగా పిలవబడుతుంది. ఈ సంస్థాన మూలపురుషుడు కామినేని కాచారెడ్డి. కామినేని వంశంలో కామినేని కామిరెడ్డి శివభక్తుడు, లింగారాధ్యులవద్ద పట్టమట్ట సోమనాథునితోపాటు సహాధ్యాయి. కామిరెడ్డి తన సంస్థానంలో సోమనాథుని ఆస్థానకవిగా నియమించి అతనితో సూతసంహితను అనువదింపజేసి అంకితం తీసుకున్నాడు. అలాగే కామినేని రెండో ఎల్లారెడ్డి వాసిష్టవము, లింగపురాణం అనే రచనలు స్వయం గా రాశాడట కాని అవి అలభ్యం. పట్టమెట్ట సోమనాథ కవి రాసిన బ్రహ్మోత్తరఖండాన్ని కామినేని రెండో ఎల్లారెడ్డికి అంకితం చేశాడు. కామినేని వంశంలో ముఖ్యమైనవాడు కామినేని మల్లారెడ్డి. ఇతను ఉద్దండ పండితుడు, రాజకవి. ఈ సంస్థానకవులలో అగ్రగణ్యుడు. సంస్కృతాంధ్ర కవితావిశారదుడు. ఇతని రచనలు షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరము, పద్మపురాణము అనే గ్రంథములు లభిస్తున్నాయి. కవి మడివాళయ్య మఠం ఈయన 18వ శతాబ్దంలో నివసించిన సుప్రసిద్ధకవి. నిజామాబాదు జిల్లాలోని బిచ్కుంద దగ్గరలోని బోర్లం గ్రామవాసి. వీరశైవమత ప్రచారం చేస్తూ, ధర్మప్రచారం కోసం అనేక రచనలు చేశాడు. బసవేశ్వరుని భక్తుడు తెలుగు,కర్నాటక భాషల్లో అనేక స్తవములు, పాటలు రచించాడు. ఈయన ప్రధాన రచన "శాయిరీ రామాయాణం". శాయిరీ మరాఠీ జానపద ఛందస్సు. పద్యాలు మాత్రఛందస్సులో ఉంటాయి. ఈ కావ్యాన్ని బోర్లం బసవేశ్వరునికి అంకితం చేశాడు.

మహంతమ్మ క్రీ.శ.1833 ప్రాంతానికి చెంది నది. మఠం మడివాళయ్య భార్య ఈమె. నిజామాబాదు జిల్లాలోని బాన్సువాడ సమీపంలోని బోర్లం గ్రామవాసి. ఈమె రచన స్తవములు (అముద్రితం). మరికొంతమంది కవులు ప్రాచీన సాహిత్యంలో తమవంతు కృషిని చాటుకున్నారు. వారిలో రాపాక వెంకటదాసకవి క్రీ.శ.1710 ప్రాంతాంలో వాడు. నిజామాబాద్ జిల్లావాసి. శివునూరి అచ్చనమంత్రి ప్రోత్సాహంతో శివరహస్య ఖండం రచించి వేములవాడ రాజరాజేశ్వరునికి అంకితం చేశాడు. దీనిలో చందాపుర విశ్వేశ్వరుని వర్ణన గలదు. రాపాక శ్రీరామకవి నిజామాబాదు జిల్లా పరకాలవాసి. ఇతని రచన అధ్యాత్మక రామాయాణం (యక్షగానము). దోమకొండ సంస్థాన 13వ పాలకుడైన మొదటి రాజేశ్వరరావు ఆశ్రితుడు రాపాక లక్ష్మిపతి. ఇతను ఆచార్యవిజయము, శ్రీమధ్వాపాఖ్యానము, నీలవివాహము, భద్రాయురాభ్యుదయము అనే గ్రంథాలను రాశాడు. ఉమాపత్యభ్యుదయం రచించినది అదిపూడి ప్రభాకర రావు. ఇది ఈ జిల్లాలో వెలువడిన మొట్టమొదటి లఘుకావ్యం. మరియు మొదటి వంశ చారిత్రక కావ్యం. కామినేని వంశ చరిత్రను తెలుపు ఏకశ్వాస పద్య గ్రంథం. గద్వాల సంస్థానంలో పని చేస్తున్న అదిపూడిగారిని దోమకొండ సంస్థానధీశుడైన ఉమా పతిరావు బహుదర్దార్ గారి ఆహ్వానం మేరకు "ఉమాపత్యభ్యుదయం" అనే పేరుతో దోమకోండ పాలకుల చరిత్రను రాశారు. దీనికే కామినేని వంశ చరిత్రగా పేరు కలదు. ఈ కావ్యం 1907లో రచించి 1909లో ముద్రితమైంది. (దోమకొండ సంస్థాన కవులు, అనంత కుమారశర్మ, పుట. 80, 81) శ్రీ చివుకుల వెంకటాచల శాస్త్రి గారు రామేశ్వర విలాసం కావ్యాన్ని రచించాడు. ఇతడు దోమకొండ సంస్థానానికి చెందినవాడు. 1920 ప్రాతంలో



వెలువడింది. జిల్లాలో వెలువడిన మొదటి క్షేత్ర మహాత్య కావ్యం అని చెప్పవచ్చు. దీనిని 2వ ఉమాపతిరావు పినతండ్రి కమారుడైన సదాశివరావు గారి కాలంలో దోమకొండలో నెలకొన్న రామ, ఈశ్వరుల ఉత్సవాల గురించి వివరించిన కావ్యం ఇది. రాణీ రాజవ్వగారి జీవిత చరిత్ర సంగ్రహం. దీనిని రచించినది పెద్ద మందడి వెంకటకృష్ణకవి. ఇతనికి "కవి శరభ" అనే బిరుదు కలదు. 2వ ఉమాపతిరావు గారి మనుమడైన రాజా సోమేశ్వర రావు తమ తల్లియగు రాణీ రాజవ్వ గురించి తన సంస్థాన కవియగు పెద్దమందడి వెంకటకృష్ణ కవిచే ఈ కావ్యాన్ని రచింపజేశాడు. 1927 ప్రాంతంలో వెలువడింది. ఈ విధంగా ఆస్థానాల కవులతోపాటు, సాహిత్యకారులు తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. కొన్ని రచనలు పుస్తక రూపానికి నోచుకున్నాయి. మరికొంత సాహిత్యం మౌఖిక రూపంలో ఉండేది. వాటిలో అధికంగా భజనలు, కీర్తనలు, హరికథలు, భాగోతాలు ఒగ్గుకథలు వంటి కళారూపాలతో ప్రదర్శితమయ్యేవి. ఇలా ఆ కాలంలో ప్రాచీన సాహిత్యం వెల్లివిరిసింది.

## నిజామాబాదు జిల్లా ఆధునిక సాహిత్యం

తెలుగు సాహిత్యంలో 1875 తరువాత ఉన్న కాలాన్ని ఆధునికయుగంగా పేర్కొంటారు. సాహిత్యంలో ప్రాచీనకాలానికి ఆధునిక కాలానికి చాలా విస్తృతి కనబడుతుంది. ఈ కాలంలో తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అవి ఆంగ్లవిద్యా ప్రభావంగాని, ఆనాటి రాజకీయ, సామాజిక పరిస్థితుల ప్రభావంగాని, పాశ్చాత్య భావజాలం గాని, లేక ముద్రణ యంత్రం, పత్రికలు అందుబాటులోకి రావడంగాని మరింకేదైనా కారణాలవల్ల సాహిత్యంలో మార్పులు వచ్చాయని చెప్పవచ్చు. అలా తెలుగు సాహిత్యంలో కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, మొదలైవి ప్రక్రియలు దర్శనమిస్తుంటాయి. సాహిత్య సంస్థలు, పత్రికలు చేసిన కృషితోపాటు రచయితలు చేసిన సేవలు మర్చిపోలేనివి.

ఆధునిక కాలంలో నిజామాబాదు జిల్లాలో వచ్చిన సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించింది. కావ్యాలు, శతకాలు, వచన, గేయ సాహిత్యాలు, యక్ష గానం, భక్తి-ఆధ్యాత్మిక, నాటక-నాటిక, కథలు- నవలలు, జానపద సాహిత్యం, కళలు మొదలైన రంగాలకు చెందిన సాహిత్యం వెలువడింది. నిజామాబాదు జిల్లాకి సంబంధించిన సాహిత్యాన్ని పరిశీలిస్తే ఇలా ఎన్నో అమూల్యమైన సాహిత్య రూపాలు కనిపిస్తాయి. వీటిలో ముఖ్యంగా ఈ క్రింది వాటిని పేర్కొంటున్నాను. అవి.

## కావ్య సాహిత్యం- పరిచయం

నిజామాబాదు జిల్లాలో పద్య ప్రక్రియలో ఆధునిక కాలం విశిష్టమైనది. వీటిలో బృహత్కావ్యాలు, లఘు కావ్యాలు, ఖండ కావ్యాలు, జీవిత చరిత్రలు, స్వీయచరిత్రలు, ఉదాహరణలు మొదలైన రచనలు వివిధ ప్రక్రియలల్లో గమనించవచ్చు. శిరశినహాళ్ రచించిన కళాశాలాభ్యుదయం మూడు ఆశ్వాలు కలిగిన కావ్యం, అలాగే మనస్సందేశం (వేదాంత పరమైన కావ్యం), రామానుజ చరిత్రము (జీవిత చరిత్ర), రత్నమాల (ఖండకావ్యం) అంతేకాకుండా స్తుతి గీతములు అనే అనువాద రచనను కూడా రాశారు. అలాగే తాళ్ళ గంగాదాస యోగీంద్రులు గారి జీవేశ్వరాద్వయ దోష రహితచల గురు బోధామృత చరిత్ర, శ్రీజ్ఞాన సరస్వతీ దేవతా స్త్రీల లాలిపాట, మహాయోగి గంగాదాసు పద్యరత్నావళి, మహాయోగి గంగాదాసు జీవిత చరిత్ర (స్వీయచరిత్ర), గురుశిక్ష-క్రమశిక్ష వంటి రచనలు తాత్విక పరమైనవి. నంబి శ్రీధరరావుగారి శారద గణితం మరియు నింబాచల మహాత్యం, మామదేవ శ్రీనివాసరావుగారి శ్రీమాద్రామాయాణం, తంగుడిగె శ్రీధరరావుగారి ద్విపద భగవద్గీత, సేనాపతి భాస్కరా చార్యులు గారి కవితతరంగిణి (ఖండకావ్యం),

చిత్కల పుండరీకాక్ష శర్మగారి శ్రీ లలితా కవిత కుసుమాంజలి, శ్రీ లలితాంబికార్చనం, శ్రీ పరాంబవ్రతకల్పం, శ్రీ లలిత సుప్రభాత స్తవము వంటి రచనలు వీరి కలం నుండే జాలువారినవి. కవి గణపతి రామ చంద్రారావుగారి శ్రీమద్వరదా చార్యోదాహరణము, శ్రీ వాసర సరస్వతీదేవి ఉదాహరణము, రస భూమిక, శ్రీవాసర సరస్వతీ దండకం, మేడిచర్ల ప్రభాకరరావు గారి భారతభారతి, రథసారథి, విశ్వసుందరి, సారంగధరుడు, రుద్రమదేవి, సౌముని సౌందర్యం, కామాక్షి కైవల్యం, చవుల చిన్నయగారి కన్నుల ఓర, మౌనధ్వని, గణపతి అశోకశర్మగారి శ్రీహరివిల్లు, ఆచార్య ఫణీంద్రగారి పద్య ప్రసూనాలు, చిత్కల శ్రీనివాసశర్మ గారి ప్లాస్టిక్ ప్రబోధం, గుండి వెంకటాచార్యులుగారి శ్రీవతము అనే పేరుతో తమిళ పారాయణ గ్రంథం తిరుప్పావైని తెలుగీకరించాడు. మహాదేవ శ్రీనివాసరావుగారు రామకథను 108 పద్యాలలో శ్రీమద్రామాయణము పేరుతో రాశాడు. డా. నటేశ్వరశర్మ గారి శ్రీ వెంకటేశ్వర విలాసం, బోజన్న గారి రాజేశ్వరశర్మ అద్వైత ప్రవక్త ఆది శంకరుని జీవితం, మహిమలు వర్ణిస్తూ శ్రీమదాది శంకరచార్య చరిత్రము రాశారు. అలాగే పప్పు నారాయాణార్య రామాయాణంలోని ఉత్తర కథను సీతారా పరి వేదనము గా రాశాడు. ఇలా నిజామాబాదు జిల్లా సాహిత్యంలో కావ్య రచన చేస్తున్న కవులు మనకు గోచరిస్తున్నారు.

## శతక సాహిత్యం-పరిచయం

"తెలుగు సాహిత్యంలో శతకం ఒక విశిష్టమైన సాహిత్య ప్రక్రియ. శతకంలోని పద్యాలు ముక్తకాలు. ఇవి వేటికవే స్వతంత్ర భావాలను కలిగి ఉంటాయి. ప్రాచీనకాలం నుండి శతక రచనను కవులు కవిత్వ సాధనకు తొలిమెట్టుగా భావించారు. స్వీయానుభూతులు, లోకానుభవం ప్రకటించడానికి కవులకు మంచి వాహిక. కవి తన ఇష్టదైవాన్ని ఉద్దేశించి లోకనీతి చెప్పడం శతకాలల్లో కనిపించే లక్షణం. శతక కవులు మకుట, ఛందో, సంఖ్యానియమాలను పాటిస్తారు". (శంకర్, వి. నిజామాబాదు జిల్లా కవిత్వం. పుట: 46) నిజామాబాదు జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు మూడువందలకు పైగా శతకాలు వెలువడ్డాయి. లభిస్తున్న ఆధారాలను బట్టి కృష్ణాజి వాడికి చెందన బాబరాయుడు రాసిన 'రాజరాజేశ్వర శతకము' (1900 ప్రాంతంలో) మొదటిది గా చెప్పవచ్చు. ఇటీవలే లభించింది. ఈ శతకం సీసపద్యాల్లో ఉంది. 'పర్వత నివేశ కృష్ణాజివాడ వాస/ రాజరాజేశ శ్రీ బాబరాయ పోష!!' అనే మకుటం గలదు. తర్వాత రెడ్డిశెట్టి హనుమద్దాసు రాసిన సాంబశతకం, శ్రీరామోజు లక్ష్మణాచారి రాసిన రాజరాజేశ్వర శతకం, శ్రీ పనస హనుమద్దాసుగారి తిరుమల స్వామి శతకం, ఆర్మూర్ వాసియైన రాగి చినయ్యగారి లక్ష్మీశతకం, నంబి శ్రీధరరావుగారు రాసిన లొంకరామేశ్వర శతకం, శాస్త్రుల పాండురంగ శర్మగారి పాండురంగ సూక్తులు పేరుతో నీతి శతకం రాశారు. అలాగే మామిండ్ల రామాగౌడు గారి చౌడప్ప శతకం, పెనుగొండ శ్రీనివాసులు గారి శ్రీ బసవలింగ శతకం, మాకునూరు లక్ష్మీనర్సింహాచార్యులు గారి శ్రీ మాణిక్యప్రభు శతకం, కందాళై లక్ష్మీ నరసింహాచార్యులు మరియు గణపతి రామచంద్రరావు జంటగా కలిసి రాసిన శ్రీ ఇందుపురీశ్వర వెంకటేశ్వర శతకం, కాశ నర్సయ్య గారి నరస శతకం, డా. అయాచితం నటేశ్వరశర్మ ఏడు శతకాలు రాశారు. అవి కవితాశతకం, నవ్యశతకం, శ్రీరాజేశ్వర శతకం, శ్రీ గణేశ శతకం, భారతీయ శతకం, వాణీ శతకం, శ్రీ భీమేశ్వర శతకాలు ముఖ్యమైనవి. అదేవిధంగా తల్లావజ్జల మహేష్ బాబుగారి తెలుగువాణీ శతకం, తాళ్ళ గంగదాసు యోగీంద్రులుగారి లొంక రామేశ్వర శతకం, కల్లూరి రామచంద్రరావు గారి తెలుగుబిడ్డ శతకం, శిరిశినహాళ్ కృష్ణమాచార్యులు గారి గాంధీ



శతకం, చిత్కల పుండరిక శర్మగారి రామలింగేశ శతకం, మేడిచర్ల ప్రభాకర్‌గారి వాసరమ్మవాణీ పంచశతి, ఆదార్య ఫణీంద్రగారి ముకుంద శతకం, ఉల్లెంగల గంగాధర్గారి విశ్వనాథ శతకం, పబ్బం మురళిగారి మురళి శతకం, కట్కం ముత్యంగారి లక్ష్మీనరసింహ శతకం, మట్టిపల్లి శ్రీధరాచార్యులు గారి వాసరేశ్వర శతకం, ఎలిగందుల లింబాద్రిగారి నింబాద్రి శతకం, డా. పింగళి గంగాధర్గారి, త్ర్యంబకేశ్వర శతకం, వెంకన్నగారి జ్యోతి రాసిన పల్లెటూరు శతకం, అంబట్ల రవిగారి సాయి శతకం, స్వర్ణ లక్ష్మణరావు గారి శ్రీనివాస శతకం, శృంగారం జనార్ధనాచార్యులుగారి గోవింద గోపాల శతకం, దుర్కివాసి గోశిక్ నరహరి గారి సోమలింగ శతకం, పప్పు నారాయాణార్య కవిపినాకపాణి అనే పేరుతో ఏడుకొండవాడి నిలువుదోపిడి అనే వ్యాజస్తుతి శతకం రాశారు. ఈ విధంగా నిజామాబాదు జిల్లాలో శతకాల రూపంలో భక్తి, నీతి, మానవ విలువలను పెంపొందించే విధంగా ఆయా రచయితలు తమ వంతు కృషిని చాటుకున్నారు. అంతేగాక జిల్లాలో పుంఖానుపుంఖాలుగా వెలువడ్డ శతకాలపైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది.


## వచన సాహిత్యం-పరిచయం

నిజామాబాదు జిల్లాలో వచన సాహిత్యం బహుముఖీనంగా విస్తరించింది. వయోభేదం లేకుండా అందరూ రచనలు చేశారు. "1970 తరువాతనే వచన కవిత్వం విస్తృతంగా వెలువడింది. 1962లో సైబ పరంధాములు "వెన్నెల" సాహిత్య పత్రికను నిర్వహిస్తూ అందులో తన రచనలతోపాటు ఇతరుల రచనలను కూడా ప్రచురించేవారు. అలాగే 1969లో ఇందూరు భారతి, 1972లో ఏర్పాటైన "చేతనసాహితి", 1974 లో "ఆదర్శ కళాసమితి" మొదలైన సాహిత్య సంస్థల స్థాపనతో వచన కవితకు కొండంత బలం చేకురింది. ఆ సంస్థలు నిర్వహించిన కవి సమ్మేళనాలు, కవిత సంకలనాల ప్రచురణలవల్ల కొత్తగా కవిత్వం రాసేవారికి నూతన ప్రోత్సాహన్ని అందించినట్లైంది". (నిజామాబాదు జిల్లా కవిత్వం, డా. వి. శంకర్. పుట: 87) 30 మంది రచయితలతో ఇందూరు భారతిలో వచ్చిన "నగ్నచిత్రాలు" అనే కవితా సంకలనం సమాజంలోని ఆరాచకాలను నిలదీసింది. సైబ పరంధాములు రచించిన పదచిత్రాలు, శబ్దచిత్రాలు, ఏ. సూర్యప్రకాశ్ సంస్పందన, చౌరస్తా, నగరం నీడలు, మళ్ళీ సూర్యోదయం, కొత్తయుగం, అలలకు ఓటమిలేదు, కాగితం పువ్వు, పత్రహరితం, సూర్యుని ఏడోగుర్రం మొదలైన రచనలు సామాజిక స్పృహతో రచనలు చేశారు. వి.ఆర్.శర్మ, బందే అలీ, జి. లచ్చయ్యలు కలిసి 1970లో ఆదర్శ కళా సమితి ద్వారా వెలువరించిన కవితలు పేర్కొనదగినవి. అలాగే బైస రామదాసు, బెడిద రాజేశ్వరం కలిసి "రేపు" అనే కవితా సంకలనం వెలువరించారు. సలంద్ర లక్ష్మీనరసింహంగారి వేడిగాలి, చావుగీతం, బద్దూరి నరసింహం రచనలు ముఖ్యమైనవి. కేశనకుర్తి వీరభద్రాచారి వారి కొత్తదారి, డి.వి. సుబ్బారావు వర్తమానం, నాళేశ్వరం శంకరం దూదిమేడ, సయ్యద్ బందే అలీ పల్లెపాటలు, కాసం సుధాకర్ రెడ్డి క్రాంతి పుష్పాలు (దేశభక్తి కవితలు న్నాయి), పంచారెడ్డి లక్ష్మణ రాజీన రాబందులు, కొత్త చిగళ్ళు, కన్నగంటి నరసింహారావు కారటోచ్చింది, తెగిన సంకేళ్ళు, బొజ్జ తారకం నది పుట్టిన గొంతుక, కొల్లు రంగారావు వెలుగు పువ్వులు (50 వచన కవితలతో మానవ విలువలను తెలుపుతుంది), తేనె జల్లు (44 వచన కవితలతో సామాజిక స్పృహని తెలియ జేస్తుంది), అఖండ భారతం, ఆకుపచ్చ సంతకం, సూరారం శంకర్ ఇవ్వాలే అంకురిద్దాం, పెద్ది అంజన్ కుమార్ కవితా రస ఝరి, వాసాల నర్సయ్య శ్రమగీతం, గరిశకుర్తి రాజేంద్ర కవితాలత, అయినంపూడి శ్రీలక్ష్మీ అలలవాన, వి.ఆర్. శర్మ సూర్యుడు అనేక రంగుల్లో ఉదయిస్తాడు, వానపూలకొండ, మా ఊరి

మట్టివాసన, ఆయాచితం నటేశ్వర శర్మ చుక్కలు, భారత ప్రశస్తి, టి, కృష్ణమూర్తి తొక్కుడుబండ, మోత్కురి ఆశోక్ కుమార్ తెలంగాణ గాయాల సంతకం, కోల్పోలోల్లం, పిట్టగూడు, గిరి నాగ భూషణం ఏరివాక (రాజకీయ దుస్థితిని తెలుపు తుంది), సుదర్శన్, లక్ష్మణ్ సంయుక్త ఆధ్వర్యంలో వెలువడిన ఎక్స్‌రే, రవీందర్ రెడ్డి కసిగా కదలివస్తే, సాగరచర్య, కొలిమి, ఎ.ఎస్. పోశెట్టి విప్లవం వర్ధిల్లాలి, రష్యాలో ఏముంది, చీర్ల అంజనేయులు అందాలకాంత, శిరీష ప్రస్థానం, ఎం. రాములు కాలం కదలికలు, ఎం. బాబురావు నాకవితలు, భారతి శర్మ అందాల శిశిరమా, ఎ. రామారావు మల్లెమొగ్గలు-మెరుపు తీగలు, రంగన్న సాయిలు రచించిన పూలకొలిమి, మధుసుదనరావు భూమిక, యెల్దీ సుదర్శన్ యెల్దీ రత్నాలు, యెల్దీ ముత్యాలు, తల్లావజ్జల మహేశ్ బాబు అమరవాణీ, పి.వి. భైరవన్ శర్మగారి స్నేహ కుసుమాలు, పొదిల గంగారంగారి అమృత గీతలహరి, స్వానుభవాల వేదిక, జీవిత పరమార్థ దీపిక, కాసర్ల నరేశ్‌రావు కాల స్పర్శ, కాల గంధం, సిరిగాద శంకర్ పో. పద, సి. హెచ్. ప్రకాశ్ మనసు మల్లెలు, అక్కడిదాకా, గంట్యాల ప్రసాద్ ఘంటానాదం, రుద్రంగి రమేశ్ అమ్మనాన్నలు, కిరణ్ బాల నా కలల ప్రపంచంలో, శారదా హన్మండ్లు మనో దర్పణం, తెలంగాణో ద్యమంలో భాగంగా తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో వచ్చిన గాయి, కామారెడ్డి కవుల పొలికేకలు, స్ఫూర్తి సాహితి సంస్థవారి అద్దం, వి.ఆర్. శర్మ దీర్ఘకవిత అలజడి, సి. హెచ్. ప్రకాశ్ చీకట్లను చీల్చు కుంటూ, ఏనిశెట్టి శంకర్ ఒకట్టే మాట తెలంగాణ, ఘనపురం దేవేందర్ ఘన తెలంగాణ, మొదలైనవి పేర్కొనదగినవి. ఇలా తెలుగు సాహిత్యం లో ఈ జిల్లా కవులు తమవంతు కృషి చేశారు.

## గేయసాహిత్యం-పరిచయం

'గేయం లయాత్మకమైనది. మాత్రాఛందస్సులో పాడుకునేందుకు అనువుగా ఉంటుంది. జానపదుల కష్టసుఖాల నుంచో లేదా భావుకుని ఊహల్లోంచో రూపుదిద్దుకున్న భావపరంపరకు నాద మాధుర్యం తోడైనపుడు గేయం ఊపిరి పోసుకుంటుంది'' (శంకర్.వి.నిజామాబాదు జిల్లా కవిత్వం పుట: 62). ఈ ప్రక్రియలో రెడ్డిశెట్టి హనుమద్దాసు జ్ఞాన బోధధ్యాత్మలు ఇందులో భక్తి, ఆధ్యాత్మిక గేయాలు గలవు. తాళ్ళ లక్ష్మీనారాయాణ గౌడు గంగి పాటలు, శిష్టా శ్రీశర్మ గేయచంద్రిక, కళ వాచస్పతి అనంతరాములు శ్రీజ్ఞాన సరస్వతి సప్తస్వర గీతమాలిక, పొదిల గంగారం చైతన్య గీతాలహరి, ఈమని సత్యనారాయణ శర్మ బాలగేయ మందారం, మామిండ్ల కృష్ణమూర్తి పన్నీరులో కన్నీరు, బి. నాగభుషణం బి.న్.వి. పాటలు, సజ్జనపూడి అనంతరాములు నాట్యగీతరవళి, మెండాప్రభాకర్ రావుగారి బాల సాహిత్యం, పాపాయి తువ్వాయి, ఉడుత బుడుత వంటి బాలగేయాలను రాశారు. అదేవిధంగా జనార్దనాచారి వేణుగోపాల భజనలు, పలస హనుమద్దాసుగారి యుగ విచిత్రము పాటలు, వడ్ల వెంకటాచార్యులు గారి శ్రీ రాజయోగానంద భజనమాల, పెద్ది హనుమయ్య శ్రీహరి భజనమాల, డా. ఆయాచితం నటేశ్వరశర్మ వసంతకుమారి, కామారెడ్డి పాట, నవ్యగీత ఆంధ్రతేజం, ఆరురుచల



ఆమని, గరిశకుర్తి రాజేంద్ర హృదయాన్వేషణ, బాలగేయాలమాల, నటేశ్వరశర్మ భారతి ప్రశస్తి, ఊరుకొండ బాలయ్యగారి బాలగేయాలు, ఉప్పల సరస్వతి గారి భక్తిగేయమాలిక, ప్రణవకుమార్ వేదవీణ, బెజుగామ రామమూర్తి గానలహరి, గడ్డం రామచంద్రరెడ్డిగారి శ్రీ బసవేశ్వరభజనమాల, పప్పు నారాయణాచార్య వేదసుధ, సురారం శంకర్ మల్లిపాటలు, తాటి కిష్టయ్యగారి గీత ప్రబంధం షట్కం, కృష్ణగీతమంజరి, కొవూరి రాములు శ్రీమన్నారాయణ భక్తిగీతములు, వెలేటి గౌరిశంకర శర్మ మా అమ్మ, గన్ను కృష్ణమూర్తి మహా సంకల్పం, వాసవీకన్యకాపరమేశ్వరి, ఎం. కృష్ణయ్య కృష్ణగీతాలు, గోవిందుల అనంతస్వామి అభ్యుదయ గేయాలు, తిగుళ్ళ వెంకటేశ్వరశర్మ వానకారు బోజన్న రాజేశ్వర శర్మ కుమార జననం మొదలైనవి. ఈ విధంగా జిల్లాలో గేయ సాహిత్య పరిమళాలు వివిధ కొణాల్లోంచి ఆవిష్కరింపబడుతూ ప్రజలను పరవశింపజేస్తున్నాయి.

## యక్షగాన సాహిత్యం పరిచయం

నిజామాబాదు జిల్లాలో ప్రాచీన కాలంనుండి సంప్రదాయ సాహిత్యం, జానపద సాహిత్యం కలిసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. జానపద సాహిత్యంలో ప్రధాన భాగమైన యక్షగానాలు, చిరుతల నాటాకాలు ఆధిక సంఖ్యలో ఈ జిల్లా కవులచే రచించబడ్డాయి. ''ప్రజల వ్యవహారిక భాషలో యక్షగానాలు, చిరుతల నాటకాలను రచించి, అద్భుతమైన తన గాన వాహినిలో సుమారు ఆరుదశాబ్దాలపైగా ఇందూరు ప్రజలను ఓలాలడించిన గాన గంధర్వులు, కవి, నటులు ప్రయోక్త పలస హనుమద్దాసు పదిహేనేళ్ళ ప్రాయం నుండే కోలాట కీర్తనలు, యక్షగానాలు రచించడం ప్రారంభించాడు. యక్షగాన రచయితలలో చెర్విరాల భాగయ్యది అగ్ర స్థానంకాగా, 31కి పైగా యక్ష గానాలు, చిరుతల నాటకాలను రచించి ద్వితీయ స్థానంలో నిలిచి ఇందూరుకు అలంకారమై భాసించాడు" (ఓం ప్రకాశ్ బోచ్కర్, నిజామాబాదు జిల్లా పద్య సాహిత్యం సమగ్ర పరిశీలన. పుట: 16) పనస హనుమద్దాసు ఉప్పలవాయి గ్రామానికి చెందినవాడు. ఇతని రచనలు రుక్మాంగద యక్షగానం, హనుమద్రాస సంగ్రామం, శకుంతలా విలాసం, వెంకటేశ్వర మాహాత్మ్యం, డాంగ్నేయో పాఖ్యానం, బాలనాగమ్మ, గుణసుందరి యక్షగానం, భక్తమాధవదాసు, చంద్రకాంత మహారాజు చరిత్ర, పాళనచోళ మహారాజు యక్షగానం, బీరప్ప యక్షగానం, ఆడది గోడ్డా! మగడుగోడ్డా!! (సాంఘిక యక్షగానం), హనుమద్దాసు కోలల కృష్ణలీలలు మొదలైనవి పలస హనుమద్దాసు రచనలలో మఖ్యమైనవి. ఆర్మూరు మండలం లోని దేగాం గ్రామానికి చెందిన ముని పంతులు మహాభారతాన్ని యక్షగానంగా రాశాడు. రఘువీరదాసు గారి మాంధాత చరిత్ర, భీంగల్ వాసి అయిన నింబాద్రి దాసు భళ్ళాణ చరిత్రము, తాడ్వాయి గ్రామానికి చెందిన రామోజు లక్ష్మణాచారి పారిజాతపహరణం యక్షగానం, శివచర్య సువర్ణ కమలాపహరణం, సేతుబంధనం, వరలక్ష్మీవ్రతం మొదలైనవి యక్షగానాలు రచించారు. మాటూరి మాసానిపల్లెకి చెందిన తెన్నెరంగపొన్న రంగనాథాచార్యులు గారి మోహినీరుక్మాంగద, శ్రీనివాస పద్మావతి పరిణయం, రుక్మిణి కళ్యాణం, లలితోపాఖ్యాణం, మొదలైనవి రాశాడు. అలాగే వీరి తమ్ముడైన తెన్నెరంగపొన్న అణ్ణనాచార్యులు 20 పైగా యక్షగానాలు రచించారు. వాటిలో కౌసల్య పరిణయం, ఋతుధ్వజోపాఖ్యాణం, ఇక్ష్వాకు మహారాజు చరిత్ర, జాంబవతీపరిణయం, గజేంద్రమోక్షం, కుశలవవిజయం, మొదలైనవి ప్రధానమైనవి. అనంతనరం సిద్ధప్పకవిగారి అశోక సామ్రాజ్యం, జీవనరేంద్ర యక్షగానం రాయాగా, బాన్సువాడలో తిర్మలాపురంకి చెందిన పెద్దిరాం పోచన్న పంతులుగారి భీరప్ప చరిత్ర, గంగాకళ్యాణం, శంబరాసురవధ రాశారు. బాన్సువాడలో దుర్కి గ్రామానికి చెందిన గోశిక భూమయ్యా నటుడు, ప్రయోక్త. వీరు చెంచులక్ష్మీ, హనుమద్విజయం, కుంతీదేవి దీవెన, స్త్రీ సాహసం, గరుడ గర్వాపహరణం రాశారు. రథాల రాంరెడ్డి గ్రామానికి చెందిన విశ్వజ్ఞ మంచిరాల జనార్ధనచారి గారి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవితచరిత్ర రాశాడు. తాడ్వాయి వాస్తవ్యుడైన రామోజి బాలయాచారిగారి

బీరప్ప చరిత్ర, సదాశివనగర్ గ్రామవాసి ఎర్రోజు వెంకటేశచారిగారి లవకుశ, మాయామశ్చీంద్ర యక్షగానం, కాంభోజరాజు యక్షగానం, నల దమయంతి యక్షగానం, సావిత్రీ పరిణయం, భక్త పురూరవ యక్షగానం, వెల్పూరు లక్ష్మణచార్యులు గారి శ్రీకృష్ణార్జున యుద్ధం, చుక్కపూర గ్రామవాసి సంగకవి గయోపాఖ్యనం, అవధూత నిర్మలానంద స్వామిగారి గుణసుందరి, సోమవార వ్రత మహాత్మ్యం, నందివాడ గ్రామవాసైన వెలమలపల్లి గుండేరావుగారి సతీసౌధమిని యక్షగానం, బీబిపేటకు చెందిన పబ్బుబుచ్చి లింగంగారి సుందోపసుందోపాఖ్యానం, కాంతావిభ్రాంత చరిత్ర, రామారెడ్డికి చెందిన వల్లంభట్ల కృష్ణయ్య సుభద్ర పరిణయం, రాజంపేట గ్రామవాసి సందుకుల రంగచార్యులు గారి రామాంజనేయ యుద్ధం ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన శ్రీకృష్ణకవి చిత్రకేతుపాఖ్యానం మొదలైనవి. ఇలా నిజామాబాదు జిల్లాలో యక్షగాన ప్రక్రియ దినదిన అభివృద్ధి చెందుతుంది.

## భక్తి-ఆధ్యాత్మక సాహిత్యం-పరిచయం

నిజామాబాదు జిల్లా చారిత్రకంగా ఎన్నో దేవాలయాలకు, పుణ్యక్షేత్రలకు, తీర్థలకు, జాతరలకు ప్రసిద్ధి. కాబట్టి ఇక్కడ భక్తి ఆధ్యాత్మిక సాహిత్యం కోకొల్లలుగా వచ్చింది. తాళ్ళగంగాదాస రాజయోగీంద్రులు రచించిన రచనలన్ని భక్తి, అధ్యాత్మిక, తాత్త్విక భావ సంపదకు నిలయాలు. కోనసముద్రం రాజమల్లిఖార్జున శర్మగారి శ్రీనావనాథ సిద్దేశ్వర చరిత్ర ఇది ఆర్మూరులోని సిద్ధులగుట్టగా ప్రసిద్ధి. ఈ క్షేత్రానికి సంబంధించిన సమగ్ర చరిత్ర తెలియజేస్తుంది. ముత్యంపేటకి చెందిన కేదరనాథ శర్మ గారిద్వాదశ జ్యోతిర్లింగ మహాత్మ్యం, శివజ్యోతి, శివదిక్షావిధి అనేవి ఇతని రచనలు. శృంగారం జనార్ధనాచారిగారి శ్రీ పంచముఖాంజనేయ చరిత్ర, మంచినరావు గారి యాదగిరాచార్యులు గారి విశ్వబ్రహ్మణ వికాసం, డా. అయాచితం నటేశ్వర శర్మగారి భగవతామృతం, దొంకేశ్వర్ కృష్ణమూర్తిగారి వెదాంత కిరణాలు, మేడిచర్ల ప్రభాకర రావుగారి ధ్యాన దర్పనం, గన్ను కృష్ణమూర్తి వస్త్రాపహరణం, గిశకుర్తి రాజేంద్ర భక్తిసుధ, ఎస్. వెంకటాచార్య కిసాన్ నగర చరిత్రము, కర్మయోగి నారాయణ జిజ్ఞాను మనశ్శాంతి, ఎం. బాబురావు రాఘవేంద్రస్తుతి, సిరిగాద శంకర్ కూడవెల్లి రానాలింగేశ్వర చరిత్ర, గణపురం కృష్ణమూర్తి పరమార్ధ దర్శిని, గంగావరం అంజనేయ శర్మ గణేశగీత, జనగామ చంద్రశేఖరశర్మ సంప్రదాయ సుముహూర్త దీపిక. ఈ విధంగా భక్తి సాహిత్యం కూడా జిల్లాలో వచ్చింది.

## నాటక - నాటిక సాహిత్యం-పరిచయం

నిజామాబాదు జిల్లాలో నాటక రచన విస్తృతంగా జరిగింది. 1904లో జన్మించిన పనస హనుమద్దాసు సుమారు 18 నాటకాలను రచించారు. వాటిలో పాండవుల ఆరణ్యవాసం, స్త్రీ సహస నాటకం, మదనసేన నాటకం, బాలనాగమ్మ నాటకం, హనుమద్రామ సంగ్రామం, బాలరాజు నాటకం, వీరబొబ్బిలి నాటకం, శకుంతల విలాసం, అల్లిరాణి పరిణయం, బలుగూరి కొండయ్య నాటకం, భక్తకేతన నాటకం, జయంత జయపాల నాటకం వంటి రచనలు ప్రధానమైవి. విశ్వజ్ఞ మంచిరాల జనార్దచారిగారి సంపూర్ణ చంద్రిక విలాసం, శ్రీకృష్ణగారడి నాటకం, పాతాళభైరవి నాటకం, శశిబిందూపాఖ్యానం, శౌరిదవేణి స్వయంవరం, అనంతవరం సిద్ధప్పవర కవి జీవనరేంద్ర నాటకం, మయుబ్రహ్మ వెంకటాచార్యులుగారి శ్రీ మార్కేండ నాటకం, శ్రీ వీరబ్రహ్మ నాటకం, భీంగలుకు చెందిన వేముగంటి శ్రీనివాసులుగారి సత్యహరిశ్చంద్ర



నాటకం, సీత స్వయంవరం, మండోదరి స్వయంవరం, ఆహల్యా స్వయంవరం, బండారు రఘుపతి గారి సతీతులసి నాటకం, సత్యగుణ భూషిని, గౌశికే నరహరి, భూమయ్యలు కలిసి పురందర విజయం, జయంతజయపాల గజగౌరి వ్రతం, తంగుడిగె శ్రీధర రావుగారి అర్జున శృంగభంగము, సిరికొండకు చెందిన దుబ్బారి నర్సయ్యగారి చిరుతల ద్రౌపది స్వయంవరం కుర్నాపల్లికి చెందిన కథలాపురం గంగాధర్ గారి చిరుతొండనంబి నాటకం, ఆరేటి నారాయణ గారి మట్కనాటకం, గరిశకుర్తి రాజేంద్ర నీజాయితికి నీరాజనం, పప్పు నారాయణార్య వీరసదాశివరెడ్డి నాటకం, డా. అయాచితం నటేశ్వర శర్మగారి వసంత విలాసం, ఆంధ్ర తేజం, ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మ చరిత్ర పుటలు, అమృతలత స్కూలు పెట్టిచూడు (నాటకాల సమాహారం). ఇలా నిజామాబాదు జిల్లాలో నాటక సాహిత్యం పరిఢవిల్లింది.

## కథ-నవల సాహిత్యం- పరిచయం

నిజామాబాదు జిల్లా సాహిత్యంలో మిగతా ప్రక్రియలాగే కథ, నవల ప్రక్రియ కూడా చెప్పుకోదగినంత వచ్చింది. ముందుగా కథ విషయానికి వస్తే జిల్లాలో 1950 దశకంలో తొలి కథా సంకలనంగా తంగుడిగె నరసింహంగారు 'తొలి కాన్పు' రచించారు. నిజామాబాదు జిల్లాలో నిరంతరం రాస్తున్న రచయితగా పేర్కొంటున్న సి.హెచ్. మధుగారు ప్రసిద్ధి చెందారు. ఈయన రాసినవి. చెదలు, ముసలోడు, వ్యవస్థ, శాంతికథలు, ముళ్ళు వద్దు రాళ్ళు వద్దు డబ్బుకావాలి, ఉద్యమ కథలు కూడా రాశారు. బొమ్మహేమదేవి గారు యమున, దేవిరమ అనే కలం పేరుతో రాసిన అన్నపూర్ణ, శాంతి నిలయం, బాంచెను దొరసాని, ఛోటి ఛోటి బాతే, గరిశకుర్తి రాజేంద్ర గారి ఇంట గెలిచి, పండుగ కథలు, సి.హెచ్. వేణు గారు బూడిద, సమరం, జాబిలి, ఇలా 30 పైగా కథలు రాశారు. అమృతలత గారు రచించిన మనస్సు ఎరగని మనుషులు, కన్నీళ్ళతో కాలక్షేపం, స్పందన, వెతలే కతలై (కథల సంపుటి) సంపాదకత్వం వహించారు. దేవికారాజ్ రాసిన మధురానభూతి (కథలసంపుటి) భోళాతనం, వై. లక్ష్మీవాసన్ గారు రాజీవ అను కలం పేరుతో కొత్తనిజం, తుర్లపాటి లక్ష్మీగారు రాసిన సూర్యునితో పోటిపడి, ఒక పాపకథ, కాశి-పులి, జీవనసమరం, పునాదుల్లోంచి, స్వాతీ శ్రీపాద మనసుకు చూపుంటే, హృదయంలో అడుగులు, కిరణ్ బాలఇందిర పేరుతో కానుక, చందమామమామె, స్విట్ సంథింగ్, తప్పిపోయిన ఉత్తరం. అయాచితం నటేశ్వరశర్మ నా బంగారు తల్లి, కన్నెగంటి నరసింహారావు సంఘశక్తి, పరిష్కారం, భారతీశర్మగారి జీవన సంధ్య, తిరిగిచ్చిన వసంతం, జానకీరామ్ కలనైనా నీవలపే, శ్రీపతిగారి మూగ మల్లేశం, ద్యూటి, మృత్యుకోసం, మెత్కురి అశోక్ కమార్ నమ్మిక, డా. వడ్ల శంకర్ ఒక సూర్యుని ఉదయం.

## ఆధార గ్రంథాలు


1. అనంతకుమార శర్మ. 1989. మేడ వరపు. దోమకొండ సంస్థాన కవులు–వారి రచనలు. కామారెడ్డి: హితసాహితి.

2. నాగభూషణం. గిరి –1987. చరిత్రలో నిజామాబాద్ జిల్లా, జనసంస్కృతి

3. పండరినాథ్, ఎ. 1997. నిజామాబాద్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర. హైదరాబాదు: స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ.

4. రాధాకృష్ణ, బూదరాజు(సంపా.). 1985. తెలుగు మాండలికాలు నిజామాబాదు జిల్లా. హైదరాబాదు: తెలుగు అకాడమి.

5. శంకర్, వి. 2016. నిజామాబాదు జిల్లా కవిత్వం. తెలంగాణ రచయితల సంఘం.


0

# MARIS STELLA COLLEGE (AUTONOMOUS)

Vijayawada - 520 008. Andhra Pradesh
A College with Potential for Excellence, Re-accredited at 'A' Level by NAAC

ज्ञान-विज्ञान विमुक्तये

**U.G.C. Sponsored Two-Day National Seminar**

**"TELUGU RACHAYITRULU - SAMAKALEENA RAJAKEEYA, SAHITYA DHORANULU"**

**Organised by Department of Telugu**

**on**

**8th and 9th January, 2015**

## Certificate

*This is to certify that Prof./Dr./Ms/Mr.* K.KRISHNA *attended the National Seminar on 8th and 9th January, 2015, He / She was an invited speaker / chaired a session / participated / presented a paper entitiled* వొయిసం నవల వస్తు రూప విశ్లేషణ *in the conference.*

*Date :* 09-01-2015

P. Usha
*Co-Ordinator*

for *Convenor*

ज्ञान-विज्ञान विमुक्तये

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి

## తెలుగు అధ్యయన శాఖ

యుజిసి జాతీయ సదస్సు

## "ఆధునిక సాహిత్యంలో బాలల సమస్యల చిత్రణ"

23-24 ఫిబ్రవరి 2015

## ధ్రువీకరణ పత్రం

ఆచార్య/డా॥/శ్రీ/శ్రీమతి/కుమారి......తంతం కృష్ణ, పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం......

గారు రెండు రోజుల జాతీయ సదస్సులో పాల్గొని......భూపాల్ 'మూలపిల్ల' కథ – బాలకార్మిక వ్యవస్థ చిత్రణ......

......అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.

కుమారి నీరజ

డా॥పి. కుమారి నీరజ

సదస్సు సంచాలకులు

సి. శైలజ

డా॥సి. శైలజ

కళాశాల అధ్యక్షులు

AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 046.